కవులు

రచనలు,జీవిత చరిత్ర

రాయలసీమ రచయితల చరిత్ర- 1,2,4


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము. మీరు చదువుకోవటంలో ఏమైనా ఇబ్బంది కలిగితే సేవక బృందంను సంప్రదించగలరు. ఒకవేళ మా సేవలో ఏమైన పొరపాటు వస్తే మన్నించగలరు.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2990100061748/49/50


గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం **ఉచితంగా eBook** రూపంలో భారత ప్రభుత్వపు సహాయంతో ఇవ్వడం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు రచయిత,పబ్లిషర్స్ కి గలవు, కనుక వారిని సంప్రదించగలరని మనవి చేసుకొంటున్నాము.

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయినాధ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీకృష్ణదేవరాయ గ్రంథమాల
హిందూపురము. పుష్పము ౨౨.

శ్రీ

రాయలసీమ
రచయితల
చరిత్ర -౧-

20వ శతాబ్దపు రాయలసీమ కవిరత్నముల చరిత్రలను
వారి కవితలతో, చిత్రపటములతో ఏర్చికూర్చి తీర్చిన
గ్రంథరాజమిది. తెనుగు తల్లి ధరించే అమూల్య
భూషణాలలో ఇదొకటి.

గ్రంథకర్త
కవిభూషణ, కవితిలక, కల్లూరు అహోబలరావు.

విషయసూచిక

పేజిసంఖ్య



శ్రీకవిసార్వభౌమ-కావ్యకళానిధి
కవిసింహ అవధాని పంచానన

శ్రీదుర్భాక రాజశేఖర శతావధాని.

జననము: **18—11—1888**

నిర్యాణము: **30—4—1957**

అసలు పేరు: కాళహస్త్యయ్య

అధికారనామము	;	రాజశేఖర శతావధాని
తండ్రి	:	శ్రీదుర్భాక వెంకటరామయ్య గారు
తల్లి	:	శ్రీమతి సుబ్బమ్మ
మతము-కులము	;	హిందూ-బ్రాహ్మణ-స్మార్తులు
గోత్రము-నాడు	:	శాలంకాయన-ములికినాడు.
జన్మస్థలము	:	కడప జిల్లాయందలి జమ్మలమడుగు.

విద్యాభ్యాసము

వీరు తమ ప్రాథమిక విద్యను జమ్మలమడుగు. ప్రొద్దుటూరు లందు నేర్చిరి. 1904-1907 సం॥ల మధ్య ' తార్కిక సింహ ' బిరుదాంకితులు శ్రీకందాళ దాసాచార్యులు గారికడను, 'కళాప్రపూర్ణ' శ్రీజనమంచి శేషాద్రిశర్మ గారి సన్నిధిని సంస్కృతాంధ్ర సాహితీ గ్రంథములు నాటకాలంకార శాస్త్రములు జదివిరి. 1907లో మెట్రిక్యులేషన్ పరీక్ష కడప వున్నత పాఠశాలలో వుత్తీర్ణులైరి. మద్రాసు క్రైస్తవ కళాశాలలో ఎఫ్. ఏ. చదువుచు, మధ్యనే ఆపివేసిరి.

ఉద్యోగ వివరములు :

1908 నుండి ప్రొద్దుటూరులోని జిల్లా మునసబు కోర్టులో గుమాస్తాగా పనిచేసి, గాంధీవుద్యమ ప్రభావమువల్ల 1921లో వుద్యోగమును వదలిరి.

తరువాత కొంతకాలము ప్రొద్దుటూరు మునిసిపల్ కౌన్సిలరుగాను, 1928లో వైస్ ఛేర్మనుగాను పనిచేసిరి.

1927—32లో ప్రొద్దుటూరు తాలూకా బోర్డు ఉపాధ్యక్షులుగా నుండిరి. మదరాసు సెనేటు సభ్యులుగాను, వేదపాఠశాల కార్యదర్శిగాను పనిచేసిరి

సాహిత్య సేవ:-

వీరికి శ్రీగడియారం వేంకటశేషశాస్త్రిగారితో పరిచయము, సన్నిహిత మైత్రి కుదిరిన తరువాత, ఈ కవిశేఖరు లిరువురును ఆంధ్రదేశమున 'రాజశేఖర - వేంకటకవుల' ను జంటపేరుతో 1920—28 మధ్య పలుతావుల శతావధాన కార్యక్రమములు జరిపి, పెక్కు సన్మానములందిరి. వీరి అవధాన యాత్రావిశేషములన్నియు 'అవధానసారము' అనెడిగ్రంథమున పొందుపరిచబడినవి. అవధానములను చాలించి, కవిశేఖరులు స్వతంత్ర కావ్యరచనకు పూనుకొని కొన్ని, రసవత్కావ్యములను వెలువరించిరి.

వీరి ముద్రిత కృతులు

1) రాణాప్రతాపసింహ చరిత్రము- 5 ఆశ్వా-200 పద్యములు ఐతిహాసిక ప్రబంధము—ప్రచురణ: 1934-35
2) అమరసింహచరిత్ర— 11 ఆశ్వా—2000 పద్యములు ఐతిహాసిక ప్రబంధము ప్రచురణ: 1951

3) వీరమతీచరిత్రము - 3 ఆశ్వా-800 పద్య-ఐతిహాసిక ప్రబంధము ప్రచురణ : 1951

4) చండనృపాల చరిత్రము- 700 పద్యములుగల గ్రంథము.

5) పుష్పావతి- 5 ఆశ్వా॥ శృంగార ప్రబంధము-1200 పద్యములు-ప్ర: 1949.

నా ట క ము లు

1) సీతాకల్యాణము 2) సీతాపహరణము 3) వృద్ధిమూల సంవాదము (2 అం॥) 4) పద్మావతీ విజయము.

ప ద్యా వ ళు లు

1) విలయమాధుర్యము(స్వప్నచంపువు) 2)స్వయంవరము 3) అనఘుడు (250 గీతములు) 4) గోదానము 5) శవన్నవ రాత్రులు.

సంస్కృతకృతి:- కామేశ్వరీ స్తోత్రమాలా

ఆంగ్లము :- దిహీరోయిన్స్ ఆఫ్ హిందూస్తాన్ (The Heroins of ' **HINDUSTAN**')

అ ము ద్రి త ము లు:

(1 రాణీ సంయుక్త (హరికథా) 2) తారాబాయి (నవల) 3) టాడ్ చరిత్రము (కావ్యము) 4) రాజసింహ.

స న్మా న ము లు:—

సీ॥ వనపర్తి, బెజవాడ-కనగిరి, గుంటూరు
హైదరాబాదు, రాజమ్మపేట
యుయ్యేలవాడ—యేలూరును, జటప్రోలు
రాజహూర్జ్యామ చంద్రాపురములు!
నెల్లూర్తెనాల్యాది, నిఖిలపట్టణముల
నెన్నిసన్మానమ్ము-లెన్నిసభలు

కదిరి మొదలొ్కని, గంజాము వఱకు మీ
రాణాప్రతాపు గౌరవము నిండె!
గీ॥ నిగనిగలు గొల్పు పెనుకొండ, "గగనమహలు"
నను-గళాపరిషత్తు స్వర్ణమయ వజ్ర
మకుట మర్పించి నిను భక్తి, బూజచేసె
సరస గుణధామ। శ్రీకవి సార్వభౌమ!

(పుష్పావతి)

నారాయణస్వామి గారు కవిశేఖరుల నొకపరి దర్శించి నప్పుడు మాటల ప్రస్తావమున వారి కృతులు పొందిన అనన్యవిఖ్యాతి నిగూర్చియు, వారుపొందిన ఘనసన్మానములను గూర్చియు మిక్కుటముగా శ్లాఘించిరి.

ఈ కవిరాజునకు, పెనుకొండయందలి 'రాయలసీమ కళా పరిషత్తు' వారు తమప్రథమ వార్షికోత్సవ సందర్భమున వీరికి స్వర్ణమయరత్న ఖచితకిరీటమును, సమర్పించి ఘన సన్మానము గావించిరి. ఆ కళా పరిషత్తునకు అధ్యక్షులు రాయలసీమ రాజకీయ కురుపితామహులు; అపరకృష్ణదేవరాయలను, ఖ్యాతివడసిన పద్మ శ్రీ కల్లూరు సుబ్బారావుగారు. వారికి మన రాయలసీమకు, ఆగౌరవ మర్యాదలు దక్కినవి. ఏకవీశ్వరుడు పొందని ఘన సన్మానమును వీరు పొందుట కామేశ్వరీ వరప్రసాదమే. " వరచారిత్ర కవిత్వ భారతి"-"కవిబ్రహ్మర్షి మూర్ధన్య" యను రెండు పదుల బిరుదము లను పొందిరి. రాయలసీమయందలి రత్నములలో ఇదొకజాతి రత్నము తరగని కాంతి.తగ్గనిధారణతో నిత్యనూతముగా ప్రకాశించే వినూత్న కవిరత్నమిది. రాయలసీమ ఖ్యాతిని నిలబెట్టిన, గొప్ప కవివీరు.

కుటుంబచరిత్ర:-

తమపిన్నయ్యగారైన శ్రీ దుర్భాక సంజీవరావుగారే' ఓనామాల' మొదలు మెట్రిక్యులేషను వఱకు ఆంధ్రాంగ్లములను నేర్పించి

సర్వ వ్వ, మర్పించి పెంచినవారని కవిగారు 'తమ కావ్యమున సుడివిరి. వీరిసతిమణి శ్రీమతి దుర్భాక లక్ష్మమ్మగారు. ఈ దంపతులకు కామేశ్వ' య్య'యను కుమారుడు పుట్టి ఏడునెలల కాలము లోనే దివంగతుడైనట్లు కవిగారు తమ 'రాణాప్రతాపచరిత్ర యందు వ్రాసుకొనిరి (రా.ప్ర.సిం.చ-పద్య-52) తరువాత వీరికి ఒక్కగా నొక్క కుమార్తె వుదయించినది. కవిగా రామెను కామేశ్వరీదేవియని పిలిచిరి. వీరు శ్రీకామేశ్వరీ ఉపాసకులు. భక్తిభావనాయత్త చిత్తులు. రాణాప్రతాప సింహచరిత్రను తమ ఇష్టదైవమైన శ్రీ కామేశ్వరీదేవికే అంకితమిచ్చినట్లు ఈ క్రింది పద్యము తెలుపుచున్నది.

కం॥ 'ఈమహనీయ గ్రంథము-గై మోడ్చుచు నంకితమ్ము।
గానిచ్చెదనే। ప్రేమ౯ బెనుపనోచని నా। కామేశ్వరునెత్తి పెంచు
కామేశ్వరికి౯.

కవిగారి కుమార్తె, అల్లుడు, శ్రీ డా॥యం. అనంతరామ్. యం.బి.బి.యస్.గారు ప్రస్తుతము మదరాసు పట్టణమున వున్నారు కవిగారికి శ్రీ యం. కృష్ణకుమార్ బి. స్. యల్. యల్. బి. గారను ఒక మనుమడు, డా॥ యం, చిత్ర యం. బి. బి. యస్. మరియు యం. మహేశ్వరి బి. యస్.సి.యనుమరాండ్రుకలరు.

కావ్య పరి చ య ము.

రాణాప్రతాప సింహచరిత్ర—ప్రచురణ: 1934,35 (ఐతిహాసిక ప్రబంధము-5 ఆశ్వాసములు)

రాజశేఖరులవారికి పురాణాంశముల గుఱించిగాని, కల్పిత కథలనుగొని గాని, ప్రబంధములు రచించుట, తొలుతటినుండియు రుచించిసదిరాదు. జరిగినది జరిగినట్లు వ్రాసిపెట్టిన సత్యమగు, దేశ చరిత్రములు, ప్రజా ప్రబోధక,ప్రబల సాధనములు కాగలవని వారి విశ్వాసము. కనుకనే వారింతకు క్రితం వ్రాసిన రెండు పద్య గ్రంథములుకూడా దేశచరిత్రకు సంబంధించినవై యున్నవి ఒకటి

'ఘూర్జర దేశచరిత్ర' యందలి 'వీరమతీదేవి చరిత్రము' రెండవది 'మేవాడ దేశచరిత్రమునందలి' చండ నృపాలచరిత్రము' తరువాత వీరి ప్రయత్నము రాణాప్రతాప సింహుని దివ్యచరితముపై జరిగినది లెఫ్టనెంటు కర్నల్ జేమ్సుటాడ్డు దొరగారి, రాజస్థానదేశచరిత్రము చదివినప్పటినుండియు ఆ మహనీయుని 'చరిత్రను' కావ్యముగా రచించి యాంధ్రభాషా యోషామణి మృదుపదార విందముల చెంత సమర్పించుకొని, కృత కృత్యుడు గావలె ననెడికోరిక వారికి గలిగి నట్లు కవిగారే, స్వయముగా ఈ గ్రంథమున వ్రాసుకొన్నారు.

ఈ గ్రంథముపై ప్రసిద్ధకవి రత్నమైన శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారు తమ అభిప్రాయము, నిట్లువెలిబుచ్చిరి.

"ఒకానొక కాలమున నేనును ప్రతాపరాణా చరిత్రమును పద్యకావ్యముగా వ్రాయ నుత్సాహపడి, యుపక్రమించియుండిన వాడను. సుమారు 300 పద్యములువ్రాసి నడుమంత్రమున, వదలితిని వ్రాతగ్రంథముకూడా నావద్దలేక నశించినది. తమగ్రంథము, జదువ మొదలిడగానే నాప్రయత్నము నిరవశేషముగా నశించుట, యెంతో మేలాయె, ననిపించినది. ఇంతగొప్ప గ్రంథమును ఒకటే ధారతో అందదుకులు, తొందుకులు, లేక రచించి ముగింపగల్గిన తమశక్తి సామర్థ్యముల కాశ్చర్యపడి అభినందించుచున్నాను. తమది ప్రబంధముల పక్వతతోకూడిన పురాణశయ్య. ఈ శైలిలో నిజముగా దామొక, పురాణమునే వ్రాసియుండిన నెట్లుండెడిదోయని యాశ పడుచున్నాను. ఈ స్థితిలో నీకావ్యము నింతరసవంతముగా పఠనీయముగా జేయ శక్తులు చాలామంది లేరనుట నిస్సందేహమైన విషయము. (రాళ్లపల్లి అనం. కృ. శర్మ)

కవిసామ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారీ ఐతిహాసిక ప్రబంధముపై నను-కవిగారియెడలను ఈ క్రింది అమోఘమైన అభిప్రాయమును వెల్లడించిరి.

"-భారతము పూర్వకాలపు కథనే చెప్పును. అందులోవున్న ధర్మముమాత్రమే, మనజాతిది. ఆ విషయము ద్వాపరయుగము నాటిది. మన పరిస్థితులతో సంబంధము లేనిది. ప్రతాపసింహచరిత్ర మనధర్మమునే కాక, మన పరిస్థితులనుకూడా చెప్పును. అక్బరు చక్రవర్తితో పాతికయేండ్లు, హోరాహోరిపోరాడి, స్వదేశమువదలి కొండలలో గుట్టలలో నివసించి, తిండిలేక, గడ్డి రొట్టెలుతిని, దైవ వశమున మఱల స్వాతంత్ర్యమును, సంపాదించిన మహాపురుషుడు రాణాప్రతాపుడు ఆయనకన్నా ధర్మరాజాదులేమియూ నెక్కువవారు కారు. వస్తుగౌరవ్యతకుగాని కథాచమత్కారమునకుగాని ఇందలి భిన్నపాత్రల భిన్నతా విశిష్టతకుగాని భారతమునకీ గ్రంథము తీసిపోదు. వస్తువిటువంటిది.

క వి - యె టు వం టి వా డు?

వ్యాసునకు తిక్కన్నకునెంత వీరరసావేశమున్నదో యంత వీర రసావేశముగలవాడు. భారతములోని యుద్ధపంచకము తిక్కన్నగారు వ్రాయకయుండినచో, మఱియెవరు వ్రాయగలుగుదురని ప్రశ్నించినచో, నేను 'రాజశేఖర-శతావధానిగా "రని సమాధానము చెప్పెద. ఈ గ్రంథములో, చివర నాల్గాశ్వాసములు యుద్ధమే తప్పవేఱేలేదు. యుద్ధవర్ణన యెచ్చటచూచినను, తిక్కన్నగారి రచనతో, తులదూగుచున్నది. ఈ గ్రంథము ఒస్వతంత్ర జాతికొక స్మృతి గ్రంథమువంటిది.

రాణాప్రతాపునకును, మహాత్మునకు గల సామ్యము భారత జాతికి గల యస్వతంత్రత. మహాత్మునిది కత్తిలేని సాత్త్వికపు పోరు-ప్రతాపునిది కత్తిగల సాత్త్వికపుపోరు. ప్రతాపసింహుడు అక్బరును జయింపవలెనని యుద్ధము చేయలేదు. ధర్మముకోసము యుద్ధము చేసెను. భారతజాతీయ ధర్మము పరులకు లొంగిపోదు-చచ్చిపోదు—అనిఋజువు చేయుటకే యుద్ధము చేసెను.

" కాన విజయంబు ముఖ్యంబు గాదుమనకు
ధర్మనిర్వహణంబు కర్తవ్య మిపుడు. "

ఇది ప్రతాపుని యూహ. నేటిసత్యాగ్రహమునకు ఆనాటి ప్రతాపుని యుద్ధధర్మమునకు భేదమేలేదు.

ఇట్టిగ్రంథరచన సామాన్యకవి చేయునదికాదు. ఇది తిక్కనాదులు చేయదగ్గది. ఇది పరమోత్తమ గ్రంథములలోనొకటి
(శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి సమీక్ష నుండి.)

రాయలసీమ ఖనినుండి వెలువడిన కోహినూరువలె ఆంధ్ర భాషా సరస్వతి కిరీటమున, వెలుగు కావ్యరత్నకృతియిది. ఇందలి ప్రశస్తఘట్టములలోని, వీరరసమును కొద్దిగా చదిచూడడు.

భానుసింహ-వీరబలులయుద్ధము. తృతీయాశ్వాసముసుండి)

ఉ॥ వాడినచేనిపైఁబడెడు-వర్షమునట్టుల,మానసింహుకుఁ
దోడయివచ్చినంతయవసర్,ధృతిలోఁజెలరేగిమూపులుఁ
మూడయిపొంగ వీరరసపూర్ణుఁడు,వీరబలుండుయోధులఁ
గూడి,యెదిర్చెనయ్యహితకుంజర సింహము,భానుసింహముఁ

౨

మ॥ కరవాలంబులు, కన్నుగోనల,స్ఫులింగశ్రేణి నల్దిక్కులఁ
బరవఁ భీషణచంద్రహాస, రుచులభ్రింబంటి, వర్తింపని
ర్వురు, గంధర్వములఁ విచిత్రగతులఁబోనిచ్చుచుఁ
దాకి,సం
గరముఁజేరి,బాహుశౌర్యము, సమగ్రప్రౌఢి దీపింపగఁ

౩

మ॥ తన గర్జారవధాటికిఁ దెసలు బ్రిద్దల్ బ్రిద్దలై పోవ, నూ
తన సంరంభ విజృంభణంబున. నమిత్రశ్రేణి, భీతిల్లగా
వెనుకఁ జూడక, భానుసింహుఁడు, రణోర్వీఁ శాత్రవుఁ
దాకి,యాతని యశ్వంబు,గళంబునుఁదఱిగె; నుద్యత్ఖడ్గ
ధారాహతిఁ

౪

కం॥ కమల సరోవరమున, ద్విర
దము, విహరించిన విధాన-దనివి సనక, వి
క్రమరాశి, భానుసింహుఁడు
సమయించెఁదురుష్కభటుల-సమరతలమునఁ

౫

చం॥ అదిగని మానసింహ విభు డంబరువీరుల 'భానుసింహుపై'
గదిసి, రణంబు సేయుదని-కట్టడ సేయగ, నట్టహాసముల్
పొదలగ వారుపై బడిరి-భూరిభుజాబలరేఖ యొప్పగాఁ
గదనము,చేయసాగె లయకాలయముండన,నాతఁడుగ్రుఁడై

అమరసింహచరిత్ర

ఈ అమరసింహ చరిత్ర వ్రాయుకాలము నాటికి కవిగారి వయస్సు అరువది రెండేండ్లు. అప్పటికే వారు వృద్ధాప్యమును పొందినట్లు చింతించి తమ అవతారిక యందిట్లు తెలుపుకొనిరి.

" అమృతరస మొల్కు మధురకా-వ్యములువ్రాయ
నాకసముఁ మింగునంతటి-యాసగలదు
కలముఁబట్టిన యంత దుర్బలత-దోచు।
దగిన బలమీగదమ్మ। కాత్యాయనమ్మ!

ఆఱువది రెండువచ్చె;సక—లాంగములుఁ వదకంగఁజొచ్చె;ధీ
గరిమము నొచ్చె; దుర్బలత-కార్శ్యముహెచ్చె; గరంబునీరస
స్ఫురణముసొచ్చె;ధారణ స—ముద్ధతి విచ్చె గృతుల్ రచింపనా
తరమె భవాని!నీవుకృప—తప్పినఁదప్పు సమస్త, యత్నముల్."

అమరసింహ చరిత్రమును చదువుచున్న పాఠకున కెవ్వనికిని కవిగారికి ఈ కృతి వ్రాయునాటికి అరువది రెండేండ్లుగా వూహింపరు. పదహారేండ్ల రసపుత్ర వీరుడే ఈ కృతిని తెనిగించినట్లు తోచును. ఈ రసపుత్రుని చరిత్ర వ్రాయునప్పుడు కవిగారు శారీరకముగా శక్తివంతులు కానప్పటికిన్ని వారికి వుత్తేజము,ఉద్రేకత, శక్తి సామర్థ్యముల నిచ్చినదా రసపుత్రులేయని చెప్పక తప్పదు. కవిగారే తమ స్వానుభవమునిట్లు తెలుపుకొనిరి.

సీ॥ రాజపుత్రస్థాన-కవివంశ నరపాల
కులమాట మదినను-కొనినయంత-
నేహేతువో కాని—దేహంబెఱుఁగకుండ
రసవ న్నదేశిక భా-రమ్ముదోచు
భావముల్ శరపటం—పరగాగదోచియా
నందబాష్పములుదొం-తరలుగట్టు!
మది, జరిత్రాంశముల్—మెదువ, నంతలా,క
థాంశముల్ తోచునో—యమరసింహ
భూవరు చరిత్రమేతోచు-నో వచింపఁ
జాల! నేమైనఁగాని, నీ-చరణయుగళ
మెడఁద నిల్పుచుఁగృతిమొద-లిడెడువాఁడ!
శైలరాజన్యకన్య! సౌ-జన్యధన్య!

అమరసింహుని కుమారుడు కర్ణుడు. జహాంగీరు పాదుషా కుమారుడైన ఖూరుము (పిదప నితడే షాజహాన్ చక్రవర్తి) తో యుద్ధమెట్లొనర్చెనో ఒకచిన్న కంద పద్యమున అతి చక్కగా అతుకునట్లు అల్లిరి.

కం. గరుడుడు. గరుడుడు, శరనిధి
శరనిధి, దేగయును దేగ-శైలము శైలం
బురవడినిదాకి నట్టులు
దురమున యువరాజుయుగము దొడరెన్ గడిమిన్.

కర్ణుడు, ఖూరుము రాకుమారుని యుద్ధమందు నిరాయుధుని గావించెను. నిరాయుధుడై నిల్చిన యవన యువరాజును గాంచి కర్ణుడు తనకు తెలిసిన యుద్ధ ధర్మము నిట్లు తెలిపెను.

గీ॥ వీర! నీచేతి ఖడ్గంబు-జారెగాన
నిదియ యవనని మేలొంద-నెంచి నిన్ను
దొడిర నుంకింప, సందేహ-పడకు! కర్ణు
డంత యన్యాయ వర్తనుం-డసుకొనకుము.

ఇట్టి యమృత రస సంభావిత వాక్యములు విన్నయా యవన, యువ రాజునకు కొంత,గగ్గుర్పాటు, అతడెవరన్న ఆశ్చర్యముగలిగి, సందేహము నడిగి తీర్చుకొని, సంభ్రమమున అశ్వము దిగివచ్చి కర్ణుని కౌగలించుకొని "నినుగన నేంగ్లనుండి కోరుచునుంటిన్" అనిపల్కి ప్రేమతో ఆతని మైత్రి కోరుచు యిరుపక్షముల శ్రేయస్సుకొరకై యిట్లు పలికెను.

సీ॥ "పితరుల కాలమీ - గతిజెల్లె రణములు
మన కాలముల్లైన - మాన్పదలచి
పరమ సౌజన్యసే - వధివంచు నిసుగూర్చి
వినియుండి నీతోడ - విన్నవింప
మేవాడకునుఢిల్లి - కీ వైరములుమాను
నని యేండ్ల నుండినే - నఖిలషింతు
నిన్నాళ్ల కాభాగ్య - మిటుగల్గె! గన్నుల
కఱవు దీఱగనిన్ను - గాంచగంటి

గీ॥ శాంతి నాకిష్టమని చిన్న - సంజ్ఞ చేయు !
మింక మేవాశకునుఢిల్లి - కెప్పుడుగాని
సమరములుగాని సంఘర్ష - ణములుగాని
పొరయ కుండంగ జేతునే - చరణమాన"

సంధి జరుపుకొన్న విషయము తెలిసిన తరువాత అమరసింహ చక్రివర్తి మనమున పరిపరి విధముల పరితపించెను. తనరాజ్యమును కర్ణకుమారున కప్పగించి యాతడు

గీ॥ రాగవిరాగముల్ - మూగనిచోటు! కా
మక్రోధములు లేని - మంచి చోటు!
పరజయాపజయముల్ - బాధసేయని చోటు!
కష్టసౌఖ్య వివక్ష - గననిచోటు!
స్నేహ వైరములు శాం - తిని మారుపనిచోటు
లాభనష్టములు మె - లగని చోటు
పూర్ణ విశ్రాంతికా - పురముండు చోటు! మ
హానంద నిలయమై - యలరు చోటు

గీ॥ ప్రకృతి వైభవమెపుడుచే - డ్పకని చోటు!
విశ్వనాథుండు మ్రోల గన్పించు చోటు!
వ్యాఘ్రశైల ప్రశాంత గుహాంతరములు
శాశ్వత స్థాయిగా నాకు శరణమగుత"
అనుచు అతడు తపమాచరించుటకు వెడలి పోయెను.



ఆంధ్ర కర్ణాటక, కవి కేసరి,
మహాకవి, సవ్యసాచి,
సాహిత్య సరస్వతి

శ్రీ కిరికెర రెడ్డి భీమరావు

జననము: **13—6—1896**
నిర్యాణము: **9—3—1964**

తండ్రి	:	రెడ్డి అప్పారావు గారు
తల్లి	:	వేంకటలక్ష్మమ్మ
మతము-కులము	:	హిందూ-బడగలనాటి బ్రాహ్మణులు.
గోత్రము	:	గౌతమసగోత్రులు.
స్వస్థళము	:	అనంతపురం (జి॥) హిందూపురం (తా॥) కిరికెర గ్రామము.

విద్యాభ్యాసము

మాధ్యమిక విద్య హిందూపురము నందలి ' ఎడ్వర్డు కారనేషను ' బడిలో మిక్కిలి శ్రద్ధగా చదివెను. అప్పుడు శ్రీ యుతులగు కల్లూరు సుబ్బరావుగారు, గురుమూర్తిగారు, దొంతి భీమయ్య శ్రేష్ఠి గారు, లేపాక్షి వెంకటనారణప్పగారు మున్నగు సుప్రసిద్ధులు వీరికి సహ పాఠకులుగా నుండిరి. మాధ్యమిక విద్య ముగిసిన పిమ్మట హిందూపురమున నున్నత పాఠశాల అప్పుడు లేని కారణమున తోడిబాలురతో గూడి బెంగళూరు నగరమునకు వెళ్ళి 'మిషన్' స్కూలులో కొన్ని సంవత్సరములు, అటు పిమ్మట మైసూరునకువెళ్ళి 'మెట్రిక్యులేషన్' పరీక్షలో నుత్తీర్ణులైరి. స్వయం కృషివల్ల, కర్ణాటక గ్రంథ పఠనము గావించి, ఛందోవ్యాకరణాది

శాస్త్ర నిష్ణాతులై, తద్భాష యందును, కవనమల్ల నభ్యసించిరి. మైసూరు సంస్కృత కళాశాల యందలి పలువురు పండిత వర్యుల కడజేరి, గీర్వాణ భాషనభ్యసించిరి. వ్యాకరణాది అలంకార సూత్రములను చక్కగా బఠించిరి. ఆయుర్వేదము జ్యోతిశ్శాస్త్రము సాముద్రికము, వేదాంతము, మున్నగు వేదాంగములకు మాతృక లైనవాటిని, గీర్వాణ భాషలోనే పరిశ్రమ మొనర్చి వాటి మూల సిద్ధాంతములను గ్రహింప గలిగిరి.

ఉద్యోగము;

పెనుకొండలో అసిస్టెంటు ఇంజనీయరుగారి ఆఫీసులో క్లార్కు గాచేరి, ఒక సంవత్సర కాలము పనిచేసిరి తరువాత ఇరువది రెండవయేట తండ్రిగారు మరణించుటవల్ల కవిగారు వంశపారంపర్యముగా వచ్చు మునసబు వుద్యోగమున ప్రవేశించిరి.

బిరుదులు :

పెనుకొండలో ఉద్యోగము చేయుచున్న సమయమున అక్కడ కవిగారు కొన్ని గ్రంథములు వ్రాసిరి. అక్కడి బాలసరస్వతి మండలివారు కవిగారిని గుర్తించి 'బాలకవి' బిరుదముతో సత్కరించిరి. 1946 లో బెంగుళూరు విశ్వకళా పరిషత్తు వారు కవిగారి నాహ్వానించి, కవిపండిత సమ్మేళనమున "ఆంధ్ర కర్ణాటక కవికేసరి" యను బిరుదముతో సత్కరించి, తమగౌరవ ప్రపత్తుల వెల్లడించిరి. 18-11-1956 తేదిన బళ్ళారి యందు కవిగారికి 'కవిసవ్యసాచి' యను బిరుదమిచ్చిరి.

కుటుంబ విశేషములు:

ఇరువది రెండవ యేట కవిగారు వివాహమాడిరి. వీరికి

ఒక కుమారుడు, ఒక కుమార్తెయు కలిగిన తరువాత కవిగారి 32 వయేట, వీరి భార్య గతించెను. ప్రస్తుతము వీరి కుమారుడు శ్రీ అప్పారావుగారు కిరికెర గ్రామ మునసబుగా నున్నారు.

రచనలు

శతకములు:— 1) వాయునందన శతకము 2) భీమేశ్వర శతకము. 3) భక్తి పంచకము (5 శతకములు) వచన రచనలు:- 4) తిరుమలాంబ 5) శత్రు నిగ్రహము 6) దశావతారములు నాటకములు:- 7) మహేంద్ర విజయము 8) చంద్రమౌళి హరికథలు:- 9) గరుడ గర్వభంగము 10) సీతా కల్యాణము 11) కృష్ణరాయబారము 12) కృష్ణగారడి. జ్యోతి శ్శాస్త్ర గ్రంథములు 13) జాతక సుధానిధి (1—2 భాగములు) 14) యోగాయుర్దాయ దర్పణము 15) భీముని సాముద్రికము

ఇతర కృతులు;- 16) జ్ఞానవాశిష్ఠ రత్నములు 17) విజయ నగర కళావిలాసము 18) పితృభక్తి (తండ్రిస్మారక చిహ్నము) 19) జగన్నాయక తారావళి

కర్ణాటక గ్రంథములు

1) భగవద్గీత 2) ఉత్తరగీత 3) గీతాంజలి 4) విజయగౌతమ 5) భీమేశ్వరీయము 6) పాండవా జ్ఞాతవాస. 7) కృష్ణ మాయావిలాస. 8) యుగంధర ప్రజ్ఞె

కడపట దశయందు వ్రాసినది.

1) యోగవాశిష్ఠము 2) అధ్యాత్మ రామాయణము.

జ్ఞానవాశిష్ఠ రత్నములు:—

శ్రీ కృష్ణ దేవరాయ గ్రంథమాల వారు, ఈ కృతిని 13వ పుష్పముగా 1957లో ప్రకటించిరి. ఈపొత్తములోని వచనరచనలు శ్రీ డి. బాబన్నగారివి. ఇయ్యది సంగ్రహ కావ్యము గనుక, పూర్వాపర కథాసందర్భముల, నావచన రచన లతికించుచు పాఠకుల మనముల నాకర్షించును.

కం. ఎక్కడి సంసారంబిది?
యెక్కడి ఘోరంబుపీడ? యెక్కడిదో:నా
కొక్కటియు దోపకున్నది
నిక్కెడి కామాదిరిపులు-నిఖిలేంద్రియముల్

౨

కం. మీరెఱిఁగిన, సుజ్ఞానము
వారక యుపదేశమొసఁగి వాత్సల్యంబిం
పార, ననుఁ జూడవేడుదు
సార తపోబలవిశాల! సన్మునిచంద్రా,

౩

చం॥ విరహిత గర్వియై, వరవివేకియు, భోగవిదూర చిత్తుఁడై
సరసత నిస్పృహుండునయి, శాంతినిగల్గి,విజృంభణంబుగా
బరగు, నహంకృతోక్తుల, వివాదములన్ దరిఁజేరనీయ, కా
దరమతిఁగాంచ గావలయు-దాశరథీ పరమంబుఁ జెందఁగన్.

౪

సీ. ఎలుకలు కొఱికిన—వలరీతి నశియించు
సంసార వాసన—సక్రమముగ
తెగును, మనోగ్రంధి—తెగ్ప పడదరువాయి
ప్రవిమల జ్ఞాన, స్వభావమంత
సజ్జుగా, నిత్యప్రసన్నమై—నెగడుచు
నలరు ప్రత్యక్ష మీ—యనుభవంబు
గల్గి, యోగ బునే—గడన సత్పదు వాని
కరుణకుఁ బ్రహ్మాది సురలు పాత్రు

గీ. లగుదు రట్టి, యోగాభ్యాసుఁడగణితుఁడయి
దిగ్వితానంబులెల్లను—దెల్లముగను
గనులు నైజంబుగా జూచు—కరణి జిత్త
గతియె లేకుండ, దాఁజేయు కర్మలెల్ల.

విజయనగర కళావిలాసము(లేపాక్షి) ప్రచురణ 1957

ఈ కృతి "పద్మశ్రీ" కల్లూరు సుబ్బరావు గారికంకిత మివ్వబడినది.

చం. అది, విరుపణ్ణ నిర్మితమునై, యెసలారెడు, దేవమందిరం
బది, యొఱ శిల్పరత్నమననై, మనరాయలసీమ కీర్తి,కా
స్పదమయి,శిల్పనైపుణి,సభఁగురు భంగిని, జాటుచుండు; వే
ఱెది, సరిరాదటంచు,మదికెంతయు మోదముఁగూర్చు
చుండెడిన్.

దుర్గాదేవి

ఉ. అద్దిరా! దుర్గ! నాడు మహిషాసుర మర్దనివైన మీద నీ
వొద్దిక నా మహేశ్వరు, మహోన్నత పీఠముజేరితందురా
సుద్ది హుళక్కి; యిందె నిజసూనుని బాయఁగ లేకనిల్చి, యీ
ముద్దులపట్టి, భద్రు నగుమోమును గాంచెదు; స్తంభ
మందునన్.

సీ. రాజాను పతిలేక—రాష్ట్ర ధనంబెల్ల
ఆలయంబునకు, వ్యయంబొనర్చి
ద్రోహమొనర్చిన-దుర్మతి విరుపణ్ణ
బట్టితెంకని, నృపవర్యుఁడలిగి
ముదల నిడిన, నంత, మదిఁబొక్కి, యావార్త
నాలకించుచు, విరుపాఖ్యుఁడపుడు
కనుగ్రుడ్లఁబెకలించి—కడుకొని, శిలపైనఁ
గొట్టె నటందురు క్రూరగతిని

గీ. నమ్మఁజాలమిద్ది; నలువారఁగళలెల్ల
వృద్ధిసల్పి శిల్పి విజ్ఞతలకుఁ
దగిన గౌరవంబు-దైవాఱఁగూర్చిన
రసికుఁడిటు లొనర్ప బొసగు నెట్లు?

ఉ॥ ఈ రతనాల బొమ్మలను—నెవ్వరు పాడొనరించిరో, నిరా
ధారము కారణంబు; మతదర్ప సమన్వితులై-మహోగ్రులై
క్రూరులు చెక్కువైచిరో:విరోధము నూనుచు, లేక యిట్టిశృం
గారము పాడుచేయుదురే? కన్నులపండువుఁగూర్చు
చుండగన్.



కవిచంద్ర

శ్రీ యమ్మనూరు సుబ్రహ్మణ్య శర్మ.

జననము– పార్థివ నామ సంవత్సర మాఘ॥ శుద్ధ పంచమి.

జన్మస్థలము: కొండాపురము హిందూపురం తాలూకా. అనంతపురం జిల్లా

తల్లి : వెంకమ్మ
తండ్రి : శేషశాస్త్రి
కులము : బ్రాహ్మణ–శౌనకసగోత్రము–ములకనాడు.

విద్యాభ్యాసము వగైరా:

చిన్నతనమున, పల్లెటూరి బడిపంతుల వద్ద విద్యాభ్యాసము. ఉపనయనమైన పిదప, మదనపల్లె తాలూకు, 'చదుము' గ్రామములో శ్రీశంకరావధానుల వారి వద్ద 'యాజుష' పూర్వ ప్రయోగమాదిగ వేద విద్యాభ్యాసము చేసిరి.

స్వగ్రామములో శ్రీరంగనాథ రామాయణము, శ్రీమదుత్తర రామాయణము, భాగవతము, సాయంకాలముల యందు చదివి శ్రోతలకు వినిపించెడివారు.

కవిగారికి ఒకనాటి రాత్రి నిద్రలో "మారసుందర! ధీరగంభీరా! సరసుడా! యేరా! మేఁగాదిక; చాలు పోపోరా: " అనియెడు రాధాకృష్ణ సంవాదపుపాట 'జావిడి' నోటికి వచ్చెను. మేల్కాంచి ఆ నాల్గు పాదములను వ్రాసుకొని ఆధాటి తెలిసిన వారికి చూపించగా వారు రాగతాళములు, విశదముగా తెలుపుచు 'యత్రలయస్తత్రియతిః'అని కవిగారిని ప్రబోధించగా, నాటినుండి దైవ సంబంధమైన భక్తియుక్తమైన పాటలు రచియించి వెలయించిరి. ఇట్లుండగా, 'కుందలగురికి' వేంకటనారాయణ కవిగారు వేంచేసి, పద్యములల్లుటకు ఛందో వ్యాకరణ పద్ధతులు, కవిగారికి తెల్పగా దానియందు కృషిచేసి 'శ్రీ పులివెందల రంగనాయక శతకము' 'శ్రీకర్ణాభ్యుదయ' ప్రబంధము రచియించి, గోరంట్ల (హిందూపురం తా॥ అనంతపురం జిల్లా) గ్రామములో రామాలయములో కృష్ణమూర్తికి, కృతి సమర్పణ చేసిరి. ఆ పండిత మండలి మహాసభలో సభాధ్యక్షులుగా విలసిల్లిన శ్రీచిలుకూరు నారాయణ రావు గారు సభికుల అనుమతిపైన 'కవిచంద్ర' యనెడి బిరుదు కవిగారికొసంగిరి.

కుటుంబ సంగ్రహ చరిత్ర:

కవిగారి పూర్వీకులు బుక్కపట్టణమునకు దగ్గరగా వున్న 'క్రొత్తచెఱువు' (అనంతపురం జి॥) గ్రామ నివాసులు. వీరి వంశమునకు 'యజ్ఞరామసోమయాజి' మూలపురుషుడు. అతనికి లింగ సోమయాజి ప్రథమ పుత్రుడు. అతని కుమారుడు శేషశాస్త్రి గారు వారి సహధర్మిణి శ్రీమతి వెంకమ్మగారు. వారికి కవిగారు జన్మించిరి. వీరి ఏకైక కుమారుడు శ్రీ నాగేశశర్మ గారు ప్రస్తుతం బెంగుళూరు, జయనగరమందలి వాణీనిలయములో వున్నారు. నాగేశశర్మ గారికి యిరువురు పుత్రులు, యిరువురు పుత్రికలు కలరు. కవిగారు వీరి వద్దనే ప్రస్తుతమున్నారు.

కవిగారికృతులు

1) శ్రీరుక్మిణీ కల్యాణము, 2) వామన చరితము, 3) అనసూయ 4) సావిత్రోపాఖ్యానము 5) కర్ణాభ్యుదయము (ప్ర. 1947) 6) శ్రీ భక్తజన మనోభిరామము.

శ్రీ కర్ణాభ్యుదయములోని కొన్ని రసవంతమైన పద్యములు.

—— కుంతిదేవి యశ్వనీనదిలో పేటికను విడుచుట. ——

ఉ॥ కన్నెటికమ్ముఁగాచుకొన • గాదిలి పట్టిని నొప్పగించెదన్
బన్నగశాయిపాదభవ • పాప విభంగ!కృపాంతరంగ!యో
సన్నుత దివ్యగంగ!నవ•సారస భృంగ తరంగ రంగ! నా
చిన్నకుమారునిన్ విజిత • చిత్తజరూపునిఁగావ వేఁడెదన్.

క॥ అనుచున్గొని యాడుచునా
జననాథుని పుత్రి • మంజుసన్పెను వఱదన్
వనరుచు విడువఁగ నదియునుఁ
జనె నాపై నేమిసెప్ప • ఁజాలుదు నధిపా!

క॥ పెన్నెతో మున్నీరో
కన్నీరో తెలుపరాదు • కాంతామణికిన్
గన్నులఁగాఱెడు స్రవము
లన్నన్నా! జూచ నగునె! యా • యలమటయున్,

—— పుత్రునికై కుంతీదేవి దుఃఖించుట. ——

ఉ॥ హా!యను;ముద్దుగుల్కుతన•యా!యనునిర్జితసుందరాస్య చం
ద్రా!యనుఁదాపదుఃఖ రహి • తా! యను నిందిత శంబరారిరూ
పా! యను దివ్యధామ దిన•పా! యను బంధుర ధర్మవర్మ దీ
ప్తా! యనుఁగార్యమింక గల•దా! యనుఁదానెనలేని వంతచేన్

వ॥ తదనంతరంబ నలుదెసలంబరికించి,

సీ॥ పుత్రుఁడా! జితకాంతి • మిత్రుడా। సౌవర్ణ
గాత్రుఁడా। నీకునే • శత్రునైతిఁ
జూతునా! నిన్నింక • నేతీరుగానైన
బ్రీతిచేఁగనులార • భూతలమున
నందనా! నినుఁబాసి • యుందునా! మహియందు
మందునా! నేనింక • గుందువదలి
కొమరుఁడా! నాపాలి • యమరుఁడా! మాముద్దు
కొమరుఁడా! యనఁదగు • కొమరువాఁడ!

గీ॥ చేతులారంగఁజేసితి • పాతకంబు
నీతిదప్పితి నే పుత్రి • ఘాతినైతి
భూతలంబున సత్కీర్తి • వొందనైతి
వేయు నేటికి నీకునే • దాయనైతి.

శ్రీ భక్తజన మనోభిరామము.

సీ॥ మోకులంబిగగట్టి • మోకరించుచులాగి
పీకతోగేకలు • వేయువారు,
గోవింద! గోవింద! గోవింద। యనుచును
తేరీడ్చుటకు, ముందు దెరలువారు,
తేరు చక్కియలందు • జేరి బారులుదీరి
బూర గొమ్ములనూది • పొనరువారు,
జయవేంకటాద్రీశ! • జయశేషశైలేశ।
జయదేవ సర్వేశ!•జయతుయనుచు,

గీ॥ పొరిది కరతాళములదట్టి • తిరుగువారు
చెలఁగి హరినామకీర్తనల్ • సేయువారు
గ్రక్కునను శౌరినటగాంచి • మ్రొక్కువారు
మొట్ట మొదలున ముడుపులు • గట్టువారు;

౨

సీ॥ వేత్ర హస్తుల పంక్తి • వేంకటేశుని మ్రోల
వ్రాలి మున్నిడి బరా • బరులు సలుప
భూమీసరోత్తముల్ • వేమరుస్వామికి
వింజామరమ్ములు • వేయుచుండ
సాధ్వీమణులు గూడి • సాగు, యరదముపై
మల్లియల్, మొల్లలు • జల్లువారు
వేల్పు బానిసలెల్ల • చాల్పుగా నిలుచుండి
నతులొనర్పుచు, నర్తనములు సలుప

గీ॥ వేద నాదంబుచే, ద్విజుల్ • విల్లసిలగ
తూర్య నినదంబులమితసం • తోషమొసగ
హాటతులనెత్తి రహిజెంది • యబల లలర
వేంకటేశుండు రథమున • వెలుగుచుండె



విద్వాన్, కావ్యతీర్థ

శ్రీ మద్దులపల్లి వేంకట సుబ్రహ్మణ్య శర్మ గారు

(కవితా సామ్రాజ్యము)

జననము:- 23—8—1900
(శార్వరి శ్రావణ బ॥ ౧౪
గురువారము)

నిర్యాణము:- 2—10—1974

తల్లి :- శ్రీమతి వేంకట సుబ్బమ్మగారు.
తండ్రి :- శ్రీ నృసింహ సిద్ధాంతిగారు
జన్మ స్థలము:- పట్టాభి రామపుర మగ్రహారము (నెల్లూరు జి॥)
మతము-కులము:- హిందూ స్మార్త బ్రాహ్మణులు.

విద్యాభ్యాసము

కృష్ణయజుర్వేద సంహితతో కొంత. నెల్లూరు జిల్లా కందుకూరు తాలూకా సింగరబొట్ల పాలెమగ్రహారములో వేదపాఠశాలలో

కావ్యపరిశ్రమ:- ఈ మనిలో (గుంటూరు జిల్లా తెనాలి తాలూకా)
నాటకాలంకార సాహిత్యపరిశ్రమ:- కడపలో శ్రీకళాప్రపూర్ణ జనమంచి శేషాద్రి శర్మ గారి సన్నిధిలో
సంస్కృతాంధ్ర కవితావ్యాసంగము. స్వయంకృషి కావ్యాభ్యాసమునుండి.

ప రీ క్ష లు

కావ్యతీర్థ కలకత్తా పరీక్ష 1923
ఉభయభాషాప్రవీణ. బి. ఆంధ్రయూనివర్సిటి. 1930
విద్వాన్. బి. మదరాసుయూనివర్సిటి. 1937

చే సి న యా త్ర లు.

కాశీయాత్ర1923 – రామేశ్వరయాత్ర1927

ఉ ద్యో గ ప ద వు లు

చెన్నపురిలో వావిళ్ల ముద్రణాలయములో పండితుఁడుగ – 1924 లో నంద్యాల మునిసిపల్ హైస్కూలులో ప్రధానాంధ్రపండితుఁడుగ (1925–1959) 34 ఏండ్లు. కర్నూలులో సెంట్ జోసప్ గరల్స్‌హైస్కూలులోను, సాంస్క్రిట్ ఓరియంటల్ హైస్కూలులోను ప్రధానాంధ్రపండితుఁడుగ 2ఏండ్లు (1960–1961)

కు టు ం బ చ రి త్ర :-

శ్రీశాస్త్రిగారి ముత్తాత వేదాధ్యాపకుడు; తాత జ్యోతిష్పండితుడు, తండ్రి జ్యోతిష్పండితుడు. పినతండ్రి వ్యాకరణ పండితుడు. వీరిది పండితవంశము కవిగారికి నలుగురు తమ్ములుకలరు. వీరు పెద్ద వారు. వీరికిసంతానములేదు. తమ్ములకు సంతానముకలదు.

సా హి త్య సే వ.

నంద్యాలయందు వీరు 'కవితా సామ్రాజ్యము'ను నెలకొల్పి గొప్పసాహిత్య సేవనొనర్చిరి. ఆసంస్థద్వారా ఈ క్రింది రచనలను ప్రచురించిరి.

1) సత్యనారాయణ మాహాత్మ్యము—5 ఆ. పద్యకావ్యము 2) అమృతసందేశము-వ్యంగ్యకావ్యము, ప్రతిపద్యము రమణీయము. 3) దైవప్రార్థన - సుభాషితములు, అనుక్షణ పఠనీయములైన పద్యములు, శ్లోకములు 400. 4) కవితావినోదము - ప్రథమ సంపుటము-వినోదకరములైన విషయములు 40, వివరణములతో. 5) పెండ్లి రాయబారము—సీతారాముల కల్యాణము, విపులమైన వివరణముతో. 6) సత్యనారాయణ సుప్రభాతము-టీకాతాత్పర్యములతో, సత్యనారాయణ సుప్రభాతము - మూలము మాత్రము. 7) నిరపరాధ నిందలురావు — నాటకము, గజానన జననము, చంద్రునకు శాపము. 8) త్యాగరాజు—5 అం. నాటకము. 9) భక్తపోతరాజీయము — 5 అం. నాటకము బమ్మెర పోతనామాత్యుని చరిత్ర. 10) మేడవరము సుబ్రహ్మణ్యశాస్త్రిగారి చరిత్ర 11) కుక్కలమొఱ-కఠిన హృదయములనేని కరగించు పద్యములు. 12) దానకర్ణ బుడ్డా వెంగలరెడ్డిగారి చరిత్ర-వచనము 13) బ్రహ్మస్వామి జీవితము-వచనము.

అయ్యలరాజు నారాయణామాత్యకవి ప్రణీతమైన "హంస వింశతి" అను శృంగార ప్రబంధమునకు టీకా తాత్పర్య వివరణమును,యెనుబది పుటల పీఠికను వ్రాసియున్నారు. వాంఛేశ్వర కవి రచితమగు "మహిషశతకము" నకు తెలుగులో వివరముగా తాత్పర్యము వ్రాసినారు. దక్షిణామూర్తి స్తోత్రమును ఆంధ్రీకరించినారు,

పై మూడు పొత్తములు శ్రీవావిళ్ల వారిచే ప్రచురింపబడినవి. వీరాంధ్ర వచన భారతమును వ్రాసిరి. దానిని ఆర్. వెంకటేశ్వర అండ్ కో., వారు ప్రచురించిరి. వీరాంధ్రీకరించిన 'ప్రియదర్శికా' నాటిక ఆంధ్రవిశ్వ విద్యాలయమువారి పట్ట పరీక్షకు పఠనీయముగ నున్నది. గాడేపల్లి వీరరాఘవ శాస్త్రిగారి చమత్కార కవితాఘట్టములను 'చమత్కార కవిత్వ' మనుపేర ప్రచురించిరి.

ఉభయభాషల పాండిత్యము వీరిది. పోతనవలె ధారాశుద్ధి గల కవితనల్ల గలవారు.

సంస్కృతాంధ్ర కవితాసామ్రాజ్యము నేకచ్ఛత్రముగా నేలిన కవిసార్వభౌములు వీరు. వీరి కవితా సామ్రాజ్యము(స్వగృహము)న సాహితీ బంధువులు పాంథులట్లు కొంతతడవు సేద తీర్చుకొని సాహిత్యామృతమును గ్రోలి వెళ్లెడివారు.

కావ్యపరిచయము. అమృత సందేశము—ప్రచురణ 1954.

ఇది యొక్క భిత్తి చిత్రకర్మ. దీని కొక యితివృత్తము లేదు, ఊహా గానము తప్ప.

విభావ సామగ్రిలో కాలచక్రమున ఘటిల్లుచున్న కఱవులు, కాటకములే ఆలంబనము. ఆఁకటిచావులు, అల్లాడిపోయిన యార్త జీవుల కంకాళదృశ్యములే ఉద్దీపనములు.

1941 వ సంవత్సరపు టుత్తరార్ధమున ఆంధ్రదేశములోఁ గొన్ని ప్రాంతములను ముంచియెత్తిన వీరక్షామ పరిస్థితులును, 1943లో పత్రికాముఖమున వినవచ్చిన బెంగాల్ రాష్ట్రములోని యాఁకటి చావువార్తలును, ప్రకటించిన ఆ బక్కజీవుల మృత కళేబర దృశ్యములు కవిగారి కావ్యావతరణకు దోహదములు. కఱవు కాటకములను దీర్చు మేఘునిట్లు కవిగారు సంబోధించిరి

ఉ.ఏ మనుకొంటివో జలద! • యిచ్చకు వచ్చినయట్లు చేసి కణా
గ్రామముఁదలంచితేమొ? యది•పాఁడుసు; వార్ధకయన్నఁగత్తిపై
సాము సుమీ!సమీహితము•చక్కఁగఁదీర్పవలెణా; నియుక్తిరో
గోములుగీములుణాదగవు;•గుర్తిడి ప్రభుత్వముఁహావదేమియున్.

మ.గమనింపం దగు ; నీదురాక యెప్పుడో • గాఁచుంచముందే ప్రజ
ల్పుముహూర్తంబని గౌరవార్థమయి బా• ష్లుణా,రిప్పలుణా,గడ్డిగా
దము లేరించియు,నిండ్లు వాకిళులు క్రొత్తల్ లేపియుణాగాచియు
న్న, మనస్ఫూర్తిగ నాదరించినది యే•నాఁచయ్య? సీప్రభగా!

సీ. నిల్కడగా నిల్చి • నిముసమేణా గురియవే !
సీయబ్బసొమ్మేమి • పోయెనయ్యా?
ఆరీతిఁ గురిసిన • నంతటఁ గురియవే !
నీతాతగంటేమి • నీల్గెనయ్యా ?
అంతటఁ గురిసిన • నదను దప్పింతువే !
నీవారిసొత్తేమి • నిలిచెనయ్యా?
అదను దప్పించిన • నావలఁ గనరావె !
నీ ముల్లె ముఁకుపేమి • నీఁగెనయ్యా ?

తే. కానవచ్చిన. యట్టులే • కానవత్తు
కురియవచ్చిన యట్టులే • యురిమి మెఱతు
చిట్టచివ కుండఁబోవ ది • క్కట్టులందు
ఏమి చిత్రవిచిత్రాల • స్వామివయ్యా?

'కుక్కలమొఱ' కావ్యమందు తమ భూతదయను అమి
తముగా ప్రకటించిరి. కవిగారి హృదయము వెన్నవంటిది. ఆ
పద్యములను చదువుపాఠకుల, హృదయమెంత బరువాయెనను
కఅగక మానదు. 'కుక్కనుజంపిన పాపము గుడిగట్టినాపోద'ను
నానుడిని వీరు ప్రబోధపఱచిరి. కుక్కలు తమ మొఱవిట్లుమానవ
జాతికి విన్పించినవి.

ఉ. భూత దయాళులార! పరిపూతగుణాకరులార! తండ్రులా
రా! తమ తోడిబిడ్డల దు। రంతపుఁజావును జిత్తగింపరే!
భూతదయాపరత్వమెటు। వోయెనొ। మానవు లయ్యు
మమ్ముఁజే
నేతులఁబట్టి చంపుదురె! చెల్లరె! యింతటి ఘోర మున్నదే!

ఉ. ఇప్పటికింత పుట్టినది ! యింతటితో నిది యాఱిపోవ;దీ
ముప్పునఁ గుక్క లన్ని పరి ।పూర్తిగ నాశన మైనమీఁదవా
తప్పును జేసినట్టి యొక।ద్రాబను బట్టి జగాన మీరుసుం
దప్పుకొనంగఁ జాలుదురె? । దాని నెఱుంగక సంతసింతురే?


మ. ఒక దుష్టాత్ముఁడు చేసినట్టి పని క। య్యో! వానిదోషాన వా
నికులంబే హత మార్చు ధర్మ మెపుడే।నిన్ గల్గెనే? నేఁడు గా
కకటా! నేఁటికి మాకు మూడినది రే। పన్నన్ మఱెవ్వారికెం
తకుఁగానున్నదొ; యిట్టిశాసనమునే। తప్పింపఁగాఁ జూడరా !

ఉ. కుక్కలఁ జంపునంతటన । కుల్కఁగ నేటికి? రేపుమాపటన్
నక్కలు వచ్చి యూరఁబడి । నన్ దెలియంగల దప్పుదైనమా
యొక్క మహోపకార;మయ।యో! తమరందఱు కన్నులారనొ
క్కొక్కటి చూచికూడ దయ! యుంపక పోయితి, రేమికాలమో!

చ. ఎనిమిదణాల చిల్లరకె । యించుక త్యాగము సేయఁగల్గుచో
ఘనముగ నొక్క ప్రాణమును గాచినపుణ్యము మీకు దక్కు మీ
రొనరుచు నిట్టి సాయమున।నూపిరి దక్కిన మేము మీఋణం
బును బయిసుంచుకొందుమె? గు।ముల్ గుములై తమ సేవ సేయమే?

క. ఇప్పటి కీగంశంబును, దప్పింపుఁడు ; ముందుమాట ।
తలపోయుద; మొ
క్కప్పుడు ప్రభుపుతె దీనిన్, దప్పింపరె; నాఁటి కొక్క।
దైవములేఁడే!

వీరి భక్తపోతరాజీయము (5 అం-నాటకము) హిందూపురం శ్రీకృష్ణదేవరాయ గ్రంథమాల వారిచే ౧౫వ. పుష్పముగా ప్రచురింపబడినది.



కవిభూషణ

శ్రీ కప్పగల్లు సంజీవమూర్తి

జననము:- 7—2—1894

నిర్యాణము:- 13—6—1962

జన్మస్థళము:- బళ్ళారి జిల్లా-'కప్పగల్లు' గ్రామము.

తండ్రి:- శ్రీకరణం: భీమరావుగారు

తల్లిపేరు:- మల్లమ్మగారు

మతము:- } కులము:- } హిందూ-బ్రాహ్మణ-మధ్వ-గౌతమ గోత్రం.

విద్యాభ్యాసము:- S.S.L.C. (మద్రాసు) సెకెండరీగ్రేడు

ఉద్యోగము:- మునిసిపల్ హైస్కూలులో ఉపాధ్యాయవృత్తి.

కుటుంబ విశేషములు:- కరణీక కుటుంబము. మధ్యతరగతికి చెందినవారు.

ముద్రితగ్రంథములు;

1) మేఘప్రతి సందేశము (ప్ర: 1937) 2) మయూరధ్వజ చరిత్రము. 3) శ్రీవరసిద్ధి వినాయక స్తవము (ప్ర: 1958) 4) వంశము. 5) గీతాసుధాసారము 6) నవ్యగాథాలహరి. 7) ఒక శరద్రాత్రి అది 8) వేణువు 9) అహల్య(ద్విపద) 10) ద్రౌపదీమానసంరక్షణ. 11) కీ.శే.కోలాచలం శ్రీనివాసరావు గారి సంగ్రహ జీవితము-గద్యము. 12) కీ. శే. ధర్మవరం రామకృష్ణమాచార్యుల జీవిత సంగ్రహము. (గద్యపద్యములు ప్ర: 1956) 13) బళ్ళారి మునిసిపల్ హైస్కూల్ చరిత్ర (గేయము ప్ర: 1954)

అముద్రితములు.

1) భారతనారిధన్య 2) సుమకరండము (పద్యములు)
3) విజయాభిమన్యు (నాటక) 4) మయూరధ్వజ (నాటక)
5) శివాజి (నాటక) 6) భక్తసుధన్వ (కన్నడనాటకం)
7) గయోపాఖ్యాన (నాటక) 8) గీతాసుధాసార (కన్నడ)
9) వేనుడు (నాటకముతెనుగు) 10) రుక్మిణీ కల్యాణము
11) కృష్ణరాయబారము.

కావ్యపరిచయం:

మేఘప్రతిసందేశము:

మహాకవి కాళిదాసకృతమగు మేఘసందేశ కావ్యమునందుఁ జెప్పఁబడిన యక్ష సంధేశవచనములకు నతనిభార్య యొసఁగిన

యనురూప ప్రతివచనములే ప్రతిసందేశకావ్యము. ఈ ప్రతి సందేశ కావ్యమును గీర్వాణభాషయందు మైసూరు మహారాజాస్థానవిద్వత్క విరత్నమగు బ్రహ్మశ్రీ మండికల్-రామాశాస్త్రి గారిచే రచింపఁ బడినది. ఆ శ్లోకములను వృత్తములతో నాంధ్రమున శ్రీరావాడ వేంకటరామశాస్త్రిగారు ననువదించిరి.ఆవృత్తముల నొక్కొక్కటిని రెండేసిగీతములుగ శ్రీకప్పగల్లుసంజీవమూర్తిగారు నాంధ్రీకరించిరి. విపులమగు విషయమును సంగ్రహించు కార్యము రావాడ వారొ నర్చగా, సంకుచిత విషయమును వెల్తిగాకుండ విశదీకరించుపని కప్పగల్లు వారొనర్చిధన్యులైరి. కాళిదాసుని మేఘసందేశమువలె నిదియు సర్గద్వయాత్మకమే; మందాక్రాంతావృత్తయుతమే. కవి, విరహతాపభర పరీతస్వాంతులగు యక్షదంపతుల నొకచోఁజేర్చి ధన్యులైరి.

ఈ కావ్యము అనంతపురం జిల్లా ఉరవకొండ యందలి మారుతీ గ్రంథమండలి వారిచే ప్రచురింపబడినది.

గీ. ఆర్తబాంధవ-యోపయోదా! యిదేల
ప్రియుని శుభవార్తపలు మాఱు వినియునిట్లు
మాటిమాటికి నడుగు నీ మగువయనుచు
విసుగుగొనఁబోక-కరుణింపవేడుదాన! ౧.

గీ. ఏటికన, లోకమునఁదమునెడసి చనిన
ప్రియులకై, యజస్రము కుందు విరహిణులకుఁ
దత్ప్రియవార్త-మఱిమఱి తవిలి వినుట
కంటె,వేఱొంటనూరట—కలుగఁగలదె! ౨.

గీ. దూరగతుఁడగు నాదయితుండు సతము
మందభాగ్యనొ, నాకయి మమతగూరి
క్లాంతచిత్తుఁడైకడుదీన గతిఘటింప
నడలుచెబ్బంగి దినములఁగడపువాఁడొ? ౩

గీ. జలధరా! నాయొనర్చు విజ్ఞాపనంబు
నాధునకుఁదెల్పి నీ సుజనత్వగరిమ
చాటుమని మాటిమాటికంజలి ఘటించి
దీననై, మనసారఁ బ్రార్థించుదాన.
....
....

గీ. విరహతాపోష్ణ,ముపశాంతిఁబొందయుకొఱకు
నరవిరుల సెజ్జ, లేఁత తామరలసెజ్జఁ
జలువ రాసెజ్జఁగాయంబు జాఱవిడితిఁ
జందనాదిక సకల చర్చలనుగొనితి;

గీ. అయిన హృదయ మొక్కటను జల్లారదయ్యె;
నరసిచూడ,నీవిరహ సూర్యాతపంబు
వసుధ యందలి శీతలత్వంబునెల్ల
నొక్కసారియె హరియించి యుండఁబోలు

శ్రీవరసిద్ధి వినాయకస్తవము

ఉ. పొట్టిగ నున్నసేమి?కడుపుల్గనుఁడుబ్బిన దెల్లవిద్యలున్
గుట్టుగ,సందెడాఁగె,నవిగో!వినలేదొకొ?'పొట్టివానికిన్
పుట్టెడుబుద్ధు' లన్ననుడి మున్నను కొంచును భక్తిబాలురే
దిట్టనివిద్యకై,కడునుతింతురె?యాతడు, మమ్ముఁబ్రోచుతన్

ఉ. తెల్లనిగట్టుకాపురము,తెల్లనిగిత్తసికంబు,తానునున్
దెల్లనిసామి,యొదలకుఁ దెల్లనిగంగ,రుమాలు, సొమ్ములున్
దెల్లని పాఁపపేరులును-దెల్లని క్రొన్నెల; యట్టిశూలికిన్
నల్లని-కాళి,యాలనుచు, నవ్వ వినాయకుఁడేలు మమ్ములన్

ఉ. పొంగెడు భక్తితోఁదనువుల్ పులకింప, ముదశ్రులూర,సా
ష్టాంగ నమస్కృతుల్ వెలయఁబ్రార్థనసల్పెడు,మామనంబు,లు
ప్పొంగఁగ,సర్వమంగళకుఁ బుత్రుఁడవౌటది, సార్థకంబుగా
మంగళమూర్తిమా కెపుడు,మంగళముల్,సమకూర్చుచుండుమా.

కవిగారి కృతిని శ్రీయుతులు అప్పకాయ సూర్యనారాయణ శాస్త్రులగారి ప్రోత్సాహమున తెనిగించిరి. కవిగారెటింగి నంతవఱకు దాదాపువారు అర్ధశతమానమునుండి ప్రతిసంవత్సరము శ్రీ విఘ్నేశ్వర పూజామహోత్సవమును బరమభక్తిపురస్సరముగను,మిగుల విజృంభణముగను జరుపుచుండిరి. ఆసందర్భములందు శ్రీగణాధిపునిమీద శ్లోకములనో,పద్యములనో రచింపఁజేసి, యచ్చువేయించి వాటిని భక్తులకు బంచిపెట్టుచుండిరి. ఆ అవకాశము శ్రీ సంజీవమూర్తిగారికి ప్రతియేడు లభించినది. ఆ కృషియే యిట్లు శతకరూపమున వెలసినది. దీనిని ప్రోత్సహించిన శ్రీ శాస్త్రుల వారే ముద్రించిరి.కవిగారి మిత్రులైన శ్రీరావాడ వేంకటరామ శాస్త్రిగారీ పొత్తముపై చక్కని యభిప్రాయమును వ్రాసిరి.

కరి "నభవుండు" ద్రుంప,' హరి' కాచుట తెల్పిభవాని నవ్వుచున్
"గరివదనుండు"వీవిట నిఁకన్ వసియింపకు; శౌరి పజ్జకున్
దరలు" మటన్నఁ"బుట్టని యతండు విధించునెః?సింగమోమునే
కరి"నని మాఱుపల్కు నగు గౌరితనూభవుఁడేలు మమ్ములన్.

ఈ పద్యములో గౌరి గణేశుని గాంచి లోకసామాన్య రీతిగ "నాయనా, నీవిట్టివాడు, నీ తండ్రియట్టివాడు, మీమామయొద్ద కుఁబొమ్ము'అనుట యందటి తల్లులు తమబిడ్డలతో ముచ్చటగ ననుకొనుచుండు సామాన్యోక్తి. దీనిని కవి యెంతముచ్చటగఁజిత్రించి నాడో ఆయావ్యక్తుల పూర్వగాథల నాకళించుకొన్నఁ,దెల్లమగును.

(శ్రీరావాడ)

వీరి రచనలెన్నియో అముద్రితములున్నవి. వానిలో నవ్య గాథాలహరి ఒక్కటి. అదిగాథాసప్తశతికి సరితూఁగురచనయనిపించు చున్నదని శ్రీ భాస్కరాచార్య రామచంద్రస్వామిగారు తమ అమూల్యాభిప్రాయమును వెల్లడించిరి. అది ముద్రింపబడుట మన యదృష్టము. వీరికి బళ్ళారియందలి ప్రసిద్ధ కవిరత్నములతో చెలిమి కలదు. ఆంధ్రకన్నడ భాషామ తల్లుల అనుంగు బిడ్డగావీరు వెలుగొందుట మన సీమకొక భాగ్యవిశేషము.



శతావధాని గాడేపల్లి వీర రాఘవ శాస్త్రి

జననము:— 30–4–1891

మరణము:— 5–3–1945

జన్మస్థలము:— కర్నూలు జిల్లా— మార్కాపురం తా॥ ఎఱ్ఱగొండ పాలెము.

తల్లి : శ్రీమతి సుబ్బమ్మ
తండ్రి : శ్రీ శివరామ దీక్షితులు.
మతము-కులము:— తెలగాణ్య వైదీకశాఖకు చెందిన బ్రాహ్మణులు

విద్యాభ్యాసము.

వీరు ౧౧వయేట బ్రహ్మోపదేశమైన తర్వాత తండ్రిగారి యొద్దనే స్మార్తభాగములో, షోడశకర్మలును, యజుర్వేదములో సంహిత, అరుణపంచకము, ఉపనిషత్పంచకము, అవసరమైన, శ్రౌతభాగము వల్లించిరి.

సాహిత్య పఠనము.

౧౯వయేట బ్రహ్మ శ్రీ మేడవరము సుబ్రహ్మణ్య శాస్త్రుల వారియొద్ద కావ్యపాఠ మారంభించిరి. నాటకాలంకార సాహిత్య గ్రంథములు పూర్తి చేసిరి. 3 సంవత్సరములు గురుకుల వాసమొనర్చిరి. కవిత్వము స్వయముద్భూతమైనది. కావ్యపఠనము తోనే అవధానశక్తి ఆవిర్భవించెను.

కుటుంబచరిత్ర:—

వీరితండ్రిగారు శివరామదీక్షితులు. అవిచ్ఛిన్నముగా, అగ్నిహోత్రము లుంచుకొన్న అతిదీక్షాపరతంత్రుఁడైన కర్మఠుఁడు. వీరు సాక్షాత్తు వేదపర్వతమని, ఋషియని, బాగుగా జదువుకొన్న వారని, మంచి సదాచార సంపత్తిగలవారని, నిత్య తృప్తులని, నిరతాన్న ప్రదాతలని. నిత్యాగ్నిహోత్రులని, అందఱ కును, ఎంతో గౌరవము.

వీరి తల్లిగారు శ్రీమతి సుబ్బమ్మగారు. పతిభక్తి కలది. సంసారములో సర్దుబాటు, సహన భావము, వచ్చిపోవువారి యెడఁ జూపు ఆదరాతిశయము, విశేషముగా గల్గిన దీమె.

శ్రీ శివరామ దీక్షితులు డెబ్బది యేండ్ల పూర్ణాయుర్దాయ ముతో, పరమ పదించిరి. తల్లి సుబ్బమ్మగారు చనిపోవునప్పటికి శ్రీ వీరరాఘవశాస్త్రిగారికి 43 సంవత్సరములు.

వీరి కిద్దరు జ్యేష్ఠ సోదరులుండిరి. 1) పెదకోటావధానులు 2) చినకోటావ ధానులు. వీరిద్దఱు తండ్రి మరణానంతర మచిర కాలములోనే గతించిరి.

వి వా హ ము :-

శ్రీ వీరరాఘవశాస్త్రిగారికి ద్వికళత్ర యోగము పట్టినది. మొదటి భార్య రెండేండ్లు కాపురమొనర్చి గతించెను. ద్వితీయ కళత్రమునకు ఒక కొమార్తెయు, నొక కొమారుడు నున్నారు. (పోయినవారు పోగా)

సా హి త్య సే వ :-

వీరు గొప్ప కవీశ్వరులు. అనేక సామాన్యమైన అగణిత ప్రతిభగల ఆధునిక కవులలో, అగ్రగణ్యులు. అసాధారణమైన ప్రతిభ, అనుపమానమైన ధోరణి, ఉదాత్తమైనధార, ఉచ్ఛృంఖల మైన ఊహ, ఉత్తేజనకరమైనవాక్కు, ఇవి వీరికి భగవత్ప్రసాదితములైన, లోకోత్తర గుణములు, ఇన్నిటిని మించినది, ఆ కారదైర్ఘ్యము. ఆకారదైర్ఘ్యము. నధఃకరించినది, దీర్ఘసమాస సంఘటనము. పిఱికి కంపలేని గుండె; వీర ధైర్యము; రాతిబొమ్మ లకు చక్కిలిగింతలు పెట్టుచమత్కార సంభాషణము, సమయస్ఫూర్తి ఏకసంధాగ్రహణశక్తి - ఇవివీరికి సహజగుణములు.చదివిన దల్పము సాధించిన, దధికము, 'ప్రపేదిరే ప్రాక్తన జన్మవిద్యాః'

ము ద్రి త గ్రం థ ము లు.

1) చమత్కార కవిత్వము 2) త్రిపురాంతక స్థల మాహాత్మ్యము (3-ఆ) 3) శ్రీ సత్యవరలక్ష్మి ధ్రువచరిత్ర (ప్ర: 1941) 4) అహోబల మాహాత్మ్యము (5—ఆ) 5) మార్కండేయ చరిత్రము (హరికథ)

శ త క ము లు.

1) రామభూపతి శతకము 2) దీన కల్పద్రుమ శతకము
3) విశ్వేశ్వర శతకము 4) సోమేశ్వర శతకము
5) చెన్నకేశవ శతకము

ఇ త ర ర చ న లు:-

1) ఆర్యవిద్యా ప్రబోధిని 2) ద్విపద భగవద్గీత
3) ముకుందమాల (ఆంధ్రీకరణము) 4) పింగళ హరికథ

అ ము ద్రి త ము లు :—

1) సాంబలక్షణ (3 ఆ-శృంగార కావ్యము) 2) హైమవతీ పరిణయము 3) భూగంగాస్తుతి 4) మార్కండేయనాటకము 5) సీతాకల్యాణము (ద్విపద) 6) సీతారామ కల్పద్రుమ శతకము 7) వెంకటేశ్వర శతకము 8) కుమార సుబ్రహ్మణ్య చరిత్ర 9) మెదకు సంస్థానాధీశుల చరిత్ర (వచనము)
10) హరివంశము (వచనము- అసంపూర్ణము)
11) ఐరావత వ్రతకథ (వచనము)

ఈ గ్రంథములేగాక, యింకను వ్రాసిన వెన్నియో యున్నట్లు శ్రీ శాస్త్రిగారే వ్రాసిన ఈ క్రింది పద్యమువలనఁ దెలియనగుసు.

సీ. మసిపాతకన్నను - పసిదప్పి ముదరిణ
కుద్రేక ముడిగిన వ్రాక్కుకొన్ని
జీర్ణపత్రములలో జీర్ణించి, క్రిములచే
దష్టంబులైన, పొత్తములుకొన్ని,
ఆయువు లందంద-హ్రాస్వమయ్యును, జిక్కి
యున్నవి వేనవే లొక్కకొన్ని,

పత్రి కాంగనలలోఁ బ్రచురణ కనియేగి
చెరి సగ మౌచు, నిల్చినవికొన్ని,
గీ. హరిహరీ! వీరరాఘవ - వరకవీంద్రు
సరస రచనా నితంబినుల్ - సభలఁ బ్రభుల
నయన హస్తావలగ్నలై - నాట్యమాడు
సమయ మేనాటికో యనుజా! యెఱుంగ.

అని, 1940లో తమస్నేహితులకు ఈ పై పద్యములు వ్రాసియున్నారు.

కావ్యపరిచయము

చమత్కార కవిత్వము

ఈ కావ్యమును శ్రీవిద్వాన్ కావ్యతీర్థ మద్దులపల్లి వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారు, గద్వాల యువకవి విజ్ఞాన సమితి ద్వారా ప్రచురించిరి.

—చమత్కార కవిత్వములోని కొన్ని పద్యములు—
(చాటువులు)

ఉ: తుమ్మలపల్లి కామయ సుతుండు, వితంతులఁ గేశయుక్తులన్
రమ్మని కౌగిలించి, యధరంబును జుంబన మాచరించి,దో
సమ్మని యెంచకే రతుల సంతస మందుచు నుండు, నిట్టికా
ర్యమ్ములు వీరిపూర్వు లెవరైన నెఱింగిరె? యెంచి చూడఁగన్

ఉ. గుప్పున మంచి వాసనలు గుప్పెడి పాటిపొగాకు నిప్పునన్
జొప్పడఁగాచి, గోఘృతము సున్నము గూర్చి,పురాణవేళలన్
దప్పక నశ్యమిచ్చు నిరతంబు బుధాళికి; గాడెపల్లికో
టప్పకుఁగల్గు భూజ కలశార్ణవ కర్ణులు సాటివత్తురే?

దైవము దిన్నె (కర్నూల్ జిల్లా) రామారెడ్డిగారి స్థానములో రాఘవ శాస్త్రి గారి కొక గొప్ప గౌరవ స్థానముగలదు. అడిగిన దాని కనుకూలమైన సమాధానము పద్యములలోనే చెప్పుదురు గనుక, రాఘవశాస్త్రి గారితో, వినోదకాలక్షేపములు జరుగు చుండును. అక్షయసంవత్సర, వసంత నవరాత్రోత్సవములకు రెడ్డి గారింటికి, మదరాసునుండి బంధువులు వచ్చియుండి, రాఘవశాస్త్రి గారితో పెద్దన తన కవిత్వమును గుఱించి మాలిక చెప్పి కొని యుండెఁగదా! మీకవిత్వమును గుఱించి మీరేమైన మాలిక చెప్పఁ గలరా? యనివినోదముగ నడిగిరఁట, అపుడు అత్యాశువు వ్రాసికొనుఁడని.

చం. సరిదసమాన వేగమునఁజక్కని చిక్కని ధారతోడ,నీ
సరసులు వహ్వారే! యన, రసప్రసరప్రచుర ప్రవాహముల్
దరులకుఁ బొంగిపొర్ల,మిగులన్ గురియింపవె,పద్య వృష్టినో
పరమదయాప యోనిధి! సభాజన వశ్యకరీ! మహేశ్వరీ!

అని ప్రార్థించి,84చరణములుగల ఉత్పలమాలికను ఆశువుగాచెప్పిరి.

ఉత్పలమాలిక
(84 చరణములలో 16 మాత్రము)

శ్రీ రమణీయులార ! సరసీరుహ నిర్య దమంద మాధురీ
సార వచస్కులార ! విలసత్కమనీయ యశో విలాసినీ
హారి విహారులార ! పర మాదుర మేదుర చిత్తులార! ఓ
సూరి వరేణ్యులార ! పరిశుద్ధ వచోరచనాచమత్క్రియా

సార రసానుభావ, గుణసార సమంచిత వృత్తరీతి,వి
స్తార మదీయ దివ్య కవితావనితాభి రతిప్రసక్తి సం
స్కారము లిందుఁ జూపుటకుఁగా నిదె కోరితి;రేను బూనితిన్;
ధోరణి విన్నచోఁ—గనక తోయజ కాండ వినిస్సర ద్రసా

సారమయ ప్రవాహరుచి సారెకు సారెకుఁదోఁచు-; నల్లికల్
గూరుచుచో-వసంత నవ కోమల పల్లవ వేల్ల దుల్లతా
గార నిరంతరాయ పరికల్పన నుల్లస మాడు-; వ్యంగ్యపు
స్ఫురుపుఁజూప నెంచ-రమణీయ మహోజ్జ్వల యౌవన ప్రభా

చారు విలాస సంభరణ సారసపాణి విలాస వాక్చమ
త్కార విశేష వైఖరులు కన్నులఁ గట్టినయట్ల తోఁచు-;నో
రూరఁగఁ జేయు మత్కవిత నూఁకొను భాగ్యము గల్గినంత-శృం
గార రసానుభావ పరికల్పిత యౌవన ఘూర్ణమాన పం

....

....

అని గకగడ చెప్పి వేసిరఁట. ఇట్టి కవితాధార మనసీమ కవులకే కలదని వీరరాఘవ శాస్త్రిగారు చాటిచెప్పిరి. తెనుగు తల్లికి దివ్యాలంకార భూషితమగు ఉత్పలమాలిక నందించిన ఘనత పెద్దన్న తరువాత వీరికే దక్కినది.



శ్రీ భాస్కరా చార్య రామచంద్ర స్వామి

జననము:- 1905

నిర్యాణము:- 25—6—1965

జన్మస్థలము:- బళ్ళారిపట్టణము.

తండ్రి:- శ్రీ పట్టాభి రామస్వామి గారు.

తల్లి :- నాగలక్ష్మాంబ

మతము;కులము:- హిందూ—బ్రాహ్మణ గౌతమస గోత్రులు.

విద్యాభ్యాసము:-

కవిగారు బళ్ళారిలో, గీర్వాణాంధ్రములనధ్యయనము చేసిన తరువాత, విజయనగర మందలి సంస్కృత కళాశాలలో చేరి, అయిదేండ్లపాటు కావ్య నాటక సాహిత్యములను, అధ్యయనము చేసిరి. స్వయం కృషితో, వారు పెక్కు భాషలతోపరిచయము సంపాదించుకొనిరి. ఇరువదేండ్ల ప్రాయముననే, గీర్వాణాంధ్రములందు పాండిత్యముతో పాటు, జ్యోతిష వైద్యమంత్ర శాస్త్రము లందు నిష్ణాతులైరి. సృష్టిక్రమము, తంత్రశాస్త్రము, వీటిపై ప్రగాఢ పరిశోధన సల్పిరి.

కుటుంబ చరిత్ర:-

వీరి తల్లిదండ్రులకు, ఈ కవిగారొక్కరే కుమారులు బళ్ళారికి చెందిన, భాస్కరాచార్య పరంపరా పీఠమునకు, అధ్యక్షులైన శ్రీ పట్టాభిరామస్వామి గారికి, వీరు దత్తపుత్రులు. కవిగారి భార్యఅంబమ్మ. ఈమె అన్నపూర్ణాదేవి వంటిది. వీరికి ఇద్దరుకుమార్తెలు, ఒక కొడుకు గలరు. కుమారుడుశ్రీ టి. బి. రామమూర్తి. బి.ఏ ఆనర్సు-ఆంగ్లభాషోపన్యాసకులుగా, నెల్లూరు వెంకటగిరి రాజా కళాశాలయందు, పనిచేయుచున్నారు. మొదటి కుమార్తె కమలమ్మ, రెండవ కుమార్తె స్వర్ణమ్మ.

సాహిత్యసేవ:—

వీరు సంస్కృత శాకుంతల నాటకమును, యథాతథముగ ఆంధ్రమున కనువదించి యున్నారు. కాని యిది యింకనూ అముద్రితము. తర్వాత వీరి సర్వాంగ సుందర మగురచన 'యాత్రికుడు' అను ముద్రిత ఖండకావ్యము. యాత్రికుడను పద్యకావ్యము, కన్నడము, ఇంగ్లీషు, మొదలగు భాషలలో అనువదింపబడినది. ఒకానొకరు నీ 'యాత్రికు'డనుపద్యకావ్యముపై ఇంగ్లీషునందు, అరువది పేజీల విమర్శను వ్రాసినారనియు, విమర్శనాగ్రంథము కూడా, ముద్రితమై యున్నదనియు వినికిడి.

అభిజ్ఞాన, శాకుంత లాంధ్రీకరణము భాషాంతరీకరణమగుటచే రస, పాక, శయ్యాలంకారాదులు, వెలుగు నోజస్సు ప్రతిబింబింప జేయుటకు బాధ్రబంధచితములును గలిగి, ఈ జనన మందు, అధికతరాభ్యాసముండవలెనని, శ్రీ వారే ఒకచోట పలికినారు. ఈ క్లిష్టతరకార్యమును కొనసాగించి, యశస్సు సంపాదించినారు మన రామచంద్రస్వామి గారు.

గుణగణములు:-

శ్రీవారు తమ యౌవనమున సిరిసంపదలతోఁగూడి యుండు తమ గృహమును, నయనానందకరంబై, అనిందితమై, నానా సద్విజశ్రేణి కాశ్రయమై, ధర్మసత్రముగజేసి యుండిరనియు, కవి, గాయక, యాచక బృంధముల కనేక విధముల తోడ్పడి, యుండిరనియు వారి మిత్రులు, ఆశ్రితులు వీరి నిప్పటికినీ బొగడు చుందురు. వీరి వార్ధక్యమున పూర్వపు టౌన్నత్యముగాని, సంపత్తు గాని యుండలేదు. కాని వారు నిరుత్సాహపడలేదు. మిత్రులయెడ, నీతనికి గల మమత, యపారము. సరస సత్కవి కావ్యసరణి వినోదించు వారీతని నాశ్రయించి యుండిరి.

ఇతడు ఖండితవాది. రసికుడు. సుజన ప్రాణుడు. కవితా నిధానుడు. ఇతనిచే రచింపబడ్డ నీ క్రింది పద్యమును పఠించిన, ఈత డెట్టివాడో నిరూపించుకో వచ్చును.

ఉ॥ "లావును తావుగానని, గులాముఁ కొగ్గి, సలాముఁ జేసి,సం
భావన నొందు కాంక్షమతిఁబట్టక, జీవన రీతులొత్తు,ని
త్యావసరాల నేకొలది యైనను దీర్చుకొనంగఁగాక నే
దోవగ గాలమున్ వెడలఁ ద్రోయుచునుంటి విధివ్యథావధిన్"

శ్రీ భాస్కరాచార్య రామచంద్రస్వామి సంస్కృతాంధ్రములలో గొప్ప పండితులు. కన్నడ, మళయాల, తమిళ, హిందీ, బెంగాలీ భాషల పరిచయము కలవారు. విశాల హృదయులు, కులమత, వర్గ, భాషా వైషమ్యములు లేనివారు,

రచించిన కృతులు:-

1) శాకుంతల యాంధ్రీకరణము 2) బాటసారి 3) మాహంపి 4) యాత్రికుడు.

శాకుంతలలో శకుంతల సౌందర్య వర్ణనము.

చం॥ పరిమళ మానసట్టి ప్రసవంబు: నఖమ్ములు సోకనట్టి సుం
దరమగు పల్లవమ్ము; రతనమ్మన విద్ధము, కోర్కిల్పులేని క్రొ
వ్విరిసునుదేనె; పుణ్యపదవీ పరిపూర్ణ ఫలమ్మనై, యఘం
బెరుగని దామెరూపు, విధి, యెవ్వని భోక్తనొనర్చునే మొకో!

యాత్రికుడు

ఇది కవిగారి స్వతంత్రకృతి. అనుభూతికందిన విషయాలను పాడుకొన్న కమ్మని గీతములే యాత్రికుడు. ఇందలి నలుబది గీతములను కన్నడ భాషలోనికి శ్రీ కె. జోశదరాసి దొడ్డనగౌడు గారు అనువదించిరి.

౧

గీ. ఎన్నఁడీ యాత్రకు మొదలో, ఎపుడు తుదియొ?
బ్రతుకు నాల్గు దినమ్ముల-పాంధశాల
రస మిగిరి పోవ, శక్తి నీరసత నొందఁ
బాత్ర మున్నంత నింపుము ప్రాత మధువు.

౨

గీ. విందు వలదు — కపూరంపు — విడెము వలదు
వలదు, కనకాభిషేక సంభావనలును
అంద అనుభవమునకు, నానందమొకఁడె
పంచిపెట్టుము — త్రావుము — ప్రాత మధువు.

౩

గీ. జ్యోతి నెగదోసియు మోయీ ! విశుద్ధ హృదయః
స్నేహ మున్నంతవరకె - నీచేతలెల్ల
ఆరి పోవకమునుపె - నీవరయుమెల్ల
ఆత్మ జ్యోతి రగుల్చు - స్నేహమయుఁడీవు!

౪

ఆ.వె. ఆఁట వెలఁది ముద్దు - తేటగీతాలలో
నాత్మవాణి - నాగృహాంగణమున
గొదమ వయసు మిసమి—కొసర, సుమించిన
కొమ్మనీతఁ బాడు - కొందుఁగాక !

౫

గీ. మధువునను - మోజువరచెడు - మదము కలదు
మదమునకు, సోలుగుణము - తుమ్మెదకు గలదు
మధుపమునను రసగ్రాహ - మహిమ కలదు
సాజ మిది, రసోపాసకాచార్యులకును.

౬

ఆ.వె. బ్రతుకు నీఁటిబుగ - పగిలు పోవక పోదు
పగిలెనేని, నాద్య భావమొందు;
నాద్యభావ మంద - నంత విశ్వమనంత
విశ్వ మంద నంత విభుఁడు పడఁతి.



శారదాపుత్ర. విద్వాన్.

పి. వెంకటరెడ్డి గారు

ప్రొద్దుటూరు.

జననము:— 1-7-1922

జన్మస్థలము:-పర్లపాడు గ్రామము ప్రొద్దుటూరు తా॥ కడప జిల్లా

తల్లి:— రామాంబ (రామక్క)

తండ్రి:— బాలిరెడ్డిగారు.

మతము,కులము:- హిందూ, పల్లెకశిరెడ్డి

విద్యాభ్యాసము వగైరా:-

తెలుగు విద్వాన్ (బి) "శారదాపుత్ర" బిరుదము.

సంగ్రహ కుటుంబ చరిత్ర:

వీరికి గోవిందరెడ్డి, వెంకటరెడ్డి యను యిరువురన్నగారును యిరువురక్కగారును కలరు. వీరి కులవృత్తి వ్యవసాయము. వీరు ప్రాథమిక పాఠశాలలో 12ఏండ్లవయసున ప్రవేశించి. నాలుగైదు తరగతుల వరకు మాత్రమే చదివిరి.

వీరి స్వగ్రామస్థులును, గురుతుల్యులునగు శ్రీ విద్వాన్ జీరెడ్డి చెన్నారెడ్డి (ఎం. ఏ. బి. ఇ. డి.) గారు వీరి కవితాభ్యాస

మునకు మార్గదర్శకులగుటయే కాక కవిగారి నున్నత విద్యాభ్యాసమునకు ప్రోత్సహించి వారి యింటి యందే అన్ని సౌకర్యములను కలిగించిరి. 'విద్వాన్' పరీక్ష చదివించి కవిగారి జీవనోపాధికి బునాదివేసిరి. కవిగారి గురువులు ప్రస్తుతము తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయమున నాంధ్రశాఖలో బని చేయుచున్నారు.

సాహిత్య ప్రవేశము:-

స్వగ్రామస్థులైన కీ. శే. 'కవిరత్న' చెమికెల చెన్నారెడ్డి గారు 'చెన్న రామాయణమును' కీ. శే. 'బాలకవి' దశిరెడ్డి వేంకట సుబ్బారెడ్డి గారు (బనగానపల్లె సంస్థానాస్థాన కవులు) 'బాలరామాయణము'ను రచించుట జేసి కవిగారును రామాయణ కావ్య రచన మొనరింప కుతూహలురై 'శ్రీమాన్ నిర్వచన వేంకట రామాయణ' మను పేర రమారమి మూడువేలపద్యములతో రామాయణమును వ్రాసిరి. అది యింకనూ ముద్రణ భాగ్యమును నోచుకొనలేదు.

కవిగారు ప్రొద్దుటూరునందలి ఓరియంటలు హైస్కూలు నందు తెలుగు పండితులుగా పనిచేయుచున్నారు.

వ్రాసిన కృతులు:—

1) బకాసుర వధ 2) గాంధీస్తుతి గీతములు. 3) వీరభద్రస్వామి పద్యరత్నమాల 4) శ్రీమాన్ నిర్వచనవేంకటరామాయణము (అముద్రితము) 5) పారిజాతాపహరణ నాటకము (ముద్రణము)

పారిజాతాపహరణ నాటక మందలి మధుర ఘట్టములోకొన్ని

నారదుడు:-

చం॥ వినుము! లతాంగి! మాటలిక వేయుననేటికి నెంచిచూడ నీ
పెనిమిటి నీవు నిక్కముగ భీష్మకనందన కాలిగోటికై
నను మఱిసాటిరావని మనంబునఁ దాఁదలపోసియుండు నే
ననుటయకాదు సుమ్మతనియాశయమట్టిద, చేష్టయట్టిదా!

సత్య:

[కోపముతో] నారదా! నేనిఁకవినఁజాలను [అని చెవులుమూసుకొని]
కర్ణ శూలములైన యీ పలుకులు మున్మాటికి వినఁజాలను.

ఉ॥ చెప్పకుమయ్య! కృష్ణు చెఱుచేఁతలు నాకిఁకఁ దచ్చరిత్రమా
విప్పకుమయ్య! పేరలుక పెంపకు, ముంపకు దైన్యవార్ధిలోఁ
దప్పిదమెల్ల నాయదియె తామరనేత్రుఁ నట్లు స్వేచ్ఛగాఁ
ద్రిప్పఁటఁజేసి నాకిటులఁ దిప్పలు కల్గెను సంయమీశ్వరా!

నారదుఁడు: సత్యాదేవీ! యీ విషయము నీకెఱిఁగించి యుపకారము
చేయుటకై వచ్చితిని.

సత్య: స్వామీ! నాకుపకారము చేయుటకై వచ్చినవారు పుష్పము
నాకొసఁగక యీ జనార్దనునకేల మోసికొనిపోయి సమర్పించితిరి

నారదుఁడు:

అమ్మా! నీ భర్త నీయందు బద్ధానురాగుడనియు నీకేయిచ్చు
ననియుఁ దలపోసి పుష్పమాతనికిచ్చితిని. తానొక్కటి దలఁచిన
దైవమొక్కటి తలఁచెనన్నట్లు నీకు మేలుచేయు తలంపుతో రాగాఁ
గీడుగా పరిణమించినది. దానికెవరేమి చేయుదురు? మనంబున
నూరడిల్లుము. శాంతము వహింపుము.

సత్య :—

ఆర్యా! నాకీయవమానాగ్ని యెట్లు చల్లారును? అగ్నిసాక్షిగాఁ బెండ్లాడిన నా భర్తయే నాకిట్లవమానము ఘటిల్లఁజేసినాదన్న సహింపచ్చునా? నన్నవమానించుట తన్నవమానించుకొనుటకదా? పోనిమ్ము! నన్నిట్లు వంచించుటకు నేనా హరికి నేమి యపరాధము చేసియుంటిని? పువ్వొసఁగి రుక్మిణినంత గౌరవించుటకామె చేసిన మేలేమిగలదు? నిర్హేతుకముగా నింత నిర్దాక్షిణ్యమేల కలుగవలయును?

నారదుఁడు :—

సాత్రాజితీదేవీ! యేమి చేయవలయును? రోజులు మారుచున్నవి. వానితోఁబాటు గొప్పవారిబుద్ధులు నైతము మారిపోవుచున్నవి. కలికాలమాసన్నమగుకొలఁది ప్రపంచమే తప్పిపోవును. లేకపోయిన నిన్నమొన్న ప్రేమించిన కృష్ణుఁడు నేడేల నిన్ను తేలికగాఁజూచును?

సత్య:—

ఋషీశ్వరా! అదియట్లుండె. నావెన్నుఁడు నేఁజేసిన యుపకృతులైనను దల పెట్టవలదా?

సీ॥ నరకాసురునిఁ జంపు నాఁడాజిలో నేను
        సలిపిన మేలైనఁ దలపవలదె?
తన యష్ట భార్యలందున మేటిపీవంచుఁ
        బలికిన పలుకైనఁ దలపవలదె?
పత్యాప్రియుండగు శౌరియటంచాడు
        పలుపురి మాటైనఁ దలపవలదె?
మచ్చమంతకమణి మహితమౌ ధనరాసు
        లెలమి నిచ్చుటయైనఁ దలఁపవలదె?

గీ॥ తనకు నే మేలు సేయని దినమొకండు
లేదుగద! యిట్టి నన్ను నెల్లిదమొనర్చి
సాటి స్త్రీలకో నగుఁబాటు చేటుదెచ్చె
నౌర! శ్రీ కృష్ణుఁడిది యోర్వనగునె? తగునె?

నారదుఁడు:—

తల్లీ! కృష్ణునంతవానికే కృతజ్ఞత్వము లేదన్న మనమిఁక నేమి చేయఁగలము? కానిమ్ము వగవకుము. కాలమొకేతీరుగా నెవరికి నుండదుకదా! చంద్రునంతవానికి మబ్బులావరించి మఱల విచ్చిపోవుటలేదా? నీకుమాత్రము చెడ్డరోజులు పోయి మంచి రోజులు రాఁగూడదా?

మే ఘ నా ద వ ధ.

(కవిగారి అముద్రిత రచనయగు శ్రీ మాన్ నిర్వచన వెంకట రామాయణము నుండి కొన్ని పద్యములు)

ఉ॥ ఓరి! విభీషణా! తగునె? యుక్తమయుక్తమటంచు నెంచకీ
దారుణ కృత్యమౌ కుల విదారణముఁ బొసరింపఁబూనితౌ
రౌర! దురాత్మ! యేమనఁగనౌనిను దానవవంశముఁ జెడఁ
గ్రూరుఁడ! నీవుపుట్టితివి; కూల్పఁగ నర్హుఁడవెల్ల భంగులన్

ఉ॥ గౌరవహైన్యమంచనక, గ్రక్కునఁబోయి విరోధిపక్షముం
జేరి సమస్త భూప్రజలు ఛీ!యన మాదగు గుట్టు దంతయున్
వారికిఁ దెల్పుచుం గులము పాడొనరింపఁగ సిద్ధమైతివా?
యోరి! యధర్మచిత్త! తగవౌల్లక నీవిటు సేయఁ బాడియే?

సీ॥ ప్రవిమల క్షీరవారాశి లోపల మహా
భీకర విషముద్భవించినట్లు,
లలిత చందన వృక్ష విలసిత వనములో
భూరి కంటక శాఖి పుట్టినట్లు,
అభినవోజ్జ్వల మనోహర సస్యరాజికిఁ
జీడపురుగు మఱి చేరినట్లు,
కమనీయ పృష్ఠ భాగంబునఁ బెనురాచ
పుండక్కజంబుగఁ బొడమినట్లు,

గీ॥ పావనంబగు దానవ వంశమందు
నీవు చెడఁ బుట్టితివి, పాపి! నీచహృదయ!
నిన్నిదే నిమిషంబులో నిహతుఁ జేసి
కులము నిష్కలుషంబుగ సలుపువాఁడ.



ఆంధ్రవాల్మీకి—కవిసార్వభౌమ

వావిలికొలను సుబ్బరావు
(వాసుదాసు)

జననము:- 23—1—1863
నిర్యాణము:- 1-8—1936
తల్లి: శ్రీమతి కనకాంబ
తండ్రి. శ్రీ రామచంద్రరావు
భార్య:-శ్రీమతి రంగనాయకమ్మ

జన్మస్థలము: కడప జిల్లా—జమ్మలమడుగు
మతము—కులము:— హిందూ-బ్రాహ్మణ-స్మార్తులు
భారధ్వాజస గోత్రము.

వంశ చరిత్ర:—

కనకాంబా శ్రీరామచంద్రుల సంతానమునందు ప్రథములు శేషగిరిరావు గారు. ద్వితీయులు సుబ్బారావు- (మ న క వి గా రు) తృతీయులు రంగారావుగారు.

వావిలి కొలను సుబ్బారావుగారి వంశము పండిత వంశము. వారి ప్రపితామహులు రత్నాజీరావు పంతులు గారు బహుళ గ్రంథ కర్తలు, మహాకవులు, గొప్ప వ్యాఖ్యాతలు. వాల్మీకి రామాయణ మునకు వారు వ్యాఖ్యానమును వ్రాసియుండిరి. సుబ్బారావు గారి పూర్వులు ప్రప్రథమమున,నైజాము రాజ్యమునందలి వావిలికొలను అను గ్రామమున, నున్నకారణముచే వారిగృహనామము వావిలి కొలనైనది.

బాల్యము,విద్యాభ్యాసము:—

చిన్ననాటినుండియు వాసుదాసులవారికి శ్రీరామచంద్రుని యెడ, నపారమైన భక్తి కలదు. సుబ్బారావుగారి పండ్రెండవ యేటనే పితృవియోగము సంభవించెను. అప్పటినుండి వారి పితృ వ్యులగు, లక్ష్మాజీరావు గారు పిన్నవయస్సులోనున్న వారిని దరిజేర్చి, విద్యాబుద్ధులుగఱపి, పెద్దవారి నొనర్చెను.

13వ యేటనే వాసుదాసుల వారికి 'క్షయవ్యాధి' సంభవించెను. ఈ క్షయవ్యాధిని లెక్కపెట్టక శ్రీవారు పాఠశాలలో జదువు సాగించుచు మఱియొక ప్రక్క సంస్కృతాంధ్ర గ్రంథములను దీక్షతో విమర్శనా పూర్వకముగా పఠింపసాగిరి. అనతి కాలములో, ఉభయ భాషలయందును మంచి పాండిత్యము సంపాదించిరి. అంతయు స్వయంకృషిలబ్ధము. పోతనవలెవారు సహజ పండితులు. శ్రీవారు ప్రవేశ పరీక్ష యందుత్తీర్ణులై 1882-83లో F.A పరీక్షకుఁజదువు చుండగా క్షయవ్యాధి ప్రబలి, తీవ్రరూపమును ధరించగా, వారి పిన తండ్రిగారు వారినిఁజదువు మానిపించిరి.

ఈ కాలములో శ్రీవారు, సంస్కృతాంధ్ర గ్రంథపఠనము సాగించుచు, నద్వితీయ పాండిత్యమును సంపాదించిరి. సారస్వత జలధి మథించి, రసామృతసిద్ధిఁ బొందుటచేఁ గావలయుఁ దీవ్రతరమైన వారిక్షయ వ్యాధి కొంత యుపశమించెను.

ఉద్యోగ వివరములు:—

1883వ సంవత్సరము ఆగస్టు 10వ తేది అనగా తమ ఇరువదవ యేట ప్రొద్దుటూరు తాలూకా కచేరీలో నుదరపోషణార్థమై, ఏడు రూపాయల జీతముపై, గుమాస్తా యుద్యోగములో చేరిరి. క్రమ క్రమముగా రివిన్యూ ఇన్స్పెక్టరై పదుకొండు సంవత్సరములు (1896 సం॥ వరకు) పనిచేసిరి.

వివాహము :—

నెల్లూరు పురవాస్తవ్యులైన కంచనపల్లి వేంకట సుబ్బారావు గారి కుమార్తెయైన చి॥సౌ॥ రంగనాయకమ్మను పెండ్లాడిరి. ఈమె.

కొంకకాలు, కుంటియైనను, పినతండ్రిగారి మాటయందు గౌరవభావము కలవారు గాన వారి ఇష్టమే తనఇష్టమని జెప్పుచు నామెను చేబట్టిన పితృవాక్య పరిపాలకులు, 1910లో భార్యను కోలుపోయిరి. వీరికి సంతతిలేదు. కావ్యకన్యలే సంతానము.

శ్రీవారి భక్తి ప్రపత్తులు.

శ్రీవారు సంసారములో మునిగియున్నను. జలనిమగ్నమైన తామరాకు చందంబున వారి దివ్య చిత్తము సాంసారిక సుఖదుఃఖములనంటలేదు. నిరంతరము శ్రీరామచంద్ర పాదారవింద సంసేవాసక్తులైయుండిరి. వారే యుద్యోగములోనున్నను, రామతారక మంత్రజపము, రామకోటి వ్రాయుట, ధర్మమత నీతి బోధకములగు కృతులు రచించుట, రాముని కంకితమొసంగుట, రామసేవజేయుట వారి నిత్యకృత్యములు. మహాకవియగు పోతన తాను రచించిన శ్రీమదాంధ్రభాగవతమును, కడప మండలము నందలి, 'ఒంటిమెట్ట' యను గ్రామమున వేంచేసియున్న, యే కోదండ రాముల కంకితమొసర్చెనో, యా కోదండ రాములే, సుబ్బారావు గారికి స్వప్నమునందు గనంబడి, "యొకకేలనాంధ్ర భాగవతము నందు కొంటిని, వేఱొకకేల నాంధ్రరామాయణముకూడ నందు కొందును. నీవదాని రచింపు" మని యాదేశించెను. ఆ దైవప్రేరణ వలన ఆది కావ్యమైన వాల్మీకి రామాయణమును, యథామూలముగా నాంధ్రీకరించిరి. ఒంటిమెట్ట యందలి 'రామతీర్థ'మను నొక కొలంకును బాగుచేయించిరి. కోదండరాముల దేవాలయమును, జీర్ణోద్ధారమొనరించిరి.

1907వ సంవత్సరములో, ఒంటిమెట్టలో, పెద్దయుత్సవము సల్పి, తమ రామాయణ గ్రంథమును, పెక్కుమంది విద్వత్కవుల సమక్షమున, కోదండరాముల కంకితమొసంగిరి. ఆ సభలో వారికి 'ఆంధ్ర వాల్మీకి' యనుబిరుదు నొసంగి, గౌరవించిరి.

కవిగారి గుణగణములు:—

వావిలికొలను సుబ్బారావుగారు నిరాడంబరులు. త్యాగశీలత దైవమానవ సేవాపరత్వము, శిష్యజనవత్సలత, యౌదార్యము, కార్యదీక్ష కలవారు. యువరాజుగారు, మన భారతదేశమునకు వచ్చినప్పుడు వివిధ భాషలలో ప్రఖ్యాత కవి పండితులకు బిరుదము లిచ్చు సందర్భమునఁ బ్రభుత్వము వారు, సుబ్బారావుగారికి కూడనొక బిరుదము నిప్పించి, గౌరవించుటకు సంకల్పించిరి. తమకు బిరుద వ్యామోహము లేదనియు, తమ కెట్టి బిరుదమును వలదనియు వారు ప్రభుత్వమునకు వ్రాసిరట.

కవిగారి లక్ష్యము:—

తమ సర్వస్వమును, శ్రీరామ కైంకర్యమునకు వెచ్చించి, చక్కగా సద్వినియోగము చేయుటకే, ద్రవ్యార్జనమును జేయవలెనన్న సూక్తి ననుసరించి విశేషధన మార్జించి, రామసేవకు వినియోగించి, నిరతాన్నదాతలై, మహాత్యాగులై, నిరాడంబరులై, యపార దైవమానవ సేవల నొనరించి,చరితార్థులైన సుబ్బారావుగా రాంధ్ర లోకమునకు చిరస్మరణీయులు. వీరు శ్రీరామనామ ప్రభావమును గూర్చి ప్రజలకు తమ శ్రీకృష్ణలీలామృతమునందిట్లు ప్రబోధించిరి.

సీ. పుచ్చిన పోఁకైన వెచ్చింపఁబనిలేదు
వాకిలిదాఁటెడి పనియులేదు
కదలక కూర్చుండు కష్టంబునుఁ లేదు
శ్వాసంబుబిగఁబట్టు చావులేదు
బుడికోళ్ల వలెనీట మునుఁగు కార్యములేదు
నోరెండవల్లించు తీరులేదు
పొగదాఁకి కన్నులు పోయెడి పనిలేదు
కడుపుగాల్చి శ్రమంబు పడగలేదు

గీ. పరుల సాహాయ్యంబుఁ గోరుచు వారివెన్కఁ
బరువు పాఱఁగఁ బనిలేదు భ్రాతలార!
నాల్క మీసొత్తు రెండువక్షములుపల్క
ముక్తికన్యక మీసొత్తు పుణ్యులార!

వీరు రచించిన గ్రంథములు

1) శ్రీకృష్ణలీలామృతము 2) ద్విపద భగవద్గీత 3) ఆర్యకథానిధులు 4) ఆర్యచరిత్రరత్నావళి 5) హితచర్యమాలిక 6) సులభ వ్యాకరణములు 7) శ్రీరామావతారతత్త్వములు 8) శ్రీకృష్ణావతారతత్త్వములు 9) సుభద్రా విజయనాటకము 10) టెంకాయచిప్ప శతకము 11) ఆంధ్రవాల్మీకి రామాయణము 12) 'రమాకుమార' చరితము:— ఈ చరితమునే 'శ్రీకుమారాభ్యుదయ కావ్యముగా సంతరించి 'శ్రీ' మొదలు 'రా' వఱకు దేనితో మొదలిడినను కథావస్తువు గోచరించునని చెప్పిరి. 13) కౌసల్యాపరిణయము 14) 'భక్తసంజీవని' మాస పత్రిక.
15) మంథరము (రామాయణ పరిశోధన) 16) ఉపదేశ త్రయము

శ్రీ కౌసల్యా పరిణయము:

పై కావ్యమును వావిలికొలనుసుబ్బరావుగారు 1894 వ సంవత్సరము, మార్చి నెల 16వ తేది ప్రారంభించి, 1894 వ సంవత్సరము, నవంబరు నెలకు సాంతము గావించిరి. అప్పుడు వారు, కడప జిల్లా—రాజంపేట తాలూకా, టంగుటూరు గ్రామము నందు, రివిన్యూ ఇన్స్పెక్టరుగా నుండిరి. కృష్ణామండలస్థులు, ఉంద్రాజవరములోనగు తాలూకాల జమీందారులైన శ్రీ రాజా వెల్లంకి వేంకటరామారావు బహద్దురు వారు 1902వ సంవత్సరములో ఈ కావ్యమును, ముద్రించిరి.

కౌసల్యా పరిణయములోని కౌసల్యా, దశరథుల వివాహవేడుక

చం. తమకము మీఱ, వారలకుఁ దైధిమి, తోంధిమి, తోంధితోం
ధితోం
ధిమికిటధిమ్మి, తక్కతయి ధిం,తయిధిం,తయిధిమ్మటంచు, సం
భ్రమమునఁ దాలమానముల-మానితచంపక తైలమంటిరా
కమలవిలోచనామణులు—క్రమపుఁగంకణరావమొప్పఁగన్.

చం. పసిమి, పసిండిదువ్వలువ, భారతిగట్టునెడన్ బులోమజా
కిసలయపాణి, దివ్యమణికీర్తిత భూషలలంకరింపగా
నసమున, మేనకాదులు తదంఘ్రిల సొమ్ములుగూర్చ,భాసిలెన్
ససిని, గడాని మేనిదొరసానికి, సాటియనంగఁగాంతయున్.

చం. కడప, పిషాణబియ్యమునఁ గమ్మని యన్నము,పప్పు,దప్పళా
ల్వడియములప్పడంబులును, బజ్జులు,లడ్డు. జిలేబియాజ్యమున్
వడలును,నావపచ్చడులు, స్వాదుఫలంబులు లోనుగాఁగ మిన్
దొడుకు ఘటింప, నొక్క త్రుటిఁ దోఁచముగా, భుజియించి
రయ్యెడన్.

శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణము (సుందరకాండ)

హనుమంతుఁడు సీతాదేవికిఁ దన దేహము పెంచిచూపుట.

చం. ఎఱుఁగదుగాక యించుకయు నెంతటివాఁడనొ కానఁబల్కెన
న్నుఱక,మదీయరూపమిపు,డొప్పుగఁజూపిన,నమ్మఁగాక,ఈ
తెఱవ, యటంచునెంచి, తనదివ్యమహాకృతిఁజూప. నేలపై
కుఱికి, ద్రుమంబునుండి, రభసోద్ధతిఁ బెంపదొడంగెఁ
గాయమున్.

సీ. దీప్తానల ప్రభఁ దేజరిల్లుచు మేరు
మందర సంకాశ—మహిత రూప
మునఁ బ్రమవక్త్రిఁడై -ఘనవజ్రి సన్నిభ
దంష్ట్రా నఖంబులు—దద్దవెలుగ
జానకి ముంగలగా—నిలుచుండి, యి
ట్లనియె, నాసతితోడ—నాంజనేయుఁ
డోదేవి! సగిరివనోద్దేశముగ సాట్ట
వప్రతోరణముగ—వైరినాథు

ఆ. వె. తోడ లంకఁగొనుచుఁ దోరంపు జవమునఁ
బోవుశక్తి గలదు—భూమితనయ
పిన్నవాఁడనను, నభిప్రాయమును బాసి
రమ్ము జాలమేల? రాముకడకు.

శ్రీ కుమారాభ్యుదయము

ఈ గ్రంథమందలి శబ్దార్థాలంకారంబులును, తత్తత్కాలోచిత శైలియు, భావిసూచకంబులగు పలుకులును, హృద్యంబులై, యనన్య సాధారణంబులయి, నెగడుచున్నవి. వేయేల? గ్రంథముచూడం జూడం రుచ్యమయి యెన్నిమాఱులు చదివినంగానివిసుగుఁ బుట్టింప నిదియయి యున్నది.

దీనికి సాటియగు గ్రంథము చిక్కుటయరుదు నిఘంటువు లెన్నే నీకవిగారికి ముఖస్థములగునని యీ గ్రంథము తెలుపుచున్నది చతుర్విధకవితల కిరవయి వివిధాలంకారంబులం బొదలుచు నింపు నింపుశైలివ్రాయబడియుండు నీగ్రంథము సుజన సమాదరణీయం బగుననుటకు సందియమున్నే? దీనిందుదముట్టఁజదివియర్థము

గ్రహించినవారికి యాంధ్రంబున నూతనశబ్దము గల్పెట్టెనని నొక్కి-వక్కాణింపఁదగును. కావుననీకవి 'నాంధ్రభోజుఁడని' సంభావింపఁదగును. గ్రంథగౌరవముంబట్టి యెంతవ్రాసినను దనివివాలదు.


ఇట్లు,

26—3—1917. ఆంధ్రపత్రికా, పత్రికాధిపతి.

రంభవర్ణనము:—

సీ. కుంభికుంభ స్మయాలంభ, సత్కుచకుంభ
 పీత తనూజిత శాతకుంభ
సారంగ కరరుచిరోరు రంభాస్తంభ
 నిశ్చలయౌవనాన్విత విజృంభ
కుంభినీ ధరవరోజ్జృంభకటీబింబ
 శుంభద్విలాస సంస్తంభకుంభ
యాయజూకముదావహాగళితారంభ
 మల్లికా కోరక—మంజు జంభ

గీ. బంభర విసీలకేశ కుసుంభవర్ణ
శుంభ దంశుక కనవక్షోభమునను
జంభ దనుజారిఁ గొల్వ నదంభరక్తి
రంభ చనుదెంచె నధిక సంరంభమునను.



నాటకకర్త-సాహితీశిల్పి శ్రీ రూపనగుడి నారాయణరావు

జననము:- 1—7—1885
నిర్యాణము:- 30—8—1963
స్వస్థలము:-బళ్ళారి పట్టణము.

తండ్రి:—శ్రీ నరసింగరావుగారు. వీరు కడపజిల్లా, ప్రొద్దుటూరులో శిరస్తాదారు, మేజిస్ట్రేటుగా పనిచేసిరి.

తల్లి:— సీతమ్మ.

మతము,కులము:— హిందూ-బ్రాహ్మణ

గోత్రము,నాడు:— హరితసగోత్రము—ములికినాడు,

విద్యాభ్యాసము:

వీరు తండ్రిగారు రిటైరైన తర్వాత, బళ్లారిలో నివాస మేర్పఱచుకొని కాపురమున్నందున కవిగారి విద్యార్థి దశయంతయు బళ్లారివార్డ్లా హైస్కూలులో జరిగినది.వీరు ఉత్తమశిక్షా క్రమమును బడసిరి. క్రికెటు, చదరంగములలో వీరికభిలాషమెంతు. శ్రీరావు గారు F. A.చదువునప్పుడు వీరి తండ్రి మరణించిరి. కాలేజివిడిచి, ఇంటిలోనే చదివి 1928లో F.A.పరీక్ష ప్యాసైరి. ఆంధ్ర, ఆంగ్లే యాది గ్రంథముల నత్యధిక శ్రద్ధతో జదువుచు, నాయావాఙ్మయ ము లందలి విషయ విశేషముల నార్జించిరి.

కుటుంబ విశేషములు—ఉద్యోగము.

శ్రీ నారాయణరావుగారి కిరువురు సోదరులు, నొక సోదరియు

నుండిరి. వీరికుటుంబమున పండ్రెండు మంది యుండిరి. కొద్ది కాలము తాలూకాఫీసులో, గుమాస్తాగా పనిచేసిరి. త్వరలో దానిని వదలి, రాజమహేంద్రివరము ట్రయినింగు కళాశాలలో, సుశిక్షితులై, మరుసటి సంవత్సరమే, అనంతపురము గవర్నమెంటు ట్రయినింగు స్కూలులో, యుపాధ్యాయులైరి. తరువాత బళ్లారి, కర్నూలు, రాయచోటి (కడప జిల్లా) చిత్తూరు మున్నగు పట్టణములందు, ట్రయినింగు పాఠశాలలయందు తెలుగు పండితులుగా పనిచేసిరి. మద్రాసు సైదాపేట టీచర్సు కాలేజీలోకూడా పనిచేసిరి. మొత్తము 40 సంవత్సరములు పాధ్యాయ వృత్తినొనరించి 1940వ సంవత్సరములో బళ్లారిలో రిటైరయిరి.

గుణగణములు—చేసినయాత్రలు

శమదమాదిగుణసంపన్నులు. సాహిత్యాభిమానులు. ఆధ్యాత్మిక ప్రియులు. శాంతి సౌమనస్యములు గలవారు. మంచి ఆరోగ్య విధులు పాటించువారు. పరోపకార పరాయణులు,

హరిద్వారము. ఋషీకేశము, కురుక్షేత్రము, మధుర-గోకుల బృందావనము మున్నగు పుణ్య స్థలముల దర్శించిరి. ఢిల్లీ, కాశీ, ప్రయాగ, బుద్ధగయమున్నగు క్షేత్రములను సేవించిరి. 1947లో పుదుచ్చేరికివెళ్లి, శ్రీ అరవిందుల దర్శనము చేసికొని, శ్రీ మాతగారి యాశీస్సుల బడసిరి. 1948 మార్చి నెలలో రామేశ్వరాది దక్షిణ దేశయాత్రలుగూడా గావించిరి.

రచనలు—అందలి తీరుతెన్నులు:—

శ్రీ నారాయణరావుగారు పెక్కుగ్రంథాలు రచించినారు. కొన్ని ముద్రితములు. ఎక్కువభాగము అముద్రితములు. విస్వ

త్కవి వరేణ్యులు శ్రీ నారాయణరావుగారు పెక్కురచనలు రచించియు వానిలో కొన్నింటినైన ప్రకాశపఱచుకొన జాలినవారుకారు.

శ్రీ నారాయణరావుగారు రాయలసీమయందు వన్నెగన్న విద్వన్మణులలో నొక్కరు. ఆ బాలవృద్ధులకుఁ బ్రయోజనకరము లగు కావ్య, నాటక, విమర్శనాదులు వీరు రచించినవి పెక్కులు. వానిలో బాలావబోధకములైన గ్రంథములు రమారమి పది. అనువాద సాహిత్యమున ఈ పండితవర్యుని చేయియందె వేసినది. నారాయణరావుగారి వచన కృతులలోఁ బెక్కులనువాదములు, శ్రీవారాంగ్ల భాషనుండి యథామాతృకగ విషయము నాంధ్రీకరించుటయందు సిద్ధహస్తులు. వీరు పాండుచ్చేరి అరవిందాశ్రమమునఁ బ్రచురింపబడినఁ కాళిదాసు, భారతీయమేధ, 'యోగభూమికలు' 'జాతీయ విద్యా విధానము' 'జీవిత సమస్యలు' మొదలగుచిన్న యాంగ్ల గ్రంథములను పండ్రెండింటిని దెనిగించినారు భాషాంతర రచనలవలన నారాయణరావుగారి యందంతర్నిహితమై యున్న కళోపాసనాశీలము, కావ్యపరనాసక్తి, పారమార్థికబుద్ధి, లోక సేవాపరత యతిశయించినవి తత్ఫలితముగాఁ దదుపరి భగవద్గీత 'Life Divine' మున్నగువాని సధ్యయనముచేసి 'ఆధ్యాత్మికోపాసన'లను గ్రంథములను వచనరూపమున రచింపఁగల్గిరి. వివిధ కవులకావ్యములఁగూర్చి కడుఁజక్కఁగ బరామర్శించు ఉద్గ్రంథము 'కావ్యనిదానము' విద్యార్థులకేకాక, యుపాధ్యాయులకును, పండితులకును గూడ, మిక్కిలి యుపకరించు గ్రంథరాజమిది.

శ్రీ నారాయణరావుగారి కబ్బములు దృశ్య—శ్రవ్య-రచన కృతులని మొత్తెరుగులు. అందు వీరు రచించిన దృశ్యకావ్యములు పదునుకొండు· వీనిలో స్వకల్పితములు ఆరు. ఆంగ్ల, గీర్వాణ భాషలనుండి యాంధ్రీకరింపబడినవి తక్కినవి. ఇందు మొదటి

ఆరింటిలో విప్రనారాయణనాటకము 1919—20లో రచింపబడి శృంగార, శాంత, కరుణ, హాస్యాదిరసములెల్ల విరియుచు చున్నది. ఇయ్యది హిందూపురం శ్రీ కృష్ణదేవరాయ గ్రంథమాల వారిచే 1932 నందు ప్రకటింపబడినది. అందలి ప్రకృతి వర్ణనలు మనోహరములును. గంభీరములును. సందర్భోచితములును. 'కవితా నీరాజన' మను ఖండకావ్యసంపుటి ముప్పదియారు శీర్షికలు గలది. భర్తృహరి సుభాషిత రత్నావళి బోలిన నీతి ప్రదమగు 'ఆర్యసుభాషితము' ఒక పద్యకృతి, మహాకావ్యసారములనదగిన 400 పద్యములందు ప్రకాశితములు. వీరి కృతులలో వేలకొలదిచరణముల (22739) నొప్పిన యనువాద గ్రంథము 'సమాస భారతము.' రావు గారు దీనిని వార్ధక్యమున వ్రాసిరి. కేవలము సులభచ్ఛందములగు సీసము, కందము, తేటగీతి, ఆటవెలది, ద్విపద. ఇట్టి దేశ జాతీయ పద్యములతోడనే ఇది రచియింపబడినది. సుప్రసిద్ధులగు శ్రీ చక్రవర్తి రాజగోపాలాచార్యుల వారాంగ్లమున రచించిన మహా భారతము దీనికిమూలము. ఈయది అనువాదమైనను స్వకల్పిత విషయ విశేషములు పెక్కులుండి రసభావ బంధురముగ విరాజిల్లు చున్నది.

శ్రీ నారాయణరావుగారి సాహిత్య సేవను పురస్కరించుకొని వారికి 16—12—1956 న శ్రీ శారదా పీఠము—హిందూపురం (అనంతపురం జిల్లా) వారు "సాహితీ శిల్పి" బిరుదు ప్రసాదించి గౌరవించిరి.

<u>ముద్రితకృతులు</u>:- <u>నాటకములు</u>.

1) విప్రనారాయణ నాటకము—ప్ర: 1932. 2) గౌతమ బుద్ధుడు—ప్ర: 1936. 3) సౌందర నందన నాటకము—ప:-1964 4) ఉన్మత్తరాఘవము—ప్ర:1964

అనువాదాలు:—

1) అరవిందుని జీవిత చరిత్ర. 2) ప్రార్థనలు—ధ్యానములు. 3) అరవిందులవారి 'కాళిదాసు' నకు తెనుగుయనువాదము.

పద్యకృతులు:—1) పంపాపురీ శతకము (ప్ర: 1964)

అముద్రితములు: నాటకములు:—

1) కాకతీయ రుద్రాంబ. 2) విషాదరామరాజీయము. 3) క్షమావతీ విజయము. 4) మానవ విజయము.

అనువాదాలు:—

1) రవీంద్రనాథ ఠాగూరు వారి-గీతాంజలి, యజ్ఞము, మాలిని; 2) టాల్‌స్టాయి రచనలకు కొన్ని యనువాదాలు.

ఇతరకృతులు:—

1) కావ్యనిదానము 2) శిశుమానసిక శాస్త్రము 3) ఆధ్యాత్మికోపన్యాసములు 4) ఆర్యా సుభాషితములు 5) రూపన కుమార భారతము 6) ఒకపది అరవిందుని ఆధ్యాత్మిక పొత్తములు.

కావ్యపరిచయము: సంఘాత మరణ వర్ణన.

1936వ సంవత్సరమున, "క్వెట్టా" భూకంపముపుట్టి, దానిచే నుప్పతిల్లిన వినాశమునుగూర్చి, యాదరార్ద్ర హృదయుఁడైన శ్రీ రూపనగుడి నారాయణరావుగారు, గేయరూపమున యిట్లాలాపించి, అశ్రుతర్పణ మొనరించినారు.

" రెండునొకటవ జామునంగోళ్లు—నిలుచుండి
చట్టపలు పటపటన్ జాడించి—మెడసాచి
పయిఁజూచి 'కొక్కొ—క్కోకో' యంచుఁగూపెట్టి
తమతావు లందట్టె—ముడిగికొని కనుమూసి
యుండంగ జాయాపతుల్ పొదివియొండొరుల
కౌఁగిళ్ల నాచలిని నిద్రించు చుండంగ
బిడ్డలును, తల్లులును, నొత్తిగిలి పన్నుండి
యుండంగ నాఁకటను బెల్లేడ్చు శిశువులకుఁ
దల్లులుగడున్ వత్సలత మెయిం జనుగుడిపి
నిదుర కంటను, వారిజోకొట్టు చుండంగ...... ....
పురమొక్క పెట్టునన్ మొదలంటఁగానూఁగె;
....పృథ్వియుం దన కరాళాస్యముం
దెఱచి, యిసుమును గ్రక్కె; బలువెలుంగుల సుమినె

+ + + +

తమయిండ్లె తమపై—సమాధులై యేర్పడఁగ
నోట నుడువఁగరాని బాధలంబొందుచును
సుఖశయ్యలందున్న వారున్నటులె, నిజ
ప్రాణముల్ గోల్పోయి నారేమని వచియింతు? ....

శ్రీ నారాయణరావుగారి కుమార భారతములో ఇంద్రప్రస్థ పురమునందు ధర్మజుని పట్టాభిషేకశుభసమయమున మన్మథ పూజనొనర్చు కన్య పడుచులలో విజయుని మనసు నాకర్షించిన సుభద్రనిట్లు కవిగారు వర్ణించిరి.

సీ. అప్పుడప్పుడె పుల్లమౌ, పుష్పమునుదాల్చు
లలిత, మంజుల, దేహ, లతికదాని;
కుఱుచ—మట్టముగాక—మఱిచాల పొడువునుం
గాక—సమమగు విగ్రహముదాని;
కుసుమ సాయకుకేల—నెసఁగు పుష్పేతరం
బగు—నాఅవశరమై—య శరుదాని;
ఉదయ సంధ్యాసమయోజ్జ్వితారుణ రుచి
రాభ్రిముంబలె—రమ్యమైసదాని;

గీ. చంపక సదృశ చారునాసఁగలదాని;
కపట భావశూన్యాభివీక్షణముదానిఁ
జెలుల, యన్యోన్య భాషణంబులను గృష్ణ
సోదరియగు, సుభద్రిగా—నూహజేసె.
(ఆదిపర్వము 87... 98చ—రూపన్నకుమార భారతము)

ఇమ్మహాకావ్యము కర్త్తకుఁబుట్టువు నొసంగిన రూపనగుడి గ్రామమునందలి 'రూపన్నదేవు'న కంకితమొసఁగబడినది.

శ్రీ సీరిపి ఆంజనేయులుగారు తమ విజ్ఞానవల్లీ గ్రంథ మండలి ద్వారా పంపాపురీ శతకమును ప్రచురించిరి. శ్రీ రూపనగుడి నారాయణరావుగారి పై వీరికిగల గురుప్రేమ కిదితార్కాణము. కవిశేఖరుల జీవితచరిత్రను వీరేవిపులముగా రచించియిందు పొందు పఱచిరి. కవిగారి మరణానంతరం దీనితోబాటు 'సౌందర నంద నాటకము', 'ఉన్మత్తరాఘవ నాటకములు' గూడా ముద్రింపబడినవి.

సౌందరనంద నాటకమును శ్రీ రావుగారు. అగ్నిప్రమాదమునకు జిక్కి తన ప్రియభర్తను, వృద్ధ జననీ జనకులను శోకార్ణవమున ముంచిపరలోకమునకు జనిన తమ కడగొట్టు పుత్రిక శ్రీమతి సీతాలక్ష్మమ్మకంకితమొసగిరి. ఈమె శ్రీ A.S. రామన్ (Editor of "The Illustrated Weekly of India" గారి భార్య. ఈ మహనీయుని మరణవార్త విన్న శ్రీ కవిరాజ కలుగోడు అశ్వత్థ రావుగారు 'మిత్రస్మృతి' పేర,నిట్లంజలి ఘటించిరి.

ఉ. "మైసురుకట్టు "వెట్టిన, రుమాలును, కోటును, కంటిజోడు,చే
యూసరనున్న బెత్తమును, అద్దులముచ్చెలు, "పంచకచ్ఛ" చే
భాసిలు కట్టుపుట్టమును వాటిల, మద్పులవల్వనీటుగన్
వేసి భుజాన, అంజలిడు ప్రేమసఖుండిక మాకులేడుగా!

కం. సారంబైన కవిత్వ,మ
పారము పాండిత్యమున్ ప్రభాప్రతిభలు సౌ
మ్మైరంజిలె—రూపనగుడి
నారాయణరాయ! నీకు; నవ్యగుణాఢ్యా!

(పంపాపురీశతకమునుండి)



ఆంధ్రనాటక పితామహ ధర్మవరం రామకృష్ణమాచార్యులు

జననము:— 1853

నిర్యాణము:— 30—11—1912

తండ్రి:— శ్రీమాన్ కొమాండూరు కృష్ణమాచార్యులు
తల్లి:— శ్రీమతి లక్ష్మిదేవమ్మ
జన్మస్థలము:—*అనంతపురం జిల్లా—ధర్మవరము.
మతము—కులము:—హిందూ—బ్రాహ్మణ—శ్రీ వైష్ణవులు.

విద్యాభ్యాసము:

శ్రీమాన్ కొమాండూరు కృష్ణమాచార్యుల వారు ధర్మవరమున కుమారుల చదువునకు తగిన యనుకూలము లేనందున స్వకుటుంబముతో బళ్ళారి జేరిరి. వీరచ్చట "వార్డ్లా కాలేజి" లో ఆంధ్రోపన్యాసకులుగా పని చేయుచు, ప్రసిద్ధ వైద్యులుగను. పౌరాణికులుగను పేరుపొందిరి. తండ్రి వద్దనే ఆంధ్ర, సంస్కృత, కర్ణాటక భాషలను మనకవిగారభ్యసించిరి.1870లో మెట్రిక్యులేషన్ పరీక్షలో జయమొందిరి.

ఆచార్యుల*తాతగారు (తండ్రి—తండ్రి) కూడా తెనుగునను, సంస్కృతమునను చక్కని జ్ఞానముకలవారు, తాతగారివద్ద ఆచార్యుల వారు మూడునెలలలో రఘువంశము నేర్చుకొని,సంవత్సరము లోపలనే చంపూ రామాయణము, ప్రతాపరుద్రీయముకూడా చదివి ముగించిరి.

కుటుంబచరిత్ర:

ఆచార్యులవారిది పేద బ్రాహ్మణ కుటుంబము. వీరు జ్యేష్ఠులు. వీరి 16వ యేటనే తండ్రి పరమపదించిరి. కుటుంబ భారము పెద్ద కుమారునిపై బడినది. వీరికి ముగ్గురు సోదరులు. ముగ్గురు సోదరీమణులుకలరు. పెద్ద తమ్ముడు శ్రీ గోపాలాచార్యులు (సెకెండు గ్రేడు ప్లీడరు) రెండవ తమ్ముడు శ్రీ శేషాచార్యులు; మూడవ తమ్ముడు శ్రీ వేంకటకృష్ణమాచార్యులు (న్యాయవాదులు) పెద్ద చెల్లెలు శ్రీమతి శేషమ్మగారు. ఈమె కుమారుడు కళాప్రపూర్ణ బళ్లారి రాఘవాచార్యులుగారు. రెండవ చెల్లెలు శ్రీమతి చిన్న శేషమ్మ. మూడవ చెల్లెలు శ్రీమతి కృష్ణమ్మ.

వివాహము:

ఆచార్యులవారి తొలికళత్రము, వివాహమైన కొలది రోజులకే చనిపోయినది. రెండవ వివాహ ప్రయత్నములో ఆచార్యుల వారొక వధువు జాతకము చూచుట సంభవించినది. జ్యోతిషములో మంచి యనుభవము కలవారగుచే ఆచార్యుల వారా వధువును వివాహమాడిన, తానత్యున్నతస్థితికి రాగల యవకాశముగలదని, తమ బంధువుల కెవ్వరికినీ యిష్టములేకున్నను, నామెనే చేబట్టిరి. ఆమెకాపురమునకు వచ్చినతరువాతనే ఆచార్యులవారి దశమారినది. వీరు తమ పెద్ద కుమారునకు కృష్ణమాచార్యులని పేరిడిరి. పెద్ద కుమారులకు 'కృష్ణమాచార్యుల' ని పేరిడుట వీరి వంశాచారమైయున్నది. వీరి రెండవ కుమారుడు వేణుగోపాలాచార్యులు, మూడవ కుమారుడు రంగాచార్యులు.

సాహిత్యపరిచయము:

వీరికి చిన్ననాటి నుండియు తెనుగుభాషపై మక్కువ కలదు. తమ యిరువది యేడవ ప్రాయముననే అనగా 1874 నందే, నేదేని

కావ్యము రచించు కుతూహలముగలిగి, గోత్రి కర్తయగు 'గాధి నందను చరిత్రిము' పద్యకావ్యముగా వ్రాసి, సగములోనే ఆపిరి. తరువాత నాటక రచనపై కుతూహలమేర్పడుటచే, సంస్కృత, ఆంగ్ల భాషలయందలి నాటకముల నాసక్తిగా జదివి 1879 లో 'ఉన్మాదరామ ప్రేక్షణికము'–'మదన విలాసము అను చిన్నినాటకములను. 'చిత్రినళీయనాటకము'ను రచించిరి. వీరిని బ్రహ్మ శ్రీ చిత్తవాడిగి హనుమంతగౌడు (కర్ణాటక నాటక రచయిత) గారు నాటక రచనకు ప్రోత్సహించిరి. దేశబాషలలో నాటకములకు దగిన భాష కన్నడమే యనియు, తెనుగందులకు దగదని యభిప్రాయపడిన బళ్లారిపురవాసుల కాచార్యులవారు తమ తెలుగు నాటకరచన, ప్రదర్శనములచే మెప్పునందిరి. 1886లో మిత్రుల సహాయముతో 'సరసవినోదిని' సభను నెలకొల్పి, తమ తొలి కన్నడ నాటకమగు 'స్వప్నానిరుద్ధ'ను ప్రదర్శించిరి. అందే 29–1–1887 లో చిత్ర నళీయమను తెలుగు నాటకమును ప్రదర్శించి బళ్లారి కన్నడ సీమ కాదను మాటస్థిరముగా నాటునట్లు చేసి కృతార్థులైరి.

నాటకకర్త లేకాదు నటులు. దర్శకులుకూడా:

ఆచార్యులవారు నాటకకర్తలేకాదు, గొప్పనటులుకూడ. వీరనేక పాత్రలుధరించిరి. నాటకిములను రక్తికట్టించిరి. చిత్ర నళీయ' నాటకమందు ఆచార్యులవారే ప్రధాన పాత్రలను పోషించుచూ దర్శకత్వమునుగూడ నిర్వహించెడివారు. వీరుసంగీతములో నిధులు. పాటకు, పద్యములకు రాగములు వారే నిర్ణయించెడివారు అర్థమును, అభినయమును జెడగొట్టని, శ్రావ్యమైన సంగీతమునే వారు పాడెడివారు, దానినే రంగస్థళముపై కూడ అమలులోనుంచెడివారు, మోహన, జంఝూటి, కేదారగౌళ ,కమాజు రాగములు వీరి కత్యంత ప్రీతి పాత్రములైనవి.

'సరస వినోదినీసభ' వారి ప్రదర్శనములన్నింటికీ వీరే 'రిహార్సల్సు' చేయించు భారము వహించెడివారు. ఏదైనా నాటకము ను వ్రాయుముందు, ఆభూమికలకు దగిన నటులనే, యెన్నుకొని వారిని దృష్టియందుంచుకొని, తమ రచనను సాగించెడివారు. ఏ మాత్రమలసతనుగానీ, అజాగ్రత్తనుగానీ సహించు వారు కారు. నటులు తప్పు చేసినప్పుడు, వారిని తీవ్రముగా దండించెడివారు.

వీరు దశరథ, బాహుక, రాజరాజనరేంద్రుడు, చిరకారి, అజామిళ పాత్రలు అభినయించుటలో దిట్టలుగా పేరు పొందిరి. ఆచార్యుల వారు పాదుకాపట్టాభిషేకమునందు దశరథుల పాత్రను పోషించెడివారు. ఈ నాటకమునందు వీరి నటన జూచిన వారెవ్వరూ కంటతడిపెట్టనివారులేరు. ఒకసారి మద్రాసునందు కొందఱు పెద్దలాచార్యులవారి నటనపై సవాలుచేసి ప్రదర్శనకు హాజరైరి. సీతారామలక్ష్మణు లడవికేగు ఘట్టమందెంతగా శోకము బిగబట్టి కూర్చొన్నను, దశరథుని మరణ ఘట్టమునందు మాత్రమాచార్యుల వారి వాచక, ఆంగిక, సాత్త్వికాభినయము లనుభవములోనికి వచ్చినప్పుడు వారికి దుఃఖమాగకపోయినది. వారాచార్యుల వారి నటనా ప్రావీణ్యము నభినందించిరి.

సన్మానములు-బిరుదులు:—

1891 వ సంవత్సరమున ఆచార్యుల వారికి చెన్నపురి రాజధాని కళాశాల యందలి సంస్కృత పండితుడు కీ.శే. ఓపర్టు పండితుడు వీరి నాటకమునకు మెచ్చి రతనాల బంగారు పతకమును బహూకరించిరి. ఆ కాలములో దాని వెల రూ. 700—00 (ఏడువందల రూపాయలు). ఇట్లు వీరు పెక్కు పతకములను పొందిరి.

1910 వ సంవత్సరములో గద్వాల మహారాజు వీరిని 'ఆంధ్ర నాటక పితామహ' అను బిరుదుతో సత్కరించిరి. పుర ప్రముఖులు వీరికి రత్నఖచిత కిరీటమును బహూకరించిరి.

వీరు ఆంగ్ల, ఆంధ్ర, కన్నడ భాషలయందును నాటకములను రచించిరి. తెలుగు నాటకములు 28, కన్నద నాటకములు 2, ఆంగ్ల నాటకము 1, మొత్తము 31 నాటకములు రచించిరి.
వీరినాటక రచనలు:

1) ఉపేంద్ర విజయము (వామనచరిత్ర) 2) స్వప్నానిరుద్ధ నాటకము (ఉషాపరిణయము) ఇవి కన్నడ నాటకములు.

తెలుగు నాటకములు—ముద్రితములు:

1) చిత్రనళీయము 2) పాదుకా పట్టాభిషేకము 3) ప్రహ్లాద 4) సావిత్రీ చిత్రాశ్వము 5) మోహినీ రుక్మాంగద 6) విషాద సారంగధర 7) బృహన్నల 8) ప్రమీళార్జునీయము 9) పాంచాలీ స్వయంవరము 10) చిరకారి 11) ముక్తావళి 12) రోషనారా శివాజీ 13) వరూధినీ నాటకము 14) అభిజ్ఞానమణిమంతము (చంద్రహాస)

అముద్రితములు

15) ఉషాపరిణయము 16) సుశీలాజయపాలీయము 17) అజామిళ 18) యుధిష్ఠర యౌవరాజ్యము 19) సీతా స్వయంవరము 20) ఘోషయాత్ర 21) ఉన్మదరాహుప్రేక్షణికం 22) రాజ్యాభిషేకము 23) సుగ్రీవ పట్టాభిషేకము 24) విభీషణ పట్టాభిషేకము 25) హరిశ్చంద్ర 26) గిరిజాకల్యాణము 27) ఉదాస కల్యాణము 28) మదన విలాసము 29) ఆంగ్లమున హరిశ్చంద్ర.

నాటక రచనా విధానము:

శ్రీ ఆచార్యుల వారు సంస్కృతనాటక లక్షణాలను, ఆంగ్ల, పార్సీ నాటక లక్షణాలను మేళవింపజేసి నూతన పద్ధతిలో నాటకాలు రచించిరి. సంస్కృత నాటకములలోని పద్యములు, ఆంగ్ల నాటకములలోని 'అంకాలు-రంగాలు', పార్సీ నాటకములలోని పాటలు వీరు తమ నాటకములలో సమ్మేళించిరి. క్రొత్త పద్యములు, గేయాలు, రాగమాలికలు, సంవాదకీర్తనలు రచించిరి. విషాద సారంగధర నాటకమునకు దేశములో మంచి ఆదరణ లభించెను. ఆ కారణముననే ఆచార్యులవారు చంద్రహాస, ముక్తావళి, అజామిళ నాటకములను విషాదాంతములుగా రచించిరి.

గ్రంథముల పరిచయము:

వీరి నాటకములందు పాటలెక్కువ. చిత్రనళీయ నాటకమునందు 217 పద్యములు, 63 పాటలు, 15 సంవాదకీర్తనలు వ్రాసిరి. 'ప్రజాబలం' అజేయమని వీరు నాటకములద్వారా ప్రబోధించిరి. వీరు చిత్రనళీయం, పాదుకాపట్టాభిషేకములందు ప్రజలను పౌరులనే పేరుతో రంగస్థలముపై ప్రవేశ పెట్టిరి. భారతంలో నలుడు అరణ్యవాసానంతరం తిరిగి పుష్కరునితో జూదమాడి రాజ్యము గెలుచుకొన్నట్లు వ్రాయబడినది. ఆచార్యులవారు దానిని మార్చి పుష్కరుని మీద ప్రజలు తిరుగబడి బంధించి కారాగారములో పడవేసి రాజ్యము నలునికప్పగించినట్లు రచించిరి. తమ చిత్రనళీయ నాటకము చిరకాలము విలసిల్ల కవిగారిట్లు వ్రాసుకొనిరి.

ఉ॥ ప్రాకట సంస్కృతాంధ్రిక వివర్యుల కంజలిఁజేసి తత్కృపా
స్తోకత రామకృష్ణకవి సోముఁడుదంచితసార సంవిధా
నైకత సంపతిల్ల-రచియించిన, చిత్రనళీయనాటకం
బాకమలాప్తతారక, మృగాంకముగా, విలసిల్లుఁగావుత౯

కొందరు విమర్శకులు చిత్రనళీయ నాటకము 'అతుకుల బొంత' యని విమర్శించిరట! అందుకు సమాధానముగా,

ఉ. కొంచెపు పెంటలేరితిను, కుక్కుటముల్ నిను, కందిగింజగా
దంచు,త్యజించు నంతనెయహో! యపకీర్తియె? నీకురత్నమా!
కాంచనపీఠి నిన్నునిడి! కాంత కిరీటము అందునిల్పి, య
భ్యంచితరీతిమస్తకము లందు ధరింపరె? రాజశేఖరుల్
అనిసూటిగా జవాబిచ్చిరి

అభిజ్ఞానమణిమంత నాటకము (చంద్రహాస నాటకము.)

ఆచార్యులవారు తొలుదొల్తనీ చంద్రహాస నాటకము విషాదాంతముగా రచించిరి. కాని యట్టి నాటకముల నాదరింపబడనికాలమగుటచే గ్రంథకర్త దీనిని మనసొప్పకున్నను మోదాంతముగ మార్చి. ముద్రించిరి. దీనిపై 15—8—1916 నాటియాంధ్రపత్రిక ఈ దిగువ యభిప్రాయమును వెలిబుచ్చినది.

"— — — దీనిని దుఃఖాంతనాటకముగ రచించి మదన,కుంభీనసుల నిరువురనిగాని లేక కుంభీనసు నొక్కనినైనగాని గతప్రాణునిగా నొనరించిన దీని నీతిని ప్రేక్షకులు మఱింత స్ఫుటముగ గ్రహింప గలుగుదురని తోఁచుచున్నదిగాని, మనవారట్టి ప్రదర్శనములను చూచి సహింప జాలరని, గాబోలు ఆచార్యులవారు దీనిని కల్యాణాంతముగా నొనర్చియున్నారు. ఆంధ్రలోక విఖ్యాతులగు నాచార్యులవారి రచనాచమత్కృతిని వర్ణింపఁగడంగుట వెఱ్ఱితనము

ఇదివర కాంగ్లభాషలో నొకరీనాటకమును వ్రాసియున్నను ఆచార్యులవారు దాని నాధారముగ గొనక స్వకపోల కల్పనలనే యొనరించుట కడుంగడు ప్రశంసనీయము."

ఇట్లే, ముక్తావళీ నాటకమును సహితము బలవంతముగ మోదాంత మొనర్పబడినందుకు కవిగారు మనసునొచ్చుకొని, ఇంకొకపరి ముద్రింపబడు భాగ్యముగలిగిన వాటిని ఖేదాంతముగానె ముద్రింప నిశ్చయించుకొన్నట్లు 'చంద్రహాస' యందు వ్రాసుకొన్నారు,

నాటక ప్రయోగములో, నటనలో ఆచార్యులవారు వేసిన బాటలే నేటికి, జీవికనటులకు శరణ్యము. రంగస్థలము మీద రాగయుక్తంగా పద్యంపాడు ఆచారం ఆచార్యులవారు తెచ్చిపెట్టినదని ప్రతీతి. ఇటి మహనీయులొకసారి ఆలూరునకు(కర్నూలుజిల్లాలో) కేసుకై వెళ్లి, వాదించి వెనుకకు తిరిగి వచ్చుచుండిరి. అక్కడి మేజిస్ట్రీటు పడసాల 'శ్రీరాము' లనువారిని చూచుచు, మెట్లు దిగుచుజారి 'హారామచంద్రా' అనుచు అసువులబాసిరి.

ఆది 30—11—1912 సాయంకాలము. రాత్రికి బళ్లారికి వీరిమృత దేహముతేబడి మరునాడు వేలకు పౌరులు వెంబడింప, అతని కళావంతమైన కాయము కూడ కనుమఱుగైపోయినది. అప్పటి కతని వయసు 60 ఏళ్లు పూర్తికాలేదు. మన సీమయందేకాక, దేశమంతట అచార్యుల వారికీర్తి ఆ చంద్ర తారార్కము విలసిల్లు చున్నది.



ఆంధ్రచరిత్ర నాటక పితామహ
కోలాచలం శ్రీనివాసరావు

జననము:– 13-3-1854
నిర్యాణము:– 23-6-1919
తండ్రి:– శ్రీ సేతుపతి శాస్త్రిగారు
తల్లి:– అచ్చమాంబ
జన్మస్థలము:–బళ్ళారి జిల్లా హంపిక్షేత్రమునకు సమీపమునగల కామలాపురము.

వంశచరిత్ర:–

కాళిదాస, మాఘ. భవభూతి, భట్టనారాయణాద్యనేక గీర్వాణకవిశేఖరుల కృతిరత్నములకు వ్యాఖ్యానము వ్రాసి పండితావతంసులని, ప్రసిద్ధిగాంచిన కోలాచలం మల్లినాథసూరి వంశమున, కోలాచలం శ్రీనివాసరావుగారు జన్మించిరి. శ్రీనివాస రావుగారి పితామహులైన గంగాధరశాస్త్రి పరిసరాలలోని భూసంపదపై అధికారంకలిగి, 'హంపీ' సమీపములోని 'కామలాపురం'లో స్థిరపడిరి. వీరిభార్య శ్రీమతి సుబ్బమ్మగారు. ఈ దంపతులకు సేతుయాత్రా (రామేశ్వరము) నంతరము పుత్ర సంతానముగలుగగా సేతుపతిశాస్త్రి యనినామకరణ మిడిరి. సేతుపతిశాస్త్రి పెరిగి పెద్దవారైన తరువాత ఆనాడానెగొంది రాజైన శ్రీమత్తిరుమల దేవరాయలవద్ద మంత్రి (దివాన్) పదవిని స్వీకరించి ప్రసిద్ధికెక్కిరి. వీరికారుగురు సంతానము. వారిలో కనిష్ఠ పుత్రుడే మన శ్రీనివాస రావుగారు. సేతుపతి శాస్త్రిగారుత్తమ గుణగరిష్ఠులు, దయాధర్మాలు వారిసొత్తు. వీరు 1836లో. మరణించిరి,అప్పటికి శ్రీనివాసరావునకు 9 వత్సరములు.

విద్యాభ్యాసము:

తండ్రి మరణానంతరము శ్రీనివాసరావుగారిని వారి బావ తిన్నవేలి కుప్పుస్వామయ్యగారు చేరదీసిరి. బళ్ళారికిగొనిపోయి, విద్యాబుద్ధులుగఱపిరి. వీరాంధ్రభాషతో పాటు సంస్కృతము, కాలోచితంగా ఆంగ్లభాషనచిరకాలములోనే అభ్యసించిరి. వీటికి తోడు కర్ణాటభాష యలవడినది. 19వయేట 1873 సం॥లో 'మెట్రిక్యులేషన్' పరీక్షలోనూ, 1876లో అనగా 22వ సం॥లో, ఎఫ్.ఏ.లో నుత్తీర్ణులైరి.

ఉద్యోగము:

'ఉద్యోగం పురుష లక్షణము' అన్నట్లు శ్రీనివాసరావుగారు స్వతంత్ర జీవితము గడుపదలచి, యుద్యోగ ప్రయత్నము కొనసాగించి, అనంతపురం జిల్లా గుత్తిలో 12 సం॥ లు (1877–89) 'రివిన్యూడిపార్టుమెంటు' లో ఉద్యోగము నిర్వర్తించిరి. స్వేచ్ఛాజీవులు, కళాపిపాసువులైన శ్రీనివాసరావుగారికి ఉద్యోగమొక పెద్ద బంధమైనది. 1889 లో తమ 35వ ఏట ఉద్యోగమునకు రాజీనామా నిచ్చి బళ్ళారిజేరిరి. అప్పుడు వీరి అన్న వేంకటరావుగారు సుప్రసిద్ధ న్యాయవాదులై కీర్తి ప్రతిష్ఠలతోపాటు ధనసంపాదన చేయుచుండిరి. వీరు తమ్ముని చేరదీసిరి. అప్పటనుండి శ్రీనివాసరావుగారికి న్యాయవాద వృత్తిపై అభిలాష కలిగినది అనుభవముతో 'సెకెండుగ్రేడు ప్లీడర్షిప్' పరీక్షలో కృతకృత్యులై 1892లో స్వచ్ఛందమైన న్యాయవాదవృత్తి నవలంబించిరి, బళ్లారిలోనే "ప్రాక్టీసు" ప్రారంభించిరి,

కుటుంబచరిత్ర:

శ్రీరావుగారి భార్యలక్ష్మమ్మ. ఈ దంపతులకు నల్గురు కుమారులు, ఒకకూతురు జన్మించిరి. వీరి జ్యేష్ఠ కుమారుడు శత్రుఘ్నరావు. శ్రీరామరావు, జయరత్నం, ప్రతాపరావులు తదితరులు. సునందనమ్మ వీరి కుమార్తె.

సాహిత్యపరిచయము:—

శ్రీనివాసరావు, తెలుగు 'ఇంగ్లీషు' కన్నడము. మరాటి, భాషలలోనేగాక, సంస్కృతభాషలోకూడ నపారమైన పాండిత్యము కలవారు. ఆనాడు బళ్లారి మునిసిపలు హైస్కూలు హెడ్డుమాష్టరు, ఆర్కాటు భీమాచార్యులు, తెలుగు పండితులైన రావాడ వేంకట రామాశాస్త్రులు వీరికి స్నేహితులైరి, వారితోకలసి, సాహిత్యగోష్ఠిని జరుపుచుండిరి, అప్పుడు రావుగారికి గ్రంథ రచనా సక్తి కల్గి, (1892లో) వైజయంతీ విలాస నాటకమును వచన రూపముగా వ్రాయుటకు మొదలిడిరి.

ఒకప్పుడు పూనా నగరమునుండి, బళ్లారికి కేశవగంధర్వ కంపెనీవారు, బాలగంధర్వ కంపెనీవారు, వచ్చి, మహారాష్ట్రి భాషలో 'రాక్షసీ మహత్వా కాంక్ష' "మానావమానము" అను సాంఘిక నాటకములను ప్రదర్శింపగా, భాష తెలియకున్నను, సంగీతము, రంగ నిర్మాణ చాతుర్యము పలువుర నాకర్షించుటచే, రావుగారా నాటకద్వయమును—రెండు నెలల లోపుగా మహారాష్ట్రిభాష నభ్యసించి—తెలుగులోవ్రాసి, ప్రదర్శించి గౌరవ ధనలాభముల నశేషముగ బొందగలిగిరి.

శ్రీనివాసరావుగారు సాంఘిక నాటకములనే వ్రాసి ప్రదర్శించు చుండగా, 'సరసవినోదినిసభ' వారు పౌరాణిక నాటకములనే ఖేలనము గావించుచుండిరి. "సుమనోరమసభ" కూడ పౌరాణిక నాటకములను ప్రదర్శింప గోరిక కల్గి రావుగారిపై నొత్తిడి తెచ్చి, వారిచే పౌరాణిక నాటకమును వ్రాయించెను. అదియే మార్కండేయ పురాణమందలి 'మదాలస చరిత్ర' నాటకము. అదియే వారి మొదటి పౌరాణిక నాటకము.

సాంఘిక నాటకములను వ్రాయుట మాని, శ్రీనివాసరావు గారు చరిత్రలోగల సంఘటనల నితివృత్తముగా గైకొని నాటకములను వ్రాయ మొదలిడిరి. తమ జన్మస్థానము కామలాపురము, కీర్తి గడించిన బళ్లారి పురము, తత్పరిసర ప్రాంత మంతయు అలనాటి విజయనగర సామ్రాజ్యములోని భాగములే. తద్రాజ్య పతన మితివృత్తముగా గల చరిత్రాంశములతో గూడిన 'రామరాజు చరిత్రము' అను నాటకమును వ్రాసిరి. రావుగారి కీర్తి దశదిశల నల్లుకొనజేసినదీ నాటకమే! అందలి "పఠాను" పాత్ర బహుప్రశంసలనొందింది, కీ. శే. రాఘవగారభినయింపగా నా పాత్రకే గాక, నాటకమునకు లభించిన పేరు ఆ చంద్రార్కము. తన్నాటకకర్తకు 'ఆంధ్రచరిత్ర నాటక పితామహ' బిరుద మిప్పించిన దీ నాటకమే. చరిత్ర నాటకములలో దీనికే యగ్రస్థానము!

వీరురచించిన నాటకములు:—

సాంఘికములు: 1) సునందినీ పరిణయం, 2) సీమంతిని, 3) సుఖమంజరీ పరిణయం, 4) యువతీ వివాహం, 5) మానవ పిశాచం, 6) రాక్షసీ మహత్వాకాంక్ష, 7) మానావమాన.

ప్రహసనములు: 1) అన్యాయ ధర్మపురిమహిమ, 2) నాచిపార్టి,

3) ఆచారమ్మ కథ (కన్నడం) 4) సమయమునకు భార్య.
చారిత్రాత్మికములు:— 1) రామరాజు, 2) ప్రతాపాక్బరీయం, 3) సుల్తానా చాందుబీ, 4) శిలాదిత్య, 5) మైసూరు రాజ్యం, 6) చంద్రగిర్యభ్యుదయం, 7) కాళిదాసు (అనుసరణ).
పౌరాణికములు:— 1) శ్రీరామజననం, 2) సీతాకల్యాణం, 3) పాదుకా పట్టాభిషేకం, 4) లంకా దహనం, 5) కుశలవ, 6) ద్రౌపదీ వస్త్రాపహరణం, 7) కీచకవధ, 8) భారత ధర్మయుద్ధం 9) శిరోమణి, 10) బభ్రువాహన, 11) మదాలస, 12) రుక్మాంగద 13) హరిశ్చంద్ర, 14) ప్రహ్లాద, 15) చంద్రహాస, 16) గిరికా కల్యాణం.

నాటకముల పరిచయము:—

రామరాజు (The fall of Vijayanagar). పఠాన్ రుస్తుం విజయనగర ప్రభువు అళియ రామరాజునకు, నొక ముస్లిం యువతికిని బుట్టినవాడు. అతడు అషాబీయను ముస్లిం వనిత మోహంలోజిక్కి ఆమెనవమానించిన రామరాజును, తండ్రియని యెఱిగికూడా మోసముతో చంపివేయును. చంపినతరువాత పశ్చాత్తాపపడును. పఠాన్‌రుస్తుం పశ్చాత్తాప, హృదయ సంక్షోభముల నొకరసవత్తర దీర్ఘ స్వగతమునందు శ్రీనివాసరావుగారు ద్యోతకముజేసిరి. ఈ దీర్ఘ స్వగతము బీభత్స భయానక కరుణరసముల కాలవాలము. షేక్స్‌పియర్ విషాదాంత నాటకముల ఛాయలు, భావములు, పాత్రల మనోవృత్తులు రామరాజు నాటకములో అక్కడక్కడ గోచరించును.

ఈ నాటకం హిందూ, ముస్లిం విద్వేషముల రెచ్చగొట్ట గలదను యభిప్రాయముతో నాటి బ్రిటిష్ ఇండియా ప్రభుత్వమీ

నాటక గ్రంథమును, ప్రదర్శనమును నిషేధించినది. తరువాత కాంగ్రెస్ ప్రభుత్వము ఈ నిషేధమును తొలగించినది. మరలా దీని పునర్ముద్రణ కాలేదు. ఈ నాటకమిప్పుడు లభ్యమగుటలేదు.

పఠాన్ పశ్చాత్తాప దీర్ఘ స్వగతంనుంచి మచ్చుకు—"... కల్పాంత సమయావిర్భూత ఫాలలోచన ఫాలభాగానలసహస్రము నైన భరింపనగును గాని యీ నా బాధ దుర్భరము. కాకోదర లోకేశ ఘోరఫూత్కారసముద్భవ తీక్ష్ణ కాకోల కీలా శతంబులు మ్రింగి సైపనగును గాని నాయీ బాధ దుర్వహము. ఆహా! ఎటు సైపుదు!"

తరువాత వచ్చిన అనేకనాటక రచయితలు ఈ దీర్ఘ స్వగతాన్ని ఒరవడిగా పెట్టుకుని రచనలు సాగించిరి.

శ్రీనివాసరావుగారి రచన లన్నింటిలో మేల్బంతి యైనది. వా రాంగ్లేయభాషలో వ్రాసిన Dramatic history of the world" (ప్రపంచ నాటక చరిత్ర మను నాటకశాస్త్రగ్రంథము) ప్రపంచములోని వివిధ దేశములందలి నాటక సంప్రదాయములు, నాటక రీతులు, ప్రాక్పశ్చిమ నాటకరీతులలో భేదములు, గొప్పనాటక కర్తల ప్రతిభా విశేషములు, భరతశాస్త్రము, దాని సాంకేతి కార్థము మొదలగు విషయముల నెన్నియో విపులముగ జర్చించియున్నారు. గ్రీకుల దండయాత్ర మొదలుకొని, యాంగ్లేయుల పాలనము వఱకు గల కాలములో భారతదేశము పర పాలనము క్రింద నున్నను, భారతదేశమునందలి నాటకకళ అన్యదేశ కళామిశ్రితముగాక యున్నదని వ్రాసియున్నారు. ఈ గ్రంథ మిప్పుడు ప్రచారములో లేదు.

చంద్రగిరి అభ్యుదయమునుండి కొన్ని పద్యములు.
(రచన:— 3—8—1916) మొదటి ముద్రణాకాలము:—1925

సీ. కమనీయకహ్లార—కలహంస కలితంబు
విమలాంబు కాసార—విశ్రుతంబు
అందమౌకురువింద—మందారమహితంబు
సుందర మాకంద—సురుచిరంబు
కంకేళి కేతకీ—కదళీకసిద్ధంబు
కాంత కాంతల కను కాంచనంబు
మధుసుధారసపూర—మధురాంబు సారంబు
నారికేళాదిక—నగయుతంబు
గీ. మందమారుత కందళ—మానితంబు
కుంద కుట్మల బృందోప—సుందరంబు
నంద నంబున కంటె నానందదంబు
నందమగునౌర ! యీవనమందిరంబు.
సీ. రాజయిచింతచే—రోజుచుండగనేల?
భోజనంబునకింత—భూమిగనడె?
ధారణీధవుడయి—తపియింపగానేల?
దారిద్ర్యుడీధర-దనివిఁగనడె?
క్షితినేలి శాత్రవ—తతికి భీతిలనేల?
నిరుపేదనిర్వృతి—నిదురగనడే?
ఇలకునేలుచు చాలఁగలిమిగోరగనేల?
యిలనుదున్నెడువాడు కలిమిగనడే?
గీ. దొరతనము, వీపుననెయుండు—దుఃఖతమము
ధరణిపాలుర భోజ్యము—దురితతమము
అన్నిఁదెలిసియు మూర్ఖుఁడనైతి నకట!
రాజగుటకంటె—బిచ్చాలరాజుమేలు,

ధర్మవరం—కోలాచలం:

ఆంధ్రనాటక పితామహుడు 'సరసవినోదినీసభ' యనునాటకసభను బళ్లారిలో స్థాపించియుండిరి. ఆ సభకు వారధ్యక్షులు. ఈ సభకు పోటీగా 'సుమనోరమసభ' ను స్థాపించి. కోలాచలం శ్రీనివాసరావుగారు, దానికధ్యక్షులైరి.

ఆచార్యులవారు, పౌరాణిక నాటకములు వ్రాయగా, రావుగారు సాంఘిక, చారిత్రిక నాటకములను రచించి, ఖేలనముగావించిరి. మొత్తము వీరు 28 నాటకములను వ్రాసిరి.

1905వ నాటికి బళ్లారిలో పక్కానాటకశాలలేదు. వెదురుపాకలోనే, నాటకాలాడుచుండిరి. శ్రీనివాసరావుగారు 'వాణీవిలాస నాటకశాల'ను నిర్మించి భారత జాతీయ మహానాయకుడైన బాలగంగాధరతిలకు గారిచే ఆ నాటకశాలను ఆవిష్కరింపజేసిరి.

కోలాచలం శ్రీనివాసరావుగారు దేశ చరిత్రలోని సంఘటనల నితివృత్తములుగా గైకొని నాటకములను రచించి, 'యాంధ్రచరిత్ర నాటక పితామహు' లని వాసిగాంచిరి. ఆంధ్ర నాటక పితామహులు ఆంధ్ర చరిత్ర నాటక పితామహులు,వీ రిద్దరివలన యాంధ్రనాటక కళ తన జీవితమును మూడు పూవు లారు కాయలు గావించుకొన్నది. ఈ కవిద్వయము నాటక కళాభివృద్ధికిఁబాటు పడుటకు. భాషాసేవ చేయుటకు రంగస్థలమైన బళ్లారిపుర మెంతయు ధన్యమైనది.

నాటకములు, ప్రహసనములు, కావ్యము, విమర్శనలు, చరిత్ర, వేదాంత విషయములు మొదలగు సారస్వత శాఖలలో పరిశ్రమించి, యఖండకీర్తి నార్జించి 23 — 6 — 1919 వ తేదీ

నాడు, కోలాచలం శ్రీనివాసరావుగారు రాచకురుపు కారణముగా భౌతికదేహమును వీడి యశోమాత్రశరీరులై యలరారుచున్నారు. ఆంధ్రదేశ మిప్పుడు వారిని విస్మరించినది ఇప్పటికైన వారి కీర్తి కంజలి ఘటించినచో నదియు నొక కళారాధనా విశేషమగునుకదా!



'కావ్యతీర్థ-''పురాణతీర్థ-విద్వత్కవి

శ్రీ జనమంచివేంకట సుబ్రహ్మణ్యశర్మ

జన్మస్థలము:—అనంతపురం జిల్లా—తాడిపత్రి తాలూకా గాండ్లపాడు.

జననము :— 11-11-1899

తల్లి :— సీతమ్మ

నిర్యాణము :— 18-11-1972

తండ్రి:— సుబ్బయ్యగారు

మతము;- హిందూ—సంపన్నవైదిక బ్రాహ్మణ-కాశ్యపస గోత్రజులు.

విద్యాభ్యాసము:—

తండ్రిగారి సంతానమున వీరు జ్యేష్ఠులు, తండ్రిగారి పరమ పదానంతరము కడప పట్టణమున మాతామహులైన మామిళ్లపల్లి సీతారామయ్య గారి యింట విద్యాభ్యాసము నడచినది. బ్రహ్మశ్రీ అనుముల వేంకటసుబ్బావధానుల వారివద్ద వేదవిద్య,ఋగ్యజుస్సు

లందు స్మార్త కర్మల పాఠముల నభ్యసించిరి. కడప పట్టణమున బ్రహ్మశ్రీ కావ్యస్మృతి జనమంచి శేషాద్రిశర్మ [పెద్దశర్మ] గారి వద్ద కావ్యపఠనముజేసిరి. 1915 లో కాశీమహాక్షేత్రమునందు వ్యాకరణ శాస్త్రము నభ్యసించి 1916లో విజయనగర సంస్కృత కళాశాలలో విద్యార్థిగాఁజేరిరి.

ఉద్యోగ వివరములు:

1917లో బద్వేలు మాధ్యమిక పాఠశాలయందు తెలుఁగు పండితులుగా బనిచేసిరి. 1918లో శ్రీ పెద్దశర్మగారివద్ద జ్యోతిష భాగము నభ్యసించుచు కడప పురపాలక ఉన్నత పాఠశాలయందు సహాయాంధ్ర పండితులుగాఁ బ్రవేశించిరి. 1920 నుండి పంచాంగ సిద్ధాంతమును ప్రారంభించి పంచాంగ ముద్రణమును నడిపిరి.1923 లో కలకత్తా సంస్కృత పరీక్షలలో "కావ్యతీర్థ"1924 లో "పురాణ తీర్థ" 1927లో మద్రాసు సర్వకళాశాల (యూనివర్సిటీ) యందు. "విద్వాన్" పట్టములను వడసిరి. 1960 వఱకు, కడప పురపాలకోన్నత పాఠశాలయందు ప్రధానాంధ్ర పండితులుగా, పనిచేసి పదవీ విరమణ వడసిరి. విద్యార్థులలో భాషా జ్ఞానమును, రచనాశక్తిని పెంపొందించుటకై వారు ప్రతియేట నాలుగుసంచికలను ప్రచురించిరి. ప్రతియేట విద్యార్థిసంఘముచేత పోతన జయంత్యుత్సవములను నిర్వహింపజేసిరి. విద్యార్థులు వీరిపై ప్రేమాదరములు చూపువారు.

కుటుంబ చరిత్ర:—

వీరికి ప్రథమమున శ్రీజనమంచి శేషాద్రిశర్మ (పెద్దశర్మ) గారి సహధర్మచారిణిసోదరి యొక్క వివాహముతోగృహస్థధర్మము ప్రారంభమైనది. ఈ ప్రథమకళత్రవియోగము 1942లో జరిగినది. తర్వాత ద్వితీయ వివాహము జరిగినది. వీరికి 6గురు స్త్రీసంతానము

1918 నుండి, కడప పట్టణమునందే స్థిర నివాసమేర్పరచుకొని, 'శ్రీలలితావిలాస' మనుగృహమునందు జీవితమును నడపిరి లలితోపాసకులు, పాదుకాంత దీక్షాపరులు. స్వగృహమునసే, ప్రతి వత్సరము శరన్నవరాత్ర పూజలు దీక్షతో నిర్వర్తించుకొనిరి. శాస్త్రాధ్యయన సంపన్నులు, నిరాడంబర జీవులు.

త్రిస్కంద జ్యోతిషము, వ్యాకరణము, ధర్మ శాస్త్ర కృషి జాతక ముహూర్త భాగములు, క్రియా పరిశీలనమునందు, వీరికి మంచి ప్రవేశముగలదు.యాచించిన శిష్యకోటికి, కావ్య.జ్యోతిష, స్మార్త కర్మలు పాఠములుచెప్పుట, వీరికలవాటు. ధర్మశాస్త్ర విచార సందర్భమునందమవాదమే సిద్ధాంతముగాఁ బరిగణింపవలెననే. అభిప్రాయములేని సరళస్వభావులు కార్యాకార్య సిద్ధాంత, విచారములందు, శాస్త్రాధారములజూపి తెలియ జెప్పుటలో వీరికిగల గ్రంథావలోకన శాస్త్రానుభవము ప్రశంసనీయమైనది.

వీరిరచనలు:—

1) దేవీభాగవతము. (బృహద్రచన) 2) లలితాంబా శతకము 3) సమాసాలంకార చంధోదర్పణం. 4) ఆంధ్రవ్యాకణ సంగ్రహము. 5) దశావతారములు. 6) పదిపైగా శతకములు పెక్కుదండకములు 7) అనేక శతకములపరిష్కర్త 8) 40ఏళ్లగా పంచాగముల ప్రకటించినారు. 9) అద్భుతోత్తర రామాయణము. 10) బ్రహ్మఖండము (ఆంధ్రీకరణము 2000 పద్యములు)

లలితాంబ శతకము

(వావిళ్ళ ప్రెస్సున 1926 లో ముద్రితము)

కొన్ని పద్యములు

కం శ్రీమద్దివ్య మునీంద్ర
స్తోమ వినుత భవ్యచరణ-తోయజ యుగళా!
కామితకల్పకవల్లీ!
శ్రీమహిత, మనోజ్ఞరూప! శ్రీలలితాంబా!

కం. శంకరు, నతజనభక్తి వ
శంకరు, నిఖిలాఘపటల—శమకరునెపుడున్
గింకరుడనై, భజించెద
హ్రీంకారిణి! చిత్తమందు-శ్రీలలితాంబా!

కం. భజియించు వారికెల్లను
త్రిజగంబులగీర్తి వెలుగ-దీవన లిడి,యో
గజగౌరి! భక్తులకుం దద
రి జయము నొడగూర్తు వమ్మ—శ్రీలలితాంబా!

కం. శ్రీచక్ర మధ్యవాసిని
యాచకజనకల్పవల్లి—హరవామాంగీ!
మోచనివి భవమునకు,గౌ
రీ చరణస్మరణవీడ—శ్రీలలితాంబా!

కం. ధనమదమునం గన్నుంగా
ననివారి యకార్యముల మనంబుననెటులన్
మననంబొనర్తువో? గౌ
రి!నిత్యమిదియెంచు చుందు—శ్రీలలితాంబా!

కం. కృష్ణ,సహోదరివయి,యా
వృష్ణికులంబునను, నవతరించి, యశోవ
ర్ధిష్ణవయి, వెలసితివి,మ
త్తృష్ణం దొలగింప వమ్మ—శ్రీలలితాంబా!



కవిశేఖర—కవిత్వవేది

శ్రీయజమాన కల్లూరు వేంకటనారాయణరావు

B. A., L. T.,

M. A. కన్నడ & తెలుగు

జననము:- **6–3–1902**

జన్మస్థలము:- మరూరుబండమీదపల్లె. అనంతపురం తాలూకా.
అనంతపురం జిల్లా.

తల్లి:— శ్రీమతి కె. లక్ష్మమ్మ.
తండ్రి:- శ్రీకల్లూరు యజమాన సుబ్బరావుగారు.
మతము,కులము:— హిందూ, బ్రాహ్మణ-బడగనాడు
వశిష్ఠగోత్రము. భాగవత సంప్రదాయము.

విద్యాభ్యాసము

1) సంస్కృత విద్వాన్ ప్రిలిమినరీ 2) యం. ఎ. (కన్నడ & తెలుగు) Madras Presidency medalist in B. A. ఆంధ్ర, గీర్వాణ,ఆంగ్ల,కన్నడ భాషలను వీరు బాల్యమునుండియు నేర్చిరి. నాలుగు భాషలయందును వీరికి పాండిత్యముగలదు.

కుటుంబ చరిత్ర:—

కవిగారు స్వగ్రామమైన 'కల్లూరు' (హిందూపురం తా॥

అనంతపురం జిల్లా) బాల్యముననే వదలి, అనంతపురము చేరుకొన్నారు. ముగ్గురన్నదమ్ములలో వీరు జ్యేష్ఠులు. వీరి తండ్రిగారు చాలాకాలము ప్రాథమిక పాఠశాలలయందుపాధ్యాయులుగాను, పోస్టు మాష్టరుగాను (అనంతపురం తా॥ జిల్లా) 'ఆత్మకూరు'నందుండిరి. కవిగారికి ప్రస్తుతము పోయినవారు పోగా ఒకపుత్రుడు, [redacted] ముగ్గురు పుత్రికలు కలరు.

ఉద్యోగ వివరములు

1925లో వీరు ఎల్. టి. ఉపాధ్యాయులుగ అనంతపురములోని బోధనాభ్యసన పాఠశాలలో నియమితులైరి. 1932 సం॥ తరువాత వీరు స్కూళ్ళ డిప్యూటి ఇన్‌స్పెక్టరుగ పనిచేసిరి. తరువాత 1948 మొదలు 1956 వరకు జిల్లా విద్యాశాఖాధికారిగ పనిచేసిరి. సర్వీసుముగియక మునుపే విశ్రాంతులైరి.

ఆధ్యాత్మికోపాసన

వీరు గాయత్రీ, ఆంజనేయోపాసకులు. చిన్నతనమునుండియు, ఆధ్యాతిక చింతనగలవారు. వీరికి జ్యోతిశ్శాస్త్రమునందును, మంత్ర శాస్త్రమునందును, నమితమగు చొరవగలదు. ఓషధీవిజ్ఞులు. బాల్యమునుండియు వీరు భవిష్యద్విజ్ఞాన వాణినికలిగి యున్నారు. వీరు గాయత్రీ మంత్రతత్పరులై, కలరామున్నగు వ్యాధులచే, గాసిలు వారిని ధ్యానముచే బాగుచేసిరనియు, వీరి సలహానుసరించి గుడ్డివారికిచూపు వచ్చెననియు, అనేకులకు సంతానమును, ఋణ విముక్తి మార్గమును, సుఖజీవితయోగమును, గ్రహబాధితులు వీరి దృష్టిపాతముచేత నిరామయులైరనియు. పెద్దలు చెప్పుదురు. దేవాలయ పునరుద్ధరణమునందును, నూతనాశ్రమ నిర్మాణమునందును,

వీరి కాసక్తిమెండు. ఉద్యోగము చేయునప్పుడే వీరు విసురాళ్ళపల్లె (గుత్తి తా॥) రైల్వే కొండాపురము (కడప జిల్లా) అనంతపురము వద్ద గుత్తి రోడ్డులో, తడకలేరు గట్టున శ్రీ రాఘవేంద్రస్వామి బృందావనాశ్రమముల స్థాపించిరి. వీరు మంత్రాలయ రాఘవేంద్ర స్వామి చరిత్రను, శ్రీ రాఘవేంద్రస్వామి విజయమను పేర రచించిరి వీరి 'గీతోత్తర భాగవతము' నందు దీనిని చేర్చిముద్రించిరి.

గుణగణములు:

ముఖస్తుతి, ఆత్మవంచన వీరికి గిట్టవు. క్షణకోపులు; ఖండిత వాదులు. ఎంతటి వారినైన నిర్దాక్షిణ్యముగ మాటలాడగల స్వభావము వీరిది. అంతర్ముఖులు. వీరు పద్యమునుగాని, గద్యమును గాని తడవుకొనక సహజధారలో, యప్పటికప్పుడు జెప్పగల సద్యస్ఫూర్తిగలవారు. చెప్పినది, వ్రాసినది సాధారణముగ సవరించుట కిష్టపడరు. అందొక సహజమగు బిగియుండును. ఇది వీరి కవితా గుణసంపద.

సాహిత్య పరిచయము:—

తమ 'పుష్పాంజలి' పీఠికలో కవిగారు తమకు సాహిత్యముపై, మక్కువెట్లేర్పడినదో వివరముగా నిట్లు వ్రాసుకొన్నారు.

'ప్రమాదో—ధీమతామపి' యను, నార్యోక్తి, సుప్రసిద్ధము గురుసన్నిధిని, నేర్వక స్వీయ పరిశ్రమముచే, నించుకంత, కవిత నభ్యసించి నట్టియు, భాషాపాండిత్యములేనట్టియు, నేను రచించిన కృతులు దోషరహితంబులనుట, పొసగ నేరదుకదా. నా 14వఏట విజ్ఞాన చంద్రికా గ్రంథమండలివారి బహుమతి కాశపడి, ధనా

భావలోభములే పురికొల్ప, తెనుగు గ్రంథములు చదువఁదొడఁ
గితిని. మండలివారి ప్రథమ పారితోషికమగు. నూటపదార్లు రూ.
116-00 నాకు 1916వ, సంవత్సరమునందే,శ్రీ టి. శివశంకరము
పిళ్లెగారి,ప్రోత్సాహ ఫలితముగ లభించినది. దీనిచేఁగొంతయు
త్సాహము ప్రబలి, బాలకవులెల్లరవలెనే, గీత కవిత్వము, నవ
లానిర్మాణములకు దొరకొంటిని. వీనియందు, నాకెందుకోగాని,
విశేష మభిరుచిలేదు. భా ర త, భాగవత కథారంగములఁగై కొని
తొలుత 'కృష్ణార్జునీయము' అనునాటకము రచించితిని. శ్రీ సత్య
నారాయణ మాహాత్మ్య మారంభింప నదియు 5–6నెలలకు, నా 17వ
ఏడు నిండునంతకు, 1919 మార్చినెలలో సమాప్తమైనది. దానిని
శ్రీయుత పేరనార్య కవిగారికిఁజూపింప, వారాదరింపకయు, నిర
సింపకయు, తటస్థభావముతో, గ్రంథము కొన్నినాళ్లుంచుకొని,
"ధారాసౌలభ్యము" గుదురించు కొనుమని సెలవిచ్చిరి.అనంతరము
దానిని మాదత్తమండల కళాశాలా పండితులు, భాషాబోధకులునగు
బ్రహ్మశ్రీ వేంకటరామాశాస్త్రులు గారికిఁజూప,వారు సంతసముతో
కొన్నిదోషములను సంస్కరించు తెరువుఁజూపి కృతిపైవారికిఁగల
యభిప్రాయమును దయచేసిరి.అంత వరకును చలివిడుగలేదు. నాకు
వచ్చినట్లు నేనల్లగలనను ధైర్య మాతర్వాతకల్గి, 1921 లో సహ
ల్యాసహస్రాక్షీయమను నాటకమును, 1922 లో విజయనగర
సామ్రాజ్యమును రచించితిని.ఈ మధ్య శ్రీయుత దోమా వేంకట
స్వామి గుప్తగారి యభినందనములును, శ్రీ యుత రాళ్లపల్లి
గోపాలకృష్ణశర్మగారి సందర్భ పదశుద్ధులు, ముఖ్యములగు
హితోపదేశములును, కొంతయుత్సాహమునుఁ గల్పించినవి. సాం
సారిక కష్టపరంపరలచే జగదనుభవ మెక్కుడగుకొలదిని, రసపి
పాసయు కవిత్వాభిలాషయుఁదగ్గఁజొచ్చినవి. ఈ కా ల ము లో
ఆంజనేయకళామాలిక, రచితమయ్యెను. క్రమక్రమముగా కవిత

వ్రాయుటకే మనసొగ్గుచుండలేదు. ఇట్టితరుణమున కళాశాలకాలము నంజదివి సేకరించియుండిన విషయముల నొకచోఁజేర్చి. "ఆంధ్ర వాఙ్మయసంగ్రహము"ను పేరనొక విమర్శన గ్రంథమును 1926లో వ్రాసితిని. దానిని వావిళ్లవారచ్చొత్తింతుమనిరి. వారికివ్వ వారేండ్లు గడపిరి. అమధ్యనామిత్రులు ముద్రింపించెదమనిరి. ఆంధ్ర ప్రచారిణీ వారునడిగిరి. మూఁడేండ్లపైన, శ్రీవావిళ్ల వేంకటేశ్వర్లు గారు దానిని ముద్రించిరి.

వీరు రచించిన గ్రంథములు. ముద్రితములు.

1) పుష్పాంజలి (1929లో ప్రకటించిరి) 2) అహల్యా సంక్రందనము (నాటకము-1921) 3) శ్రీ కృష్ణార్జునీయము 4) శ్రీ రాఘవేంద్రస్తోత్రము 5) ఆంధ్రవాఙ్మయ చరిత్ర సంగ్రహము. 1926 6) శ్రీ శాంతిసమార్పిట్టు-అశోకచరిత్రము-శ్రీ శ్రీ కల్లూరు సుబ్బారాయ షష్ట్యబ్దసంపూర్తి 1958లో ముద్రణము. 7) శ్రీ వీరేశలింగయుగము 1965లో ముద్రణము. (19వ శతాబ్దపు ఆంధ్ర వాఙ్మయ చరిత్రము) 8) శ్రీ విద్యారణ్య చరిత్రము (1959) 9) శ్రీ గీతోత్తర భాగవతము VOL I. (కలియుగాది చరిత్ర కబీరు నానక్ గాథలు, మఱియు శ్రీ రాఘవేంద్రస్వామి విజయము 1974.) 10) సాధనామృతము 12) షాజహాను 1960 12) The Message of the Past And India 1964 (English) 13) పంపాభారత సంస్కృతి (Kannada-1971)

అముద్రితగ్రంథములు

1) షడ్దర్శనములు 2) ఇస్లాము తత్త్వమంజూష 3) అవిధేయ తనయ చరిత్రము. 4) ద్రావిడభాషామూలము 5) ఆధ్యాత్మిక రామాయణము.

'ప్రతి దినము మనమాచరించు సంధ్యావందన సంస్కృత శ్లోకములను ఆంధ్రీకరించి, 'సంధ్యోపాసన' యని పేరిడిరి. అందలి గాయత్రీ మంత్రమునకు తెనుగు సేత

గాయత్రీ ధ్యానము.

సీ॥ ఏదేవి తేజమహీన కాంతులఁదుల
దూగు సన్మౌక్తిక ద్యుతులతోడ
ఏధవళాస్యనేత్రేందీవరములు, వి
ద్రుమనీలహాటక రుచులఁజల్లు
ఏమూర్తియభయాంకు శేద్ధగదాచక్ర
ముల, దయా వర దానములనుఁగురియు
ఏశక్తిమకుటంబు నెల్లెడ రత్నాంత
రనిబద్ధవిధునితో రమణ సూపు
గీ॥ ఏమనీషిణికరముల నెపుడుదాల్చు
సుందరారవిందంబుల, సొబగుమిగుల
అట్టియవ్యక్త వ్యక్తిని నాత్మనరసి
కలిత తత్త్వార్థ వర్ణనుఁగొలుతు భక్తి

కావ్యపరిచయము:-

శ్రీ శాంతి సామ్రాట్టు—అశోకచరిత్రము. ప్రచురణ: 1958

అశోక చరిత్రము పరమాద్భుతమైనది. ఇంతవర కశోకుని గురించి వచనగ్రంథములును వచ్చినవి. పద్యప్రబంధములునువచ్చి నవి. అశోకజీవిక కథాఘట్టములను గైకొని రచియింపబడిన నాటికలును నాటకములును గలవు. కాని ఈయశోక చరిత్ర ప్రబంధ మనేక విధముల విశిష్టమైనది. వివిధ వాఙ్మయముల వలన దెలియ నగు గాథలేవియు అశోకుని సమగ్రజీవితమును విశద పరుపవు.

సరికదా.పరస్పర విరుద్ధములగుట వానికైక్యములేదు.వానినన్నిటిని ఆ మహారాజు ఘనతకు దగినట్లు, కార్యకారణ సంబంధమును గల్పించి, తెగి వేనికవియే విడివడి చెదరిపోయిన హారములోని వివిధవర్ణముల మణులవంటి వాని సన్నిటిని కలియ జేర్చి కూర్చి, శ్రీ వేంకటనారాయణరావుగారు ఈ యశోకచరిత్ర మను రత్నహారమును రమణీయమగురీతిని. కడు నైపుణితో, ప్రబంధించి, పాఠక లోకమునకందిచ్చినారు. అశోకచరిత్రమును నిబంధించునది యొక దివ్యప్రబంధము.శ్రీ వేంకటనారాయణరావు తమకావ్యకళానైపుణిని,వట్టి పేలపిండివలె నీరసమైన చరిత్రకు, జీవముపోసి, షట్కాండాంచిత రసవన్మధుర ప్రౌఢ నిర్వదన కావ్యముగ వెలయించినారు. ప్రతికాండమును ధారోప విభాగ శోభితము ఏతత్కావ్యావతారికయే ఒక విచిత్రప్రారంభము.—(శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మ.)

స్వతంత్రభారతమునకు ఏకైకధ్యేయము, శ్రేయోరాజ్య సంస్థాపనము. ప్రపంచచరిత్రలో శ్రేయోరాజ్య సంస్థాపకులలో ప్రాతఃస్మరణీయుడు అశోకుడు. అందుచేతనే ఈ యితివృత్తము స్వీకరింపుమని ప్రోత్సహించిన వ్యక్తి, గాంధీయుగమునందలి, అతిరథ మహారథ శ్రేష్ఠులలో నొకరగు పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు గారగుట వింతగాదు. శ్రీ కల్లూరు సుబ్బారావుగారి షష్టిపూర్త్యంకముగ నీ కృతి వెలువడుట ముదావహమైన విషయము: నవయుగ నిర్మాతలలో నొకరైన ఆ కల్లూరు వారికల, ఈ కల్లూరు వారి కలము వలన ఇట్లు అక్షరరూపమున, కలరూపు ధరించుట యెంతయు సముచితము.

ఈ కృతిని శ్రీ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి వారి కంకిత మొనర్చుచు రాయలసీమ గ్రామజీవితమును వర్ణించిన తీరు రమ్యముగానున్నది,

సీ. మా తుమ్మకొమ్మల—మా రేగుకంపల
మా జాలచేల సంసారపోశవు
మా కుందు వరదలో—మాకుంజరాఁభటి
మా పెన్నధాటిలోఁ జేపుఁపలువ
మా తరీకయ్యల—మా నల్లరేనాట
మాచౌడునేలలో—నేఁచుకలిమి
మాగండ శిలలపై—మాగండుగుండెల
కాఁపులలోని విక్రమపు బలిమి

గీ. మా తనకలాట, కపిలెల మాఱుమ్రోఁగు
గీతములలోని వేదాంత—మూఁతనీకు!
ఎసఁగె దెప్పుడు నీవుమా-కేడుగడగ:
నుంకమంకితంబిదియె! శ్రీ వేంకటేశ!

కళింగయుద్ధము.

గీ. కసిమసంగుచు వీరులుగ్రాహవమున
విలయ రుద్రులై, పరులను వీకదాకి
తుండుపడనేయఁదత్తను హింసనముల
దండధరుప్రోలుఁగనె మృత్యు తాండవములు

గీ. ఎగిరిపోవు ప్రాణముల లెక్కిడగగాదు
క్రుళ్లు పలలంబు ప్రోవులకొలతలేదు
ధనికులు, దరిద్రులెవరు? కన్గొనగరాదు
మొనగలంచుటంతయు మృత్యువునకెపాదు

షాజహాన్ (ప్రచురణ; 1960—చంద్రసందేశము)

(ఈ కావ్యము హిందూపురం శ్రీకృష్ణదేవరాయ గ్రంథ

మాల వారిచే ప్రచురింపబడినది.) 'షాజహాన్' తన చరమావస్థలో శ్రీ కృష్ణ జన్మస్థాన క్లేశము ననుభవింపవలసివచ్చెను. తనకన్న ముందు పరమపదించిన తనభార్య'ముంతాజ్' జ్ఞాపకార్థమై,ఆగ్రాలో లోకసుందరమైన 'తాజ్‌మహల్' కట్టించెను. ఒకనాటి రాత్రిజరిగి పోయిన కాలకథలన్నియు స్మరించు చుండగా, తనభార్య జ్ఞాపకము నకు వచ్చెను. పరలోకమందున్న ప్రియను స్మరించి ఆ కాశము నందున్న చలువల ఱేనిగాంచి తనభావతరంగముల నతనితో చెప్పుకొని ప్రియురాలితో, తాననుభవించిన శృంగారచేష్టను స్మరించెను. తాననుభవించువియోగ దుఃఖమును ప్రియురాలికెఱింగింప చంద్రుని ప్రార్థించెను. తానుకూడ త్వరలోనే ప్రియ జేరవాంచించెను. ఇది ఇందలి సంగ్రహకథ.

గీ. భోగిచెంగట భోగులు పొలుపుమెలపు
నలవడుటయ నిసర్గమై యమరు రమణి!
కొడుకులకుగూడ తండ్రి దుర్గుణములొలసె
నంతె! దోసంబు నీదియొక్కింతలేదు.

కుమారులు జెడిపోవుటకు తానే కారకుడని షాజహాన్ మదిలో కుంది, తానును భార్యదరిజేరనిట్లు పరితపించెను.

ఉ. చూచితి జూచితిన్ మనసు చొక్కిన ఘట్టములిట్టి వెన్నియో
నోఁచితి నిర్వురైక్యతననూన సుఖాంబుధి నీఁదులాడుటల్
ప్రోచితి వోసుశీల!ననుబూర్తిగ గొల్చియు,ముందువోయి,నే
వేచరితార్థవై తివిఁక నేనునునీదరి జేరవచ్చెదన్.

గీ. కల్లబ్రతుకను పంటలో కలుపుదీయ
నుల్లమది పల్లవించి ప్రఫుల్లమయ్యె;
అల్లకలవోలె కలగల్పు దెల్లవాఱ
తనువు నీదరి నౌరయంగ దల్లడిల్లు.

సీ. ఆఁకులో నాఁకునై యణఁగి చేరఁగజూతు
చేరులోననె యది చినుగునేమొ?
తృణ కంకణముగనై తేలిరా గమకింతు
వచ్చులోనవె యది విచ్చునేమొ?
జలదాంగ నాంకంబు చక్కనెక్కగణింతు
నదిదాటులోనవె యగలునేమొ?
కిన్నెర నాదమై విన్పొంద నంకింతు
నేగులోనవె యది వీగునేమొ?

గీ. అల యజంతసుందరియెక్కు యానమట్టి
దెగుర నుంకింతు; అనువాయు వేడదెత్తు?
భూతజాతంబు లివియేల? మూలభూత
మాశ్రయించుటె నాయాత్ర కరయలెస్స.

సానామృతము

ఇందులో 1) ఆంజనేయస్తవము 2) మానసగీత 3) గురూపదేశము 4) భాగవతసంప్రదాయము 5) వివిధసాధన యోగములు అనుశీర్షికలక్రింద శ్రీ కవిగారు పద్యములు, వచనములు వ్రాసినారు.

ఆంజనేయస్తవము

సీ. శ్రీజానకీజాని-సేవాధురంధర-అంజనాగర్భ,దుగ్ధాబ్ధిచంద్ర!
సామీరి!మారుతి సమవేగ!విజితేంద్రియ!బుధేంద్ర!ఆశ్రితా
స్యాంబుజార్క!
వానర వాహినీ-మానిత సేనాని!అమితబలైశ్వర్య!విమలచిత్త!
విశ్వసన్నుత!మహావీర!నిరంతర-బ్రహ్మచర్యానుభవ!ప్రసిద్ధ!

గీ. రాత్రిచరహంత! హనుమంత! రాణ్ణియంత!
మేరుసమకాయ! నిగమసంహిత విధేయ!
రామదూత! సమస్త వరప్రదాత!
అమరగేయ! కసాపట్టణాంజనేయ!

శ్రీ కల్లూరు వేంకటనారాయణరావుగారు పొందిన సన్మానములు

1958లో, అనంతపుర కళాశాలలో జరిగిన సభలో 'అంత రార్థ కళాప్రపూర్ణ' అను బిరుదువడసిరి.

1958, కడపయందు జరిగిన సారస్వత సభలో 'కవితా తపస్వి' యను బిరుదు నిచ్చిరి.

1968లో, అనంతపురములో, ప్రభుత్వ సన్మానము 'కవి రాజశేఖర'

1968లో అనంతపురములో లలితకళా పరిషత్తు సభలో 'ఆధ్యాత్మిక తత్త్వవేత్త' అనుబిరుదు వడిసిరి.

1969లో, రాయలకళా పరిషత్తు సభలో 'కవితానంద మనోదధి.'

చేసినయాత్రలు.

ఆసేతు హిమాచలం, రామేశ్వరాది అయోధ్య కాశీలతోకూడ, బదరీ నారాయణవఱకు, మూడుసార్లుతిరిగి, శ్రీ శైల హంపీ క్షేత్రములలో తపస్సు చేసినారు.

'నిక్కమైన మంచినీలమొక్కటిచాలు–తళుకుబెళుకురాళ్లు తట్టెడేల' యన్నట్లు వీరు నీలమువలె ప్రకాశించిరి. వీరికి 'భోజరాజు'–'కవిత్వవేది'–బోధార్షేందు–'స్వామి నారాయణ'యను లేఖినీ నామములుగలవు. రాయలసీమలో వెలసిన రాణాప్రతాపసింహ చరిత్ర, శివభారతమునకేమాత్రము తీసిపోనిది వీరి అశోక సామ్రాట్టుచరిత్ర. ఇయ్యది అఖిలభారత సాహిత్య అకాడమీ వారు సన్మానింపదగిన మహాకృతియని శ్రీనిడదవోలు వేంకటరావుగారు పలికిన పలుకులలో పొల్లులేదు. ఆ భాగ్యము మన కవిశేఖరుల కందుగాక!



బ్రహ్మశ్రీ, అభినవ, ఆంధ్ర
వాల్మీకి, కళాప్రపూర్ణ
కావ్య స్మృతి తీర్థ

జనమంచి శేషాద్రిశర్మ

జననము:– 4–7–1882

నిర్యాణము:– జూలైనెల 1950

తల్లి: శ్రీమతి కామాక్షమ్మ
తండ్రి: శ్రీ సుబ్రహ్మణ్యశర్మ
జన్మస్థలము: కడప జిల్లా, బద్వేలు తాలూకా వెంకటరామపుర అగ్రహారము.
మతము కులము: హిందూ-వైదిక-బ్రాహ్మణ-తెలుగు నాటిశాఖ కాశ్యపసగోత్రులు.

వంశచరిత్ర:

వెంకటరామపుర అగ్రహారమునందు జనమంచి వంశములో సూర్యనారాయణ సోమయాజి కలడు. ఇతని కుమారుడు శ్రీ వెంకటేశావధాని. ఇతని భార్య పేరమ్మ. ఈ దంపతుల కిద్దరు కొమారులు కలిగిరి. జ్యేష్ఠుడు శ్రీ సుబ్రహ్మణ్యశర్మ. రెండవ కుమారుడు శేషశర్మ. ఇతని కొమారుడే మనకవిగారైన జనమంచి శేషాద్రిశర్మ.

కుటుంబ చరిత్ర:

ఈ కవిగారికి సంతానములేదు. వీరి దత్తపుత్రులు శ్రీ శివకుమారశర్మ కడపలో ఉపాధ్యాయులుగా నున్నారు.

విద్యాభ్యాసము-ఉద్యోగము.

ఎనిమిదవఏటనే, శేషాద్రి శర్మగారి తల్లి గతించెను. తండ్రిగారు వారణాసికి వెళ్లిపోయిరి. 1893 లో కవిగారు కూడ కాశీచేరి, అచ్చట చక్కగా సంస్కృతమును నేర్చుకొనిరి. కావ్య వ్యాకరణముల నభ్యసించిరి. మఱల ఆంధ్రదేశమునకువచ్చి 1904 సం॥లో విశాఖ పట్టణమున, ఆగమ గణిత శాస్త్రములను, యోగ సాంఖ్యాది శాస్త్రములను, శ్రీ దాసాచార్య పండితులవద్ద

ఛందో వ్యాకరణముల నభ్యసించిరి. 1901లో కడప మునిసిపలు హైస్కూలులో, ప్రధానాంధ్రోపాధ్యాయులుగా చేరి, ఆ పదవిలో 1937 వఱకుండిరి.

సన్మానములు:

(1) కాశీనగర పండిత సభవారు 'సంస్కృతసూరి' బిరుద మిచ్చిరి. (2) వంగదేశ సంస్కృత మండలివారు 'కావ్యతీర్థ' బిరుదమిచ్చిరి. (3) త్రిలింగ విద్యాపీఠమువారు 'మహాకవి' బిరుదమిచ్చిరి. (4) ఆంధ్ర విశ్వ విద్యాలయము 'కళాప్రపూర్ణ' బిరుదమిచ్చి సన్మానించిరి.

శర్మగారు మంత్ర తంత్ర వైద్య శాస్త్రములందు నిష్ణాతులు. జ్యోతిష ధర్మశాస్త్రములందు వీరిది అసమానపాండిత్యము. శర్మ గారి గ్రంథములచ్చువేసిన 'వావిళ్లవారు' వేలకువేలు రూప్యములు సంపాదించిరి. కవిగారికి ఫలపుష్ప తాంబూలాదులు, పట్టువస్త్రములు మాత్రము దక్కినవి.

శర్మగారి గుణగణములు.

వీరనుదినమును "బ్రాహ్మ" ముహూర్తమున మేల్కాంచి కృత స్నానులై, సంధ్యాద్యనుష్ఠానములదీర్చి పరదేవిని ధ్యాన పద్ధతి నర్చించి, తదానంద సౌఖ్యము ననుభవించిగాని, యొకరితో మాటాడరు. అవ్వలనొక యేకాంత స్థలమునజేరి కవికృత్యముల నెఱవేర్చుకొందురు. పదుకొండు గంటలకా కార్యములనుండి విశ్ర మించి మఱల స్నానాధి మాధ్యాహ్నిక కృత్యములు పవిత్రశ్రద్ధతో జరపుకొని భుజింతురు. మఱల సాయంకాలమున, దేహబాధలు

తీర్చుకొని, స్నాన సంధ్యాద్యనుష్ఠానము లొనర్చి పరదేవీ పద ధ్యానమొనరించి,కొలది గడియలు సద్గోష్ఠినుండి భుజించి సుఖనిద్రc జెందుదురు.

వీరు కవిత్వము కొఱకుcగేవలము సంస్కృత కావ్యనాట కాలంకార సాహిత్యమును మాత్ర మలవఱచుకొన్న వారు గారు. సకల శాస్త్రాభ్యాస జనిత సంస్కార సంపన్నులు. అమూల్యమైన కాలమునొక్క త్రుటి మాత్రమేని వృథపుచ్చువారుకారు.అసత్యము పరవంచనము, డంబము, సోమరితనము. కృతఘ్నతయన్న వీరికిcగిట్టదు. మితభాషులు. పరమత సహనము గలవారు. కపట మెఱుంగని సరళహృదయులు. సదాచార సంపన్నులు.

శర్మగారి ముఖమండలము శాంతతేజోవిలసితము. మంద హాసమెడబాయనిది. దైన్యమెఱుగనిది, ధనసంపత్తిలేక పోయి నను, గుణసంపత్తిచే మిక్కిలి లెక్కకు రాగల్గిరి

(అధారము జనమంచివారి జన్మ దినోత్సవ సన్మాన సంపుటము)

శ్రీ శర్మగారు రచించిన పద్యకావ్యములు.

(1) హాలాస్య మహాత్మ్యము (స్కాందపురాణాంతర్గతము) 2300పద్య (2) శ్రీ లలితోపాఖ్యానము (1963 ప్ర (3)బ్రహ్మాండ పురాణము (6118 పద్య) (4) శ్రీమద్రామాయణము (24161 పద్య) (5) హనుమద్విజయము (812 పద్య) (6) తాండవ కృష్ణ భాగవతము (5185 పద్య) (7) సర్వమంగళా పరిణయము (2024 పద్య) (8) ధర్మసారరామాయణము (4735 పద్య) (9) కలివిలాసము (1010 పద్య) (10) కౌమారికాఖండము (5040 పద్య) (11) బ్రహ్మపురాణము (12) శ్రీ రామావతార

తత్త్వము (13) శ్రీ కృష్ణావతార తత్త్వము (12 సంపుటములు) (14) శ్రీమదభినవ వాల్మీకి రామాయణము (15) నీతిసింధువు (16) నీతిరత్నాకరము (17) సత్ప్రవర్తనము (18) మనుచరిత్ర పరిశోధనము (19) భగవద్గీత (వచనము) (20) ఉత్తమ మార్గము (భక్తిరస గ్రంథము) (21) విచిత్ర రామాయణము (22) భారత భాగవత, రామాయణములు (23) ఉదయగిరి ముట్టడి (24) కడప మండల చరిత్ర (25) విచిత్ర పాదుకా పటాభిషేకము (26) పాండవజ్ఞాతవాసము (27) శ్రీ రామ వనవాసము (28) విహంగ విజయము (29) భగవద్గీత (వచనము) (30) స్వప్నయాత్ర (31) నీతి కథావళి.

(పై పుస్తకములన్నియు శ్రీ వావిళ్లవారు ముద్రించినారు)

"సర్వమంగళా పరిణయము"

(ద్వితీయాశ్వాసము—హిమవంతుడు పార్వతికి హితముఁ దెలుపుట)

సీ. వ్యాఘ్రాసనంబున - వహియించి, గజచర్మ
ధారియై, విష్ణుపాదమునబుట్టి
నట్టి, గంగను-దలయందుఁదాలిచి,వృష
భంబు, వాహనముగ-బ్రజలకేవ
గలిగించు చున్నట్టి-యెలుకులు, సువిహార
భూమిగా నొప్పంగ—భూధరాగ్ర
మందు, న్యగ్రోధంబు-క్రిందఁగాపుర మొప్ప
భస్మానురాగంబు—పరిఢవిల్ల

గీ. భూరిభయద భుజంగ—విభూషణాళి
వెలయ నుండును రుద్రుఁడో-వెఱ్ఱితల్లి!
యతని వరియించి యేసుఖ—మనుభవించు
దానవో—యెన్నజాలకున్నాను నేను

ఉ. అన్నులమిన్న! ఫాలమున—నగ్నిమయాంబక మొప్పుఁగంఠమం
దన్నరొ-ప్రాణవాయువుల—నట్టెగ్రసించు హలాహలంబు, నా
వెన్నికఁగన్న దుర్విషమదెంతయు నల్లఁగఁజూడసుండు, నా
పన్నగరాజభూషణుని-వారకకోరితివంటి! నిస్సిరో!

శ్రీ ధర్మసార రామాయణము.

శ్రీ వావిళ్ల వారు దీనిని 1937లో ముద్రించిరి.

ఇందలికథ రామాయణకథయే. కాని అందందు కవిగారు లోకులకుఁదెలుపనెంచిన సద్విషయముల కనుగుణముగఁ గొంత మార్చిరి. చరాచరాత్మకమైన ప్రపంచమంతయు గర్మము నకు లోబడ్డినది. కర్మము ననుసరించి శరీరము, దాని ననుసరించియే వాంఛలు కలుగును. కర్మమును బట్టియే సుఖదుఃఖాదులు. దానిఁ దిరస్కరించి పోనెంతవారికేఁదీఱదు. విధియన్నను, గాలమన్నను నదియే.అదియ దైవమని పెక్కుతావుల కవిగారీ రామాయణములో సిద్ధాంతమొనర్చిరి. రావణుడు ముక్తికొఱకు సీతాపహరణమును గావించెనే కాని కాముకుడై కాదని కవిగారు నిరూపించిరి. ఇక్కవి చంద్రుల శైలి నించుక రుచిచూడక మానుట పాడిగాదు.

బాలకాండము 188వ పద్యము.

చం. ఒకతఱి మోహవేగమున—నొక్కనిసత్నిని బట్టుకొన్న, వే
ఱొకతఱి స్వీయదారల, మహోద్ధతి నొక్కడు బల్మిబట్టి, యీ
డ్చుకొనుచుఁబోవుచుండ, గనుచున్ దపియించుచు నుండ
గావలెన్
పకపకనవ్వి చేయు గురుపాతక మేర్వగఁజేయుఁబిమ్మటన్

సుందరకాండము 63వ పద్యము

ఉ. తావియెలేనిపుష్పము, నితంబిని లేని గృహోత్తమంబు, స
ద్భావము లేనిపల్కు, ఫలభార వినమ్రముగాని భూరుహం
బేవిధి కందనట్టి బహుశ్లేష్టద కర్మమునాగ సర్వభూ
తావితథానుకంపఁగననట్టి గుణావళి నిష్ఫలంబెయౌ

సుందరకాండము 293వ పద్యము

చం. తనపని కన్యకార్యసముదాయము హాని గనంగఁజేయుచున్
ఘనత వహించు కార్యమదిగాఁదలపోయుచు, నుబ్బుచున్దనుం
గనుగొన నీసడించు నరుగాంచి హసించుచు నుండు క్రూరచి
త్తునిఁదలపోయ రాదనుచు దోచెడు సంచు వచించు నిచ్చలున్

(శ్రీ కరణము, కృష్ణరావుగారు—బెవినహళ్లి వారు వ్రాసిన దానిలో సంగ్రహము)

తాండవకృష్ణ, భాగవతము—(దశమస్కంధము)

శ్రీ వావిళ్ల వారిచే 1936లో ముద్రితము. శ్రీ జనమంచి శేషాద్రిశర్మగారు భాగవతోత్తములు. భగవద్భక్తి ప్రతిపాదించు భాగవతమును,పోతనామాత్యునికన్న మిన్నగా రచించి లోకంబును మెప్పింప గల గరువము శర్మగారికి లేదు. ఈ క్రింది పద్యము చూడుడు.

ఉ. బమ్మెరపోతనార్యుఁడొగి—భాగవతమ్మును, దెన్గొనర్చె; మో
దమ్మలరార దానిఁగవితల్లజు లెల్లరు సంతసంబు శీ
ర్షమ్ములదాల్తు; రట్టి కృతి—సత్త్వమమున్ దెనిగించు టేలఁగ
ర్వమ్ముఁనగాక యంచుఁదెగి పల్కకుడీ! బుధులార!
ప్రమొక్కెదన్.

శ్రీ శర్మగారి కవిత్వము నాతికఠిన మృదు మధురమై, శబ్దాలంకార శోభాయమానమై, పండిత పామరజన, హృదయంగమంబై, చదువరుల కానంద మాపాదించుచుండును. పదలాలిత్యంబును, ధారాశుద్ధియు. శయ్యాపాక వృత్త్యాదులును, సముచితంబులు. వీరి కవిత్వమందొక వంతు తెనుగు పదంబులును, రెండు వంతులు సంస్కృత పదంబులుండును. వీరు శృంగారాది రసముల కన్న, భక్తిరసము చక్కగా ప్రదర్శించియున్నారు. శృంగార, వీరాది రసము లక్కడక్కడ మనోజ్ఞములుగా వర్ణింపబడినది.

అద్భుతరసము

సీ. కనులు విప్పగలేని—కసుగందుగానున్న
యప్పుడే గురుబలంబొప్పమించు
నట్టి పూతనయక మందుండి, చనుఁబాలు
ప్రాణాలతో, శరీర-బు. వయసుఁ
గాలుండు హరియించు—కరణిఁబీల్చెనుకదా!
మూడు మాసంబుల—యీడునాడె!
శకటంబు క్రిందను—శయనించి తా నుండ
పయిఁబడ వచ్చిన-బండినట్టె

గీ. యేడ్చుచుంగాలదన్నంగ—నిద్ధపాద
హతికి నాబండి, తలక్రిందులగుచుగ్రిందఁ
బడుచుఁగూలెను వత్సరప్రాయమలరు
తటినిగ్రిందను గూర్చుండ—దనుజఔకఁడు.

ఇట్లే అన్ని రసములను పోషించుచు పద్యముల వ్రాసినారు.

గోపికా వస్త్రాపహరణ ఘట్టము.

చం. అమృతము సేవచింపనని! యందఱు వీరలెఱుంగుదుర్గనుం
గొనుడు,సుమధ్యలార! యివిగో వసనంబులొకొక్కరే జవం
బున, నరుదెంచి కై కొనగ—బోలును; గుంపుగఁగూడియైనఁజే
కొనఁదగు దీననెద్దిమది గోరుదురో—యటు చేయగాదగు



విద్వత్క విభూషణ

విద్వాన్ – వేదము వేంకటకృష్ణ శర్మ

జననము:— 1899

నిర్యాణము:— 1973

తల్లి : సుబ్బనరసమ్మ

తండ్రి: శ్రీ రామయ్య

మతము.కులము:—హిందూ—బ్రాహ్మణులు—స్మార్తులు కౌశిక గోత్రులు. వైదీకులు. ములకనాటివారు వేద కులజులు.
జన్మ స్థలము: చిత్తూరు జిల్లా. కార్వేటినగరము.

కవి వంశాదులు

శర్మగారి తాతగారు శ్రీ వేంకటరమణయ్యగారు. వీరిభార్యామణి శ్రీమతి సుబ్బమాంబ.వీరికి 5మంది కొమారులు. 5వ కుమారుడైన శ్రీ రామయ్యగారు, సుబ్బనరసమ్మను పెండ్లాడిరి. వీరి జ్యేష్ఠ కొమారుడే మన కవి శ్రీవేదము వేంకటకృష్ణశర్మగారు.వీరు తమ 15వఏటనే కార్వేటి నగరమున 'ఆమ్నాయ నిలయ' మనుగ్రంథాలయమును నెలకొల్పిరి.

వీరిపూర్వులు, కార్వేటినగర సంస్థానమున చేపగడించి, రాజాదరణఁబొందిన మహనీయులు. పండిత పత్రికాండులు. మనకవి గా రుదరపోషణార్థము కడప మండల మందలి, కోడూరులోని మిషనరీలోచేరి క్రైస్తవ గ్రంథముల నాంధ్రీకరించు ఉద్యోగములో చేరిరి. 4 ఏండ్ల తరువాత, మద్రాసుచేరి శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానమువారి ఉన్నత పాఠశాలలో ఆంధ్రోపాధ్యాయులుగాచేరి, అత్యంత ప్రతిభావంతముగ తమ బాధ్యత నెరవేర్చి 1950లో ఉద్యోగ విరమణ మొనర్చిరి.

కవిత్వము:

ప్రౌఢ గంభీరశైలి. భావసంపద గల్గి పదలాలిత్యముతో గూడిన కవితనల్లగలవారు. వారి రచనలోఁగొన్ని విశ్వవిద్యాలయ పరీక్షలకు పాఠ్య పుస్తకములైనవి. రాష్ట్రీయ పండితోపాధ్యాయ పరిషత్తువారు వీరికి, 'విద్వత్కవిభూషణ'అను బిరుదునొసంగిరి.

శ్రీ శర్మగారి కృతులు.

ముద్రితములు

(1) సద్ధర్మ ప్రబోధిని. (2) కలి నిగర్హణము (3) ఆంధ్ర పాండవ గీతలు (4) శిష్య నీతిబోధినీ శతకము (5) తోడేటి దొరతనము (6) భక్త కల్పశతకము (7) ధర్మ విమర్శనము. (8) కుందమాల (9) భామినీ విలాసము (10) ఊరు భంగము (11) తేనెసోనలు—3 సంపుటములు. (12) భక్తవత్సల శతకము (13) శ్రీరామ (లక్ష్మీ) స్వభావము (14) శ్రీ సోమ శేఖరీయము (సభారంజన శతకము) (15) శ్రీ కృష్ణశాస్త్రీయము(కలివిడంబన శతకము) (16) నెహ్రూశ్రీ కావ్యము (17) అభినవాంధ్ర కాదంబరి (18) శతక వాఙ్మయ సర్వస్వము(సం.I.) (19) శ్రీ ఆంజనేయ కవీయము (చారుచర్య)

అముద్రితములు.

(20) పద్మ పాత్రిభృతకము (21) బాల భారతము (22) మహాపురుష శతకము (23) ఝాన్సీ మహారాణి (24)భక్తి యోగము (25) ఆరణ్యకజాతులు (26) తేనెసోనలు (సంపుటి4) (27) మహేశమాల (సంస్కృత శ్లోకములు) (28) విష్ణుమహా మాయావిలాసము (29) బౌద్ధ ధర్మదీక్ష. (30) శతకవాఙ్మయ సర్వస్వము (సంపుటముII) (31) సుభాషిత రత్నమాల.

కవిగారు తమ కులదైవమగు, శ్రీ వేంకటేశ్వరుని సంబోధించుచుఁ జెప్పిన పద్యములలో, వారు వాపోయిన విధమును జదువుచో నేరికి గుండె నిబ్బరముగ నుండఁగలదు? బంధువుల నిరసన భావము, దైవదర్శనమునకు ధన శక్తి లేమి-తిరుపతిగొంటి

గింపులు—లక్షలాదికొన్కలు ప్రోఁగగుచున్నను వేంకటపతి భక్తుల కొక్కకానైన నిడమి—మున్నగు ప్రసంగములు దడవి భగవంతుని విష్ఠరము లాడునంతటి యవస్థకీకవిగారిని అప్పటి పరిస్థితులు ప్రేరేచినవి. క్రింది పద్యములోని కవీంద్రుల నిర్వేదముం గనుఁడు:—

చం. "పరమదరిద్రతాదశకుఁ బాల్పడి, వ్యాధుల బాధల న్నిరం
తరము శ్రమమ్మునొందుచిటు నాదగు జీవిత మెన్నినాళ్లిలం
జరుపుదు? నింక నేని, నను సాదరదృష్టిని జూడనెంచ,కీ
యరమర లేల చేసెదు? రమాధిప! వేంకటశైల మందిరా?"

వీరికి దీర్ఘకాలముగ నుదరశూల గలదు. ఆపీడ వీరిని వదలినదికాదు. అందులకై యెన్నిచికిత్సలో చేయించుకొనిరి. ఫలము తాత్కాలికాపాయమే; వ్యాధి నివారణము మాత్రము శూన్యము. ఆమయమతిశయించి, సంసారపుఁదగులాట మెక్కువైనపుడు వీరి యావేదనము హృదయ విదారకము. చూతుఁడు:

చం. "నలుపదియేండ్లకే తనువునం గడు నీరసభావ మేర్పడెన్;
నలిగెను సంధిబంధము;ల నంతరుజల్ పయిఁ గానిపించె; దు
ర్బలతఁ గృశించె నంగములు; ప్రాణములుం బరువంచుఁ దోఁచె; నెం
దుల కిటు కష్టపెట్టుదువొ? దుర్జనశిక్షక! సాధురక్షకా!"

ఈ శారీరికానారోగ్యస్థితి యొకవంక బాధించుచుండ, జ్ఞాతులు-బంధుగులు "తాము మాత్ర మూరకుండుటయా?"—యని వీరిని ముప్పతిప్పలు పెట్టి, మూఁడు చెఱువులనీరు త్రావించి, న్యాయస్థానములకు సయితము లాఁగిరి.

కోడూరుపురమున 1939 వ-సం॥రమున శ్రీ సుగాసి గురవయ్యగారను మిత్రులు నివేశస్థలము నుచితముగ నొసంగ గృహ

నిర్మాణమునకుఁ బూనుకొనిరి. అట్టియెడ నావశ్యకమగు ధనాధికము నీకవిగారికి ఋణమొసంగఁ గొందఱు మిత్రులును శిష్యులును వాగ్దత్తమొనర్చియుఁ దుదకు మొండిచేయి చూపిరి. 25 ఏండ్లు సాంసారిక జీవనము గడపియు వీరికి పుత్రుడు కలుగలేదు. 1945 వ సంవత్సరమున వీరికొక కూతురు జన్మించెను. అప్పుడు లభించిన సంతసము వర్ణనాతీతము ఈమెయే "ఉదయరంజని"

ఒకప్పుడు, 'కీళ్లవాతము' సంభవించి, ఎడమచేయి పైకెత్తుటకు వీలుకాలేదు. అట్టి సమయమున, వీరు డబ్బు పోగొట్టుకొనుట తమ్ముని కుమారుఁడు మృతినొందుట, 'వీరికి ఉదర శూల' ప్రకోపించుట, వెంటవెంటనే సంభవించినవి.

అన్ని ఇడుముల, ప్రశాంత స్వభావముతో, భగవంతునిపై, భారమువైచి కర్మఫల మనుభవించిరి.

సన్మానములు;

ఈ కవిగారిని, కడప జిల్లా రాజంపేటవారు 1961వ సంవత్సరములో శ్రీమాన్ మాడభూషి అనంతశయన మయ్యంగారి అధ్యక్షత క్రింద సన్మానించిరి. ఆ సన్మాన పద్య పంచరత్నములలో ఒకటి తిలకింపుడు.

సీ. అనువాదములొనర్చి-యాంధ్రులడెందమూ
గించినావు; రసాన-ముంచినావు.
బహుళ స్వతంత్ర కావ్యములు రచించిపే
రందినావు; మునమ్ము-నెందినావు
రాజకీయముల, దుర్వాదములను, విమ
ర్శించినావు; ఋతమ్ముఁ బెంచినావు.

అంతే వసద్వర్యులలరఁగై తలను, నే
ర్పించినావు; కృతులఁబంచినావు
భూరి, "విద్వత్కవి—భూషణ" బిరుదమా
ర్జించినావు. యశమ్ము నించినావు
గీ. మేలి, రాయలసీమ, రత్నాలసీమ
యంచు, వావాదులన్నిర్ణయించినావు.
భారతీ పదపద్మ మంజీరరుతుల
గృతుల నినదింపఁజేసి జీవించినావు.

కావ్యపరిచయము

ఆంధ్రభామినీ విలాసము.

ఈయది అనువాద గ్రంథము. దీనిని సంస్కృతమున పండితరాయలు 'భామినీ విలాస' మనుపేర వ్రాసిరి. "—————ఈ కవి రాజాస్థానములలో నుత్కృష్టతమ మనదగు ఢిల్లీ మొగలుల యాస్థానము నందుండిన వాఁడగుటచే నతని యన్యాపదేశము ప్రతిమములయినవి. మిగిలిన కథలెట్లున్నను, పండితరాజు ఢిల్లీ మొగలుల నాశ్రయించియుండెననునది నిర్వివాదాంశము. అతఁడు-అక్బరు షాజహానుల కాలములలో జీవించియుండె ననుచున్నారు. షాజహాను కుమారుడగు 'దారా' కుపండితరాయల యందపరిమితమగు నభిమానముండెను. కాని, దారా ఢిల్లీ సుల్తాను కాకపోవుట పండితరాజు దురదృష్టమని చెప్పవచ్చును. దారా మరణముతోఁ బండితరాజునకు ఢిల్లీ సంబంధము తెగియుండవచ్చును. పండితరాజు తన వార్ధక్యమును మధురలో గడపి యచటనే మరణించె నందురు.

'భామినీ విలాసము' నాలుగు భాగములుగా నున్నది. అన్యోక్తి సముల్లాసము, శృంగార సముల్లాసము, శాంత సముల్లాసము

కరుణ సముల్లాసములని వాటికి పేర్లు. ఈ నాల్గింటి లోనుకలిసి ౧౫౦ ప్రక్షిప్త శ్లోకములకును, శ్రీ వేంకటకృష్ణ శర్మగారు తెనుగు పద్యముల రచించిరి.

(ఆంధ్రభామినీవిలాసము-ఉపోద్ఘాతము)

అందలి కొన్నిపద్యములిందు పొందు పరచితిమి.

(1950) భామినీ విలాసము-శృంగార సముల్లాసము,

ఉ. రాతిరి యేగుదెంచె నుడురాట్కరముల్ హరిదంతరంబులన్
బూఁతలుపూసె, భామినులు భూషణముల్ ధరియించిరిండ్ల,రో
షాతిశయంబువీడ విసు మంతయు, నింకను, దాననేమగున్?
లేఁత బిసంబుకన్నఁదరుణీ! కృశమై మెయిచిక్కె నక్కటా!

ఉ. బంగరుబొమ్మ! నీవు ముఖవారిజమందు వికాసలక్ష్మిఁదా
ల్పంగని, లేమిఁగీడ్వడుఁగలానిధి, పున్నమ నోలునష్ట, యెం
దుంగడు నీలిమంగలువతోటలలర్చు, దిగంతరంబు లు
ప్పొంగును గాంతితోఁజెలఁగు మోదమునిండ సుహృజ్జనంబులున్

కుందమాల (1948)

(శ్రీ దిఙ్నాగాచార్యకృతికాంధ్రీకరణము)

ఇయ్యది షష్ఠాంకముల నాటకము ఇందులో, కొన్ని పద్యము లిట నుదహరించినాము, లక్ష్మణుఁడుః ఆర్యురాలి కొఱకీ భగవతిని వేడి కొందును.

గీ. కమల గంధ కృతాధి వాసముల, విమల
వీచికానిలముల, శ్రాంతి విసరుమమ్మ!
త్రిషవణస్నానమాడుచో-దేవి! మూర్తి
మంబు, వేగంబుఁదగ్గింపుమమ్మ! గంగ!

గీ. ఈ వనంబునఁగల యోముసీంధ్రులార!
ఇదిగో, కేల్వేర్చి తలను, బల్కెదనుమీకు
లేమ, త్యక్త, యశరణ, కులీనయంచు
భగవతి యటంచు, దయఁగనఁదగును దేవి!

గీ. అంజలి, ఘటించి, వనదేవతాళికిదిగో
విన్నవించెద-క్షణమిది వినునుగాక!
నిదుర యందాపదను గష్టమొదవుతరిని
పూన్కి-భగవతులీమె నోముదురుగాత!

గీ. సకులు నదులార! దిక్పతుల్-స్వాములార!
జనని గంగాసహోదరుల్-శైలరాజు
లార! యిదిగో! లక్ష్మణుఁడు పల్కెఱు వేఁడు
నృపసుతం గావుఁడీ పూన్కి-నేను జనుదు.

★ ★



విద్వాన్ కవితానంద, శతావధాని,
అష్టావధానదక్ష.

శ్రీ సోంపల్లి సంపత్ కృష్ణమూర్తి

జననము: 1913

నిర్యాణము: 29–1–1969

తల్లి : మంగాంబ

తండ్రి: సంజపాచ్యుడు

మతము,కులము: హిందూ—బ్రాహ్మణ స్మార్తులు

నివాసస్థలము:— కొక్కంటి—కదిరి తాలూకా—అనంతపురం జిల్లా

ఉద్యోగము:— 1941వ సం॥ నుండి ప్రధానాంధ్రపండితులుగా కదిరి ఉన్నత పాఠశాలలో పని చేసిరి.

గురువులు:— విద్వాన్ కవిసార్వభౌమ, అభినవబాణకవి, ఆశుకవి చక్రవర్తి, శతావధాని శ్రీ గౌరావజల రామకృష్ణ సీతారామ సోదరకవులు. అనంతవరం. అగ్రహారం. (నెల్లూరు జి॥)

కుటుంబ చరిత్ర

శ్రీ కవిగారి ఇంటిపేరు సోంపల్లివారు. వీరు శ్రీ రామచంద్ర, బాలాత్రిపురసుందరీ పాదసరోజ సేవా పరాయణులు. మంగాంబా,నంజపార్వతనూభవులు.'ఉల్చుకమ్మ' యను తెగకుజేరిన విప్రులు. విశ్వకళాశాలవారి, విద్వత్పరీక్ష యందారితేరి, సంస్కృతాంధ్రములయందుఁ బాండిత్యమును, సంపాదించిరి.

ముద్రితకృతులు

(1) భక్తరక్షామణి (పద్యశతము) (2) ఆపదుద్ధారక స్తోత్రము (3) వాసవీ విలాసాభి రూపకము (నాటకము) (4) మల్లికార్జునదైవవినుతి (5) రామాస్త్రము (6) పుష్పవిలాసము (7) కవితానంద వాల్మీకి రామాయణము 2సంపుటములు

అముద్రితములు

(1) సతీతిలక (నవల) (2) ఆంధ్ర వ్యాకరణ వివరణము (3) శంకర విజయము (హరికథ ముద్రణము) (4) ఆంధ్ర

సూర్య శతక టీక. (5) దైవజ్ఞ భూషణము (6) సత్యనారాయణ వాచకములు ఐదు. (7) కొక్కొంటిపాళెగారి చరిత్ర

కావ్యపరిచయము

ముద్రిత గ్రంథము కవితానంద వాల్మీకి రామాయణము (బాలకాండము) నుండి కొన్ని పద్యములు. ఈ గ్రంథము 1940 నందు ముద్రింపబడినది.

దశరథుఁడు రోమపాదునకుఁ దన కూఁతురగు శాంత నొసంగుట.

తే. ఆ మహీపతి, హితుఁడైన-రోమపాదు
నకు నొసంగెను దనదు శాం-తాకుమారిఁ
దనయఁగా, రోమపాదుండుఁ-దత్కృతమున
కాత్మసంతసమందుచు-నరిగెఁ బురికి

మ. ప్రవినీతుండగు రోమపాదునిజరా-ష్ట్రం బందనావృష్టిసం
భవమయ్యెన్ మునిఋష్యశృంగుఁ బిలిపిం-పం బూనియా
తండు మేల్
జవరాండ్రన్ వెలయాండ్రనాశ్రమము ప-జ్జం జేరఁగా బంపె వా
రవునౌనంచు నుతింపఁగాఁదగిన నా-య్యారంబు దీపింపఁగన్.

క. అమలవిభాండక మున్యా
శ్రమమును జేరంగ నరిగి-చయ్యన వేశ్యా
రమణులు సంకీర్తవిలా
సములును మతినృత్యవాద్య-సంగతులలరన్

తే. శ్రీ విభాండక సుతుఋష్య-శృంగు జూచి
కౌఁగిలించుచు నగవుల-గ్రమ్మ వాక్య
ములను సత్కారములఁగడు-మోహ వశునిఁ
జేసియాతనిఁ దమ వెంట-జేరఁ బిలిచి.

తే. రోమపాదున కర్పింప-నామునీంద్రుఁ
డడుగుపెట్టిన మాత్రనా—పుత్రమియందు
మంచివానలు కురిసెస—మంచితముగఁ
బాడి పంటలు పొలుపొందె—భవ్యమహిమ.

కవితానంద వాల్మీకి రామాయణము
(యాత్రా కాండాదికము—ప్రచురణ—1966—67)
—: సీతను లక్ష్మణుడు వనభూముల విడుచుట:—

ఉ॥ అన్నకు మ్రొక్కి-సీత నిలయంబునకుంజని తేరువచ్చె;రా
మన్నయు నీదుకోర్కి కయి-యమ్మనిపల్లెయు వాల్మికాశ్రమం
బున్నపొలాన నిన్విడిచి-యూరికి రమ్మని చెప్పెలెమ్మ; నీ
పున్నెపు పంటయెట్టిదియొ? పూనుమిదే! వదినే!రథంబుపై.

కం. ఆ క్షితిజాతకు నదరెను
దక్షిణనేత్రంబు వఱకు-దరిఁబొరి యఱచెన్
బక్షులవి, యక్రమముగ, స
నుక్షణమును నరదమును గనుంగొనుచరిగెన్.

ఉ. హేతువెఱుంగరామిఁదన హృత్కమలంబు చలింప, మేదినీ
జాత, యిదేమి?లక్ష్మణ!విచారముగల్గెడు నీ ప్రయాణమే
భీతిగఁదోచుచుండె; నడవిన్ శకునంబులు చెడ్డవయ్యె! భూ
నేతకు రామచంద్రునకు నిత్యశుభంబును క్షేమమౌఁగదా!

కం. అనియడుగ, నతనిక్షేమం
బున, కేమి కొఱంతలేదు-పుణ్యాంగనలా
మునిపత్నులె—నినుబ్రోతురు
మనమున నిబ్బరము గలిగి—మసుమ నెనతడున్

ప్రాఁత—క్రొత్త.

సీ. రాజులరాణుల-రాజ్యసంపదప్రాఁత
సర్వంబునకు, నరాజకత క్రొత్త
హరిహరపూజాదు-లాచరించుటప్రాఁత
హరిజనోద్ధారకులగుట క్రొత్త
అన్నసత్రములలో—నాదరించుటప్రాఁత
అన్నమే యిదనట్టి-యఱవుక్రొత్త
వలసిన ధాన్యంబు-గలిగియుండుట ప్రాఁత
తిండిగింజలులేని—స్థితియెక్రొత్త

గీ. కులమతాచారములువిల్వ కొనుటప్రాఁత
కులమతాచారములుకూల్చ-కొనుటక్రొత్త
తారతమ్యము తెలియు వర్తనముప్రాత
తారతమ్యములేని, వర్తనముక్రొత్త

సీ. పరపురుషునిఁగాంచి-తరుణిజంకుటప్రాఁత
పరతృప్తికై వెంటఁబడుటక్రొత్త
ఇల్లాలుతనయింటనీలువ-దుటప్రాఁత.
రచ్చలఁదిరుగాడుమెచ్చుక్రొత్త
బూటకాలకులొంగి పోవకుండుటప్రాఁత
వానికై యలవాటుపడుటక్రొత్త
అలముఖస్తుతిగమాటాడకుండుటప్రాఁత
ముఖనుతివెన్క—దుర్బుద్ధిక్రొత్త

గీ. కార్యమునఁద్యాగశీలముల్ గనుట ప్రాఁత
అవి, యుపన్యాసములయందెయగుట క్రొత్త
చెడ్డచెడ్డదె-మంచి మంచిదియెప్రాఁత
చెడుగు మంచిది-మంచిది చెడుగుక్రొత్త.



వైద్య విద్వత్పండిత సత్కవి

నారు నాగనార్య

జననము: 3-7-1903

నిర్యాణము: 18-1-1973

తల్లి:- శ్రీమతి సుబ్బమ్మ

తండ్రి:- శ్రీ నరసింహము.

జన్మస్థలము:- కడపజిల్లా- రాజంపేట తా॥-రాఘవరాజపుర అగ్రహారం (రైల్వే కోడూరు ప్రక్కన)

మతము-కులము:- హిందూ-తెలికకులము

విద్యాభ్యాసము:

నెల్లూరుజిల్లా వెంకటగిరిలోని అష్టావధాని అల్లాడి జగన్నాథ శాస్త్రిగారివద్ద చంధస్సు, అలంకారములునేర్చిరి. శ్రీ జనమంచి శేషాద్రిశర్మగారివద్ద శ్రీ విద్యోపాసనముగావించిరి.

దేశసేవ:-

వీరు స్వాతంత్ర్య ప్రియులు. దేశసేవాగ్రగణ్యులు. 1921 లో సహాయ నిరాకరణోద్యమమునచేరి, 1924 వరకు నెల్లూరు పల్లపాడు గ్రామములందు సత్యాగ్రహాశ్రమనివాసులై ఖద్దరుసేవచేసిరి. 1923 నందు నాగపుర సత్యాగ్రహిగా జైలుశిక్ష ననుభవించిరి. 1947 నందు 'వ్యష్టి' సత్యాగ్రహమునపాల్గొని చెఱసాలకువెళ్లిరి.

శ్రీమహాత్మాగాంధీ నిర్యాణమువరకు కాంగ్రెసు సేవనొనర్చి తదుపరి కాంగ్రెస్సువదలిరి. 1949 నుండి సాహితీక్షేత్రమున కృషీవలురై నందనోద్యానవనమును వెలయించిరి.

సాహిత్యసేవ:

వీరికి సంస్కృతాంధ్రము అభిమాన భాషలు. వీరికి కవితా వేశముమెండు. ఏకధాటిగా వందలకొలది పద్యములనల్లెడి శక్తి గలదు. వీరికి అచ్చతెనుగుపై అభిమానముమెండు. అందులకేవారి డెబ్బదికృతులలో ఆ అచ్చతెనుగుకృతులు మేల్బంతులైనవి. భాషా భిరుచిగలవారికవి సరికొ్రొత్తవిందులు. వీరు పెద్దన్నగారి మను చరిత్రమును-'మనువుపుట్టువు' అనుపేరను, ముక్కు తిమ్మనార్యుని పారిజాతాపహరణమును-'మెచ్చులపచ్చముచ్చిలి' యనుపేర సరి యగు యచ్చ తెనుగున రూపొందించిరి. తరువాత ఈ పోకడలోనే మరికొన్ని అచ్చతెనుగు కబ్బములు-శకుంతల, ఊర్వశి, వెన్నెల పెండ్లి, రామకథలు వ్రాసిరి.

గీ॥ నాయెడఁదఁ బొంగువాఱుచున్నది యయారె!
తల్లిబాసగు తెనుఁగున కుల్లమలర
నేమికానుకయిత్తుఁ గెంపెడఁదఁజీల్పఁ
బొడము నెత్తురు పారాణి పూఁతఁదప్ప!

కం॥ పలువురు జదువని వ్రాఁతల
వలనన్ మేలేమి యంచుఁబలుకుట వినియున్
వలనొప్పఁ దల్లిబాసను
బలుకుటఁ దప్పేమియంచు-వ్రాసితి దీనిన్

యని కవిగారు తమ అభిప్రాయమును అచ్చతెనుగు పారిజాతాపహరణమున తెలుపుకొనిరి. ఈ కృతినిగురించి మహాకవి శ్రీ గడియారము వేంకటశేషశాస్త్రిగారిట్లు వ్రాసిరి.

"———శ్రీ నాగనార్యుఁడు పల్లెలయందే నివసించి, అందలిజనులతో విశేష పరిచయము కలవాఁడైనందున, ప్రాచీన ప్రబంధముల క్షుణ్ణముగా చదివిన వాఁడైనందున, కావ్యజ్ఞ శిక్ష పొందిన వాడైనందున తనరచనకు వలసినంత పదజాలము సంతరింపఁగలిగినాఁడు. తక్కువపడిన దానిని సృష్టించుకోఁ గలిగినాడు అన్నింటిని పులుగడిగి రంగురేకలుదీర్చి మెఱుగులు దిద్ది అందమైన కావ్యశరీరము నిర్మించినాడు. ఈ చేయుటలో చేయివణకుటో, చూపు చెదరుటో, సంధికదలుటో, బంధమువదలుటో యేదైన ఏమఱు పాటుజరిగియుండవచ్చును. అదియు క్రొత్తకాదు. ఇంత కొ్రిత్త చేయుచున్నను కవిత సహజముగా సరళముగా కుంటువడక నడచినది. కథాకథనము, భావ చిత్రణము, అలంకార విన్యాసము, మున్నుగా కావ్యసంపద యంతయూ మూలమునకే చెందిన దైననూ తనకూర్పులో వానిని యథావిన్యాసముగా పొదుగుటయే యీతని నేర్పు. ఈ విధముగా ఈ నాటికవులలో నాగనార్యుడొక క్రొత్త దారితొక్కి కృతకృత్యుడైనాడు"

మచ్చునకుగొన్ని పద్యములు చూడుడు

మ॥ పనిపాటుల్ విడియూరు నాడుఁ దిరుగన్ బాల్వడ్డ బైరాగి పో
రనుతిండిన్ బ్రదుకంగలాడచటికాహా! వచ్చెనా! వచ్చియే
మనిచెప్పెన్ మనయందగాఁడు బదులేమందించెఁగన్గిటి రు
క్మిణి యేమాడెను డాఁప కంతయును గూర్మింబల్కరాదే!చెలీ!

కం॥ దాసానిరంగు చీరఁ
బాసి, వెలఁది మడుఁగుఁగట్టి-పంచల సొమ్ముల్
వేసి, కయిదమ్మిఁదునుకలు
సేసి, చెలిఁ గొదుకు బ్రదుకుఁ—జిడిముడిపడుచుఁ

కం॥ సీరున్నకాఱు మబ్బున
జేరిన రిక్కవలె 'సత్య'—చెలువంబతిపం
చారించి యలుకగీమున
దూరెను సకులలుగఁ జేయుదురుగద! యిట్టుల్

కడప మండలమునజరిగిన యొక ప్రాచీన విషయమును గై
కొని కవిగారు 'వీరపూజ' యనుపేర నొక వీరరసోదంచిత కావ్యమును లిఖించిరి. ఇందు హైందవులకుఁ బ్రాచీనకాలము నుండియు సహజములుగ నుండు వీర్య శౌర్యౌదార్యములు చక్కగా వివరింపబడి యున్నది. 'శృంగార వీర కరుణాద్భుతాది రసములనెల్లను నలంకార శాస్త్రమునఁజదివి యుదాహరణముల నెఱుగుటకంటె నీ గ్రంథమునఁజదువుట యే చాలును' అని శ్రీ జనమంచి వేంకట సుబ్రహ్మణ్యశర్మగారు తమ యమూల్యాభిప్రాయమును నుడివిరి.

వీరపూజయందలి వీరవిహారమెట్లున్నదో కనుడు

శా॥ వాగర్థంబులవోలె నిర్వురొకటై వైరిప్రకాండంబును
ద్వేగాకంపిత దేహవల్లరులరీతిఁ స్వప్రతాపక్రియా
వేగోదీర్ణ బల ప్రభంజనతఁ గల్పింపఁ సముద్దిష్ట దీ
క్షాగర్వంబునవేళ్లపై నుఱుకువ్యాఘ్రంబుల్ వలెఁ దూఁకినన్.

కం॥ బలవన్నాగవరంబే॥
జవిచీమల చేతఁజిక్కి చచ్చినయటులీ
బలియుఁడు మాచే సిలుఁగుల
గలఁగఁడె యిపుడొంటి పాటు గదిసినకతన॥

మ॥అనియుబ్బొంగుతలంపుల॥ బెనఁగు మిథ్యాపౌరు షోద్రేకసం
జలితక్రోధ విఘూర్ణ నోత్థచటులోచ్చాయ క్రియ॥ బ్రాఙ్మనో
జనితాఖండజయేప్సితార్థ ఫలమిచ్చాస్ఫూర్తి నర్థించి, మిం
చిన వేగంబున వీరుపైఁ గవిసి నిస్త్రింశోగ్ర ధారాహతిన్.

యుద్ధమెంత వీరోచితముగా జరిగినదో రచనయంతకుమించిన భావోద్రేకము తోడను, భావపుష్టితోడను, యర్థగాంభీర్యముతోడను పదగుంఫనముతోడను సాగినదనుటలో యతిశయోక్తి లేదు. ఈ మండలమున వెలసిన రాణాప్రతాపసింహ చరిత్రకు, శివభారతము నకే మాత్రము తీసిపోనిదీ వీరపూజ. ఒకేగడ్డలో పుట్టిన బిడ్డలలో వీరావేశము అడ్డులేక విహరించినదని గట్టిగాజెప్పవచ్చును. వీరి మరొక చారిత్రాత్మికమైన వీరరసకావ్యము శ్రీపృథ్వీరాజవిజయము

కం॥ అదియేమొ? వానికత్తికిఁ
బదునెక్కడనుండి యూడిపడెనో? శిరముల్
బదులును వందలు వేలును
జిదగొదయై త్రెళ్ళిపడుఁఖచిక్కనులోనన్

గీ॥ పిడుగు వడునట్లు దండుపైఁబడియవకర్రి
విక్రమాటోపమునవైరి వీరసమితి
జౌన్నతఱిగిన జెన్నాన నొరిది నఱకి
బీడువడ రణతలమెల్ల గాడుఁజేసె.

పై రెండును పృథ్వీరాజవిజయమందుయుద్ధ ఘట్టమున జెప్పబడిన పద్యములు. కవిశేఖరులు నిజముగా వ్యవసాయదారులే. లేకున్న వారికి యుద్ధవర్ణన చేయునప్పుడుకూడా జొన్న చేనుల కోతపైనున్న ధ్యాస తప్పలేదు. ఇది స్వభావికమేగదా!

వీర రసమునెంత చక్కగా వీరుపోషించిరో, అంతే చిక్కగా శృంగారమును సహితము మథించిరి. వీరి 'తిలోత్తమాసాహసికము' 'తిలోత్తమ' ఉషారాజ్ఞి—ధాన్యమాలిని-ప్రణయిని-యెన్నదగిన శృంగార కృతులు "మా పండితుడు, ముసలితనములో నప్సరసలతోడి సంబంధము నెందుకు పెట్టుకొన్నాడో! ముసలి తనము రెండవ బాల్యమన్నారు పెద్దలు-" అని 'పుట్టపర్తి' వారన్నమాటలో వింతలేదు. నిజముగా ముసలిప్రాయమున శృంగారముప్పొంగు ననుట తథ్యముదాని నీకవీశ్వరులు దృఢపరచిరి.

ఉ॥ గుత్తపు పట్టుపైకబిగి కుట్టు పటుక్కునఁ బిక్కటిల్లి స్వా
యత్తముఁ దప్పిపోఁ బ్రిదిలి యబ్బుర పుబ్బగు గబ్బిగుబ్బలు
వ్వెత్తున నొత్తరించివలపింపఁగవుంగిటనించి పల్లు కెం
పొత్తిలి మోవితేనెఁజవులూరఁగొనెన్"విధుఁ"డా"తిలోత్త
మన్"

ఇది ప్రాచీన కవుల ప్రబంధములందలి శృంగారమునకే మాత్రమతీసి పోలేదుకదా! ఇంత చక్కటి కవిత నెంతమంది కవి పుంగవులు వ్రాయగలరు? ఒక్కరో యిద్దరోతప్ప. కవియిట్టి వాడగుట చేతనే పలువురు వీరి కవిత్వమును ప్రశంసించిరి. శ్రీ జనమంచి వేంకట సుబ్రహ్మణ్యశర్మగారు తక్కువ వారేమికాదు గదా! అట్టి మహనీయులీ కవినెట్లు పొగడిరో జూడుడు.

"——————ఈ గ్రంథకర్త తెలుంగులోకమునకుఁ జిర పరిచితుఁడు. కడపమండలమున శ్రీ శేషాచల సమీపమునఁగల కోడూరు గ్రామ వాస్తవ్యుఁడు. కుంజరనదీ సలిలపాన ప్రభావ సంజనితదివ్యకవితామృతవాగ్విశారదుఁడయ్యు శ్రీవేంకటాచలదివ్య పర్వతసాను విలసిత మహౌషధీ పరిపూత మలయమారుత సేవా సంప్రాప్త సారస్వత రస పరిపూర్ణుడు నారునాగనార్యాభిధానుఁడు. సహజకవితావిచక్షణుడు. ఆర్యవాణీ రచయిత - దేశ సేవా గ్రగణ్యుఁడు. స్వాతంత్ర్య ప్రియుడు. లోకోప కారనిరతుడు. దేశాభిమాని. వైద్యవిద్వరుఁడు. దేవ బ్రాహ్మణ గురుజన భక్తియుక్తుడు. సుకవిత్వలంపటుఁడు. లోకక్లేశాసహిష్ణువు. ఇట్టి సుగుణంబు లెన్నియేనిగలవాడు. ఈ మాటలు స్తుతి పాఠములు కావనియు, సహజములనియు, దత్త్వవిమలూహింపక మానరని నా విశ్వాసము." (వీరపూజ—ఆశంసనమునుండి)

ఇంతకంటెను కావలసినదేమున్నది. కవిధన్యుడైనాడు. అతని జన్మకు సార్ధకతేర్పడినది. కవికావ్యముల కొకగొప్పవిశిష్టతేర్పడినది. బిరుదులు, సన్మానములు పై వాక్యముల ముందు దిగదుడుపే

యుక్తాయుక్త విచారదశ వచ్చినప్పటినుండియు వీరి బుద్ధి యాధ్యాత్మిక పథము వంకకే యుఱుకులెత్తసాగినది. శ్రీ భగవాన్ రమణ మహర్షులాతని యాత్మ విద్యా జిజ్ఞాసకు మార్గోపదేష్టలు. బాల్య, యౌవన మధ్యకాలమున వీరుత్సహించి, దిగి, లోతు పాతులరయని ప్రాపంచిక విషయములులేవు. బ్రహ్మజ్ఞానార్జనను వీరు త్రికరణశుద్ధిగా విశ్వసించిరి. శ్రీ రమణాభ్యుదయమే వీరి కాత్మానందము. వీరు శ్రీరమణ మహర్షి పావన జీవితమును ధారాశమగు శైలిలో పద్యకావ్యముగ వ్రాసి,యిటు గురుఋణము, నిటు తెనుఁగు వారికొఱఁతదీర్చి సార్థక జన్ములైరి.

సీ. ఇదియె జీవితమునఁదుది నిముసంబని
తోఁచె విస్మృతి కొంత తొంగి చూచెఁ
బ్రబలి తోర్ధ్వశ్వాస పరుగులు వారెనన
య్యెడనున "రమణమహర్షి" తల్లి
నేకాగ్రదృష్టి లక్షించి దక్షిణహస్త
మునుమాతృ హృదయమందునిచి వామ
కరము శిరమ్ముపై నొరయింప నంతఃప్ర
వృత్తులుఁగడుఁ బ్రకోపింపఁదొడఁగె

గీ. వాసన లడంగెఁ బ్రోన్నత స్వానుభవము
జూఱఁగొని హాయి తెంకి తానై రహించె
"నళగమాంబ" మహర్షి దివ్యాత్మ శక్తి
విమల విద్యుత్ప్రసారమై వెలుఁగుఁజూప.

(శ్రీ రమణాభ్యుదయము)



సరసకవిశేఖర

శ్రీ బేవినహళ్లి కరణము కృష్ణరావు

జన్మస్థలము:—బేవినహళ్ళి.హిందూపురం తా॥ అనంతపురము జిల్లా

జన్మించిన తేది:— 21–9–1894

తల్లి:— శ్రీమతి నరసమాంబా,

తండ్రి:— శ్రీనరసింగరావు

మతము—కులము: హిందూ, శాంకరమతము—బ్రాహ్మణ.
బడగనాడు.

విద్యాభ్యాసము:

వీధిబడిలో రెండవ తరగతి మాత్రము జదివిరి. నాల్గవ తరగతిలో ఏడుమాసములుండి, పరీక్షా కాలమునకు విషమశీత జ్వరముతో హాజరు కాలేకపోయి యంతకే చదువు ఆపివేసిరి.

కుటుంబచరిత్ర:

వీరిది సామాన్యకుటుంబము. క్రమాగతముగావచ్చిన గ్రామ కరణీకము వీరి ముఖ్యవృత్తి. వీరి తల్లిదండ్రులకు ఎనిమిది మంది సంతానము. కవిగారు కడపటి వారు. ప్రస్తుతము పోయిన వారు పోగా కవిగారికి యిద్దరన్నగారు, యిద్దరప్పగారు కలరు. 1915 సం॥ నుండి గ్రామ కరణీకపదవిని చేబట్టిరి. అప్పుడు వారు తెనుగు, గన్నడ గ్రంథములను జదువుచు, పద్యములను వ్రాయుటలో నేర్పును సంపాదించిరి.

వీరికి ప్రస్తుతము యిరువురు కుమారులు, యిద్దరు కుమార్తెలు కలరు. వీరికి స్వంత వ్యవసాయముకలదు.

సాహిత్యపరిచయము:

1921 లో కవిత్వము జెప్పమొదలిడి 'లోకబాంధవ శతకము' వ్రాసిరి. ఇది వారి తొలికృతి. డిగ్రీల చదువులెరుగని వీరు సరస్వతీ ప్రసన్నులైన సహజ ప్రతిభులు. మేడిపట్టి మెరకలు

చున్నిన చేతితోనే కలముపట్టి కవిత పండించిన నిరాడంబరులు. వీరి కవితావ్యవసాయము ఏబదేళ్ళ నిరంతర సాహిత్య సంపర్కముతో సుసంపన్నమైనది. హరికథారచనలతో ప్రారంభించిన వీరికవిత్వము అనతికాలంలోనే ధారాశుద్ధికలిగి, యతిప్రాసలకు గింజుకొనని సరళముగా సరసముగా పద్యములల్లు పాండిత్యము వీరికి దైవము కలిగించెను. వీరి అముద్రిత కృతులు పెక్కుకలవు. ప్రచురించి ప్రాచుర్యము పొందవలెననెడి ఆకాంక్షమదియందు లేక,అజ్ఞాతముగా జీవనముగడిపిన బిజ్ఞానులు వీరు. ఈ కవిగారి 'ధర్మసామ్రాజ్యము' ను బృహత్తర ప్రౌఢ ప్రబంధమును రచించి నలుపదిఏండ్లపైబడి నను ముద్రించు ప్రయత్నమునకు వారు పూనలేదు.

వీరి ముద్రితకృతులునాలుగు. (1) ఏకలవ్యుని గురుభక్తిని ప్రబోధించు 'గురుదక్షిణ' (2) అభిమన్యుని వీరపరాక్రమమును తెలియజేయు 'తమ్మిమొగ్గరము' (3) గరుత్మంతునిగాథను తెలుపు 'విహగేంద్రవిజయము' (4) నవరసభరిత చతుర్థాంక నాటకము 'భీష్మ.'

అముద్రితములు:—

(1) లోకబాంధవశతకము (2) ధర్మవిజయము (సామ్రాజ్యము) (3) విక్రమవిజయము (4) త్రిశతి (5) భార్గవీ శతకము (6) సదుపదేశ శతకము (7) వేదాంత డిండిమము (8) సంధ్యార్థ విచారము (9) పూతనా సంహారము (హరికథ) (10) యమళార్జున భంజనము (11) కాళియ మర్దనము (12) పారిజాతాపహరణము (13) సుందోపసుంద (14) రన్నన స్వప్నయాత్రె — గద్యము. (15) ఆదిశంకర భగవత్పాదుల చరిత్రము.

కావ్యపరిచయము.

గురుదక్షిణ కవిగారి తొలిముద్రితకృతి. దీనిని వీరు 1923లో ప్రచురించిరి. చక్కటి ఆటవెలదులతో కూర్చిన కృతియిది. ఇందు ఏకలవ్యుడు తనగురువునెట్లు ఆరాధించెనో చూడుడు.

మట్టిచేత ద్రోణు నట్టిబొమ్మనుఁజేసి
కేలునందు ధనువుఁ గీలుగొలిపి
వస్త్రమాల్యములను వఱలశోభితుఁజేసి
భక్తిఁదానుశిష్యపదముఁదాల్చె.

అతఁడె తండ్రియంచు నాచార్యుఁడంచును
దైవమంచు దాతతాతయంచుఁ
బ్రాణసఖుడటంచుఁ బాపంచు శుశ్రూషఁ
జిత్త శుద్ధిఁగలిగి చేయుచుండి.

గురుని ముందు తాను కోదండమునుబూని
బాణమొండుఁగూర్చి పైనబోవు
పక్షిగములనేయు; బడకున్నబొమ్మకుఁ
జుట్టుఁదిరిగిమ్రొక్కి గొట్టుమనల.

తమ్మిమొగ్గరము (ప్ర — 1924) వీరి ద్వితీయ కుసుమము. ఇందు బాలవీరాభిమన్యుని పద్మవ్యూహచ్ఛేదనము చక్కగా చెప్పబడినది.

వీరాభిమన్యుని వీరవిహారమెట్లు రచించిరో చదివి, చవిచూడుడు.

ఆ. వె. మెఱుఁగు మెఱసినట్లుఁ గొఱవిఁ ద్రిప్పినరీతి
పరుల లక్ష్యమునకుఁ బట్టువడక
తనరథంబు మెఱయ సునిశిత విశిఖముల్
బఱపి మొగ్గరంబుఁ జెఱచివొచ్చె

కం॥ శరధిం దిరిగెడి మందర
గిరి యటు వనిసంచరించు కీలియుఁబోలెన్
గిరిభేది పౌత్రుఁడత్తఱిఁ
గురుకుల సాగరముఁజొచ్చి ఘూర్ణిలఁజేసెన్

కం॥ ఎచ్చటఁజూచిన నాతఁడె
విచ్చల విడిసంచరించి విమతుల మేనన్
గ్రుచ్చుచు తీవ్రాంబకముల
వ్రచ్చుచు పటుసుభట కోటి వఱలుచు నుండెన్.

వీరిమూడవ పుష్పము విహగేంద్రవిజయము. 1927లో దీనిని ప్రచురించిరి. తల్లి దాస్యమును బాపిన గరుత్మంతుని గాథయిది. భారతమున నాదిపర్వమున నున్న కథనుగైకొని కొంత పెంచి వ్రాసిరి. వినత తనకుమారుని యాశీర్వదించి, అమృత భాండమును దెచ్చుటకై పంపు సందర్భమున మాతృవాత్సల్యము నతి చక్కగా కవిగారు వ్రాసిరి.

ఉ. ఊఱకఁబల్కి తార్క్ష్యుఁడిటులున్నత భక్తినమస్కరించి, తాఁ
గోరఁగ నానతిన్ వినత గొబ్బున నక్కునజేర్చి, యింపునొం
పారు సుధామయోక్తులను హస్తతలంబున మౌళిదువ్వుచుం
గోరి వచించెఁబుత్రుప యుఁ గూర్మిబయల్పడ సమ్మదంబునన్.

చ. తలఁకని చిత్తవృత్తి సురధామముఁజేరి యరాతివర్గముం
దలకొని యాహవోర్వి బలదర్పసమున్నతిఁగెల్చి, యాసుధం
బలిమి గ్రహించి తెచ్చునెడఁ బంకజనేత్రుఁడ దెందునీకునే
సిలుగులు లేక సత్కరుణ శ్రీ విజయంబులు గూర్చిగావుతన్.

చ. వలగొని మ్రొక్కి యవ్విహగవల్లభుఁడిట్లనుఁదల్లిఁ గూర్చి, నే
బలపరిపంథితోడసుధ బల్మి గ్రహించెదులావు గల్గఁగా,
వలసినభోజనం బిడుము; వామవిలోచన! క్షుత్పిపాసలం, దొలం
చి, విరోధులంగడిమి దూఁటి జయంబునుఁగాంచి వచ్చెదన్.

నాల్గవది వీరి భీష్మనాటకము. (ప్ర—1973)

భీష్మ నాటకమున సంభాషణములు గద్యపద్యాత్మకములై సులభ గ్రాంధిక భాషలో నుండుటచే సంగీత సాహిత్యములకు వియ్య మేర్పడినది. తేటతెలుగు పదములతో చిన్నచిన్న వాక్యములలో నీ కవి పద్యములు తిక్కన్నగారి సంభాషణాశైలిని పుణికి పుచ్చుకొన్నటుల నుండుటచే నాటకోచితములైనవి. ముఖ్యముగా ఉపాలంభనములు, వాదోపవాదములు, వీరాలాపములు మొదలగు భావముల ప్రకటనమున వీరి లోకోక్తులతోపలుకుబడులతో నిండిన శైలి చక్కగ రాణించినది.సరళశైలికి తగినట్లుటనట స్పష్టములగు నలంకారములు కుదిరినవి.

కర్ణుని నమ్మియుద్ధమునకుదిగిన దుర్యోధనునకు భీష్మాచార్యు లెట్లుపదేశము గావించిరో జూడుడు.

దుర్యో:— పితామహా! యేటిమాటలు? ఈ యుద్ధమున జయము మనకే లభ్యమగును.

గీ. కెఱలి భీష్మాగ్ని మునుముందు పఱవ, వెనుకఁ
ఘటజ కర్ణాది యోధులన్ గాలిపీవఁ
బాండు సుతులను నెండిన వనము గనము
మాడి మసికాదె యొక త్రుటి మాత్రిలోన.

పాండవులను గూల్పనొక్క కర్ణుండెచాలును.

భీష్మ:— దుర్యోధనా ఎంతపసివాఁడవైతివి?

సీ. గురునాజ్ఞ ద్రుపదుని గొనితేరఁజనువేళఁ
దెగివెంటరాఁడె యీ మగలమగఁడు?
తిమియంత్రి ఛేదనోద్యమము నిర్వర్తింప
నజ్జాసరాఁడె ఈ వెజ్జితఱటు?
గంధర్వపతినిన్ను బంధించి నప్పుడు
తలనమ్మ కొనెనె రాధాసుతుండు?
పట్టిన పసిఁదలపాగయుఁ గ్రీడికిఁ
గోలిచ్చిరాఁడె ఈ బాలిశుండు?

గీ. క్రొత్తలేముండె వెనుకటి పొత్తెరాక?
కలదువారికిఁ గృష్ణునిబల మతండు
చురిక గొనకున్న — రణమూడి నఱక
గన్ను దెఱచిన లోకమ్ము కాలికూలు.

అదియునుంగాక నీ ప్రాణమిత్రులతోఁజేరి మీరు వారి కొనర్చిన యెగ్గులెన్నిలేవు? వానికి ఫలితములు మీరు భావింపనటు నెఱవేరెనా?

చం॥ సలుపరు మంతనంబుఁ గొని నాలిపనుల్ దెగియెన్ని యేనియున్
జలిపితి; రేయొకండయిన సంకటపెట్టెనె వారి? దానికిన్
గలబలమొక్క ధర్మ; మది కన్గొనుఁ గృష్ణనిరూప; మాతఁడే
కలిగిన వారివంకఁ ద్రిజగంబులు జూడఁగ నోప వేపునన్.

శకుని సాయంబున జూదమున గెల్చితిననియు, నట్లే కర్ణు సాయమున యుద్ధమున గూడ వారి నిర్జింతుననియు, సుయోధనుఁడు తలంచెను. అది వలదు పాండవులు కృష్ణుఁడను వజ్రకవచమును ధరించిరి. అది అభేద్యము

పేరు ప్రతిష్ఠలను ఆశించుటగాని అన్వేషించుటగాని యెరుగని ఈ వృద్ధకవిని (81 ఏండ్లు) ఆంధ్రభాషాభిమానులందరు ఆదరించి కృతికర్తకు సారస్వత ప్రపంచమున సముచితస్థానము నందించ గలరని మా ఆకాంక్ష.



కవితావసంత—కవిసింహ—అవధాని పంచానన—శివభారతకర్త—మహాకవి

శ్రీ గడియారము వేంకటశేషశాస్త్రి

జననము: 7–4–1894

జన్మస్థలము: కడపజిల్లా—జమ్మలమడుగు తాలూకా—నెమళ్లదిన్నె గ్రామము.

తల్లి:— శ్రీమతి నరసమాంబ
తండ్రి:— శ్రీ రామయ్య

మతము, కులము:— హిందూ—బ్రాహ్మణ

విద్యాభ్యాసము:

కవిగారు తమ పదమూడవయేటనే ప్రొద్దుటూరుచేరి అక్కడి బ్రహ్మ శ్రీ రూపావతారము శేషశాస్త్రుల వారివద్ద కావ్యనాటకాలంకార సాహిత్యమును, తర్క వ్యాకరణ శాస్త్రములను అభ్యసించిరి. శ్రీ షడ్దర్శనము వాసుదేవావధానులవారివద్ద జాతక, ముహూర్తవాస్తు శాస్త్రముల నభ్యయనముచేసిరి. జ్యోతిశ్శాస్త్రమున స్వయముగా వ్యాసంగము చేసిరి.

ఉద్యోగము—పదవులు:—

1930 లో ప్రొద్దుటూరునందలి శ్రీకన్యకాపరమేశ్వరి సంస్కృత పాఠశాలలోఅధ్యాపకులుగా చేరిరి. ఆ సమయమున "బ్రహ్మనందినీ" అను పత్రికకు సంపాదకత్వమును వహించిరి. తరువాత ప్రొద్దుటూరునందలి పురపాలకోన్నత పాఠశాలలో పెక్కేండ్లు ప్రధానాంధ్రోపాధ్యాయులుగ పనిచేసి పదవీ విరమణ పొందిరి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సంస్థకు వీరు సామాన్య సభ్యులుగాచేరి ఉపాధ్యక్షులై విశిష్టసభ్యులుగా గౌరవింపబడిరి. ఆంధ్ర ప్రభుత్వము వారిని శాసనమండలి సభ్యులుగ ఎన్నుకొని, గౌరవించినది. 80 ఏండ్లకు పైబడిన వృద్ధాప్యమునందు సహితము వీరు సాహిత్య రచనా వ్యాసంగము వదలలేదు. ప్రస్తుతము వారు వాల్మీకి రామాయణమును ఏడువేల పద్యములందు తెనుగించి అచ్చునకు సిద్ధపరచిరి.

సాహిత్య సేవ:—

శ్రీ దుర్భాకరాజశేఖర శతావధానితో కలిసి వీరు 'రాజశేఖర వేంకటేశకవుల'ను జంటకవుల పేర అష్టావధానములను పలుచోట్ల గావించిరి. విశేష సన్మానములనందిరి. వీరి అవధాన జైత్రయాత్రా విశేషములన్నియు 'అవధానసారమను' గ్రంథమున విపులముగా చెప్పబడినది. బాల్యమునందు వీరు ' శరన్నవరాత్రపద్యావళి 'ని తెనిగించిరి. తరువాతి కావ్యమే వీరి ' శివభారతము'

శ్రీ శాస్త్రిగారి ముద్రితకృతులు

(1) శరన్నవరాత్రపద్యావళి (2) అష్టావధాన సారము (3) శ్రీ ఛత్రపతిశివాజీ (4) విశ్వనాథనాయకుడు (5) శివభారతము (6) శ్రీనాథుని కవితా విమర్శనము (7) గోవర్ధన సప్తశతి (8) రఘునాథీయము.

అముద్రితములు :— (1) ఉత్తర రామాయణ కావ్యశిల్పము (విమర్శనము) (2) రామాయణము— పద్యకావ్యము.

కావ్యపరిచయము

శివభారతరచనకు పూర్వమీకవిగారిని గూర్చి, వీరి కవిత్వమును గూర్చి తామెఱుఁగక పోయిన విస్మయమును గొంచఱు పెద్దలు ప్రకటించుట యప్పటిలో జరిగినది. రాయలసీమ ఖనినుండి వెలువడిన రత్నములన్నియూ సానబెట్టిన తరువాతనే జాతిరత్నములుగా, దేదీప్యమానములై ప్రకాశించి పేరెన్నికగన్నవి. ఈ గ్రంథరచనా కాలమున కవిగారు చేసినదొక కవితాతపస్సు. ఆ ఫలితమే శివభారతావతరణ. అది తెనుగువారల కడుపులు నిండించు రాయలసీమ పంట.

"శివభారత మొక సుందర కళాసృష్టి. ఆంధ్రభారతి ముంజేతి చిలుక ముద్దులమూటగట్టు తెలుగుపలుకులను ముఱిపముతో ముచ్చటిస్తున్నది. ఆమెముఖము నిగమసూక్తుల గానముచేస్తూ ధర్మోపన్యాసము కావిస్తున్నది. ఆమెచేతియందలి అక్షరమాల భారతధర్మమనన ధ్యానాదుల జేయవలెనవి భారతీయుల నుద్బోధిస్తున్నది. ఆమె యొయ్యారముగా గ్రహించిన వీణనుండి మంద్ర, మధ్యమ, తార భేదములతో 'సరిగమపదనిస' స్వరములు భావపూరితములై బయలు వెడలుతూ లోకమును సమ్మోహితము జేస్తున్నది. ఆమె మఱియొక చేతియందు ధరించిన ఆపుస్తకమే 'శ్రీ శివభారతము ' ....

పై పలుకులు శ్రీడాక్టర్ చిలుకూరి నారాయణరావు M.A.L.T., Ph D. గారివి. వారు వ్రాసిన వాక్కులందతిశయోక్తులు లేవు. అవిస్తుతి వాక్యములుకావు. ముఖస్తుతిచేయు నగత్యమువారికిలేదు. వీరి పద్య రచన ఒకతేనెకాలువ. వీరికవిత బంగరు తీగవలెసాగినది.

భారతదేశమున సనాతన ధర్మపునరుద్ధరణకై కంకణము కట్టిన మహావీరుడు శివాజీ. మొగలుల నెదిర్చి హైందవ ధర్మపతాకము నెగురవేసిన వీరకేసరి ఈ కావ్యకథానాయకుడు. అష్టమూర్తిభక్తుడు శివాజి. కావుననే యీ ప్రబంధము ఎనిమిదాశ్వాసములు గలిగి యున్నది శ్రీ శివభారత మీనాటి కవితోద్యానమునకు నవ్య వసంతాగమనము. శివాజీ నిజముగా హిందూ ధర్మమును నిలుపుటకు దాని విశిష్టతను చాటుటకు, యవనరాజ్య నిర్మూలనకు అవతరించిన శివుడే. కాకున్న యిట్టి ఘనకార్య మితరులచేతకాదు.

చం. శివునవతారమే యని వచింపఁగనొప్పు శివాజి, ప్రాగ్భవో
ద్భవమగు భక్తిసంపదయుఁ, దల్లియొసంగు మతాభిమానమున్
బువు వెదలించు తావివలెఁ బొంగిన సాహస ధైర్యశౌర్యగా
రవము లెలర్పఁగాఁ జిఱుత ప్రాయపు టాటల మేలిమిఁగనెఁ

చిఱుత ప్రాయమునుండియే, తల్లి యిచ్చిన మతాభిమానముతోను, ఆమె చెప్పిన పురాణకథలతోను, శివాజీ సాహసము పొంగినది. ఒకనాడుతల్లి యాతనికి చిన్ననాటజరిగిన యొకసంఘటన నిట్లు జెప్పినది.

మ॥ అయిదాఱేఁడులవాఁడవే వెఱుఁగ, వన్నా! మొన్న మొగల్ చమూ
చయముల్ గత్తిఁగటారి దూసి కసిమించన్ దాసి, మీయయ్య నే
బయలన్ నిల్వఁగనీకతోలె, నటుపైఁ బంతంబు సాధింపనా
పయికిన్ దూఁకె, నిఁకేమి వల్కుదుఁ? దలంపన్ మేసు గంపిం
చెడిన్.

సీ. ఉదరమ్ము నంటనిన్ బొదివి, మర్కటివోలెఁ
బ్రతిదుర్గమున కెగఁబ్రాకలేక,
బావురు గానియాపదఁబాప, రాచిల్క
వలెఁబంజరమున నిన్నిలుపలేక,
కంసు కటారినోఁకఁగనీక, వసుదేవు
వలె గోకులముఁ జేర్చువాఁడులేక,
పులివాతఁబడుగోవువలె, లేఁగదరిఁజేరి
దిక్కులేనితనంబు దెలుపలేక,

తే॥ యలసిపోయితిఁ; 'దోడు వైతి' ననుచుఁ
గుమిలిపోయితి; మొగలు కక్కుఱితి నెదిరి
ధిక్కరించితి; నీతికై తెంపు సేయ
నొకఁడు లేఁడయ్యెనే' యంచు నుడికిపోతి.

దానితో శివాజీ యుద్రేకము మఱింత మించినది. తల్లి యిట్లు వీరరసమును నూరిపోసినది. తరువాత శివాజీకి రామదాసు దర్శన

భాగ్యమబ్బినది. అతడు హైందవమతమును, హైందవ భూమిని రక్షించు భారమును పూర్తిగా శివాజీపై మోపెను. అతడిట్లు ధర్మోప దేశమును గావించెను.

ఉ॥ కాపరిలేనిగోగణము కైవడి హైందవభూమి ధర్మర
క్షాపరులైన క్షత్రియులఁగానక, ముష్కరతస్కరాళిచే
నేపఱి, నీపయిన్ బరువులెత్తెడు నాసలవేచియుండె; బా
హాపరిణాహ ధూర్వహుఁడవై శివరాజ! భరింపుమీ ధరన్!

చ॥ 'మునుకలువెట్టుదేశమతముల్ దరిఁజేర్పఁగ ధీరుఁడెవ్వఁడా'
యని నిసుఁగంటిఁ, గంటి భవదాశయ; మీనినుఁబ్రోత్స హింపఁగాఁ
బనిగొని ధర్మగీతములు వ్రాసితి; నా తలఁపున్ వచించి నె
మ్మనమున నూఱడిల్లితిఁ; గుమార!సమీహితమీవ చూడుమీ।

రామదాసు వచనామృతమును మనసారఁగ్రోలిన శివాజీ తనువు నిలువెల్ల పొంగినది. నాటినుండియు కాషాయ పతాకమెత్తి 'భగవాజండా' ను ప్రతిష్ఠించెను. కవిగారు పోషించిన వీరరసమునకీ పద్యమొక మచ్చుతునక.

సీ॥ కొఱవిఁద్రిప్పినయట్లు మెఱుఁగులేచినయట్లు
కరవాలుమిసమిసల్ గ్రమ్ముకొనఁగ,
మునుమెత్తి రిపుమధ్యమును జీల్చి చొఁచ్చిపాటి
నలువైపు సేనలు నఱకులాడి—
పెనుగాలి తాటిపంగ్లనురలుచ్చు చందానఁ
గొకవంగ్లఁ బైరులు గోసినట్లు,
చెఱుకు గడల్ నిల్వునటికి పై చెఱుకీతిఁ,
జిగురాకు దూసిపోసిన విధానఁ

తే॥ దలలు పేగులు పాణి పాదములుకండ
లింతలింతలు తునియలై, యిందునందుఁ
బ్రోవులై, రాసులై, రణభూమిమిత్తి
వంటయిల్లనఁ బీనుఁగు పెంటచేసె॥

ఇట్లీకావ్యము హైందవ మతసంరక్షణార్థమై వెలయుటయు, అందు వీరరసము నత్యున్నతముగా పోషించుటయు, నేటిచదువరులకు దేశభక్తి ప్రబోధాత్మకముగా నుండుటయు, పిఱికిపందలకు సహితము వీరావేశమును గల్గించుటయు మనయదృష్టము. ఎన్నదగిన వీరిరెండవకృతి శ్రీ రఘునాథీయము. ఇదికూడా చారిత్రాత్మిక ప్రబంధమే. శ్రీ రఘునాథ నాయకునిగూర్చి తెలుగువారికే తగినంత తెలియదు. ఆతని వీరశృంగారముల చొఱవ, ఉదాత్తహృదయము, సంగీత సాహిత్యముల మీది పాండిత్యాభిమానములు, అందుల కాతని కైంకర్యము,—ఇత్యాది విషయములమీద తెలుగు కోవిదులుచేసిన పరిశీలన చాలామితము; అదియు అందునందు వికీర్ణము. ఎంతో శ్రమతో ఓర్పుతో ఆ ప్రాత—క్రొత్త చరిత్రలోని చిన్న-పెద్ద వివరములను సప్రమాణముగా సంపాదించి, సమకూర్చుకొని, శాస్త్రిగారు ఈ కావ్యము సంతరించినారు. రఘునాథుని ' ఉభయనాంచారుల ' తోడి ప్రణయలీలలు ఇందు ఉదాత్తమధురముగా చిత్రితమైనవి. కాని ఒట్టుమీద ఈ కావ్యముగూడ తొంబదిపాళ్లు వివిధ వీరరసవీచీ విహారములతోనే మఱవకు అని తొణకుచున్నది. (శ్రీ రాళ్ళపల్లి)

రఘునాథుడు తన ప్రియురాండ్రతోగలసి యిట్లు వనకేళి జలకేళీ విహారములను గావించెనని కవిగారు వ్రాసియున్నారు.

మ॥ 'ద్రవిడ ప్రీకుచకంచుకావరణముం దప్పించి వాతార్భకుం
డవరోధంబు తొలంచెనో, తమకుఁదామై విప్పిరోకాక, యాం
ధ్రవధూగర్వము చేతఁజిక్కె నిదె సర్వంబౌర కావేరి గౌ
రవ' మంచాడు విభుం గళావతికుచాగ్రంబొత్తెఁగౌఁగిటిలో

సీ॥ మొగమించుకంత నిక్కఁగఁజేసియీతాడఁ
 జంద్రబింబములు సాక్షాత్కరించెఁ,
బిరుదలపైకిఁబొంపిరివోవ నీదుచో
 నిసుకతిన్నెలలీవు లేపుసూపె.
నీలకేశాళిగన్పింప నీఁదాడుచో
 శైవాలజాల సంచయము లుబ్బె,
బిగి గబ్బిగుబ్బలుబ్బగ నీదులాడుచో
 జక్కవ కవయొప్పు సవదరించె,

గీ॥ అన్ని సొబగుల రఘునాథుఁడవధరించి
పెరిమపెంపున నుబ్బితబ్బిబ్బు చెందఁ
జెంచులక్ష్మీకళావతి స్నిగ్ధమూర్తు
లెనసి యీఁతాడ, దివి—భువి యేకమయ్యె

కవి గారు కడురమ్యముగా ద్రవిడాంగనా సొబగును విప్పి జూపిరి. జవ్వనుల జలకేళీ విహారమును కనులకుగట్టినట్లు తీర్చిరి. రఘునాథుని వనకేళి, జలకేళీ విహారములందే 'కావేరి' నదినిగూర్చి యాప్రాంతమునబండు చెఱకు,వరి,మామిడి, నారికేళ ఫలవృక్షముల గూర్చి, ధాన్యరాశుల వైభవమునుగూర్చి చక్కగా పోల్చిచెప్పిరి.

ఈ కావ్యమురెండు వేలకుపైగా పద్యములతోనిండివున్నది. శివభారతము తరువాత అంతటి మహత్తరకావ్యమిక తనకవిత్వమున వెలువడదేమోనని సంశయించిన కవిగారు ముప్పదియేండ్లతరువాత మరల తమ కవితావిపంచిని పలికించి, ఇంతకాలమెదురు చూచుచు వేచియున్న తెలుగువారి హృదయముల కుల్లాసము గలిగించిన దీరఘునాథీయము. రాయలసీమలో వెలిసిన కావ్యగుచ్ఛముల యందిది మేల్బంతి.

గోవర్ధనసప్తశతి: ఆంధ్రానువాదము చేయబడినది. దీనిని సంస్కృతమున శ్రీ గోవర్ధనాచార్యులవారు 'ఆర్యాసప్తశతి' యనుపేర వ్రాసిరి. ఇందు దాదాపు 8 వందల పద్యములు మూలముతో వున్నవి. ఏ శ్లోకమున కాపద్యమేకాని, కథానుబంధములేదు. పద్యములన్నియు శృంగార పూరితము లై శోభిల్లుచున్నవి. 11వ శతాబ్దిలో వెలసిన ఈ మూలగ్రంథమునకు సరియైన యనువాద మిప్పుడు వెలుగులోనికి వచ్చుట మనయదృష్టము.

రాయలసీమలో మరొక రామాయణ కావ్యము ఈ కవిగారి కలమునుండి వెలువడుచుండుట మన భాగ్యము. ఇది వాల్మీకికవి హృదయమునకు ప్రతిచ్ఛాయేకాని, పూర్తి అనువాదముకాని, అనుసరణముగాని కానేకాదు.

ఈ యముద్రిత శ్రీరామాయణకావ్యమందలి సుందర కాండమునందు ప్రథమ పర్యాయముగ సీత రావణునితోనిట్లను చున్నది.

ఉ॥ ఆతఁడు ధర్మమూర్తి, శరణాగతవత్సలుఁ, డూరకే యని
ర్హేతుకవైరమెంచఁ; డిదియిట్టిదిగానఁ, గృతజ్ఞతాప్రతి
ద్యోతితమైన నీదుహృదయోన్నతి నాతఁడుమెచ్చు;మృత్యుసం
ఘాతముఁ బాపికోఁదలపు గల్గినచో నిదియుత్తమైతగున్॥

చ॥ కనలుచు, నింద్రహస్త పరికల్పిత వజ్రమునట్లు నెల్లెడన్
ముసుగుచు, రామలక్ష్మణులు పూన్చినబాణము లీపురంబున
న్మొసలఁ బరాక్రమించి, యహిపుంజములన్ గరుడుంతు
వోలె, మి
మ్మని మొనఁజీల్చివేయఁగల;వంతయు సత్యము దానవేశ్వరా!

ఎనుబదిరెండేండ్లవయస్సున వీరీ రామాయణకావ్యమును వ్రాయుట పుణ్యమునకు, పురుషార్థమునకు దగియున్నది. దీనిని త్వరలోనే ముద్రించు ప్రయత్నమునన్నారు. వారి సంకల్పమనతి కాలముననే ఫలించుగాక!

ఈ 'మహాకవి'గా రిటీవల జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలయందు సన్మానితులగుట రాయలసీమకే ఒకయలంకారము. వీరిట్టి సన్మానములెన్నియో పొందదగినవారు.

రాయలసీమ రత్నాలలో వీరు మాణిక్యమువంటివారు. వీరి కృషి ఆ చంద్ర తారార్కముగా విలసిల్లు గాక!

(మొదటి భాగము సంపూర్ణము.)

శ్రీకృష్ణదేవరాయ గ్రంథమాల

హిందూపురము. పుష్పము ౨౭.

శ్రీ

రాయలసీమ రచయితల చరిత్ర -౨-

— రెండవ సంపుటి —

ఈ సంపుటితో చేరి, 20వ శతాబ్దపు రాయలసీమ కవిరత్నముల చరిత్రలు, ఏర్చి, కూర్చి, తీర్చబడి ఏబదియొక్క రత్నహారముగా తెలుగుతల్లి కంఠసీమ నలంకరించినది.

గ్రంథకర్త

కవిభూషణ, కవితిలక, కల్లూరు అహోబలరావు

ఆలనాటి ఆంధ్రభోజుడు-కళాపోషకుడు-మూరురాయరగండడు శ్రీకృష్ణదేవరాయలు



రాయలసీమ కవులపాలిటి కల్పతరువు.

జననము:- క్రీ. శ 1489వ ప్రాంత్యము-నిర్యాణం:- క్రీ. శ 1529వ ప్రాంత్యము

ఇరవై నంవత్సరాలు ఏకచ్ఛత్రాధిపతిగా విజయనగర సామ్రాజ్యమేలిన మూరురాయరగండడు.

శ్రీ రాయలకీర్తి

కవిభూషణ—కవితిలక
శ్రీ కల్లూరు అహోబలరావు.

గీ. పలుకు చున్నావు చిత్రమౌ — ప్రతిమలందు
కులుకు చున్నావు నాట్యకోమలులనడుమ
తళుకు గొన్నావు రమ్యదేవళములందు
తేజ ముప్పొంగ శ్రీ కృష్ణ దేవరాయ!

౨

గీ. ఎందు నున్నాడవోగాని — ఎట్టియెదుట
నున్నవాని చందంబు, నేడున్నవాఁడ
వౌర! నీశిల్పికళల, మహాద్భుతంబు
తెలియగా నౌనె? శ్రీ కృష్ణదేవరాయ!

౩

గీ. సంస్కృతాంబను దరిజేర్చి — సలలితముగ
కన్నడ, వధూటిఁబ్రేమించి — గారవమున
ద్రావిడాంగన, ముద్దాడి, రక్తిమెఱయ
ఆంధ్రి రమణిని పరిణయ — మందినావు

౪

గీ. దేశ బాసలందు — తెలుగు తేటగ్రహించి
తెలుగు వెన్నఁదిన్న — దేవరాయ!
చవులెఱింగి, కవిత - సారంబు గొంటివి
కృష్ణదేవుడీవె — కృష్ణరాయ!

విషయసూచిక.

పేజి నంబర్లు.

పేజి సంఖ్యలు.

రావుసాహేబ్

శ్రీ మరూరు లక్ష్మీనరసప్పగారు, యం. ఎ.,

జననము: 16-9-1882 నిర్యాణము: 3-4-1956

తల్లి: శ్రీమతి లక్ష్మాంబ

తండ్రి: కరణం శ్రీ మరూరు నరసింహప్ప

మతము, కులము:– బ్రాహ్మణ–నందవరీక, శ్రీవత్సన గోత్రులు.

జన్మస్థలము:– అనంతపురం జిల్లా॥ తాలూకా॥ మరూరు గ్రామము.

వీరు అతి పేదకుటుంబమున జన్మించిరి. మేనమామల సహాయముతో మద్రాసు క్రిశ్చియన్ కళాశాలలో పట్టభద్రులైరి. తరువాత ఉద్యోగముచేయుచు చరిత్రలో యం. ఎ., పట్టము తీసుకొనిరి. వీరికి కీ॥ శే॥ కట్టమంచి రామలింగారెడ్డిగారు సహాధ్యాయులు.

తొలుత రూ. 4½ లతో ప్రభుత్వ ఉద్యోగమును ప్రారంభించి, 1937 వరకు డిప్యూటి కలెక్టరు పదవిని నిర్వహించిరి. 1927లో భద్రాచలమునందు ఉద్యోగము చేయునప్పుడు వీరికి శ్రీ భద్రాద్రి రాముని కృప కలిగినది.

వీరి మాతా పితృభక్తి కడుప్రశంసింపదగినది. జీవితములో చేతనైనంతవరకు సహాయపడుటయే తమజీవిత ధ్యేయముగా పెట్టుకొన్నవారు. వీరు రామాయణములోని పాత్రల విశిష్టతను వారు ఆదర్శముగా నుంచుకొని ఆచరణలో పెట్టెడివారు. తమకున్న యధికారమునంతయు ప్రజాసేవకే వినియోగించి ప్రజల హృద

యములను చూరగొనిరి.అప్పటి ప్రభుత్వము వారిగణనీయ సేవలను గుర్తించి " రా వు సా హే బ్ " అను బిరుదమును ప్రసాదించి గౌరవించినది.

కవిగారికి తెనుగుభారతమన్న ప్రీతిమెండు. భారతమును క్షుణ్ణముగా చదివిగ్రహించిన మేధావులు. తెనుగుభారతమును గద్య రూపమున రచించిరి. ఇంగ్లీషులో బైబిల్ శైలియందు ఆసక్తి ఎక్కువ. అందువలననే వారు అశైలిలోనే ఆంగ్లమున 'శ్రీకృష్ణ చరిత్రము'ను సులభ శోకడలో వ్రాసిరి. పై రెండు గ్రంథములు అచ్చుకాలేకపోయినవి.

భద్రాచల శ్రీరాములవారి ప్రేరణతో రామాయణగాధను సామాన్యప్రజల కందుబాటులో నుండునటుల సులభశైలిలో తేట గీతములతో వ్రాయసంకల్పించి 'సులభరామాయణము'ను 5365 గీతములతోముగించిరి.

ఈగ్రంథపు వ్రాతప్రతి చాలానాళ్ళవరకు తమవద్దనే యున్నట్లు బళ్ళారిలోని కీ॥ శే॥ భాస్కరాచార్య రామచంద్రస్వామిగారు వ్రాసుకొన్నారు. ఆగ్రంథమును శ్రీ అ॥ దొరస్వామి నాయుడుగారు (పోలీసు సబ్ఇన్స్పెక్టరు) అనంతపురం పోలీసుక్లబ్బులోవచ్చి పోయెడివారికి తలదిండుగ నుపయోగించుచుండినట్లును, ఒకనాడు దానిని తెరచిచూచి పద్యములతో నుండుట తెలిసి రామచంద్రస్వామి గారికి సమర్పించినట్లు తెలియుచున్నది. రామచంద్రస్వామిగారు ఆగ్రంథకర్తనుగూర్చి, గ్రంథమునుగూర్చి తెలుసుకొనవలెనని ఎంతగానో ప్రయత్నించిరి, కాని అంతు చిక్కలేదట.

గ్రంథకర్తగారు జీవించియున్నప్పుడే అరణ్యకాండమువరకు ముద్రింపబడెననియు, కారణాంతరములవల్ల అది ప్రజల మధ్యకు రాలేక పోయినదని కవిగారికుమారులైన శ్రీ నరసింహభారతిగారు తెలియజేసిరి. వారు ప్రస్తుతము హైదరాబాదులోనున్నారు. సులభ రామాయణమును పునర్ముద్రించు ప్రయత్నములో వారున్నారు. అది ఆంధ్రుల భాగ్యవిశేషమే.

సులభరామాయణమునందలి ఉపోద్ఘాతములో కవిగారిట్లు చెప్పుకొన్నారు.

సంస్కృతమునేర్వ, నాంధ్రభాషను నఖండ
పాండితి గడింప, యతిగణ ప్రాసలక్ష
ణముల శోధింప, వ్యాకరణముమథింపఁ
బదము లల్లుట నాకనభ్యస్తవిద్య॥

ప్రథితిగాంచిన మాతండ్రి రామభక్తి
అనయమునునాదు మదినుండు హనుమకరుణ
భద్రగిరివాసుఁడగు రామభద్రుకృపయు
సాయపడుగాత నావ్యవసాయమునకు ॥

సులభరామాయణములో ఉత్తరకాండకూడా చేర్చబడినది. బాలకాండలో 427 తేటగీతలు; అయోధ్యాకాండలో 1407, అరణ్య కాండలో 507, కిష్కింధాకాండములో 587, సుందరకాండములో 750, యుద్ధకాండలో 1278, ఉత్తరకాండలో 409, తేటగీతములు కలవు. మొత్తము 5365. మచ్చుకు బాలకాండలోని తేటగీతము నొకదానిని పాడుకొందము.

నిత్యజలసిక్త సుమతరు నిచయయుక్త
మందమారుతకవిత సమ్యగ్విభక్త
రాజసామంత పణ్యమార్గములు(బాంథ
వేదనాపనోదన రమ్యవేదికలును.

బాలకాండములోని గద్యమున కవిగారిట్లు వ్రాసుకొన్నారు. 'ఇది శ్రీమదచలాత్మజారమణ,చరణసేవానిరత హృదయుండును, నందవరీకవంశ,శ్రీవత్సగోత్ర సంభవుండును నగు మరూరు నరసింహప్ప కుమారుడు రావుసాహేబు మరూరు లక్ష్మినరసప్పచే రచింపబడిన సులభరామాయణంబున బాలకాండ'

మట్టిలోని మాణిక్యాలవలె రాయలసీమలో నిట్టి యజ్ఞాతకవులు పెక్కుమందివున్నారు. వారిగ్రంథములు మరుగునపడి క్రిమికీటకాదుల పాలగుచున్నవి. తెరచిచూచు ఓపికయు వెలుగులోనికి దెచ్చు సామర్థ్యములేని వారుగనున్నారు మనసీమవారు. వావిలికొలను వారివలే వీరునూ రామభక్తి పరాయణులు. నిరాడంబరులు, నిగర్వులు. వారికిని వీరికిని దగ్గర పోలికలున్నవనుటలో అతిశయోక్తిలేదు.

వీరికి కీ॥ శే॥ ఆడిపూడి సోమనాథరావు, కీ॥ శే॥ కాశీ కృష్ణమాచార్యులు శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగార్లతో అత్యంత సన్నిహితముకలదు. అరుణాచలంలోని గుడిపాటి వెంకటాచలంగారికి వీరు ప్రీతి పాత్రులు.

కవిశేఖరులు కర్నూలులో తమ 74వ ఏట దివంగతులైరి.

సాహిత్య రత్నాకర-విద్వత్కవి కులతిలక—అభినవపోతనామాత్య.

ఆంధ్రకంబర్ శ్రీ పూతలపట్టు శ్రీరాములురెడ్డి.

జననము: 5—4—1892 నిర్యాణము: 8—11—1971

తల్లి:— శ్రీమతి లక్ష్మమ్మ.
తండ్రి:— శ్రీ పెద్దబుచ్చిరెడి.

మతము, కులము: హిందూ—పాకనాటిరెడ్లు
జన్మస్థలము: చిత్తూరు జిల్లా—పూతలపట్టు గ్రామము.

రాయలసీమ జిల్లాలలో కన్నడ, తమిళ, ఉర్దూ, భాషలతో పరిచయమున్న కవులనేకులున్నారు. ఆయా భాషా రాష్ట్రాలనానుకుని వున్న జిల్లాల సరిహద్దు ప్రాంతాలలోని ప్రజానీకానికి తెలుగు కాకుండా తదితర భాషలతోను పరిచయమబ్బి యుండుట సహజ విషయమే. అనంతపురం జిల్లా వారికి కర్ణాటక భాషతో పరిచయం కలదు. చిత్తూరు జిల్లా వారికి తమిళంతో స్నేహం ఏర్పడినది. పూర్వపు నవాబుపరిపాలన ప్రాంతమై, ఆంధ్ర రాష్ట్రమునకు రాజధానిగా వ్యవహరింపబడిన కర్నూలుకు ఉర్దూ భాషతో కొంత సఖ్యముచేకూరినది. అనంతపురం జిల్లా కవులెందరో కర్ణాటక సాహిత్య సౌరభాలను తెనుగువారికి అందివ్వగల్గిరి. అట్లే తెనుగు సాహిత్య కుసుమాలు కన్నడ సాహితీ ప్రాంగణంలో పరిమళించినవికూడా.

తమిళ సాహిత్య విశేషాలనుకూడా మన సీమకవులెరిగి వుండుట మన పుణ్యవిశేషమే. చిత్తూరు జిల్లా తమిళ ప్రాంతంతో ముడిపడినది. ఆసరిహద్దు ప్రాంతంలో తెనుగు, తమిళ సాహిత్య మలయమారుతము వీచినది. తమిళ సారస్వత సాగరమందలి

రత్నములను సేకరించి సోదరాంధ్రులకు నెఱచూఱలిచ్చిన కవి పుంగవులు చిత్తూరు జిల్లాలో పెక్కుమంది కలరు. అట్టివారిలో తమిళ 'కంబమహాకవి' రచించిన 'కంబరామాయణము ను తెనుగు వారి కందించిన ' ఆంధ్రకంబర్ ' శ్రీపూతలపట్టు శ్రీరాములురెడ్డి గారొకరు.

కవిగారు రెడ్ల వంశమునకు చెందినవారు. వీరి తండ్రిగారికి చాలాకాలమువరకు సంతానము కలుగలేదు. అందుచే కవిగారి తండ్రి శ్రీ పెద్దబుచ్చిరెడ్డి శ్రీ వేంకటేశ్వరస్వామి కోవెల కట్టించి సేవచేసిరి. తరువాత కొన్నినాళ్ళకు ఇద్దరు కుమార్తెలుదయించిరి. కాని కుమారుడు పుట్టలేదను కొరత ఆదంపతులకు పోలేదు. వారు స్వగ్రామమగు పూతలపట్టునందు ' శ్రీరామచంద్రునకు దేవాలయము కట్టించిరి. శ్రీరాముని భక్తితో అహర్నిశము ప్రార్థించిరి. అకృపామూర్తి ఆ పుణ్యదంపతులకు శ్రీరామనవమి పుణ్యదినమున ఒక మగబిడ్డను ప్రసాదించెను. వారే శ్రీరాములురెడ్డిగారు, వీరు జ్యేష్ఠ పుత్రులు. తరువాత వారికి ఇద్దరు తమ్ములుకల్గిరి. ఒకరు విద్వాన్ బాలకృష్ణారెడ్డిగారు, మరియొకరు శ్రీమునిరత్నంరెడ్డిగారు.

కవిగారు ప్రాథమిక పాఠశాలలో పఠించినను, స్వయం కృషిచే ఆంధ్ర, తమిళ, సంస్కృత సారస్వతములు, స్వాయత్తము చేసుకొని విశ్వవిద్యాలయ విద్వత్పరీక్షలో నుత్తీర్ణులై, ఆంధ్ర పండిత పదవిని నిర్వహించిరి. బహుపద్య, గద్యకావ్య ప్రణీతులైరి. అసమానమైన బోధనాపాటవము చేతనేగాక, అప్రతిమాన శీలసంపదచేకూడ శిష్యులను ఆనందోపదేశముల సంతృప్తిపఱచిరి.

కవిగారికి ' కట్టమంచి ' రెడ్లతోను, పొలకలరెడ్డి వంశము

వారితోను రక్తసంబంధముకలదు. శ్రీరాములురెడ్డిగారికి నలుగురు కుమార్తెలు. మగసంతతి వీరికిలేదు.

రెడ్డిగారి తండ్రిగారు హరికథలను చెప్పెడివారగుటచే ఆ పాండిత్య ప్రకర్ష కుమారునకు సహితము అబ్బుటకు వీలైనది. పెక్కుకావ్యకర్తలైన వీరు 'కంబరామాయణము' తో ఆంధ్ర దేశమున గొప్పపేరు ప్రతిష్ఠలను సంపాదించుకొనిరి. ఎన్నియో ఘనసన్మానములుపొందిరి. వీరిని 'విద్వత్కవికులతిలక' 'సాహిత్య రత్నాకర' కవితాతపస్వి'-అభినవపోతనామాత్య-మహాకవి-ఆంధ్ర కంబర్ అను బిరుద సత్కారములతో తెనుగు దేశము నీరాజనము పట్టినది. పూతలపట్టు గ్రామములో పల్లకి ఊరేగింపు జరుపుకొనిరి. 'ఆంధ్రనలంద' గుడివాడ వారిచే బంగారు పతకముపొందిరి. తమిళనాడు 'కారక్కుడి'లో జరిగిన కంబకవి వార్షికోత్సవములో కనకాభిషేకము పొందిరి.

1953లో కళాపరిషత్తుకు కవిగారు అధ్యక్షులుగా వ్యవహరించిరి. తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయమువారు వీరిని సెనేట్ సభ్యులుగా గౌరవించిరి. హైదరాబాదు ఆంధ్ర సాహిత్య అకాడమీ సభ్యులుగా వ్యవహరించిరి.

రాష్ట్రపతిచే మంజూరు చేయబడిన గౌరవ వేతనమును వీరు జీవితాంతము అందుకొన్నారు.

సాహిత్య విశేషములు: కృతులు.

కవిగారు అరవమునుండి ఈక్రింది ప్రసిద్ధ కావ్యములను వదించిరి. 1) కంబరామాయణము (2 సంపుటాలు) 2) నాలడి

యారు 3) పెరియ పురాణము 4) శిలప్పదికారము 5) మణి మేఖల 6) సూక్తిసుధ 7) తెనుగు సందేశము 8) త్రివర్గము 9) నీతిగుచ్ఛము.

సంస్కృతమునుండి తెలుగులోనికి 1) కుమారసంభవము 2) ప్రశ్నోత్తర రత్నావళి, గ్రంథములనువదించిరి. ఇవియేకాక పదునైదుకు పైబడిన గద్యగ్రంథములు వీరు రచించిరి.

'శిలప్పదికారం' ను తెనుగులో 'అందియకత'గా కవిగారు తెనుగించిరి. దీనిని 1957వ సం॥లో తిరుమల తిరుపతి దేవస్థానము వారు ప్రకటించిరి.

తమిళము నందలి ప్రసిద్ధ గ్రంథములైన 'మణిమేఖల' 'శిలప్పదికారము'లను తెనుగింపవలసినదిగా కవివరేణ్యులరు శ్రీకట్ట మంచి రామలింగారెడ్డిగారు సూచించి, అందందు అనుసరింపదలచిన విధానములనుకూడా సెలవిచ్చి ప్రోత్సహించిరి. వారి యాజ్ఞను శిరసావహించి రెండు ప్రకరణములు ముగించిరి. మూడవ ప్రకరణము వ్రాయు చున్నతఱి, కట్టమంచివారు దివంగతులైరి. అంతటితో 7, 8 నెలలు ఆకార్యము ఆగిసది. తరువాత వారి యాత్మకు తృప్తిని కలిగించుటకై ఆ కార్యమును కవిగారు ముగించిరి.

ఇదిద్రవిడ వాఙ్మయమున శిరోరత్నమగు మహాకావ్యము. ఇందు కథకంటె ఆకాలమందలి సంగీతమునకు, జైత్రి జాతీయ నటనములకు ప్రాముఖ్య మివ్వబడినది. అందలి కథావస్తువు సంక్షిప్తముగానిది.

చోళరాజ్య రాజధాని 'సంగమ' పట్టణము. అందు 'కోవలుడు'

ఒక వణిజుడు. అతడు 'మాధవి' యను వేశ్యాంగనకు వశుడైనాడు. దానితో సమస్త సంపదలు కోల్పోయి ధర్మపత్ని 'కన్నగి' తో కూడి దేశాంతరముల కేగినాడు. తిరిగి తిరిగి పాండ్యరాజు ముఖ్య పట్టణమైన 'మధుర' లో ప్రవేశించిరి. జీవయాత్ర సాగుట దుర్లభమైన స్థితిలో భార్య పైడి కాలియంది యను ఒక కంసాలివానికి కోవలుడు అమ్మటకు ప్రయత్నించెను. కంసాలి దానిని చూచి అనుమానించి, విషయమును ప్రభువుకు నివేదించెను. మున్నప హృతమైన, మహామ్యాల్యమౌ పాదకటకమొక్క అన్యుని చెంత యుండుట ఆరాజు సహించలేక వెనుకముందాలోచించక కోవలుని శిరచ్ఛేదమొనర్చి, అందియ నొసపరచుకొనెను.

కోవలుని భార్య కన్నగి తన భర్త కళేబరము చూచి తల్లడిల్లి కన్నీరు మున్నీరుగానేడ్చి భీకరాకృతిధాల్చి రోషాగ్నులు వెదజల్లుచూ యిట్లు ఘోరవాక్కులు పలికినద్ది.

....

....

" రాజుతో నీ మధు — రా నగరమ్ము
బూదిగావింతునో — పొలతిరో! నీవు
నరయుడుగాకని — యారాచనగరు
వీడి, వెలికివచ్చి — వీటఁగలట్టి
మానవులార!, ఆనుమపవరులాఁ!
మునులార! నాపంతమును వినుఁడీరు
నామనోహరుజంపు — భూమీశుపురము
పైగిన్కఁబూనితి — బాపమ్ముగాదు
కాంచుఁడీయని — కుడికరమున నెడమ
స్తనమును వడివైచి — చలమున లాగి

కేలెత్తిపురిఁ బ్రదక్షిణముగాదిరిగె
విసరివైచుచుఁ,నది — విలయాగ్నికరణి
విచ్చలవిడిరేగి — విన్నంటఁబెరిగె
.... — మున్నర్జునుండు
ఖాండవమ్మునుగాల్చు — కాలాన బోలె
గలతనొందగ, ధార్మికులును, విద్వరులు
గల కడకేగక — చలపట్టి నట్లు
పాపులు, నీచులు — పరగు వీథులను
జ్వాలలు, చెలరేగ, బసులును వాని
దూడలు, ధర్మబుద్ధులుగల గొల్ల
వాడలఁజేరెను; ....
దన భర్తఁగాంచఁ జాలని చింతచేత
మగువ మండి, కొలిమిమాడ్కి, నిట్టూర్పు
వడిసూర్చి వీదుల — సుడివడి తిరుగుఁ
దిరిగి, సంతాపించుఁ దిరిగి తపించి
వేదన నొందుచు — వెగచుచుఁగోప
మూఱక కుందు — నయ్యతివకు నెదుట
నుజ్జ్వల జ్వాలల — నుడికి తపించి
సైఁపఁజాలక, మధురాపుర దేవి
కనులకు నయ్యెడ — గానంగవచ్చె.

మధురాపురి కరుణా కటాక్షముచే కన్నగి విభుని అమర రూపమున గాంచెను. ఇంద్రుడు ఆ పుణ్యదంపతుల కింద్ర లోక ప్రాప్తిగావించెను.

కంబరామాయణము

శ్రీకట్టమంచి రామలింగారెడ్డిగారు *1951*లో కంబరామాయణమును గురించి ఇట్లు వ్రాసిరి.

"శ్రీరాములురెడ్డి పరివర్తనము సంస్కృతమునుండి కావింపబడు పరివర్తనము కంటె చాలకష్టమైనది. సంస్కృతవృత్తములును, అందలి పదములను మార్పులేకయు, కొంతమార్పుచేసియు మన సాహిత్యమునందు కవులు ప్రవేశపెట్టుట సులభమైనవి. అరవ ముతో ఛందః పద్ధతిభిన్నము. వారి సాహిత్యములోని భాషయు, ప్రకృతి ప్రత్యయ, సంబంధములును వేఱు, అట్లే ఎరవలితెచ్చిపెట్టు కొనుటకు సాధ్యముకాదు. ఇక్కడ నిజమైన పరివర్తనక్రియ ఆవశ్యకము. అట్లట్లే మార్పులేక వినియోగింపజాలము. కాబట్టి ఇది నిజమైన భాషాంతరీకరణము. సుగమమైన పనికాదు. దుర్గ మము. దుస్తరము.

ఇట్టి యీ క్లిష్టకళను ఎంతచక్కగా అనాయాసమని తోపిం చునట్లు, శ్రీరాములురెడ్డి చేసియున్నాడు. అది ఉభయ భాషా వేత్తలకుగాక, ఇతరులకు సంపూర్ణముగా, విదితముకాదు"

కంబరామాయణములోని సొబగును కొంత పరిశీలింతము.

సీ. కనులతోనే ప్రేమ – యను వస్తురూపంబు
గాంతముగాక – యో కాంతలార!
ఈనాతి జన్మంబు – చే, నొందదగు ఫలం
బీనాడె కందమో – యింతులార!
రాతికిఁదొలిరూపు – రమణఁ గావించిన
పదములఁజూతమో – పడతులార!
కడు బరువైనశ్రీ – కంఠు విల్విఱిచిన,
కరము లీక్షింతమో – కలికులార!

గీ. అనుచు, నీటి యొద్దడినొచ్చు – హరిణచయము
విమల జల పూరముం గన్న – విధిని పల్ల

మునకుఁబాఱు జలముఁబోలి — మనసు పఱవఁ
బటఁబరుగిడు చందాన — బరుగులిడిరి.

మ. చిగురుం బ డులు, రాముపై విరులు వర్షింపంగఁ గందర్పుఁడా
పగిదిన్ వారలమీద బుష్పశరముల్ — వర్షింప నొక్క ర్తనున్
జగతీనాథుని చండశాసనము — నీ శ్యామాంగు చిత్రోన్నతిన్
దగవున్ నేరక భీతనేత్రలకు — బాధం గూర్చు పీడెవ్వడే?

కం. హరిణాక్షి ధైర్యోర్తి యాపయ
నరునకు నీ లక్షణములు । నలువొందునె? శ్రీ
వరు డితడు నిక్కమియ్యది
యరయఁగలరు కన్నులార ననియెఁ జెలులతో

ఆ. వాలు గంటి యొకత — పూలపానుపుఁజేరి
పిడుగు మోత విన్న — పడఁగ దారి
చూడ్కు, మిట్టి మిఱుకు చన్నులుచెమరింప
బుద్ధి చెడగ, నూర్పు — పుచ్చుచుండే

❋ ❋ ❋ ❋ ❋

మహామహోపాధ్యాయ, కళాప్రపూర్ణ,

డాక్టర్ శ్రీ చిలుకూరు నారాయణరావు, M. A., Ph.d.,

జననము: 1890 నిర్యాణము: 1952

డాక్టరు శ్రీ చిలుకూరు నారాయణరావుగారు 1890 వ సంవత్సరమున విశాఖపట్టణ మండలములోని పొందూరు దగ్గఱనున్న 'ఆనందపురము'న జన్మించిరి. వీరు చాలకాలము రాయలసీమలోనే నివసించిరి. అనంతపురము'న ఆర్ట్సు కళాశాలలో పని చేసిరి.

'పర్లాకిమిడి' కళాశాలలోను, విజయనగరము మహారాజ కళాశాలలోను రావుగారు ఆంగ్ల విద్యాభ్యాసము నొనరించిరి. మద్రాసు విశ్వవిద్యాలయములో తెలుగు, కన్నడములలోఁ బట్టభద్రమును పొందిరి. 11వ శతాబ్దములోని తెలుగు రచనను గూర్చి రావుగారు పరిశోధించి ప్రకటించిరి. 'Doctor of Philosophy' అను బిరుదుపొందిరి. చిన్నప్పటినుండియు రావుగారికి భాషాసారస్వత చరిత్ర పరిశోధన యన్నచాల ఆసక్తి. వ్యవసాయము మీద రావుగారికి మక్కువమెండు. నూతన వ్యవసాయ పరిశోధనపు పోటీలో వీరికి బహుమానముగా బంగారు పతకము లభించెను. Inspector of Schools గా వీరు కొంతకాలము పనిచేసిరి.

తరువాత అనంతపురము కళాశాలలో ఆచార్యత్వము వహించిరి. మద్రాసు, మైసూరు ఉస్మానియా విశ్వవిద్యాలయముల యందు వీరు సభ్యులుగానుండి గౌరవములపొందిరి. 'ఆంధ్రఇతిహాస పరిశోధక' మండలికి వీరధ్యక్షులుగానుండి, కొన్నివందల తాళపత్ర గ్రంథములను సేకరించిరి. శిలాతామ్ర శాసనములు, నాణెములు సేకరించిరి.

నవలలు, నాటకములు, జీవిత చరిత్రములు, భాషా చరిత్రములు, పద్యకావ్యములు, గేయములు మొదలైనవి శతాధికములుగా వ్రాసిరి. ఉపనిషత్తులు, భగవద్గీత, అధర్వణ వేదమును తెలుగులో వ్రాసిరి. ఖురానుషరీఫు, జెండావెస్తా, ఉమర్ ఖయ్యూము (ముత్యాలసరములు) అంబ నాటకము (మొండి శిఖండి) మొదలగునవి వ్రాసిరి.

శ్రీ రావుగారు వాఙ్మయ తపస్వి, సారస్వతయాజి. వాఙ్మయ ద్వారమున దేశారాధనము, ఈశ్వర సేవ సాగించిన మహాయశుడు.

ఆకారమున దర్భపుల్లవలె సన్నగా నుండెడివారు. ఒక కన్ను కొంచెము మెల్ల.

బ్రిటిష్ దొరతనమువారు, వీరికృషిని గుర్తించి 1947లో 'మహామహోపాధ్యాయ' బిరుదమునిచ్చిరి. 'ఆంధ్రబెర్నార్డుషా' అను బిరుదుకూడా వీరికి గలదు.

"మహానటుని మయూర నృత్యము" అనుపేరితో, కాశీలో జరిగిన అఖిలభారత రచయితల మహాసభలో, నాటువుగా నొక గేయమును రావుగారు పాడిరి. ఆ గేయములోని ఆవేశము నవీన కవులలో, సందటికిని లభింపని యావేశము. వీరు వ్యావహారిక భాషావాదులు.

'ఉమర్ ఖయ్యాము' ఒక పారసీక కవి. ఈకవి 'రుబాయత్' అను పద్యములను వ్రాసిరి. ఈ పద్యములు అనేక భాషలలోనికి పరివర్తితములైనవి. వీనిలోని 101 పద్యములకు 'Fitz Genald అను ఆంగ్లేయకవి ఇంగ్లీషు పద్యములను వ్రాసెను.

పై 'రుబాయత్' పద్యములను శ్రీరావుగారు షట్పదులలో వ్రాసి ప్రకటించిరి. వాటికి 'ముత్యాలసరములు' అనిపేరిడిరి. 101 షట్పదులలో మచ్చుకు మూడు పేర్కొనెదము.

నరకమున యమబాధలంట – నరన సుఖమంట స్వర్గమందున
నరయజాలని దెల్ల–బూటక మొకటె–సత్యమగుణ
నరులకీ జీవంబు గుర్రెక్కెడు – నరదుకాదు గుటుక్కుమనుఁజామి
విరియబాఱిన పువ్వు మఱలను మొగ్గ యెట్లాలగుణ?
తెరనువైచెను, తోలుబొమ్మలఁ బఱచి యాడింపంగ దొడగెను
త్వరగ నొక్కటి యొక్కటే కొని – తీయగాఁదొడఁగెన్

పరమ మాంత్రికుఁడతఁడు బొమ్మలఁ బఱచి యాడగఁజేసె
మనలను। కరమునను దీపంబు బట్టి — విచిత్ర గతు లొప్పన్.
ఉత్తనేనా, నన్నుజేయఁగ మెత్తనైన బంకమట్టిని
మెత్తియీరూపంబు నిచ్చెను కుంభకారుండు?
ఎత్తి వేసిన బ్రద్ద లౌచును - ఉత్తమన్నైమంటఁగలసెద
నిత్తెఱగె మన యందఱకి — నని యొక్క కుండ యనెఁ
("ముత్యాలసరములు"నుండి)

'కళాప్రపూర్ణ'

డాక్టర్ శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి, M.A., [Cantab] D.Lt.

జననము: 10—12—1880 నిర్యాణము: 24—2—1951

తల్లి:— శ్రీమతి నారాయణమ్మ తండ్రి:— శ్రీసుబ్రహ్మణ్యారెడ్డి

జన్మస్థలము: చిత్తూరు జిల్లాలోని 'కట్టమంచి' గ్రామము.

శ్రీ రామలింగారెడ్డి గారిది పండితవంశము. సంస్కృతాంధ్ర, ఆంగ్ల జ్యోతిశ్శాస్త్రములందు వీరి వంశీకులు దిట్టలు, ఉద్దండ పండితులు. రామలింగారెడ్డి ముత్తాతగారైన శ్రీ పెద్దరామలింగారెడ్డిగారు సుప్రసిద్ధమైన 'భాస్కర శతక' కర్తలు. తండ్రిగారాంగ్ల విద్య నభ్యసించి 'భాషాజ్ఞాన పరీక్ష'లో కృతార్థులైరి. మరింతకృషి సలిపి న్యాయవాద విద్య నభ్యసించిరి.

'భాగవతసార ముక్తావళి'—'భారతసార రత్నావళి' యను రెండు గ్రంథములను రచించి సాహిత్య వేత్తలుగా ప్రసిద్ధి నొందిరి. అట్టి మేధావుల వంశ పరంపరలో వచ్చిన రామలింగారెడ్డి బుద్ధికుశలత

చిన్నతనమునుండియే వికసించినది. నూరుకథలను తన పదిపన్నెం డేండ్ల చిన్నిబుఱ్ఱలో దాచుకొని జెప్పగలిగిన జ్ఞాపకశక్తి అతనిది.

వీధి బడులలో విద్యాభ్యాసము ముగించి 1890 లో మొదటి ఫారంలో ప్రవేశించిరి. 'చిత్తూరుపులి' గా ప్రసిద్ధిపొందిన శ్రీ తిరువేంగడ సామినాయుడు, కుప్పనయ్యంగార్లు రెడ్డిగారి గురువులు. 1896 నాటికి మెట్రిక్యులేషన్ పూర్తిగావించి, 1897లో మద్రాసు క్రిశ్చియన్ కళాశాలలో ప్రవేశించిరి.

కళాశాలలో చదువుచున్నప్పుడే శ్రీరెడ్డిగారు కావ్యరచనకు పూనుకొన్నారు. 'ఆంధ్ర భాషాభిరంజని' సమాజమువారు కావ్య రచనలను ప్రోత్సహించే నిమిత్తమై పోటీలు నిర్వహించిరి. ఆ పోటీలలో రెడ్డిగారి 'ముసలమ్మ మరణము' ప్రథమ బహుమతిని పొందినది. అధునిక సాంఘిక యితివృత్తమును గైకొని నవ్య కవితాసుమములతో, విషాదాంతమైన కావ్యము వ్రాయుట యిదియే ప్రథమము. ఆ పోకడ అంతవరకూ యెవరును చేపట్టలేదు. కట్టు మంచి వారిదే ప్రథమ తాంబూలము.

'ముసలమ్మ మరణము' కావ్యములోని యితివృత్తము. అనంతపురమునకు చేరువనున్న బుక్కరాయసముద్రమను గ్రామ మున జరిగిన ఒక చారిత్రాత్మిక సంఘటన. ముసలమ్మ బసిరెడ్డి కోడలు. ఆమె సుదతీమణి. పూతచరిత. అత్తమామలను ప్రాణ ప్రదముగా చూచుకొను కోడలావిడ. అట్టిసాధ్వీమణి ప్రజలకొఱకు గంగాదేవికి బలియైనది.

ఒకసారి కురిసిన విశేష వర్షముల కాగ్రామ చెఱువు గండి పడినది. గ్రామస్థు లెన్నివిధముల ప్రయత్నించినను గండిపూడ్చుటకు

సాధ్యము కాలేదు. గంగాదేవి నరబలి కోరినది. ముసలమ్మ తానే బలి యగుదునని ముందుకు వచ్చినది. ఆ త్యాగశీలి, ఉదారచరిత్రు రాలు గండిలో కూర్చొనగానే పరిజలు రాళ్లు, మన్నుతో గండి పూడ్చిరి. వర్షముతగ్గినది. చెఱువు తెగుననుభయము తీరినది. ప్రజలక్షేమము కొఱకు ప్రాణములు విడిచిన వీరవనిత ముసలమ్మ పేరిట పరిజలు 'ముసలమ్మ కట్ట'ను ఒక స్మృతి చిహ్నముగా కట్టి ధన్యవాదములు జెప్పుకొనిరి.

రెడ్డిగారు తమరెడ్డి వంశీకులెంతటి త్యాగశీలురో తెలియ జెప్పుటకు, ముసలమ్మ వంటి పుణ్యస్త్రీల చరిత్రలడుగంటి పోకుండుటకు, రాయలసీమ చారిత్రాత్మిక విశేషములు నలుదిక్కుల చాటి చెప్పుటకు, చిరస్థాయిగ నుండు రీతి ఈ కావ్యమును లోకమున కందించి చిరస్మరణీయులైరి.

ఈ కావ్య ఉపక్రమణికలోని ఈ క్రింది పద్యములో పోతన్నగారి'ముగురమ్మల మూలపుటమ్మ'ను రెడ్డిగారిట్లు వర్ణించిరి.

సీ. అంచ తేజీ నెక్కి యలరు సామిని జేరి
చదువుల గొంతియై చాల వెలిఁగె
జిలువల యెకిమీని సెజ్జఁ బండెడు వాని
చెలువయై, కలుముల చేడెయయ్యె
గిత్తతత్తటి రౌతు కేల్గేలఁ గీలించి
బుత్తి ముత్తుల నిచ్చు సత్తియయ్యె
ముగురు సాములకును మొదలింటి వెలుఁగయి
యట్టిట్టి దనరాని యవ్వ యయ్యె

గీ. నచల సంభూత, సదయ హృదంబుజాత
నిర్గుణోపేత ! పరిపూర్ణ — నిత్యపూత

వాఙ్మనోతీత, సుగుణ సంపత్సమేత
పార్వతీ మాత ! మదభీష్ట వరము లీత !

అత్తగారింటిలో ముసలమ్మ యెట్లు వర్తించెడిదో రెడ్డిగారతి మనోహరముగా వర్ణించిరి.

సీ. అత్తమ్మ కొంగు నన్వహము బట్టుకొని తా
తిరుగు చుండును బిడ్డ కరణి బాల;
తన వారు, పెఱవారలను భేదమే లేదు
హృదయ మన్నది యప్పుడెత్తు వెన్న;
యేవేళఁ జూచిన నెలనవ్వులే కాని
చిడిముడి పడదెంత యుడుకులున్న;
తనముద్దు మోముఁజూచినజాలు, హృదయ తా
పంబెల్ల నప్పుడె పాఱిపోవు;

గీ. నహహ! మామపైగలభక్తి, యాత్మవిభుని
మీది మక్కువ, మఱదుల మీది కూర్మి
ప్రజలమీది వాత్సల్యంబు; బ్రహ్మకైనఁ
జూప శక్యమే వేఱొక్క సుదతి యందు.

రాయలసీమ గ్రామ వాతావరణమును, కాపు స్త్రీల సౌకుమార్యమును ముగ్ధ మనోహరముగా చిత్రము వ్రాసినట్లు చిత్రించిన రసజ్ఞులు వీరు.

ముసలమ్మ 'ప్రజలమీది వాత్సల్యము' తో గంగాదేవికి బలియగుటకు సిద్ధమైనది. ఆ దృశ్య రచన ఒక వర్ణచిత్రరువును బోలియుండు ననుటలో అతిశయోక్తి లేదు.

ఈ క్రింది పద్యము జదివిని ప్రతివారికిని ఆ దృశ్యము కనుల ముందు నిలిచిపోగలదు.

సీ. కన్నెఱ్ఱ వాఱిన – ఖర కరోదయకాల
మల్లన మ్రింగు జాబిల్లి యనఁగ
జ్వాలదగ్ని శిఖలపై – నెలనవ్వుతోఁ బోవు
ధాత్రీ మహాదేవి – తనయ యనఁగ
గెందామరల బారు – సుందరమగు లీల
నల్ల నల్లనఁ జొచ్చు – నంచ యనఁగ
గాల మహాస్వర్ణ కారకుండగ్నిలో
గరగించు బంగారు – కణిక యనఁగ

గీ. బ్రళయ కాలానలప్రభా భాసురోగ్ర
రంగ దుత్తుంగ భంగ సంఘాతములకుఁ
గలక నొందక, దరహాసమలర, మంద
మంద గతిఁబోయి, చొచ్చెనమ్మగువ నీట.

తెనుగు మహాభారతము నందభిరుచిగలిగి, తిక్కన రచనా శైలిని చక్కగా ఒంట బట్టిన వారగుటచే రెడ్డిగారాయిరువది యేళ్ల వయసునకే యంత చక్కటి పద్యరచనను చేయగల్గిరి. ప్రాచీన కావ్యములకే మాత్రము తీసిపోని గంభీరత అందులో కని పించు చున్నది. వారికి ప్రజ్ఞాపాటవమునకు కొమ్ములు తిరిగిన పండి తాగ్రేసరులెల్లరు తలలూపిరి.

విద్యార్థి దశలోనే మరొక సాహస కృత్యమునుగూడా రెడ్డి గారు గావించిరి. పింగళి సూరనామాత్యుని 'కళాపూర్ణోదయము' 'ప్రభావతీ ప్రద్యుమ్నము' ఈ ప్రబంధములను విమర్శనాత్మ కముగా నధ్యయనముచేసి, 'కవిత్వతత్త్వవిచార' మను విమర్శ నాగ్రంథమును వెలువరించిరి. వేమనయోగి నిర్భయముగ సంఘము లోని దురన్యాయములను విమర్శించుటచే రెడ్డిగారి కభిమాన పాత్రు

డైనాడు. అట్లే అతడుకూడా సూటిగా నిర్భయముగా కావ్య విమర్శలు గావించి, 'విమర్శలో విప్లవము'ను తెచ్చి 'విమర్శ కాగ్రేసర చక్రవర్తి'గా కీర్తి తెచ్చుకొన్నాడు.

1901లో మద్రాసు విశ్వవిద్యాలయములో రెడ్డిగారు పట్టభద్రులై 1906లో ఆంగ్ల దేశమందలి కేంబ్రిడ్జిలోని 'సెయింట్ జోన్సు' కళాశాలలో ప్రవేశించిరి. 1907లో యం. ఎ. (చారిత్రాత్మక విషయమున) ప్రథమ శ్రేణిలో నుత్తీర్ణతజెందిరి.

భారత దేశమునకు తిరిగివచ్చిన వెంటనే బరోడా మహారాజు గారు రెడ్డిగారి నాహ్వానించి, బరోడా కళాశాలలో వైసుప్రిన్సిపాల్ పదవి నిచ్చిరి. 1909లో మైసూరు మహారాజా వారి కాలేజిలో ప్రొఫెసర్‌గా పనిచేసిరి. మైసూరు యువరాజా వారితోకలసి విశ్వవిద్యాలయ విద్యా విధానము తెలిసికొనుటకై యూరపు, కెనడా, జపాన్, హాంకాంగ్ మొదలగు విదేశములన్నియు తిరిగివచ్చిరి.

అప్పటికాంధ్రులకొక ప్రత్యేక విశ్వ విద్యాలయములేదు. దానిని గుర్తించిన శ్రీరెడ్డిగారు తీవ్ర కృషిచేసి 1926వ సంవత్సరం ఏప్రిల్ 26వ తేదీన విజయవాడలో 'ఆంధ్ర విశ్వవిద్యాలయము'ను తొలుత ప్రారంభింప జేసిరి. ఆయన గారి బహుముఖ కృషిఫలితము గానే ఆంధ్రులకు విశ్వవిద్యాలయ మొక టేర్పడ గలిగినది. ఆంధ్ర లోకమంతయూ వారికి ఋణపడి యున్నది.

రెడ్డిగారి ప్రతిభ దేనిలో తక్కువైనది? వారు చేయని ఘన కార్యములేదు. అలంకరించని పదవులులేవు ఆయన స్వతహాగాకవి. విమర్శకావతంసుడు, గొప్పవక్త, సర్వశాస్త్ర రహస్యములెఱింగిన సహృదయుడు. సారస్వత పట్టభద్రుడు. వీరి 'అర్థశాస్త్ర' రచనకు

మద్రాసు విశ్వ విద్యాలయము 1913లో బహుమతి నొసంగినది. ఆంధ్ర విశ్వ విద్యాలయము 'Doctor of Literature' బిరుదిచ్చినది. 10–12–1940లో వీరు షష్టిపూర్తి చేసుకొనిరి.

రామలింగారెడ్డిగారి రచనలు

1) ముసలమ్మ మరణము 2) నవయామిని 3) ఆర్థిక శాస్త్రము 4) కవిత్వతత్త్వవిచారము 5) భారత విమర్శనము 6) వ్యాసమంజరి (5 ఖండములు) 7) ముత్యాలసరములు 8) దేవీ భాగవతము 9) పరిహాసనములు 10) ప్రతాపరుద్రీయము 11) కీ. శే. కట్టమంచి సుబ్రహ్మణ్యరెడ్డిగారి సంక్షేప చరిత్రము. 12) పంచమి 13) Speeches on University reforms 14) Congress in Office 15) Democracy in Contemporary India 16) Article on R. T. C.

శ్రీరాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ యంతటివారు 'నాకతపటి గురువు కట్టమంచివారు. నాకు నావలె ఎందరికో తెలుగు భారతము నందభిరుచిని, అభిమానమును కల్గించిన పుణ్యము మనరెడ్డిదే' అనిముక్తకంఠముతో చెప్పుకొనిరి.

ఇట్టి విజ్ఞాని రాయలసీమ రత్నాలకొక దివ్యాలంకారమైన వజ్రము. అతనిని ప్రపంచమేకొని యాడినది. అతని కీర్తి ఆ చంద్ర తారార్కము నిలిచియుండును. రాయలసీమవారికి గలిగిన పుణ్య విశేషమిదియే.

శ్రీ ఉప్పలపాటి వేంకటనరసయ్య

జననము: 1891 నిర్యాణము: 25-2-1973

తల్లి:— శ్రీమతి రంగమ్మ
తండ్రి:— శ్రీ ఉప్పలపాటి గంగయ్య

మతము, కులము:— హిందూ—రజక
జన్మస్థలము:— కదిరి—అనంతపురం జిల్లా.

మ॥ "నట దీశాన జటాటవీ లుఠిత తుంగా భంగ గంగాపగో
ద్భట ధారా ప్రసరత్స్రమాన కవితా ప్రావీణ్య ముంగల్గి, య
ప్పటపున్ రైతుల నిత్య జీవిత మిటుల్ వ్రాయంగ నేర్చున్న నీ
కిట జోహారు లొనర్తు స్మారకవితా హేరాళ పారంగతా!

నేటి ఆంధ్ర విద్వల్లోకమున నెంతటి కవి ప్రకాండులనయినను సంపాదింప వచ్చును గాని, శ్రీ ఉప్పలపాటి వేంకటనరసయ్య గారంతటి 'ఉత్తమకవి' ని గుర్తించుట ప్రయాసతో కూడుకొన్న పని" యని శ్రీ నారునాగనార్యగారు తమ యభిప్రాయమును 'గ్రామాభిరామ' మనుకావ్యముపై దెల్పినారు.

పల్లెపట్టులందు గుట్టుగా కాలమునెట్టుకొనుచు, పల్లెవాసుల జీవన విధానముల జక్కగానెఱిగి. తన మనోభావములను గ్రంథ రూపమున ఆంధ్రలోకమున కందించిన కర్మయోగులు వేంకట నరసయ్యగారు. స్వబిరుద ప్రతిష్ఠాపన కుబలాట, వాదోపవాదము లకు దిగుట, నీకవికి సరిపడవు. జీవితమంతయూ నుపాధ్యాయ వృత్తినిగావించి,తనకున్న కవితాధారతో మాతృభాషసేవకే జీవితము నంకితము చేసిన ధన్యజీవులువారు.

వేంకటనరసయ్యగారు ఏడవయేట పల్లెటూరి బడిలో అమ

రము. ఆంధ్ర పద్యనిఘంటువులను శ్రద్ధగా నేర్చుకొనిరి. 'చిత్వేలి' బోర్డు పాఠశాలలో ప్రైమెరి విద్యవరకు చదివిరి. ఆ రోజులలో పేదలకు ఉన్నత విద్య అందుబాటులో నుండెడిదికాదు. ఆ కారణమున పై చదువులు వారు చదువలేకపోయిరి. జీవనోపాధి కొఱకు 1911లో 'కొమ్మనవారి పల్లె'లో ఒక గ్రాంటు బడి పెట్టి పిల్లలకు చదువులు చెప్పనారంభించిరి.

పల్లెవాతావరణములోని రాత్రి భజన సంకీర్తనలు, నాటకాలు వీరి రచనా వ్యాసంగమునకు దోహదమైనవి. 'గుండాలరెడ్డి నాటక సమాజము' వారి చిత్ర నళీయము, పాదుకా పట్టాభిషేకము మొదలగు నాటకములు చూచుటద్వారా కవిగారికి ఒక విధమగు సంగీతాపేక్ష పుట్టి పాటలు, పద్యములు వ్రాయవలెననెడి కుతూహలమధికముకాజొచ్చినది. దానికితోడు సజ్జన సాంగత్యమబ్బినది. పూవులతోబాటు నారకు తావి యబ్బినట్లు శ్రీ వైద్య విద్వాన్ పండిత నారు నాగనార్యగారి సాహచర్యముతో సాహిత్యాభిరుచి యినుమడించినది. అప్పటిలో నారునాగ నార్యగారు సత్యాగ్రహ ప్రచారకులుగా నుండిరి. ఇరువురు కలిసి దేశసేవ, సాహిత్యసేవ సమముగా నొనర్చిరి. పెక్కు శిలాశాసనముల ప్రతులు వ్రాసియుంచిరి.

1917—19 సం॥ నందు రాచపీటిలో టీచర్ ట్రయినింగ్ పొందునప్పుడు శ్రీ వేంకటనరసయ్యగారికి శ్రీ రూపనగుడి నారాయణరావుగారితో సాహచర్య మేర్పడినది. రూపనగుడి వారికి నరసయ్యగారిపై అవ్యాజానురాగ మేర్పడి, అతనికి తెనుగు వ్యాకరణము, ఛందో లక్షణము నేర్పిరి. అట్లే శ్రీ వెల్లాల వేంకటాద్రి శర్మగారి వద్ద మూడు సర్గలవరకు రఘువంశము నేర్చుకొనిరి.

1950 వరకు వీరు ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిరి. వీరు పల్లె

ప్రజల చిత్తప్రవృత్తిని చక్కగా ఆకళించుకొనిరి. ఆ తీయతీయని స్మృతుల రూపమునే ఒక చక్కటి మూసలోపోసి, తీర్చిదిద్దిమన ముందు కావ్యరూపమున నుంచిరి. ప్రాచీన భారతదేశమునను గ్రామ సౌభాగ్య విశేషముల దెలుపుచు, సహజోక్తులతో సాగిన సాహితీఖండమే 'గ్రామాభిరామము'.

గ్రామాభిరామ మందు రైతు కుటుంబీకుల యాదరాభిమానములు, ప్రకృతి సహజసంపదలు. వారి నిరాడంబర జీవన విధానములు. వారి అమాయక ప్రవృత్తి, వారిపాడిపంటలు మున్నగునవి యన్నియు బహుచక్కగా అద్దము పట్టినట్లు చూపిరి. పద్యములన్ని లలిత పదములతోగూడి అనేక గ్రామ నానుడులతో అతి మనోహరములుగానున్నవి. కొన్నిభావములు పాఠకుల హృదయ పీఠములలో తిష్ఠవేయక మానవనుచు శ్రీ రాచమల్లు భైరవ కొండారెడ్డి గారిట్లనిరి.

" చింత చిగురంచు ముట్టి చూచితినిగాని
వలపు లూనుచు కపురంపు తళుకు లిను
వింత చిగురిద్ది; యిందులో గొంత దిని
తలపు పెట్టియు, డాతు నేస్తమ! నిజంబు"

నిజముగా నిందు మనసు నా కట్టుకొను దృశ్యవర్ణనలు, సహజోక్తులు, సామ్యములు, మనోజ్ఞభావములు పెక్కులు, మచ్చునకు చూతము.

కాకులు చేలపై బడి పంటను పాడు జేయుట సహజము. కాని కవి దృష్టిలో ఆ కాకులదాడి ఎట్లున్నదో గమనార్హము.

యవనుల్ పూర్వము దాడిబెట్టి మన యార్యావర్త దేశంబునఁ
బవరస్త్రీ జనమండలిం గమిచి దౌర్జన్యంబుఁ గావించి న

ట్లవిగో, కాకులు జేని మీఁదఁబడి బిట్టల్లాడు లేఁగఱ్ఱలన్
బువికిఁ ద్రాలఁగఁద్రొక్కి చంచువుల వెన్నుల్ ద్రుంచుటం గాంచుమా!

చేను కాపలాకు వచ్చిన చెల్లెల నిట్లు, ఆ కాపు దండించు చున్నాడు

చెల్లీ! యెచ్చటికేగినావొ కనవే! చేనంత పాడాయె; నీ
పిల్లాటల్ మొదులాఱ వేగముగ రావే! యెక్కవే మంచెపై
రాళ్ళన్ మొత్తుము మొండి కాకులవి రా–రాపింతలే కెట్టులన్
వెళ్ళున్ దేవునికేని దెబ్బ గురు వీ విశ్వంబునఁ లేమ్మిఁకన్

ఆ కాపుచెల్లి చేతిలో వడిసలపట్టుకొని త్రిప్పు దృశ్యమునిట్లుచెప్పిరి.

అలిపఙ్క్రమ దృశ్యమాన పదవిన్యాసైక భంగ్యంతర
వ్యాలోలంబగు చూడ్కితో నడుము జవ్వాడంగ వేణీభర
శ్రీలావణ్యము శ్రోణిఁజింద "వడిసెల్" చేఁడ్రిప్పు నీమూర్తి యో
రా! లక్షింపఁగ ఝాన్సిరాణివియొ సత్యాదేవివో యౌదువో!

ఇట్టి నయనానందకర దృశ్యములెన్నో యిందు కడురమ్యముగా పొందు పరచబడినవి. ప్రాతః కాలముననే కూయు కోడి కూతతో మానవాళి నీతదెట్లు ప్రబోధించెనో చూడుడు.

మత విద్వేష నృపాల శృంఖలములఁ మానంబుఁగోల్పోవు, దు
స్థితికింజాఱిన దేశమాత చెఱ విచ్ఛేదంబు గావింపఁగా
బ్రతుకుల్ ప్రాణము లప్పగించిన, మహా ప్రఖ్యాత వీరాంధ్ర సం
స్కృతులగ్గించెడి కోడికూత వినిపించెన్ నిద్రఁజాలింపుమా!

ఆణి ముత్యములవంటి నిట్టి పద్యములలో నివి మంచివని ఏరుట దుస్సాధ్యము. అన్నియూ రత్నములే. అన్నియూ సుగంధ కవితా కుసుమములే. వారి రచనాశైలి అట్టిది గ్రామాభిరామ మందు

నటనట కొంత గ్రామీణ కథయు నడిపిరి. దానిని ముచ్చటగా కూర్చిరి.

రమ్యముగా వ్రాయు కవికి ఎట్టి చిన్న భావన కలిగినను దానిని దివ్యముగానే చెప్పును. నేర్పరియైన శిల్పి ఎంతటి బండరాయినైనను తన ప్రతిభచే చక్కటి బొమ్మగా తీర్చ గలడు. వాల్మీకి జూచిన విషాద సంఘటన గొప్పకావ్యముగా నవతరించినది. కవిదృష్టి కేదియును అల్పముకాదు. ఒకరెడ్డిగారి పశువుల కొట్టములో కాపురమున్న 'పిచ్చుక జంట'ల కథనొక కావ్యవస్తువుగా యెన్నుకొని మనోరంజకముగా 'పిచ్చుకపిన్ని' యను పేరుతో కావ్యమును వేంకట నరసయ్యగారు వ్రాసిరి. అందలి కథ సూక్ష్మముగా నిది.

'ఒకపశువుల కొట్టములోని పిచ్చుక జంటకు చాలకాలము వరకు సంతానము గలుగలేదు. అవి సంతానముకొఱకై తీర్థములు సేవించినవి. తుదకు ఫలమబ్బినది. పసికందులు మాత్రము కొట్టములోని ఒక నాగుబాము నోటబడినవి. పిట్టలు గోడుగోడున నేడ్చినవి. ఉడుత వాటిని ఓదార్చినది. ఒకసారి పాము రెడ్డి కంటబడినది. రెడ్డి పాములు బట్టు వానిని పిలిపించి దానిని పట్టించెను. పిట్టలకు భయము తీరినది. మరల కొట్టములో కాపురముంచి, గ్రుడ్లుపెట్టి పొదిగి పిల్లలను కన్నదా పిచ్చుక యిల్లాలు. కానీ ఆ పిచ్చుకకు బిడ్డలను పోషించు నదృష్టములేదేమో! పాపము పిచ్చుక బాలెంత నంజునబడి మరణించినది. ఱెక్కలురాని పిల్లలను పెంచుటకు ఆ మగ పిచ్చుక మరల పెండ్లాడినది. ఆ సవతి పిచ్చుక పిల్లల పాలిటి మృత్యువైనది. ఆ పిచ్చుకపిన్ని చేతిలో పలుకష్టములు పొందినవా పసికందులు.

కవిగారిట్టి కావ్యవస్తువునెంత హృద్యముగా వర్ణించిరో 'గ్రామాభిరామము' ను పఠించిన పాఠకులూహించి యుందురు. ఈ కావ్యమును రాయలసీమ సాహిత్య పరిషత్తువారు ఆంధ్రలోకమున కందించి ధన్యులైరి. ఈ కృతి నభినందించుచు శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు పలికిన పలుకులివి.

"................... ఇంత చక్కని కవి యిన్నాళ్ళెమూలదాగి యున్నాడో తెలియదు. పద్యరచన నిస్సందేహముగా దివ్యముగా నున్నది. చక్కని భాషా జ్ఞానము, రమణీయమైనకూర్పు, పద్య రచనలో నెక్కుడసు కొంకులేకుండట, మఱియు కొన్నిచోట్ల గడుసుదనము, ఒండు రెండుచోట్ల ప్రౌఢకవులు పోవు లక్షణము, కొన్ని సీసపద్యములు వ్యర్థపదము లేకుండ దేశీయములైన పదము లలో నింపి యెంతో రమణీయముగ వ్రాయుట చూచినకొలది ముద్దు ముచ్చటలను సమకూర్చు చున్నది."

పలు ప్రశంసల నందుకొన్న నీకవి వందల కొలది కావ్యములు వ్రాయలేదు. వ్రాసిన వాటిలో 1) గ్రామాభిరామము 2) పిచ్చుక పిన్ని 3) మల్లికార్జున విలాసములు మాత్రమే ముద్రితములు. మరికొన్ని అద్భుతఖండ కావ్యములైన ఊర్వశి, కోకిలమ్మ, చీమల బారు, వేంకటేశ్వర శతకములు. అముద్రితములుగనే నున్నవి. 'మీనాక్షి' యను నవలకూడా అముద్రితమే. చిన్నతనమున వ్రాసిన 'ఒంటిమిట్ట జానకీవల్లభ శతకము' 'దుర్మోహపరిభవ' నాటకము, సంపాదించి వుండిన మహావిష్ణు పురాణమును తాటియాకుల పొత్తము గృహదహనము సంభవించి కాలిపోయినవని కవిగారే స్వయముగా తెల్పుకొన్నారు.

"1927 సం॥ మద్రాసు అఖిల భారత జాతీయ మహాసభను

నాగునార్యునితో కలిసి సందర్శించుట. శ్రీ రంగక్షేత్రమును వైకుంఠ యేకాదశిని సేవించుట, జీర్ణవిద్యానగర సందర్శనము, శ్రీ బాపూజీ పావన చరణ సంస్పర్శనము. ఇవి నా జీవిత మధుర ఘట్టములు' అని కవిగారు వ్రాసుకొన్నారు.

వీరికిరువురు పుత్రికలు, యిద్దరు పుత్రులు. ఒక కుమారుడు కుమార్తె ఉపాధ్యాయ వృత్తినే స్వీకరించినారు. చిన్నకుమారుడు పోలీసు ఆఫీసునందు గుమాస్తాగా వున్నాడు.

కడప మండలములోని పెక్కు కవిపుంగవులతో వీరికి సాహచర్యముకలదు. అజ్ఞాతకవిగానే వీరు ఎనుబదిరెండేండ్ల పండు వయసు వరకు స్వగ్రామమైన అనంతంపల్లె (రాజంపేట తాలూక కడప జిల్లా) లో నివసించిరి. జీవించినంత కాలము ఒకరి నాశ్రయించినవారుకాదు. ఘన సన్మానములు, గొప్ప బిరుదులు పొంద వలెనని యుబలాట పడినవారుకారు. ఇట్టి నిస్వార్థ త్యాగపురుషులే తెనుగు తల్లి సేవచేయదగు అనుంగు బిడ్డలు. ఈ పల్లెసీమ కవి వర్యుని అమూల్యమగు కృతులను మనము వెలుగులోనికి దెచ్చు కృషి చేసినప్పుడే మన ఋణము తీరగలదు.

ఆ అముద్రిత కృతులలోని సుగంధ సౌరభ కవితా సుమములను వాడనీయక తెనుగుదేశమున పంచిపెట్టుట మన కర్తవ్యమై యున్నది.

★

కవిరాజ

శ్రీ కలుగోడు అశ్వత్థరావు

జననము: 25-7-1901 నిర్యాణము: 19-7-1972

తల్లి:- శ్రీమతి లక్ష్మాంబ. తండ్రి:- శ్రీ వెంకోబరావు.

జన్మస్థలము:- కలుగోడు-రాయదుర్గము తా॥ అనంతపురం జిల్లా.

మతము-కులము:- హిందూ, బ్రాహ్మణ, బడగనాడు. మధ్వ,

కర్ణాటకాంధ్ర భాషలకు గల మైత్రి ఈనాటిదికాదు. విజయ నగర సామ్రాజ్య పాలకుల ఏలుబడిలో నుండిన మనసీమ కర్ణాటకాంధ్ర కవిశేఖరుల నిరువురిని, ఆ ప్రభువులొకేతులలో తూచి, ఇరువురిని సమానముగా పోషించినారు. అనాడు తెలుగు కన్నడ కవుల సరస్పర మైత్రి వాత్సల్యములు పెంపొందెను. భాషావైషమ్యములకు తావులేదు. ఏనాడో, ఆరెండు భాషల మధ్య ధృఢమైన సేతువు నిర్మింపబడినది.

ఈ ఇరువదవ శతాబ్దమున ఆంధ్ర కర్ణాటక భాషలకొకే లిపి నిర్మాణమొనర్చ ప్రయత్నములు జరుగుచుండుట ముదావహము. అనంతపురము జిల్లా పొలిమేరలు మైసూరు రాష్ట్రమునకు చేరియుండుట వల్లను, కర్ణాటకాంధ్రులలో, వివాహ సంబంధములు జరిగియుండుటవల్లను. ఇరువురి ఆచార వ్యవహార సంప్రదాయము లించుమించుగా కలిసిపోయినవి. కాన, అనంతపురము జిల్లా కొన్ని తాలూకాలలో, కర్ణాటకాంధ్ర కవి సవ్యసాచులు పెక్కుమంది వెలసిరి. వారెంతో కృషిసల్పి ఇరుభాషా సాహిత్య కుసుమము లందుగల పరిమళములను వెదజల్లిరి. అట్టి ధృఢతర సేవజేసి ధన్యులైన వారిలో శ్రీ కలుగోడు అశ్వత్థరావుగారొకరు.

కన్నడ సాహిత్యములో వీరికి చిన్ననాటినుండి మక్కువ కుదిరినది. కన్నడ కస్తూరి పరిమళమును బాగుగా ఆఘ్రాణించి, తెలుగు తీపిని చక్కగా గ్రహించిరి.

కన్నడజైన కవులైన, పంప, రన్న, పొన్న కవులు కర్ణాటక సాహిత్యమును వెలుగులోనికి దెచ్చిరి. వారు 'రత్నత్రియ' మని ప్రసిద్ధి పొందిరి. 'సర్వజ్ఞునివచనము' అను పేర ఆంధ్రీకరించిరి. తెనుగున వాడుకలోలేని, "కన్నడత్రిపది ఛందస్సు"నే వాడినారు. మచ్చునకు గమనించుడు.

1. పచ్చి మాంసపు బీడు – పాడు బొమికల గూడు
హెచ్చురోత – తనువున నుండి – కులమెంచ
వచ్చునేరీతి సర్వజ్ఞ!

2. ధనకనకములు గలుగ – దినకరుని వలె వెలుగు
ధనకనక మరుగ – మఱునాడు – పాడూరు
శునకమగు నరుడు సర్వజ్ఞ

3. జాతిపై – నొక్రమాను – జాయుచుండుట గంటి
చేతులాపైన – గనుగొంటి – సౌరభము
భాతియును గంటి (సానరాయి)

4. మీను ముట్టనివారి – దాసవుల పగవారి
మానవుల కగును – ఫలకారి – తెలిపెదరె?
జాణులీదారి? (టెంకాయ)

ఇట్లే వేమన పద్యములను కన్నడభాషలోని కనువదించిరి. ఈ "వేమన రత్నగళు" కర్ణాటక దేశములో బహుళ ప్రచారమైనవి. మఱియు, కన్నడములో, "మహాలింగరంగ" అనుకవిచే వ్రాయబడిన "అనుభవామృత మనబడు అద్వైత వేదాంత గ్రంథమును తెలుగులో "అనుభవామృత సారము"గా రచించిరి,

అల్లే పాల్కురికి సోమనాథ కవిగారి సోమేశ్వర శతకమును, కనక దాసుగారి హరిభక్తి సారమును తెలుగులో అనువదించిరి.

పోతన్నగారి, తెలుగు మహాభాగవతమందలి ప్రశస్త ఘట్టములైన, గజేంద్ర మోక్షము, రుక్మిణీ కల్యాణము, ప్రహ్లాద చరిత్ర, వామన చరిత్రములను కన్నడ దేశము వారికి 'భాగవత గీతిగళు' అనుపేర నందించిరి.

పెద్దన్నగారి మనుచరిత్రను "శృంగార వరూథిని" గా కన్నడమున రచించిరి. స్వతంత్రముగా కన్నడమున, 1) కంద పద్య రామాయణ 2) శ్రీ కృష్ణలీలె(బైలునాటక) 3) సుభద్రాపరిణయ నాటక. అనునవి, వ్రాసినామని కవిగారు తమ గ్రంథములలో వ్రాసికొన్నారుగాని, ఆవ్రాత ప్రతులు చేదాటిపోయిన వన్నారు.

కన్నడ రన్నకవిచే వ్రాయబడిన "సాహస భీమవిజయ" అను కర్ణాటక కావ్యమును, మన కవిగారు "గదాయుద్ధము" అను పేర ఆంధ్రీకరించినారు అందులో మచ్చునకు మూడు పద్యములు చూడుడు.

1. కం. మానధనుఁడన నెగడి, యభి
మానము డిగనాడి, నీటమయిదాఁచుటే? యెం
దైనఁ గప్పలు నేంద్రులు
మీనులు, జలములనిలు; నిలమేలే మగలుఁ?

2. కం. ఎందెందు నీవు మృతినే
పొందనటులఁదలఁచి, మిగులఁబొంగితి; నీవొం
డుందలఁచు టెఱుంగవో? జడుండ వగుదువో?

3. కం. మాగాడ్పు పట్టితో, నీ
మాగవు; మఱనాకు నీకువైరఁపగిమెడిఁ

నాగాండీవము నిశితము
నీ గళపుటబటుత్వమరయ–నీవిటురమ్మా!

భాషాంతరీ కరణము సామాన్యులచే సాధ్యముకాని పని. పరస్పర భాషలకు సౌందర్య సాహిత్యములను, అనువాదము ప్రసాదించవలెను. అనువాదకున కుభయ భాషా పాండిత్యము, ప్రత్యేకపు పలుకుబళ్లు, దేశ్యపదజాలములు, నానుడులు, ఏతద్భాషా స్వరూప స్వభావ సౌందర్య వికాసములు తెలిసి యుండవలయును. వీటి నెఱింగిన దిట్ట మనకవిగారు.

ఈ కవిగారు, రాయదుర్గము తాల్లూకా–"కలుగోడు"లోను మైసూరు సీమలోని 'తళుకు' గ్రామములోను కరణము పనిచేసిరి. ఈ రెండు గ్రామములందును. కవిగారికి చాలినన్ని భూములుగలవు గాన జీవితమును సుఖముగాగడపిరి. అయితే వీరికి సంతానములేదు. అన్న కొమారునే, తన పుత్రునిగా వాత్సల్యమున పెంచిరి. ఈకవి విలాస పురుషుడు. చేతి వ్రేళ్ల కైదింటికి రాళ్ళు చెక్కిన కనకపు టుంగరములు ధరించి, సరిగంచు వస్త్రములను సింగారముగా ధరించువారు. తన ఇంటికి వచ్చిన అతిథి, అభ్యాగతుల నాదరించి మృష్టాన్నమునిడి, వారిని సంతోషపెట్టువారు. తాము వ్రాసిన కావ్య ముద్రణము కొఱకు నితర ముద్రాశాలల శరణుజొచ్చక, స్వంత ముద్రాక్షర శాలను, రాయదుర్గములో నెలకొల్పి, తగుకావ్యముల నందే ముద్రించుకొనిరి. ముద్రణ సౌందర్యము నాశింపక, తగు గ్రంథముల నెట్లో యొకరీతి తమ "కవిరాజ" ముద్రాక్షర శాలయందే ముద్రించిరి. తమ అవసాన కాలమునందా ముద్రాక్షర శాలను రాయల పరిషత్తున కుచితముగా సమర్పించిరి. వారి దాతృత్వ మెట్టిదియో గమనింపుడు. ఇంతకుముందు పేర్కొన్న అను

వాద గ్రంథములే కాక, ఈ కవిగారీ గ్రంథములను కూడ రచించిరి. 1) దండక రామాయణము 2) అశ్వత్థభారతము (పద్యకావ్యము ఆది చతుష్కము మాత్రము) 3) అశ్వత్థేశ త్రిశతి (కందములు) 4) మూడు శతకములు 5) రెండు నాటకములు 6) అక్క మహాదేవి వచనములు 7) బ్రాహ్మణుడు 8) గురుదక్షిణ.

గురుదక్షిణ 1966 లో వ్రాసిరి. ఇందులో కవిగారు తమ మనస్సు విప్పి, కవితాకన్య తన్నెట్లు వరించెనో చెప్పుకొన్నారు.

ఉ. చదువఁగ గొప్పచదువు, మది గోరిక లేకలేదు; నే నడ
ప్పడుగఁబనిపేరును దెప్పుడదు – పుట్టువు నుండియుఁ గైత తోడనే
మతి మెఱుంగుబు; వేఱు పని – పట్టదు; గిట్టదు; కైత సౌఖ్య మి
పుడమిని గల్గ దెందు – నది పొందినవాఁడె యెఱుంగుఁ బొందయా!

ఉ. భార్యకు మున్న నాసరము – బట్టెను; బాయదు నిద్రలోను, నే
కార్యముఁగొన్న నీకవితెఁగాచును; జూచును నామనంబులో
జౌర్యము; వేఱు ధ్యాసఁగొన – నైపదు; శాంతిసుఖం బొసంగు, నౌ
దార్యము మీఱ; లోక సుఖధర్మము శాంతికరంబు! కాల్పనే?

రామాయణము నెందఱో, మహానుభావులు వ్రాసియున్నారు. కాని, దండకరూపమున, 'దండక రామాయణము'ను వ్రాసిన వారీ కవి గారొక్కరే. కైకేయి తన వాక్చాతుర్యముతో, దశరథునిట్లు మరులు గొల్పినది.

"హానాథ! మత్ప్రేమనాథా! ధరానేతృనేతా! ప్రతాపాధినాథుఁ నిన్ను భర్తగా బొందియుఁ నే నథా కృతిఁ గుందెదఁ మోహనాంగా! మదీ యెప్పి తార్థంబు దీర్పంగ నే నుంటినం చంటివే? అంత భాగ్యంబు నాకున్నదే?

సత్యముగా బల్కుదే? బాళి నీవంతగా నాయెడ జాల్కుదే? పల్కవె! యన్న భూనాథుడోమానినీ! నాయెడ నీకు సందేహ మెట్లుండ నేహేతువో? నాతిరో! మున్నుకన్నావటే నా యుదాసీన భావంబు నీపట్ల? నీకైచితిగా దూకగా వచ్చినగా దూకెడ గోర్కెనే దీర్తు, నీడేర్తు నోకామినీ! కోరుమంచన్న, నా జాబ వేలేచి, ముద్దారగా గౌగిట గుచ్చి; యా వృద్ధు మాయా విమోహంబులగా గుప్ప, తీపాచమత్కారవుగా భాషణల్ నెప్పి, యిట్లాడు........ ఇట్లే క ధారగా వీరి కవితా ప్రవాహము సాగిపోయినది.

ఈ కవిగారు, బడిలో 4 వ తరగతి మాత్రము చదువు కొన్నను, పూర్వజన్మ విద్యాసంస్కృతి వల్లను, స్వయం కృషి వల్లను, దాగుకొన్న కవితామొగ్గ, వికసించి పుష్పమై, తన సువాసనల నలువైపుల వెదజల్లెను. ప్రహ్లాద, ధ్రువ బాలకుల కుగ్గు బాలతోనే, భక్తి పుట్టలేదా? కీ. శే. కప్పగల్లు సంజీవమూర్తి జ్ఞారు, తమ గురువులని కవిగారు చెప్పుకొన్నారు. గురువులు నిమిత్తమాత్రులేకాని, పూర్వజన్మ సంస్కార మొక్కటియే, భక్తి, గాన, వైరాగ్యములకు, కవిత్వ – పాండిత్యములకు పునాదియని ఘంటాపథముగ చెప్పవచ్చును. ఈ కవిగారికి 'కవిరాజ' 'కవి సవ్యసాచి' యను బిరుదులేకాక, శ్రీశైల జగద్గురువులు 'ఉభయ భాషా భాస్కర' యను బిరుద మొసంగి సత్కరించిరి.

ఇట్టి కవిగారికి బ్రహ్మ పూర్ణాయువొసగక, 70 ఏండ్లకే తనువు చాలించుట, ఆంధ్రుల దురాదృష్టమని చెప్పపనిలేదు.

నారాయణవనము

శ్రీ కూరత్తాళ్వారు అయ్యంగారు

జననము:— 1867 నిర్యాణము:— 1947

మతము:- హిందూ—అయ్యంగార్లు.

జన్మస్థానము:- తిరుచనాపల్లి జిల్లా. స్థిరపడినది రాయలసీమ జిల్లా అనంతపురము. కాన వీరు రాయలసీమ వాసులుగా ఎన్నికైనారు. తల్లి దండ్రులు, కుటుంబ చరిత్ర వారు వ్రాసుకొనలేదు.

వీరు జాతీయ భావములుగల్గి, విద్యార్థులలో దేశభక్తిని సంఘసేవా శక్తిని, పెంపొందించిరి. 1909 నుండి 1912 వఱకు అనంతపురము జిల్లా, పెనుకొండలో మిడిలు స్కూలు హెడ్డు మాష్టరుగా పనిచేసిరి. మఱల 1912 నుండి ధర్మవరము లండన్ మిషన్ హైయరు ఎలిమెంటరీ స్కూలులో పనిచేసి 1922 లో పదవీ విరమణ చేసినారు.

ఈ కవి గారాజానుబాహులు. నిమ్మపండు శరీరచ్ఛాయ, దరహసితవదనము, కనికరమును వెదజల్లు కన్నులుగల నిండు విగ్రహము వారిది. చక్కగా మూడు తిరునామములు ధరించి, స్వచ్ఛమైన తెల్లధోవతి పంచెకట్టు ధరించి, తెల్లని నిడుపుకోటు (Long Coat) తల పాగా వేసుకొని, బడికి వెళ్లెడివారు. వీరి సన్నిధిలో, శిష్యులు గురుకులములో వలె చదువుకొనెడి వారు. విద్యార్థులకు సంస్కృతము నేర్పవలయునను యుత్సాహముతో, వీరు వేకువ 4 గంటలకే మేల్కొని ఇంటింటికి దిరిగి తమవెంట విద్యార్థులను పిలుచుకొనివచ్చి వారికి, అమరము, సంస్కృతము

నేర్పెడి వారు. వీరి శిష్యులైన, జిల్లా కలెక్టరు పనిచేసి కీర్తిశేషులైన భోగిశెట్టి జూగప్పగారిట్లు వ్రాసియున్నారు.

"శ్రీ కూరత్తాళ్వారు అయ్యంగారు సన్నిధిలో నేను 1909 నుండి 1912 వరకు, అనంతపురము జిల్లా పెనుకొండలో చదువుకొంటిని. వారి ధర్మ విధానము, జ్ఞానము, దైవభక్తి, దేశభక్తి, దేశాభ్యుదయ సేవాశక్తి. తెలుగు సంస్కృత హిందీ భాషానురక్తి వర్ణనాతీతము. మా పాఠశాల చుట్టువున్న బీడు భూములలో, పైరులను నాటించి బావినుండి నీళ్లను మాతో మోయించి, పైరులకు పోయించు చుండిరి. 1908 వ సంవత్సరమునందే హిందీ దేశభాషగా నుండ వలయుననియు, ప్రతి విద్యార్థియు, ఈత, సెట్టిపు స్వారి, సాము, గరిడీలు నేర్వవలయునని వారి ఆశయము. కుల మత భేదములు నశించవలయునని, వారు భాగవతములోని రంతిదేవుని చరిత్రమును పలుమారు చదివి చెప్పుచుండిరి. శివకేశవ భేదము లెంచ కూడదని. దయయే శివపూజయని, సత్యమే హరి కీర్తనమని, తిట్టినవానిని దీవింపుము, కొట్టినవానిని పూజింపుమని వారు మాకు ప్రహ్లాదుని చరిత్రి చెప్పుచుండిరి. చేనేత బట్టలనే వారు ధరించిరి. వారిల్లు బీద విద్యార్థులకు హాస్టలుగా ఉండేది"

నేను (కల్లూరు అహోబలరావు) వారివద్ద 1912 నుండి 1915 వరకు, అనంతపురము ధర్మవరము లండన్ మిషను హైయరు ఎలిమెంటరీ స్కూలులో చదువుకొన్నాను. వారు 'సాధు సంగతి' నిట్లు వర్ణించిరి.

కం॥ శ్రీ నొసగు, యశము బెంచు, న
సూన ప్రమదంబు సేయు — నురు దోషములన్

బో నడచుము; ప్రవిమల, వి
జ్ఞానము వెలయించు సాధు సంతతి తలపన్

ఒకసారి వారు విద్యార్థులను, సమీపము నందున్న దిగుడు బావి దగ్గఱకు పిలుచుకొని పోయి, అచ్చట భూమిని త్రవ్వించి, యేవో పైర్లను పెట్టించి, మాతో నీరు పోయించెడి వారు. ఆ పైర్ల చుట్టు ముళ్ల కంపలు నాటించు వారు. చూచిన రైతులు, 'తేరు తావ గాలి యాస్తే—రైలు కమ్ములు దాటిపోతాయి' అని చెప్పుకొనుచు పోవుచుండగా, మా గురువుగారు 'చూచితిరా! ఆ రైతు ఎటువంటి ఉపమానము చెప్పినాడో' అని తెల్పుచు, ముసి ముసి నవ్వులు నవ్వువారు. కంచెకు తూర్పున ఒక మైలు దూరములో తేరు, కంచెకు పడమర ఫర్లాంగు దూరములో రైలు కమ్ములుండెను.

వీరు సహజకవులు. వీరు వ్రాసిన చిట్టిపొత్తములు ప్రకటించినవి రెండే. 1 రాగిరంకి (వచనము) 2 పోణిమి (ద్విపద). వీరు వ్యవసాయము సంబధి రుచిగలవారు. వ్యవసాయాభివృద్ధి. పలు తెఱగుల పంటలు, వివిధ రకములైన ఎరువులను గుఱించి అనేక వ్యాసములను వ్రాసినారు (అవి దొరకవు)

'రాగి రంకి'లో అనంతపురము జిల్లాలో విశేషముగా రైతులు పండించు రాగి ధాన్యమును గుఱించి వ్రాయుచు, రాగి పిండితో చేయు పలువిధములైన వంటకములను వర్ణించిరి. ఆ వంటకములను తమ ఇంటిలో వాడుచుండిరి.

'పోణిమి' ద్విపదలో వారెన్ని విషయములనో వర్ణించిరి. మచ్చునకు కొన్ని

ద్విపద ॥ ఇంటి పెఱళ్లలో – నిడి ప్రత్తిచెట్లు
కుంటక, నేకుల – గూర్చి దాసముల
నూలి పోగుల దీసి – నుసులక ద్రిప్పి
పాలుమాలక స్త్రీలు – పట్టి కండెలను
గుడ్డల కఱవును – గూటి పెదఱిమి
గడ్డికౌ కడగండ్లు – కడపడు మనకు
కల్లను దగవైచి – కావలి యుంచి
పుల్లను బోనీక – ప్రోదిగా బెంచి
చలిగాలి వానల – సన్నముల్ గాక
కలజీవ ధనముల – గట్టి కొట్టముల
పిడుదలు చీమలు – పెను దోమగములు
కడిది పేడ గదురు – గంజును లేక
శుద్ధిగా బశువుల – జూచుట మేలు
....
పదియేండ్ల బిడ్డకు – బాడియావొకటి
కుదిరిన నేలను – గూర్పగావలయు

బాలురకు వ్యాయామము ముఖ్యముగా తోడ్పడుననియు, వారిలో ఇద్ధతేజస్సు, బుద్ధిబలము, పౌరుషపరితనము, దేశభక్తి, దేవతాప్రీతి పెంపొంద పలెననెడి, ఉదాత్త భావముగల వారాచార్య వర్యులు.

1914 వ సంవత్సరమునకు సరియైన ఆనంద సంవత్సర ఉగాది కానుక శుభాకాంక్షల నిట్లు ప్రకటించిరి.

సీ. ఆనంద సంవత్సరాది, కుశల వార్త
యానంద దాయక – మందఱకును

వృద్ధియౌ సస్యజ – వృక్షజ జంతుజ
ఖనిజాండ జంబులు – జనము లలర
భూచర, జలచరంబులు, నుభయ చరంబు
లును, తమ తమ పనులొనర నలువ
ఆంగిక వస్తువు –లనువుగా నేలలో
జేరుట బంటలు జెలువు మించు

గీ. నుభయ మూలల వానలు నూర్జితముగ
జరుగు చుండంగ సవ్యాప సవ్యములుగ
శిల్ప యంత్రకల్పనములఁ జేతి పనుల
భారతీయుల భాగ్యంబు ప్రబలి వెలుగు


'పోణిమి'లోని ద్విపద

'కూరేశ శర్మ' యీగుణిపట్టి జనుల
కూరిమి నేర్పను –గొనజేయు నెపుడు
అంకితం బియ్యది – యాంధ్ర నాయకుని
లెంకల కిది నిత్య – లీలగా వెలయు
శ్రీరస్తు – శుభమస్తు – శివభూతిరస్తు
ఆరోగ్యమస్తు – దీర్ఘాయుష్యమస్తు
పశువృద్ధిరస్తు – సద్బాంధవ్యమస్తు
శిశువృద్ధిరస్తు – సత్స్త్రీవృద్ధిరస్తు
ఋతుకాల వర్షాభివృద్ధి స్సదాస్తు
హితమతి కర్షక స్కృతి కార్యరస్తు
తృణకాష్ఠ జలవృద్ధి దినదినమస్తు
ఫణిరాజ తల్ప కృపా మహిమాస్తు

ఇందులో తమపేరు 'కూరేశశర్మ' అని వ్రాసుకొన్నారు.

సర్వేజనాః సుఖినో భవంతు అని అందరిని దీవించిన మహాను భావులు వీరు.

వీరి శిష్యులెందరో గొప్ప పదవుల నలంకరించియున్నారు. ఆదర్శగురువులు. చెప్పినది చేసి చూపువారు. వ్యర్థ ప్రసంగములు వీరికి పనికిరావు. కార్యదక్షత, నీతి నిజాయితీ కలవారు. ఇట్టి వారి స్మరణ మాత్రముచేతనే. మనయందు కార్యదీక్షత జనించు నను టలో ఏ సందియము లేదు.



బ్రహ్మవిద్వరిష్ఠ

శ్రీ మేడవరము

సుబ్రహ్మణ్యశాస్త్రి గారు

జననము : 1885 అక్టోబరు

నిర్యాణము : 22-5-1960

జన్మస్థలము:- నెల్లూరు జిల్లా–దర్శి తాలూకా–పోలేపల్లి.
(వీరు తమ జీవితకాలము నంతయు రాయలసీమ జిల్లాలలో గడిపి, రాయలసీమ వాసులుగా ఎన్నికైరి)

తండ్రి :- శ్రీ కోటయ్య

తల్లి :- శ్రీమతి అన్నపూర్ణమ్మగారు.

శ్రీ శాస్త్రిగారు గొప్ప పండిత కుటుంబమునకు జెందినవారు. ఋగ్వేదులు. ఆశ్వలాయన సూత్రము కామకాయన విశ్వామిత్రస గోత్రులు, వైదిక బ్రాహ్మణ శాఖకుజెందినవారు.

వీరు ఋగ్వేదములో కొంత సంహితా భాగమును వల్లించిరి. తిరుపతి, గుంటూరు జిల్లా కొల్లూరు మొదలైనచోట్ల ఆరంభములో కావ్య వ్యాసంగముచేసి, తరువాత గోదావరి జిల్లా కాకరపఱ్ఱు గ్రామములో బ్రహ్మశ్రీ వేదుల సత్యనారాయణ శాస్త్రిగారి దగ్గర కావ్య నాటకాలంకార సాహిత్య గ్రంథములను పూర్తి చేసిరి. జ్యోతిష్యము, మంత్రశాస్త్రము, శంకరాద్వైతము వీరు సాధించిన విద్యలు. వీరు సంస్కృతాంధ్రముల రెండింటిలోను కవిత్వము చెప్పనేర్చిరి.

వీరి భార్య శ్రీమతి చిన్నమ్మగారు. వీరిరువురు సోదరులు. పెదసుబ్బరాయ శాస్త్రిగారు వీరి అన్నగారు. శాస్త్రిగారు మూడు వందలమంది శిష్యులకు ఆధ్యాత్మిక విద్య నుపదేశించిరి. నిరతాన్న దానము సలిపిరి.

శతావధాని శ్రీగాడేపల్లి వీరరాఘవ శాస్త్రిగారు వీరి ముఖ్య శిష్యులు. ఒకసారి వీరరాఘవ శాస్త్రిగారు జబ్బునపడియున్న తమ గురుదేవులను దర్శించు నిమిత్తము దొనకొండకు వచ్చిరి. అచ్చట వారు డాక్టరు శ్రీ శంకమలం పిళ్ళెగారి దగ్గఱ ఔషదము సేవించు చుండిరి. శిష్యునిరాకడ, అతడవధాన క్రియలో దెచ్చుకొన్న పేరు ప్రతిష్ఠలకు కడుసంతసిల్లి గురువుగారు, 'అవధానమేమో, చేయుచున్నావట! నా సమక్షములో జేయవలసినది' అని కోరిరి. అప్పుడు డాక్టరు శంకమలం పిళ్ళె తదితర యుద్యోగస్థు లేర్పాటు చేసిన సభకు శ్రీ మేడవరపు సుబ్రహ్మణ్యశాస్త్రులవారే అధ్యక్షత వహించిరి. శిష్యుని అవధానమునకు మెచ్చి వారట్లు ఆశీర్వదించిరి.

ఉ: ఎన్నడు వచ్చు రాఘవుఁడి కెన్నడు తా నవధాన కార్య ము
సన్నుతి గల్గఁ బండితుల 'లెస్స' యనఁజేసి ముదంబుఁ గూర్చు నిం

కెన్నఁడిఁకెన్న డంచు. మదినెంచుచు నుండగ నీ సభాస్థలిన్
నన్నుత రీతి నల్పితివి; చాలముదంబు జనించె రాఘవా!

చం॥ మా॥...... ....
.... వహ్వారె; నీకవితాశుధార, వి
స్ఫుర దరవింద జాల, మధుపూర రసంబులఁదోఁచి, మేటి భూ
ధరముల ధిక్కరించు, వనితా కుచమండలి నొత్తుఁబుచ్చి యు
ద్ధిరయనిపించె, మిక్కిలి సుధీజన మోదముఁగూర్చె; నింక భూ
వరుల, సభాస్థలంబులను వర్థిలు వోయి! సుగౌరవంబునన్
బరపగ దోయి కీర్తిసుధ, భవ్యవచఃకుసుమంబులన్ బరా
త్పరుని, యజింప వోయి! గుణవంతులఁ బుత్రుల గాంచవోయి యా
దరమున నిన్నుఁబ్రోచు నతతంబును నాపరదేవి రాఘవా!

ఇట్లాశువుగా శ్రీమేడవరపు వారుపలికిరి.

శ్రీమేడవరపు వారు రచించిన గ్రంథములన్నియూ అద్వైత వేదాంత గ్రంథములే. 1) యథార్థ విచారము 2) విచారదర్పణము 3) అద్వైతాధ్యాత్మిక తత్త్వము (సుబోధక వచన గ్రంథము) అన్నియు ముద్రితములే.

శ్రీ శాస్త్రులవారు గద్వాలుకుపెళ్లి, మహారాజుగారిచే చండీయాగము చేయించిరి. సంతానములేని వారికి దైవోపాసనతో సంతానము ననుగ్రహించిరి. తమ మంత్ర శక్తులవలన గ్రామమందలి మశూచికాది బాధలను మాన్పిరి, శీతలా యంత్ర ప్రతిష్ఠాపనలు అష్ట దిగ్బంధన లొనర్చి, భగవతీ కటాక్షముతో గ్రామములను కాపాడుచు, అకాలమరణాదులులేక, శిశువృద్ధిగల్గి, పాడిపంటలతో తులతూగు నట్లొనర్చిరి.

వీరు తమ జీవితకాలమంతయు, నర్ధ శతాబ్దమునకు మించి రాయలసీమలో కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ యందును, కడప, అనంతపురము జిల్లాల యందును గడపినారు. వీరు రాయలసీమ వాసులుగా ఎన్నికైరి.

శ్రీ మేడవరపువారు తమ 62 యేండ్లవరకు అనగా 1947 సం॥ వఱకు గడిపిన జీవితచరిత్రను సమగ్రముగా వ్రాసిపెట్టిరి దానిని వారి శిష్యులైన శ్రీదుద్దులపల్లి వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారు పూర్తి చేసి ముద్రించి యున్నారు. గురువుగారు 1960 లో బ్రహ్మైక్యమైన సందర్భములో శిష్యులు శ్రీమద్దులపల్లివారు వ్రాసిన ఈ చరమ శ్లోకమొక్కటి విద్వద్రత్నము యొక్క విలువను వెలువరింప జాలును.

విద్వాన్ ప్రవక్తా వివిధాగమజ్ఞః
గురుః ప్రసన్నోస్తమితోధు నేతి
బ్రహ్మైవ సన్ముక్తితోథ వేతి
కిం శోచనీయం? కిమశోచనీయం.

విద్వాంసుడు, మంచివక్త, వివిధాగమజ్ఞుడు, సుప్రసన్నుండు ఇట్టి గురుదేవుడు మనకు లేకపోయెనే? యని కింశోచనీయం దుఃఖింపదగునా? బ్రహ్మవిద్బ్రహ్మైవ భవతి యను న్యాయమును బ్రహ్మ విద్వరిష్ఠుడై, బ్రహ్మమే తానై పోయె గనుక, కిమశోచనీయం—ఆనందింపదగునా?

———o———



శ్రీ రాప్తాటి సుబ్బదాసు

నిర్యాణము :- 19 - 5 - 64

తండ్రి:— నారప్ప

తల్లి :— లక్ష్మమ్మ

జన్మస్థలము :— ధర్మవరం.
అనంతపురం జిల్లా.

శ్రీ రాప్తాటి సుబ్బదాసుగారు కవులేకాగ యోగి పుంగవులు కూడాను. చిన్ననాటినుండియు తమ జీవితమును పరోపకార కార్యములయందే వినియోగించిన వారు. సంఘ సంస్కరణ పరాయణులు. ధర్మోద్ధరణ చికీర్షకులు. కళారాధకులు. దేశసేవా నిర్వహణ దీక్షా పరతంత్రులై తమ మనధనముల సమర్పించిన త్యాగపురుషులు. హరికథలను స్వయముగా రచించి, ప్రతి పట్టణమునకు సంచరించి హరికథా గానములను, పురాణ శ్రవణములను, ఉపన్యాసములను గావించుచు లోకమునకు ధర్మోపదేశము, సంఘసేవ చేయుచుండెడి వారు. వీరికి నాటకానుభవముకూడ కలదు. నాటకములందు ప్రధాన నాయక పాత్రలను ధరించి అభినయించి ప్రజల మెప్పులు పొందినారు. అప్పటిలో ప్రఖ్యాతి వహించిన సురభి కంపెనీవారి నాటక విధానములననుసరించి, సుబ్బదాసుగారు 1910-11సం॥ ప్రాంతము లందే 'అభిజ్ఞాన జయదేవ' నాటకమును రచించిరి. దానిని వారు తమ స్వగ్రామమైన ధర్మవరమున (అనంతపురం జిల్లా) " వాణీ మనోవినోదిని " యను నాటక సభను స్థాపించి దాని ద్వారా

ప్రదర్శించిరి. అందలి ప్రధానపాత్ర జయదేవుని భూమికను సుబ్బదాసుగారే నిర్వహించిరి. తరువాత వారు ఇహపర సాధనములకు మూలమగు హరికథా కాలక్షేపమును చేబట్టి నాంధ్ర దేశమునందంతటిని తిరిగి, ధనము క్రోడీకరించి, ధర్మవరమున హఠయోగాశ్రమమును స్థాపించిరి. వీరి శిష్యురాలు శ్రీమతి బొజ్జమ్మగారు పంద్రెండేండ్లుగా సుబ్బదాసుగారికి అండదండగానుండి అహోరాత్రులు నెరతెగని దీక్షతో పరిశ్రమించి హఠయోగాశ్రమాభివృద్ధికి తోడ్పడినది. అట్టిశిష్యురాలి వేడుకోలు వలనను పట్టుదల వలనను అభిజ్ఞాన జయదేవ నాటకమును (1941లో) " నిగమార్థ చంద్రోదయ "మను గ్రంథమాలను స్థాపించి తద్వార ముద్రించిరి. ఆ నాటకమును ముద్రించుటలోగల తమ యుద్దేశ్యమును కవిగారిట్లు తెలిపిరి.

"............... కవిసార్వభౌము లెందరో నాటక రాజము లను వెలయించి కీర్తి గడించుచుండిన యీ కాలమున, నేనీ కావ్యము ప్రచురించుటకుగల ముఖ్యకారణము, ఏతద్దృశ్యకావ్య మూలమున మహాత్ముని యహింసా సత్యముల రుచిని ప్రజలకు జూపి, వారిలో దేశభక్తిని పురికొల్పవలయు ననుటయే! అహింసా సత్యవ్రతములకు నాధారమనందగిన పురుషుడు జయదేవుడు. అమ్మహనీయుని జీవిత చరిత్రమున కాదర్శమువంటి యీ నాటక మీనాటికి నాంధ్ర లోకమున దర్శింపజాలినందులకు మిగుల సంతసించుచున్నాను."

శ్రీ మహాత్మాగాంధీ గారి ఆదేశానుసారము దేశ దాస్య విముక్తికై "వ్యష్టి సత్యాగ్రహము"న పాల్గొని కృష్ణజన్మస్థానమునకు వెళ్లుటకు మూడు దినములముందు సుబ్బదాసుగారు 8-1-41లో తమ శిష్యురాలు శ్రీమతి బొజ్జమ్మగారి కోరికపై 'ఆత్మారామ

గేయము' లను పేరుంచి స్త్రీలు పాడుకొనుటకు సులభముగా యుండు నట్లు రచించిరి. తరువాతి మూడు దినములకే పోలీసులు నిర్బంధించి నాలుగు మాసములు మాత్రము అలీపూర్ జైలులో సుబ్బదాసుగారి నుంచిరి. ఆ అజ్ఞాత వాసము ముగించుకొని వచ్చిన తరువాత ఆ గేయములను 1948లో ముద్రించిరి. ఆ గేయముల గాంధి తత్వము నిట్లు పాడిరి.

పల్లవి: భరతమాత దాస్య బంధము తొలగ నరులెల్ల శ్రీగాంధి తత్వము
అ. ప: నెఱిగి సత్యాహింస పరిపూర్ణ సిద్ధులై చెరసాలలకు వెళ్ళరాదు తత్వంబు
చ. మరు గొకించుకలేక సద్గురు కరుణా స్వాత్మా
 ను భవమును నెఱుంగ జేసితి ధరను నా చంద్రార్క
 మై కృతి నలరుగా కని ॥ శ్రీ ॥

అహింసా సిద్ధాంతమును సుబ్బదాసుగారు తమ 'పశుయజ్ఞ ఖండము' నందు ప్రబోధించిరి. దీనిని 1939లో ముద్రించిరి.

తే॥ గీ. గ్రాస మడుగదు గర్జింప రోస పడదు
 భార మెత్తిన యజమాని దూర లేదు
 ఇట్టి సోదర పశువులన్నట్టి మనుజ
 పశువు దినసౌనె న్యాయమే బయిసి మాలి.

తే॥ గీ. సిత్రికములను భక్షించి నిష్కలంపు
 జల మొసంగెడు చేపల జంపు టేల
 తళుకు దేహము సొంపుల గులుకు కనులు
 జూచి యానంద పడరాదె చూట్కి లేదె.

తే॥ గీ. పరమ నీచులు పతితులు బాలిశులును
 పుణ్య భీరులు కటికలు పణ్యాజనులు
 దైవతా ప్రీతి యని మేక తలలు గొట్టి

శవములను వ్రేల్చి భక్షింత్రు శాపతప్త
బ్రహ్మరాక్షసుల విధానబయిసిమాలి.

తే॥ గీ. జంతు సంతతిని నిజాత్మ సమతజూచు
మతమె సుజ్ఞాన ధనుల సంమ్మతముకాని
కఠిన దుర్భర క్రోధ సంఘటిత వృత్తి
లాతిప్రాణులజంపు టేలాటిమతము.

అభిజ్ఞాన జయదేవ నాటకమునకు శ్రీ మహాభక్త విజయమందలి కథమూలము అందలి ఒక పద్యమును మచ్చునకు చూతము

చం॥ నిను నెడబాసినే నిలువ నేర్తునె యీపుడమింగురుప్రభూ!
యనలము బాసి యర్చియును, నభ్రముబాసి తటిల్లతాంగి యుం,
మనుజుని బాసి ఛాయ, రవిమండలముఙ్ బెడబాసి యెండయుం
గనబడునే? నిజంబుగ జగంబున నాగతి యింతయే యికఙ్.

ఇందలి రచనా విధానము, పాత్రలపోషణ, సంభాషణములు మనోజ్ఞము. ప్రేక్షకులకు విసుగు పుట్టింపకుండునట్లు రచించుట కవిగారి నేర్పు. కవితాధార అనర్గళము. సులభశైలి. వీరు మరి కొన్ని గ్రంథములను కూడా వ్రాసిరి. 1) మానసగీతావళి 2) సుప్రకాశ శతకము. 3) పరమేశ్వర శతకము 4) విష్ణునామావళి 5) హితబోధిని. వీరి శిష్యులు ధర్మవర పట్టణమున పెక్కుమదున్నారు. ఇప్పటికి సీ హఠయోగాశ్రమము కలదు. 19–5–64యేట సుబ్బదాసుగారు తమ భౌతిక దేహమును చాలించిరి.

———— o ————

సాహిత్య శిరోమణి—ఉభయభాషాప్రవీణ—కవిరాజు



శ్రీ కాండూరు నరసింహా చార్యులు

జననము:— 15-6-1900

నిర్యాణము:— 24-1-1972

తల్లి - శ్రీమతి తిరువేంగడమ్మ

తండ్రి — శ్రీ కాండూరు రాఘవా చార్యులు

మతము, కులము:— హిందూ బ్రాహ్మణు— శ్రీ వైష్ణవులు

జన్మస్థలము:— మహబూబ్‌నగర్ జిల్లా—'వనపర్తి' (కడప జిల్లా జమ్మలమడుగులో స్థిర నివాసమేర్పరచుకొనిరి)

శ్రీ కాండూరు వారు కడుపేద కుటుంబమున పుట్టినవారు. తమ యారవ యేటనే తండ్రిని కోల్పోయి తల్లి సంరక్షలో పెరిగిరి. భిక్షాటనము చేసి ఆమె తన యిరువురు కుమారులను పోషించినది. పెద్ద కుమారునకు విద్య అబ్బలేదు. రెండవ కుమారుడైన నరసింహాచార్యులనైనను విద్యావంతుని జేయ ఆమె సంకల్పించినది. ఆచార్యులవారికి సహితము విద్య నేర్వవలెననెడి కాంక్ష హెచ్చె. 1915 సం॥ నుండి 1926 సం॥ వరకు ప్రొద్దుటూరు, మదరాసు, మైసూరు, బెంగళూరు కళాశాలలలో సంస్కృతాంధ్రములను నేర్చిరి.

1926 సం॥ నుండి 1955 సం॥ వరకు కడప జిల్లా జమ్మలమడుగు పి.ఆర్. బోర్డు హైస్కూలులో ప్రధానాంధ్ర పండితులుగా పనిచేసిరి. వీరికి సంస్కృతాంధ్రము లందు మంచి ప్రావీణ్యము కలదు. సాధారణముగ వీరు ప్రాపంచిక పరిణామములను విమర్శించుకొనుట యొక యలవాటు. వీరి రచనలో అట్టివిశేషములే గోచరించు చుండుట గమనింప దగినది.

సాంఘిక యితివృత్తమును గైకొని చక్కటి సాంఘిక ప్రబంధమును తీర్చి మెప్పులు బడసిన ఘనత శ్రీ కాండూరు వారికి "మోహన విజయము" అను కావ్యముతో దక్కినది. ఇట్టికావ్యము లప్పటిలో పలు విమర్శలకు గురియైనను, ఆచార్యులవారు వాటిని గణింపక 'నాదృష్టివేఱు' అనురీతి యెదురొడ్డిరి. వారి దృష్టిలో సందేశమే ప్రధానము.

ఇందు మోహనుడు ప్రధాన నాయకుడు. అతని తండ్రి విశ్వపతి లోభి. కుమారుని విద్యకు సహితము ధనము వెచ్చింప నుత్సహింపని వాడతడు. మోహనుడు తుదకు ప్రభావితుడై విద్య నభ్యసించుకై దూరదేశముల కేగినాడు. దేశాటనమువలన అతనికి విద్యతోబాటు లోకజ్ఞాన మలవడినది. విద్యావంతుడై తిరిగివచ్చిన కుమారునకు 'వరకట్నము' విశేషముగా నిచ్చునొక సంబంధమును తండ్రి కుదిర్చినాడు. మోహనుడు తండ్రికి హితబోధచేసి, తాను ప్రేమించిన సుశీలనే వివాహ మాడినాడు. ప్రతిదినము భార్యాభర్త లిద్దరూ గ్రామసంచారము గావించి ప్రకృత కాల పరిస్థితులను బట్టి దేశ పద్ధతులను, రాజ్య పాలనమును, ప్రజల కిట్లు పదేశించిరి.

ఉ॥ అన్నలు తమ్ములంచుఁ, దమ యన్వయ మందొక గుంపు వారిపై
మన్ననఁ జూపి యెన్నుకొన మాన్యపుఁ బౌరత పాడుసేయుటే,

యెన్నికలం బ్రభుత్వమున కెన్నిక సేఁత వివేక సూన్యులన్
గన్నెల నిచ్చి నీచులకు గాళ్లకు మ్రొక్కుచు దిర్గుటె యుగస్.

చ॥ ప్రజలె ప్రభుత్వ మంచదరు బాధ్యత పౌరుల ధర్మమంచుఁ దా
నిజముగఁ బౌర ధర్మముల నిశ్చల చిత్తత నాచరించు వాఁ
డు జగమునన్ సునీతిపరు డుజ్జ్వల నిత్యసుఖంబు లొప్పగస్
విజయము లందు చుండుఁ బృథివిస్ సహుభావము లుల్ల సిల్లగస్.

ఇట్టి సాంఘిక విషయముల పెక్కింటిని వారచ్చటచ్చట తమ కావ్యములందు తడిమిరి. "వినోద–బహిష్కరణము" లను బహు ఖండ కావ్యమునందు సహితము పేరియసి ప్రియుల మనోభావములు దేశసేవ సలుపుటయందు నిమగ్నము కావలెనని ప్రబోధించిరి. "బహిష్కరణ" ము నందు శ్రీ యామునాచార్యుల వారు గవించిన హరిజనోద్ధరణ విధానమును సూచించిరి.

"మారన" యను మాలవాడెట్లు రంగశాయి భక్తుడయ్యెనో యిందు వివరింపబడినది. చక్కటి శైలిలో సరళముగా పద్యములు సాగినవి. మారనకొక యతిపతి యుపదేశము లభించినది. దానితో అతడు శ్రీరంగని సేవించుటకై శ్రీ రంగపట్టణమునకు బయలు దేరినాడు. శ్రీరంగ పట్టణము నిట్లు కవిగారు వర్ణించిరి.

సీ॥ రంగ త్తరంగ నిర్మల వారిపూర్ణమై
యుభయ కావేరు లింపొనఁగు చుండ
భక్తులు ప్రోవ నిర్బంధించి నట్టుల
నేడు ప్రాకారంబు లెనఁగు చుండ
శ్రీ వైష్ణవుల గోష్ఠిసేవింపఁ దలకొని
దివ్య ప్రబంధ గీతికలు పాడ
సంభృతానంద సంస్తవన మోహన లీలఁ
గొబ్బరి తోఁపులు గులుకు చుండ

తే॥ హాయి శ్రీశేషశాయి యై యలరు చుండు
రంగపతి సేవసేయ శ్రీరంగ పురికిఁ
దరలె "మారడు", దివ్యబోధంబు గలుగ
నైహికా పేక్షఁ గుమిలెడు ననద గలఁడె?

వీరి మరియొక ఖండకావ్యము ' పూలతోఁట '. ఇందెన్నో సుగంధ కవితా కుసుమములు విరబూచినవి. తోటలోని వివిధ పుష్పములవలె పెక్కు విషయములిందు ప్రస్తాపించ బడినవి. అప్పు చేయుట యెంతటి తప్పో. అదెంతటి ముప్పునుగొని తెచ్చునో ఈ క్రిందివి పద్యమున మనకు విదితమగును.

ఇంద్రుని యంత వారు నిను నెమ్మొయి నమ్మినఁ గొంపఁ గూల్తు, రా
జేంద్రులనేని బొంక వలపిచెందు. నీయెడ నీతి సున్న, ని
స్తంద్రులనైన నీవలపు తంత్రమునం బడద్రోతువా హరి
శ్చంద్రుఁడె నిన్ను నమ్మి యగచాట్లకు లోనయికుంది క్రుంగడె॥

కాయ కష్టమునను గలియేని గంజియే
గుడిచి తృప్తినందుఁ కోవిదుండు
చేత కాని కుమతి చేసిన యప్పులఁ
దీర్చలేక సతము దిగులు చెందు.

పేద రైతుకు కష్టముమెండు. దానికితోడు దురదృష్ట మెదురైనచో యతని దీనావస్థ జెప్పనలవికాదు. ఒక పేదరైతు అదృష్ట మెట్లున్నదో సహజముగా నిరూపించిరి. చూడుడు.

ఎద్దులఁ గొన్న బాకి పరికింపగ దీరక మొన్నెరోగ మా
యెద్దుల బొట్టబెట్టుకొని యేచగ దానికదోడు నిత్యమున్
చద్దుల మోసి మోసి బహు సంకట పాటుస కోర్చు భార్యయున్
ముద్దుల బిడ్డలాకటికి బొక్కుచు నుండగ జింత యుండదే.

అశోక రాజ్యము, రామరాజ్యమనునవి వీరి మహా ప్రబంధ ములు. రామరాజ్యము నందు రామాయణ గాథను వ్రాసిరి.

'మన దేశమున రామాయణము వ్రాయని కవిలేడు. ఎందఱు వ్రాసినను విసుగు జనింపని లోకోత్తర గుణవిశేషములును, ధీరోదాత్త నాయకుడందుండుట ముఖ్య కారణములైనవి. స్వతంత్ర భారత దేశమును రామరాజ్యముగా భావించు కొనుచున్నాము. అందెంత వరకు సత్యమున్నది? రాముని యవతారము, అత డెదుర్కొనిన కష్టపరంపరలు, సాధించిన ఘనకార్యములు, అతని పరిపాలనా పద్ధతి మొదలగు నంశములను గ్రహించి, ఆవిధముగా నడచుకొన్నప్పుడే మన రాజ్యము 'రామరాజ్యము' కాగలదు. ఈ విషయ మెల్లరు గ్రహింపవలెనని నేను రామకథను సులభముగ సంగ్రహముగా లోకమునకు వెల్లడించుటయే నా పరమోద్దేశ్యము.' అని కవిగారు తెలుపు కొన్నారు.

రామలక్ష్మణు లెట్లు తమభోగములు విడిచి యరణ్యవాసము నకు యోగ్యులై వెళ్లిరో నీ క్రింది సీసపద్యమున రమ్యముగా జెప్ప బడినది.

సీ॥ పట్టు పుట్టంబుల పసమించు మొలలపై
నార చీరల జిగి నాటి మెఱగ;
నునుపరి కుసుమ వాసనల నింపు దలిర్చు
సిగలు జడకట్లౌ మొగము లలర;
గస్తూరి కాంగ రాగములు పిసాళించు
మేన సంతట బూడి మెఱుగు లీన;
రంగు మీఱెడు పాదరక్షలం బొలుపొందు
నడుగులు పాపల నంద గింప;

తే॥ చాప నమ్ముల పొదులు బుజమ్ము లెక్క
మూర్తి గైకొన్న సన్న్యాసమో యనంగ
రహి వహించెడు శ్రీరామలక్ష్మణులకు
భోగములు వీడ సన్న్యాసయోగ మమరె.


ఇట్లీ మహా ప్రబంధమును రచించి కవిగారు పుణ్యమును, పురుషార్థమును సాధించిరి. వీరి తర కృతులు పెక్కు గలవు. హర్షుడు, భీష్ముడు నీ రెండునూ విద్యార్థుల కుపవాచకములుగా నుండినవి. రంగనాథ శతకము, కావ్య ప్రకాశ వివరణము, సాహిత్య విచార చంద్రిక, సందేశము. చంద్రా పీడుడు, కలభాషిణీ చరిత్ర, ప్రారంభ వ్యాకరణము మొదలగునవి వీరి కృతులలో ముఖ్యమైనవి. మహాశ్వేత—పరివర్తనము వీరి అముద్రిత నవలలు.

ఆస్థానకవులుగా నుండిన శ్రీ పాదకృష్ణమూర్తి శాస్త్రిగారు వీరికి ‘కవిరాజ’ యను బిరుదము నిచ్చిరి. కవిత్వముతో బాటు ఆయుర్వేదము నందు అమోఘమైన అనుభవమును సంపాదించి వైద్యవృత్తిని నెరవేర్చిరి.

భార్య అంధురాలు. ఆయనకు యిద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కలరు. కుమారుడు శ్రీ కాండూరు రంగ రామానుజాచార్యులు, ప్రొద్దుటూరులో ప్రస్తుతము నివసించు చున్నాడు. ఆచార్యులవారు తమ యుద్యోగమును విరమించిన తరువాత తమకు గల శ్రావ్య మధుర కంఠముతో ప్రవచనములు సాగించుచుండిరి.

అంతటి మహనీయులు డెబ్బది రెండేండ్లు జీవించి, తనువును చాలించిరి.

———— o ————



అభినవగౌరవ

శ్రీ గార్లదిన్నె సుబ్బారావు

జననము:— 1893

నిర్యాణము:—1966

తల్లి: శ్రీమతి నరసమ్మ

తండ్రి శ్రీ పెద్దనారాయణప్ప

మతము, కులము:— హిందూ—బ్రాహ్మణ—స్మార్తులు—
కౌండిన్యన గోత్రులు,

జన్మస్థలము:— 'సోదనపల్లె' అనంతపురం జిల్లా.

శ్రీ సుబ్బరావుగారి పూర్వీకులు అనంతపురం జిల్లా 'సోదన పల్లె'లో నివసించిరి. వీరి వంశకర్త పెద్ద నారాయణప్పగారు. అతడు కీర్తి ధనుడు. ఆ పల్లెకు దణి.

ఈ కవిగారి వంశవృక్ష మిట్లున్నది.

గార్లదిన్నె సుబ్బారావుగారి
- తండ్రి:—శ్రీ పెద్దనారాయణప్పగారు
- తాత:— శ్రీ సుబ్బరావుగారు
- ముత్తాత:— శ్రీ అశ్వత్థప్ప
- ముత్తాత తండ్రి:— శ్రీ పెద్ద నారాయణప్ప (వంశకర్త)

కవిగారు తమ విద్యను గూర్చి ఉత్తర హరిశ్చంద్రీయములో నిట్లు వ్రాసుకొనిరి.

ద్వి: దేశభాషా పయోధిని వ్రేలుసద్ది
సేవించి సంతృప్తిఁజెందితిఁగొంత
త్రైలింగ భాషాతరంగణిన్ మున్గి
తేలుచు, మఱి మున్గితేలితిఁగొంత
గణిత శాస్త్రంబను – ఘన కూపమందు
మునిగి లోతరయఁగ పాదలితిఁగొంత
ఆవని నిబ్బంగి, విద్యామహత్వముల
తవణిల్లి యున్నవాఁతను, గురూత్తముల
సేవించి, తత్ప్రియాశీర్వాద పూత
జీవిత సౌఖ్యంబుఁ జెంది యున్నాఁడ;
ఏపని కెంపేని నేవేళనైన
శ్రీపతి పదములే చేపట్టి నాఁత
సుబ్బరాయాఖ్యతఁజొప్పడి నాడ
గబ్బంబు వ్రాయగా గడగితి నిట్లు

సుబ్బరావుగారు గౌరనచే పూర్వము వ్రాయబడిన హరిశ్చంద్ర కావ్యములోని యంశము లెల్లను గ్రహించి, కథారుచికొఱకు కొంత కల్పించి ద్విపదలో వ్రాసిరి. ఈ కార్యమునకు బ్ర॥ శ్రీ॥ విద్వాన్ తొగర్చేటి భాస్కర సిద్ధాంతుల వారు ప్రోత్సహించిరి. గౌరన గారి కావ్యమునకిది తరువాత దగుటచే దీనికి 'ఉత్తర హరిశ్చంద్రీయ' మని పేరిడిరి. ఈ కావ్యమును 1935వ సం॥ జూన్ నెలలో శ్రీయుత రాచోటి రామయ్యగారికి (ఆదోని) అంకిత మొసంగిరి.

ఈ ఉత్తర హరిశ్చంద్రీయము ఆరు ఆశ్వాసముల ద్విపద కావ్యము. ఇందలి తృతీయాశ్వాసములో చంద్రమతి నిట్లు కవిగారు వర్ణించిరి.

(హరిశ్చంద్రుడు తన మనంబున నిట్లు తలచుచున్నాడు)

“ ఈ రామతోఁజెల్మియేపారి సౌఖ్య
వారాశిఁదేలని వాని యందంపు
కన్నులు సున్నలు; కళలొప్పు మొగము
చెన్నులు సున్నలు; చెలువొందు కేలు
దమ్ములు వమ్ములు; తగవాని కారి
యమ్ములు దిమ్ములు; నాయత బాహు
దండముల్ ఖండముల్; తద్దయు వాని
పండుగల్ దండుగల్; పడసిన పెన్ని
ధానంబు న్యూసంబు; ధరణిలో వాని
ప్రాణంబు క్షీణంబు; పల్కులింకేల?

....

‘కలకంధర’ యేకుల వడకుటను కవిగారిట్లు వర్ణించిరి.

ద్వి: తోడి చేడెలఁజూచి దొడ్డరాటంబు
వేడుకఁ దాసును బెట్టికొనుచు, న
నేకుల కుపయోగ మేకుల వృత్తి
కే కొలగలదని యేకుల వడుకు
రాటము ముందట రతనంపు జిన్న
పీటపైఁగూర్చుండి బిసరుహపాణి
కుడికాల రాట్నపు కొనపీటద్రొక్కి
యెడమ హజ్జనిలుపు నిలజిక్క బట్టి
కడియముల్ గాజులు కట్లు తోడాలు
బడిబడి ఘల్లని ధ్వనిసేయు చుంత
గుడిచేతితోఁబిడిఁగొని త్రిప్పి త్రిప్పి
ఎడమ కేలుననేకు నెగయాడ్చి యాడ్చి,

తన చూడ్కి యేకుతో దారంబుతోడ
ననుగమింపఁగ దార మప్పుడునపుడు
కదురుకుఁ జుట్టిన క్షణమాత్రమందు
బెదరు జింక తెఱంగు వీక్షణల్ ద్రిప్పి
చేయెత్తినప్పుడు చెఱఁగు దొలంగు
నాయెడ వామ కుచార్ధభాగంబు
పొడసూపి ముచ్చటల్ ముంచి వైపంగ
వెడదనెన్నుదుటి పై స్వేదబిందువులు
బొడముచు నవసితాంభోజంబు మీద
బెడగారు ప్రాలేయ బిందువు లట్లు
తొప, నీరీతి నా తొయ్యలి రాట
మాపక త్రిప్పు చున్నట్టి కాలమున

కవిగారి హృదయములో గాంధీగారి జాతీయ భావములు, దేశీయ వస్త్రపరిశ్రమ, రాట్నసంగీతములు, మెదలుచుండె ననుటకీ 'ఏకులవడకు' వర్ణనమే నిదర్శనము.

వీరు హరికథలను కూడా వ్రాసిరి. అవి వ్రాత పత్రులుగానే నిలిచిపోయినవి. రుక్మిణీ కల్యాణ హరికథలో రుక్మిణీదేవి గౌరీ పూజ కరుగు వర్ణన ఎట్లున్నదో చూతము.

సీ. భీష్మకాలయ సుధాబ్ధిని వెలువడి కళల్
దేఱెడు నిందిరాదేవి యనగ;
తన జనంబులకు, దర్శన మీయ రూపొంది
యరుదెంచు నవ్వీటి సిరి యనంగ;
చైద్యాది దానవ సమితి మోసము సేయ
జనుచున్నయట్టి, మోహిని యనంగ;

భక్తావ సుందగు పద్మదళాక్షుని
        కవియు బోయెడు కీర్తి కాంతయనగ
గీ. నిజగృహమునకుఁజను, 'భవానియె'యనంగ
నృప సమూహము డిగనాడి కృష్ణు నందె
లక్ష్య ముంచుచు జను, జయలక్ష్మి యనఁగ
గ్రాలె రుక్మిణి రాజమార్గంబు నందు.

వీరు వ్రాసిన 'దుర్గాదాసీయమ'న బడు నాటకము గూడ వ్రాత ప్రతి గానే నిలిచిపోయినది. ఆ నాటకమునందు దుర్గాదాసు గావించిన వీర విహారము నిట్లభివర్ణించిరి.

సీ॥ తోలెనా గుఱ్ఱముఁ జూ దుముకుచు రణమున
        నెదిరి గుఱ్ఱంబులు బెదరి పారు;
త్రిప్పెనా ఖడ్గమున్ దెసలు దీపింప; న
        రాతి నేత్రంబులు మూత పడును;
విసరెనా యసిలతన్ వెసవెన పగఱ, త
        లలు డుల్లు తాళఫలంబు లట్లు;
విడిచెనా బాణముల్ వీకవైరుల తనుల్
        గుదులుగా గుదులుగా-గ్రుచ్చి పోవు;
గీ॥ మూలబలము పై శ్రీరాముపోల్కి కదన
రంగ మందెల్ల యెడలఁ గనుంగొనంగ
చక్రభంగి దుర్గాదాసు విక్రమించి
యుండె నే మందు నతని శౌర్యోజ్జ్వలంబు.

1) కృష్ణశతకము 2) రామకుమారాభ్యుదయము (నాటకము) 3) అనసూయామహిమ (నాటకము) అనబడు గ్రంథములు వ్రాసినట్లు ఉత్తరహరిశ్చంద్రీయములోని ఉపోద్ఘాతము

ద్వారా తెలియుచున్నది. వీటిని కీ॥ శే॥ బదినేహాళు తమ్మిరెడ్డిగారు ముద్రించిరి.

ఇట్టి యజ్ఞాత కవుల వివరములు తెలుసుకొనుటకు భగీరథ ప్రయత్నమే చేయవలసి యుండును. కవి వంశీకు లీవిషయము లందు సహకరింప నుత్సహింపనిచో వారు కృతులలో వ్రాసుకొన్న విషయములు తప్ప హెచ్చు విషయములు తెలుసుకొనుట కవకాశ ముండదు.

ఈ ఇరువదవ శతాబ్దకవుల విషయములే మన కగమ్యగోచరములైనప్పుడు, పూర్వ కవుల విషయములిక జెప్పపనిలేదు. కాన కవివంశస్థు లట్టి వారి చరిత్రలను వ్రాసి వుంచుకొని, వెలుగు లోనికి దెచ్చి, వంశకీర్తి నినుమడింపజేసి ధన్యులగుదురని మా విశ్వాసము.



సాహిత్యసరస్వతి

శ్రీ సీరిపి ఆంజనేయులు

జననము:— 1—6 1891

నిర్యాణము:— 27—11—1974

జన్మస్థలము:— ధర్మవరం
అనంతపురం జిల్లా

తల్లి:— నారమ్మ

తండ్రి:— రామన్న

మతము; కులము:— హిందూ—కాపు

కవిగారు తమ విద్యాభ్యాసమును ధర్మవరము వీధిబడుల లోను, మిషన్ వారి పాఠశాలలో ప్రాథమిక విద్యయు జరిపిరి. తండ్రిగారి యాదేశాను సారము చిన్ననాడు కొంతకాలము వృత్తి విద్యయగు వ్యవసాయమునకే ప్రాధాన్యమిచ్చినట్లు వారు వ్రాసు కొన్న పద్యముల ద్వారా మనకు విదితమగు చున్నది.

నన్నుఁదనవలెఁ గృషక సంపన్నుఁజేయ
నెంచి, మజ్జనకుఁడు నియోగించె 'పొలము
పనుల యెడ నష్టచూపుట పాడి' యనుచు
నట్టి మొదలను దలదాల్చి యడరు గంటి.

బండి తోలుట, మేడిని బట్టుటయును,
జేతఁ గొని పార గనిమలు చెక్కుటయును,
మ్రాను గడుపుట, యిట్టి కర్షములనెల్ల
నాకు నామాతులుఁడు, కొన్నినాళ్లు గఱపె.

శ్రీ సీరిపి ఆంజనేయులుగారి వృత్తి ఒజ్జరికము. తాము చదివిన 'మిషను' వారి బడిలో 1911 నుండి 1920 వఱకు పదేండ్లును, మాండలిక మాధ్యమిక పాఠశాలలో ఐదేండ్లును. (1920 నుండి 1925 వఱకు) అనంతపురము నందలి స్త్రీల ట్రయినింగ్ స్కూలు నందు యిరువది రెండేండ్లును(1925-46) పనిచేసి విశ్రాంతి బడసిరి. చిరకాలము ఆంధ్ర భాషా సేవకే పాటు బడిరి, విద్యార్థులచేత తెనుగు పరీక్షలకు కట్టించెడివారు. పూర్వజన్మ సుకృతాను సారము వీరి కాదర్శగురువుల సన్నిధి, కవిత్వమలవడినది.

కలకత్తా యందలి 'నిఖిల భారత సాహిత్య విద్యా పీఠము'న కథానిక, నవలా రచనా విభాగమునకు జెందిన ప్రత్యేక పట్ట పరీక్షయందు 1921వ యేట, నత్యుత్తమ శ్రేణిని జయమంది,

సాహిత్య సరస్వతి' యను బిరుదము వడసిరి. ధర్మవరమున 'విజ్ఞాన వల్లికా గ్రంథమాల'ను స్థాపించి తమ రచనలనే కాకుండా తదితర కవిపుంగవుల పుస్తకములను సహితము ముద్రించిరి.

విజ్ఞానవల్లి–ప్రకృతిమాత– విద్యార్థి మున్నగు పత్రికలకు వీరు సంపాదకత్వము వహించి వానిని సమర్థతతో నడిపి, ప్రాజ్ఞుల ప్రశంసల నందుకొన్నారు.

సాహిత్య ప్రక్రియలోగల యన్ని ప్రధాన పోకడలను వీరు చేపట్టిరి. చారిత్రాత్మకాంశములను పరిశోధించి గ్రంథస్థ మొనరించిరి. వీరు వ్రాసిన చరిత్ర గ్రంథములలో ముఖ్యమైనవి. 1) విద్యానగర చరిత్రము 2) విద్యానగర వీరులు 3) ధర్మవర చరిత్రము 4) అనంతపుర మండల ఆదిమవాసుల చరిత్ర 5) చిక్కప్ప యొడయరు లేక చిక్కన్నమంత్రి 6) ముసలమ్మముక్తి.

అప్పటిలో పాఠకులు నవలలు, నాటకము లందాసక్తిని గల్గి యున్నారని యెఱింగిన సీరిపివారు తమరచనా పోకడల నటువైపుకు కూడా కొంత మరల్చిరి. 'శారద' యనబడు వీరి అపరాధ పరిశోధక నవలకు మంచిపేరు లభించినది. తదుపరి వీరు వీరవిలాసము, కుముదవల్లి యను నాటకములను రచించిరి. కుముదవల్లి నాటకమును శ్రీకృష్ణదేవరాయ గ్రంథమాల వారు తమ తొమ్మిదవ పుష్పముగా ముద్రించిరి.

పై గ్రంథములేకాక 1) గౌతమ బుద్ధ చరిత్ర 2) సీతారామావధూత చరిత్ర 3) అన్యాపదేశము మున్నగు కృతులను వీరు రచించిరి. వీరు తమ విజ్ఞాన వల్లికా గ్రంథమండలీ ముఖమున

శ్రీ నారునాగనార్యుడు, శ్రీ వేదం వేంకటకృష్ణశర్మ, శ్రీ కుంటిమద్ది శేషశర్మ, శ్రీ కల్లోడు అశ్వత్థరావు, శ్రీ విద్వాన్ విశ్వం మున్నగు ప్రముఖ రాయలసీమ కవి పుంగవుల పొత్తములను ముద్రించి కృతిభర్తలైరి. సాహిత్యపోషణే కాక భూరిదానము లిచ్చిన త్యాగమూర్తులు వీరు. ఆంధ్రప్రదేశ్ సర్వోదయ పక్ష భూదాన సమితికి 72 ఎకరముల నేలను 1957వ సం॥న భూరి విరాళ మిచ్చిరి. భారత రక్షణ నిధికై రూ. 1116/—లను ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి ద్వారా నొసంగిరి. 1949వ సం॥ లో ధర్మవరమున రైల్వే జంక్షనునకు పడమర 120 ఎకరాల సొంత నేలను విశాలమగు వీధుల నొప్పెడి యొకపేటగా 'ఆంజనేయపుర' మను పేర నెలకొల్పినారు. ధర్మవరమున కళాశాల భవన నిర్మాణమునకు 24 ఎకరముల భూమిని స్వచ్ఛందముగ దానమొసగిన త్యాగశీలురు వీరు.

ప్రకృతి వైద్యమును నమ్మి నిర్విరామ ప్రచారమును గావించిరి. ప్రకృతి మాతను సేవించిరి. వారు ఎనుబది మూడేండ్ల వయసులోను నవయవ్వనులకంటే హెచ్చగు నారోగ్యమును బొంది యుండుటకు కారణము వారు ప్రకృతి చికిత్సను గాఢముగా విశ్వసించి యుండుటయే.

సీరిపి వారి 'కరుణగీత' యొక విషాద పరిస్థితులందవతరించినది. ధర్మవరమున 1919లో నూరజాతర పేర నూటారు నోరులేని జంతువులు బలియైనవి. ఆ మహాఘాతుక కార్యము కవిగారి హృదయమును గదల్చినది. అదిట్లు గీతముగా సాగినది.

....

చీమనేనిఁ బుట్టింపఁగా జేత గాని
నరుఁడు, పరులను జంప నే కరణిఁ దగును?

ప్రాణి హింసన మెల్ల యీశ్వరుని హింస
ఈశునకు క్షమార్హుఁడుగాఁడు హింసకుండు.
కాన నే ప్రాణికైన నేకడలనైన
నెప్పుడైన నొక్కింతయు హింస లేక
ప్రజ్ఞమై మసనేర్చుట పరమ హితము
ప్రేమ రసమొల్కఁ బ్రాణులఁ బెనుచు చుంట
ఈశ్వరా రాధ నమ్మది శాశ్వతమ్ము
ధర్మ మార్గమ్ము పరమ పదమ్ము గనుఁడు.

వీరి 'అన్యాపదేశము' అనంతపురము రాయలకళా గోష్ఠి వారిచే ప్రకటింపబడినది. ఇందనేక విషయములు రమ్యముగా వ్రాయబడినవి. 'బూటకము' శీర్షికలో కవిగారు దిష్టి బొమ్మ నిట్లు వర్ణించిరి.

కాయమూ వట్టి కట్టి; కన్గవయుఁదొట్టి;
మస్తకము మట్టి బుట్టి; జన్మమ్మె పట్టి;
బూటకపు గావుపై పొలములను నిల్చి,
జంతు సంతానముం జడిపింతు వౌర!

గుట్టు సాగిన దాక నీకొలువు సాగు
నో బెదురుబొమ్మ! గుట్టు రట్టౌంచె నేని
యెవడు నిన్నొక మనిసిగా నెన్నువాడు?
వెస మెన్నాళ్లు మూసి దాపెట్టఁ గలము?

అమాయకత్వమును గూర్చి కవిగారిట్లు వ్రాసిరి.

కొమ్ము గవఁబన్ను నూలిపోగులను జుట్టి.
పొనగ బండారు కుంకుమల్ నొనటఁ బెట్టి:
గళమునఁ జేప పుండ దండలను గట్టి,
పొలియిడగ నిన్ను గుడికిఁ గొంపోవు వేళ;

పెనురవమ్ము తెనంగ దప్పెటలు మ్రోయఁ
గొలుపుగోలది నీగొంతు కోఁతకే యని
తెలియ నేరక, బయలి చూపుల వెలార్చి
వెడలు దువు గంతులిడుచు నో వెఱ్ఱి గొఱ్ఱె!

అనంతపుర మండలమున వీరి శిష్యులు పెక్కుమంది పెద్ద పెద్ద యుద్యోగములందుండి, వీరిని స్మరించుకొను చుందురు.

శ్రీ సీరిపి ఆంజనేయులు తమ 83వ ఏట జబ్బుపడి ప్రకృతి చికిత్సానుసారము రెండు దినము లుపవసించిరి. నీరు మాత్రమే తీసుకొన్నారని వారి భార్య సీరిపి సావిత్రిమ్మగారు చెప్పిరి. నీరస స్థితిలో ఆస్పత్రి జేరిరి కాని లాభములేక పోయెను. తమ స్వగృహములో 27-11-1974వ తేది స్వర్గస్థులైరి. వీరి భార్యకూడ ఒక సంవత్సరములోనే తీరుకొన్నారు. వీరికి సంతానమేమియు లేదు.

వీరి గృహములోనే పుస్తక భాండాగారమున్నది. అమూల్యమైన పుస్తకములను వీరు సేకరించిరి. అనంతపురములో పెద్ద మహడీ ఇండ్లు మూడుగలవు. ఇప్పుడు వీరి ఆస్తి అన్నకొమారులకు, మేనల్లునికి దక్కినది.

తమ జీవితమును సాహిత్యసేవ కుపయోగించిన పుణ్యధనులు వీరు. ఇట్టి సాహిత్య పోషణను కవిగారి వంశీకులు చేపట్టి వారి కీర్తి నినుమడింప జేతురని తలంచుచున్నాము.

* * * *



శ్రీ పిళ్లారిసెట్టి రంగబ్రహ్మరావు నాయుడు

జననము.— - 1890

నిర్యాణము:— 1962 ఆ ప్రాంత్యము

తండ్రి:—పిళ్ళారిసెట్టి శ్రీ కృష్ణులునాయుడు

తల్లి:— పేరు తెలియదు

మతము, కులము:— హిందూ—అదివెలమ

చేసిన ఉద్యోగము:— బళ్ళారిలో, తహసీలుదారు పని

1930 లో ఆదివెలమ శతకము, సీస పద్యములతో వ్రాసినారు. ఈ శతకములో శ్రీ విలసిల్లు బృందావనములో, కృష్ణమూర్తి జన్మించిన రీతిగా, ఆదివెలమ కులము పుట్టుక స్థలము బృందావనమే అనగా 'బందరు' అని సూచించినారు. బందరును వీడి ఉద్యోగ వశమున అప్పటికి రాయలసీమలోనున్న బళ్ళారిజేరి తహసీలుదారు ఉద్యోగము నిర్వహించిరి. స్వయముగా కవులు.సారస్వతాభిమానులు

1931 లో, బళ్ళారిలో నెలకొల్పబడిన శ్రీ కృష్ణ దేవరాయ గ్రంథమాల వార్తవిని వారాసంస్థ మేనేజింగు ఎడిటరుగారి నింటికి పిలిపించుకొని ఇట్లు చెప్పిరి. "ఈ యుద్యమ మెంతయు, బళ్ళారి పట్టణంబునకు దగియున్నది. చేసియే తీరవలయును. పట్టుదలచే కృషి జరిగిన ధనసహాయము తప్పక కలుగును " అని ప్రోత్సహించి మొట్టమొదటనే భూరివిరాళ మొత్తము నిచ్చి, గ్రంథ మాలను ప్రోత్సహించిరి. గ్రంథమాల కార్యక్రమములలో పాల్గొని చేదోడు వాదోడుగా నుండిరి. వీరిని మఱచిపోదమన్నను మఱపు రాదు. వీరు అదివెలమ శతకము వ్రాసిరి.

ఈ శతకములో 173 సీస పద్యములుకలవు.

సీ. సబ్ జడ్జి పనిజేయ సామ్రాజ్యమును లేదు
బంట్రోతు పనికి లోపంబులేదు
కోటికి పడిగెత్త–గొప్పయేమియులేదు
దారిద్ర్యదశ నున్న–తప్పులేదు.
సరిగ చీరలుగట్ట–సద్గౌరవములేదు.
చవుకవి దోడుగ, నీచంబులేదు
పనివాండ్ర నియమింప। పరువు హెచ్చుటలేదు.
తానె కష్టము సేయ తగ్గులేదు

గీ. కులమె ముఖ్యము నంతకు గుణమె గొప్ప
గాని, యితరంబు లోకలెక్కగావు సుమ్ము
విమల గుణ ధన్యులగు–నాదివెలమలార!
బంధుజనులార! సత్కృపా సింధులార!

(కవిగారి నీతిబోధన)

సీ. కన్న తండ్రికిగూడ–కడు పారబెట్టక
యెండలో పనిఁజేయనిచ్చు వారు
తల్లిపై సరియైన – దాక్షిణ్య ముంచక
పెండ్లాల సేవింపఁ బెట్టువారు
అక్కలన్న లటంచు, నాదరంబులులేక
రేపుమాపును. యెదురించువారు
వృద్ధ బాంధవులందు–వినయంబు జూపక
చులకనగాజూచి సొక్కువారు

గీ. కలరు మనలోన వారల కావరంబు
లణఁగి భక్తి భావలెప్పు డబ్బగలవొ?॥విమల॥
(ఇట్టివారన్ని కులములలో నున్నారుదా।)

ఇప్పటి తప్పులను, కవిగారెంత చమత్కారముగా జెప్పినారో
ఈ క్రింది పద్యము చదువండి.

సీ. చీపురు, కనపూడ్చ—చేతబట్టుటతప్పు
మునురు పాత్రలను దోముటయు తప్పు
నెత్తిపై బిందెతో—నీళ్లకేగుట తప్పు
వంటజేయుట, యంతకంటె తప్పు
బిడ్డకు పాలిచ్చి-పెంచుట యొకతప్పు
వడ్డించుపనికూడ చెడ్డ తప్పు
చేటతో చెఱుగుట—చేయగూడని తప్పు
వినరుట దంచుట—యసలె తప్పు
గీ. ఇట్టు లగుటచే, యిప్పటి యింటిపనులు
నలుపనౌకర్లు, పదిమందిచాలరైరి—॥విమల॥

(కవిగారు అత్తింటి కాపురమునుగూర్చి ఇట్లు వ్రాసిరి.)

సీ. లోపలనేయుండి—లోలోన బాధించు
మంచంబులోనల్లి—మగనితల్లి
సర్వదాబాధించి—సంకటబడఁజేయు
మగమంత్రగబ్బ యామగనియబ్బ
అతిక్రూరముగజూచి—యార్భాటములుజేయు
పొగరుబట్టిన కుక్క—మగనియక్క
అందిందు నెందున్న—యాక్షేపణముసేయు
మదికినాటెడుముల్లు—మగని ఇల్లు
మగని వర్తన మెంతటి-మంచిదైన
యతివ కత్తింటి కాపురం—బార్తిగూర్చు—విమల॥

ఈ కవిగారు, మరి యేగ్రంథము వ్రాసినట్లు తెలియదు. సువాసన
గల 'గులాబి' ఒకటి చాలదా? *



కవిశేఖర, మధుర కవిరాజ

విద్వాన్ హెచ్. దేవదానము

జననము:— 1902

నిర్యాణము:— 29—11—1954

జన్మస్థలము:— హనుమనగుత్తి
బద్వేలు తా॥ కడప జిల్లా.

మతము:— హిందూ క్రైస్తవులు.

శ్రీ దేవదానముగారు క్రైస్తవ మతస్థులైనను హిందూ పురాణ, శాస్త్రములందు మక్కువ హెచ్చు. వీరు తమ కౌమార దశనుండియు శ్రీ యేసునామ సద్గురు సేవా తత్పరులై క్రైస్తవ మతభక్తి ప్రతి పాదకములైన నాటకములను మఱికొన్ని యితర గ్రంథములను రచించిరి. వీరి నాటకములు రాయలసీమ క్రైస్తవ ప్రజానీకానికి బాగుగా పరిచయమైనవి. వాటిని ప్రతియేడు వారు పండుగ సమయములందు ప్రదర్శించు చుండెడివారు. ఆ నాటకము లేవియును ముద్రింపబడలేదు.

వీరు 1927 నుండి 1934 వఱకు బళ్ళారి సెంటు ఫిలామినను హైస్కూలులో తెలుగు పండితులుగా పనిచేసిరి. అక్కడ పలువురు సాహితీవేత్తలతో వీరికి పొందేర్పడినది. అంతవరకు రాయలసీమలో లేని ఒక గ్రంథ ప్రచురణోద్యమమును శ్రీకల్లూరు అహోబలరావు శ్రీ ఘూళీ కృష్ణమూర్తి వర్యులచే కలసి వీరు కొనసాగించిరి. ఈ ముప్వురి కృషి ఫలితముగానే బళ్ళారి పట్టణమున 'శ్రీకృష్ణదేవ రాయ గ్రంథమాల' 1931వ సం॥లో యేర్పడినది. ఆ గ్రంథమాలకు

దేవదానముగారు కార్యదర్శులైరి. వారు గ్రంథమాలోద్యమమును కడప జిల్లాయందు బహుళ ప్రచారము గావించిరి. దేవదానము గారిచే వ్రాయబడిన 'ప్రేమసుందరి' నవల రెండు భాగములుగా శ్రీ కృష్ణ దేవరాయ గ్రంథమాల ద్వారా ముద్రింపబడి, బహుళ వ్యాప్తిగాంచినది.

శ్రీ దేవదానముగారు రచించిన పొత్తములలో 'మృత్యుంజయ స్మృతి' అను కావ్యము శ్రీ యేసునాథుని చరిత్రమును తెలుపు చున్నది. దాదాపు రెండు వందల పద్యము లిందుగలవు. ఏసునాథుని మృత్యుంజయునిగా స్మరించుటలో కవిగారి భావన దొడ్డది. ఆ మహాత్ముని దివ్యాత్మ మృత్యుంజయమై, దివ్యజ్యోతియైనదని కవి యాశయము. ఈ సిద్ధాంత మన్నిమతము లందును కనిపించు చున్నది. ఈ కావ్యములోని ప్రధాన ఘట్టములందు కవి నిజముగా విలపించెను. ఆ పద్యములు పాఠకుని హృదయాంతరాళమును ఛేదించివేయక మానవు. కరుడుగట్టిన హృదయమును కరిగించివేయు పద్యములవి. మచ్చునకివి చూడుడు.

మత్తే॥ తలపై ముండ్లకిరీట మొందునిచి, రక్తం బొల్కఁగాఁగ్రుచ్చిఁ కా
ళుల యందున్మఱి చేతులందుననుఁ బల్లోతుం దిగంగొట్టి మే
కులు, కష్టంబుల నొందఁజేసిరొకో! య్యాక్రూరుల్ యెహెూద్దీయులౘ
ఖలులయ్యో! యెటులోర్చికొంటివిక, నాగాయంబులన్నా ప్రభో!

ఉ॥ బల్లిదుఁడైన యూదుఁడొక భల్లముతో నినుఁగ్రుచ్చ డొక్కలోఁ
జిల్లునఁ జిందిరక్తమటె చెంతను నిల్చిన వారిపైఁ బడౘ
దల్లట మందె భక్త తతి తద్దయు నేడ్చిరి బంధులెల్ల, నీ
నల్లను జూడలేక భువి నైల్యము నొందిన పోల్కి గన్పడెౘ.

'కవితా వేశముగల వారందఱికి తర్కము పనికిరాదు. వారి హృదయమందలి సామాన్య ధర్మము వేదన. అది యుద్రేకించి నపుడు వారు వాక్కులను బిగబట్టలేరు. ఆ పరవశత్వమే లోకుల నాకర్షించును.'—ఈ మాటలు శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు దేవదానముగారి 'దీనాలాపము'లనబడు కావ్యముపై నుడివిరి. వార న్నట్లు దేవదానము గారార్ద్ర హృదయులు. వారు తమకుగల కవితా ధారతో సంఘ మందలి లోపములను సవరింప నావేశముతో వ్రాసిన పద్యములు పెక్కులు. మన సంఘమున కొందఱు వ్యక్తులను భవించు మితిలేని కష్టములను. వారి దీనత్వమును కవిగారు 'దీనా లాపములు' అనుపేరనొక ఖండికగా దీర్చిరి. జాతర సమయము లందు జంతుబలి గావించుట మనదేశ వాసులకు పరిపాటి. ఆజాతర లందనేక మూగజీవులు తమ ప్రాణములను గోల్పోవుచున్నవి. వాటి మొఱను వినువారులేరు. అవిట్లు దీనముగా విలపించు చున్నవి.

సీ॥ మాలేతఁ కంఠాలు జాలివీడుచుఁ గోసి
రక్తంబు చిందింప ముక్తియున్నె?
అతికోమలంబులౌ యంగాలఁ జీల్చి
మా ప్రేవుల జంజాలు వేయఫలమె?
మా మృదు మాంసాలు మాడ్చి భుజించిన
హృదయ కల్మషములు బెదరి చనునె?
మా క్రొవ్వుఁ గరగించి మానక ప్రమిదల
వెలిగింపఁ పాపాలు విరియఁ బడునె?

తే॥గీ॥ ఎంత మూఢులో మానవు లెఱుఁగ రాదు
నోరులేని జంతువులను గ్రూరముగను
చంపి మాంసంబు భుజియించి యింపు మీఱ
జంతు బలులనిడితిమని సంతసింత్రు.

ఒక అనాథ బాలిక తన వేదన నిట్లు చెప్పుకొను చున్నది.

ఉ॥ తల్లియుఁ దండ్రిలేక తలదాచు కొనంగను గేము లేక, బల్
తల్లడ మందునట్టి నను దాపుకుఁ దీయుచుఁసాక గోరు నా
చల్లని దాత నొక్కరిని నత్కృప దైవము చూపునేని, నే
వెళ్ళి నమస్కృతుల్సలిపి వేఁడెద దీనత నన్నుఁబెంపగన్.

ఇందు రజకుడు, వృద్ధుఁడు, వితంతువు మున్నగు దీనుల విలాపము లన్నియు చేర్చబడినవి. క్రొత్త కోడలుగూడా ఈ దీనావస్థ తప్పించు కొనలేదు. ఆమె తన వేదన నిట్లు తెల్పుకొన్నది.

ఉ॥ ప్రక్కలఁ జూడరాదు, మఱి పాటల నెవియుఁ బాడరాదు; నే
నొక్కెడఁ గూరుచుండి మనసొప్ప విరామము నెందరాదు; తాఁ
గక్కన మంది యత్తదస కన్కిన రత్యాధికంబుగాఁగ, నా
పుక్కకు వచ్చితిట్టి వెన రప్పకు నీడ్చుచునుండు నీర్ష్యమై.

భారత దేశమందలి దారిద్ర్యమును, కూటికఱవును. కుల మత భేద పిశాచము మొదలగు ననర్థములను మనసు నందుంచు కొని, కవిగారు 'ఆకటిచిచ్చు' అను పద్యకావ్యమును రచించి గాంధీ మహాత్మున కంకితమిచ్చిరి. మహాత్ముని యున్నతాశయములను, హరిజనోద్ధరణమును ముఖ్యముగా దృష్టియందుంచుకొని. వీరు తమ హృదయ కుహరమునుండి యుప్పొంగిన భావ తరంగ ధ్వనుల నెప్పటి కప్పుడు ఊహాగానముగ రచించిరి. కుడిచి కూర్చొని పద్యము లల్లెడి స్వభావము వీరికిలేదు. శబ్దాడంబరమునకు గాని, రసాలంకారాది కావ్య లక్షణములకుగాని ప్రాకులాడిన వారు కానేకారు. తన మనోభావములను పాఠకులకు తేటతెల్లని తెనుగునుడికారములతో సులభముగా బోధ పడునట్లు వ్రాయుటయే వీరి అభిమతము

ఒక అనాథ హరిజన స్త్రీ తన పిల్లల కన్నముబెట్ట లేని దుస్థితిలో చిక్కుకొన్నది. ఆమె గింజలకొఱకెందరినో అర్థించినది, అందరావిడకు మొండిచేతులే చూపిరి. ఆవిడ తనకసికొద్ది ఆపల్లెను పల్లెవాసులను దూరినది. తుదకొకరెడ్డి, పనివారికి కూలిధాన్యములు కొలిచి వేయుట నామెగాంచి, అతనిని యాచించినది. అతడు కోపించి కసరుకొన్నాడు. ఆమె ఇట్లు తనబాధను వెళ్లగ్రక్కినది.

కం॥ హరిజనులని, పిలుతురుమము
హరి జనులమె యైన లచ్చి యరయదె కరుణన్?
హరిజనులము కాముధరణి,
హరునిజనులుఃమేము ; బిచ్చ మడుగుట గలిగెన్.

ఉ॥ ఆకటిచిచ్చు దారసిలి యగ్నులు గ్రక్కుచు రోఁత మాటలన్
మీకడఁ బల్క జేయఁగను మిక్కలి ప్రేలుచు నున్నదాన; నా
యాకటి బాధదీర్చి యిపుడాదర మీయగ నెవ్వరుందురో
మీకొక దండమయ్యా! యిక మీదయఁ బాపుడు నేఁటి యాకటిన్

ఇట్టి సహజమైన దృశ్యముల నత్యంత రమణీయకముగ చిత్రించునేర్పు అందఱి కలవడదు.

కడప మండలమున జరిగిన నొక విచిత్ర సంఘటన శ్రీ దేవదానముగారి కలముద్వారా 'స్వప్నవల్లభుఁడు' అను కావ్యముగా అవతరించినది. దీనిని శ్రీ కృష్ణదేవరాయగ్రంథమాల వారు తమ 12వ పుష్పముగా, ప్రకటించిరి. ఇందలి నాయికా నాయకులు జనపద మందలి యువతీ యువకులు. కావ్యము విషాదాంతము. ఇట్టివి ప్రాచీన కావ్య లక్షణములకు విరుద్ధము. కాని కాలానుగుణముగా కవుల నాశయములు మారుచుండుట సహజము.

ఈ కావ్యమునందు శౌరిరెడ్డి భార్య నరసాంబ సంతతి కొఱకు జేయు పూజాపునస్కారములన్నింటిని "క్రైస్తవ కవి శేఖరులు" వర్ణించిన తీరును జూడుడు.

సీ॥ అరుణోదయమ్ముల నరిగి దేవాలయ
 మ్ములకు, దేవతలకు మ్రొక్కుచుండు,
నాగుల కడకేగి నమ్రతఁ బూజించి
వల్మీకముల యందుఁబాలు వోయు,
పిప్పల పిచుమంద। వృక్షముల్ జంటగా
బెరిగినఁ జుట్టును దిరిగి మ్రొక్కు.
శ్రావణంబుల లక్ష్మిదేవి పూజలు సల్పుఁ
గార్తీకముల యందుగౌరిఁ గొల్చు

తే॥ నంతు పడయుట కెన్నియో। శ్రమలు పడుచు
నేట నేటను ఫలమున కెదురు చూచు
జిన్నెలేవియుఁగనకున్నఁ జిటి ముటి పడు
వేల్పులయెడలఁ దా గడు విసువు సెందు.

శౌరిరెడ్డి నరసాంబలను కరుణించి, భగవంతుడు వారికొక యాడుబిడ్డను ప్రసాదించినాడు. ఆమెకు లక్ష్మియని నామకరణము చేసిరి. లక్ష్మిబాల్యమును కవిగారు చక్కగా వర్ణించిరి. యౌవనమున లక్ష్మి చెన్నుడను యువకుని మోహించినది. వారిరువురి ప్రేమానురాగములు రానురాను యినుమడించినవి. చెన్నుడు దురదృష్ట వశమున పాముకాటుకు మరణించినాడు. లక్ష్మి యతనినే తన భర్తగా నెంచి తన ప్రాణములు పోవువఱకు వైధవ్యము ననుభవించి, విరాగియై తుదకు ప్రియుని సమాధి ప్రక్కనే ఆమె జీవసమాధి చెందినది.

తే॥ ప్రేయసీ ప్రియు లీరీతి। పృథివి పీడ
దీప ధూప నైవేద్యాల । నేపుమీఱ

నా నమాధుల విలసిల్లె ననవరతము
కీర్తి కాంతు లలరఁగ నాక్షేత్రమందు.

వీరి రచనల నన్నింటిలోను విషాదకర విషయములే ప్రధానములుగా కన్పించుచున్నవి. విషాద సంఘటనలు మనసున చిరస్థాయిగా నిలిచి పోగలవు. అవి మనసును పరివర్తన గావించును. సానుభూతిని ప్రకటింప జేయును. ఎంతటి కఠిన పాషాణ హృదయునైననూ విషాదకర సంఘటనలు కొన్ని వేళలందు నవనీతముగా మార్చి వేయగలవు. వాల్మీకి యంతటి మహర్షినొక విషాదాంత సంఘటన కావ్యమునే వ్రాయించినది. శ్రీ దేవదానము వారి కబ్బినట్లీ తత్త్వమితరుల కలవడ లేదేమో! వీరి 'ప్రేమ సుందరి' నవల కూడా విషాదాంతమే.

శ్రీ దేవదానముగారు ఆడంబర రహితులు. విజ్ఞాన సహితులు. కార్యదక్షులు. వీరు కార్యదర్శిగా పనిచేయునప్పుడు శ్రీకృష్ణదేవరాయ గ్రంథమాల కార్యక్రమములు బహుచురుకుగా కొనసాగినవి. బళ్ళారి విడిచిన తరువాత వీరు కడప జిల్లా బద్వేలుచేరి అచ్చటి బోరు హైస్కూలులో ప్రధానాంధ్రోపాధ్యాయులుగా పనిచేసిరి. వీరికైదుగురు పుత్రులు. జ్యేష్ఠుడైన హెచ్. విజయరత్నం జోసఫ్ బి. ఎ., (ఆనర్సు) అనంతపురం కళాశాలలో 1957లో పనిచేసిరి. వీరు 'దీనాలాపము' లనబడు సాంఘిక నాటకమును వ్రాసి ప్రచురించిరి. శ్రీ దేవదానముగారు తమభార్యను 1940లో కోల్పోయిరి. 'స్వప్నవల్లభుఁడు' అను కావ్యమును తమ భార్యకంకిత మొనర్చిరి.

ఆ జన్మ క్రైస్తవులై, ఆంధ్రాంగ్ల గీర్వాణ భాషలయందు పరిచయముపొంది, హిందూ, క్రైస్తవ మత సామరస్యములనెఱిగి యేసుకృపచే యలవడిన కవిత్వముతో, ఆర్ద్ర కావ్యములను రచించి చిరస్థాయిని పొందిన కీర్తిధనులు శ్రీ దేవదానముగారు. ★



కావ్యతీర్థ
శ్రీ
రావాడ వేంకట రామాశాస్త్రి

జననము:— **1892**

నిర్యాణము:— **1970**

జన్మస్థలము: కణేకల్లు, రాయదుర్గము తా॥
అనంతపురం జిల్లా

తండ్రి:– శ్రీ రావాడ రామాశాస్త్రి

తల్లి:— పేరు తెలియదు

మతము, కులము;– హిందూ– స్మార్త బ్రాహ్మణులు, భారద్వాజస గోత్రము.

వీరు తమ తండ్రి వద్దను, బళ్లారి యందలి శ్రీమాన్ కుంటి మద్ది శ్రీనివాసాచార్యుల చెంతను, కావ్యములను జదువుకొనిరి. తరువాత, తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర సంస్కృత కళాశాలలో జేరి, తర్క, వ్యాకరణ, కౌముదీ గ్రంథములతో బాటు కావ్య నాటకాలంకారాదులను పది సంవత్సరములలో అభ్యసించిరి.

బళ్లారి మునిసిపలు హైస్కూలులో సంస్కృత పండితులుగను, 35 సంవత్సరములు పనిచేసిరి. కలకత్తా గవర్నమెంటు వారు 'కావ్యతీర్థ' బిరుదమిచ్చిరి, మదరాసు విశ్వ విద్యాలయమువారు 'విద్వాన్' బిరుద మొసంగి, సత్కరించిరి.

ఈ శాస్త్రిగారు 1) వేమభూపాల విజయము 2) ఆంధ్రి మేఘ ప్రతి సందేశము అను రెండు పద్య కావ్యములు వ్రాసిరి. వేమభూపాల విజయమును, శ్రీ కృష్ణదేవరాయ గ్రంథమాల వారు 1932లో ముద్రించిరి. ఆంధ్ర విశ్వ విద్యాలయము వారి పుస్తక

మును 'విద్వాన్ సి' ఇంటరు మీడియటు తరగతులకు పాఠ్య గ్రంథముగా నిర్ణయించిరి. ఇందలికథ:—

'అద్దంకి'ని రాజధానిగా జేసుకొని కొండవీడు దుర్గమును 'ప్రోలయ వేమభూపాలుడు' పరిపాలించెను. ఇతని మనుమడైన పెదకోమటి వేమభూపాలునికి జన్మించినవాడు మన కథానాయకుడైన వేమభూపాలుడు. ఇతడు క్రీ. శ. 1400 నుండి 1440 వఱకు కొండవీడు దుర్గమును పరిపాలించెను.

ఈ వేమభూపాలుడు శృంగార రసాభిరుచి కలవాడు. సంస్కృత విద్వాంసుడు. 'అమరుకవి' వ్రాసిన శృంగార సంస్కృత కావ్యమునకు 'శృంగార దీపిక' యను సంస్కృత వ్యాఖ్యానము వ్రాసెను.

ఇతని ఆస్థానములో, ఆస్థాన కవిగా పండితునిగా నున్నవాడు, వామన భట్టబాణుడు. ఇతడు సంస్కృతములో 'వేమ భూపాల చరితము' అను వచన కావ్యమును వ్రాసినారు. 'అభినవ భట్టబాణ' బిరుదుగల శ్రీ మాన్ ఆర్. వి. కృష్ణమాచార్యులుగారు మూల గ్రంథమును సంగ్రహించి వ్రాసిరి. దీనిని మాతృకగా గొని మన శాస్త్రిగారు ఆంధ్రములో 'వేమభూపాల విజయము'ను వ్రాసిరి.

వేమభూపాలుడు, ఎంత శృంగార రసానుభూతుడో, అంతకంటె ఎక్కువగా దైవభక్తి కలవాడు. అతడు దేవీ భక్తుడు. ద్రాక్షారామాది క్షేత్రముల దర్శించెను. అచ్చటి చండికాలయమును, దేవిని శ్రీ శాస్త్రిగారిట్లు వర్ణించిరి.

సీ॥ ఒకచాయ వైష్ణవీ – ప్రకటయాన ఖగేంద్ర

ఒక చక్క న్య గ్రోధ-వికట శాఖాంతర
డోలాధిరూఢ-భేతాళమిథున
మొక యిక్క దారుకాదిక, దైత్యరుండ, సం
గ్రథనోగ్ర శూల కరంబితంబు
ఒకపక్క నాకంట-నకనక లాడుచుం
దిరుగాడు బూచుల-దెప్పరంబు

గీ. నగుచు, నొప్పారు శ్రీ చండికాల యంబు
నచటం దిలకించి తరువాత-నవని విభుండు
భక్తి మధురస పూర్ణ, హృత్పంక జాతుం
డగుచుం జొత్తెంచె-నాలయాభ్యంతరంబు.

సీ. ఏ దేవి మాయచే-నీ జగమంతయు
వివిధ రూపంబుల-విస్తరిలునొ?
ఏ బాలికామణి-కేడు లోకములును
నింపు నింపెడు, బొమ్మరిండులగునొ?
ఏ దివ్య చారిత్ర-కెల్ల వేదంబులు
మహిత నిజస్తోత్ర-మాల యగునొ?
ఏ శక్తినిదురింప-నీ విశ్వము లయించి
మేలు కాంచిన, నిది మేలుకొనునొ?

గీ. ఆ మహాదేవి శర్వాణి-నఖిల దేవ
మకుట మణిరాజ సుప్రభామండి తాంఘ్రి
గామితానల్ప, కల్పనా-కల్పలతిక
నెంతు నని యిట్లు సన్నుతియించె నృపుండు.

'ఆంధ్ర మేఘ ప్రతిసందేశము'ను, మైసూరు మహారాజా స్థాన విద్వత్కవి రత్నమైన బ్రహ్మశ్రీ మండికల్ రామాశాస్త్రి గారు సంస్కృతములో రచించిరి. మన శాస్త్రిగారు దానిని తెలిగించిరి.

యక్షుడు, యక్షి దంపతులు. యక్షుడు యక్షిని వీడి ఎనిమిది మాసములాయెను, దూరదేశమేగినాడు. ఏకారణముచేతనో యక్షుడు యక్షిని గూడలేదు. విరహతాప సంతప్తయైన యక్షి ఆకాశమున సంచరించుచున్న మేఘునిగాంచి ఇట్లు ప్రార్థించుచున్నది. ఈ మాటలను శాస్త్రిగారిట్లు వర్ణించిరి.

వానపుటింట గోడకడఁ బాణిఁగపోలమునూఁడి యర్థ ప
ద్మాసనమంది వాకిటను సారసు దృగంచలముంచి, యెంచి నీ
గానిలి, గడ్డియుఁ గదలగా—నరుదెంచితి వీవ, యంచెటో
మానము లెన్నిదిఁ గడపి-మంటి నినుఁ ముఖిఁజూచు వేడుకఁ

కమ్మని తావులఁ బొలుచు—కందరభూమి విహారవేళఁ బ్రే
మమ్ము-భయమ్ము మన్ననయు—మల్లడిగా—ననుగూడి సాను దే
శమ్ములఁ బ్రౌఢ రీతిగను—నల్పిన నీదురహః ప్రవృత్తి—నే
నిమ్ముగ, సంస్మరించునటు లీకృతకాద్రి యొనర్చు నిచ్చలుఁ

ఒక కయిఁ గన్నుమూసి—మఱియొక్కట నాభుజ మూల మంటుచుఁ
మొకము మరల్పఁ ద్రిప్పుకొని—ముద్దిడుచుఁ బొలయుల్కసూనఁగా
వికృతిని జెంది మ్రొక్కులిడి వేఁడెదు నీదురహః ప్రవృత్తి—నే
నకట-స్మరించునట్లు—కృతకాచలమిద్ది—యొనర్చునో ప్రియా!

శృంగార రసమును బోషించుటలో శాస్త్రిగారు దిట్టలు.

వీరికి పుత్రసంతానము లేదు. ఇద్దరాడుబిడ్డలు మాత్రమున్నారు. వీరి అముద్రిత రచనములు చాల కలవు. అవి ఎచ్చటున్నవో తెలియదు. రాయలసీమలో ఉన్న బళ్ళారి పట్టణము మన దురదృష్టముచేత కర్ణాటకములో కలసిపోయినది. ఇప్పుడు కూడా ఆపట్టణమున ఆంధ్ర కవిపుంగవులున్నారు. అదిభాగ్యమే ★



శ్రీ
రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

జననము — 23—1—1893

జన్మస్థలము: రాళ్లపల్లి-కల్యాణదుర్గం తా॥ అనంతపురం జిల్లా.

తండ్రి:— శ్రీ కర్ణ మడకల కృష్ణమాచార్యులు.

తల్లి:— శ్రీమతి అలువేలు మంగమ్మ.

మతము, కులము:—హిందూ—బ్రాహ్మణ—వడగల శ్రీ వైష్ణవులు.

సంగీత సాహిత్యములు సరస్వతీదేవి కుచద్వయములు. ఆ తల్లి ఒడిలోన నల్లారు ముద్దుగా పెరిగిన అనుంగు బిడ్డ అనంత కృష్ణశర్మ. చిన్నతనము నుండియే, తండ్రివద్ద సంస్కృతాంధ్ర సాహిత్య శిక్షలను పదుమూడేండ్లు బడసిరి. సకల విద్యలు వారి కుటుంబీకులకు వారసత్వముగా సలవడినవి. శర్మగారి అవ్వగారు (తల్లి తల్లి) అక్షర జ్ఞానములేని వారైన, జ్యోతిష్కము, వైద్యము ధర్మశాస్త్రములు, పురాణములు, కావ్యము లామెకు కంఠస్థములు. కవిత్వముకూడా చెప్పగలిగిన దిట్ట ఆవిడ. పురాణేతి హాసములను బహు చక్కగా విమర్శించుటలో, యుద్దండురాలు.

తండ్రివద్ద విద్యనేర్చిన తరువాత, శర్మగారు 1906లో ఉన్నత సంస్కృత విద్యాభ్యాసముకొఱకై మైసూరులోని శ్రీపర కాలమఠమును ప్రవేశించిరి. అక్కడ వీరికి శ్రీ కృష్ణబ్రహ్మతంత్ర పరకాల యతీశ్వరుల సన్నిధిలో శ్రీమద్రామాయణ తత్త్వసారము,

అలంకారశాస్త్రము లలవడినవి అట్లే శ్రీ చామరాజ నగరం రామ శాస్త్రిగారివద్ద సాహిత్యరంగమున శర్మగారికి ప్రవేశము లభించినది

1912 సం॥లో, శర్మగారు మైసూరు మహారాజ కళాశాలలో తెనుగు పండితులుగా 33 సంవత్సరములు పని చేసిరి. అప్పుడు శర్మ గారికి ఆ కాలేజిలో పని చేయుచున్న శ్రీ కట్టమంచివారితో స్నేహ మేర్పడినది. కట్టమంచివారక్కడ ఆంగ్ల సాహిత్యము, చరిత్ర, తత్త్వ శాస్త్రములు బోధించు ప్రధానాచార్యులుగా నుండిరి. వారా కన్నడ ప్రాంతమున ఆంధ్రభాషా పరిమళము వ్యాపింప కృషిచేసిన మహనీయులు. శర్మగారికి అన్ని విషయములందును. చేదోడు వాదోడుగా నుండి వారిని ప్రోత్సహించిన మహనీయులు కట్టమంచి వారు. "నాకు నావలె ఎందరికో తెలుగు భారతము నందభిరుచిని, యభిమానమును కల్గించిన, నాకడపటి గురుదేవులు కట్టమంచివారు' అని చెప్పుకొన్నారు, రాళ్లపల్లి వారు.

శర్మగారు కట్టమంచి వారి ప్రోత్సాహముతో, వేమనపై పెక్కు విమర్శనాత్మకోపన్యాసము లిచ్చిరి. వాటినొక గ్రంథముగా ముద్రించిరి. నిశితమైన విమర్శనను గావించుటతోబాటు హాస్య రచనా చమత్కృతిని హృదయముగా జోడించి చెప్పుటలో సమర్థులు వచన రచన కొక విశిష్టమైన ఒరవడి నందించిన సాహితీ దురంధురులు వీరు.

తెలుగు పండితులుగా యుద్యోగమును విరమించిన తదనంత రము, తిరుపతిలో ప్రాచ్యతాళ పత్రగ్రంథ పరిశోధనశాలలో 'తాళ్ల పాక వారి సంకీర్తన' లపై పరిశోధన గావించిరి. ఈ కార్యక్రమ మును 6—7 సంవత్సరములు కొనసాగించిరి.

బళ్లారిలో జరిగిన 'ధర్మవరం—కోలాచలం' గార్ల స్మారకోత్సవ సందర్భమున, శర్మగారు నాటకలక్షణముల గూర్చి నాటకోపన్యాసముల నిచ్చిరి. వీరు వ్రాసిన "సాహిత్య మత్తు జీవనకళె" 'గానకళె' ఈ రెండు విమర్శగ్రంథములు శర్మగారి కన్నడ పాండిత్యమును చాటి చెప్పుచున్నవి. వీరు తెనుగున పెక్కు సారస్వతోపన్యాసములు వ్రాసిరి. శ్రీ కృష్ణదేవరాయల కాలము నాటి సాహిత్య పరంపరను నిశితముగా విమర్శించిన రసికులు వీరు. వీరి విమర్శలోగల చతురోక్తులను కొంత చదివి నవ్వుకొందము.

రాయల కాలము నాటి స్త్రీ, పురుషుల అలంకారములెట్లుండినవో, శర్మగారి వ్యాసముల ద్వారా తేట పడుచున్నవి. అందలి హాస్యరసము కొంత చూతము.

"పూర్వము కిరీట, కటకాంగద మేఖలాదుల యందున్న యాశ యిప్పుడంతర్ధానమై గుండీలు, గడియారపు గొలుసులు, అపురూపముగా ఉంగరములు, మొదలగు వానియందు వెలిచి వెలిచి వ్యాపించుచున్నది. దీనికర్థమేమనఁగా, మనకు నేఁడు మన జాతిసొమ్ములు మనయానందమునకై ధరించు ధైర్యము లేదుగాని, యింకొకజాతి సొమ్ములు వారిమెప్పులకై ధరించు దాస్యమున్న దన్నమాట. మన వస్త్రములు నిట్లేకదా! సరిగంచుల సేలము-దోవతులు-నేఁతపనికెల్ల నెత్తి పూలవంటివి—గట్టుటకు మనకు సంకోచము కలదు గాని, 'సర్జు సూటు'లలో దూఱుటకు సిగ్గులేదు. పింజెలు పోసి యలంకారముగా చుంగులు చుంగులుగ దోవతి కట్టుకొని బైటఁగనబడుటకు బిడియము; కాని చాకఁలివాని 'ఇస్త్రీ' రేఖలు చెడునేమోయని చేతులు కాళ్ళు చెక్కబొమ్మలవలె ఆడించుచు వీధులలో వెడలుటకు

వెనుదీయము! ప్రాచీనులు స్వతంత్రులు; రసికులు. కావుననే వారు తమకు సొమ్ముల పైఁగల ప్రీతిని తమ యిచ్ఛవచ్చినట్లు ధారాళముగ, నిర్భయముగఁ జూపుకొనువారు. మనవలె వారికి మఱియొకరి మొగము చూచి వారికన్న ముందఱ పండ్లిగిలింపవలసిన పని యుండలేదు.''

వీరు రచించిన ఎఱ్ఱన్న, నాచన సోమన్నల తారతమ్య నిరూపణ మమోఘమైన వ్యాసము. ప్రాకృత భాషలో, ఆర్యా వృత్తములలో వ్రాయబడిన ప్రాకృత గాథలను శర్మగారు 'శాలివాహన గాథా సప్తశతి సార'మను పేర తెనుగున రచించిరి. ఆ గీతముల చదువుడు.

వడిగ వచ్చినాను గడుఁబెద్దదీ నిండు
గడవ మోచి కొనుచుఁ; గాన చెలియ!
ఒడలు వనము దప్పె నూర్పుఁ జెమ్మటలచే;
గొంత సేదదీర్చి కొందు నిందు.

అపుడు నా చెక్కిళుల నిల్పినట్టి చూడ్కి
నొండు వెనకు మరల్పక యుంటి వీవు;
అదియె నేను, నాచెక్కిళ్లు నవియె; కాని
చూడు మిప్పుడు లేనిదా చూడ్కి యొకటె!

సంస్కృతమున సుందర పాండ్యునిచే రచింపబడిన 'ఆర్యా' ను శర్మగారు తెనిగించిరి. ఇవి సుందరపాండ్యుని సుందర నీతులు. గమనింపుడు.

కం॥ ఒరులయెడఁ దప్పు నూపఁగఁ
బరిషత్తులఁ బోవరాదు పండితుఁడెట్లున్
మరి నిజమేనియు మనసులఁ
జెఱచెడు నదియైనఁ దగదు చెప్పఁగ నెప్పుడున్.

తే॥ గుడ్డియెవ్వఁడు? – వినయంబు గొననివాడు;
చెవిటి యెవ్వఁడు? – హితోక్తి వర్జించువాఁడు;
మూఢుఁ డెవ్వడు? – తఱిఁ బ్రియముగల యతిథి
యింటి కరుదేర నొప్పరి కించువాడు.

శర్మగారు కాళిదాసుగారి రఘువంశ కావ్యమును పదునారు సర్గల వరకుతెనిగించిరి. దానిని కట్టమంచి వారు చదివి మెచ్చుకొని ప్రకటింప సిద్ధపడిరి కాని శర్మగారికే మన సొప్పలేదు. కాళిదాసం తటి మహాకవి కావ్యమునకు తన యనువాదము కొంతైనను దీటుగా నుండనప్పుడు తెనుగించుట యనవసరమని చించి వేసిరి.

శర్మగారికి సంగీత విద్య తల్లినుండి సంక్రమించినది. ఆమె కన్నడ తెలుగు, తమిళ పాటలను కమ్మగా పాడెడిది. ఆమెవద్ద తొలుత సంగీతసాధన గావించి, క్రమేణ సంగీతములో కృషిచేసిరి. మైసూరులో నున్నప్పుడు 'వయొలిన్' సాధన గావించిరి. వీరి సంగీత కృషి పలువురి ప్రశంశలను పొందినది. అన్నమాచార్యుల కీర్తనలకు స్వరకల్పన గావించిరి. ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ వారు ఏర్పరిచిన ప్రథమ కర్ణాటక సంగీత సమావేశమునకు, మైసూరులో జరిగిన సంగీత పరిషత్తునకు అధ్యక్షత వహించిరి. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ఉపాధ్యక్షులుగా కొన్ని నాళ్ళు వ్యవహరించిరి.

ఈ 20వ శతాబ్దములోనున్న రాయలసీమ కవి పుంగవులలో వీరు అగ్రశ్రేణికి చెందియున్నారు. చక్కటి విమర్శకులగుటచే కవులెల్లనూ తమ పొత్తములకు వీరి యభిప్రాయము లవసరమని తలంచెడివారు. వీరెందరి పుస్తకములకో తమ సదభిప్రాయముల

నిచ్చియున్నారు. రాయలసీమ కవులపై వీరికి మక్కువ మెండు. రాయలసీమ కవుల దురవస్థకు వీరు మిక్కిలి విచారించెదరు.

శర్మగారు పుట్టిన అనంతపురం జిల్లా లోని ఘనగిరి (పెనుకొండ) విజయనగర రాజులకు వేసవికాలమందు 'చలువ రాజధాని' గా నుండెడిది. అందే రామరాజ భూషణుని 'వసు చరిత్ర' మవతరించినది. అక్కడి 'దాడిమ లతాలతాంగులు'-'జటిల ద్రాక్షాగుళుచ్ఛంబు' లిప్పటికిని యక్కడి పుణ్యదంపతులు చవిచూచుచున్నారు. ఆ పెనుకొండను రాళ్ళపల్లి వారు మఱచి పోలేదు. రాయలసీమ సాహిత్యములో చిరస్థాయిగా నిలిచిపోవురీతి 'పెనుకొండ—కొండ' పాటను వ్రాసిరి. ఇప్పటికిని ఆపాట అనంతపురం జిల్లాలో వాడుకలోనున్నది. ఆపాట నొకసారి జ్ఞప్తికి తెచ్చుకోవడ మెంతైనా అవసరము.

పెనుకొండ—కొండ పాట.

చనిన నాళుల – తెనుగు కత్తుల
సాన పెట్టిన బండ – ఈ
పెనుకొండ – కొండ

రంధ్రముల ప్రహరించు శత్రుల
రక్తధారల ద్రావి త్రేచిన
ఆంధ్ర కన్నడ రాజ్యలక్ష్ముల
కళితి నీలపు దండ–ఈ
పెనుకొండ – కొండ.

వెలుపు లెఱుగని – బిరుదు నడకల
విజయ నగరపు రాజు కొడుకులు
పారలబోయగ కరుడు గట్టిన

పచ్చి నెత్తురు కండ – ఈ
పెనుకొండ – కొండ
తిరుమలేంద్రుని – కీర్తి తేనెలు
బెరసి దాచిన కాపు కవనపు
నిరుపమ ద్రాక్షా రసంబులు
నిండి తొలకెడి కుండ – ఈ
పెనుకొండ – కొండ

శర్మగారి కిప్పటి కెనుబది నాలుగు సంవత్సరాల వయస్సు. చూపు తగ్గినది, చేయి వణకుచున్నది. ఐనను జాబులు వ్రాసిన వారికి జవాబు వ్రాయు నోపిక తగ్గలేదు. సన్మానములకు, బిరుదులకు యెగబ్రాకని నిరాడంబరులు. ప్రతివారిని సహృదయతతో మాట్లాడించు సరసులు. 'వారు మాటలాడినచో ముత్యములు రాలును. పాటలు పాడినచో తేట తేనియ లూట లూరు' నన్న దివాకర్ల వారి మాటలు సత్యములు.

ప్రస్తుతము శర్మగారు బెంగళూరు జయనగరములో వారి జ్యేష్ఠకుమారులైన శ్రీ ఫణిశాయిగారి పరామరికలో నున్నారు. బెంగళూరులోని తెలుగు సాహితీవేత్తలు 'రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మగారి అభినంద సమితి' పేర వారిని సన్మానింప దలచు టెంతయో ముదావహము. శ్రీ శర్మగారికి భగవంతుడాయురారోగ్య భాగ్యముల నిచ్చి బ్రోతుగాక !

——o——



సరస్వతీపుత్ర – మహాకవి

పద్మశ్రీ – డాక్టర్

పుట్టపర్తి నారాయణాచార్యులు

జననము :– **28–3–1914.**

జన్మస్థలము :– చియ్యేడు

అనంతపురం జిల్లా – తా॥

తల్లి:– శ్రీమతి లక్ష్మమ్మ. తండ్రి:– శ్రీ శ్రీనివాసాచార్యులు.

మతము కులము:– హిందూ–బ్రాహ్మణ–శ్రీవైష్ణవులు.

విజయనగర రాజుల రాజధానిగా వెల్గిన పెనుకొండ (అనంతపురం జిల్లా) లో శ్రీ నారాయణాచార్యుల వారి విద్యాభ్యాసము, కవిత్వరచనారంభము జరిగినవి. తండ్రి గొప్ప సంస్కృత పండితుడు. మంచి పౌరాణికుడు. తల్లి సంగీతము నందు నిష్ణాతురాలు. ఆ కారణమున ఆచార్యులవారికి బాల్యము నుండియే సంస్కృతాంధ్రములు, సంగీత, సాహిత్యములు పట్టుపడినవి. పెనుకొండలోని మహాలక్ష్మమ్మ యను వేశ్యాంగన వద్ద వీరు పిన్నతనము నుండియే శాస్త్రయుక్తమైన నాట్యము నభ్యసించిరి. పదునైదేండ్ల ప్రాయము వఱకు పెనుకొండలో వుండి, అచ్చట మూడవ ఫారము ముగించి, తరువాత తిరుపతి సంస్కృత కళాశాలలో చేరి వ్యాకరణ, అలంకారాది శాస్త్రముల నభ్యసించిరి. ఆ తరువాత స్వయం కృషితో 'విద్వాన్' పట్టము పుచ్చుకొనిరి.

ఒక్క తెలుగు భాషలోనే కాకుండ 14 భాషలలో ఆచార్యుల వారికి ప్రవేశముకలదు. 7,8 భాషలలో అనర్గళముగా కవిత్వము జెప్పగలరు. రష్యన్ భాషనుకూడ నేర్వ నుత్సహించుచున్న బహు భాషా కోవిదులు వీరు. సంగీత, నాట్యశాస్త్రము లందును, పురాణ పఠనము నందును, అవధాన ప్రక్రియ యందును, నటనయందును, సారస్వతమందును, వక్తృత్వమందును వీరు అతులిత శేముషీ విభావతులైరి. ఒక్క మాటలో వీరు సర్వకళా కోవిదులని చెప్ప వచ్చును. వీరు కొన్ని వేల కృతులను వ్రాసినారు. 'శివరంజని' 'శంకరి' యిట్టిరాగములను కర్ణాటక సంగీతమున ప్రవేశ పెట్టిరి. వీరు వాగ్గేయకారులు.

ఆచార్యుల వారు తమ పదునారు, పదునెనిమిదేండ్ల ప్రాయము ననే కొన్ని ఖండికలు వ్రాసిరి. అవి భారతీ మున్నగు ప్రముఖ సాహితీ పత్రికలలో ముద్రింపబడినవి. వాటిని 'అగ్నివీణ' యను ఖండ కావ్యముగా ప్రకటించిరి. అగ్నివీణలో పుట్టపర్తివారి అర్ధాంగి శ్రీమతి కనకమ్మగారి రచనలు కూడా చేర్చబడినవి. ఆమె రాయల సీమలోని అజ్ఞాత రచయిత్రి.

కవి హృదయమొకవీణ. ఎన్నెన్నో సన్నివేశము లతని హృదయముపై ముద్రింపబడును. కవి వాటికనుగత శృతిని కల్పిం చును. ఈ అనుభూత్యాపాదనకు పుట్టపర్తి వారగ్నివీణను సారించిరి. ఆ వీణ మ్రోయించిన గీతములు పలురకములు. ఇందు కావ్యనాయిక 'వరూధిని' నిట్లు కవిగారు పలుకరించిరి.

ఓసి! యేమే! వరూధినీ!
ఒక్కసారి
కౌగలింతవురమ్ము — ద్రాక్షగుళుచ్ఛ

ములు బిగిసి కొన్న మా తెన్గుపొలములందు
వలపు దుసికిళ్ళు వోవు నీ వాలుచూపు
యౌవనపు పొంగు - పాషాణమైన యట్టి
ప్రవరుని కృధాగ్నిలో వేల్చి భావ చిక్క
ణాస్రముల గుందు చున్న సుధాస్రవంతి
హత్తికొందును నా హృదయమ్ము నందు.

బ్రదుకు బాటకు దివ్యదీపంబ! అమర
పల్లకీ! జీర్ణ కర్ణాట వైభవ ప్ర
శస్త సామ్రాజ్యరాజ్ఞి! నిశ్వాసధూమ
లాంగి! కవితా పితామహ రక్తయావ
కాంకిత శిరీష సుమకోమ లాంఘ్రి యుగళ!
ఓసి యేమే! వరూధినీ!!

చిన్నతనములోనే ఆచార్యుల వారికి ప్రౌఢ కవిత్వమలవడినది. తన్ను పెంచి పెద్దజేసి విద్యాబుద్ధులు నేర్పిన పెనుకొండను వారు మఱవకుండుటకై సాహిత్యములో ఆ కళాక్షేత్రమునకు శాశ్వత కీర్తి తెచ్చిపెట్టుటకై 'పెనుకొండ లక్ష్మి' యను కావ్యమును వ్రాసిరి. దానిని మద్రాసు విశ్వవిద్యాలయము వారు 'విద్వాన్' విద్యార్థులకు పాఠ్య పుస్తకముగా నుంచిరి. ఆచార్యుల వారు విద్వాన్ పరీక్షకు వెళ్లినప్పుడు తాము వ్రాసిన పుస్తకమునే చదివి తానే జవాబు వ్రాయు విచిత్ర సంఘటన ఎదురైనది. ఇది ఆచార్యుల వారికి మరపురాని సంఘటన. ఆచార్యులవారు పెనుకొండ లక్ష్మి కిట్లు నమస్కరించిరి.

సీ॥ తెలుగు రాయని బల్కు పాలతికి దానిమ్మ
రసములో నుగ్గు పాల్గలిపి పోసి,

మునలి యయ్యును మీనమును దువ్వ మా రామ
నృపతి గుండెలకును నీరుజల్లి,
తిరుమలరాయ పృథీశు లేనవ్వ, వె
న్నెలలోన గరువంపు మొలక వోసి,
రామ భూషణ కవిరాజు గోకిల సేత
బలికించు హిందోళ గలియ బలికి.

గీ॥ ముక్కు తిమ్మన సృష్టించు ముద్దు గృష్ణు
గూకటులలోన, నెఱకొండ గోగు జెక్కి
అలసి సొలసిన మాయింటి యాడుబిడ్డ
ఘనగిరి నివాసినీ! నమస్కార మిదిగో!

'పాద్యము' వీరి మరొకకృతి. ఇందు భగవంతు నిట్లు భక్తుడు ప్రార్థించుచున్నాడు.

ఎంతగ నేడిపించెదవొ? యీజడకాష్ఠము నేడిపించి నీ
పంతము దీర్చుకో! తనువుఁబాసినఁ బుణ్యామె పండిపోవు; ని
శ్చింతతఁ బోదుఁ గాని, నను జీవముతో మననిచ్చి, కష్టముల్
పంతుకుఁదెచ్చి, గ్రుమ్మకుము ప్రాణము, నీకు నమస్కరించెదన్.

భక్తుడు తన ఆవేదననే కాక వెగటుగా కనిపించి మనసును నొప్పించు ప్రతి విషయమును భగవంతుని ముందు చర్చించును. అతనికా అర్హత గలదు. విద్యారంగపు దుస్థితి నిట్లు భగవ-తుని ముందుంచి వాపోయినాడు భక్తుడు.

కాలిన వత్తు లట్టులు, వికారములై కళలేని శుష్క వి
ద్యాలయముల్ మనస్సను పదార్థమె లేని గురుల్-విజీర్ణ కం
కాళములైన పిల్లలను గాంచినఁగన్నులు గుట్టునాకుఁ దం
డ్రీ! లయకాలనృత్యము ఫలించినదేమిర దేశ మందునన్ ?

'నూత్న నాగరికతా మదిరా రసమత్తులైన, నవ నాగరికులతో దేశమంతయు బాడయి పోయిన లేవనట్టి నిద్దుర'తో నుండుట, భక్తుడు జూచి దేశపరిస్థితి ఏమగునోయని ఒక్కొక్కసారి బాధ చెందును. ఇట్లెన్నో విషయముల నీకవిగారు చర్చించినారు.

పుట్టపర్తివారి గ్రంథములలో 'శివతాండవ'మునకు విశేష వ్యాప్తి గల్గినది. ఈ కావ్యము పెక్కు పునర్ముద్రణములను పొందినది. శివతాండవ కావ్యము ఆంధ్ర సరస్వతికి ఉజ్జ్వల నూతనాలంకారము, సంగీత, సాహిత్య, నాట్య సంకేతములు, సరసముగా, సలక్షణముగా ఈ కృతిలో నిమిడినవి. ఈ 'శివతాండవము' ను కవిగారి కంఠము నుండియే వినవలెను. ఇందలి శబ్దసమ్మేళనమును, హిందీ — మళయాళ — తమిళాదిభాషాపండితులు విని మెచ్చుకొన్నారు. కవిగారు పాడునప్పుడు శ్రోతలు తాండవ నృత్యమునే చేయుదురు. ఈక్రింది పాట వినండి.

తమ్ములై, ఘటిత మోదమ్ములై సుకృత రూ
పమ్ములై, శాస్త్ర భాగ్యమ్ములై నవకోర
కమ్ములై, వికచ పుష్పమ్ములై దుమ్మెదల
తమ్ములై, భావ మంద్రమ్ములై, హావ ఫు
ల్లమ్ములై, నూత్న రత్నమ్ములై, వల్గుహా
సమ్ములై, గగ్గనల సొమ్ములై, విశ్రాంతి
దమ్ములై, రక్తకిసమ్ములై, రక్తి, చి
హ్నమ్ములై, తంద్ర గమనమ్ములై, గెడగూడి
కులుకు నిలవుఁగండ్లఁదళుకు జూపులు బూయ
ఘలుఘల్లు మని కాళ్లఁజిలిపి గజ్జెలు మ్రోయ
ఆడెనమ్మా! శివుఁడు
పాడెనమ్మా! భవుఁడు

శివుడు తాండవ నృత్యము చేయుచుండగా,

ఆడినది గిరికన్నె యల సమారుత మట్లు
పాడినది సెలకన్నె—పకపకా నవ్వినటు
లాట పాటల తోడస వశులై బ్రహ్మర్షి
కోటు లెల్లెడ సమిత-జూటులై సేవింప
శర దబ్జ ధూళీ పింజరితముల చక్రముల
సరిదూగు లావణ్యభరిత కుచయుగ్మములు
చనుకట్టు నెగమీటి మినుఁ దాకునో యనగ
వనజాక్షి, పైపైని వక్షమ్ము విరియించి .... యాడినది గిరికన్నె

గిరికన్నె యిట్లందరితో కలిసి నాట్యమాడినది. ఆమె తొమ్మిది రకములైన 'భూచారినాట్యము' లను జూపించినది. పదునాఱు 'ఖచారిపద్ధతుల'లో నాట్యము చేసినది. ఆ నాట్య విన్యాసములందు చూపిన హావభావములు గ్రంథమున జదువవలసినదే. ఇచ్చట పేర్కొనన్న నొంపుండదు. 'ఆధునిక సారస్వతమున యిటువంటి గేయకృతి యింకొకటి లేదు' అని శివశంకరశాస్త్రి గారు నుడివిన మాటలలో అతిశయోక్తి లేదు. ఇంతటి ప్రచారమునే తెనుగుదేశమున వీరి 'మేఘదూతము'నకు దక్కినది. ఈ కావ్యము మానవతావాదమును చాటి చెప్పుచున్నది. ఇందు అన్యాయము నెదురింప బూనుకొన్న మానవున కన్యాయ మెదురైనది. హృదయ రహితమైన కఱకు శాసన మతనిని బెదరించి కారాగార వాసప్రాప్తి గావించినది.

"అతఁడొనర్చిన యట్టి యపరాధ మేమంచు
చీకటులు ప్రశ్నించె — చిఱుచుక్కలడిగినవి
పవలు లాశ్చర్య సంభరితములు వెల్లనై

కొండ కోనలతోడ గుసలు గుసలాడినవి;
ఉత్తరం బెవరిత్తు రున్న యుత్తము లందు?"

అతనికి జరిగిన యన్యాయమును గూర్చి యెల్లరు వాపోవుదురు. అతడు తన ప్రియురాలిని తలచుకొన్నాడు. ఆమె పడెడు కష్టముల నొకసారి తలపోసినాడు. అప్పుడాతడు గగనాన విహరించు మేఘమాలతో

పలికె నా ఖైది "శుభతేజా! కానంత
నిలుమోయి! ఓ జలదరాజా!
చిన్నిచుక్కల చెలువు జిలికించు ప్రియురాలు
ఉన్నదో! లేదో! యీయుర్విపై నడిగేను.

మేఘుడు పయనించు మార్గమున గోచరించు కొన్ని విషాద దృశ్యములను ఆ అపరాధి 'శోకాత్మక కావ్యమ్ము'గా వర్ణించును.

నిండు టాకలి దూయ
మండు టెండలు గాయ
నడ పీనుగుల వోలె నిలిచి శిరసుపై
గడుధూళియును దుమ్ము బెరసీ కనపడెడు
హరిజనులపై నుంత యాదరము నీవైన
పరపరా! వారి నోదార్చు వారు లేరు.

ఇట్లెందరో కష్టజీవుల నొకసారి పరామర్శించి వెళ్లుమని యాతడు వాపోవును. తెనుగు దేశమున పేరెన్నికగన్న విజయనగర ప్రభువునుగూర్చి 'ఉపకార మపకారమై - బ్రదుకు హతమార్చె నొకరాజు; అతడు సామాన్యుడా! ఆంధ్రజాతికి పొగరు'అని సూక్ష్మముగా మందలించును. ఇట్లైనో పెక్కు ఆంధ్రదేశపు విషయములను 'మేఘదూత'లో ప్రస్తావించిరి. ఈ పద్ధతిలో వ్రాసిన కావ్య మిదొక్కటే యని చెప్పవచ్చును.

పుట్టపర్తి వారి కావ్యములు నూటికి మించియున్నవి. వాటిలో పై పేర్కొన్నవే గాక 1) షాజి 2) విప్లవ యోగీశ్వరుడు 3) నవ యుగ వైతాళికుడు 4) విరహగోపి 5) సాక్షాత్కారము 6) సిపాయి పితూరి 7) పండరీ భాగవతము 8) అష్టాక్షరీ కృతులు కూడ ప్రధానమైనవి. ఆచార్యులవారి అనువాదకృషి శ్లాఘింపదగినది.

వీరు పెక్కు భాషలను జీర్ణించుకొన్నవారగుటచే యితర భాషలయందుగల సాహితీ మాధుర్యమును కొంత తెనుగువారికి చవి చూపిరి. హిందీ భాషాధ్యయన మొనర్చి 'తులసీరామాయణము'ను కంఠస్థము చేసిరి. హిందీలోని కబీరు వచనములను 'కబీరు వచనావళి' గా అనువదించిరి. ఉషఃకాల్–గాడివాలా, కూడా పుట్టపర్తి వారిచే అనువదింప బడిన హిందీ అనువాదములు.

కేరళ విశ్వవిద్యాలయమున కొన్నినాళ్ళు భాషాశాస్త్ర పరిశోధన గావించి, మళయాళ నవలలను తెనుగున వ్రాసిరి. అట్లే కొన్ని మలయాళ భాషలోనే నవలలు వ్రాసిరి. శ్రీవిశ్వనాథవారి 'ఏకవీర' నవలను మళయాళములోని కనువదించిరి. ప్రసిద్ధ కన్నడ హాస్య రచయిత శ్రీ భీమసేనాచార్ (బీ. చి)గారి 'సరస్వతీ సంహార' మను నవలను తెనుగించిరి. ఆచార్యులవారికి సమర్థ రామదాసుగారిపై భక్తి మెండు. ఆకారణముగా మరాఠీ భాషను నేర్చి 'బుద్ధభగవానుడు' అనుపేర బుద్ధుని చరిత్రను తెనుగున వ్రాసిరి. వీరాంగ్లమున 'Leaves in the wind' అను కావ్య సంపుటిని వ్రాసిరి, శ్రీ హరీంద్రనాథ చట్టోపాధ్యాయచే మెప్పు పొందిరి.

వీరు సంగీతప్రియులు. 7000 అష్టాక్షరీ కృతులను 1948–1951 సం॥మధ్య రచించిరి. ఇవి కనకాంగి, గమనప్రియ, సింధు

భైరవి, నటాభరణము, శుద్ధశ్రీమంతి, మున్నగు అపూర్వ రాగములతో కూర్చబడినవి. త్యాగరాజ కృతులవలె రాగతాళ సౌలభ్యము కలిగినవి, తమకుగల శ్రావ్యమైన కంఠముతో వాటిని పాడి సభికులను ముగ్ధులను గావించెదరు. వారనేకచోట్ల ఉపన్యాసములను, ప్రవచనములను గావించిరి.

కొన్నినాళ్ళు వీరు తిరువాన్కూరు విశ్వవిద్యాలయమున దక్షిణదేశ భాషాశాఖలో రీడరుగాను, కేంద్ర సాహిత్య అకాడమీ వారి 'లింగ్విస్టిక్ లైబ్రరీ'లో లైబ్రరీయన్‌గా పని జేసిరి.

భారతదేశ పర్యటన గావించి, హృషీకేశమున స్వామి శివానంద మహరాజులచే 'సరస్వతీపుత్ర' బిరుదమును పొందిన మహనీయులాచార్యులవారు. సంగీత, సాహిత్య రంగాలలో వీరొనరించిన కృషిని గుర్తించి భారత ప్రభుత్వము 1972 జనవరి 26న 'పద్మశ్రీ' బిరుదము నిచ్చి సత్కరించినది. ఈ భాగ్యమును పొందిన తొలి రాయలసీమ కవి వీరే. వీరికి దేశమెల్లెడలా సాహితీమిత్రులున్నటులే, సాహితీ శిష్యపరంపర కూడా కలదు. వీరి శిష్యులందరూ గురువుగారి పేరు నిలబెట్టువారే.

ఆచార్యులవారి 'పండరీ భాగవతము', యిరువదినాలుగువేల ద్విపదలుగల బృహత్కావ్య మిటీవలనే ప్రచురింపబడినది. వీరి 'జనప్రియ రామాయణము' ఆకాశవాణి శ్రోతలకు పరిచయమైనదే.

ఈ వయసున కింతటి అమోఘకృషి యెవ్వరును జేయలేదు. ఆచార్యులవారికి గల పూర్వజన్మ సుకృతి ఫల మందులకు కారణము కావచ్చును. వారు కేవలము మానవమాత్రులుగా నూహించుట పొరబాటు. నిజముగను వారు సరస్వతీపుత్రులే. తల్లి

కుమారుని జిహ్వాగ్రమున నిల్లు గట్టుకొన్నది. ఆ భాగ్య మందరికిని యబ్బునదా?... ఆచార్యులవారి కీర్తి ప్రతిష్ఠలింకనూ ఆ తల్లివర ప్రభావముతో నినుమడించుగాక!

—o—



సాహిత్యశిరోమణి-విద్వాన్

శ్రీ కుంటిమద్ది శేషశర్మ

జననము: **2-2-1913**

తల్లి:- శ్రీమతి శేషమ్మ

తండ్రి:-శ్రీ వేంకట రంగాచార్యులు

జన్మస్థలము :- అనంతపురము

మతము, కులము.- హిందూ బ్రాహ్మణ, శ్రీవైష్ణవులు.

శ్రీ శర్మగారు కుంటిమద్ది ప్రాథమిక పాఠశాలలో, 4 తరగతులు ముగించి, బళ్ళారిలో హైస్కూలు చదువును ముగించిరి. పండిత ప్రకాండులు, పితామహులునగు, కుంటిమద్ది శ్రీనివాసాచార్యుల వద్ద 8 సంవత్సరములు, సంస్కృత కావ్యాలంకార, వ్యాకరణముల నధ్యయన మొనర్చిరి. మరల 8 సంవత్సరములు తిరుపతి

శ్రీ వేంకటేశ్వర సంస్కృత కళాశాలలో చదివి సాహిత్యశిరోమణి యందుత్తీర్ణులై, 1938 లో, తెలుగు విద్వాన్ పరీక్షలోకూడ కృతార్థులైరి.

1943 నుండి, అనంతపురముజిల్లా ఉన్నత పాఠశాలల యందు సంస్కృతాంధ్ర పండిత పదవుల నిర్వర్తించుచు. 1959 నుండి 1971 వఱకు, జూనియరు కాలేజీలలో పనిచేయుచు, రిటైరై, ప్రస్తుతము అనంతపురములో ఉన్నారు.

శర్మగారు వ్రాసిన తెలుగు రచనలు 1) సుధాబిందువులు 2) తెలుగుతల్లి 3) రామిరెడ్డి 4) శ్రీ కేశవప్రపత్తి 5) శ్రీ యతిరాజీయము 6) శాంతివిలాసము 7) రామానుజులు షడర్థములు 8) అలంకార విచారము 9) గీతామృతము 10) మేలినోము.

సంస్కృత కావ్యములు: 1) శ్రీ కేశవ సుప్రభాతము 2) బాష్పబిందవః 3) సుమతిశతకము 4) మనుసంభవః 5) ముకుంద విలాసః. "సుధాబిందువులు" ఈ చిన్నకావ్యములో శర్మగారు శ్రీ వేంకటేశ్వరుని సన్నిధిలో, భక్తిభావముపొంగ నిట్లు ప్రార్థించిరి.

ఆ. నిలువు దోపు లిత్తు - నీరాజనము లిత్తు
ముడుపు లిత్తు - కురుల ముడుల నిత్తు
ఆర్తి బాపు మనగ - నారోగ్య మిమ్మన
లంచ గొండి వని - తలంచలేదు.

ఆ. కానుకలను జూపి - కైమోడ్పులర్పించి
కావు మనెడి వారి - కామితముల
దీర్చి, యన్యజనుల - ధిక్కార మొనరించు
నాశ పాతకుండ - వని తలంప

ఆ. కోరి కొందుగాని – కొమ్మన నేరను
నీకు నిచ్చుటకును – నేనెవండ?
ఇచ్చి పుచ్చుకొనుట – కీవు, విక్రేతవు
గావు, బేరగాడ – గాను నేను.

ఆంగ్ల విద్యాభ్యాసమును. తమ 'తెనుగుతల్లి'లో ఇట్లు నిరసించిరి.

ఆనూ గూనులతో (Ass–Goose) కమెన్సయిన, యీ ఆంగ్లంపు
మర్యాద, నభ్యాసంబే–గణనీయ మంచు నుడువగా, పాశ్చాత్య
విద్యానిధుల్–శాసింపగా దొరలట్ల నన్యగతికుల్, సాగించి
రధ్యాపకుల్-గ్రాసావాస విలోపలోల ధిషణాక్రాంతుల్ యథోక్తక్రముల్.

'రామిరెడ్డి' అను లలితకావ్యములో శృంగార రసమును వెళ్ళబోయుచు, కోమటి కోడల నిట్లు వర్ణించిరి.

చెందొవ నిగ్గుతో–జిలుగు–చేలపు టంచులు జిందులాడ–నం
దందు బదంబు లందు; నరిగంచుల గుత్తపు నీలరైక–క
న్విం దొనరింప నుజ్జ్వల మణీమయ భూషలు దాల్చి, దేవతా
మందిర మేగుచున్నది సుమా–అది కోమటి కోడలంటరా!

ఒంటికి నంటు కొన్న, తెలియొల్లియు ప్రాయపుమేని పొంకముగా
కంటికి విందుసేయ, కరకంజములగా ధరియించి, పంచ పా
ళింటికి నింటికిగా వరున–నిందు నిభానన గేస్తురాంధ్ర, పే
రంటము బిల్వ బోయెడినిరా–అది కోమటి కోడలంటరా!

శ్రీ తిరుమల రామచంద్రిగారిట్లు వ్రాసిరి. "శేషశర్మ విద్వత్కవివర్యుడు. అలంకార శాస్త్ర పారంగతుడు. రసగంగాధర ఫక్కీలో ఈయన రచించిన 'అలంకార విచారము' విద్వాంసుల తలలూపేటట్టు చేసింది. ఈయన సుధాబిందువులు సహృదయ సుధాబిందువులు. తెనుగుతల్లి లోకవృత్తము పుణికి పుచ్చుకొన్న కవితామతల్లి."

'శ్రీ కేశవప్రపత్తి'లో శ్రీ శర్మగారు కేశవు నిట్లు వర్ణించిరి.

నిన్నే—నే శరణంటి—నా యవనముఁ—నీభారమే యంటి; య
న్యున్నే వేడను, నీకె సేవకుడ, నన్నుఁ—బాలలో ముంచినా
మున్నీటిఁ బడద్రోసినా అది యశమ్మో, నిందయో, నీకె— ఆ
పన్నానీక శరణ్యా—కీర్తికి దగఁ వర్తింపుమో—కేశవా!

శ్రీ 'యతిరాజీయము'లో, రామానుజాచార్యుల చరిత్రను పది గుచ్ఛములలోవ్రాసినారు. 7 గుచ్ఛములు ప్రకటించినారు. మిగత 3 గుచ్ఛము లచ్చునకు సిద్ధముగా నున్నవి. అన్నియు పద్యములే. వీరు విశిష్టాద్వైత మతస్థులైనను, శివకేశవులను సమానముగా అర్చించిరి.

కాళహస్తీశ్వరు నిట్లు వర్ణించిరి.

శంకర! చంద్రశేఖర! వృషధ్వజ! కృత్తివరాసి! మృత్యు నా
శంకర! పార్వతీ రమణ! సర్పవిభూషణ! భూషణాయితై
ణాంక కపాలమాల! నయనాయిత పావక! నీలకంఠ! నీ
కింకరి లెంక దానిఁ దిలకింపుము దీనిదయఁ మహేశ్వరా!

వక్రోక్తికి వాసిగన్న మహాకవి నీలకంఠ దీక్షితుని, 'ధర్మ ప్రబోధ' కృతికి 'శాంతి విలాసము' అనుపేర శ్రీ శర్మగారు అనువాదము వ్రాసినారు. తామే దీనికి తాత్పర్యమువ్రాసి, అనంతపురము నుండి వెలువడుచున్న 'సాధన పత్రిక' యందు వరుసగ ప్రకటించిరి. అందులో ఒకపద్యము.

ఎన్నిభవంబు లెత్తితినొ? ఎందఱు తల్లుల బిడ్డ నైతినో?
ఎన్నిటి నీతి వాక్యముల - నెందఱు పెద్దలు సెప్పవింటినో?
ఎన్నిటి దుఃఖముల్ సుఖము లెన్నిటి గంటినొ? నైననేమి? య
న్నన్న! విరక్తి పుట్టదుగదా! విషయంబుల నించుకేనియుఁ

ఈ శర్మగారు, గోదాదేవి తమిళమున రచించిన 'తిరుప్పావై' అను కావ్యమును తెలుగులో పద్య కావ్యముగా రచించిరి. భగవద్గీతను, 'గీతామృతము' అను పేర, వ్యావహారి కాంధ్రి భాషలో కథగా రచించిరి.

విశ్రాంతి కాలము, వృథాబోసీయక శర్మగారు పలుతావులకు వెడలుచు, పురాణ కాలక్షేపము జేయుచున్నారు. ధర్మబోధ, భక్తి బోధ పురాణముల వినుట యందాసక్తి, నాస్తికత వ్యాపించుచున్న, నవీన కాలములో ప్రజలకుద్బోధ గావింప వలసియున్నదిగదా! శుభం భూయాత్!

—O—

" కవిచకోర చంద్రోదయ "

శ్రీ పైడి లక్ష్మయ్య గారు

జననము:— **24—6—1904**

తల్లి:— శ్రీమతి వెంకటాంబ   తండ్రి:— శ్రీ పైడి మునలప్ప

జన్మస్థలము:— అచ్చంపల్లి—కళ్యాణదుర్గం తా॥ అనంతపురం జిల్లా.

మతము, కులము:— హిందూ—కమ్మని కమ్మ.

శ్రీ లక్ష్మయ్యగారు ఆంగ్లభాషా పట్టభద్రు లగుటకుఁదోడు, సంస్కృతాంధ్రాది భాషలయందును పట్టభద్రులై పాశ్చాత్య దేశము లందుఁగూడఁబర్యటించి, తత్రత్య ప్రాజ్ఞులచే సంభావితులై, బహు దేశ దేశీయ విజ్ఞానము నవగతము గావించుకొని, న్యాయవాదులై అనంతపురము జిల్లా బోర్డు అధ్యక్షులై, పార్లమెంటు సభ్యులై, దేవదాయ ధర్మాదాయ శాఖల కమీషనరై, శ్రీశైల దేవస్థానముల పాలక వర్గమున కధ్యక్షులై, సలిపిన ప్రజాసేవ, దేవతాసేవ,

దేవాలయముల పునరుద్ధరణసేవ, మఱవ రానిది. వారు పిన్ననాటనే 'దేశభాసలందు—తెలుగులెస్స' అను ఆంధ్రభోజుని నుడి చక్కగా పాటించి, ఆంధ్ర భాషలో ప్రత్యేక కృషి యొనర్చి పండితుల మన్ననల గాంచిన ప్రాజ్ఞులు.

పసిడికి తావి అబ్బినరీతి పూర్వజన్మ సుకృత విశేషమున, వారికి పాండిత్యమునకు తోడుగా కవితాకళ అబ్బినది వారికి నాటకములన్న మిక్కిలి మక్కువ. ఆంధ్ర నాటకపితామహులగు స్వర్గీయ ధర్మవరము కృష్ణమాచార్యులవారి, అడుగు జాడల వర్తించి శ్రీ లక్ష్మయ్యగారు, విద్యార్థి దశయందే, నాటక రచన ముపక్రమించి 'మార్కండేయ' నాటకము రచించిరి.

ఈ నాటకమును 1926వ సం॥ అనంతపురమున—'కలియుగ ఆంజనేయ బిరుదాంకితులగు శ్రీ సి. యన్. నటేశంగారి నాటక మండలి వారు మనోహరముగ ప్రదర్శించి, ప్రజలను మెప్పించి, ప్రఖ్యాతి గాంచిరి. 1960 లో, కర్నూలు నాటక మండలి వారిచే శ్రీ శైల క్షేత్రములో, మాజీ రాష్ట్రపతి డాక్టరు రాజేంద్రప్రసాదు గారి సమక్షమున కూడా ఈ నాటకము ప్రదర్శింపబడెను.

వీరు వ్రాసిన నాటకములు 1) మార్కండేయ విజయము 2) మహాత్మ కబీరు 3) శ్రీ రామాశ్వమేధము (లవ, కుశ) 4) ఉద్భాగ్రేసర. 5) తారాశశాంక 6) హేమారెడ్డి మల్లమ్మ లేక మల్లికార్జున మాహాత్మ్యము ముద్రితములు. సంసారనౌక, సాయిలీల, శ్రీశైలీయము వీరి అముద్రిత నాటకములు.

'సంసారనౌక' అను నాటకమును బళ్ళారిపురమున 1943లో, నాటి మద్రాసు గవర్నరు "సర్ ఆర్థర్ హోప్"గారి సమక్షమున

ప్రదర్శింపబడెను. 'సాయిలీల' అను నాటకమును అనంతపురము జిల్లాలో పలు తావులయందు ప్రదర్శించిరి. 1963లో, శ్రీశైలములో, కర్నూలు నాటక పరిషత్తువారు కూడ ఈ నాటకమును, ప్రదర్శించిరి. 'మల్లికార్జున మాహాత్మ్యము' అను నాటకమును, బెజవాడ శ్రీరాజ రాజేశ్వరి నాటకమండలివారు, 'శ్రీ శైలీయము' అను నాటకమును భ్రమరాంబా మల్లికార్జున కళాసమితివారు ప్రదర్శించిరి. వీరి నాటకములు నిర్దుష్టమై, నిరుపమానమై, సరళపద శోభితమై, నవరస భరితమై అలరారు చుండు ననుటలో అత్యుక్తి యుండదు.

శ్రీ మల్లికార్జున మాహాత్మ్యము (హేమారెడ్డి మల్లమ్మ)

ఇది ఐదంకముల నాటకము. ఇందలి కథ, భక్తురాలగు మల్లమాంబ, పాండురంగ భక్తురాలగు సక్కుబాయివలె, తన భర్త చేతను, మామచేతను, నెంతయో యాదృతయయ్యు, సక్కుబాయి వలెనే తన యత్తయగు పద్మమ్మ వలన, తోడి కోడలగు నాగమ్మవలన, నానా కష్టములకు లోనై, వాటి నన్నిటిని నిశ్చలయై సహించి, మల్లికార్జున సేవాతత్పరయగుట, నిత్యమును జంగమయ్య వేషమున నామెకు మల్లికార్జునుడు సాక్షాత్కరించుట, వరముల వేడుకొమ్మన నత్తకును, దోడి కోడలికిని గల మహావ్యాధుల బోకార్చి వారిని నిజ భక్తురాండ్రగా గావించు కొమ్మని ప్రార్థించుట. తుదకు అత్తయగు పద్మమ్మయు, తోడి కోడలగు నాగమ్మయు బుద్ధి తెచ్చుకొని భక్తురాండ్రయి, మల్లమాంబకు శరణాగతులయి, మల్లికార్జునుని సేవించుట.

సోమిరెడ్డి కూతురైన మల్లమ్మను, అత్తగారింటికి పంపునప్పుడు.

సీ. పతిని, దైవంబుగా – భావించి సతతంబు
నింపు సొంపెలయఁ బూజింపు మమ్మ!
అత్త మామలను, ప్రత్యక్ష దేవతలని
తలఁచి భక్తిని సేవ సలుపు మమ్మ!
తోడికోడండ్రను, నీతోడ బుట్టువు లంచు
నెంచి, యాదరమునఁగాంచు మమ్మ!
సేవకులను, నిరసింపక కన్నబి
డ్డలవోలె బోషించి యలరు మమ్మ!

గీ. శ్రీగిరి క్షేత్ర మందు – రాజిల్లు నట్టి
జనని భ్రమరాంబ, మల్లికార్జునుఁడు మనకు
నిష్ట దైవమ్ములని, యాత్మ నెంచు మమ్మ!
పోయి రావమ్మ! శుభములు–పొందు మమ్మ!

శ్రీ పైడి లక్ష్మయ్యగారు. భక్తి, జ్ఞాన, కర్మయోగములలో భక్తి మార్గము రాచబాట యన్నారు. మనస్సనెడి కోతిని బంధించుటకు భక్తిపాశము సులభమన్నారు. ఈపద్యమును చూడుడు.

అనిశము. మోహకాననము–నందు, నతీకుచ పర్వతమ్ములన్
కొన, మొన లేని యాశలను-కొమ్మల స్వేచ్ఛఁజరించు నట్టి, యా
మనసను క్రోతినెట్టులో, సమంచిత భక్తిని గట్టి, నీ వశం
బునఁగొను మాదిభిక్షు! భవ! ముక్తిఫలప్రద! మల్లికార్జునా!

కవిగారు మాయ సంసారము నిట్లు కీర్తించిరి.

మాయ సంసార మిది తమ్ముడా! ఈ
మాయలోఁబడబోకు తమ్ముడా!
కన్నబిడ్డలు భార్య తమ్ముడా – నీ
కంఠాన కుర్రిత్రాళ్లు తమ్ముడా!

చెన్న మల్లేశు పూజ తమ్ముడా— నీకు
చేకూర్చు మోక్షంబు తమ్ముడా!
శంభో! శివా యన్ని తమ్ముడా! సలుపు
శివపూజ లెప్పుడు తమ్ముడా!

శ్రీ లక్ష్మయ్యగారు, శ్రీ పుట్టపర్తి శ్రీనివాసాచార్ల వద్దను, శ్రీ పేరరాజుగారివద్దను, ఛందోవ్యాకరణాది లక్షణముల నేర్చు కొన్నారు. వీరి కుమారులు శ్రీ పి. యల్ సంజీవరెడ్డిగారు ప్రస్తుతము కడప జిల్లాకలెక్టరుగా పని చేయుచున్నారు.

'బాబా సద్గురు సోమనాథమహారాజుగారు' వీరి ఆధ్యాత్మిక గురువు. వారిపై 'సద్గురు శ్రీ సోమనాథ శతకము' వ్రాసినారు. ఈ గురువుగారు, బెంగళూరు—కెంగేరిలో 'సావన్ దర్బారు ఆశ్రమము'లో యున్నారు.

'సూరి వందిత సద్గురు — సోమనాథ' అను మకుటముతో గీత పద్యములను వ్రాసినారు. అందుకో మూడు చదువుడు.

గీ. ధనము గడియింప, నీచ వర్తన మదేల?
జనుల వంచించి, మోసంబు సలుపనేల?
వచ్చునేవెంట పుచ్చిన వక్రతుదకు? ॥సూరి॥

గీ. సంతులు, సరోవరములు, వర్షంబు, తరులు
జనుల కొనరించు చుండు నిస్వార్థ సేవ
స్వార్థరాహిత్యసేవయే — సత్య పథము ॥సూరి॥

గీ. సద్గురూత్తము మూలాన — సలుపు పూజ
చెందు తనకని పరమాత్మ — చెప్పు చుండు
సద్గురువు లేనిపూజ, నిష్ఫలము గాదె? ॥సూరి॥

ప్రస్తుతము, శ్రీ పైడి లక్ష్మయ్యగారు అన్ని పదవుల నుండి, రిటైరై, సుఖశాంతులతో కాలము గడుపుచున్నారు. అనంతపురములో, కోర్టురోడ్డులో వీరి విశాల భవనము కలదు. వీరి సలహాల కొఱకు, దివ్యమైన సందేశముల కొఱకు, కవులు, పండితులు అన్ని సంస్థల ఉద్యోగులు, రైతుజనులు అశ్రాంతము వీరిగృహము నలంకరించుచుందురు. కవి పండితులయందు వీరి కవ్యాజమైన ప్రేమ కలదు. ప్రస్తుతము వీరు అనంతపురము జిల్లా రచయితల సంఘమున కధ్యక్షులై, సారస్వతసేవ లొనరించు చున్నారు. వీరు స్వయముగా కవులేకాక, కవుల నాదరించు స్వభావము కలవారు. గ్రంథమాలకు రూ 116 విరాళము చెల్లించిన ధన్యులు. అచిరకాలములోనే, వీరి అముద్రిత నాటకములు ముద్రింపబడునని నమ్ముచున్నాము. వీరి చిత్రపటము ఈగ్రంథములో దాతల ఫోటోలలో ముద్రింపబడినది. గమనింపుడు. భగవంతు డాయురారోగ్య భాగ్యముల నిచ్చి వీరిని కాపాడు గాత!

—o—

విద్వాన్, అభినవ వేమన

శ్రీ జోస్యం జనార్దనశాస్త్రి

జననము:— **2—10—1911**

తల్లి:— శ్రీమతి అన్నపూర్ణమ్మ తండ్రి:— శ్రీ వేంకటరామయ్య.

జన్మస్థలము:— పాణ్యం—కర్నూలు జిల్లా.

మతము, కులము:— హిందూ—ములకనాటి బ్రాహ్మణ—కౌండిన్యస గోత్రులు.

పచ్చ కప్పురము నదల్చు వాసన పస
వలపుఁబారిజాతపు టలరుల మృదులత

లింపు సొంపుల నింపు ప్రేమింపుఁ జలువ
వెన్నెలల వెల్లి జాబిల్లి కన్నతల్లి.

'కన్నతల్లి' ఆరాధనతో తన తొలి కవితాగానము నారంభించిన కవికోకిలావతంసులు శ్రీ జోస్యం జనార్దనశాస్త్రిగారు. అది వారి కవితా వ్యాసంగమునకు శుభోదర్కము. 'కన్నతల్లి' కావ్యమును రచించి నిజమాతృదేవికి సమర్పించి తల్లి ఋణమును దీర్చుకొని ధన్యులైరి శ్రీ శాస్త్రిగారు.

కడుపు పంటకై తల్లి పడెడి కష్టములు, కన్నతరువాత సంతాన పోషణకు పడెడి కడగండ్లు, కొడుకు నొక యింటివానినిజేసి, కోడలి రాపిళ్ళకుఁగుళ్ళుచు, కొడుకును జూచుకొని కొండంత సంతోషముతో కాలము బుచ్చు తల్లి గాంభీర్యమును వర్ణించుపట్ల శాస్త్రిగారు మిక్కిలి తన్మయత్వముతో, స్వానుభవమును వెల్లడించిరి. బిడ్డలపై మోహము తల్లికెప్పుడు నొకే రీతియుండునను టకు శాస్త్రిగారీ పద్యమును చెప్పిరి.

తనయుఁడెంతటి బిడ్డల తండ్రియైన
దనదు పాలికిఁ బసికూన యనియె దలఁచి
వేళ కన్నము బతిమాలి పిలిచిపెట్టు
కన్నమోహము విడలేక కన్నతల్లి

శ్రీ శాస్త్రిగారు కన్నతల్లితో బాటు 'ప్రకృతి కన్నతల్లి'ని కూడ ఆరాధించిరి. వారి దృక్పథములో యిరువురును సమానమే.

ఎలిమి సంజె కొమ్మలు తెరలెత్తిదింప
లీలఁగోయిల కలరాగ మాలపింప
శ్రావ్యముగఁ జిల్క పడఁతి వర్ణములు పల్క

కుల్కు పురివిప్పుకొని నెమ్మి గొండ్లి సలుప
హాయి బిడ్డల నొడినిడి యలరఁ జేయు
ఘస వినోద, మోద ప్రకృతి కన్నతల్లి.

ప్రకృతిమాత యొడిలో బిడ్డలు పొందు హాయిని చక్కగా అభివర్ణించిరి. శాస్త్రిగారి తల్లిదండ్రులు ప్రాచీనార్ష సంప్రదాయమునకు చెందిన సాత్త్వికులు. శ్రీ కవిగారు ప్రాథమిక విద్య 10—12సం॥లలో ముగించి తరువాత మేనమామల కడ, పూర్వ పద్ధతులలో సంస్కృతాంధ్ర కావ్య నాటకాలంకారములను నేర్చిరి. 1933 లో శాస్త్రిగారు మద్రాసు యూనివర్సిటీలో 'విద్వాన్'పరీక్షలో నెగ్గి. అప్పటినుండి అనంతపురంజిల్లా తాడిపత్రిలో మునిసిపల్ హైస్కూలు నందు ప్రధానాంధ్ర పండితులుగా పని చేసిరి.

శాస్త్రిగారు తమ 'కన్నీటిచుక్కలు' అనుకావ్యములో తండ్రి కొఱకు పరితపించు కుమారుని ఆవేదనను వర్ణించిరి. పారశీక యువకుడైన 'షొహరాబ్' చదువు సాములఁదారితేరినవాడు. అతడెంతోకాలము తన తండ్రి నామధేయము తెలియనివాడై, సాటివారిలో అపహాస్యముల పాలైనాడు. అతడావేదనకు క్రుంగి పోయినాడు. తండ్రినిగూర్చి తల్లినిట్లని ప్రశ్నించినాడు.

" అమ్మ రుస్తుము సరియుద్ధి నైతి నంద్రు
నేఁటి పారసీక యువక కోటి యందు
జనకుఁడెవ్వడొ? నాకు నీ సరికిఁ దెలుప
బూన విదియేమి? యేమి యీ మౌనముద్ర?
సాటివారల చదువులు సాము లరసి
వారి తండ్రు లానంద సంభరితు లగుచు
మెచ్చుకొని, చీరి, కౌఁగిటఁ గ్రుచ్చియెత్తి
దేరిచూచుచుఁ గుందుదు దేబె పగిది!

అద్భుతావహమైన విద్యాప్రదర్శ
నమ్ము దిలకింప వచ్చు జనమ్ము నన్ను
గూర్మిఁబిలిచి " నీవెవ్వాని కొడుక " వన్న
బట్టరాని వేదనఁ దల వంచు కొంటి "

తల్లి కుమారుని ఓదార్చి నీకు సరియుద్ధియైన 'రుస్తుము' నీ తండ్రి యని సమాధాన పఱచెను. రుస్తుము మొగమెఱుగడు షొహరాబ్. షొహరాబ్ తన పుత్రుడని రుస్తుముకు తెలియదు. ఈ విషమ పరిస్థితిలో విధి వక్రించి తండ్రి కుమారులకే యుద్ధము జరుగును. తండ్రిచేతనే కుమారుడు హతుడగును. తనయుడని తెలిసిన తరువాత తండ్రి యిట్లు శోకించును.

" క్రూరుఁడను, మోసగాఁడను, ఘోర పాత
కుడను, బాడు పౌరుషమునఁ గొడుకటంచు
డెలియఁ జాలక నవనవోజ్జ్వల సురూప
శౌర్యశాలిని జేసేత జంపు కొంటి.

నా వరాలమూట! నావంశ రత్నము!
నా కుమార! తెలివి లేక తన్ను
దానె చంపుకొన్న దౌర్భాగ్య రుస్తుము
వీఁడె పుత్రహంత! వీడె ఖలుఁడు!

కవిగారిందు వీర కరుణా రసముల రెండింటిని సమపాళ్ళలో మేళవించి. చదువరుల కంట కన్నీటిచుక్కలు రాల్పింతురు. వీరి 'కృతిపతి' కావ్యము గ్రామ్యభాషలో, శిష్టవ్యావహారిక ఫక్కిలో, తెలుగు జాతీయ పలుకు బడులతో సాగిన ఖండకావ్యము. భారత స్త్రీ జీవితమును చిత్రించు 'సీతమ్మ' యను కావ్యఖండము గూడ యిందు చేర్చబడినది.

రాయల కాలమునాటి ప్రజానీకము కూడ కవితాభిరుచిగల వారనియు, ప్రజలు, ప్రభుత్వము, ఆనాడు కవులను, కావ్యములను గౌరవించెడి వారనియు కృతిపతి కావ్యము ద్వారా మనకు జోస్యము వారు తెల్పిరి. అందు కనువగు నొక కథనుకూడా అందు జోడించిరి. గువ్వల చెన్నుడు రాయలను మించిన రసజ్ఞుడు. వాడు పెద్దన్న కవిత్వమును మెచ్చుకొని స్వర్ణకంకణమును బహుమానముగా పొందినాడు. ఒకసారి ఒక పరదేశి విప్రుడు రాయల కొలువుకు వచ్చి భంగపడినాడు. అతనిని ఆదరించిన వారు లేరు. అతడు ప్రచ్ఛన్న రూపమున నున్న, తెనాలి రామకృష్ణుని కలిసినాడు. రామకృష్ణుడతనికి ఒక పద్యమునేర్పి, చెన్నుడి వద్దకు పిలుచుకొని వచ్చినాడు. ఆ సమయములో చెన్నుడు అతని భార్యమధ్య జరిగిన సంభాషణ నిట్లు కవిగారు వ్రాసిరి.

భార్య:— మామా! యేంతికోన్నివి?
ఆ మారాజే అడక్క ఆకడె మిస్తే
నీ మన్సేంబడి తుంటా
నే మోజుగ అడుగు తుంటె యీరా దేమే?

చెన్నుడు:— పిల్లా! దాని గ్గాదే
యిల్లాలికి సొమ్ములేంటికే! యెరి మొగమా!
యిల్లూ, వాకిలి, మొగుడూ,
నల్లగ తిననీకి వుంటె సాల్లే దేమే?

నాపాలి పున్నె మాయని,
ఆ పెద్దయ్యకు దయొచ్చి ఆయన కాయ్నే
ఆ పద్యాల్మొలాన్నే
నా పేర్మిల బెట్టు నంతు నాక్కలిగించెజా.

పోయే! అయియేకము దా
నా! యేపాటి సుగాలుగాని యేం సాస్వత మౌ
తాయా? యివన్ని యెంటొ
స్తాయా? పేరొగటి తప్ప తతిమా వల్లా!

చెన్నుడి వద్దకు వచ్చిన ఆ విప్రుడు 'కులవిద్యకు సాటిలేదు గువ్వలచెన్నా'! అని పద్యము వల్లించును. చెన్నుడు పొంగిపోయి బంగారు కంకణ మతనికి బహూకరించుతాడు. తరువాత మరొక బ్రాహ్మణుడు వచ్చి అదే పద్యమును మరింత కమ్మగా పాడి విని పించును. అతనికి చెన్నుడు తన జీవనాధారమైన గొడ్డలిని సమర్పి స్తాడు. దీనినంతటిని మారువేషమున నున్న రాయలు గుర్తించి చెన్ను నీవిధంగా సత్కరించును.

ధనమేల? రాజ్యమేలా?
వినయ వివేకముల తోడి వితరణ గలుగన్
అనుమాన మేల? నాకం
టెను గువ్వల చెన్నఁడొక్కఁడే కృతిపతియౌ!
అని కృష్ణదేవ రాయలు
తన కంఠమునం దమూల్య తర హారంబున్
గొనుమోయి! 'సత్కృతిపతీ!'
యని చెన్నుని కంఠసీమ యందు నమర్చెన్.

ఇందు పాత్రానుగుణమైన భాషను, విశేష వాడుక లోనున్న నానుడులను సంభాషణ లందు వాడి దృశ్యకావ్యముగా రక్తికట్టించిరి

'సీతమ్మ' ఖండకావ్యము నందొక ఆడుపడుచు మనోవేదన చిత్రీకరింపబడినది. ఆధునిక సీతమ్మ తన కడగండ్లను పురాణ స్త్రీయైన సీతాదేవితో చెప్పుకొంటున్నట్లుగా వర్ణించినారు కవిగారు.

కవిగారు కన్నులార నేటి సతీమతల్లుల అగచాట్లన్నియు చూచిరి. ఆ హృదయవేదనను పద్యరూపము నందుంచిరి. ఇది ప్రతి భారత స్త్రీ పొందుతున్న సంక్షోభము. కొన్ని సంఘ దురాచారములకు, అన్యాయములకు, ఆడుది ఆహుతి యగుచున్నది. వాటిని మార్చ వలెననెడి తలంపు కవిగారికి పూర్తిగా కలదు. అందుకతడెన్నో యథార్థ విషయములను బయటపెట్టును. వారందుకు వెనుదీయ లేదు. ఆడుబిడ్డలపై తల్లిదండ్రుల అభిప్రాయ మెట్టిదో చూడుడు.

ఇది మన సొమ్ముకాదిచట నిల్లడ పెట్టిన దేరి కోసమో
గద? యెటు లెన్ని చేసినను గాని యొకయ్యకు నెట్టు నొప్పఁజె
ప్పదగిన దాడుపిల్ల యను భావనతో విధి లేక సాకు నొ
ప్పిదముగఁ దల్లిదండ్రుల గుపింతురు మాదెటు వంటి కర్మయో!

యథార్థ విషయము చెప్పిన అందరి కది చేదుగానే కనిపించును.

"ఉన్నమాటంటే ఊరందరికులుకు" అన్న సామెత సాధా రణ మైనదే. అంత మాత్రమున నిజ విషయములు దాచుట మం చిది కాదుకదా! అందుకే జోస్యం వారు, లోకపు తీరునందలి గుణ దోషములను పరిశీలించి, వ్యంగ్యముగ, సూటిగ, ఛలోక్తిగ 'ఉన్నమాట జోస్యమన్నమాట' అను మకుటముతో అనేక ప్రసంగములను 'అభినవ వేమన'వలె వెలికి నీడ్చిరి. వేమనపై గల గౌరవాదరములే శాస్త్రిగారిచే 'ఉన్నమాటలు' వ్రాయించినవి. దేవతా ప్రసంగమున జెప్పిన ఈ పద్యము జూడుడు.

ఆ.వె. దొడ్డగా శతక్రతువు లాచరింప నీ
మూడు లోకములకు తేడుగాని
యొరుల సతుల కుఱుక నొడలెల్ల గుల్లయౌ
నున్నమాట జోస్యమన్న మాట.

నీతి ప్రసంగములో: బాల భటుడు, బాల వటుడు, బాల నటుండు
బాల యతియు, బతియు బాల విధవ
కీర్తి ముర్వురు నపకీర్తి ముర్వురు గాంతు
రున్నమాట జోస్యమన్నమాట.

కళాప్రసంగములో: సంతు దొంతులు బడిపంతులకు ధనమ్ము
కాగితంపు చింపు కవికి ధనము
అల్లరులః తగవులె న్యాయవాదికి ధన
మున్నమాట జోస్యమన్నమాట.

హరిహర తత్త్వము నిట్లు కవిగారు చెప్పిరి.
పాము నీళ్లు తనకుంబైననో క్రిందనో?
తానె నలుపా? తనదు తరుణి నలుపా?
అలగుడి తలకట్లె హరిహర స్వరతత్త్వ
మున్నమాట జోస్యమన్నమాట.

సంస్కృత భాషాకోవిదులైన శాస్త్రిగారు కాళిదాసు రఘు వంశ కావ్యమందలి 'వరతంతు కౌత్సల కథ'ను తెనుగున 'పసిడి పంట'గా తెనిగించిరి. ఇది గురుశిష్యుల మధ్య గల యుదాత్త సంబంధమును, ప్రేమాభిమానములను వెల్లడించును. శ్రీ మధునా పంతుల సత్యనారాయణగారీ కావ్యముపై తమ అభిప్రాయమః నిట్లు వ్రాసిరి.

'సంప్రదాయ సుందరమైన వర్ణనలతో, సంస్కార ప్రౌఢ మైన భాషతో, సమన్వయ ప్రియమైన భావ సంపదలతో 'పసిడి పంట'' జయఘంట' యనిపించుచున్నది.'

ఇటీవలనే శాస్త్రిగారు 'దుర్గా సప్తశతి' నిగూడా తెనిగించిరి ఉద్యోగ విరమణ చేసినప్పటినుండి వీరు తాడిపత్రి యందే స్థిర

నివాసమున్నారు. వీరి కుమారులు శ్రీవిద్యాసాగర్ కూడ రచయితే. 'రిరంస'యను గేయకృతిని వీరు వ్రాసినారు. శాస్త్రిగారు షష్టిపూర్తి మహోత్సవమునుగూడ ముగించినారు. ఎట్టి సన్మానముల కాశింపక పోయినను, వీరు తమ కృతులద్వారా ఆంధ్రమహాకవుల మన్నన లనేకములపొందిరి. వారికదియే సంతోషము.

తమ పద్యరచనలో ఒక విశిష్ట వరవడిని వీరు పెట్టుకొన్నారు. ఆశైలి కొందరికి మాత్రమే కలదు. అల్పపదములతో సాగిన ఆటవెలది పద్యము లందిమిడ్చిన భావములమోఘములు. ఈ కవిశేఖరుల కలమునుండి మరికొన్ని మధుర కావ్యములు వెలువడగలవని ఆశించుచున్నాము. భగవంతుడు వీరికాయురారోగ్య భాగ్యములనిచ్చి సాహిత్యకృషి మరింత ఇతోధికముగా చేయింప గలరని ఆశించుచున్నాము.

——o——

మధురకవి, రాయలసీమ కవికోకిల

శ్రీ బెళ్లూరి శ్రీనివాసమూర్తి

జననము:– 4—2—1910

తల్లి: శ్రీమతి సీతమ్మ తండ్రి:– శ్రీ బెళ్లూరి హనుమంతరావు

జన్మస్థలము:– తలమర్ల. పెనుకొండ తా॥ అనంతపురం జిల్లా.

మతము; కులము – హిందూ–బ్రాహ్మణులు.

రాయలసీమ నెవరో రాళ్లసీమ అన్నారు. ఈ సీమ గత వైభవమెట్టిదియో వారెఱుగరు. రత్నములను రాసులుగా పోసి, ఈ సీమలో విక్రయించినారు. వజ్రకరూరు , వజ్రములు దొరికినవి. వర్షాకాలములో ఇప్పటికికూడా, పరదేశీయులిచ్చటికివచ్చి,

ప్రతి శిలను వెదకుచున్నారు. రాయలసీమ మట్టిలో బంగారు గనులు దొరికినవి. రామగిరి ప్రాంతములో బంగారు కొఱకు, అఖండాన్వేషణము ప్రభుత్వమువారు జరుపుచున్నారు.

'రాయలసీమ'లో చక్కని కవిత్వము చెప్పువారున్నారా? అనునది మఱొక ప్రశ్న? ఈ సీమ పెనుకొండ. కొండలలోనే 'వసుచరిత్ర' కావ్యముద్భవించినది. ఈసీమ కొండకోనలలో మధుర కవితాగానము వినవచ్చినది. రాయలసీమ 'రసజ్ఞత'గుఱించి శ్రీ నండూరి రామకృష్ణాచార్యులిట్లు పల్కిరి.

క్షామము దాపురించి పలుసారులు చచ్చెను జంతు సంతతుల్
వేమరు చచ్చినారు ప్రజ వేనకువేలు చరిత్ర లోపలన్,
క్షామము లెన్నివచ్చిన – రసజ్ఞత మాత్రము చావలేదు, జ్ఞా
నామృత వృష్టికిన్ కొరతనందని రాయలసీమ లోపలన్.

ఈ పెన్నేటిగడ్డపై పుట్టిన అచ్చపు రాయలసీమ కవి కుమారుడు, ప్రకృతిదేవత నువాసించి 'మధురకవి' యై యిట్లు గీతమును బాడుచున్నాడు.

చాల చిన్నదిరా!

నాయిల్లు – చాల చిన్నదిరా!
నామీది ప్రేమతో – నావాకిటను నిల్చి
నన్నుబిల్తువుగాని – అతిథ్యమెటుసేతురా
నాబ్రదుకు అంతటికి – నోచదయ్యెనురా!
కారు మబ్బుల లోన – కటిక చీకటిలోన
నా స్వామివగు నీవు – నా కొఱతనేతీర్ప
నా వాకిటను నిల్చి – నన్నుబిల్తువుగాని

చిన్నిదివ్వెయు లేదురా
నీరాక చిత్తమున । వెతగూర్చురా!

మిత్రమై నాతోడ – మెలగి ముచ్చటలాడ
అరుదెంతువే గాని – చిఱుచాపయును లేదురా
కూర్చుండ, శిథిల భూభాగంబురా!
కనుల నిండుగనీరు – గ్రమ్ముకొన నీచెంత
పాటలే వినిపింతురా – నాబ్రతుకు
పాటతో పయనించురా। (అమృతాభిషేకము)

శ్రీ బెళ్లూరి శ్రీనివాసమూర్తి పేరెఱుగని వారు లేరు. వీరి కవితలు తెలుగుదేశపు నలుమూలల వ్యాపించినవి. ఇతనిని రాయలసీమలో, ఒక అగ్రశ్రేణి కవిగా నిలబెట్టినది 'భారతి' (మాసపత్రిక) "అవ్యాజ వాత్సల్యముతో భారతి భిక్షపెట్టక యున్నచో 'నాజీవితము'లో ఏనాడో, కవితాసన్యాసము స్వీకరింప యుండవలసిన వాడనే"యని కవిగారు చెప్పుకొన్నారు.

ప్రకృతికన్య, 'శ్రీ బెళ్లూరి' వారిని లేఁ్రాయముననే వరించినది. శుకపిక శారికలు, కర్షకులు, కాపుకన్యలు పచ్చని పైరులు, పూదీగలు వారి కవితాసొత్తులు. అతనికి వాటితో పొత్తు వీడరాని బంధమైనది. అవి ప్రసాదించిన సుఖము కవిగారికి మఱెచ్చట దొరకలేదు. అందుకే అతడిట్లు చెప్పుకొన్నాడు.

పరిమళింపని దొక్క పుష్పంబు లేదు
నేను విహరింపఁజనిన వనీతలాల
సుకృత వశమునఁ గలిగిన సుఖము లందు
నోలలాడితి యౌవనోన్మీలనమున.

ప్రకృతి యొడిలోన సుఖసుప్తవడయు చుందు
కోయిలలు లేప నిదుర మేల్కొనుచు నుందు
అడవి కోసల సెలయేటి పడుచుఁగాంచి
పరమ సంతోష భరమున బలుకరింతు.

మొగ్గనై, యాకు మఱుగున బొలుతు నేమొ?
పూవుగాఁబూచి పరిమళ మొలుకఁబోతు
నో విహంగమై పరతునో? భావగీత
మగుదునో? నేను భావిజన్మములయందు

కాంక్షలేవేఱు, నా మనోగతులె వేఱు.
పూరి గుడిసెలలోనైనఁ బుత్తుగాని
గీత మల్లిక బ్రదుకు సాగింపలేను;
భావగానంబె నాదు సర్వస్వమవని! (తపోవనము)

శ్రీ బెళ్లూరి శ్రీనివాసమూర్తిగారి జనకులు శ్రీ బెళ్లూరి హనుమంతరావుగారుకూడ సాహిత్య పిపాసకులే. వారెన్నో పద్యములల్లిరి. వారు అలోపతి, హోమియోపతి, ఆయుర్వేదాది సమస్త వైద్యశాఖలలో సిద్ధహస్తులు. శ్రీ బెళ్లూరివారు శ్రీ పుట్టపర్తి శ్రీనివాసాచార్యులకడ శిష్యరికమొనర్చిరి. అప్పటినుండి వీరు గురుకుమారులైన శ్రీపుట్టపర్తి నారాయణాచార్యుల వారికి ప్రియ మిత్రులైరి శ్రీ విద్వాన్ విశ్వంగారు వీరి బాల్యస్నేహితులు. ఈ ముగ్గురు కొన్నినాళ్లు రాయలసీమలో 'కవిత్రయముగా' వాసి కెక్కిరి.

శ్రీ బెళ్లూరివారి కవితాధార తేనెకంటెను తీయనిది. ఆయన గారి రచనలు చదువుచున్నప్పుడు పాఠకుడు తాను సెలయేటి జలత రంగాలలో నీదులాడి నట్లానందించును. ఆ పద్యములందరి రమ్య

మైన భావములు హృదయ ఫలకములపై ముద్రవేయును.

కవికి కావలసిన ప్రతిభ వ్యుత్పన్నత వీరికి కలదు. "పద్యము చదువగనే కవికి అర్జవగుణమెంత యుండునదియు కావ్యానుభవ రసికులకు స్పష్టముగా తెలిసిపోవును. ఈ యార్జవగుణము నిండి యుండుటను శ్రీనివాసమూర్తిగారి కవనమందు ప్రతి పద్యము నందును మనము చూడవచ్చును. ఈ గుణముచే వీరి సుందరవస్తు ప్రపంచము విశాలమైనది" (శ్రీరాళ్లపల్లి.)

శ్రీ బెళ్లూరివారు తమ 'కావ్యగంగ'లో తమ కవితాంగనను తెనుగు ప్రాంగణములోని కాహ్వానించిరి. ఆమెకు కవి, తమ తెనుగు ప్రాంగణములోని విశేషముల నిట్లు నుగ్గడించును.

తరుణీ తప్పకపోయి చూడదగు నందంబైన "లేపాక్షి" యె
వ్వరు నిర్మించిరొ దేవతాయతన మబ్బా, యేమి శిల్పంబు, మ
త్సరమున్ గాంతురు భిన్నదేశ జనులా సౌందర్యముం జూచి, ఆ
శిరసుల్ విప్పిన సర్పమో, వృషభమో, స్త్రీమూర్తులో యచ్చటం.

కావ్యగంగ'ను మైసూరు విశ్వవిద్యాలయమువారు బి. ఎ., బి. యస్. సి., పరీక్షలకు పాఠ్యపుస్తకముగా నుంచిరి

వీరి 'శిల్పవాణి' కావ్యమందు శిల్పవిలాసిని యొక్కతె తన స్వీయానుభవమును నివేదించుకొనును. అందు విజయనగరపు రాజైన శ్రీ కృష్ణదేవరాయల రాజ్యాంగము, సాహితీసమారాధన. నాటి సంస్కృతి సంగ్రహముగా నిక్షిప్తమైయున్నది. రాయల సాహితీ కొలువుకూట మిట్లు అలంకరింపబడినదని శిల్పవాణి తన హృదయవీణను మీటి పలుకుచున్నది.

రూపుగొన్న కవిత్వ రోచిస్సువలె పెద్ద
నామాత్యుడొక్కచో నధివసించె,

అమృత గంగాప్రవాహము వోలె నంది తి
మ్మన వచ్చి నిజపీఠమున వసించె,
పదగుంభన ప్రౌఢి పాటించు రామ కృ
ష్ణ కవీంద్రుడుచితాసనమున జేరె,
గాంధర్వ కలనేర్పి కవితాకుమారిని
కై సేయు భూషణ కవియు వచ్చె,
సాహితీ పుత్రుడల్ల ధూర్జటి కవీశు
డపర తిక్కన పింగళి యరుగుదేర
వచ్చెనయ్యలరాజు, సభాస్థలంబు
మల్లనయు జేరె సభ్యుల యుల్ల మలర.

కవి హృదయమెల్లప్పుడు ఒకేరీతిగా నుండదు. అతనిక సుఖ దుఃఖములు కలవు. అతడొక్కపరి ఆనంద ఝురులందోల లాడును. ఒకొక్కసరి విషాదసాగరమున మునుగును. విషాద మావరించినపుడు భగవంతుని ముందతడు కుమిలి కుమిలి ఏడ్చును. బెళ్లూరి వారికి పుత్రికావియోగము సంభవించినప్పుడు తమ యావేదనను పద్యరూపమున నుంచిరి. ఆ విషాద జనకమగు ఆగాధకు, ఆ బాధకు మనగుండెలు కరుగును.

పానము సేయబూని మధుపాత్రిక నాయధరంబుఁజేర్చితిన్
గాని, యపారమై యచటఁగానబడెన్ విషబుద్బుదంబు లా
శా నిహతుండనైతినని స్వామి. వచింపఁగలేను నాకథన్
ప్రాణము వోసి నా హృదయభార మణంపుము నీకుమ్రొక్కెదన్.

ఎదిగిన కుమారుని కోల్పోయిన విషాద తరుణమున కూడా వారిట్లే కన్నీరు గార్చిరి. వారికి ప్రకృతిరూపము వికృతముగా గోచరించినది. కోకిలపాటలో పదును కత్తిపోటు కనిపించినది. అందుకే వారు—

పాడకు మీ ప్రభాతమున పాడకు కోకిల; నీదుపాటలో
వాడి కృపాణవర్గములు వ్రచ్చెడు నా హృదయంబు. పుత్రునిన్.
బూడిదవైచి నేశిశిరముం గనుచుంటిని జీవితంబులో
పాడకు మీ ప్రభాతమున పాడకు కోకిల ప్రేమగీతముల్

శ్రీ బెళ్లూరివారు తమ జీవితముననిట్టి యొడుదుడుకుల నెన్నింటినో వోర్చి నిలద్రొక్కుకొన్నారు. 30యేండ్లు అనంతపురం జిల్లా బోర్డు ఉన్నతపాఠశాలలలో ప్రధానాంధ్రపండితుల పని నిర్వహించి అనేకమంది విద్యార్థులను సాహితీప్రియులుగా తీర్చి ప్రస్తుతము ధర్మవరం తాలూకా కుంటిమద్ది గ్రామమున విశ్రాంతి గైకొనుచున్నారు. ఈ విశ్రాంతి సమయములోను వారి కలము చిందులు వేయుచున్నది. ఇటీవలనే వీరి 'శిల్పవాణి' విడుదలైనది. 'రెడ్డిరాజుమల హాయుగము' ముద్రణ కావలసియున్నది. ఈ మధ్యనే అనంతపురంలో జిల్లాకలెక్టరుగారి సమక్షమున కవిగారికి గొప్పగా సన్మానము జరిగినది. వారిప్పటికి జరుపుకొన్న సన్మానమదొక్కటే. వారెన్నడు సన్మానములకు, పొగడ్తలకు ఆశించిన మనుష్యులు కారు అపర వివేకానందులు.

వారి ఖండికలన్నియు ప్రకృతి సౌందర్యమునకు ప్రతీకలే. కావ్యనిర్మాణ మేదైనను జేయవలెననెడి తలంపు వారికి చిరకాలము నుండి కలదు. అధ్యాత్మిక జీవనమున అత్యున్నతస్థానము నందుకొన్న వివేకానందుని చరిత్రనే కావ్యవస్తువుగా దీసుకొని రమ్యమైన ద్విపదలో 'వివేకానందం' రచించి ధన్యులైరి. చికాగోలో తన్నాదరించిన సాధ్వీమ తల్లితో వివేకానందుడిట్లనుచున్నాడు.

అతిపూత చరిత భారత రత్నగర్భ
బ్రతుకెల్లదోచితీ పలుకు; నయ్యాదియె

నా జన్మభూమి; మానసము సర్పించి
పూజింతు నాదివ్యభూమి నేనాఁడు
భువనేశ్వరీమాత పుణ్యగర్భంబు
నవమాసములు మోచెనన్ను; నాతండ్రి
విశ్వనాథుఁడు నన్ను బెంచె; సర్వంబు
విశ్వేశ్వరుని కృపాభిక్షగా దలఁతు
రామకృష్ణాఖ్యగుర్వాజ్ఞ, పాలింప
భూమండలి చరింతు; ప్రేమ నర్పింతు;
నాశిషంబుల నందుమమ్మ! నీపల్కు
లాశా లతిక బెంచెనమ్మ నాలోన"
అని వివేకానందుఁడాహ్వాన సరణి
జని, యామెగృహము పావనము గావించె.

శ్రీ శ్రీనివాసమూర్తిగారు వందలకావ్యములు వ్రాయలేదు కాని వ్రాసిన వన్నియు మేల్బంతులు, తెనుఁగుతల్లికి అమూల్యాభరణములవి. వీరి కృతులలో ఖండకావ్యములెక్కువ. తపోవనము—కావ్యగంగ—అమృతాభిషేకము—విశ్వవైణికుడు. జాముకోడి-మొదలగునవి వీరి ఖండకృతులు. శిల్పవాణి-వివేకానందము కావ్యములు. కవిగారు 'గీతావాణి' పత్రికకు గౌరవ సహాయ సంపాదకులుగా పనిచేసిరి. వివేకానందము గీతావాణి పత్రికయందు ధారావాహికగ ప్రచురింపబడినది.

మధురకవి-రాయలసీమ కవికోకిల-అభినవకాళిదాసు మున్నగు బిరుదులతో కవిగారిని సత్కరించుటలో సరిపోలేదు. ఇట్టి కవీశ్వరులకు ఆర్థికముగా సహాయ పడుటగూడా మన ధర్మమైయున్నది దీనిని గుర్తించినప్పుడే రాయలసీమ ప్రజలు ఆంధ్రభోజునకు దీటైన సాహితీపోషకులు గాగలరని మా విశ్వాసము.

విద్వాన్
శ్రీ షేక్ దావూద్ సాహెబ్

జననము :— 1—7—1916

తల్లి:— శ్రీమతి ఖాదర్‌బీ తండ్రి:— శ్రీ సుల్తాన్‌సాహెబ్.

జన్మస్థలము:— 'చిట్వేలు' కడప జిల్లా.

మతము, కులము:— ఇస్లాం — ముస్లిము.

20వ, శతాబ్దమునకు మున్ను. అంధ్రభాషలో కృతులు వ్రాసిన మహమ్మదీయులున్నట్లు మనకు తెలియదు. మాలిక్-ఇబ్రహీమ్‌షా - అమీర్‌ఖాన్ మున్నగు వారందరూ కృతిభర్తలుగానే పేరొందిరి. వారు తెనుగు కవులనాదరించిరి. తెనుగుకావ్యముల నంకితముగొనిరి. వారు ఆంధ్రసారస్వతము గూడ తమది గానే యభిమానించిరి. రానురాను హిందూదేశములోని మహమ్మదీయులు వారి 'ఉర్దూ'తో బాటు సంస్కృతాంధ్రభాషలను నేర్చి తియ్యతియ్యని తెలుగుకైతలు సృష్టించిరి. అది తెలుగుభాషకొక గౌరవప్రదమైన విషయము. భారతికి మతము, కులములతో బని లేదు. ఆవిడ సంస్కారవంతునితో చెలిమిచేయును. అతడిని తీర్చిదిద్దును. అట్టి భాగ్యశాలి-కవి, పండితుడు, హిందూ. మహమ్మదీయ మతసమన్వయము నెరిగినవ్యక్తి శ్రీ షేక్‌దావూద్ సాహెబ్.తనది ఇస్లాం మతము మాతృభాష ఉరూ. పుట్టినది భారత దేశము. చేబట్టినది హిందూ. మహమ్మదీయ సమన్వయము. నేర్చినది సంస్కృతాంధ్ర, హిందీభాషలు. కవితచెప్పి 'శహబాష్' అనిపించుకొన్నది ఆంధ్రమున-ఇవి దావూద్‌గారి ప్రత్యేకతలు.

పేదకుటుంబమున పుట్టిన దావూద్‌కు చిన్నతనములోనే తల్లిదండ్రులు గతించుటచే స్వస్థలముపీడి నెల్లూరుపట్టణముచేరి

సాహెబ్‌గారు సులువుగా నేర్చుకొనిరి. వారి కీర్తి కొట్టు కృష్ణ రాయల భువన విజయమట్లును మఱిపించుచుండెడిది. పలువురు కవి పండితుల గోష్ఠులతో తానును పండితులైనారు. దానికితోడు మద్రాసు విశ్వవిద్యాలయమువారి 'విద్వాన్' పట్టముతో హిందీ—తెనుగు పండితుడుగా ప్రకాశించి 1940 నుండి 49సం॥ వఱకు నంద్యాల హైస్కూలులో తెనుగు పండితుల పదవిని నిర్వహించిరి. తదనంతరము 1949లో కర్నూలు ఉస్మానియా కళాశాలలో హిందీ పండితులైరి.

శ్రీ దావూద్ సాహెబ్‌గారు తమనుగూర్చి యిట్లు చెప్పుకొనిరి.

'కవి యెట్టివాడైనను దగ్గరికి తీసి ప్రోత్సహింతును. కావ్యములు సవరింతును. వారికి బలువిధముగా చక్కిలిగింత పెట్టుదును. బాలకవులను నిరుత్సాహ పఱచుట పాపమను తలంపు నాకు గలదు. నాకు జాతి కుల, పంక్తి, ధర్మ, ధర్మేతరమను సంకుచితము మాత్రములేదు. నేను మాత్రము పదునాఱణాలు ముస్లిము ధర్మావలంబిని. శ్రీ షర్డీసాయిబాబా యందు మానసిక శ్రద్ధగలవాడను. మహాత్ములన్న శ్రద్ధమెండు"

దావూద్‌గారిని కొందరు 'తురక పండితుడని' ఆక్షేపించిరి మఱికొందఱు హేళనగా 'దావూద్‌శాస్త్రి' అని పలికిరి. కొన్నాళ్ళు వారి మతస్థులు ఈసడించుకొన్నారు. వీరెవరిని లెక్కకుపెట్టినవారు కాదు. దావూద్ గారిది హిందూ ముస్లిం సామరస్యమునకు పాటు పడిన పవిత్రవంశము. వీరి అగ్రజులు హిందూ, ముస్లిం సామరస్యమునకై బలియైన మహాత్యాగి. వీరు హిందూ ముస్లిం

సంస్కృతులు సంగమించిన స్రవంతి. అందుకే వీరి హృదయ పీఠాధిష్ఠానదేవత సాయిబాబా యైనాడు. శ్రీ షర్దిసాయిబాబాపై వీరీకృతులు వ్రాసినారు. 1) క్రీడాషర్దీశ్వరము 2) సాయిశతకము 3] సాయిబాబా దండకము 4] శ్రీసాయిబాబా ఆధ్యాత్మికశక్తిని చాటిచెప్పెడి కావ్యము 'సంస్కారప్రణయము'. ఈ కావ్యమందు శ్రీసాయి తన్నుగూర్చి తన భక్తులతో నిట్లనుచున్నాడు.

"కలకాల మార్తసంఘమువెతల్ దుల్పఁగా
మదిలో నమృత కాంక్షఁ బదిలపఱచి,
హృదయాన ననుఁబిల్చు సద సద్వివేకుల
తలఁపుల వలపించు తత్త్వమెఱిగి,
'సాయీ' యనుచుఁ గూర్మి స్వాగతమిడువారి
కష్టముల్ పోకార్చు దృష్టినొసఁగి,
భావి జీవిత చింత భయమందువారికి
చిత్తశాంతిని గూర్చు బత్తి దెలిపి,
తత్త్వ సంబంధ నిత్యసంతప్తమతికి
గీల కమ్మగు జపమును గీలుకొల్పి
జగము గాపాడు గురుదత్త శక్తిగల్గి
షర్ధి నివసింతు నాత్మ శిక్షకుఁడనగుచు"

శ్రీనావూచ్‌గారు కబీరు, రహీమ్, వృంద్ అను మువ్వురు హిందీలో వ్రాసిన కొన్ని 'దోహాలు'లను తెనుగున 'సూఫీసూక్తు' లను పేర గీతపద్యములుగా అనువదించిరి. భగవన్మహిమ ఇట్టిదని వారు నుడివిరి.

నదులెవని నమ్మి జీవనానందమందు
ఋతువు లెవనిదయస్ సఫలత భజించు

యతుల కెవ్వాఁడు శరణమో యతఁడౌనంగు
మీకు శుభముల గురునాజ్ఞ మెలగునెడల.

తత్త్వమును గూర్చి యిట్లు చెప్పిరి.

మనసు మధురగ. ద్వారకా మందిరమ్ము
హృదిగఁ, కాయమ్ము కాశిగా నెఱిఁగి మఱియు
ద్వార దశకమ్ముగా దేహతత్త్వ మరసి
తత్త్వ మరయంగఁదగును నిస్తంద్రభక్తి.

వీరి కావ్యములలో 'దాసీపన్నా' తెలుగు సాహిత్యాకాశమున నొక ఉజ్జ్వల నక్షత్రముగా వెలిగినది. రాజస్థానమున దేశ స్వాతంత్ర్యమును గాపాడుటకు తన సర్వస్వమును ధారవోసిన 'రాణా సంగ్రామ సింహు'ని వంశ చరిత్రమునకు ప్రాముఖ్యతగలదు. సంగ్రామసింహుని పుత్రుడగు ఉదయసింహుని ప్రాణరక్షణార్థము తన పుత్రుని ప్రాణముల బలినొసగిన వీరవనిత ధాత్రీపన్నాచరిత్ర మిందు గైకొనబడినది. ఇందు ద్వాదశ పరిచ్ఛేదములు గలవు. ఒక్కొక్క పరిచ్ఛేదమునకు కావ్యానుగుణముగా ఒక్కొక్క పేరు రమ్యముగా నుంచిరి.

వనవీరుడు ఉదయుని జంపవచ్చినప్పుడు పన్నా తన నిజ సుతునే యతనికి జూపినది. ఆ పసికందు నిద్రలో నన్నియు మఱచియున్నాడు. అతని నిట్లు కవిగారు వర్ణించినారు.

మాతృవాత్సల్య నిర్మల లోహ కవచ ర
క్షాధైర్యమున నిద్ర గనెడువాని,
మాత్సర్య మోహ దుర్మాయాదు లెఱుఁగని
యొక నూత్న జగము నందున్నవాని.

శత్రుమిత్రాది దుష్టప్రేత ఘాతుక
భేదంబెఱుంగని పిన్నవాని.
ఉయ్యాలయో, తల్లియొడియో, గద్దెయటంచు
నెంచి కూర్చుండి హర్షించువాని,

సకల మనముల ప్రేమసస్యములఁబెంచు
జలదరూపుని, కళ్యాణముల కొటారు
బాల చంద్రుని బోలు డింభకుని జంప
విచ్చుగత్తిని నవ్వనవీరు డెత్తె!

'కోకిల గూట దుమికెడు ఘూకమట్లు' అతడు దూకి శిశువును చంపినాడు. పన్నా 'సంగ్రామమున బుత్రశతము కాలునిఁజేర వాపోవు నంధ దంపతులకన్న' మిన్నగ శోకించినది. అది ఆమె హృదయమున యారిపోని శోకాగ్ని. ఆమె కుమారుని సంతోషముగా స్వర్గమున కిట్లు పలికి పంపినది. ఆమె యెంతటీ నిశ్చల హృదయురాలో జూడుడు.

అరుగుము స్వర్గభూమి, కటనారయుమీ మన వీరభాగమా
యిరుగున గుల్మవీధి మన యేలిక సొంగుడు గానవచ్చు; నీ
వరిమురి నిచ్చటన్ జరిగినట్టి విషాద చరిత్రఁ దెల్పుమా
పరమ పవిత్ర వీరుడు కృపామతినిన్ గవుగింటఁ జేర్పగన్.

పన్నా దుఃఖమున నున్నదని తెలిసి, ఆమెకప్పుడూరట కల్గించుటకు చంద్రుడు, చంద్రికాతతులు బయలుదేఱినవట. ప్రకృతిగూడ ఆమె మనోవ్రకృతినెఱిగి దుఃఖించిన తీరున కవిగారు రమ్యముగా వ్రాసిరి. పన్నాకు ఉదయుని కాపాడుట కష్టమై పోయినది. ఆమె అతనిని భిల్లుల రక్షణలోనుంచి పెద్దజేసి సమయము కొఱకు వేచినది. కొన్నినాళ్లకు ఆ వనవీరు పరి

పాలన అరాచకముగా సాగినది. అతడు భోగలాలసుడైనాడు. జారుడైనాడు. ప్రజలకు వాని పాలనపై వెగటేర్పడినది. ఆ సమయమెఱిగి పన్నా ప్రజలలో విప్లవభావము పురికొల్పినది. అప్పటికి ఉదయుడు పెరిగి పదునారేండ్ల ప్రాయపు వీరుడైనాడు. భిల్లులు, యితర రాజులు అతనికి తోడ్పడిరి. ఆ 'భోగాలమేడలో' నున్న వనవీరునిబట్టి ఉదయుడు చంపబూనినప్పుడు పన్నా అతని వారించినది. దానినిట్లు కవిగారు పోల్చిరి.

> భారత గాథలో హృదయభారము గూర్చిన ద్రోణపుత్రుదు
> ద్వార యశోవిశాలయగు ద్రౌపది ముఃఖ క్షమియించినట్లు, హృ
> త్కారుణి కత్వముం దెలుపగా వనవీరు క్షమించి. నేటి మా
> భారత ధాత్రి నేలిన కృపామతి ధాత్రియె ధన్యయియ్యెడః.

ఈ విధముగా ఈ కమ్మని కావ్యము మన పోతుగడ్డపై ఆవిర్భవించినది. ఇది గడియారమువారి 'శివభారతము'నకు—రాజశేఖర శతావధానిగారి 'రాణాప్రతాప సింహచరిత్ర'కు ఈడైన చిరు చారిత్రాత్మక పద్యకావ్యము. 'కదాసందర్భద్యోతక సహజప్రకృతి వర్ణనలతోబాటు, మహాశిల్పి చెక్కిన కళాఖండముల వలె నున్నవి మనోభావ వర్ణనలు. ఏకచూపుట పుస్తకము సాంతంగాచదువుతే' అన్నారు శ్రీ మరుపూరు కోదండరామరెడ్డిగారు. వారి మాటలలో అసత్యమేదియులేదు.

తెనుగు కవిత వ్రాయనారంభించి ముప్పదియేండ్లు కావచ్చినను, పరంజ్యోతి స్వరూపుని, పరమసేవానిరతుడగు ప్రవక్త నుద్దేశించి యొక్క పద్యము నెన్నడు రచింపలేకపోయితి ననెడు మనోవేదన దావూద్‌సాహెబ్‌గారికి కలుగకపోలేదు. సమయమాసన్నమైనప్పుడు భగవంతుడే ఆపనిని చేయించును. శ్రీ కే.

గోపాలకృష్ణారావుగారు (నిజాము కళాశాల ఆచార్యులు)కవిగారిని ప్రోత్సహించి, మహమ్మదు ప్రవక్తగారినిగూర్చి శతకమును వ్రాయుమనిరి. అప్పుడు కవిగారిలో మానసిక చైతన్యము గల్గినది. జగత్ప్రవక్తపేరిట 'రసూల్ ప్రభు శతకము'రచించి జన్మ సార్థకతను పొందిరి. వారిట్లు ప్రభువును ప్రార్థించిరి.

> చింతల తంతు్రుంపుము వసింతు భవత్పద పద్మచింత నా
> వంతల బొంత సుంత భగవంతుడు లేడు నిరంతరూప! యా
> త్మాంతర మన్ కులాయమున నంట దొకింత కృతాంతభీతి న
> న్నింతకు దుఃఖకీటకమె హీను నొనర్చునహో రసూల్ప్రభూ!

> కవితకు సృష్టిదేవు ననుకంపయొ, సత్యము నీమహత్త్వముం
> దవిలిన నాకలమ్ము గుఱితప్పక తావక చర్చసల్పెడున్
> భగవత జీవులందఱు సెబాసని మెచ్చి పఠింప రక్తి హృ
> త్పవిమల ముక్తిగొను బాటను దెల్పగదే రసూల్ప్రభూ!

వీరు హిందీ పండితులగుటచే కొన్ని హిందీ అనువాదములనుకూడ తెనుగున గావించిరి. హిందీ కవి జయశంకర్ ప్రసాద్ గారి 'ఆన్సూ' కావ్యమును 'అశ్రుమాల'గా అనువదించి ముద్రించిరి. హిందీలోని 'మిలన్'ను 'ఆనందకుమార' యను పేర అనువదించిరి.

రసూల్ ప్రభు శతకము తరువాత 1) అల్లా మాలిక్ శతకము 2) సఖుడా (శతకము) 3) నాగూర్ ఖాదర్వలీగారిచరిత్ర 4) ఆజాద్ చరిత్ర 5) అబ్దుల్ఖాదర్ జీలాని. గౌసుల్ ఆజమ్ దస్తగిరి గారి దివ్యచరిత్ర 6) చంద్రవదన మోహియార్ ఖండకావ్యము (కదిరి సమాధిగాథ) మున్నగు ఇస్లాం మత ప్రబోధాత్మక రచనలను గావించిరి. ఇవి అముద్రితములుగానే నిలిచినవి.

ఇవియేగాక 'అభినవ తిక్కన కవితాసమీక్ష' — 'ఖండకృతులు'— ఆదర్శము(నవల) సాయిబాబాచరిత్ర(కావ్యము) మున్నగునవికూడ అముద్రితములు.

వీరు మంచి వక్తలు. ఉపన్యాసములలో హాస్యమును మేళవించి శ్రోతలను కడుపుబ్బ నవ్వింతురు. వీరు గ్రాంథికభాషా ప్రియులు. సరళహృదయులు. నిరాడంబరులు. వీరికి నలుగురు కూతురులు. 6గురు కుమారులు కలరు. ప్రస్తుతమువీరు కర్నూలు ఉస్మానియా కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా నున్నారు.

హిందూ మహమ్మదీయ సఖ్యతకు నిలయమైన భారత భూమిలో మతసామరస్యమును చాటిచెప్పు యిట్టి కవీశ్వరు లుద్భ వించుట మన పుణ్యవిశేషము. అందులో రాయలసీమ అభాగ్యం ప్రాంతంచుట సుకృతము. కవిగారికి ఈశ్వరు డాయురారోగ్య భాగ్యంబుల నిచ్చుగాక! శుభమస్తు.

"ఈశ్వర అలా తేరేనామ్, సబ్‌కో సన్మతి దే భగవాన్".

★ ★ ★ ★

డాక్టర్ గుంటుపల్లి రాధాకృష్ణమూర్తి

జననము: — 25—8—1930

తండ్రి: — శ్రీ గుంటుపల్లి శ్రీనివాసరావు

స్వస్థలము:— కర్నూలు జిల్లా – బనగానపల్లె తా॥ నందవరం.

మతము, కులము:— హిందూ – బ్రాహ్మణ – నందవరీకులు.

నేటి ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక చదువరులకు శ్రీ గుంటుపల్లి రాధాకృష్ణమూర్తిగారి పేరు సుపరిచయమే. వారి

'వైద్యవిజ్ఞానం' శీర్షిక జనరంజకంగా, బహుజనుల కుపయోగ ముగా నిర్వహింప బడుచున్నది. అనంతపురం పట్టణములో వీరు సుప్రసిద్ధ నేత్రవైద్యులుగా వాసికెక్కియున్నారు. అటు వృత్తి రీత్యా వారు డాక్టర్లు. ఇటు సాహిత్యంలో 'డాక్టరేట్' బిరుదును పొందదగిన సమర్థులు. విజ్ఞానవంతులు. నేత్ర శాస్త్రాచార్యులు. పేదల పాలిటి కొంగుబంగారము. నిర్మలహృదయులు. నిరాడం బరులు సాహిత్యప్రియులతో చెలిమి నాకాంక్షించు తత్త్వమువారిది.

వీరి తండ్రిగారు కవులు. వారు 'రుక్మిణీకల్యాణము'- 'జానకీ పరిణయ' మను కావ్యములను వ్రాసిరి. శ్రీ రాధాకృష్ణమూర్తిగారు తమ అన్నగారైన శ్రీ గుంటుపల్లి శ్రీరామమూర్తిగారివద్దనే పెరిగి పెద్దవారై విద్యాబుద్ధులు నేర్చుకొనిరి. మద్రాసు పచ్చ యప్ప కళాశాలలో B. Sc., డిగ్రీ 1949లో కవిగారు పొందిరి. 1954లో మద్రాసు వైద్యకళాశాలలో ఎం. బి. బి. యస్., డిగ్రీని, 1956లో నేత్రవైద్య డిప్లమాను పొందిరి.

తరువాత సివిల్ అసిస్టెంట్ సర్జనుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యశాఖలో చేరిరి. నేత్రవైద్యములో ఉన్నతోన్నత మైన ఎం. ఎస్. డిగ్రీని 1961లో చేపట్టిరి. కర్నూలు, వరంగల్ వైద్యకళాశాలలో సహాయనేత్ర శాస్త్రాచార్యులు (అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఆప్తాల్మాలజీ)గా పని చేసిరి. 1968లో వీరి పరి శోధనా పత్రాలకు గుర్తింపుగా 'అంతర్జాతీయ శస్త్రవైద్యుల కళా శాల' చికాగో (అమెరికా)వారు రాధాకృష్ణమూర్తి గారిని సభ్యులుగా ఎన్నుకొని డిగ్రీనిచ్చి సత్కరించిరి.

1965 ఆగస్టు 15వ తేదీనాడు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి నేత్రవైద్యులుగా నియమింపబడిరి. తరువాత వచ్చిన

ప్రభుత్వ వుత్తరువు ననుసరించి వారు స్వతంత్రముగా ప్రాక్టీసు చేయదలచి, ప్రభుత్వోద్యోగమునకు ఉద్వాసన నిచ్చిరి. అప్పటి నుండి యిప్పటివరకు వీరు అనంతపురము కోర్టురోడ్డులో స్వతంత్ర కంటివైద్య ఆస్పత్రిని స్థాపించి పేరు ప్రఖ్యాతులు పొందిరి.

వైద్యమునందేకాక రచనావ్యాసంగములోను రాధాకృష్ణ మూర్తిగారు ఆరితేరినవారు. చిన్నతనమునుండి వీరికి తెనుగు భాష యందు మక్కువ మెండు. 1945లో వీరు మద్రాసునందు యస్. యస్. యల్. సి. చదువుచున్నప్పుడే వీరి తెనుగుపండి తులు శ్రీ గరిమెళ్ల సత్యగోదావరిశర్మగారు తరగతిలోని విద్యార్థు లకు ఛందస్సును బోధించుచు, ప్రతిపిల్లవానిని ఒక పద్యము వ్రాసుకొని రావలసినదిగా ఆజ్ఞాపించిరి. మరుసటి రోజే రాధాకృష్ణ మూర్తిగారు ఉపాధ్యాయులవారికి ఒక పద్యమును వ్రాసుకొనివచ్చి చూపిరి. తెనుగు పండితులవారు మెచ్చుకొని 'నీకు తెనుగు సాహి త్యములో మంచి భవిష్యత్తు గలదు' అని ఆశీర్వదించిరి. ఆనాటి వారి ఆశీర్వాద ఫలితంగానే ఈనాడొక గొప్ప రచయితగా వెలుగు చున్నారు శ్రీ గుంటుపల్లివారు. 'సుదినం' వీరి తొలి రచన. 1946లో శ్రీ దుర్గాబాయిగారి 'ఆంధ్రమహిళ' మాసపత్రికలో అలంకరించినప్పటినుండి వారి రచనాజీవితం సుదినంగా పరిఢవి ల్లి నది. తరువాత ఆంధ్రమహిళ - చిత్రగుప్త — నవజీవన - ఆనంద వాణి - జయశ్రీ - కిన్నెర - ఆంధ్రప్రభ మున్నగు సుప్రసిద్ధ పత్రి కలలో కథానికలు, వ్యాసాలు, నాటికలు, పద్యాలు, గేయాలు ధారావాహినిగా ప్రచురింపబడినవి వీరు శతాధిక కథలనే రచిం చిరి. అందులో ప్రజామోదము పొందినవి. 1) కుబేరపుష్పకము

2) మనసు మలుపుల్లో 3) లాటరీచీటి 4) షష్టాష్టకం 5) దోమ తెర, తగాదా మొదలగునవి.

నవలారచనలోకూడా గుంటుపల్లి వారు సిద్ధహస్తులు. 1)గెలుపు 2) ప్రకాశము-ప్రేమ 3) చక్కనిచుక్కలు పత్రికలలో ధారావాహికగ ప్రచురింపబడిన నవలలు. వీరి 'ఓట్ల వేట' నాటకము అనంతపురము లలితకళా పరిషత్తువారిచే అనేక పర్యాయములు ప్రదర్శింపబడి, హైదరాబాదు రవీంద్రభారతిలో ప్రదర్శింపబడి మెప్పులు పొందినది. 'టోకరా' - 'ప్రేయసి' - 'వన్ట్రూత్రీ' మొదలగునవి వీరి కలమునుండి వెలువడిన ఇతర నాటికలు. ఇటీవలనే ఆకాశవాణిలో వీరి 'మరో జవహర్'అనే నాటిక ప్రసారమైనది.

1) చందమామయాత్ర 2) హాస్యకుసుమాలు 3) హక్కులు—విధులు 4) విజ్ఞాన విశారదులు (5 భాగములు) 5)కళ్లను కాపాడుకోండి మున్నగునవి వీరి ముద్రిత పుస్తకములు. వీరి రచనలకు భారత ప్రభుత్వ బహుమతులుకూడా లభించినవి. 1956లో 'ఆరోగ్యమే మహాభాగ్యము', 1957లో 'సంఘజీవనము', '1961లో 'జ్ఞానపంచమి' అనే వైద్యగ్రంథాలకు భారత ప్రభుత్వ బహుమతులు లభించినవి. వరుసగా మూడు సంవత్సరాలు భారత ప్రభుత్వ బహుమతి పొందుట వారికిగల ఘనతకు తార్కాణము. 1958లో ఆంధ్రప్రదేశ ప్రభుత్వ బహుమతి వీరి 'విజ్ఞానం' అనబడు పిల్లల పుస్తకమునకు లభించినది. 1964 లో నెల్లూరు పౌరులు జరిపిన 'కవికోకిల దువ్వూరి రామిరెడ్డి వర్ధంతి' సందర్భముగా శాస్త్రరచన బహుమతి వీరి 'వైద్యవిజ్ఞానము'నకు దక్కినది.

1960లో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక దీపావళి సంచికలో 'తెలుగు కలాలు' శీర్షికలో రాధాకృష్ణమూర్తిగారు తెలుగు పాఠకులకు పరిచయము జేయబడిరి. సంపాదకులు రచయితను గూర్చి యిట్లు చెప్పిరి. 'సులువైన భాషలో బరువైన విషయాలను రచించగలగడం వీరి ప్రత్యేకత'. ఈవిషయమును పాఠకులు ప్రస్తుతము ఆంధ్రప్రభ సచిత్రవారపత్రికలో ప్రచురింపబడుతున్న 'వైద్యవిజ్ఞానం' వ్యాసములు చదివి తెలుసుకొనవచ్చును.

సిస్టర్ సుమతి - అన్వేషణ - నవలలు, ప్రయాణం—స్వాతంత్ర్య సమరము - సర్వోదయం - కథాసాహిత్యము మొదలైన ఇతర గ్రంథాలు అచ్చుకు వేచియున్నవి. 'గుంటుపల్లి సూక్తి గురుడ వినర'అనే మకుటంతో వీరు 200 పద్యములకుపైగా రచించిరి. వచన కవితలు పెక్కులు అముద్రితములుగా నున్నవి.

ఒకవైపు మానవకోటికి దృష్టిజ్ఞానమును ప్రసాదించుచు, మరొకవైపు సాహితీ విజ్ఞానవేత్తలకు, పామరులకు మనోజ్ఞానము నిచ్చువైద్యవిజ్ఞాన గ్రంథములను, సాహితీగ్రంథములను రచించి ధన్యతనుపొందినవారు శ్రీ గుంటుపల్లివారు. వీరు అనంతపురంలోని రోటరీక్లబ్‌కు అధ్యక్షులుగానుండి మానవ సేవాకార్యములను నిర్వహించుటగూడా ఒక విశేషగుణము. వీరికి భగవంతుడు ఆయురారోగ్య భాగ్యంబులనిచ్చి కాపాడుగాత !

★ ★ ★ ★

అభినవ పోతనామాత్య – కవికులాలంకార

శ్రీ వాడేల వేంకట శేషగిరిరావు

జననము: — *14—10—1905*

తల్లి: – శ్రీమతి వాడేల వెంకట లక్ష్మమ్మ

తండ్రి: – శ్రీ వాడేల వెంకట్రామయ్య

స్వస్థలము — రావిపాడు – కంభంతా॥ కర్నూలు జిల్లా.

మతము, కులము:— హిందూ – నియోగి బ్రాహ్మణ – కౌండిన్యగోత్రులు.

భక్త్యావేశము ప్రోత్సహింప స్థిరుడై బ్రాహ్మీమహాదేవియే
సూక్త్యంతర్గత భావగుంభిత పదస్తోమంబునం దీర్చుచో
ముక్త్యావేశమునన్ లిఖించు ఘనుడా పోతన్నతో దీటుగా
రక్త్యానంద మెఱుంగనట్టి జడుడా వ్రాయున్ ప్రబంధంబునున్,

వాని పదరేణువుల బోలలేని నేను
భాగవత కావ్యరచనకై పాటుపడుట
దైవ నిర్ణయమే సూవె తలచి తలచి
వ్రాసితిని తోచినంత శ్రీవరుని కరుణ.

శ్రీ వాడేల వేంకట శేషగిరిరావు గారొక సాహసకృత్యమును భగవంతుని కృపతో సాగించిరి. భవబంధ విమోచనకొరకై పోతన వ్రాసిన ఆంధ్రమహాభాగవత దశమస్కంద యితివృత్తము నాధారముగా జేసుకొని వీరు 'శ్రీ కృష్ణాభ్యుదయము' ను రచించి వాసికెక్కిరి.

ఈ కార్యమును క్రితమునందు శ్రీ జనమంచి శేషాద్రిశర్మ గారు గావించి ధన్యులైరి. వారి కావ్యమునకు 'తాండవ కృష్ణ భాగవతము'అని పేరిడిరి. వారు సహితము పోతనభాగవత దశమ స్కందమునే మూలముగా గొనిరి. అటే శ్రీపాదకృష్ణమూర్తి

శాస్త్రిగారు కూడ సంస్కృత వ్యాస భాగవతమును ఆమూలాగ్ర ముగా ఆంధ్రీకరించి కృతార్థులైరి. అట్టి విద్వత్కవులచే శ్రీ వాడేలవారి శ్రీకృష్ణాభ్యుదయము ప్రశంసలను పొందినది. శ్రీ వాడేలవారు తొలుత 'విజయభారతి' అను యితివృత్తమును వ్రాయ పూనుకొని అందు శ్రీకృష్ణలీలలు వర్ణించు నుత్సాహముతో ధారగా కొన్ని పద్యములు వ్రాసిరి. తదుపరి వారికి శ్రీకృష్ణుని కథనే ప్రత్యేకముగా వ్రాయు సంకల్పమును భగవంతుడు కల్గించెను. ఆ కార్యమును భగవంతుడతనితో చేయించెను. ఆ దైవనిర్ణయముం డుటవలననే రాయలసీమయందు అభినవ పోతనామాత్యుడుగా వెలిగినారు శ్రీ వాడేల వేంకట శేషగిరిరావుగారు.

కావ్యము ముగించి యేడాదియైనను ముద్రణకు ధనములేక మౌనముగానున్న తరుణములో భగవంతుడే కవిగారికి త్రోవ చూపించినాడు. ఆంగ్లములోగల 'క్రాసువర్డ్ పజిల్' నందు కవి గారు పాల్గొని ద్రవ్యమును సంపాదించుకొనిరి. ఆ ఆకస్మిక ధన లాభముతో కావ్యముద్రణ చక్కగా జరిగినది. ఇందు కవిగారు తమ వంశక్రమమును. కుటుంబచరిత్రను విపులముగా పద్య రూప మున చేర్చిరి. ఈ కవిగారి పూర్వీకులు నిరతాన్న దాతలు. సద్గుణసంపన్నులు.

'శ్రీ కృష్ణాభ్యుదయము' నందు వీరి రచన సరళముగా సాగి నది. పామరులకొకపరి చదివి వినిపించిన సులువుగా అర్థము కాగలదు. పాండిత్య ప్రకర్షకై సుదీర్ఘ సమాసములుపయోగించు నలవాటు వీరికి లేదు. ఎన్నో లోకోక్తులను, వ్యావహారిక భాషా పదములను తమ రచనలో ప్రవేశపెట్టిరి. ఇందక్కడక్కడ నాటకధోరణి కనిపించును. కొన్నియెడల భాగవతము ననుసరింపక

స్వతంత్రించి రచన సాగించిరి. వాడేలవారు పాత్రల మనస్తత్వములను గొప్పగా చిత్రీకరించిరి.

ఆరు కాన్పులన్యాయముగా కంసుని కత్తికి బలిచేసి. తుద కేడవగర్భమును ధరించిన దేవకి మనక్షోభము నిట్లు కవిగారు వర్ణించిరి.

ఉ॥ "ఇప్పటి కారుమార్లు సహియించితి; లోకమునందు నెవ్వరే
నెప్పుడుఁ జెందియుండని, భరింపని యాతన; గన్నవారినే
యప్పన జేసినాను మనసార నరాంతకు కత్తివాతకున్
జెప్పన దేమి? భూతమను, జెడ్డపిశాచిని నేను మాధవా!

శా॥ దేవా! యింక భరింపలే నుబుసు; నీదే భారమీకాన్పు నే
త్రోవన్ దీర్చెదొ? యేదియెట్లయిన, నాదుర్మార్గుఁడే వచ్చి నా
జీవంబుల్ బలివెట్టనెంచిననరే; చేజేఁత నాపాప న
య్యో వారాశిని 'ద్రోయ'ద్రోయ' నని యెంతో ఖిన్నయై యేడ్చుచున్!

ఆయా సందర్భములందు కవిగారు చదువరులకంట కన్నీ రొలికించిరి. కొన్నియెడల నవ్వుపుట్టించిరి. గోపికల తన్మయత్వ మెట్లున్నదో చూడుడు.

సీ. సరిగంచు చీరను సవరించు కొనులేమ
మైజారు పయ్యెద మఱచిపోయె;
బిగుతు కంచుకమును బిగియించు కొనుభామ
ముడివేసి కొనుమాట విడిచిచనియె;
నంగరాగము దిద్దు మంగళాంగి చెలంగి
పరిపూర్తిసేయుగా నరయదయ్యె!

భూషణములదాల్చు పొన్నికొమ్మ యొకర్తు
తల క్రిందులుగ వాని దాల్ప దొడగె;
గనులగాటుక దిద్దెడు కనకగాత్రి
నగములోనిల్పి పయనమై సాగిపోయె;
గట్టికట్టని చీరతోఁ గదలె నొకతె
కుతుకమున రెచ్చి యన్య నంగతులు మఱచి.

ఉ॥ తల్లులు దండ్రులున్ సఖులు దత్పతులాప్తులు. నన్నదమ్ములున్
బెల్లుగ నార్చుచున్న వినిపింపనియట్లు తదేకచిత్తలై
వల్లవ కామినీమణులు పర్విడి రొక్కటి భావదీప్తిచే
నుల్లము లెంతయున్ మెఱసి యూరక శ్రీహరి జూచుచుండగన్.

గోపికలు గోపాలకృష్ణుని రాసక్రీడకిట్లు ఆహ్వానించుచున్నారు.

సీ. బిడియమా? కౌగిటబిగియించి, వగ్రదుంచి
సొగసించి కరుణింప సుందరాంగ
తలవంపుకా? ముద్దులొలికించి వలపించి
లలిముంచి పరికింప లలితగాత్ర!
సరిపోలమా? నిన్ను మురుబంతులాడించి
మురిపించి. మెఱపించ మోహనాంగ!
పనికిరామా? సేవలొనరించి తనయించి
మనసుదీరి సుఖించ మదనమూర్తి!
ఇంతబలవంతమేలనో? కంతుకేళి
యంతుభాతరలాడ మెప్పింతువనుచు
వలచిపిలుచుటచేన? గోపాలబాల!
చాలు జాలింక బిగువులు జక్కనయ్య!

ఇందు రుక్మిణీకళ్యాణఘట్టమునుగూడ అందముగా జొప్పించిరి. రుక్మిణీ తన లేఖలో శ్రీకృష్ణునికిట్లు నివేదించుకొన్నది.

శా॥ నేనే నీసతి, నీవె నాపతివి, నింతే యెన్ని జన్మంబులం
దైనం బాయని సత్యబంధమిది నాథా ! సూక్ష్మమూహించి నీ
చానన్ నన్నుఁ బరిగ్రహింపుము దురాశావేశు లుర్వీశ్వరుల్
గ్లానిం బొందెడునట్లు రాక్షసవిధిన్ గైకొమ్ము నిక్కమ్ముగన్.

క॥ రాక్షస విధి గైకొనుటలు
సుక్షత్రియ వంశకీర్తి శోభన మౌటన్
రక్షా దక్షుడవై నీ
పక్షమునం జేర్చుకొమ్ము పావనమూర్తీ!

ఇట్లీ శ్రీ కృష్ణాభ్యుదయ పూర్వభాగమును రుక్మిణీకృష్ణుల కల్యాణముతో ముగించిరి. ఇందు పోతన భాగవతమున కానరాని కంస, కాలయవనుల జన్మవృత్తాంతములు జేర్చబడినవి. కొన్ని పద్యములు చదువుచున్నప్పుడు పోతన జ్ఞప్తికి వచ్చును. అంత మాత్రమున కవిపోతనను పూర్తిగా అనుసరించి యున్నాడనుటకు వీలులేదు. గ్రంథము పూర్తిగా జదివిన వారికీవిషయము స్పష్టము కాగలదు. శ్రీకృష్ణ చరిత్రను కవిగారు గానము చేసి ధన్యులైరి. అది వారి పూర్వజన్మ పుణ్య విశేషము.

శ్రీ వాడేల వేంకటశేషగిరిరావు గారు కవులేగాక సిద్ధాంతులు కూడ. వీరికి భగవంతుని కృపవలననే జ్యోతిషమునందనుభవము గలిగినది. వీరి కక్షరాభ్యాసము చేసిన గురువులు శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు. ఉన్నత విద్యాభ్యాసమంతయు హైదరాబాదు నందలి వారి అక్క, బావగార్లయింట జరిపిరి. వీరికి ఇంగ్లీషునందు యింటర్మీడియేట్‌వరకు ప్రవేశము కలదు. వీరు 'Paradise' అను ఒక పొత్తమును ఆంగ్లమున వ్రాసిరి.

ఈకవి శ్రీశైలమల్లికార్జునిపై నక్షత్రమాల -స్తోత్రమాల, స్తోత్ర కదంబము, శ్రీశైల పంచాంగము, శ్రీశైలక్షేత్రమహిమ, శ్రీశైలేశ చరితము మున్నగునవి రచించిరి. ఆ పుస్తకములపై వచ్చెడి సొమ్మును దేవాలయమునకే సమర్పించిరి. శ్రీశైలేశ చరితమునందు మల్లికార్జునస్వామి చరిత్రను గద్యమున వ్రాయుచు అటనట కొన్ని సందర్భములందు ముత్యములవంటి పద్యములను చేర్చిరి. మచ్చునకీ పద్యము చూడుడు.

సీ. పండిత ప్రవరులు పాతాళమున నుండ
మిడిమిడి చదువరి మేడలెక్క
ముక్తుడౌ విజ్ఞాని రిక్తుడై పడియుండ
మెట్టవేదాంతి తామింటి కెగయు
సత్యమేమూలనో చచ్చినట్లొదుగుచో
కల్ల లోకమునెల్ల కలియబెట్టు
ఋజువర్తనులమాట రిత్తయై బొత్తిల
కూలంకషనిధాటి కోటగట్టు

గీ॥ ప్రకృతి తలదాచు కొనచోటు బడయకున్న
వికృతి విజయధ్వజంబు స్థాపింపగలుగు
నేమిలీలలో యివి నీకె యెఱుకగాని
తలప దుస్సాధ్యమూహింప తరముగాదు

వీరి రచనలో సీసపద్యములే మిక్కిలి రసవత్తరముగా సాగినవి. సీసపద్య రచనలో వీరిది అందవేసినచేయి.

వీరికి నంద్యాల, కర్నూలు, నెల్లూరులందు ఘనముగా సన్మానములు జరిగినవి. పెక్కు బిరుదులు లభించినవి. 2—11—60 వ తేది కర్నూలు నగరమున సంస్కృత విద్యాదాన సమాజంవారు

కలెక్టరుగారి సమక్షమున 'కవికులాలంకార' బిరుదముతో సన్మానించిరి. వీరి అముద్రిత రచనలు పెక్కులున్నవి. 1) శ్రీకృష్ణాభ్యుదయము (ఉత్తరభాగము—4200 పద్యములు) 2) గీతభాగవతము (2000 గీతములు) 3) రుక్మిణీకల్యాణము 4)సత్యభామాపరిణయము 5) కట్నపిశాచి 6) శ్రీకృష్ణదేవరాయలు 7) లీలామల్లికార్జునీయము లేక శివలీల మొదలగునవి నాటకములు.

వీరు రావిపాడు గ్రామమున శ్రీలక్ష్మీగణేశ జ్యోతిషాలయమును నడుపుచు, కవిగా, ఆయుర్వేదిక్ డాక్టరుగా ప్రసిద్ధిపొందినారు

—o—



కవిసుధాకర

శ్రీ

యస్. రాజన్నకవి

జననము :— 1–7–1931

తల్లి:— శ్రీమతి సాలాంబ

తండ్రి:— శ్రీ చిన్న జమాలప్ప

జన్మస్థలము :—ప్రొద్దుటూరు
కడప జిల్లా.

మతము, కులము :—
హిందూ – నాదబ్రాహ్మణ.

సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులవారి శిష్యపరంపరలో శ్రీ రాజన్న ప్రముఖుడు. చిన్నతనమున పెద్దతండ్రికడ సంగీతము నభ్యసించి, తదుపరి శ్రీ పుట్టపర్తి వారికడ సాహి

త్యమును, సంగీతము నేర్చిరి. చక్కని కంఠముకల్గి దానికితోడు తెనుగు సాహిత్యము నందభినివేశము పొందుట సువర్ణమునకు పరిమళమబ్బి నట్లయినది. వారికి గల మృదుమధుర కంఠమునకు, ఉపన్యాస చతురతకు తెనుగుదేశము నీరాజనము పట్టినది. ప్రస్తుతము సాహిత్య క్షేత్రమున ఎక్కువగా పాఠాడు రాయలసీమ యువకవి మన రాజన్న. "కాంత పదావళి, కమనీయ శైలి, రాజన్న కవితలోని రమ్యగుణాలు. కవిగా, గాయకుడుగా, రంగస్థల నటుడుగా, రాయలసీమలో పేరుమోసిన అభినవ కవితా నీరాజనం—ఈ కవిరాజ నీరాజనం" అన్నారు శ్రీ సి.నారాయణరెడ్డిగారు రాజన్నగారు రంగస్థలముపై శ్రీకృష్ణ, నక్షత్రక, చంద్రి, గయ, భవాని మొదలగు పాత్రలను ధరించిననటశేఖరులు. ఆకాశవాణిలో తమ మధురగానమును విన్పించు మధుర గాయకులు. హరికథలు చెప్పుటయందుకూడ ప్రవేశము గలవారు. వీరి 'కవిరాజ నీరాజనము'ను గూర్చి శ్రీ దివాకర్ల వేంకటావధానిగారిట్లు నుడివిరి.

"ఈ గ్రంథమున కవిచంద్రులనుగూర్చి రచింపబడిన పద్యములు లలితసుందర పదప్రయోగ శోభితములు. గంభీర భావ గర్భితములునై చదివినకొలది చదువవలెనను నుత్కంఠనావహించుచున్నది"

శ్రీ రాజన్నగారికి భగవదనుగ్రహము వలనను, గురుశుశ్రూషాప్రభావము వలనను, సరస హృదయమైన కవితాధార యలవడినది. వీరింకను రసబంధురములైన కృతులు రచించి యాంధ్రిభాషాయోష కభినవాలంకృతులు సమకూర్తురుగాక!"

కవిరాజ నీరాజనమునందు కాళిదాసు, పోతన్నల కిట్లు రాజన్నగారు నీరాజన పమర్పించిరి.

మ. అతడే ! మంజుల సాహితీ సురభిలోద్యానంబులో శారదా
సతి కంఠమ్మున నవ్యనాటక పరిష్కారంబులన్ దీర్చి—పం
డితులెల్లన్ బులకించిపోవ తన పాండిత్యమ్ము పండించి, న
త్కృతులన్ జేసిన కాళిదాసకవి సత్కీర్తిన్ ప్రశంసించెదన్.

సీ. శారద యామినీ జైవాతృక స్నిగ్ధ
శిశిర చంద్రికలు వర్షించినట్లు,
మధుమాస పరిపూర్ణ మాకంద మంజరీ
హారి గంధము ఘుమ్ముమన్నయట్లు,
తరుణీ జపారుణాధర నవ్యపీయూష
ములను కోకొల్లగాఁజిలికినట్లు
తుంగభద్రా సరిత్తోయ మృదంగ భం
గిమలెల్ల తరచుఁబల్కించినట్లు
పదములా ! భావమా ! పద్యబంధమా ! మ
హాకవీ ; రసరాజ్యమూర్ధాభిషిక్త !
ఏ తెలుంగున నిన్ను వర్ణింతునయ్య!
మాధవాధీన ! పోతనామాత్య ! సుకవి ॥

రాజన్నకవిగారు రామరాజభూషణుని వసుచరిత్రను ప్రత్యేకాభి నివేశముతో అధ్యయనం చేసినారు. రామరాజ భూషణుడందు సంగీత సాహిత్యములను సమముగా మేళవించినాడు. ప్రబంధయుగములో ఈకృషి గావించినవారు మరొకరులేరు. అట్లే వసుచరిత్రలోని ఆసాహిత్య సౌరభమును, సంగీతమాధురిని, అందలి మనోహర శ్లేషవైచిత్రిని మనకుపన్యాసముల ద్వారా అందించిన ఘటికుడు రాయలసీమలో రాజన్న ఒక్కడేయని చెప్ప వచ్చును. వీరు వసుచరిత్ర 'కవితావిపంచి'ని మ్రోయించిన వైణికులు

వీరు 'అవతారమూర్తులు' అను కావ్యమునందు గౌతమ బుద్ధునినిట్లు వర్ణించిరి.

మ. అరిషడ్వర్గమడంచి, యైహిక సుఖ వ్యామోహముంద్రుంచి, నీ
కరుణాదృక్కుల సర్వ భూవలయు శోకమ్మున్ నిభాళించి, యీ
ధర సర్వస్వము రోసిపోయితివి సత్యజ్యోతివై – బౌద్ధమే
పరమార్థంబని చాటి చెప్పితివి దేవా। బౌద్ధ ధర్మాకృతీ॥

ఉ. నిద్దురపోవు ముగ్ధ తరుణీ వదనమ్మున కాంతివల్లి, నీ
ముద్దుల బిడ్డ రాహులుని పున్నమి నవ్వుల పాలవెల్లి, నీ
యద్దమువంటి డెందమున హత్తుకొనన్ గదలంగలేక నీ
వద్దమురేయి యేగతి ప్రయాణము చేసితివోయి గౌతమా!

భారతదేశమునకు చైనాతో యుద్ధము వాటిల్లిన తరుణాన మన యువక కవి రక్తము ఉక్రోషముతో పొంగినది. దేశభక్తి ప్రబోధితుడై భారతీయులను తన శంఖారావముతో నిట్లు మేల్కొలిపినాడు.

గీ. న్యాయహీన చైనారాజకీయ విదులు
సామ సన్మార్గములతోడ చక్కబడరు;
దండనమ్మొక్కటే యిక దగినతెరువు;
వీర చందనమునుదాల్చి వెడలుడనికి.


సీ. నాఁడెన్నడో కాదు నేడిదే కనుడంచు
బాలచంద్రులు నేడు ప్రబల వలయు,
నాడెన్నడోకాదు నేడు కన్గొను డంచు
తాండ్రపాపయ్యలు తరలవలయు,
నాడెన్నడోకాదు నేడిదే కనుడంచు
మహరాష్ట్ర వీరులు మసలవలయు,
నాడెన్నడోకాదు నేడు కన్గొను డంచు

రాణా ప్రతాపులు రగుల వలయుః
నాటి యెందరో వీరులు మేటిమగలు
భారతావని బ్రదికియున్నారు నేడు
నాడు నేడును నేడెయై వాడిపూవ
భరత మాతను నేడు కాపాడవలయు !!

1) కవిరాజసీరాజనము 2) వ్యాససౌరభము 3) ఖండ కావ్య సంపుటి 4) అవతారమూర్తులు 5) త్యాగరాజీయము 6) తిమ్మన కమ్మని రచన. ఇవి రాజన్నగారి ముద్రితకృతులు.

ప్రస్తుతము వీరు రివిన్యూ డిపార్టుమెంటులో రివిన్యూ ఇన్‌స్పెక్టరుగా పనిచేయుచున్నను, సారస్వత సేవమ ధ్యేయముగా నుంచుకొని తీరికవేళలలో పలుతావులకు వెళ్లి సారస్వత సభలలో ఉపన్యసించుచు, తమకుగల కవిత్వ ప్రతిభను, గానకౌశలమును యినుమడింప జేసుకొనుచుండుట ముదావహమైన విషయము. ఈ ఇరువదవ శతాబ్దపు నవయువకులకు సాహిత్యాభిరుచి ఏర్పడుట ఒక వినూత్న విషయము. అందులో ప్రభుత్వోద్యోగము చేయుచున్న వారికిట్టి విశేషాంశములపై శ్రద్ధజూపుటకు ఓర్పుండదు. చేయుచున్న ఉద్యోగమునకు, తన అభిరుచికి పొందికఉండదు. అవి హస్తిమశకాంతరములు. ఇట్టియెడ రాజన్న గారి ఓర్పు, సాహిత్యాభిమానములు అభినందనీయములు.

కడపజిల్లా ప్రొద్దుటూరు అగ్రశ్రేణి కవిపుంగవులకు నిలయము. అదొక సాహితీ కొలువుకూటము. అందు పచ్చని తోరణమై భాసించు చుండుట రాజన్నలోగల విశేషము. వీరి కృషి మూడు పూవులారు కాయలుగా వర్ధిల్లుగాక !



లలితకళానిధి

శ్రీ మైనంపాటి వేంకట సుబ్రహ్మణ్యము

జననము :– **25–8–1926**

తల్లి :– శ్రీమతి అన్నపూర్ణమ్మ

తండ్రి:– శ్రీ వేంకటసుబ్రహ్మణ్యము (సుబ్బయ్య)

జన్మస్థలము :– బుడుగుంటపల్లె. రాజంపేట తా॥ (కడప జిల్లా.)

మతము, కులము:– హిందూ— బ్రాహ్మణ-ఆర్వేల నియోగులు.

మైనంపాటివారి వంశస్థులు సంగీత సాహిత్య నాట్యాభినయము లందభినివేశముకలిగి, వాటిని దైవదత్తము లొనర్చిన మహనీయులు. వీరు జ్యోతిషము, గణితములందును, వ్యవహార దక్షతలోను ప్రసిద్ధులు. రామభక్తి, కృష్ణభక్తి మిక్కుటముగా గల్గినవారు. ప్రకాశం జిల్లా మైనంపాడునందలి శ్రీ వేణుగోపాలస్వామి, మైనంపాటి వంశీకులకు కులదైవము. ఆదేవుడు మైనంపాటి వంశీకులచేత అక్కడ వెలసినాడు. వివాహపూర్వము శ్రీ వేణుగోపాలస్వామి సన్నిధిలో మైనంపాటివారు అభినయము చేయు సంప్రదాయ ముండినట్లుగా ఈక్రింది పద్యమువలన తెలియుచున్నది.

" పెండ్లి పేరంటముల మున్ను విధిగ కాళ్ళ
గజ్జె గట్టి సంకీర్తనన్ గాన భావ
బంధురమ్ముగ వేణుగోపాలు నాట
పాటలన్ గొల్తు మైనముపాటివారు-"

ఈ ఆచారము మైనంపాటి వారెల్లరూ విడువక అవలంబించియున్నచో కూచిపూడి వారివలె నాట్యమునకు గొప్ప కీర్తి ప్రతిష్ఠలు దక్కెడివి. వీరిది సంప్రదాయ సిద్ధమైన నాట్యము.

సాహిత్యాభినివేశము గల్గిన మహనీయులు మైనంపాటి వారి వంశములో పెక్కుమందియున్నారు. వారందరూ సంగీత సాహిత్య సేవయే పరమార్థముగా నెఱిగి, పెక్కు హరికథలను, సంకీర్తనలను, భక్తిగేయములను, శతకములను వ్రాసిరి. వారందరూ వాగ్గేయకారులే. అట్టి పుణ్యవంశమున పుట్టినవారే శ్రీమైనంపాటి వేంకట సుబ్రహ్మణ్యముగారు.

స్వగ్రామమున ప్రాథమిక విద్య చదివి, కోడూరు హయ్యర్ ఎలిమెంటరీ పాఠశాలలో 8వ తరగతిని కవిగారు ముగించిరి. తరువాత గ్రామాధికారుల పరీక్షలు ముగించి 1949 వఱకు ఆ ఉద్యోగములను నిర్వహించిరి. శ్రీ లోకన రాఘవయ్యగారికడ సంస్కృతాంధ్రభాష లభ్యసించి మద్రాసు విశ్వవిద్యాలయము వారి 'విద్వాన్' పట్టమునొంది, పండిత శిక్షణ ముగించిరి. కొన్నాళ్లు చిత్రలేఖనమునందలి Free hand out line &- Model drawing, పెంటింగు హైయరు పరీక్షలందును, డిజైన్ పరీక్షలోను ఉత్తీర్ణతపొంది శిక్షణ ముగించిరి. 1950లో కోడూరు (R. S.) ఉన్నత పాఠశాలలో చిత్రలేఖనోపాధ్యాయుడుగా పని చేసిరి. తరువాత 1958లో ఆంధ్రభాషాధ్యాపకులైరి.

శ్రీ మైనంపాటివారి తొలి ముద్రిత కృతి 'త్రిలింగభారతి' ఈ కావ్యమునందలి ప్రతి పద్యము ఆంధ్రప్రదేశపు చరిత్రాంశమును దెల్పును. దీనిని 'ఆంధ్రుల పురాణము'గా శ్రీ వేదం వేంకట కృష్ణశర్మగారు పేర్కొనిరి. ఆంధ్రుల శిల్పకళనుగూర్చి కవి యిట్లనుచున్నాడు.

అల్లదె కొండకోనల మహాద్భుత శిల్పకళానివేశముల్
కొల్లఁగ నిల్చియున్నవట, కోరికనుంగొను 'మెల్లొరా' గుహ
లెల్లను బౌద్ధచైత్యము లనేకములున్న వఖండ చిత్రముల్
చల్లనితల్లి! పొమ్మటుల జాలముగాదు త్రిలింగభారతీ!

ఊర్విని దేవళంబులె మహోన్నతికెక్కెను శిల్పశాలలై
పూర్వము తెల్గుభూధవుల పోషణలోన విశేషభక్తియే
సర్వము చిత్రశిల్పముల సంపదకెల్లను హేతుభూతమౌ
గర్వము తెల్గుజాతికది కారణమౌను త్రిలింగభారతీ!

'త్రిలింగభారతి' తరువాత వీరి ముద్రిత గేయకృతి 'శ్రీ కృష్ణతాండవము-గోపికాలాస్యము'. కవిగారు భాగవతమును మథించి కృష్ణతత్త్వము నవగతముచేసుకొని ఆనందోత్సాహముతో ఈ గేయకృతిని వ్రాసినారు. ఆధునిక ఆంధ్రభాషలో గేయ కృతులు కొలదిగానున్నవి. అందులో పుట్టపర్తివారి 'శివతాండవము' ఉజ్జ్వలముగా వెలిగినది. కవిగారు శివతాండవ పఠనాభిలాషు లగుటచే వీరి శ్రీకృష్ణతాండవము ఆ పోకడలోనే సాగినది. కాని వారెన్నో క్రొత్తమార్గములు త్రొక్కినారు. కవిగారికి సంగీత సాహిత్య నాట్యాలంకారాది శాస్త్రపాండిత్యము వంశక్రమముగా సంక్రమించుటచేతనే వారీకృతిని వ్రాయగల్గిరి. లేకున్నచో యిట్టి కావ్యరచన యెల్లరు చేయజాలరు. వారికులదైవము శ్రీవేణుగోపా

లుడే, వారి మనోవేదికపై తాండవనృత్యమాడినాడు. కవిగారు కావ్యారంభమున తమ నమస్సుమములనిట్లు పాఠకుల కర్పించినారు.

భాగవతార్థముల్ మధుర భావములందు దరంగ తాండవో
ద్వేగము గూర్చగా మహిత విష్ణుకథాశయలీల జొక్కి శ్రీ
భాగవతోత్తముండు కవి బమ్మెరపోతన కావ్యగానమి
ట్లీగతి సత్కృతిగా వెలసె నియ్యది తాండవకృష్ణరూపమై !
ఆ త్రిపురాంతకోద్ధత మహానటనాకృతిలో 'సరస్వతీ
పుత్ర' విచిత్రరీతుల నపూర్వముగాఁ గృతిదీర్చుటన్న నే
మాత్రమొ పూర్వపుణ్యఫల మాధురిగాక; మఱొండుగల్గునే ?
మిత్రుల! మోలనుంచితి; క్షమించుచు గావ్యరసమ్ముగ్రోలుడీ!

ఈ గేయకృతిలో తొలుత శ్రీ కృష్ణతాండవము, తరువాత గోపికాలాస్యము వర్ణింపబడినది. నాట్యకళలో లాస్యము, తాండవము అను రెండు భేదములున్నవి. తాండవము ఉద్ధృతమైనది. దానిని పురుషులకుద్దేశింపబడినది. లాస్యము సుకుమారమైనది. అది స్త్రీలకుద్దేశింపబడినది. వీటికి అధిదేవతలు శివపార్వతులు. శ్రీకృష్ణుడు బాల్యమున కాళీయుని పడగలపై భరతశాస్త్ర పద్ధతిలో తాండవమాడినాడు. గోపికలు శ్రీ కృష్ణునితో రాసక్రీడ సల్పినారు. ఈ సన్నివేశముల నాలంబనముగా చేసికొని 'శ్రీకృష్ణతాండవము, గోపికాలాస్యము'ను సృష్టించినారు కవిగారు. అందలి తీరును కొంత గమనింతము.

అందము — ఆనందము
బృందావనమున — ఏమందము !
ఏమానందము !
ఆ యమునాజలముల ఆ యహిరాట్ఫణముల
తాండవమట !— కృష్ణుని తాండవమట !

లాస్యమ్మట! – గోపిక లాస్యమ్మట !
కొండెపు సిగముడి – నిండగు పించము
ముత్తెపు సరములు – గుత్తంపుదాయెతు
లంగగు మురుగులు – బంగరు టందెలు
ముక్కున ముత్తెము – చక్కనిపోగులు
మెళ్ళోదండలు – మొల్లోగజ్జెలు
సొగసులుగుల్కగ – నగవులు నల్లెడు
గోపకిశోరుని – రూపము ముద్దుగఁ
దీర్చినదెవ్వరు ? – కూర్చినదెవ్వరు?
శంభుడో ! మఱి – స్వయంభువుడో నట !
ఔనట! – ఔనట! ఔనట ! ఔనట!

కవిగారి రచనలోని విశేషమునకొకదానిని పరిశీలింతము.

అకారమై త్రిగుణ సాకారమైకన. ని
రాకారమైనిలిచి శ్రీకారమై వినని
హుంకారమై కదలి ఛాంకారమై వెలయు
టంకారమై వెడలి ఢంకారమై తెలియ
హంకారమై కలభ ఘీంకారమై యళుల
ఝుంకారమై కేకి క్రేంకారమై సిరుల
ప్రాకారమై కలికి హ్రీకారమై చెలగు
ణాకారమై లలిత క్లీకారమై వెలుగు
అంకారమై రసాలంకారమై పలికి
శంకారమై నిత్యమోంకారమై కులికి
ఆడెనమ్మా ! కృష్ణుడు
పాడెనమ్మా ! విష్ణువు.

ప్రతి పుటలోని విశేషాంశముల కన్నింటికినీ పుట దిగువన
పఘుటిప్పణిలో వివరములగు అర్థములిచ్చుటచే కవిగారు ప్రయో

గించిన పెక్కు శబ్ద, క్రీడ, భరతనాట్య, సంగీత, శృంగార, అభినయ ఆంగిక విషయములు చదువరులకు తెలియుచున్నది. రేకున్నచో పతితలు, నర్తకులు, సంగీతప్రియులుకూడ చాల యాతనల ననుభవించెడివారు. కావ్యరచనకంటె టిప్పణి రచనకే ఎక్కువకాలము కవిగారికి పట్టినదనుటలో సందేహము లేదు. పద్మశ్రీ వేదాంతం సత్యనారాయణశర్మగారన్నట్లు 'కావ్యటిప్పణములు రెండును 'మణినావలయం, వలయేన మణిః' అన్నట్లు పరస్పర భూషణ భూష్య భావము నొందుచున్నవి. అర్థాలంకారములు, శబ్దాలంకారములు సమముగా నుపయోగింపబడినవి. తేట తెనుగు పదములు కొన్నిచోట్ల- సమాసభూయిష్ట సంస్కృత పదములు కొన్నిచోట్ల రసానుకూలముగా భావానుగుణముగా వాడబడినవి.

వెన్న కడవల వెన్న తిన్నగా గాజేయ
చిన్నికృష్ణుడు వంగి చిటికెలో దా, దాయ
'అమ్మ! చిక్కితె' వంచు నడుగులో నడుగిడుచు
నెమ్మదిన్ జని వెన్కనిక్కు గుబ్బలఁగ్రుచ్చి
'అందుకో, యీముద్ద తొందరేలర?' యంచు
నందిచ్చి పాదువుకొని 'విద్దకమ్మిది' యంచు
నాడినది గోపికా!- మధురముగ పాడినది రాధికా!

ఇట్లనేక శృంగారచేష్టలను గోపికలు బాలకృష్ణునియెడ జూపినారట. చదువరి నొక నిమిషమేనియు వదలనివ్వని గేయ కావ్యమిది. సంగీత నాట్యములు, దెలిసిన పాఠకుడి మనసు చిందులువేయకమానదు. పెక్కు నూత్న విశేషాంశముల నతడు గ్రహించును. కవులు చిత్రకారులగుటచే అటనట చక్కని నాట్య భంగిమలను దెల్పు చిత్రములనుగీచి, ముద్రించి కావ్యమునకు మరొక విశిష్టతను చేకూర్చిరి.

కవిగారు ఈ కృతిని 30-8-1975 వసం॥న కార్వేటి నగరమందలి శ్రీ వేణుగోపాలస్వామివారికి అంకితమొసగి ధన్యులైనారు. ఆనాడు జరిగిన మహాసభలో కవిగారు 'లలితకళానిధి' బిరుదముతో సత్కరింప బడిరి. వీరి పెక్కు కృతులు అముద్రితములుగానే నున్నవి. వీరు నాటకములు. నవలలు, శతకములు, ఖండికలు, అనేకములు వ్రాసియున్నారు. 'బాలమిత్ర' పిల్లల కథల మాసపత్రికలో వీరి 'ఆకులు చెప్పిన అరవైనాలుగు కథలు' కొన్ని ఏండ్లనుండి సీరియల్‌గా ప్రచురింపబడుచుండుట ఒక విశేషము.

ఇట్టి కవులెందరో రాయలసీమయందు అజ్ఞాతముగా నున్నారు. వారెన్నో విలువైన గ్రంథములను వ్రాసినారు. ముద్రింప ద్రవ్యసహాయములేక అవి క్రిమికీటకాదులచే నాశనమగుచున్నవి. శ్రీ సుబ్రహ్మణ్యముగారి 'శ్రీకృష్ణతాండవము—గోపికాలాస్యము' కృతి ఇప్పటికైనను వెలుగును జూచుటకు తోడ్పడిన సాహితీపోషకులకు, ఉదారహృదయులకు ధన్యవాదములు తెలుపవలసినదే. కవిగారిపై శ్రీ వేణుగోపాలస్వామి కృపాకటాక్షములు సర్వదా ప్రసరించుగాక!

———o———

సాహిత్య సరస్వతి

శ్రీ రాచర్ల తిప్పయ్యగుప్త

జననము:— 30—5—1908

తల్లి:— శ్రీమతి తిప్పమాంబ; తండ్రి:— శ్రీ దొణ తిమ్మప్ప

జన్మస్థలము: — బెళుగుప్ప — కల్యాణదుర్గం తా॥ అనంతపురం జిల్లా.

మతము, కులము:— హిందూ — వైశ్య.

శ్రీ రాచర్ల తిప్పయ్యగుప్తగారిది పండితవంశము. వీరి తాత రామప్పగారు ఆంధ్ర గీర్వాణభాషలందు ప్రజ్ఞానిధులు. వారు శ్రవణపేయముగ పురాణపఠనము గావించు నేర్పరులు. తండ్రి దొణ తిమ్మప్ప వేదాంతమందు చక్కని అనుభూతి గలవ్యక్తి, అతడు సారస్వతప్రియుడు, దైవ భక్తి పరాయణుడు, సాధు స్వరూపుడు.

శ్రీ గుప్తగారు బళ్లారియందలి శ్రీ యాదాటి నరహరి శాస్త్రిలవారికడ సంస్కృత, వేదాంత విద్యల నభ్యసించిరి. మహా కవులుగ మండల విద్యాశాఖాదికారులుగ అనంతపురంజిల్లాలో ప్రసిద్ధిపొందిన శ్రీ కల్లూరు వేంకటనారాయణరావుగారికడ వీరు లక్ష్యలక్షణగ్రంథముల చెక్కంటి నభ్యసించిరి. వారు తిప్పయ్య గుప్తగారికి సాహిత్య గురువులైరి. వారిని నాటికిని, నేటికిని మఱవక, భక్తిభావములతో నిత్యము స్మరించుచుండుట శ్రీ తిప్పయ్యగుప్తగారి సద్గుణవిశేషము.

ఈ కవిగారు తమ 15 సం॥ వయస్సునందే కవితాకన్యను చేబట్టిరి. బళ్లారి వార్డ్లా హైస్కూల్ నందున్నతవిద్య చదువు తరుణముననే వీరి రచనలు భారతి మాసపత్రికలో అలంకరింపబడినవి. వీరి తొలి రచన 1925 భారతి మాసపత్రికలో వెలువడినది. ఆ యుక్తవయస్సున వీరి కవితారచన సాగినతీరును గమనింతము.

సీ. ఆలా భవిష్యద్వసంతాగమంబు వచించు
పరభృతగాన ప్రవాహమందు ;
అలరు కెందామరలందు జుం జుమ్మని
రొదసేయు యెలదేటి కదుపులందు ;
నరవిరి మొగ్గల విరియించి సౌరభం

బుల గ్రోలు శీతలానిలములందు;
నెలమావి పూపపిందెలమెక్కి మనసార
యలరు చిల్కలముద్దు పలుకులందు;
గీ॥ భవ్య కమనీయ వన, సుసౌభాగ్యమందు
జెలఁగి యుదయించుచున్న లేజిగురులందు
బెక్కు చందంబులఁ దాండవించుచున్న
ప్రణయదేవతకిదె! యభివందనంబు.

తదనంతరము వీరు సాగించిన సాహిత్యకృషి మెచ్చ దగినది. పద్యరచనయందేకాక నాటక, నవల, చరిత్రగ్రంథ రచనలందారితేరిరి. వీరి చరిత్ర గ్రంథములలో 1) విద్యారణ్యచరిత్ర 2) విద్యారణ్యవిజయము ప్రశస్తి నందినవి. శ్రీ విద్యారణ్య పీఠాధిపతులచే నవి ప్రశంసింపబడినవి. ఆ గ్రంథములందలి కొన్ని భాగములు త్రిలిజసమదర్శిని పత్రికలలో ప్రకటింపబడినవి.

21—5—1934వ సంవత్సరమున ఈ రెండు గ్రంథములను పరిశీలించి డాక్టర్ శ్రీ చిలుకూరు నారాయణరావుగారు తమ యభిప్రాయమిట్లు తెలియజేసిరి. "రాచర్ల తిప్పయ్యగారు రచించిన విద్యానగర నిర్మాణము, విద్యారణ్యచరిత్రము నీరెండు గ్రంథములను ఆమూలాగ్రముగ చదివినాను. ఈరెండును గొప్ప పరిశ్రమ జేసి వ్రాసినవి కాని సాధారణ గ్రంథములుకావు.——

....

మృదుమధురములగు పదములతో వ్రాయబడి చదువుటకింపుగనున్నవి. చరిత్ర గ్రంథములలో యీ గ్రంథములు ఉత్తమ స్థానము పొందగలవని ఆశిస్తున్నాను."

ఈ రెండు చారిత్రక గ్రంథములేకాక 1) కంపిల విజృంభణము 2) కాకతీయ జీవనసంధ్య వీరి కలమునుండి వెలువడినవి.

1) అమృత స్రవంతి 2) బదులుకు బదులు వీరు వ్రాసిన నవలలు.

వీరు వ్రాసిన నాటకములు 1) మోహినీరుక్మాంగద 2) ఛత్రపతి శివాజీ. ఛత్రపతి శివాజీయందొక పద్యము జూడుడు.

సీ. ఎవ్వాఁడు హైందవు లెలమి సుఖింపగ
జేసె తదాచార శిష్టరక్ష ?
యెవ్వాఁడు మ్లేచ్ఛులనెదిరి దహించెను
కాననుగ్ర శిఖిశిఖావిధంబు ?
యెవ్వాఁడు పూర్వ రాజేంద్ర పద్ధతి నిల్పె
నాశాంత దివ్య గజాంసపీఠి ?
యెవ్వాఁడు శిరసావహించి దేశికు నాజ్ఞ
వర్తించి జన్మపావనత గాంచె ?
అట్టిమహిమాఢ్యుఁ డున్నతుఁడౌ శివాజి
మహిత మహరాష్ట్ర లక్ష్మినిజ మనుచుచుండె
అలరుగాత శివాజి రాజ్యంబు రామ
రాజ్య విఖ్యాతి నశ్రాంత పూజ్యమగుచు.

మోహినీరుక్మాంగద నాటకమునందు రుక్మాంగదుడు మోహినీ రూపలావణ్యముల నాత్మగతమునందిట్లు భావించుచున్నాడు.


సీ. అలివేణి జిలిబిలి పలుకుల బలుప్రేమ
నాలకించెడు మోహనాంగు డెవడొ ?
కలవాణి సొగసు చెక్కులనంటి ముద్దాడి
సంతసంబును గాంచు నరసు డెవడొ?
రమణితో నానందరాజ్యాభిషేక సం
ప్రాప్తికై బుట్టిన మదను డెవడొ?
జలజాక్షి యదుగులజాడలలో వర్తింప
నవతరించిన సుందరాంగు డెవడొ?

గీ॥ యెవని పుణ్యము బూచునో యీమెవలన
ఆత్మసుఖమెవనిది చరితార్థమగునొ
బ్రహ్మసంకల్పమందు నెవ్వాడుగలడొ
యింత పుణ్యావకాశమే నెటులగాంతు.

తెనుగుసాహిత్యముతో తనకు చెలిమిగావించిన శ్రీమాన్ కల్లూరు వేంకట నారాయణరావు గురుదేవులను నిత్యము వారిట్లు స్మరింతురు.

కల్లూర్వంశపయఃపయోధి విలసద్రాకాసుధాంశుం శుభం
ఆంధ్రక్ష్మాతల పండితాఖిలజన ప్రస్తూయమానోజ్జ్వలం
బోధార్థి ప్రతినామసిద్ధపురుషం జ్యోతిర్విదామగ్రణీం
శ్రీ మద్వేంకటపూర్వకం గురువరం నారాయణం భావయే.

ఈ గురుకృపాకటాక్షమువల్లనే శ్రీ గుప్తగారు 'సాహిత్య సరస్వతి' అని పిలువబడిరి. పెద్దలయెడ భక్తి, గురువులయెడ నమ్రత, సాహిత్యపోషణయెడ ఉదారత, సాహితీప్రియులయెడ ప్రేమ వీరికి వెన్నతోపెట్టిన గుణములు. వీరికి తండ్రిపై భక్తి ఎక్కువ. వారి సంస్మరణార్థము 116 రూ. గ్రంథమాలకిచ్చినారు. తండ్రి కొమారుల చిత్రములు ప్రకటింపబడినవి.



శ్రీ లంకా కృష్ణమూర్తి

జననము :– 9–9–1925

తల్లి :– శ్రీమతి దుర్గా లక్ష్మమ్మ

తండ్రి :– శ్రీలంక వెంకటరామప్ప

జన్మస్థలము:– పెనుకొండ

అనంతపురం జిల్లా.

మతము, కులము:– హిందూ

బ్రాహ్మణ – వెలనాడు.

శ్రీలంకా కృష్ణ మూర్తిగారు రాయలసీమలోని అనంతపురం జిల్లాకు చెందినవారు. వీరు ఉద్యోగరీత్యా 1950 నుండి కర్ణాటక రాష్ట్ర రాజధాని నగరమైన బెంగళూరులో హైకోర్టునందు డిప్యూటి రిజిస్ట్రారుగా పనిచేయుచున్నారు. వీరు సంస్కృతాంధ్ర భాషలలో రచనలు చేయగల దిట్టలు. హిందీ, కన్నడ, ఆంగ్లభాషలెఱిగి అందభిమానము. అభినివేశము కూడ గలవారు.కన్నడదేశపువారికి తెనుగుసాహిత్య సౌరభముల నందించిన ఆంధ్రులలో వీరొక్కరు. బెంగళూరులోని 'తెలుగు సాహితీ సమితి'కి వీరుపాధ్యక్షులు. వీరి తెలుగు ఉపన్యాసములు, కవితలు, బెంగళూరు ఆకాశవాణినుండి ప్రసారము చేయబడినవి. కన్నడప్రాంతమున జరుగు తెనుగు సాహిత్యసభలలో,అవధానక్రియలలో వీరికి ప్రథమస్థానముకలదు.

శ్రీకృష్ణమూర్తిగారు మద్రాసు యూనివర్సిటీ బి. యస్. సి. పరీక్షలో ఉత్తీర్ణులై, తగుపరి మైసూరు యూనివర్సిటీలో

బి. యల్. పట్టమునొందిరి. 1950 నుండి – 59 వరకు వీరు న్యాయవాదులు. తరువాత కర్ణాటక హైకోర్టులో డిప్యూటి రిజిస్ట్రారు పదవిని చేబట్టిరి.

ఈ కవిగారి 'దానయజ్ఞము' 1956లో ముద్రింపబడినది. ఇందులో కరుణాప్రేరితమగు దానమత్యుత్తమ మనియు. దానిని యజ్ఞముగా నాచరించినచో నేటి మానవు డున్నతస్థానమునందుట కవకాశమేర్పడగలదనియు చెప్పిరి. ఇందు భారతమందలి సక్తుప్రస్థ చరిత మితివృత్తముగా గ్రహింపబడినది. ధర్మరాజు గావించిన అశ్వమేధయాగమును కవిగారిట్లు వర్ణించిరి.

సీ॥ యజ్ఞమంత్రములకుఁ బ్రాజ్ఞ భూసురశాస్త్ర
చర్చ,వ్యాఖ్యను సమకూర్చుచుండ;
భూసురాశీర్వాదములకు, రాజన్యుల
జయనినాదంబులు జయముఁనొసఁగ;
హోమధూమములతో నొక్కటైయరుదగు
ధూపముల్ క్రొత్తావి జూపుచుండ;
దగజెప్ప పనసల ధాటికి మంగళ
తూర్యశబ్దంబులు తోడ్పడంగ;
గీ॥ ధర్మజుడొనర్చు నశ్వమేధమ్ము వింత
చెలువముల గల్గి యెల్లర చిత్తములను
వివిధరీతుల జెలగించె, వేడుకలకు
మేర లేదయ్యెః నెల్లెడ శ్రీరహించె.

శ్రీ కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి కృతిని పరిశీలించి తమ యభిప్రాయముల నిట్లు వెల్లడించిరి.

'.................. వీరికి సంస్కృతాంధ్రములయందు చక్కని పాండిత్య కలిమియు, పద్యరచనాకౌశల్యము కలదని గ్రంథము వలన దెలియుచున్నవి. ఇంతటి రచనా శక్తితో వీరు మహాకావ్య రచనయు చేయగలరు. అట్టి కావ్యరచన కిక గడంగుదురని, యాశించుచున్నాడను'

కవిసామ్రాట్ గారు ఆశించిన విధముగనే శ్రీకృష్ణమూర్తి గారు 1958–59 సం॥లలో 'త్యాగ శిల్పము' అను మహాకావ్యమును వ్రాసిరి. అందు లేపాక్షి దేవాలయమును కట్టించిన విరుపణ్ణ కథ వ్రాయబడినది. విరుపణ్ణ కళాయోగమున జీవన్ముక్తుడగుట విపులముగా వర్ణింపబడినది. అతడు యోగసిద్ధుడగుటచే తన కన్నులను తానే త్యాగము చేయగలిగినాడు. కళాయోగమును వర్ణించుచు కవి ప్రేమ చైతన్యపు సమగ్ర స్వరూపము నీక్రింది పద్యమున వర్ణించినాడు.

సీ॥ విష్ణుపదోద్భూత విమల మందాకిని
దేవ లోకాలకు దీప్తినిచ్చి
శివజటాజూట రంజిత సుస్థితినిగాంచి
ఆవేశమున భూమి కట్టెదుమికి
సాగరంబులనింపి జగతి నోముచునుండి
జీవకోటికి నెల్ల జీవనమిడి
సృష్టిస్థితుల మూలపుష్టియై యొప్పిన
ముద్రబంధమునకు బొదిగియుండి

గీ॥ అస్థిరంబగు జగతి లయంబునందు
వేళ శివనాట్య చలితమై వేలమీరి

పొంగి తేజోమరుద్భావములను బొంది
విష్ణు పదమందు గంగయై ప్రేమవెలయు.

ఇట్టి ధ్వని మయములగు శిల్పములీ కావ్యము నందచ్చ టచ్చట గలవు. దేవాలయ నిర్మాణమును వర్ణించుసీ క్రింది పద్యము కవిగారి ప్రౌఢ రచన కొక యుదాహరణము.

చిల్కుచుఁ జీల్చుచుఞ్ జనగఁ జేతికి లొంగెను గండశైలముల్
తొల్చుచుఁ దొల్చుచుఞ్ జన గతుల్గని రూపములఞ్ ధరించుచుఞ్
మల్చుచు, మల్చుచుఞ్ జనగ నవ్యవిలాసము బెంచుచుఞ్ శిలల్
నిల్చుచు నిల్చుచుఞ్ గనియె నిశ్చల నిత్య సురాలయస్థితిఞ్.

ఈ కావ్యము త్వరలో ముద్రింపబడుగాత !

వీరి రెండవ ముద్రితకృతి 'శ్రీవిలాసము' దీనిని రాయల కళాపరిషత్తు-మడకశిర వారు ముద్రించిరి. 'శ్రీ'యన్న పదము నకు సర్వసాధారణముగా ఎల్లరూ ధనమను అర్థమునే గ్రహించి నారు. కాని వేదమున నీపదమున కుద్దేశించిన యర్థము వేరు. ఆ యర్థమును వివరించుటకే ఈ శతకము ప్రవృత్తమైనది. ఇందెట్టి కథా వస్తువునులేదు.

'కవి తాను వివరింపదలచిన ధర్మ రహస్యమును సూటిగా. సులభముగా. అర్థవంతములైన పదములతో, జాతీయములైన నుడికారములతో హృదయంగమములైన లోకోక్తులతో వివరింప గల్గెను. ఇదియే శతకమునకు కావలసినది. ఈ గుణములన్నియూ ఈ శతకమునకు గలవు' అని శ్రీ రూపావతారం నారాయణశర్మ గారు కృతియందు తమ అభిప్రాయమును వెల్లడించినారు. ఈ శతకమునకు కవిగారెట్టి మకుటము నుంచలేదు. దీనిని ధర్మప్రబో ధకముగా నెంచవచ్చును.

'శ్రీ' యొక్క రూపమును, సుగుణములను కవిగారిట్లు తెల్పుచున్నారు.

శాంతి, ముదము, సత్యసంధత, ధైర్యంబు
దమము, తృప్తి, సమత, దైవభక్తి
భూతదయ, విశాలబుద్ధి, ధర్మశ్రద్ధ
మున్నుగాగ సుగుణములును నీవ!

ప్రతిభ, కవిత. వాక్పటుత. కార్యకౌశల
మందు, కళలయందు నభిరుచియును
నైపుణంబు, విద్య, రూపంబు, శక్తియు
నీదు రూపులుగ గణింతు నేను.

ధనము కొరకు బండచాకిరి చేసెడి పేదలను. నిశ్శక్తుల కష్టములను జూడుమని కవిగారు 'శ్రీలక్ష్మి'కిట్లు నివేదించుకొనుచున్నారు.

సీ॥ ఎప్పుడో విధిలేక నప్పుసేసిన నద్ది
పెరుగుచుండగఁ దీర్ప వెసవులేక
ఋణదాత కోరినరీతిఁ బత్రంబుల
వ్రాసియిచ్చుచు వాని దాసు లగుచు
కొనకు వాడాస్తులెల్లను దోచుకొని పోవ
నాలుబిడ్డల సాక వీలుగాక
కలవర మందు కంకాళ రూపులఁజూడు
మమ్మ లక్షలకొద్ది యగపడెదరు
గీ॥ మేని చెమటలూడ్చి భూసికసేవింప
గూలి యివ్వ తిట్టు కొనెడివారి
యడుగు లాశ్రయించి కడుపుకై మానంబు
విడిచి బతుకు వారిఁజూడుతల్లి!

కన్నడ సాహిత్యమునకు వీరొనరించిన కృషి కడు ప్రశంసింప దగినది వీరి కలమునుండి వెలువడిన 'కౌడెయగోపాల' కన్నడ నవల ప్రస్తుతము కన్నడప్రభ దినపత్రికలో ప్రతిదినము ధారా వాహికగా వెలువడుచున్నది. 'త్యాగశిల్పి' కన్నడ నాటకము, 'అత్తెయఎత్తర' కన్నడ ప్రహసనము. వీరి అముద్రిత రచనలు.

శ్రీలంకా కృష్ణమూర్తిగారు నిరాడంబరులు. బిరుదములకు సన్మానములకు ప్రాకులాడు స్వభావము వారికిలేదు. ఇతోధికముగ సాహిత్యసేవ చేయుట వీరి ప్రధానాశయము. తమ 'శ్రీవిలాసము'ను రాయలకళాపరిషత్తునకు సర్వహక్కులతోబాటు, ముద్రణకగు ఖర్చులనుకూడ నొసంగి తమ నిస్వార్థ సారస్వత సేవను ప్రకటించుకొనిరి. కవిగారుత్తరోత్తర తమకుగల సంస్కృతాంధ్ర,కర్ణాటక భాషాపాండిత్యప్రతిభలతో అమూల్యగ్రంథములను రచించి కర్ణాటకాంధ్ర కవిశేఖరులుగా విఖ్యాతి నొందుదురు గాక ★



శ్రీ పప్పూరు రామాచార్యులు

జననము :– 8–11–1896

నిర్యాణము :– 21–3–1972

తల్లి :– శ్రీమతి కొండమ్మ

తండ్రి :– శ్రీ పప్పూరు నరసింహాచార్యులు

జన్మస్థలం :– అనంతపురం.

మతము, కులము :– హిందూ బ్రాహ్మణ – శ్రీవైష్ణవులు.

పుట్టు చున్నవెపుడు పుస్తకంబులు కోట్లు
చదువదగిన వందు చాల కొలది
పుట్టుజనులలోన పూజ్యు లెకొందరో
విశ్వ వినుత నామ వినుము రామ. (రామయ్యపద్యాలు)

పుట్టిన ప్రతిమనిషి పూజ్యుడు కాలేడు. వ్రాసిన ప్రతి పుస్తకము సాహిత్యములో తలమానికము కాజాలదు. 'మలయ జంబు వలన వనము వెలిగిన రీతి' ఒక పుణ్య పురుషునివలన ఆమండలమునకు కీర్తి ప్రతిష్టలు పెరుగును. పూజ్యులైన శ్రీ పప్పూరు రామాచార్యులవారిని అనంతపుర మండలమున ఎఱుగని వారు లేరు. ఒక వైపు రచనావ్యాసంగమును చేబట్టి సామర్థ్యముతో ఒక పత్రికను నిర్వహించుచు ప్రజలలో రాజకీయ చైతన్యమును కల్గించిన ప్రజ్ఞాశాలురు శ్రీ ఆచార్యులవారు.

శ్రీ రామాచార్యుల తండ్రిగారైన శ్రీ నరసింహాచార్యులు కూడ పేరుమోసిన పౌరాణికులు. వీరి పురాణ ప్రసంగములందు హాస్యధోరణి అధికము. ఆఛాయలే కుమారునిలోను పొడచూపినవి. ఆచార్యులవారు తండ్రికడనే సంస్కృతాంధ్రములునేర్చి. అనంతపురము మునిసిపల్ హైస్కూలులోచేరి, స్కూలుఫైనల్ పరీక్షను రాజమహేంద్రవరమున ముగించిరి. తరువాత 1914 లో మద్రాసు పచ్చయప్ప కళాశాలలో ఇంటర్మీడియేట్ చదువు సమయమునందే వీరు రాజకీయరంగములో ప్రవేశించిరి. అప్పటిలో రాయలసీమ ప్రజానీకమును జాగృతమొనర్చిన నాయకులలో పద్మశ్రీ కల్లూరు సుబ్బరావుగారు, గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు ముఖ్యులు. కల్లూరు సుబ్బరావుగారివెంట పల్లెటూర్లకు వెళ్లి ప్రజలలో స్వాతంత్ర్య సముపార్జనా కాంక్షను రేకెత్తించిరి. ఆ సమ

యము నందే ఆచార్యులవారికి సుబ్బరావుగారితో కడు సన్నిహిత మేర్పడినది. గ్రామములలో మద్యనిషేధము, ఖద్దరు వస్త్రధారణ, హరిజనోద్ధరణ, గ్రామపారిశుభ్రత మున్నగు జాతీయ కార్యక్రమములను చేబట్టి, అనంతపురమండలమున బహుళ ప్రచారము గావించిరి. 1921లో గాంధీజిగారిని తాడిపత్రిలో కలుసుకొని, ఉప్పు సత్యాగ్రహములో పాల్గొనిరి. ఆకారణమున వారొక ఏడాదిపాటు బళ్ళారిలో కారాగారవాస మనుభవించిరి.

తరువాత 1923లో శ్రీ ఆత్మారామప్పగారి సహకారముతో ఆచార్యులవారు 'పినాకినీ' పత్రికను ప్రారంభించిరి. మూడేడులా పత్రిక సాగిన తదనంతరము 1926లో ఆచార్యులవారే 'సాధన' యనుపేర మరొక పత్రికను నడిపిరి. ఆ పత్రికనంతపుర మండలమున ఎఱుగని వారులేరు. ఇప్పటికినీ ఆ పత్రికను ఆచార్యులవారి కుమారులు శ్రీ శేషాచార్యులవారే నడుపుచుండుట ముదావహము. శ్రీరామాచార్యులవారి కలమునకు పదును మెండు. పత్రికా సంపాదకత్వములో వీరనేక విషయములను కడు విచక్షణతో విమర్శించిరి. తెనుగుదేశమున వీరొక ప్రముఖ సంపాదకులుగా గుర్తింపబడిరి.

1942లో జరిగిన 'క్విట్ ఇండియా' ఉద్యమమున ఆచార్యులవారు పాల్గొనిన కారణమున, మరొకసారి కారాగారమునకు వెళ్లి వేలూరు, తంజావూరు జైళ్లలో రెండేళ్లు గడిపిరి. అప్పుడు వీరితోబాటు శ్రీయుతులు ఆర్. బి. రామకృష్ణరాజు, కల్లూరు చంద్రమౌళి, కల్లూరు సుబ్బరావు, కే కూ రు సుబ్రహ్మణ్యము మున్నగువారుకూడా ఉండిరి. ఆచార్యులవారు తమకుగల సహజ పౌరాణిక ప్రవచనములతో తోటి డెటిన్యూలకు భారత, కాళిదాస కావ్యములలోని రమ్యభావములను వినిపించుచు, సత్కాలక్షేపము

చేయుచుండిరి. వారి ప్రవచనాపాండిత్యమునకు రాజకీయ ఖైదీలు వెలుగుపడి. జైలునందే వారికి పండిత సత్కారములు నెరవేర్చిరి

జైలునుండి విడుదల జరిగిన పిదపకూడ ఆచార్యులవారు పురాణపఠన కార్యక్రమమును కొనసాగించుచు తమ జీవితమును గడుపుచుండిరి. బళ్లారి ప్రజానీకము వీరి పురాణపఠన కార్యక్రమమునకు జోహారులొనర్చిరి. నాటక కళాప్రపూర్ణ బళ్లారి రాఘవాచార్యులవారు ఆచార్యుల వారినా సందర్భమున బంగారుపతకముతో సత్కరించిరి.

ఆచార్యులవారి రచనాపాటవమునకు 'వదరుబోతు' వ్యాసములు మచ్చుతునకలు. ఆవ్యాసములన్నియు హాస్యవ్యంగ్య ధోరణిలో, నిర్దుష్టమైన భాషలో, ధారాళమైన శైలిలో సంఘ సంప్రదాయములను విమర్శించుచు వ్రాయబడినవి. ఈవ్యాసములు భాషాభివృద్ధికేకాక సాంఘిక దురాచార నిర్మూలనకుకూడ తోడ్పడగలవు. ఈ వ్యాసములు కొన్ని విద్యార్థుల పాఠ్యగ్రంథములలో చేర్చబడినవి.

ఆచార్యులవారు తమ జాతీయోద్యమమున మద్యనిషేధము రూపుమాపదలచి, అటనట గ్రామీణ ప్రజలకు దృశ్యరూపముగా ప్రదర్శించి తెలియజేయుటకు వీలుగా, వ్యావహారిక భాషలోనే 'కల్లుపెంట' నాటకమును రచించిరి.

ఆచార్యులవారికి శ్రీరామునిపై భక్తిమెండు. రామనామము విశ్వవినుతమైనదగుటచే వారు తమ పద్యములను 'విశ్వవినుత నామ వినుము రామ' అను మకుటముతో 40 పద్యములు వ్రాసిరి.

అవి ఇటీవల వెలుగులోనికి వచ్చినవి. ఆ పద్యములలో మచ్చునకివి.

గండ్ల శిలలనైన ఖండింప గలిగిన
ఉక్కునీటి చెమ్మ తుక్కుపట్టు
ఎంత శూరుడైన కాంత చేతికి చిక్కు
విశ్వ వినుత నామ వినుము రామ.

చెట్టు మీద కోట్లు చిగురాకు పువ్వులు
ఒకటి తోడ నొకటి యొరసి కొనవు
నీతిపరుల బ్రతుకు రీతులిట్లుండురా
విశ్వ వినుత నామ వినుము రామ.

ఆచార్యులవారితో సన్నిహితులుగానున్న శ్రీ విద్వాన్ విశ్వంగారు వారినిగూర్చి ఇట్లు వ్రాసిరి.


"———— ఆయన హాస్యంలో కాస్త ఘాటుపాలెక్కువ గనుక కొంత వ్యతిరేకత సంపాదించుకొన్నారు. జిల్లా కాంగ్రెస్ రాజకీయాలలో యువకులుగా మేము (నేను, నీలం సంజీవరెడ్డి, తరిమెల నాగిరెడ్డి వగైరాలు) ప్రవేశించినప్పుడు వ్యతిరేకంగా ఆయన చాలా వ్రాసేవారు. నేను సమాధానాలు అదే 'సాధన' లోనే వ్రాసేవాణ్ణి. ఇద్దరం ఆ ఆఫీసులోని పట్టెమీద కూర్చునే వ్రాసేవారం. ఒకరి చిత్తశుద్ధి నొకరు శంకించి ఎఱుగము. వాదం వాదమే. స్నేహం స్నేహమేగా ఉండగల సంస్కారం వారికున్నది."

ప్రస్తుతం లోకసభ స్పీకర్‌గానైన శ్రీ నీలం సంజీవరెడ్డి గారికి వీరు ప్రవేటు ఉపాధ్యాయులుగా మూడేళ్ల పని చేసిరి. ఇట్టి శిష్యు లాచార్యులవారి కెందరో కలరు. 1955లో ఆచార్యులవారు

ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యులుగా ఎన్నికైరి. అనంతపురం మునిసిపల్ ఛేర్మనుగా పనిచేసిరి. అనంతపురము జిల్లా సహకారకేంద్ర బ్యాంకు అధ్యక్షపదవినలంకరించిరి. సాధన పత్రికతో బాటు 'సహకారపత్రిక' కు సంపాదకత్వము వహించిరి. దక్షిణ భారత హిందీ ప్రచారసభవారి 'స్రవంతి' పత్రిక సంపాదవర్గమున నుండిరి.

వీరికి ముగ్గురు కుమారులు. ఏడుమంది ఆడుబిడ్డలు. పెద్ద కుమారుడు శ్రీ శేషాచార్యులవారు ప్రస్తుతము 'సాధన' పత్రికను పట్టుదలతో నడుపుచున్నారు.

పండినమనసు. వయసుగల ఆచార్యులవారు జీవితమును నిండుగా అనుభవించి వెళ్లిరి. వారు ధన్యజీవులు. ★



శ్రీ కగ్గల్లు సుబ్బరత్నము

జననము :– 8–8–1920

తల్లి:– శ్రీమతి నంజీవమ్మ

తండ్రి :– కరణము శ్రీ గోపాలరావు

మతము – కులము : హిందూ బ్రాహ్మణ–స్మార్త నందవరీకులు శ్రీవత్సనగోత్రము.

వీరు స్వయంకృషితో. భారత భాగవత రామాయణాదులను. భక్తి శ్రద్ధలతో పఠించి, కవిత్వమును నేర్చిరి. సాధు

సన్యాసులన్న ప్రీతి ఎక్కువ. శ్రీ నరహరి సద్గురువుల వారి శిష్యులై. ఆత్మ ప్రబోధమును పొందియున్నారు. స్వాములవారి నిట్లు కొండా

సీ. శ్రీ ప్రబోధానంద — జీవిత లక్ష్యంబు
నద్వైత మర్మంబు — నరయదెలిసి
గుణరూప వర్ణాది గణభేదములు లేని
బ్రహ్మంబు సెలుగంగ — బలికినారు
జ్ఞాన సంపదరూప — సౌందర్య మబ్బిన
గురుసేవ యొక్కటే — గూర్చుముక్తి
పరిపూర్ణ భావంబు — ప్రణవస్వరూపంబు
నిలుచు నెప్పుడనుచు — బలికినారు
ఆ. బ్రహ్మమెఱిగి, మదిని బ్రహ్మర్షి తానౌచు
సత్యధర్మ నిష్ఠసాధనముల
శాంతి వచనములను — సంతాపములదీర్చు
గురువరేణ్యా మిమ్ము — గొలుతు సతము.

సీ. నిష్కామ యోగంబు — నిర్మలాంతఃకర
ణంబు, ముక్తికి — కారణంబు దెలియ
శివకేశవుల గొల్వఁజిత్తంబు వికసించి
భేద భావంబులు — వెడలిపోవు
సంసార బంధంబు — సమయంగ, నేకేశ్వ
రోపాసనంబె, విద్యుక్తమగును
ఆత్మయొక్కటె స్థిర — మస్థిరంబగు దేహ
మనెడు, శంకరుమార్గ —మరయ వలయు
గీ. బ్రహ్మ విద్యను సాధింప — పరముదక్కు
అరయ, నిశ్చల జ్ఞానోదయంబె వలయు

నంచు, నరహరి గురువర్య! యరసిదెల్పి
నావు; కైకొమ్ము; మా వందనములు ఆర్య!

వీరప్పుడప్పుగు వసంత ఋతువును వర్ణించుచు, కొన్ని పద్యములను వ్రాసినారు. చిగురుబోండ్లు వసంతకాలము నందుద్యాన వనములలో తిరుగు సందర్భమున.

సీ. అందమే సొమ్మని – హాయిగా నిదురించె
చెట్ల నీడల నొక్క చిగురుబోడి
పందెమే నాదని – పంతంబు లాడెను
దాయలొడ్డుచు నొక్క – తమ్మికంటి
చందమియ్యదియని – సఖియలతో గూడి
మధురాన్నములదినె – మగువ యొకతె
వందల ఖర్చుతో – వచ్చినదీచీర
నంగతేమనిపల్కె – నకియయొకతె

గీ. గిలుకు మెట్టెలు రవళింప – కులుకులొలుక
పసపు పారాణి పాదాల మిసిమిగూర్ప
చంద్రవదన మొయ్యారంపు – సొరుతోడ
వనవిహార మొనర్చిరి – జనులుపొగడ
సంక్రాంతి నిట్లు వర్ణించిరి.

గీ. రంగుముగ్గులు – ముంగిళ్ల – రాజ్యమేలె
క్రొత్తయల్లుండ్ర రాకలు గూర్చెశోభ
అత్తవారిండ్ల – యానంద మతిశయించె
పచ్చ పచ్చగ సంక్రాంతి – వచ్చునపుడు

క్రమక్రమముగా ఈకవిగారు ఖండికలనేకాక కావ్యములను కూడ వ్రాయుదురుగాక!

★

' నరసకవయిత్రి '

శ్రీమతి గంటి కృష్ణవేణమ్మ

జననము: 20—12—1920

తల్లి:- శ్రీమతి సుబ్బలక్ష్మమ్మ తండ్రి:- శ్రీకజ్జారామశర్మ

జన్మస్థలము: తిరుపతి—చిత్తూరు జిల్లా

మతము, కులము:- హిందూ—బ్రాహ్మణ—ద్రవిడవంశము.

రాయలసీమ మహిళామణులుకూడ, కవిత్వము చెప్పుటలో వెనుదీయలేదు. మొల్ల, తరిగొండ వెంకమాంబ, తాళ్ళపాక తిమ్మక్క వీరందరూ ప్రాచీనులు. పుట్టపర్తి కనకమ్మ, గంటి కృష్ణ వేణమ్మ మొదలైనవారు ఆధునికులు. వీరు తమ కవిత్వమును ఛందోబద్ధముగా వ్రాసినవారే. స్వాతంత్ర్యానంతరము దేశములో పద్యరచన తగ్గి, వచన రచనలధికమైనవి. స్త్రీలు నవలలు వ్రాసి పేరుదెచ్చుకొన్నారు. ఇప్పటి రచయిత (త్రు)లకు పత్రికలధికము. పాఠకులు అధికమే. అప్పటిలో భారతి—గృహలక్ష్మి వంటి కొన్ని ప్రముఖ పత్రికలు విద్యావంతులను మాత్రమే ఆకర్షించుచుం డెడివి. మద్రాసునుండి వెలువడుచున్న డా॥ కె. యన్. కేసరిగారి 'గృహలక్ష్మి' మాసపత్రిక ఆనాటి స్త్రీ రచయితలను ప్రోత్సహిం చినది. ప్రతి ఏడాది గృహలక్ష్మి 'స్వర్ణ కంకణము'ను ఉత్తమ శ్రేణి మహిళల కందించెడిది. ఆ పత్రిక యిచ్చిన ప్రోత్సాహ ముతో కొందరు స్త్రీలు తమ కాలమును రచనావ్యాసంగమునకు వెచ్చించి. పత్రికాముఖమున మంచి పేరు ప్రఖ్యాతులను సంపా దించుకొనిరి. అట్టి మహిళలో రాయలసీమకు చెందిన కవయిత్రి శ్రీమతి గంటి కృష్ణవేణమ్మగారొకరు.

శ్రీ కృష్ణ వేణమ్మ తాతగారందరు దివాన్, పెష్కారు ప్లీడర్లు, ఆస్థానపండితులుగాను పనిచేసిన వారు. వీరి తండ్రి కష్ణా రామశర్మగారు పోలీసుఇన్స్పెక్టర్గా పనిచేసిరి. వీరి తల్లి శ్రీమతి సుబ్బలక్ష్మమ్మ కవయిత్రి. 'చంద్రికళా విలాసము' అను ప్రబంధమును ఈమె రచించినది. ఆగ్రంథము విద్వాన్ పరీక్షకు పాఠ్యగ్రంథముగా నుండెడిది. కృష్ణవేణమ్మగారి భర్త శ్రీగంటి వెంకటసుబ్బయ్యగారు బి. ఏ. వీరుకూడ మంచి పండితులు. కవిత్వము వ్రాయగలిగినవారు. వారు 'కవులుట్ల చెన్నకేశవ' శతకమును వ్రాసిరి. వారు బొంబాయిలో జనరల్ మోటార్సులో ఉన్నతోద్యోగులై యుండిరి. 1940లో వీరు కాలగర్భములో కలసిపోయిరి. అప్పటికి శ్రీమతి కృష్ణవేణమ్మగారికొక కుమారుడుండెను.

ఈ కవయిత్రి బహు విద్యావంతురాలు కాకపోయినను తాతగారైన నాగపూడి కుప్పుస్వామయ్యగారివద్ద తెనుగులో కొంత పరిచయము కలుగజేసుకొన్నది. ఒంటిమిట్టలో శ్రీ వావిలికొలను సుబ్బరావుగారు జరుపుచున్న పరీక్షలలో 3, 4 పరీక్షలను చిన్నతనములోనే ముగించిరి. హిందీ, వార్ధా విద్యాపీఠమువారి 'భాషా కోవిద' పరీక్షవరకు చదివి పట్టముపొందిరి. ఆంగ్లమున కొంత వరకు పరిచయము కలదు. కన్నడభాషలో ప్రవేశమున్నది.

బాల్యదశలోనే ప్రాప్తించిన వైధవ్యముతో జీవితాంతము బాధచెందక, మనోల్లాసమునకు, దైవభక్తి కనుకూలమార్గమైన కావ్యపఠన, కావ్యరచనలను చేబట్టి వివిధఖండికలు వ్రాసి గృహలక్ష్మి మాసపత్రికకు పంపిరి.

1947 జనవరినుండి వీరి 'సైరంధ్రి' పద్యకావ్యము వరుసగా గృహలక్ష్మిలో ముద్రింపబడినది. విధి వక్రించిన పాండవులు ద్రౌపదితోబాటు విరటు కొలువున అజ్ఞాతవాసము గడుపవలసి వచ్చినది. ద్రౌపది సైరంధ్రిగా విరటుని అంతఃపురము జేరినది. ఒక నడిరేయి ఆమె గతమును గూర్చి తనకు తానే చర్చించుకొన్నది. ఆమె కారాజ సౌధమున నిద్దురపట్టలేదు. ఆమె నాళనాళము లుద్రేకముతో జొంగినవి. ఆమె అక్కడ 'బోనులోపలి పులియట్లు ప్రొద్దుపుచ్చు' చున్నది.

మనుజుఁడేకాకి యైన దాను మసలుచున్న
మనసదెప్పుడు దాల్పడు మౌనముద్ర
తనకుదా జెప్పికొను; వినుతానె మఱల
అనృత మాడద్దు మానన మట్టిపట్ల.

కవయిత్రి, మనస్తత్వమును చిత్రీకరించుటలో నేర్పరురాలు. నాడు కురుసభలో ద్రౌపది చెందిన మనోవేదన నిట్లు కవయిత్రి చిత్రీకరించినది.

' నాడటు పాండవాత్మజులు నన్నును, తమ్మును రాజ్యమెల్ల దా
నోడి మహార్తి నున్నతరి నుద్యతులై ధృతరాష్ట్ర నందనుల్
పాడి దొఱంగి వల్వలొలువన్ గని సూతసుతుండు కొల్వులో
నాడిన మాట లకటా! తలపోయ మనంబు వ్రయ్యదే!

కురుపతి, భీష్ముడున్, గృపుడు, కుంభజ ముఖ్యులు గల్గుకొల్వులో
నరసి వచింపరైరకట! యాడుది వేడిన ధర్మసంశయం
బెరుఁగరె? ధర్మ శాస్త్రముల నేటికిగాల్పనె! పెద్దవారలం
దురుగద, యేటి పెద్దలిక నేటికి వారల గౌరవింపగన్?

ఆ ద్రౌపది మనోపరితాపమును రచయిత్రి అతిచక్కగా వర్ణించెను. ద్రౌపది హృదయాంత రాళములో గూడు కట్టుకొన్న మనోవేదనే ధారగా ఆమెకనులలో స్రవించినది. ఆ నాడు నిండు కొలువులో తన్నవమానించిన దుష్టులందరూ సమరాంగణమున తన భర్తలతో చచ్చుట తాను చూడవలెనని పట్టుబట్టినది.

1951 జూలై గృహలక్ష్మి కృష్ణవేణమ్మగారి 'విర్వేదన' యను ఒక ఖండికను ప్రచురించెను. అందలిభావములన్నియు నామె స్వయముగా జీవితమున నెదుర్కొను వేదనా పరంపరలే.ఆ మె వేదన ఇట్లున్నది.

దుఃఖమయమైన లోకమ్ము దొలగి పోవ
మిగుల జింతించి చింతించి, మేరలేని
సంశయాబ్ధిని మున్గుచు జావులేక
బ్రదుకు లేకిట్లు వెఱ్ఱినై పాడుచుంటి

వీరి 'వృథా'— 'గాలిపటము' మున్నగు ఖండికలుగూడ ఆవేదనా భరితములే. వీరి యితర కృతులలో 'గిరిజాకల్యాణము' శృంగార రస ప్రధానమైనది. ఈ యితివృత్తమును మనోహరముగా నవ్య రీతిలో తీర్చిన నవీన కావ్య కుసుమమిది. 'పవనదూత్యము' వీరి మరొక సందేశ కావ్యము. ఇందలికథా వస్తువు రాధాకృష్ణుల ప్రణ యము. రాధ మాధవుని పైగల విరహవేదన నిక సహింపలేక పవనునితో రాయబారము పంపుటకు యత్నించును. ఈ రెండును ప్రాచీన తెనుగు మహా కవుల కావ్యముల కేమాత్రము తీసిపోవు. చక్కటి కవితాధార, భావగంభీరత ఈ కావ్యములందు కాన్పించును శ్రీ రాజరాజేశ్వరీ శతకము—కామాక్షి శతకము కవయిత్రి గారి ముద్రిత రచనలు.

శ్రీమతి కృష్ణ వేణమ్మగారు గృహలక్ష్మి పత్రికాధిపతులతో స్వర్ణకంకణమును, 'సరసకవయిత్రి' యను బిరుదమును పొందిరి. ఇంతటి ఉన్నత స్థాయిని పొందుటకు ఆమె భర్తగారి తోడ్పాటే మూల కారణము. దానికితోడు జ్ఞాన ప్రసూనాంబిక వరప్రసాదము కూడ కవయిత్రికి లభించినది. అందులకే వారిట్లు వ్రాసుకొన్నారు.

> అందముగ రసిక హృదయా
> నందంబుగ గవిత జెప్ప నాకలవియె? బా
> లేందుధరు కూర్మిసతి నా
> యందు నిలిచి బలుకు మన్న, యంత పలికెదన్ (నిర్వేదన)

కవయిత్రి అత్తగారిల్లు కడపజిల్లా ప్రొద్దుటూరు తాలూకా యర్రగుంటపల్లె. మామగారు గొప్పభూస్థితి గలిగిన శ్రోత్రియం దారులు. వీరి కుమారులు శ్రీ గంటి దత్తాత్రేయగారు, ప్రముఖ న్యాయవాదులుగా నున్నారు. ప్రస్తుతము కవయిత్రి ప్రొద్దుటూరు నందు వాసము చేయుచు తీరికవేళలందు కావ్యరచన చేయుచు, తాను నేర్చిన హిందీ భాషను విద్యార్థినులకు బోధించుచు, సమాజ కార్య క్రమములందు పాల్గొనుచు కాలము బుచ్చుచున్నారు. కవయిత్రికి జ్ఞాన ప్రసూనాంబిక సతతమీండగానుండి రక్షించుగాత! *

రాయలసీమ రచయితల చరిత్ర

రెండవ సంపుటి సమాప్తము.

శ్రీ పింగళమూర్తి

ఉగాది కానుక 20-3-1977

రచన:— కవిభూషణ—కవితిలక కల్లూరు అహోబలరావు

సీ. బంగారు రంగుల—రంగారు జివురుల
సింగారముగఁ జెట్టు జేమ లలరె
మంద మందంబుగ—మలయానిలంబులు
కమ్మ కమ్మగ, వీవగా దొడంగె
శుకపిక, శారికల్, సుకముగాఁ బాడుచు
ప్రియముగా, వీనుల—విందొనర్చె
వాసంత మన్మథుల్ — స్వాగత సుమమాల
లర్పింపవేచిరి — యాదరమున

గీ. శ్రీ యుగాది, వేంచేసెను — శ్రీకరముగ
రమ్మ! పింగళమూర్తి! రారమ్మ వేగ
పిండి వంటల భుజియించి — ప్రీతితోడ
మంగళమ్ముల మాకు నొసంగుదేవ! ౧

కం. గళమున, గరళముగల, పిం
గళమూర్తి! శంకరాఘనా శంకర! బె
బ్బులి చర్మాంబరధారీ!
మలకొమరిత నేలినట్టి — మంగళమూర్తీ! ౨

గీ. తీవ్ర ఝంఝానిలంబును — దెచ్చిపెట్టి
భారతము, నల్ల కల్లోల — పఱచినావు
శ్రీ ప్రజాస్వామ్య వాదంబు — శ్రేయమంచు
బలికినావు — పింగళమూరి వర్య! నేడు 3

ఆ. అలహాబాదుకోర్టు — యానతి దప్పి, సు
ప్రీముకోర్టుకేగి — రీతిదప్పి
దప్పిగొంచు. తప్పిదంబుల నొనరించె
అమ్మ! ఇందిరమ్మ — అనువు దప్పె ౪

ఆ. కాలదోషమొకటి — కర్మదోషమురెండు
గ్రహము పాటు మూడు — గల్గెగాక!
నిన్ను గెల్చువారు — నిఖిలలోకంబుల
రారు; లేరు — ఇందిరమ్మ నిజము. ౫

గీ. జనతపార్టి — యేతెంచెను — సంతసంబు;
శ్రీమొరార్జి, దేశాయి, విశిష్టగుణుని
ధీరవరుని. ప్రధాన మంత్రిగ వరించె
లోకసభ, హర్షమొందిరి లోకజనులు. ౬

గీ. జాతి, మత, కులభేద ఈర్ష్యలు నశించి
దేశమందు హింసాకాంత నాశనంబు.
గాంచి, సోదరత్వము మేళవించి, మంచి
బెంచి, సాధుల రక్షించి. మించుసౌఖ్య
ములను సాధించి. జనతప్రభుత్వమెల్ల
వారి రక్షించి, పింగళ వత్సరమున
యశము జెందెడిగావుత! యహరహంబు. ౭

గీ. బహుగుణుండు జగ్జీవన ప్రతిభవరుడు
అతిరథులు, మహారథులు నీయండనున్న
వారు; మూరార్జి దేశాయి! మీరుప్రజల
కిచ్చినట్టి వాగ్దానముల్, హెచ్చరికతో
పాలనమొనర్చి కాంగ్రెసువారికంటె

మిన్నయనిపించు కొనుటయే మేలు: పింగ
ళుండు మీబుద్ధి కనిపెట్టి యుండుగాన
'జనత ప్రభుత' శోభిల్లుచు – దనరవలయు ౮

గీ. రాజు రవిగాన, ప్రభులలో – ప్రబలు వైర
ములు; బుధుడు మంత్రి – మతి సైన్యములను నడపు
గాన, పింగళమూర్తియు – గన్నువిప్ప
చిచ్చుబడి, శత్రుమూక – నశింపకున్న? ౯

చం. నవ, నవధాన్యముల్ వెలసి–నాణెముగా జలదంబు లెల్లెడన్
నవిరళభంగిగాఁగురిసి, యప్పుల కూపతటాక జాలముల్
జవు లలరంగ నిండి. పశుజాలము, భూప్రజ సంతసింప, గౌ
రవమున పింగళాక్షు డవురాయన కీర్తినిఁబొందగావలెన్ ౧౦

కం. పింగళమూర్తీ! భువిలో
మంగళముల్ గల్గజేసి – మానితముగ, రా.
జ్యాంగము తిద్దిదీర్చుము
వెంగలివిత్తుగ జరింప – వృథయగు బ్రతుకున్ ౧౧

కం. జిలిబిలి పలుకుల గులుకుచు
తెలుగు కవిత – మంజులముగ – తేట దనమునన్
విలసిల్ల వలయు; శ్రీపిం
గళనామక వత్సరమున గల్గు శుభంబుల్. ౧౨

ఓం–శ్శాంతి–శ్శాంతిః

19-11-75 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 'కొత్తపుస్తకాలు' శీర్షికలో ప్రచురింపబడిన పత్రికాభిప్రాయము.

రాయలసీమ రచయితల చరిత్ర-ప్రథమ భాగము

గ్రంథకర్త: కవిభూషణ, కవితిలక కల్లూరు అహోబలరావు, ప్రచురణ: శ్రీ కృష్ణదేవరాయ గ్రంథమాల, హిందూపురము క్రౌను 28+144 పుటలు వెల: రు. 8–00

ఎన్నో శతాబ్దాలనుంచీ రాయలసీమ మహాకవులకూ, మహా పండితులకూ పేరుపడింది. రాయలవారి ఆస్థానంలోని అష్టదిగ్గజాలను గురించి ఎరగని ఆంధ్రులుండరు. ఆ సంప్రదాయం అనుస్యూతంగా వస్తూనే ఉన్నది. వారిలో కొందరి చరిత్రలే చరిత్రల కెక్కినవి. ఈ గ్రంథకర్త 20వ శతాబ్దపు రాయలసీమ కవి రత్నముల చరిత్రలను వారి కవితలతో, చిత్రపటములతో ఏర్చికూర్చి గ్రంథరాజాన్ని తెలుగు తల్లికి సమర్పింప నిశ్చయించారు. అందలి మొదటి భాగం ఇది. ఇందులో ఇరవై మంది విద్వత్కవుల చరిత్ర లున్నవి.

ఈ శతాబ్దిలోని రచయితలను గురించిన చరిత్రలు ఇదివరకే ఎన్నో ఉన్నవి, రచయితల చిత్రాలతో, వారి కవితా విశేషాలను ఉదహరిస్తూ వ్రాసిన చరిత్రలలో ఇది మొదటిగా కానవస్తున్నది. ఆయా రచయితల కుటుంబ చరిత్రకు కూడా ప్రాధాన్య మివ్వటం ఇందలి మరొక విశేషం.

సుప్రసిద్ధ నాటక కర్తలు శ్రీధర్మవరం వారు, కోలాచలం వారు, వాల్మీకి రామాయణాంధ్రీకర్తలు శ్రీవావిలికొలను వారు,

జనమంచివారు, 'శివభారత' కర్త శ్రీగడియారం వారు, 'ప్రతాప సింహ' చరిత్రకారులు శ్రీ దుర్భాకవారు, విద్వత్కవి వతంసులు శ్రీ గాడేపల్లి వారు, మద్దులపల్లి వారు 'ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహ ' కర్తలు శ్రీ కల్లూరి వారు ఇందలి రచయితలలో ముఖ్యులు. వీరిని గురించి చాలా మందికి తెలుసు. ఇతర రచయి తలను గూర్చి కొందరికి మాత్రమే తెలుసు. అట్టి వారి చరిత్రలను ఇందులో ఇచ్చి శ్రీ కల్లూరు అహోబలరావు వాఙ్మయాని కెంతో ఉపకారం చేశారని చెప్పవచ్చు. ఆయా రచయితలను గూర్చి విషయాన్ని సేకరించుటలో గ్రంథకర్త పరిశ్రమ ప్రశంసనీయం.

శ్రీ రాళ్ళపల్లి వారు, విద్వాన్ విశ్వం, పుట్టపర్తివారు, బెళ్ళూరి వారు, సుబ్బన్న శతావధానిగారు, తిరుమల రామచంద్ర మున్నగు సుప్రసిద్ధులను గురించి తర్వాతి భాగాలలో ఉండుననుకుంటాను.

మధురకవి బెళ్ళూరి శ్రీనివాసమూర్తిగారి 'మెప్పు' ఈ గ్రంథానికి శోభను కలిగిస్తున్నది. ఇందులో శ్రీ కృష్ణదేవరాయ గ్రంథమాల సంగ్రహ చరిత్ర. గ్రంథకర్తగారి గ్రంథాంతరం 'ఉగాది స్వర్ణభారతి' కృతి స్వీకరణ వృత్తాంతం, కల్లూరి వెంకట నారాయణరావు గారి 'మున్నుడి' కూడా ఉన్నవి.

ఈ శతాబ్దంలోని రాయలసీమ రచయితలను గురించి తెలుసు కొనగోరేవారు దీనిని చదవడం మిక్కిలి అవసరం.

—ఆయాన్య

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక సౌజన్యముతో)

———o———

కృష్ణదేవరాయ గ్రంథమాల పుష్పము-30
హిందూపురం.

శ్రీ

రాయలసీమ రచయితల చరిత్ర-4

సంపుటితో చేరి, 20 వ శతాబ్దపు రాయలసీమ కవి
త్తముల చరిత్రలు ఏర్చి, కూర్చి, తీర్చబడి నూట
నలువది ఒక్క రత్నహారముగా తెలుగుతల్లి
కంఠసీమ నలంకరింపబడినది.

గ్రంథకర్త :

కవిభూషణ, కవితిలక
కల్లూరు అహోబలరావు

సంపాదకీయము

రాయలసీమ రచయితల చరిత్ర-1 వ భాగమును 1975 జూలై నెలలో గ్రంథమాల 22 వ పుష్పముగా ప్రకటించినాము. ఇందులో 20 మంది కవుల చరిత్రలు కలవు. రెండవ భాగమును 1977 జూలై నెలలో గ్రంథమాల 23వ పుష్పముగా ప్రకటించితిమి. ఇందులో 31 మంది కవిజీవితములు చేర్చబడినవి. 3వ భాగమును 1981 ఆగస్టులో గ్రంథమాల 28వ పుష్పముగా ప్రకటించితిమి. ఇందులో 50 మంది కవుల జీవితచరిత్రలు కలవు. ప్రకృతము 1986 జూలై నెలలో వెలువడిన 4 వ భాగములో 40 మంది రచయితల, రచయిత్రుల జీవితచరిత్రలు కలవు. మొత్తము 141 మంది జీవితచరిత్రలను ప్రకటింప గల్గితిమి.

రాయలసీమలో అజ్ఞాతముగా మరియెందరో కవులు, కవయిత్రులున్నారు. వారి నందరిని చేర్చికూర్చిన మరికొన్ని సంపుటములు కాగలవు. కాని నా వయస్సు 85. నిత్రాణ ఎక్కువ ఓపిక తక్కువ. గ్రంథమాల పనులన్నీ నా పుత్రునికి చి॥ కల్లూరు రాఘవేంద్రరావునకు ఒప్పజెప్పినాను. అతడే మున్ముందు ఈశ్వరుని కృపవల్ల - ఈపని కొనసాగింప గలడు. ఈ భాగమునందలి కవుల జీవితములను వ్యావహారిక భాషలోనే వ్రాయుట జరిగినది. ఈ పద్ధతిని వ్రాయుటలో నా కుమారుడు నేర్పు గడించినాడు. ఈ కాలమునకీ భాషయే కావలయును గదా!

వాడుకభాషయే గ్రాంథిక భాషయైనది. కాలానుసారము మనము వద్దన్నను వాడుకభాషయే గ్రంథస్థమై తీరును. నేడు కొత్తగా వచ్చిన 6 - 7 తరగతుల తెలుగు పాఠ్యపుస్తకాలు (ప్రభుత్వ ప్రచురణలు) సహితము ఇప్లే పూర్తిగా వ్యావహారిక భాషలో ముద్రింపబడినవి. భాష మరింత నీచస్థితికి దిగజారక వ్యావహారిక భాషయైనా, సాధువుగా, ఇంపుగా, సరసన సౌష్ఠవమై దినపత్రికల సంపాదకీయముల వలె శోభిల్లవలెనని నా అభిప్రాయము.

కీ॥ శే॥ కందుకూరి వీరేశలింగం పంతులుగారు తమ ఆంధ్ర కవుల చరిత్రలో గ్రాంథిక వచన శైలికి ఒక సామాన్య పద్ధతి నేర్పరిచి, గద్య తిక్కన అయినారు. చిలకమర్తి వారు చిన్నయ సూరియొక్క శైలితో "కర్పూర మంజరి" - "సౌందర్య తిలక" (పౌరాణిక నవల) "రామచంద్ర విజయము" (సాంఘిక నవల) "గణపతి" (హాస్య నవల) "గయోపాఖ్యానము" (నాటకము) వ్రాసిరి. గయోపాఖ్యానము లక్షప్రతులు అమ్ముడైనవి. ఇతని శైలి రసవత్తరమైనది. ఆ శైలి అతనితోనే అంతరించినది. శ్రీ తేకుమళ్ళ కామేశ్వరరావుగారు తమ గ్రంథములను వాడుక భాషలో వ్రాసిరి. దానికి కొన్ని నియమముల నేర్పరచిరి. వాడుక భాషకొక నిఘంటువు అవసరమని చెప్పిరి. గ్రామ్య భాషా రచనలకును, గ్రాంథిక భాషా రచనలకును మధ్యే మార్గము

చూపించిరి. ఇట్టి శిష్ట వ్యావహారికభాష గ్రంథస్థము కావలయును గాని ఒక వారపత్రికలో "బుతేనా" అను శీర్షిక భాష మన కక్కఱలేదని నా విన్నపము.

ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీవారు అచ్చ తెలుగు నిఘంటు త్రయము 1. ఆంధ్రనామ సంగ్రహము, 2. ఆంధ్రనామ శేషము 3. సాంబ నిఘంటువు వీటి పద్యాల నేమాత్రము మార్చకుండా పర్యాయపదాల భావములను సూచించు రంగు రంగుల బొమ్మలతో ముద్రించడానికి కృషి చేయుచున్నారనియు, ప్రభుత్వము 6 లక్షల రూపాయలు మంజూరు చేసియున్నారనియు, పత్రికా ముఖమున తెలియవచ్చుట చాల సంతోషము. 6, 7 తరగతుల వారికి వీటిని బోధింప సంకల్పించుట కూడా ముదావహము. అవశ్యముగా ఈ కార్యక్రమ మాచరణలో పెట్టవలసినదే.

పాఠశాలలలో విద్యార్థుల ద్వారా లైబ్రరీలకు వసూలు చేయబడు మొత్తములు పూర్తిగా తగ్గిపోయినవి. దానితో పాఠశాలల గ్రంథాలయాలకు పుస్తకములు కొనుటకు వీలుండదని ప్రధానోపాధ్యాయులు పనవి చేయుట పరిపాటి. ఇంకేవిధంగా ఈ పుస్తకాలు అమ్ముడగునో ఆ దైవమునకే ఎఱుక? ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వము మండలమున కొక్క గ్రంథాలయమును, నెలకొల్పబోవుచున్నట్లు పత్రికలద్వారా, ప్రకటనలు విరివిగా విడుదలయగుచున్నవి. అవెంతవరకు పుస్తక ప్రచురణ కర్తలకు

సహాయకారిగా వుండగలదో వేచి చూతముగాక! ఏమైననూ ప్రభుత్వము గ్రంథాలయములపై ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొనుట లేదనియే చెప్పవచ్చును.

ప్రస్తుతము పుస్తకముల ముద్రణ జరుపవచ్చును కాని, వాటిని అమ్ముట బహు కష్టమైన విషయము. జిల్లా గ్రంథాలయములుగాని, రాష్ట్రస్థాయిలో ప్రభుత్వముగాని పుస్తకములను ఈ మధ్య కొనుటలేదు. పాఠశాలల, కళాశాలల లైబ్రరీల మాట చెప్ప పనిలేదు.

ఇక, ఇప్పుడు విడుదలగుచున్న నవలల విషయము వేరుగా చెప్ప పనిలేదు. ఇవి ఎంతకాలము నిలువగలవో కూడ చెప్పలేము. వీటి ధరలు ఎంత అధికంగావున్ననూ వాటిని వేలం వెఱ్ఱిగాకొని చదవడము జరుగుచున్నది. పత్రికల విషయము కూడ అంతే. న్యూస్‌ప్రింట్ ధర–ముద్రణ–బ్లాకుల ధరలు ఒక వైపు విపరీతముగా పెరుగుచున్ననూ, అందులోని విషయముల విలువ మాత్రం ప్రోత్సాహకరముగా లేదు. పది కాలాలపాటు నిలిచి పదిలపఱచుకొను విషయము అందు శూన్యము. తుదకు పొట్లములు కట్టుట కా పత్రిక ఉపయోగపడుచుండుట, మన మెరిగిన విషయమే. పూర్వపు మాసపత్రిక లానాటివారు సంపుటములుగా "బైండు" చేయించుకొని, భద్రపఱచి వుంచిరి. అందుకు కారణ మందలి అనర్ఘరత్నములవంటి విషయములే.

కాగితము లభించని మన పూర్వీకు లమూల్యములగు గ్రంథము లను తాటియాకులపై వ్రాసిపెట్టి మన కందించిరి. విరివిగా కాగితము లభించుచున్న ఈనాడు, మన నాగరికులు పనికిరాని చెత్త నంతటిని ముద్రించి, కాగితముల కొఱతను తెచ్చిపెట్టి నారు. ఇది మనము సంపాదించుకొన్న ఖ్యాతి. కాన ప్రభుత్వం కూడ వేలంవెర్రిగా అన్నిరకములైన పత్రికలకు న్యూస్‌ప్రింట్‌ను కేటాయించుట మంచి పద్ధతి కాదేమో!

సాహితీ సంస్థలు, కవి పండితులు, ఎందరో మంచి పుస్త ములను రచించి ముద్రించుచున్నారు. అట్టి వారి కృతులకు కాగితము లభించుటే దుర్లభముగా ఉన్నది. ప్రభుత్వము కూడ అట్టి వారి రచనల ముద్రణకు తక్కువ ధరలో కాగితము నందిం చుటలేదు. పోనీ, ముద్రించిన పుస్తకములను గ్రంథాలయము లైనా కొని, ప్రోత్సహించుచున్నవా? అదియునూ లేదు. ఇట్టి తరుణములో పాఠకులే ఈ విషయములను దృష్టి యందుంచు కొని తాము ఖర్చుపెట్టిన మొత్తమునకు పదింతలు విలువగలిగిన అమూల్య విషయములు లభించినవా, లేదా? అని వారే ఆలో చించుకొన్నప్పుడు మంచి పుస్తకములు వెలువడు ననుటలో సందేహము లేదు.

తెలుగు సాహిత్యములో అపురూప గ్రంథములు, శతక ములు, వ్యాస సంపుటములు, ప్రబంధములు, కావ్యములు,

నాటకములు, యక్షగానములు, హాస్యరచనలు, కథలు నవలలు నాటికలు, కవితా సంపుటములు మన కింకనూ లభించుట లేవు. వాటి విలువ ఈతరము వారికి తెలియనే తెలియదు. వాటి నెవరు చదువుదురను నిర్లక్ష్యమువల్ల ఆ అనర్ఘరత్నములు, మట్టిపాలగుచున్నవి. వాటిని వెలికిదీసి సానబెట్టి అందించి నప్పుడు అవి వజ్రములవలె ప్రకాశింపగలవు. వాటిని ఆధు నికులు కూడా కొని చదువుదురను నమ్మిక కలదు. ఆ ప్రయ త్నము చేయుటకే గ్రంథమాల పూనుకొన్నది. ఈ ప్రయత్న మునకు "లహరి" అను సంపుటీ కార్యక్రమ మేర్పాటు చేయనున్నది.

"లహరి" మూడునెలల కొకసారి వెలువడు త్రైమాసపత్రికను పోలిన ఒక గ్రంథ సంపుటి. ఇందు, తెలుగు సాహిత్యములో అనర్ఘరత్నము లనబడు పై పేర్కొన్న సాహిత్య ప్రక్రియల నుండి మీచే ఎన్నిక చేయబడిన విషయముల కొన్నింటిని వరుసగా "లహరి"లో ముద్రించబడును. వాటిని పాఠకులు మరలా "లహరి" సంపుటినుండి విడగొట్టి విడివిడి పుస్తకములుగా బైండు చేయించుకొని భద్రముగా ఉంచుకొనవచ్చును. ఇవి ముందు తరముల వారికి కూడ ఉపయోగపడి, డబ్బు పెట్టి కొన్నందుకు మంచి గ్రంథ సంచయమును ప్రోగుచేసుకొన్నట్లుగా సంతోషము కల్గును. కాన పాఠకులారా! మా సదుద్దేశ్యములను

అర్థము చేసుకొని ఈ విషయముగా మీరు మాకు చక్కని సలహాల నందివ్వగలరని ఆశించుచున్నాము. మీరెట్టి అపురూప గ్రంథములను కోరుచున్నారో, వాటిని మాకు సవివరముగా తెలియజేయ ప్రార్థన. వాటి నన్నింటిని దృష్టి యుంచుకొని ఈ "లహరి" పథకమును ప్రారంభింతుముగాక!


ఈ కార్యక్రమమునకు మీ యందరి సహాయ, సహకారములు, సలహాలు సర్వదా కోరుచున్నాము. కాన, వెనువెంటనే మీ సలహాలు - అపురూప గ్రంథముల పేర్లు తెలియజేయుడు. ఈ కార్యక్రమమును దిగ్విజయము గావించుడు.

వందనములతో

హిందూపురం
25-7-1986

కవిభూషణ, కవితిలక,
కల్లూరు అహోబలరావు.

విషయసూచిక



శ్రీ పాణ్యాం లక్ష్మీనరసింహయ్య

జననము: 6-4-1920

నిర్యాణము: 1978-79 మధ్య

తల్లి: శ్రీమతి సుబ్బలక్ష్మమ్మ

తండ్రి: శ్రీ పాణ్యాం లక్ష్మీనరసయ్య

జన్మస్థలం: కర్నూలు జిల్లా - కోయిలకుంట్ల తా॥ - ఉయ్యాలవాడ

హరిభక్తులు, వేదాంత వేత్తలు, ధర్మజ్ఞులు, ప్రజ్ఞాన్వితులైన వంశీకుల యింటబుట్టిన పాణ్యాం లక్ష్మీనరసింహయ్య గారి హృదయమున చిఱుత ప్రాయముననే ధర్మమీమాంసయు, ధర్మతత్పరతయు మొలకలెత్తుచు, ప్రతిచిన్న విషయము "ఇది శాస్త్రీయమగునా? కాదా?"యని వివేచించుటయు, విజ్ఞులగు పెద్దలనడిగి తెలుసుకొని ధర్మమని తెలిసిన దానిని యథాశక్తి నాచరించుటకు నలవాటుపడిరి. వయస్సు పెరిగినకొలది వారిలో ఆ తత్త్వము తనంతటతానే అభివృద్ధి చెందుతూ వచ్చినది.

ఈ ధర్మమీమాంసయందు కొట్టుమిట్టాడుచున్న నరసింహయ్యకవిగారికి నేటి సాంఘిక రాజకీయ ధర్మ విప్లవగతులు తలపునకు వచ్చినప్పుడెల్లనూ భయవిషాద పరితాపములలుముకొని నిదుర బట్టదయ్యెను. తుదకొక సుప్రభాత సమయమున ధ్యాన నిమగ్నుడైన నీ కవివరునకు యాతని హృదయాంతరాళ

మున విద్యుల్లేఖవలె ఒక క్రొత్త భావము స్ఫురించినది. దానిని వారు తన మనశ్శాంతికై, భగవంతుడు ప్రసాదించిన ప్రేరణగా భావించిరి. ఆ భావ మేమనగా "ఏ యుగమునం దేకాలమున, ఏ స్థలమునందు, ఏ నామరూపములుగల భూతములెట్లెట్లు వ్యవహరించునో, ఆ యుగములెప్పుడు వచ్చినను ఆ కాలమున, ఆ స్థలము నందు ఆయా నామరూపములుగల భూతములు అట్లట్లే వ్యవహరించుచుండును." ఈ భావన కవిగారికి మనశ్శాంతిని కలిగించినది. ఈ విషయముగూర్చి, గ్రంథాన్వేషణ గావించగా వారికెన్నో ఆధారములు లభించినవి. ఆ భావములను తొలుత వ్యాసములుగా వ్రాసి పత్రికలలో ప్రకటించిరి. ఈ ధర్మములు క్షణికములు కావనితలచి, అందలి కొన్ని ధర్మములను, పొందుపఱచి "ధర్మజ్యోతి" యను గ్రంథముగా వెలువరించిరి.

శ్రీ లక్ష్మీనరసింహయ్య గారు తండ్రిగారి వద్దను, పినతండ్రిగారైన శ్రీ వాసుదేవశాస్త్రిగారి వద్దను, వెలుదుర్తిలోని అన్నదానం సుబ్బాశాస్త్రిగారి వద్దను, శ్రీ గౌరిపెద్ది శేషశాస్త్రుల వద్దను సంస్కృతాంధ్రములు నేర్చిరి.

ఈ కవిగారికి శైశవమందే కవిత్వమబ్బినది. ఉత్పలమాలావృత్తములలో " ఈశ్వరశతకము " నప్పుడే వ్రాసిరి. తదుపరి సీసపద్యములలో ఉయ్యాలవాడలోని శ్రీ కోదండరామస్వామిని, స్తుతిస్తూ " శ్రీ కోదండరామశతకము "ను రచించిరి.

ఇందలి ప్రతి పద్యమునందును ఉత్తమ ఆదర్శము, కవిగారి అనుతాపము, హృదయావేదన, ప్రతిబింబించును. నేటి నవ నాగరికతయొక్క విచిత్ర పరిణామములను, వాని అనర్థములను లోకమునకు వెల్లడి చేయవలయునను పట్టుదల, యిందు ప్రధానముగా గానవచ్చును. అందలి మచ్చునకొక పద్యము చూతము.

సీ॥ సీమంతి నీత్వలక్ష్మిని దెల్పు, చక్కని
పాపటల్ - వక్రత బడయ జొచ్చె,
దాంపత్య ధర్మతత్త్వము దెల్పు మంగళ
సూత్రబంధము, నైచ్యపాత్రమయ్యె,
దీర్ఘమాంగల్యంబు - దెల్పు కుంకుమబొట్టు
లావగింజలకన్న - నణువులయ్యె,
సతత పతివ్రతా - చరణదీక్షా చిహ్న
కంకణ ధారణల్ - కలుషమయ్యె,

తే॥గీ॥ నకట! పాశ్చాత్య నవనాగరకత వచ్చి
హైందవస్త్రీల భావమ్ము - లందునిల్చి
పావనాచార, సాధు సంపత్తి నణచె;
ధరణి, నుయ్యలవాడ! కోదండరామ!

వీరి రచనలన్నియు, తత్త్వవిచార వాసనా శోభితములై యుండుట విశేషము. వీరి "శ్రీ విశ్వేశ్వరనక్షత్రమాల" కృతి

ఆ కృతిలో చిన్నదైననూ రసజ్ఞులగు,చదువరుల హృదయమును ద్రవింపజేసి, కన్నుల జెమ్మగిల్లజేయును. కవిగారు తమ జీవితానుభవమును రంగరించి, మొత్తము మానవ జీవితానుభవ పాఠమును, మన కన్నుల ముందుంచి ధన్యులైరి.

భార్యాపుత్ర కుటుంబ మోహమున నే-బంధంబునన్ జిక్కి, స
త్కార్యాకార్యవివేక వర్జితుడనై -గావించితిన్, బాపముల్
సౌర్యుద్దండ ప్రచండ దండనలకున్, స్వాంతంబు భీతిల్లె; నో
యార్యావల్లభ! యెట్లు బ్రోచెదవో? నిన్నర్థింతు, విశ్వేశ్వరా!

మానసికముగా ఎదిగిన వారికి, వృద్ధాప్యమునందు పశ్చాత్తాపము తప్పదు. వార్ధక్యము, ఇహపర జీవిత సాగరముల నడుమగల వారధి. జన్మ సంస్కార ఫలమువల్ల, కవిగారు తమ జీవితానుభవసారము నెల్లరకు పంచి మార్గదర్శకులైరి.

"శ్రీ రామతత్త్వ రహస్యము" వీరి మరియొక కృతి. "ఈ కృతి నొకమారు పఠించి మననము చేసికొనినచో, సులభమగు పరతత్త్వ వివేచనము కలిగి, పరబ్రహ్మాను సంధాత యగుటకు లోపము లేదనవలయును." కవిగారు శ్రీ రామతత్త్వమును కథా సంవిధానముతో జోడించి, ఎట్లుచెప్పిరో ఈ క్రింది పద్యమువలన మనకు విశదమగును.

శ్రీరామాఖ్యుడె యాత్మ; బుద్ధియనగా సీతామహాదేవి; కా

ర్యారంభమ్ము లొనర్చుచుండు మనసే-యారావణ బ్రహ్మ; త
త్సార గ్రీవము లింద్రియంబులగు; దత్తాత్కామ రోషాదులే
యారక్షఃపతి సైన్యపంక్తి; తనువే యాలంక తత్త్వస్థితిన్.

ఇట్లు కవిగారు మనస్సు నందనుభవ పూర్వముగ దెలిసిన విషయమును దాచక గద్యపద్య రూపములగు గ్రంథములుగా సంతరించి వెలయింప నుద్దేశించిన, వీరి కృషి అమేయము, నిరుపమానమని చెప్పవచ్చును.

వీరు కేవలము, పరమార్థదృష్టితో లోకసేవయే, ముఖ్య సాధనముగ నెంచి తమ యనుభవమున నార్జించిన, జ్ఞానధనమును తమ తోడివారికి బంచిపెట్టి ధన్యులైన మహనీయులు.

కం॥ ధర్మంబు తెలుప తెలుచును
ధర్మము రక్షించువారి దా రక్షించున్
ధర్మంబు తెడక యుండును
నిర్మలమతి నడవవలయు నిశ్చలనియతిన్ (భారతము)

ఇట్టి నిర్మలమైన ధర్మప్రతిష్ఠా వాక్యములను మనస్సునందు నిశ్చలముగా నిలుపుకొని, లోకోపకారార్థమై జీవితాంత మట్టి రచనలనే రచించి వెలయించిన శ్రీ పాణ్యా లక్ష్మీనరసింహయ్య గారు ధన్యతపొంది, కీర్తివంతులైరి.

పాణ్యం సోదరులు

శ్రీ పాణ్యం లక్ష్మీనరసింహయ్య గారికి, ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వీరి పెద్ద కుమారుడు శ్రీ పాణ్యం నరసరామయ్య. ప్రతిభాశాలి. సంస్కృతాంధ్రములు, చక్కగ నేర్చి, చిక్కని, కవితల్లల్లగలిగిన యువకవి. వీరును వీరి పెద్దతండ్రి కుమారుడైన పాణ్యం లక్ష్మీనరసయ్య గారును కలిపి "పాణ్యం సోదరుల"ను పేర తొలుత "ప్రభాతరేఖల"ను ఖండకావ్యమును వెలువరించిరి. ఈ ఖండకావ్యమునకు శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యుల వారు తొలిపలుకులు వ్రాసిరి. అందు వారీ సోదరులనుగూర్చి యిట్లు వ్రాసిరి.

"ఈ కవులు ఆంధ్రమును బాగుగా దఱచినారు. సంస్కృత సాహితీనదులయందు తానమాడినారు. ప్రాచీనాధునాతన, కవితా రీతుల, నాకట్టుకొన్నారు. జన్మతోబుట్టిన సంస్కారబలమున్నది. వీరి ఖండికలను జూచినప్పుడు నా భావనానేత్రము............, వీరి యుజ్జ్వల భవిష్యత్తును స్పష్టముగా జూడగలుగుచున్నాను."

పై మాటలలో, అతిశయోక్తి ఏమాత్రములేదు. ఇరువురును కవిత్వమల్లుటలో సమవుజ్జీలే. కవితారథము నీడ్వగల్గిన మంచికుఱ్ఱలే. వీరి ప్రభాతరేఖల ఖండకావ్యము "చక్కని భావనాశక్తి - కావ్యమునకు జీవనమైన ధ్వని - గంభీర

మైన పదగుంభన, దీక్షీకృతములైన, పరుషములైన సమాసము లతో పొందుపరచబడినది." ఇందలి ఒక పద్యమును మచ్చునకు చూతము.

సీ॥ మనసోగ వెన్నెలలను, జగంబులబూయు
చందురులో కందు-జిందితేల?
జిలుగు వెలుగుల, తళత్తళలతో మించు, క్రొ
మ్మించులో చాంపల్య ముంచితేల?
వన్నెవన్నెల మేని చిన్నెల, జెన్నొందు
బెబ్బులిలో, జుల్మబెట్టితేల?
నలుదెసల్ గమగమల్ వలపించు సంపంగి
విరిలోన వెగటు జొప్పించితేల?

గీ॥ ఈ మహత్తర శిల్పాన, యేమి? యేమి?
యెత్తుగడలున్నవో యేమొ? యెవడెఱుంగు?
అప్రతిహతాఖిల, చరాచర ప్రపంచ
హృదయచిన్మూర్తి! నీ సృష్టికిదె! జోహారు!

శ్రీ పాణ్యాం నరసరామయ్య

పాణ్యాం నరసరామయ్య, చిన్నప్పటి నుండి కావ్యము లల్లు నలవాటుగల వాడగుటచే, నేదైనా కావ్యము వ్రాయవలె

ననెడి యాతని అభిప్రాయమునకు శివభారత కర్తయైన, శ్రీ గడియారం వేంకటశేషశాస్త్రి గారొకపరి, ఏదేని ఒక చిన్న యితివృత్తమును, గ్రహించి రచన సాగించి, అభ్యాసపాటవమున ఫలసిద్ధి, పొందవలసినదిగా నుపదేశించిరి. ఆ యుపదేశముతో, ఆతడు వారికి ఏకలవ్యశిష్యుడై "వీరకంకణము" అను పేర విశ్వనాథనాయక చరిత్రను పద్యకావ్యముగా రచించిరి.

వీరకంకణమొక చారిత్రాత్మక పద్యకావ్యము. ఇది శ్రీ కృష్ణదేవరాయల కాలమున జరిగిన కథ. చోళరాజు, పాండ్యరాజును పారద్రోలి ఆతనిభార్యను చెరబట్టిన విషయము రాయలవారికి తెలియగా, ఆయన తనకు విశ్వాసపాత్రుడైన, నాగమనాయకుని సైన్యముతో చోళరాజుపైకి యుద్ధమునకు పంపెను. నాగమనాయకుడు చోళరాజును జయించి, ఆ రాజ్యమును మరలా పాండ్యరాజున కివ్వక, తానే స్వతంత్రించి రాజుగా ప్రకటించుకొనెను. ఇది తెలిసిన కృష్ణరాయలు, ఉగ్రులై సభలో యిట్లు పల్కిరి.

ఉ॥ ఏ జగజెట్టియైననుసరే! చనుదెంచి, రణాంగణంబునన్
దేజము దెంపుజూపి జననిందితు నాగమనీని బట్టి మా
యోజను బెంచువానికి, సముజ్జ్వల సాహసమూర్తికిన్,యశో
భాజన'వీరకంకణ 'ముపాయన మియ్యది;భోగ్యమయ్యెడున్

ఆ ప్రకటన విన్నంతనే "లేత జవ్వనమున నూనూగు మీసములు వచ్చిన వీరరసంబునాగ, నజ్జనపతి ముందటన్నిలిచి సాగిలి మ్రొక్కి, నొకండు దీర్ణుడై -"

మ॥ అతడే వీరమ నాయకుండ హిత బాహాగర్వ నిర్వాహణో
ద్ధత నిర్వక్ర పరాక్రమక్రముడు, ప్రోద్యద్ధర్మ దీక్షా సమం
చిత, పుణ్యోదయమూర్తి, నాగమ మహాసేనానికిన్ బుత్రకుం
డతిలోక ప్రభుభక్తి తత్పరత దృష్టాంతంబు; లోకంబునన్.

అతడు అంజలి ఘటించి తండ్రిపై యుద్ధము ప్రకటించి నాడు. యుద్ధమునకు ముందు తండ్రీకొడుకులకు నడుమ జరిగిన వీరోచిత సంభాషణమును కవిగారు అతి చక్కగా, గంభీరత చెడ నట్లుగా, మఱి మఱి పఠించి యానందింపదగినదిగా రచించినారు.

ఇయ్యది వీరరస ప్రధానమైన కావ్యము. ప్రతి పద్యము వదలక చదువ వలసినదేకాని, విడిచి ముందుకు సాగలేము.

"వీరి కవిత వలచి వచ్చినదిగాని, బలాదాకృష్యమాణ గాదు. ఇందారంభమునుండి, కొసవఱకు జక్కని పదజాలముతో స్వాభావికమగు నడకలతో, బద్యములు హృద్యములై కవి యొక్క సరళత్వమును బ్రదర్శించుచున్నవి. అనవసరములగు వర్ణనల, జోలికిబోక తగిన రీతిగా నడుపబడిన, ఈ కవిత యెంతయు గొనియాడదగియున్నది. కావ్య లక్షణము లొక్కిం

తయు, సడలనీక యిందు బొందు పఱచుట హర్షింపదగిన విషయము"-ఇయ్యది శ్రీ జనమంచి వేంకట సుబ్రహ్మణ్యశర్మ గారు కావ్యముపై వెలువరించిన సదభిప్రాయము.

వీరి రెండవ కావ్యము "స్వాతంత్ర్యవీరుడు". ఇది కర్నూలు జిల్లాకు చెందిన ఉయ్యాలవాడ గ్రామవాసియైన శ్రీ నరసింహారెడ్డి చరిత్ర. అతడు ఆంగ్లేయులపాలన నంతమొందింప నెంచిన సాహసి. జానపదులాతని "రెడ్డికాదు బంగారుకడ్డీ" అని కీర్తించిరి. అతని సాహస మంతా యింతా కాదు. ఏటేటా ప్రభుత్వమిచ్చు "తవర్జి" అను భరణము కొరకై రెడ్డి ఎవరినో ఒకరిని తహసీలుదారు కడకు పంపుచుండిరి. కానీ కోవెలకుంట్ల తహసీలుదారునకు, రెడ్డికి నేదో ఒక సందర్భమున వాగ్వాదము జరిగి వుండుటచే, "దాసరి క్రిందకూడ, నొకదాసరియా" యని యీసడించి "ఆ దాసరివచ్చి మమ్మడిగి ద్రవ్యము గైకొనవచ్చు" నని దురుసుగా మాట్లాడిరి. దానితో రెడ్డి రెచ్చిపోయినాడు. వాని "తల తీయక విడుతునా!" యని ప్రతిజ్ఞ పట్టి దండుతో, తాలూకాఫీసు మీదికి దాడి జరిపినాడు. రెడ్డి దండు చూడగానే రక్షకభటులు తుపాకులు వదలి పరుగెత్తినారు. రెడ్డి ఉగ్ర నరసింహుని రూపము దాల్చి

కఱ కఱ పండ్లనూరి, చెడుగా! యిటురమ్మని, పట్టి ఈడ్చి ని
ర్భరమగు, నక్కసమ్ము మెయి, వాని శిరమ్మును నేలద్రున్నె చుం

గఱకు కటారు గేలకొని గ్రక్కునవైవ, శిరంబు మొండెమున్
ధరణి పయింబడెన్ రుధిర ధారలు మందిరమెల్ల జిమ్ముచున్.

ఇట్లాతని చంపి ఆంగ్లేయులపై కక్షగట్టిన క్షాత్రవతంసు డతడు.

ఇట్టి సాహసవీరుని స్వగ్రామమగు ఉయ్యాలవాడ యందు బుట్టిన మన నరసరామయ్యగారు సాహసించి, ఈ వీరుని కథను జానపద పదములకే పరిణితిబెట్టక, కావ్యరూపము నిచ్చి రాయల సీమకు కీర్తి తెచ్చిరి.

నరసరామయ్యగారి రెండు కృతులు, చరిత్రకు సంబంధించి నవే యైనను, వీర కంకణ కృతి శైలికిని, యిందు జూపిన శైలికిని, భిన్నత్వము స్పష్టముగా గోచరించును. రెడ్డి చరిత్ర పండిత పామర జనానందకరమై యొప్పుచున్నది. ఈ రెండు కావ్యములవల్ల ఈ కవి సంస్కృతాంధ్రములలో పుష్కలమైన పాండిత్యము, కవితలో నిండైన ప్రావీణ్యము, కలవారని తేటతెల్లమగుచున్నది. ఈ కవిగారు రెడ్డి చరిత్రను అసమగ్ర ముగా ప్రచురించిరి. ఇది పాఠకులకు కొంత అసంతృప్తిని కలిగించినదని చెప్పవచ్చును. దీని రెండవ భాగము ప్రచురించి, నరసింహారెడ్డి చరిత్రకు సంపూర్ణత చేకూర్చి కవివరేణ్యులు ధన్యులగుదురు గాత!

శ్రీ పాణ్యం లక్ష్మీనరసయ్య

వీరు శ్రీ పాణ్యం లక్ష్మీనరసింహయ్యగారి అన్న కుమారులు. పాణ్యం నరసరామయ్యతో కలసి "పాణ్యం సోదరులు"గా వాసికెక్కినవారు. వెల్దుర్తి వీరి జన్మస్థలము. చిన్నతనము నుండియే, కవిత్వమన్నెడి అభ్యాసము వీరి కలవడినది. సోదరుడు నరసరామయ్యతో వీరికి కుదిరిన సఖ్యముతో, ఈ ఇద్దరి హృదయము లేకమైనవి. "వీరి భావములు పూర్తిగా తెలిసికొనలేనంతగా నైక్యమైపోయినవి." అందుకు "ప్రభాత రేఖలు" ఖండ కావ్యమే సాక్షి. వీరి స్వతంత్ర రచన "శ్రీ గురుస్తోత్ర మాల" ఇందు వీరి రచనా విధానమిట్లు సాగినది.

సందేహమ్ములు వాయుచోటు; మదులన్ సద్వాసనా దివ్యముల్
మందారమ్ములు విచ్చుచోటు; తొలగన్ మాలిన్య విక్షేపముల్
డెందమ్ముల్, నిలు పొందుచోటు; పరిపాటిన్నిత్యమాధుర్యమా
నందం బయ్యది పొంగుచోటు; బుధగణ్యా! నీ పదధ్యానమే॥

ఇంతటి చక్కని రచనను వ్రాయగలిగిన ప్రతిభాశాలురైన వీరు మరితర పొత్తములేవియు వ్రాసినట్లు లేదు. ఒక్క ఖండకావ్యము మాత్రమే "పాణ్యం సోదరులు" జంటగా కలపి వ్రాసినది. తరువాత జంటగా రచనలు సాగించినట్లు లేవు. ఏమైననూ పాణ్యం సోదరులు తమ కవిత్వము 'పిల్లకవిత్వము' కాదని-"మేల్ హో యల్ గల కవిత్వ విలాసమ"ని నిరూపించిరి.

శ్రీనివాసపురం సోదరులు

శ్రీకరమై సిరిసంపదలకు నాలవాలమై అతి ప్రాచీన కాలము నుండి అభ్యుదయ పథమున, పురోగమించిన ఆంధ్ర భూమి యందలి రాయలసీమ, రత్నగర్భయే గాక, అనేక కవి పండిత మాన్యమనీషి రత్నములనుగన్న భారతసుపుత్రి. ఆంధ్ర కర్ణాటక రాజ్యలక్ష్మికి కీర్తి ప్రతిష్ఠలను జేకూర్చి ఉజ్జ్వల వైభవో న్నతుల కాటపట్టుగా, నాటి సారస్వత సామ్రాజ్యంలో కవిపండిత పరికాండులకు ప్రాభవ వైభవ, సన్మాన సత్కారములతో నీరా జనము పట్టిన "విజయనగర రాణ్మహీపతుల సామ్రాజ్య సవిస్తార చారిత్రికేతిహాసము" (క్రీ॥ శ॥ 1224 నుండి క్రీ॥ శ॥ 1656 వరకు గల చరిత్ర) ఆంధ్ర పాఠకలోకమునకు, లోగడ ఏ యితర రచయితలవల్లగాని అందించబడనట్టి సంపూర్ణమైన యితి వృత్తముగా, బహుళమైన కృషిచేసి విద్యానగర చారిత్రక నవలా మాలిక యను పేర 20 సంపుటములుగా (దాదాపు 6 వేల పుట లలో) మనకు సంతరించి యిచ్చిన రచయితలు "శ్రీనివాసపురం సోదరులు" వీరు వరుసగా 1. కవిరాజ్, డాక్టరు శ్రీనివాసపురం శేషాచార్యులు 2. కవిరాజ్, డాక్టర్ శ్రీనివాసపురం నరసింహా చార్యులు 3. శ్రీనివాసపురం వేంకట లక్ష్మినారాయణ్ 4. శ్రీని వాసపురం అనంతాచార్యులు 5. శ్రీనివాసపురం రామాచార్యులు అను పేరుగల ఈ శ్రీనివాసపురం సోదరపంచకము రాయలసీమ

లోని స్వయంప్రభా రత్నములు. వీరిని, వీరి రచనలను గూర్చి తెలుసుకొనుట సాహిత్య, పిపాసువులకు ఎంతేని అవసరము.

"శ్రీనివాసపురం సోదరులు" అను సమిష్టి నామముతో ఆంధ్ర పాఠకలోకమునకు పరిచితులైన, ఈ రచయితలు చిత్తూరు జిల్లాలోని పలమనేరు తాలూకా, పెంగరకుంట గ్రామ వాస్తవ్యులు. వీరి తండ్రిగారైన బ్రహ్మశ్రీ, శ్రీమాన్ శ్రీనివాసపురం కృష్ణమాచార్యులవారు - ఆయుర్వేద విద్యాపారంగతులు. ఆధ్యాత్మిక చింతనాపరులైన శ్రీవైష్ణవులు. ఆయుర్వేద వైద్యము వీరి కుటుంబమునకు వంశ పారంపర్యముగా అబ్బినది. కృష్ణమాచార్యుల వారికి 11 మంది సంతానము. అందులో ఏడుగురు కుమారులు. వరుసగా మొదటి ఐదుమంది "శ్రీనివాసపురం సోదరులు" గా వాసికెక్కినారు.

శ్రీనివాసపురం శేషాచార్యులు

శ్రీనివాసపురం సోదరులలో వీరు జ్యేష్ఠులు. కలం పేరు "శఠశ్రీ". 1921లో జననము. వృత్తి ఆయుర్వేద వైద్యంలో డాక్టరు.

1941నుండి సారస్వతకృషి. 1943లో భారతరాజకీయాల్లో ప్రవేశము. భారత జాతీయ కాంగ్రెస్‌లో 'క్రియాశీల' సభ్యులు. ప్రకాశంపంతులుగారి అనుయాయులు. కాంగ్రెస్‌వాది. స్వాతం

త్ర్యము లభించిన తరువాత "ఆంధ్రరాష్ట్రసాధన" కలగా మిగిలి పోయినప్పుడు వీరు 'శుభశ్రీ' కలంపేరుతో నిశితమైన రాజకీయ విమర్శలు, వ్యాసాలు, గేయాలు వ్రాసి ఆంధ్రప్రజల్లో రాజకీయ చైతన్య భావాలు రేకెత్తించిన వైతాళికులు. 1917-18 ప్రాంతంలో వీరి రచనలనేకము ఆనాటి పత్రికలలో ప్రచురించబడినవి. ముఖ్యంగా వీరి కలం గేయ, వ్యాస రచనలకే పరిమితమైనది. శ్రీశ్రీ పోకడ వీరి కవిత్వంలో చాలావరకు కనిపించును. 1954లో పుంగనూరు నుండి వెలువడుచున్న 'నవీన' మాసపత్రికకు సంపాదకత్వము వహించిరి. 1955వ సం॥లో సంపూర్ణ విజయ నగర సామ్రాజ్య చారిత్రికేతిహాస రచనకు ప్రారంభించిరి. అట్లు వ్రాయబూనిన 'విద్యానగర చారిత్రిక నవలామాలిక' లోని 20 సంపుటములలో రాజద్రోహి - శాంతివాది - పిచ్చిప్రభువు అను మూడు సంపుటములు వీరు రచించిరి.

1964వ సం॥ ఫిబ్రవరి నెలలో అనంతపురం జిల్లా పెనుకొండలో జరిగిన శ్రీకృష్ణదేవరాయ వర్ధంతి రజతోత్సవ సందర్భంగా డా॥ శేషాచార్యులుగారు తమ్ములతోసహా సత్కరింపబడిరి.

శ్రీమాన్ మాడభూషి అనంతశయనం అయ్యంగార్ వారు బీహార్ గవర్నరుగా నుండిన కాలంలో వారికి, గౌరవ స్వకీయ ఆయుర్వేద వైద్యులుగా శేషాచార్యులు కొంతకాలం నియమితులై యుండిరి. చిత్తూరు జిల్లా రచయితల సహకార ప్రచురణల

సొసైటీకి వీరు డైరెక్టరుగా నియమింపబడిరి. వీరు సోదరులతో కలిసి సాహితీక్షేత్రమున మరింత వ్యవసాయమొనర్చి చక్కని సస్యములు పండింతురుగాక!

శ్రీనివాసపురం నరసింహాచార్యులు

శ్రీనివాసపురం సోదరులలో వీరు ద్వితీయులు. వీరి కలం పేరు 'సింహశ్రీ'. జననము 13-1-1927. వృత్తివైద్యము.

1948 సం॥ నుండి తీరిక సమయములందు పద్య, గేయ వ్యాస, విమర్శనాత్మకమగు సాహిత్యకృషిని ప్రారంభించిరి. విద్యార్థిదశ నుండి ప్రాచీన కావ్యాలు, ప్రబంధాలు ఆసక్తిగా చదివేవారు. కనబడిన ప్రతిగ్రంథము చదువుట వీరికున్న ఒక మంచి అలవాటు. "రాధిక, తెనుగుబిడ్డ, భగ్న హృదయము, రసార్ద్రము, చరమసంధ్య" మొదగునవి వీరి ఖండకావ్యములు. వీరి అనేకరచనలు త్రిలింగ-హితవాది-చిత్రగుప్త-పల్లెసీమ-భారతి ఆంధ్రపత్రిక-ఆంధ్రప్రభలలో ప్రచురింపబడినవి. చిన్ననాడే వీరు "కవికిశోర"మని పిలువబడిరి. 1960 లో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో "తెలుగుకలాలు" శీర్షికలో వీరినిగూర్చి వ్రాయబడినది.

హైందవ చారిత్రక విషయములతో వీరికి విశేషమైన ప్రజ్ఞగలదు. 1964 జనవరి - మార్చి నెలల "భారతి" మాస

పత్రికలో ప్రచురింపబడిన "రాజావళి చరిత్ర ఈనాటిది కాదు" "రాజావళి" చరిత్ర మరికొన్ని విశేషములు - వీరి ఎన్నదగిన పరిశోధనా వ్యాసములు. "అక్షయ భారత విజ్ఞానము" అను నొక బృహన్నిఘంటు నిర్మాణమునకు పూనుకొన్న సాహిత్య సాధకు డీయన.

సోదరులతో కలిసి వ్రాసిన విజయనగర నవలామాలిక లోని "దేవగిరిదుర్గం, రాజ్యోదయము, రాజ్యక్రాంతి, నాగలాదేవి, రఘునాథవిజయము" అను నైదు సంపుటములకు వీరు ప్రధాన సంపాదకులు.

"వైద్యము ప్రధానజీవికగా, బ్రతుకుబాటలో భవిష్యత్తుకై సాగే పోరాటములో, కాలముతో కలిసి రాజీకిరాని గడుసరి. ఆత్మాభిమాని. శాస్త్రచక్షువు, వ్యాసకర్త-కావ్యప్రియుడు" మన నరసింహాచార్యులు.

శ్రీనివాసపురం వేంకట లక్ష్మీనారాయణన్

శ్రీనివాసపురం సోదరులలో వీరు మూడవవారు. జననం 1929. కలంపేర్లు "రమాకాంత్" - "పద్మావతీ నారాయణన్" ఉద్యోగం చేసింది రైల్వేశాఖలో. వీరికి గద్యరచనపై మక్కువ మెండు. ఆధునిక రచయితల రచనలను, దీక్షతో చదివి బాగుగా

ఆకళింపు జేసుకొన్నవారు వీరు. వీరి రచన లనేకము పత్రికలలో ప్రచురించబడినవి. వీరు కథారచనలో సిద్ధహస్తులు.

అన్నదమ్ములతో కలసి చేసిన విజయనగర సామ్రాజ్య చారిత్రికేతిహాస రచనాకృషిలో వీరు "దేవగిరి పతనము, రాయల పరాభవము, దివికోట" అను సంపుటములకు వీరు సంచాలకులు.

వంశానుక్రమముగా వచ్చుచున్న "సాహిత్య వారసత్వపు కన్య'తనకుతానై వీరిని వరించిందనడంలో ఎట్టిసందేహము లేదు.

శ్రీనివాసపురం అనంతాచార్యులు

ఈ సోదర పంచకములో వీరు నాల్గవవారు. జననము 1932లో. కలంపేరు "అనంతశ్రీ". ఉద్యోగం చేసింది భారత సైనిక తపాలాశాఖలో. స్వయంకృషితో సాహిత్యము నలవరచుకొనిరి. వీరి కవిత్వము స్వామి శివశంకరశాస్త్రి-వేలూరి శివరామశాస్త్రి వంటి పెద్దల నాకర్షించినది. వీరి "శ్రీహర్ష-శ్రీనాథుల స్వర్గ సమావేశము" - "సంయుక్తా స్వయంవరం" నాటికలు చాల ప్రాముఖ్యత నందినవి. వీరి వ్యాస రచనలలోకెల్ల "కాళిదాసుని లోకయాత్రా పరిశీలనము" ప్రధానమైనది. వీరు అనువాదకర్తలు కూడా. శ్రీ భాసమహాకవి కృత "కర్ణభారము" నకు "ప్రతిజ్ఞా నిర్వహణము" వీరి స్వేచ్ఛానువాద కృతి.

సోదరులతో కలిసి వీరు "విజయనగర నవలామాలిక" లోని కంపిలరాయలు, సమ్రాట్ ప్రౌఢదేవరాయలు, రాక్షసి-తంగడి, రాజ్యక్షయము"అను పొత్తములు వీరి సంపాదకత్వమున వెలువడినవి.

"మానవసేవయే మాధవసేవ"గా తలచి వీరు వంశ సాంప్రదాయ సిద్ధమగు వైద్యవృత్తిని పూని జీవయాత్ర సాగిస్తున్నారు.

శ్రీనివాసపురం రామాచార్యులు

ఈ సోదరపంచకములో వీరు ఐదవవారు. జననం 1935. కలంపేరు "రమ్యశ్రీ". తంతి తపాలాశాఖలో ఉద్యోగం చేసిరి. వీరు తమ 15వ ఏటనే కథారచనను ప్రారంభించిరి. వీరిది ఆవేశ పూరిత హృదయము. రచనాశైలి సరళముగా నుండి సునిశిత మైన హాస్యము మిళితమై చమత్కారముగా వ్రాయుట వీరికిగల నేర్పు. వీరికి వచనరచనమీద మక్కువ మెండు. వీరు వందకు పైగా కథలువ్రాసిరి. అన్నిపత్రికలలోను అవి వెలుగుచూచినవి.

సోదరులు తలపెట్టిన "విజయనగర నవలా మాలిక" రచనా కార్యక్రమములో వీరిరచన నాంది పలికినది. ఆ నవలా మాలికలోని 11వ సంపుటమైన "జగన్మోహిని"ని వీరు తొలుత

ఆంధ్ర పాఠకలోకమునకు అందించిరి. ఈ నవలల భాషాంతరీ కరణకు వీరు ప్రధానకర్తలు. ఈ సంపుటములలోని మరికొన్ని భాగములగు "కుమారరాముడు, తౌళవేశ్వరుడు, అమాత్య రత్నము, జ్ఞాతికలహము" లకు వీరు ప్రధాన సంచాలకులు. "ప్రణయబంధము-మీరాబాయి-కన్నీటికడలి" వీరి మరికొన్ని నవలలు. తండ్రివద్ద అంతేవాసిగా మెలగి 15 ఏండ్లు ఆయుర్వేద వైద్యమును నేర్చి-ప్రభుత్వ పట్టముపొంది, ఆంధ్ర ప్రభుత్వంలో అర్హతగల వైద్యులుగా గుర్తింపబడిరి.

విద్యానగర నవలామాలిక

ఈ సోదర పంచకముచే రచింపబడిన, ఈ సంపూర్ణ విజయనగర సామ్రాజ్యేతిహాసము 20 సంపుటములు. క్రీ॥ శ॥ 1224 నుండి క్రీ॥ శ॥ 1656 వరకు గల చరిత్ర యిది. ఇందలి మొదటి ఐదు భాగములు విజయనగర సామ్రాజ్యోదయ ఘట్టమును (1224 నుండి 1336) వివరించు నవలలు. అవి 1) దేవగిరి దుర్గము 2) దేవగిరి పతనము 3) కంపిలరాయలు 4) కుమారరాముడు 5) రాజ్యోదయము.

6 నుండి 12 భాగములు సామ్రాజ్య వైభవ ఘట్టముల (1336-1528) ను విశదపరచు నవలలు. అవి 6) రాయపరాభవము 7) సమ్రాట్ప్రౌఢ దేవరాయలు 8) రాజ్యక్రాంతి

9) తౌళవేశ్వరుడు 10) నాగలాదేవి 11) జగన్మోహిని 12) శాంతివాది.


13 నుండి 15 భాగములు "సామ్రాజ్య దురంతఘట్టము" (1528-1565) అను తెలుపు నవలలు. అవి 13) రాజద్రోహి 14) అమాత్యరత్నము 15) పిచ్చిప్రభువు 16) రాక్షసి-తంగడి.

17 నుండి 20 భాగములు "సామ్రాజ్య పతనఘట్టము" (1565-1656) వరకు వ్రాయబడిన సంపుటములు. అవి 17) రఘునాథవిజయము 18) దీవికోట 19) జ్ఞాతికలహము 20) రాజ్యక్షయము.

ఈ నవలా మాలికకు, శ్రీ కొరటి శ్రీనివాసరావు గారు రచించిన కన్నడ నవలలు మూలము. కాని, ఈ సోదరపంచకము మూలమున లేని అమూల్యములగు అంశములతో, మూలమును మించిన, జిగిబిగితో వీరి రచనలు నొప్పారుచున్నట్లు ప్రముఖ సాహితీవేత్తలు-పరిశోధనాకర్తలు ప్రశంసించిరి. బీహార్ గవర్నరుగా నుండిన శ్రీమాన్ మాడభూషి అనంతశయనం అయ్యంగారు వీరి పుస్తకాలను గూర్చి వ్రాసిన అభిప్రాయ మిట్లున్నది. "డా॥ శేషాచార్లు-వీరి సోదరులు నల్వురు,కూడా వీరితో సమానముగా రచనా వ్యాసంగంలో కృషిసల్పినారు. వీరందరూ కలిసి వ్రాసిననూ, ఈ సాహిత్యం ఏక కంఠంతో వినిపించినట్లున్నది.

శ్రీనివాసపురం సోదరపంచకము, మిక్కిలిగా శ్రమించి జీవితము నర్థంచేసికొని, బ్రతుకుతో రాజీపడి, కాలంతోకలిసి మనకు సంత రించియిచ్చిన ఈ "విజయనగర సామ్రాజ్య చారిత్రిక నవలా సంపుటిని తెలుగు పాఠకలోకం సహృదయంతో ఆదరించగలదని విశ్వసిస్తున్నాను".

ఈ సోదరపంచకము ఈ కృషి తరువాత కలసి సాగించిన కృషి మరొకటేదియులేదని తెలియుచున్నది. ఈ రచనాయజ్ఞ మును బహుప్రయాసలకోర్చి పరిసమాప్తి గావించిన ఈ సోద రులకు ఆంధ్రులెంతయో, ఋణపడి వున్నారు. 1968 తరువాత ఈ నవలలు మరలా పునర్ముద్రింపబడలేదని తెలియుచున్నది. ఇవి పునర్ముద్రింపబడినచో అది ఆంధ్రుల మహద్భాగ్యముగా నెంచవచ్చును. ఈ సోదరులకు శారదామాత ఆయురారోగ్య భాగ్యము లొసంగుగాత!



శ్రీ టేకుమళ్ల కామేశ్వరరావు

జననము:
22-3-1907;

జన్మస్థలం:
విజయనగరం.

తల్లి: శ్రీమతి విశాలాక్షి; తండ్రి: టేకుమళ్ళ అచ్యుతరావు
ప్రస్తుత నివాసము: చిత్తూరు. (ఆంధ్రప్రదేశ్)

ఆంధ్ర వాఙ్మయ విమర్శకులు, బహు గ్రంథకర్తలైన శ్రీ టేకుమళ్ళ అచ్యుతరావుగారి పేరెరుగని ఆంధ్రు లుండరు. వీరు రచించిన "విజయనగరాంధ్ర వాఙ్మయచరిత్ర, ఆంగ్లములో "పింగళి సూరన జీవితము - సాహిత్య విమర్శ" ప్రసిద్ధములైనవి. వీరి జ్యేష్ఠ పుత్రుడే టేకుమళ్ళ కామేశ్వరరావు.

కామేశ్వరరావు గారికి చిన్నప్పటి నుండి కవిత్వమల్లుట అభ్యాసమైనది. బళ్ళారిలో చదువు చున్నప్పుడే కవిత్వ లక్షణ గ్రంథములను చదువుచుండిరి. 1927లో వీరికి వివాహమైనది. 1933 నాటికి ఉపాధ్యాయవృత్తిలో ప్రవేశించి, తదుపరి స్కూళ్ళ ఇన్‌స్పెక్టరుగా రాయలసీమ, ఉత్తర సర్కారు జిల్లాలలో పని చేసిరి.

1935లో వీరు కళత్రవియోగము జెందిరి. ఆ సంవత్సరమే వారికి ద్వితీయ వివాహము జరిగినది. ఆమె పేరు హనుమా యమ్మ. ఆవిడ ఒక మహాయోగిని. ఆధ్యాత్మిక శక్తి కలది. ఆమె ఆధ్యాత్మికశక్తిని గూర్చి కామేశ్వరరావుగారు పరిశోధన గావించి ఆంగ్లములో "**Further life of the Soul**" అను పుస్తకమును వ్రాసి ముద్రించిరి.

కామేశ్వరరావు గారు అచ్చువేసిన మొదటి పుస్తకము "కలువలు"-1933లో. అదియొక చక్కని ఖండ కావ్య సంపుటి. రాజమండ్రిలో వున్నప్పుడు "కోపదారిమొగుడు" అను ఐదంక ముల నాటకమును వ్రాసి 1937లో ప్రచురించిరి. వాడుకభాష పేర కొందరు రచయితలు నోటికి వచ్చినట్లు వ్రాయుచుండుట చూచి దానికి కొన్ని నియమములు అవసరమని తలచి "వాడుక భాషా-రచన-కొన్ని నియమములు" అను గ్రంథమును రచించి మార్గదర్శకులైరి.

వీరు వ్యవహారిక భాషతో వ్రాసిన చక్కటి కథలు, ఆనాటి వివిధ తెనుగు పత్రికలలో ప్రచురింపబడినది. "రోజా" "జానకిప్రేమ" - వీరి కథల సంపుటులు. వీరి "రోజా" కథను చదివిన రావుసాహేబ్ శ్రీ గిడుగు వెంకటరామమూర్తి పంతులు గారు "నేను భాషలో ఇంతకృషి చేశాను; ఎందుకూ? ఇటువంటి

కథ ఒక్కటి రాసి వుంటే ఎంత బాగుండును?" అని మెచ్చుకొన్నారు.

పిల్లలకోసం వీరు వచన కవిత్వం వ్రాసి "మిణుగురు పురుగు"-"పాలపిట్ట" అను పేర్లతో చిన్న పుస్తకములను ప్రచురించిరి. "పసివానికీ చిన్నచిన్న సమస్యలున్నాయి. వాటిని విడదీసి చక్కగా అతని కర్థమయ్యేటట్టూ, అతనికానందం కలిగించేటట్టూ చెప్పాలి. అతని విజ్ఞానావరణాన్ని విశాలం చెయ్యాలి. అతనికి, తన చుట్టూను కనిపిస్తూన్న ప్రకృతినీ, తనలోని ప్రకృతినీ తెలుసుకొని ఆనందించడం నేర్పాలి. అందుకు బాలురకు ప్రత్యేక సాహిత్యం కావాలి. ఆ కృషి శ్రీ కామేశ్వరరావు గారు చేశారు. బాలుర మనస్తత్త్వాలను పరిశీలించి దాని కనువయేటట్టు వ్రాయడం వారి ఆదర్శం." - అని బాలసాహిత్యమునందు కృషి గావించి పేరెన్నికగన్న శ్రీ బి. వి. సింగరాచార్య "మిణుగురు పురుగు"కు వ్రాసిన తొలిమాటలో ప్రస్తావించిరి. మచ్చుకు అందలి ఒక చిన్న గేయము.

కా లా లు

వేసం కాలంలో ఎండకి - వేగిపోయాము
వర్షాలెప్పుడు దిగుతాయో?
వర్షాకాలంలో వానకి - వణికిపోయాము
చలిగాలెప్పుడు తిరుగుతుందో?

శీతాకాలంలో చలికి - బిగిసిపోయాము
ఎండలు ఎప్పుడుకాస్తాయో! ("మిణుగురుపురుగు")

శ్రీ కామేశ్వరరావుకు చిన్నతనం నుండి కవుల చరిత్రలు చదవడమన్న చాలాసరదా. ఆయన గురుజాడ శ్రీ రామమూర్తి కందుకూరి వారలు వ్రాసిన కవుల చరిత్రలు బాగుగా చదివినారు. విసుగులేకుండా కందుకూరి వారి " ఆంధ్రకవుల చరిత్ర " తిరగ వేసినారు. అందలి శైలి వారికి హద్దులేని ఆనందము నిచ్చింది. అప్పటినుండి వీరికి తెలుగుకవుల జీవితములను సేకరించవలె ననెడి పట్టుదల కలిగి 1932 ప్రాంతంలో భోగట్టాలను సేకరించు టకు ప్రారంభించిరి. "కవుల చరిత్రయొక్క అవసరమేమిటి?" అని పలువురు వీరిని ప్రశ్నించినప్పుడు వీరు " ఒక మహాకవిని అర్థం చేసుకోవాలంటే, అతనియొక్క జీవితచరిత్ర అత్యవసరం" అని వాదించెడివారు. వీరు కవుల చరిత్రసేకరణ గావించు సమ యమున సుప్రసిద్ధ కథకులైన శ్రీ పాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి జీవితచరిత్రను వ్రాయతలపెట్టి అంశములకొరకు వారికి వ్రాయగా ఆయన "మీరు ముఖ్యస్నేహితులు కాబట్టి దాచకుండా చెప్పు తున్నాను. మరొకరైతే చెప్పను. మీరు ఇంకొకరి చరిత్రవ్రాస్తే మీకీర్తి తగ్గిపోతుంది. వారికీర్తి ఎక్కువవుతుంది. కాబట్టి అట్టి ప్రియత్నం మానుకోండి" అని నిరుత్సాహ పరచడానికి ప్రయ త్నించగా, దానిని కామేశ్వరరావు - మంచి హృదయముతో

చెప్పినదే యైననూ, పాతకాలపు దురభిప్రాయంగా భావించి, దానిని నొక "వాఙ్మయసేవ"గా లెక్కించిరి.

ఈ కవుల చరిత్ర సేకరణలో వీరు పొందిన అనుభవము అంతా యింతా కాదు. నాటికి నేటికి కవుల స్వభావమొక్కటే. జాబులతో అంతగా ప్రయోజనము లేదనుకొని కవుల ఫోగట్లా కొరకు దేశసంచారము కూడా సాగించిరి. ఇట్లైనో్న కష్టముల కోర్చి తుదకు 19-20 శతాబ్దములందలి 102 మంది ఆధునిక కవులను గూర్చి "నా వాఙ్మయమిత్రులు" అను పేర 350 పుటల ఒక పెద్ద పుస్తకముగా ప్రచురించి వాఙ్మయసేవ గావించిన సాహిత్యోపాసకులు వీరు.

1970 లో "పూర్వాంధ్రకవులు" అను మరియొక కవుల చరిత్రను మొదటిభాగముగా క్రీ॥ శ॥ 630-945 వరకు గల జయదేవుడు, వేమన, రేచన, నన్నెచోడుడు, పంపకవి మొదలగు కవులను గూర్చి వ్రాసి ప్రచురించిరి. మిగుల శ్రమపడి "తెలంగాణా రాజుల చరిత్ర" లను నాలుగింటిని పెద్ద నాటకములుగా వ్రాసిరి. అవి అచ్చురాలేదు. వీరి "ప్రకాశ విమర్శీయము" అను ఐదంకముల నాటకము, హిందూ-బౌద్ధమత విభిన్న లక్షణములను తెలియజేయు మతపరమైన ఒక హాస్యనాటిక. విమర్శాదేవి, ప్రకాశమూర్తి అనువారు ఇందలి నాయికానాయకులు. ఈ నాటకము రంగస్థలముపై ప్రదర్శించుటకు యోగ్యమైనదికాదు.

చదువరులను మాత్రము ఆలోచింప జేయుననుట వాస్తవము.

తదుపరి వీరి సాహిత్యకృషి "జానపద గేయ వాఙ్మయ చరిత్ర" - "పూర్వపదాలు-పాతపాటల" పై సాగినది. పెక్కు జంగం కథలను సేకరించి వాటిపై పరిశోధన గావించి విమర్శ నాత్మకముగా విపులమైన వ్యాసములు వ్రాసి ఆనాటి గృహలక్ష్మి సౌభాగ్య-కిన్నెర పత్రికలలో వరసగా ప్రచురించిరి. ఆ వ్యాస ములను ఒక పుస్తకరూపమున దెచ్చి జానపదగేయవాఙ్మయము నకు అలంకారము తెచ్చిరి.

కవిగారు మొదటినుండి దైవభక్తిపరులు. జప తపము లతో కాలము గడుపుచూ, కవులతోనే కాక యోగులతోను స్నేహము నెఱపిరి. ఈ జపతపములు ముదిరి, చివరకు 1943 లో దైవ సాక్షాత్కారమును పొందిరి. ఆధ్యాత్మిక శక్తిగల భార్య తోడుకాగ మరింత భక్తిజ్ఞాన యోగము ముదిరినది. సంతానము దక్కలేదు. దానికితోడు భార్య అనారోగ్యము. ఆమె కూడా తన 72 వ ఏట కన్నుమూసింది. కవిగారు ఏకాకిగా మిగిలిరి.

తుదకు చిత్తూరులో గృహ నిర్మాణము గావించుకొని కాలము గడుపుచున్న సమయములో ఇంటివద్ద ఎవరో ఒక ఆడశిశువును కని పారవేయగా దానిని భగవదాజ్ఞగా నెంచి

ఆ శిశువును తెచ్చి సంరక్షించను పూనుకొనిరి. (కవిగారు ఆ అమ్మాయితో తీయించుకొన్న ఫోటోను చూడవచ్చును) ఆ బిడ్డ బాధ్యత కవిగారి మీద పడినది. ఆ బిడ్డ "పరమేశ్వరియే కాని వేరు కాదు" అని తలచి పెంచుకొనుచున్నారు.

"నా శరీరము రోగ నిలయ మయినది. ఇట్టి స్థితిలో ఎట్లో పాటుపడి నా ప్రియమైన కుమార్తెను పెంచుచున్నాను. భగవంతుడు ముందేమి చేయునో నాకు తెలియదు. ఈ ఎనభై ఏండ్ల వయసులో ఇప్పుడింక క్రొత్త వ్రాతలు అసాధ్యము. జీవితము ఎట్లు ముగియునో అగోచరము. వాని లీలలు మనకు తెలియుననుకొనుట అవివేకము" అని శ్రీ కామేశ్వరరావుగారు ఒక ఉత్తరమున వ్రాసిరి.

ఇట్టి వాఙ్మయమూర్తిని భగవంతుడు ఆయురారోగ్యము లతో కాపాడుగాత!



డా॥ ఎస్. గంగప్ప

జననము: 8-11-1936

తల్లి: శ్రీమతి కృష్ణమ్మ

తండ్రి: వెంకటప్ప

జన్మస్థలము:

నల్లగొండ్రాయనిపల్లి

పెనుకొండ తా॥

అనంతపురం జిల్లా.

జనపదములో పుట్టిపెరిగిన గంగప్ప గారికి బాల్యము నుండియే జానపద గీతములపై ఒక ప్రత్యేకమైన అభిమాన మేర్పడినది. అందునా రాయలసీమ రైతుల, కూలీల కష్టనష్ట ములను బాగుగా తెలుసుకొన్న సామాన్య రైతు కుటుంబీకుడు గంగప్ప. పెనుకొండ చుట్టుముట్టుగల పల్లెలలో జానపదులు పాడుకొను కపిల పాటలను, విసర్రాయి పాటలను, వడ్లు దంచు పాటలను, కలుపులు, కోతలప్పుడు పాడు పాటలను చిన్నతనము నుండియే ఆసక్తిగా వింటూ సేకరించు ఉత్సాహమును కలిగి వుండిరి. ఈ జానపద విజ్ఞాన మొక అపారమైన ఖని యని భావించి త్రివ్వితీయు ప్రయత్నములో మునిగితేలిన శ్రామికులు వీరు. "కష్టేఫలీ అని నమ్మి ఆరుగాలమూ పాటుపడుతున్న కృషి పండితు డీవడు".

గంగప్పగారి ప్రాథమిక విద్య సోమందేపల్లి లోను,

ఉన్నతపాఠశాల విద్యాభ్యాసము పెనుకొండలోను, ముగించి తదుపరి అనంతపురం ప్రభుత్వ కళాశాలలో బి. ఏ ఆనర్సు; ఆంధ్ర విశ్వకళా పరిషత్తు, వాల్తేరులో ఎం. ఏ., పూర్తి గావించిరి. ఆనర్సులో వీరి అభిమాన విషయము భాషాశాస్త్రము. పూనా వేసవి పాఠశాలలో భాషా శాస్త్రాధ్యయన ప్రొఫెసర్ లీలిస్కర్ వంటి మహా విద్వాంసుల సన్నిధిలో భాషాధ్యయనము గావించారు. కాని వీరికి సాహిత్యము పైననే అభిమానము మెండు. అందులోనే అధికకృషి గావించిరి. కళాశాల అధ్యాపక వృత్తి కొనసాగించుచూ ప్రవేటుగా పరిశోధన విద్యార్థిగా "శ్రీ కోలాచలం శ్రీనివాసరావు-నాటక సాహిత్య సమాలోచనము" అను అంశముపై పరిశోధన గావించి "డాక్టరేట్" సంపాదించిరి.

తదుపరి వీరి మరియొక పరిశోధనా గ్రంథము "క్షేత్రయ్య పద సాహిత్యము". దీనికి ఆం. ప్ర. సాహిత్య అకాడమీ వారి అవార్డు కూడా లభించినది. "పదకవితా సమీక్షాక్షేత్రంలో చాల కాలంగా పరిశ్రమిస్తున్న వ్యవసాయికులలో డాక్టర్ ఎస్. గంగప్ప మొదటి మునుముకు చెందిన వ్యక్తి" గా ఆచార్య తూమాటి దోణప్పగారు అభివర్ణించిరి. క్షేత్రయ్య తరువాత "వీరు సారంగపాణి పదసాహిత్యము"ను వెలుగులోనికి దెచ్చిరి. ప్రసిద్ధిగాంచిన వాగ్గేయకారులలో సారంగపాణి కూడా ఒకడు. ఇతడు చిత్తూరు జిల్లాకు చెందిన కార్వేటినగర సంస్థానమున నుండినవాడు.

అన్నమయ్య, క్షేత్రయ్యలవలె జగమెరిగినవాడు కాడు. ఒక అజ్ఞాత వాగ్గేయకారు డతడు. కార్వేటి నగరములోని ఒక సాహితీ సంస్థ ఆ వాగ్గేయకారుని పదసాహిత్యమును వ్యాప్తి లోనికి దెచ్చుటకు పూనుకొన్నది. ఆ సమయములోనే గంగప్ప గారి క్షేత్రయ్య పదసాహిత్య గ్రంథము వెలువడుట జరిగినది. ఈ విషయం తెలుసుకొనిన శ్రీ విశ్వనాథ అరుణాచలం గారు గంగప్పగారి నీవిషయముగా ప్రస్తావించిరి. గంగప్పగారు పట్టిన పట్టు విడువక సారంగపాణి పదసాహిత్యమును పరిశోధన గావించి ఒక గ్రంథముగా వెలువరించిరి. ఆయన కృషి ఫలిత ముగా "సారంగపాణి పదసాహిత్యము" వెలుగు చూచు భాగ్య మబ్బినది.

పై రెండు పదసాహిత్యముల కృషి ఫలితముగా భారత ప్రభుత్వ-కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలశాఖ వీరికి "సీనియర్ ఫెలోషిప్" ఇచ్చి "అన్నమాచార్యులు - ఇతర ప్రముఖ వాగ్గేయ కారులు-తులనాత్మక అధ్యయనం" అను అంశముపై పరిశోధన గావించుటకు ఏర్పాటు చేయబడిన 15 మంది భారతీయ పరి శోధకులలో వీరికి మూడవస్థాన మిచ్చిరి. ఈ గ్రంథము వెలు వడిన ఒక అమూల్య గ్రంథముగా పరిగణింపబడగలదు.

ఈ ముగ్గురు వాగ్గేయకారుల పదసాహిత్యమును పరిశోధన గావించిన అనుభవజ్ఞులగుటచే వీరు "తెలుగులో పద కవిత"

అనబడు గ్రంథమును రచించి 1980 - 81లో ఆం.ప్ర. సాహిత్య అకాడమీ అవార్డు పొందిరి. ఇందు వివిధ భారతీయ భాషలలో పద కవిత ఆవిర్భావము - వికాసము; పదకవుల చరిత్ర - పద కవితావైభవం - పదకవితలోని భాషా విశేషాలు - పద కవితలో శృంగార, భక్తి నీతి వైరాగ్యములు, మున్నగు అనేక విషయములను గూర్చి విపులముగా చర్చించిన గ్రంథమిది. తెలుగు సాహిత్యములో ఈ పరిశోధనా గ్రంథమునకు ఒక ఉన్నత స్థానము లభించగలదు.

పదసాహిత్యము తరువాత వీరి జానపద సాహిత్య కృషి మెచ్చదగిన అంశము. వీరు సేకరించిన "తెలుగుదేశపు జానపద గీతాల"ను ఆం.ప్ర. సమాచార పౌర సంబంధశాఖవారు ప్రచురణగావించిరి. తదుపరి జానపదులు పాడుకొనే రామాయణ సంబంధ గేయముల నన్నింటిని సేకరించి "జానపద గేయ రామాయణ"ముగా ముద్రించిరి. జానపద సాహిత్యముపై వీరు పెక్కు వ్యాసములు వ్రాసి "జాతికి ప్రతిబింబం జానపద సాహిత్యం" పేర పుస్తక రూపములో ముద్రించిరి.

పద-జానపద సాహిత్యకృషి తరువాత తెలుగు ప్రబంధ, ఆధునిక భాషా సాహిత్యములపై పెక్కు విమర్శనాత్మకమైన వ్యాసములను రచించిరి. వాటిని కొన్ని వ్యాస సంపుటములుగా ముద్రించిరి. ఆ వ్యాస సంపుటము లివి-సాహిత్యసుధ, ఉన్నవ

లక్ష్మీనారాయణ సాహిత్య జీవితం, సాహిత్యోపన్యాసములు, భాషా వ్యాసాలు; తెలుగు నాటకం - ఆరంభం నుండి అబ్సర్డు నాటకాల దాక. విశ్వనాథవారి వేయి పడగలు - విశ్లేషణాత్మక విమర్శ- శ్రీ విశ్వనాథవారి నాటకాలు - విశ్లేషణ: ఈ విమర్శనాత్మక వ్యాసావళులేకాక చిన్నకథలు, కవితలు; నాటికలు; బాలసాహిత్యము, 8; 9, 10 తరగతులకు తెలుగు ఉపవాచకములు, నవలలు, వయోజనవిద్య పుస్తకములు మిక్కుటముగా ప్రచురించిరి. వీరు తెలుగు సాహిత్యములో చేపట్టని ప్రక్రియలేదు. ఈయన విరామ మెరుగని రచయిత. ఈయన చేపట్టినది సాహిత్యవ్రతం. "తన ప్రతి రచన వెలుగులోనికి రావాలని ఉబలాటపడే స్వభావం వీరిది."

"ఒక రకంగా చూస్తే మన గంగప్పకూడా వ్యసనపరుడని చెప్పక తప్పదు. నిరంతర గవేషణా ప్రియత్వము, సత్యతత్వావిష్కరణ తత్పరత్వము, సద్గ్రంథ ప్రచురణ చణత్వము డా॥ గంగప్పను ముప్పేటగా ముసురుకొన్న వ్యసనాలు: ఇవి ఎవరికీ హాని చేకూర్చక పోవడమేగాక ఒక జాతి సంస్కృతి ప్రగతికి కొంతలో కొంత దోహదం చేస్తాయి కాబట్టి వీటిని సద్వ్యసనాల క్రింద జమకట్టుకోక తీరదు." అని శ్రీ తూమాటి దొణప్పగారు వక్కాణించారు.

ప్రస్తుతము ఎస్. గంగప్పగారు, గుంటూరు జిల్లాలోని

నాగార్జున విశ్వవిద్యాలయ తెలుగుశాఖలో తెలుగు రీడర్‌గా పని చేయుచున్నారు. వీరు రాష్ట్రంలోను; జాతీయ స్థాయిలోను; అంతర్జాతీయ స్థాయిలోను జరిగిన పెక్కు సదస్సులు; గోష్ఠులు, చర్చలలో అనేక పర్యాయములు ప్రభుత్వపక్షాన, విశ్వవిద్యాలయం పక్షాన పాల్గొని అనేక అంశములు చర్చలు జరిపి; పండిత ప్రశంసలకు పాత్రులైరి:

డా॥ గంగప్పగారు తమ ఐదుపదుల వయస్సుకె ఎనలేని సాహిత్యకృషి గావించి; ఆంధ్రదేశమున వాసికెక్కిరి: వీరింకనూ శతాధిక గ్రంథకర్తలై సహస్రాధిక పరిశోధనా విద్యార్థులు వీరి చేతిమీదుగా తయారు కాగలరని ఆశింతముగాక!



తిరుమల రామచంద్ర

జననము: 17-6-1913

తల్లి: శ్రీమతి జానకమ్మ

తండ్రి: శ్రీ శేషాచార్యులు

జన్మస్థలము: రాఘవమ్మపల్లె, ధర్మవరం తాలూకా అనంతపురం జిల్లా:

సుప్రసిద్ధ పత్రికా రచయితలు, రచయిత, భాషాచరిత్ర పరిశోధకులైన శ్రీ తిరుమల రామచంద్రగారి పేరెరుగని తెలుగు వారుండరు. ఆంధ్ర సచిత్ర వారపత్రిక పాఠకులకు వీరు మరీ చేరువైనవారు. ఆ పత్రికలోని "హైదరాబాదు నోట్‌బుక్" శీర్షికకు వివిధ విషయములు వ్రాయుచున్నారు. ఆ శీర్షిక కొసలో వారు వ్రాయు "ఉపశ్రుతి" కొందరికి చురుకు ముట్టించును. అంతటి నిశితమైన కలం వారిది. తెలుగు పత్రికా రంగములో వీరికి మంచిపేరు, గౌరవస్థానము కలదు. కాన్పూర్ డెయిలీ టెలిగ్రాఫ్ - తెలంగాణా - మీజాన్ తెలుగు దినపత్రిక-హైదరాబాద్, ఆంధ్రప్రభ-భారతి - ఆంధ్రపత్రిక - ఆంధ్రభూమి-హిందూస్తాన్ సమాచార్ మొదలగు వివిధ పత్రికలలో సహాయ సంపాదకులుగా పనిచేసి పేరు గడించిరి.

వీరు బహు భాషా కోవిదులు. తెలుగు, సంస్కృతం, ప్రాకృతం, హిందీ, కన్నడము, తమిళము, ఇంగ్లీషు, పంజాబీ (కొద్దిగా) వీరికి తెలిసిన భాషలు. ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమున వీరు సహాయ పండితులుగా పనిచేయుటవలన వీరివ్వి భాషలు నేర్వ గలిగిరి. అట్లే శాసన, చరిత్ర, భాషాదులలో పరిశోధనాభిరుచి ఏర్పడినది.

రామచంద్రగారి తాతగారైన తిరుమల తాడిమర్రి వరసింహాచార్యులు అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకా తాడిమర్రి

సామంతరాజులకు గురువులుగా వ్యవహరించిరి. వీరు విజయ నగర సార్వభౌముల గురువైన తాతాచార్యుల వంశమువారు. విజయనగర రాజుల తదనంతరం వీరు సామంతరాజుల నాశ్ర యించిరి. కాలక్రమేణ ఆ సామంతరాజ్యము లన్నియు ఆంగ్లే యులవశమై పోవుటచే గురువుల వంశస్థులు దిక్కుకొకరైరి. అప్పుడు మన రామచంద్రగారి తాతగారైన తిరుమల తాడిమర్రి నరసింహాచార్యులు తమ మేనమామగారైన ప్రబంధం శ్రీనివాసా చార్యుల ఊరైన బళ్ళారి జిల్లాలోని కమలాపురం చేరిరి. తండ్రి గారి కాలమున వీరు వైభవముగా జీవించిరి. వారి కాలమున తిలక్ మహరాజ్, మహాత్మాగాంధీ గారల జాతీయోద్యమము మిక్కుటముగా వ్యాపించుటచే వారందరు శుద్ధ ఖద్దరు వస్త్ర ధారులై జాతీయవాదులుగా వెలిగిరి. ఆ వాతావరణమున మన తిరుమల రామచంద్రగారు పెరుగుటచే వారి మనసులోకూడ జాతీయ భావములు చిగురించినవి.

1932 లో వీరు తిరుపతి సంస్కృత కళాశాలలో చదువు సాగించునప్పుడు విదేశీ వస్త్ర బహిష్కరణ, ఖద్దరుధారణ మొద లైన కాంగ్రెస్సు కార్యక్రమములు నిర్వహించుచూ, తిరుపతి పట్టణ కాంగ్రెస్సు సంఘపు కార్యదర్శిగా కొన్నేళ్లు వ్యవహరించిరి. తిరుపతిలో జరిగిన ఒక జాతీయోద్యమ సంఘటన వీరి జీవిత మున అనేక మార్పులను తెచ్చినది. తిరుపతి గోవిందరాజస్వామి

మహాద్వార గోపురపు నాల్గవ అంతస్థుపైన ఈయన కాంగ్రెస్సు త్రివర్ణ పతాకము ఎగురవేసినందుకు, నిషిద్ధ కరపత్రములు పంచి పెట్టినందుకు పోలీసులు వీరిని అరెస్టు చేసిరి. చంద్రగిరి కోర్టువారు ఆయనకు సంవత్సర కఠిన కారాగారవాస శిక్షను విధించిరి. ఆయన రాయవేలూరు, తిరుచినాపల్లి జైళ్ళలో ఉన్నప్పుడు లాహోరు కుట్ర కేసు నిందితులైన భగతసింగ్ సహచరులైన బట్కేశ్వర్ దత్, కుందన్‌లాల్‌గుప్త మున్నగు విప్లవ కారులతోను, విప్లవ నాయకులైన సురేంద్రమోహన్ ఘోష్, జీవన్‌లాల్ చటర్జీ, ప్రతూల్‌చంద్ర గంగూలీ మున్నగు వారితోను వివిధ ప్రాంతముల నాయకులతోను పరిచయము లేర్పడినవి. దాని పరిణామముగా 1934 లో మద్రాసు కుట్ర కేసులో ముద్దాయిగా లెక్కింపబడిరి. వయస్సులో చిన్నవారు కావడం, కేసుతో ఎక్కువ సంబంధం లేకపోవడంవల్ల వీరిని విడుదల చేసిరి. కానీ పోలీసులు చాల సంవత్సరములు వీరిని వెన్నాడుచుండిరి.

రాజకీయ దశ ముగిసిన తరువాత నెల్లూరు, మద్రాసు మైలాపూర్ వేద సంస్కృత కళాశాలలో కొంతకాలము చదివి, తండ్రిగారి హితవు మేరకు భాషా సారస్వత సేవలు, రాజకీయముల కన్నా ముఖ్యమైనవేనవి, అదికూడా దేశసేవ వంటిదేనని నమ్మి రామచంద్రగారు జీవిక కొరకు మద్రాసు ప్రాచ్య లిఖిత

భాండాగారములో లేఖకులుగా చేరిరి. అక్కడ శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి కడ అసిస్టెంట్ పండితుడుగా పనిచేసిరి.

ఇక వీరి సాహిత్య కృషిని గూర్చి కొంత ముచ్చటింతము. వీరు రచించిన పుస్తకముల పట్టికను పరిశీలించిన వీరు గొప్ప రచయితలు, చక్కటి బహుభాషా అనువాదకులు, పరిశోధకులు, వ్యాస కర్తలు, నవలాకారులు, వైద్య గ్రంథకర్తలు, పెక్కు ప్రత్యేక సంచికలకు సంపాదకులు, గ్రంథ సమీక్షకులు, పీఠికా కర్తలుగా వెలుగొందిన విద్వన్మణులని చెప్పవచ్చును. సంస్కృతములో వీరు సత్యాగ్రహవిజయం, సుమతి శతకం అను కృతులను రచించిరి. హిందువుల పండుగలు-పర్వములు; మనలిపి పుట్టు పూర్వోత్తరాలు; గాథాసప్తశతిలో తెలుగుపదాలు; నుడి-నానుడి; సాహితీ సుగతుని స్వగతం; ప్రాచీనాంధ్ర గాథలు-మొదలగునవి వీరి పరిశోధన, భాషాశాస్త్ర, వ్యాస రచనలకు నిదర్శనలు.


కన్నడనవల శాంతల; తమిళం నుండి రాజాజీ కథలు; ఆంగ్లంనుండి భక్తి వేదాంతస్వామి కమింగ్ బ్యాక్; హిందీ నుండి డాక్టర్ సుశీలానయ్యర్ గారి గాంధీజీ కారాగారగాథ; సంస్కృతం నుండి క్షేమేంద్రుని బృహత్కథామంజరి; ప్రాకృతం నుండి లీలావతికావ్యం; వీరి అనువాద ప్రతిభకు అణిముత్యాలు. వీర గాథలు, దక్షిణాంధ్ర వీరులు, కాటమరాజుకథ, శశాంకవతి,

(నవల) ధర్మదీక్ష వీరి స్వతంత్ర తెనుగు రచనలలో ఎన్నదగినవి. తెలుగు విజ్ఞాన సర్వస్వంలోని లలితకళా సంపుటి వీరి ప్రత్యేక సంచికల సంపాదకత్వ కృషికి మేల్బంతి.

బహు భాషాకోవిదులు, బహు గ్రంథకర్తలైన శ్రీరామచంద్రగారు బహు సన్మానగ్రహీతులు కూడాను. వీరు పత్రకార శిరోమణి, మహా మహోపాధ్యాయ, కళాసరస్వతి అను బిరుదములచేత గౌరవింపబడిరి. ప్రథమ, ద్వితీయ ప్రపంచ మహా సభలలోను, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ అసోసియేషన్ వారిచేతను సన్మాన, సత్కారములు పొందిరి. ఆం. ప్ర. బాలల అకాడమీకి కార్యదర్శిగాను, ప్రాకృత అకాడమీకి అధ్యక్షులుగాను వ్యవహరించు చున్నారు.

స్వాతంత్ర్య సమరయోధులుగా, స్వతంత్ర సైనిక్ సమ్మాన్ పెన్షన్, మరియు భాషాసాహిత్య సేవకులుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము నుండి పెన్షన్ పొందుతూ, కొడుకులూ, కూతుళ్ళూ కలిగి హైదరాబాదులో హాయిగా వుంటున్నారు.

ఈ బహుభాషా కోవిదులు బహుకాలము ఆయురారోగ్య భాగ్యములతో వర్ధిల్లుగాక!



కె. సుబ్బరామప్ప

జననము : 23-9-1913

తల్లి:
శ్రీమతి రంగమ్మ

తండ్రి :
శ్రీ కె. సుబ్బరామప్ప

జన్మస్థలం:
మేడాపురం.
ధర్మవరం తా॥
అనంతపురం జిల్లా

తెలుగు కన్నడ భాషలకు ఏక లిపి అవసరమని తలచి అందుకొరకు ద్విభాషా నిఘంటువును తయారుచేయుటలో అహోరాత్రులు కృషి చేసినవారు, తెలుగు కన్నడ సాహితీ దురంధరులు శ్రీ కె. సుబ్బరాయప్పగారు. అందుకుగాను ఆంధ్ర కర్ణాటక రాష్ట్రప్రభుత్వములు, కన్నడ సాహిత్య పరిషత్తు అంగీకరించడం, సహకార మందించడం జరిగింది. అప్పటి తెలుగు ప్రభుత్వం నియమించిన "తెలుగు లిపి సంస్కరణ"లో సుబ్బరామప్పగారు ఒక సభ్యులుగా పనిచేసిరి. అట్లే కర్ణాటక ప్రభుత్వంవారు కూడ వీరిని తమ రాష్ట్రములో తెలుగు పాఠ్య పుస్తకాలు వ్రాయుటకు నియమించిన కమిటీకి అధ్యక్షులుగా చేసిరి.

శ్రీ సుబ్బరామప్ప మదనపల్లిలోని బిసెంట్ థియసాఫికల్ హైస్కూలు, కళాశాలల్లో చదివి, విద్వాన్, ఎం ఎ. బి.ఇడి; బి.ఓ.ఎల్, పరీక్షలలో ఉత్తీర్ణులైరి. మదనపల్లెలో తాను చదివిన హైస్కూల్, కళాశాలలోనే వీరు అసిస్టెంట్ హెడ్ మాష్టరుగా, తెలుగు లెక్చరర్‌గా పనిచేశారు.

1949 జనవరి నాటికి మైసూరు విశ్వ విద్యాలయములో తెలుగుభాషా శాఖాధ్యక్షులుగా చేరిరి. మైసూరు చేరిన పిమ్మట వీరు కన్నడభాషా సాహిత్యమును బాగుగా అభ్యసించి తెలుగు, కన్నడ భాషా సాహిత్యములలోని గొప్పదనములను వ్యాసముల ద్వారా తెలియజేయుచుండిరి. వీరి వ్యాసములు ఇంగ్లీషు, కన్నడ, తెలుగుపత్రికలలో అనేకములు ప్రకటితమైనవి. 1975 నవంబరు 6వ తేది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో వీరు వ్రాసిన "On Kannada Telugu Harmony" అనబడు వ్యాసములో తెలుగుకవులు కొందరు కన్నడరాజ్యంలో ఏ విధంగా నివసించి ఆ భాషను నేర్చి గ్రంథములను వ్రాయగలిగిరో సోదాహరణముగా వివరించిరి.

నన్నయ నుండి వేమన వరకుగల తెలుగుకవుల రచనల నుండి తెలుగు పద్యములను సేకరించి వీరు "తెలుగు పాఠగళు" అనబడు తెలుగు పద్య సంకలనమును తయారుచేసిరి. దీనిని మైసూరు విశ్వ విద్యాలయ ప్రచురణశాఖవారు ప్రకటించి, వీరిని


గౌరవించిరి. తెలుగు సాహిత్యమును పరిచయము చేసికొనగోరు కన్నడిగులకిది మిక్కిలి యుపయుక్తమగు రీతిగా, అచ్చతెలుగు పదములకు కన్నడ అర్థములను, కన్నడభాషలోనే ఉపోద్ఘాత మును వ్రాసి ముద్రించిరి.

మైసూరు యూనివర్శిటీ నుండి పరిశోధనా పట్టమును పొందగోరు సాహిత్య విద్యార్థులకు వీరు పర్యవేక్షకులుగా నుండిరి. వీరి పర్యవేక్షణలో పరిశోధన చేసి పి.హెచ్‌డి., పట్ట ణమును పొందినవారిలో శ్రీ నండూరు రామకృష్ణమాచార్యులు- తిరుపతి, గారొకరు. ప్రొఫెసర్ సుబ్బరామప్పగారు ఆంధ్ర, ఉస్మానియా, వేంకటేశ్వర, మద్రాసు, విశ్వవిద్యాలయములలో తెలుగుభాషకు సంబంధించిన బోర్డు ఆఫ్ స్టడీస్ మొదలైన వానిలో సభ్యులుగా పనిచేసిరి.

తెలుగు విజ్ఞాన సర్వస్వములోని విశ్వసాహితి VI వ సంపుటములో వీరు వ్రాసిన "కన్నడ రత్నత్రయము" (పంప, పొన్న, రన్నకవులు) అను వ్యాసము ప్రకటింపబడినది. అట్లే కన్నడ విజ్ఞాన సర్వస్వమునకు "తెలుగు ఛందస్సు"ను గూర్చి కన్నడభాషలో తులనాత్మక వ్యాసము వ్రాసిరి. మైసూరు ప్రభు త్వం ప్రకటించిన "Karnataka through the Ages" అనే ఇంగ్లీషు సంకలన ఉద్గ్రంథమునకు వీరు "Telugu Lite- rature in Karnataka" అను పరిశోధనాత్మక వ్యాసము

వ్రాసిరి. హైదరాబాద్‌లో ప్రకటింపబడిన సంగ్రహ ఆంధ్ర విజ్ఞానకోశం 3వ సంపుటమున వీరి "కోలారు జిల్లా" అను వ్యాసము ప్రకటింపబడినది.

ప్రొఫెసర్ సుబ్బరామప్పగారు జీవితాంతము తెలుగు కన్నడములకు ఏక లిపిని చేయు బృహత్కార్యములోనే నిమగ్నులై, కన్నడ, తెలుగువారల మధుర బాంధవ్యములకు వారధి గట్టిన వారైరి. తెలుగు, కన్నడ ప్రజల హృదయాంతరాళములలో శాశ్వితులైరి.



శ్రీ చొక్కావు నారాయణస్వామి

జననము : 4-4-1939

తల్లి: శ్రీమతి ఓబలాంబ

తండ్రి : శ్రీ కంబయ్య

జన్మస్థలం : యు. కొత్తపల్లి డోన్ తా॥ కర్నూలు జిల్లా

అది 1956 వ సంవత్సరం. అనంతపురం కళాశాలకు శ్రీ శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు క్రొత్తగా ప్రిన్సిపాల్‌గా

నియమితులైరి. వారు సైన్సులో డాక్టరేట్ పొందినను, పల్లె పదాలు మొదలు పరమాణువు వరకు క్షుణ్ణంగా విషయ పరిజ్ఞానముగల వ్యక్తి. ఆయనగారు ఆ సంవత్సరం కళాశాల మ్యాగజైనుకు విద్యార్థులనుండి వ్యాసములు సేకరించి, వచ్చిన వ్యాసములను పరిశీలించిరి. అందులో ఒక విద్యార్థి జానపద సాహిత్యమును గూర్చి వ్రాసిన వ్యాసము అమితంగా ఆయన్ని ఆకర్షించింది. ఆ విద్యార్థి ని పిలిచి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఆ విద్యార్థికి జానపద సాహిత్యంపై గల మక్కువను గ్రహించి, జానపద పాటలను సేకరింపు మని ప్రోత్సహించిరి. ఆనాటి నుండి వారిరువురు సాహితీ మిత్రులైరి. ప్రతి దినం ఆ విద్యార్థి ప్రిన్సిపాల్‌గారి ఇంటివద్దకు వెళ్ళి జానపద గేయాలను గూర్చి, లేపాక్షి, తాడిపత్రి దేవాలయముల శిల్పములను గూర్చి చర్చించుకొనేవారు. ఇంతకూ ఆ విద్యార్థి ఎవరు? ఎవరూ కాదు. ఆ విద్యార్థి చొక్కపు నారాయణస్వామే నని వేరుగా జెప్ప పనిలేదు.

పూవు పుట్టగనే పరిమళించునన్నట్లు నారాయణస్వామి చొక్కపు వంశములో పుట్టిన నాటినుండే సాహితీ పరీమళములు గుభాళించినవి. ప్రాథమిక విద్యాభ్యాసమును స్వగ్రామములో ముగించి, ఉన్నత విద్యను డోన్‌లో జరుపుతున్నప్పుడు వీరు వీరి మామగారైన ఆలాసుంకన్నగారి సమక్షములో ఉండడం

జరిగింది. అక్కడి సాధు సాంగత్యము, వేదాంత చర్చలు, వీరిని ఆధ్యాత్మిక దృష్టిలోనికి మరల్చింది. అప్పుడే ప్రాచీన తాళపత్ర గ్రంథ సేకరణపై విశేషమైన అభిరుచి ఏర్పడింది. దొరికిన ప్రతి తాళపత్ర గ్రంథమును, వ్రాతప్రతులను సేకరించి భద్రపరచడం మొదలుపెట్టిరి. రాను రాను వారి నిలయం "సరస్వతీ నిలయం" గా మారింది.

వీరి తాళపత్ర గ్రంథసేకరణ కృషినిగూర్చి కీ॥ శే॥ కళా ప్రపూర్ణ నిడదవోలు వేంకటరావుగారి వంటి పరిశోధన కర్తలు తమ అమూల్యాభిప్రాయముల నిట్లు తెలిపిరి. "శ్రీ నారాయణ స్వామి గారైదువందలకుపైగా నమూల్యములగు తెలుగు తాళ పత్రములను, వ్రాత ప్రతులను సేకరించిరి. వారి గ్రంథ సంచ యమున నెట్టి యద్భుతపు కబ్బములున్నవో తెలుపుటకు ఒక ఉదాహరణము చూపుచున్నాను. ఇప్పటికి నాల్గేండ్ల క్రిందట 1950లో మద్రాసు విశ్వవిద్యాలయ పక్షమున తెలుగు కవుల చరిత్ర అను గ్రంథమును ప్రకటించినారు. అందు "విష్ణు వర్ధన మంత్రి - బృహజ్జాతకము" అను ప్రథమ తెలుగు వచన కృతిని గూర్చి ప్రస్తావించితిని. ఇంతవరకు సాహిత్యలోక మెరుగని ఈ కృతికి ప్రత్యంతరము లభింపగలదను నాశయును నాకు లేకపోయినది. ఇట్లుండ ఆంధ్ర ప్రభుత్వమువారి ఆర్షశాఖ (State Archives) వారిచే నియమితుడనై మహబూబ్

నగరమున శ్రీ నారాయణస్వామి తాళపత్ర గ్రంథములు పరిశీలించుచుండగా "విష్ణువర్ధనమంత్రి - బృహజ్జాతకము" అన్న గ్రంథమును జూచి నేనత్యంతాశ్చర్య భరితుడైనాను. దీనికి ప్రత్యంతరము ఒక తంజావూరు పుస్తక భాండాగారములో తప్ప వేరొకచోట చూడలేదు. అదియును అసమగ్రము. నారాయణ స్వామిగారు ఇప్పటికనేక గ్రంథములను పరిష్కరించియున్నారు.

వాఙ్మయ పరిశోధకులకు ఎంతో యుపయోగకరముగా నుండునట్లుగా నొక సూచిక తయారుచేయుచున్నారు. ఇది సంపూర్ణముగా సిద్ధమైనచో నాంధ్రదేశమున విశ్వ విద్యాలయ పరిశోధకులకు సాహితీ వేత్తలకు వాఙ్మయ చరిత్రకారులకు నత్యంత ఉపయుక్తమగును. ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమువారు, సాహిత్య పరిశోధక సంస్థలు, విశ్వవిద్యాలయములు చేయవలసిన పనిని శ్రీ నారాయణస్వామిగారు అందును సాహిత్యేతరోద్యోగమున నున్నవారు చేయుట ఎంతో యభినందనీయము."

శ్రీ నారాయణస్వామి పరిష్కరించిన, ప్రచురించిన తాళపత్ర గ్రంథములు వరుసగా యివి. 1) బ్రహ్మాండ వచనము:- దీని కర్త మాచనామాత్యుడు. చతుర్వేదములను, అష్టాదశ పురాణములను పరిశీలించి సారంబును తీసి ఈ బ్రహ్మాండ వచనము చేసెను. ఇదొక సంక్షిప్త విజ్ఞాన సర్వస్వము. మానవుని

సందేహ నివృత్తికోశము. ఈ వచన కృతిని పరిష్కరించుటకు నారాయణస్వామిగారు మద్రాసు, తిరుపతి, తంజావూరు ప్రాచ్య లిఖిత తాళపత్ర భాండాగారముల అధిపతులతో సంప్రదించి ఆ గ్రంథములను క్షుణ్ణముగా పరిశీలించి, ఒక తీరుకు తెచ్చిన విషయము సర్వదా శ్లాఘనీయము. ఇందు వీరు చక్కటి పీఠికను కూడా వ్రాసిరి.

తరువాత 2) శఠకోప విన్నపములు - వీరు తాళపత్రముల నుండి పరిష్కరించిన గ్రంథము. శఠకోపముని ఆళ్వార్లలో కెడు ప్రసిద్ధుడు. అతని విన్నపములివి. తరువాతి గ్రంథము 3) సభాపతి వచనములు. శ్రీ నారాయణస్వామి సంకలనము చేసిన గ్రంథములలో "ఆంధ్ర వచన మణిభూషణము" ఒకటి. ఇది ఆంధ్ర సాహిత్య లోకమునకే నూతనమైనది. ఈ గ్రంథము ప్రజలను ఆధ్యాత్మిక దృష్టి వైపుకు మరల్చును.

ఇంకను వీరి అముద్రిత రచనలు కొన్ని గలవు. 1. శ్రీ లక్ష్మీనారాయణ నానార్థ నిఘంటువు 2) పాలమూరి మండల రాజకవులు 3) వర్ధమానపురం 4) వైద్యశతశ్లోకి 5) నారాయణస్వామి గేయాలు 6) నిత్యానుసంధానము 7) విష్ణువర్ధనమంత్రి రచించిన "బృహజ్జాతకము"ను పరిష్కరించిటీకతో ప్రచురించనున్నారు. ఒకవైపు తాళపత్ర గ్రంథ పరిశోధన, మరోవైపు జానపద గేయముల సేకరణ రెండునూ అడ్డులేక

చొక్కపువారు సాగించినారు. వీరు వెలువరించిన జానపద గేయ సంకలనము "తేనెసోనలు". ఇందు 23 గేయములు కలవు. అన్నియు వివిధ వైవిధ్యములుగల జానపద గేయములే. ఈ కృతి ఆపాత మధురోద్యమానికి నాంది. 1966లో ఈ గేయములను ముద్రింపదలచి, ప్రెస్సువారికి డబ్బుకూడా చెల్లించిన సమయములో శ్రీ అనంతాచారి అను ఒక కవి మిత్రుడు కోరిక మేరకు ఆయన వ్రాసిన "శ్రీ వేంకటేశ్వర శతకము"ను పై కృతికి మారుగా ముద్రించుట జరిగినదని వ్రాసుకొన్నారు. ఈ చొక్కపు వారు కృతికర్తలే కాదు. కృతిభర్తలు కూడనని నిరూపించు కొన్నారు. అట్లే డా॥ వల్లపురెడ్డి బుచ్చారెడ్డిగారి "ముక్త గీతికల"ను కూడా వీరు 1972లో ముద్రించి కవిపోషకులైరి. ఆగిపోయిన వీరి తేనెసోనలు 1974లో వెలుగులోనికి వచ్చినది.

జీవిత బీమా సంస్థలో వీరు విస్తరణాధికారిగా పని చేయుచూ ఆ సంస్థకుకూడ తమ సాహిత్యసేవను నాటకముల ద్వారా అందించిరి. జీవితబీమా కథ; పరివర్తన, నాటికలు జీవితబీమా అంశముపై వ్రాయబడిన రచనలే. నాటకములలో నటించుట కూడా వీరికి చిన్నతనము నుండి వున్న అభిరుచి. ధ్రువోపాఖ్యానములో వీరు "సురుచి" స్త్రీ పాత్రను, శ్రీకృష్ణ రాయబారములో శ్రీకృష్ణుని పాత్రను, కనువిప్పు, యోగక్షేమం మొదలగు సాంఘిక నాటకములలో నాయక పాత్రలను వేసిరి.

ఇక వీరి సాహిత్య, సాంస్కృతిక, విద్య, వైద్య, గ్రంథాలయ, దేవాలయ మొదలగు వివిధ సంస్థల నిర్వహణా కార్యక్రమములను గూర్చి విపులీకరించుటకు వేయినాల్కల ఆదిశేషునికైనను వీలుకాదు. 1957-61 సం॥ మధ్య ద్రోణాచలంలో ఒక ఉచిత హోమియోపతి వైద్యశాలను స్థాపించి బీదలకు సేవ చేసిరి. 1964లో మహబూబ్‌నగరమునందు "వివేకానంద విద్యా కేంద్రము"ను స్థాపించి విద్యావ్యాప్తిని, మహబూబ్‌నగర్ తాలూకాలోగల రామకొండలో దేవాలయ నిర్మాణము, 1976లో వరంగల్ సాహితీ సమితి స్థాపన, "చొక్కపువారి సరస్వతీ నిలయం" (గ్రంథాలయం) భారత సేవక సమాజ్ కన్వీనర్‌గా, జీవ కారుణ్య సంఘమునకు గౌరవ కార్యదర్శిగా, వక్తగా, బహుముఖ కార్యకర్తలుగా వ్యవహరించుచున్నారు.

మంచి వ్యక్తిత్వము, మూర్తిమత్వము, సహృదయతలకు వీరు పెట్టినది పేరు. అందుకే విశదవోలువారు వీరిని గూర్చి యిట్లు ప్రస్తుతించిరి.

చొక్కపు రూపురేఖలును, చొక్కమునైన మనంబు మాటయున్
చొక్కపు చేతలెల్లకడు, చొక్కపు వర్తన మెంచి చూడగా
చొక్కమువై జనంబులను చొక్కగ జేయుటచేత నీతడున్
చొక్కపు వంగడంబునను శోభిలె గాదె యమోఘధీభ్యుడై

ఇంతటి యశోవంతులైన శ్రీ చొక్కపువారు జీవితభీమా

సంస్థలో కూడా మంచిపేరును సంపాదించుకొని, సాహితీసేవను వదలక, నిర్వహించుచూ, భార్యాపుత్ర సమేతులై ప్రస్తుతము కర్నూలునందు నివసించుచున్నారు. వీరికి భగవంతుడు ఆయు రారోగ్య భాగ్యములనిచ్చి వీరిచేత జీవితాంతము బహు విధము లైన సాహిత్య సేవలను చేయించుగాక!



శ్రీ శంకరంబాడి సుందరాచారి

జన్మస్థలము :
తిరుపతి, చిత్తూరు జిల్లా

నిర్యాణము ; 1977
ఏప్రిల్ 8వ తేది

ఆరుకోట్ల ఆంధ్రప్రజల శ్రవణ పేటికలలో రింగుమని మారుమ్రోగే విధముగా " మా తెనుగుతల్లికి మల్లెపూదండ "ను రచించి ఆమె కీర్తిని గానం చేయించిన కవివరేణ్యుడు మన శంకరంబాడి సుందరాచారి.

"శంకరంబాడి సుందరాచారి నేను" అని ఒకపరి అప్రయత్నంగా అతని నోటినుండి వెలువడింది. వాల్మీకి శోకమే శ్లోకమైనట్లు సుందరాచారి నోటినుండి జాలువారిన ఈ తియ్యటిమాట తెటతెనుగు ఛందస్సులో తేటగీతి పాదముగా అవతరించింది. "అయితే నేను తేటగీతి కవిని" అని మురిసిపోయాడు ఆయన. ఆ అప్రయత్న భావనలో ప్రభావితుడైన ఈ కవి ప్రయత్నపూర్వకముగా దాదాపు 15,000 తేటగీతికలను కడురమ్యంగా భావయుక్తంగా అలతి అలతి పదములతో, ఇంతవరకూ ఇంత చక్కగా తేటగీతికలను అల్లిన కవి లేడను విధంగా రచించి, తేటగీతి సుందరాచారిపొత్తుగా - సాహిత్యలోకములో పరిగణింపబడినాడు. అందుకే ఈ సుకవి తన "సుందర రామాయణ" కావ్యములో యిట్లు వ్రాసుకొన్నాడు.

ఆంధ్రుడనగ జెల్లు యక్కరంబులు నేర్చి
నంత, దీని జేత నందీ చదువ
వచ్చువంచు, సరళ పదముల మృదుశమో
నడకగూర్చి నడపినాడ నింతె.

ఈ సుందర రామాయణమును వీరు పూర్తిగా తేటగీతలందె వ్రాసి ఒక ఘనతను సాధించిరి. ఈ రామాయణము అచ్చులో వున్నప్పుడు కీ॥ శే॥ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు వీటి ప్రూఫులు దిద్దువనికి ఒప్పుకొనిరి. సుందరాచార్యులవారు

ఒకవైపు రచన, మరొకవైపు కావ్యముద్రణ సాగించు సమయమున, అనంతకృష్ణశర్మగారికి ఒక సందేహము కల్గి "అయ్యా! సుందరాచారీ! తాటకి భయంకర స్వరూపిణి. నీ తేటగీతుల్లో ఇముడుతుందా?" అని ప్రశ్నించారు. ఆయన దానినొక సవాలుగా స్వీకరించి తాటకినిట్లు ప్రవేశపెట్టిరి.

నల్లకొండల నుగ్గుగా నలగగొట్టి
చిమ్మ చీకటిలోగల చేవబిండి
కాళసర్పాల విసమెల్ల గలిపినూరి
కాచిపోసిన రూపుగా గానుపించె

పచ్చి రక్కసి, నడగొండవలెను, వదన
గహ్వరము విచ్చి మంటలుగ్రక్కి, నాల్క
సాచి, కనులెఱ్ఱవార, చేయూచికొనుచు
నురము ముందునకునెట్టి, శిరమునెత్తి

కాలభైరవియై వల్లకాటికెల్ల
దానె గాపరి యనమించి తలలమాల
మెడను ప్రేలాడ, ద్రాచులు పడగలెత్తి
భూషలయి మేన బుసకొట్టి, ఘోషలిడుచు

హారులు, తరులును, గిరులును, దరువులొకట
వెంట బడిమూగ, నడుగులు, పిడుగులగుచు

నిడిన చోట్లెల్ల గోతులు వడుచునుండ
నచటి కరుదెంచె వికటాట్టహాసముగను.

తేటతెనుగు తనమును పుణికి పుచ్చుకొని ఎదుట తారస పడిన సుందరాచారి తాటకిని చూచి, విమర్శకాగ్రేసర చక్రవర్తి రాళ్ళపల్లివారు ముక్కుమీద వేలేసుకొన్నారు. ఈ తేటగీతుల కవి ప్రతిభను తేటగీతిలోనే యిట్లు వారు ప్రస్తుతించినారు.

తేటగీతుల దెలుగు తీదీపు రుచుల
యూట, కొంకుల కొసరుల కాటుపడక
నమ్మి నమ్మించు, నిత్య బోధమ్ముదాకు
సారతరమిది సుందరాచారి కవిత!

"ప్రాచీన కావ్యములు ప్రతిభా సమన్వితములు. విశ్వ శ్రేయమునెంచి విరచింపబడినవి. వానిని మించి వెలయగల నూతన సృష్టి ప్రయత్నములు మరెవ్వరికేమోగాని, నా చేతగాని పని" అని సుందరాచారిగారు సవినయముగా చెప్పుకొనుచూ, తన మనోభావము నిట్లు ప్రకటించిరి.

వారును వీరుమెచ్చుకొను భంగినిగోరి, కలమ్ముబట్టి నే
నేరను వ్రాయకబ్బముల నిందు మనమ్మది పొంగి యేరులై
పారెడుదాక, యుక్తపదబంధము తీరెడుదాక, భావముల్
జారవు నాకలమ్మువిడి, సత్యము, నాహృదయమ్మె తెల్పితిన్

ఎంతటి సముచిత సమంజసమైన నిర్ణయమిది.

సుందరాచారి "బుద్ధగీత"పై శ్రీ పుట్టపర్తివారు 1954లో తమ అమూల్యాభిప్రాయము నిట్లు చెప్పిరి. "సుందరాచారి చక్కని భావకుడు. అతని కలము తీయనైనది. జీవితమును అనుభవించి, అనుభవించు చున్నాడు. ఇట్టివారి వ్రాతలలో సాహసము, తీక్షణత ప్రధాన గుణములు. అతడేరుకొన్న "గీతము" మట్టసమైనది. వ్యర్థ పదముల తిండిని జీర్ణించుకొనుటకు దానికి బృహత్కాయము లేదు. అతడు "గీత" ఛందస్సులో ఉదార రచనను నడుపుట సంతోషము"

ఈ బుద్ధగీతలో, బుద్ధుని జననము - గృహనిర్గమనము- దివ్యబోధ ప్రబోధములను పూవు-గాయ-పండు గా వర్గీకరించి బుద్ధుని కథను కడురమ్యముగా చిత్రించిరి. సంతతి లేక శుద్ధోధన మహారాజు, మాయాదేవి లొక్కరేకాదు, ప్రకృతియావత్తూ యువరాజు పుట్టలేదని కుందినది. దానిని కవిగారిట్లు వర్ణించినారు.

ఆలమందకు మేతల యాసలేదు
చిన్నదూడలు పొదుగుల చేరబోవు
కోకిలమ్మకు గొంతులో గొఱతతోచి
చివురుటాకులు చేదని చిన్నబోయె.

పై భావన అమోఘము కదా! ఆ ప్రక్కనే గౌతముడు

పుట్టినప్పుడెట్లు హర్షించినదో చూతము.

పసిడి కంకులు తొడిగెను పంటచేలు
పాడియావుల పొదుగులు పాలుగార్చె
పైట చెఱగుల తెరదోచి పాపలెల్ల
బట్టు బట్టిరి. తనివార బాలుచేవ.

చెన్నుని రథముపై నెక్కి వెడలిన గౌతముడు గాంచిన దృశ్యముల నిట్లు కవి వర్ణించినాడు.

ఏడ జూచిన నేడుపె, పాడుబ్రతుకె
యెందు జూచిన హింసయే యేవగించె
లోకమందునగల యట్టి శోకమెల్ల
పాక మందెను కనుముందు బాపమేమొ.

ఈ విధంగా వీరి కవితామృతవాహిని మందాకిని వలె కడు గంభీరతతో ముందుకు సాగిపోతుంది.

శ్రీ సుందరాచారి తిరుపతిలో సంపన్న సదాచార శ్రీవైష్ణవ కుటుంబములో జన్మించినాడు. చిన్నతనములోనే తండ్రిగారితో మాటపడి, పట్టింపుపైన ఇల్లు విడిచి వెళ్లి మద్రాసు చేరి దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారిని ఆశ్రయించి, తన స్థితి గతులను వివరించి ఉద్యోగమును అర్థించినాడు. ఆయన ఆంధ్రపత్రికలో ప్రూఫ్‌రీడరుగా నియమించినాడు.

ఆ తరువాత అనతి కాలములోనే ఆంధ్ర సచిత్రవారపత్రికకు ఉప సంపాదకుడైనాడు. పద్మశ్రీ చిత్తూరు నాగయ్య ఆధ్వర్యములో గ్రామఫోను పాటలు వ్రాసినాడు. ఆ రోజుల్లో ఆయన వ్రాసిన ఉషాపరిణయము నాటకం బహుళ ప్రచారం పొందింది. అటు తరువాత సినిమాకవిగా పేరు తెచ్చుకొని, బిల్హణ చిత్రానికి మాటలు, పాటలు వ్రాసిరి.. దీనబంధు చిత్రమునకు శ్రీ హెచ్. యం. రెడ్డిగారితో కలిసి పనిచేసిరి.

ఆ తరువాత ఎందుకో ఓ శుభ ముహూర్తమున అన్నింటిని వదలిపెట్టి ఉపాధ్యాయ వృత్తిలోనికి ప్రవేశించి, క్రమేణ డిప్యూటీ ఇన్‌స్పెక్టరుగా నియమితులైనారు. స్వతంత్ర భావాలు నిండుగాగల వ్యక్తి కావడంతో అన్నింటికి తిలోదకాలిచ్చి సాహితీ జీవనం చేపట్టి, కవిత్వముకొరకే జీవించిరి. జీవితమును కాచి వడబోసిన అనుభవజ్ఞుడగుటచే సుందరాచారి తన మనసులోని మాటను దాచుకొనక భగవంతుని ముందు వినమ్రుడై ఇట్లు విన్నవించుకొన్నాడు.

అర్థము గడియించి, అధికారమున పొంగి
అతివలిచ్చు సుఖము లనుభవించి
ఆశదీర త్రాగి ఆడినా పాడినా
చిక్కలేదు సుఖము శ్రీనివాస!

తుదకా చిక్కని సుఖము శ్రీనివాసునికడనే లభించునని

తలచి తన్ను పెంచి పెద్దచేసిన తెలుగుతల్లికి వాడని "మల్లె పూదండ" ను సమర్పించి ధన్యతను పొందిరి. ఈ కవిగారిని 1974 "రాక్షస" ఉగాది పర్వదినమున హైదరాబాదులో జరిగిన "ప్రపంచ తెలుగు మహాసభ"లలో వీరిని ఆంధ్రప్రభుత్వము సన్మానించి, వీరు వ్రాసిన "మా తెలుగుతల్లికి మల్లెపూదండ" పాటను రాష్ట్రగీతముగా పరిగణించిరి.

"కవితకు నిత్య నూతనత్వం అలవడాలి. అన్వేషించే కొద్దీ అపురూప భావాలు పొడమాలి. ఉత్సాహం వృద్ధికావాలి. ఆశలు రేకెత్తాలి. ఒకే కావ్యం ఏనాటికానాడు క్రొంగ్రొత్తగా కనిపించాలి. ఊహించే కొద్దీ విస్తరిల్లాలి. మనోవాతావరణాన్ననుసరించి మారుతూ రావాలి. కావ్యమే నాలుగు గీటులైతే కావ్యార్థం నాలుగు గ్రంథాలు కావాలి. అలాంటిదే అమరకవిత నా దృష్టిలో" అని అంటారు మన మందరాచారిగారు. వీరి కవిత్వమున కట్టి అమరత్వమెన్నదో సిద్ధించింది. అమర కవిత్వమును అందించిన అమరకవి ఈయన.

శ్రీ ఆలూరు రామశాస్త్రి

జననము :- 9—6—1911

తల్లి:- శ్రీమతి గంగమాంబ; తండ్రి:- ఆలూరు నరసింహశాస్త్రి

జన్మస్థలం:- మలయనూరు-కల్యాణదుర్గం తా॥ అనంతపురం జి॥

ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతములందు పుట్టి పెరిగిన కొందరు కవి పండితులకు ఆ రెండు భాషలయందును రచనలు గావించెడి నేర్పు పుట్టుకతోనే అబ్బిన ఒక పుణ్యవిశేషము. దానికితోడు సంప్రదాయ కుటుంబంలో పుట్టిన మరికొందరికి సంస్కృత వాఙ్మయములో సంపూర్ణ ఆధిక్యత లభించుట బంగారుకు తావి అబ్బినట్లే కదా! ఆంధ్ర, కన్నడ సాహిత్యములకు వారు వారధిగట్టి అనర్ఘరత్నములను ఇరువైపులా పంచిరి. అట్టి వారు మన రాయలసీమలో పెక్కు మందున్నారు. వారిలో శ్రీ ఆలూరు రామశాస్త్రి గారొకరు.

శాస్త్రిగారు పాఠశాలలో విద్య గరిపినది తక్కువేయైనను, ఇంట తండ్రిగారి వద్దనే అమరము, శబ్దరత్నావళి, సంస్కృత సాహిత్యాభ్యాసము, రఘువంశాది పంచకావ్య పఠనములను క్షుణ్ణముగా నేర్చిరి. కీ॥ శే॥ సముద్రాల నారాయణశాస్త్రి గారితో కలిసి అప్పుడప్పుడు గీర్వాణ సాహిత్య ప్రసక్తి, చర్చలు, ప్రసంగాలు, ఆంధ్ర కావ్యములను గూర్చి భాషణ, సరిహద్దు

ప్రాంతీయ భాషయగు కర్ణాటక భాషా కావ్యములను గూర్చి చర్చించి వారిద్వారా అనేక విషయములు నేర్చిరి. జీవికకు వైదికవృత్తిని వదలక పిత్రార్జితమైన స్థిరాస్తితో కాలము గడుపుచుండిరి.

40ఏండ్లు దాటిన తరువాత శాస్త్రిగారికి తెనుగునగల సుమతీ శతకమును, భాస్కరశతకమును, కన్నడములోనికి అనువదింప వలెననెడి ఒక ఆలోచన పొడసూపి, ఆ కార్యమునకు పూను కొనిరి. సుమతి శతకము 1955లో కన్నడమున ముద్రింపబడి, బహుళ ప్రచారములోనికి వచ్చెను. తదుపరి కీ॥ శే॥ శ్రీ వడ్డాది సుబ్బరాయ కవిగారి శ్రీ సూక్తి వసుప్రకాశమను గ్రంథము నుండి దాదాపు 4, 5 శతకములను కన్నడములోనికి అను వదించిరి. కాని వాటిని ప్రచురించుటకు మూలకర్తగారి సర్వ స్వామ్య సంకలితాధికారము లెవరినుండి పొందవలెనో తెలియక ప్రచురింపబడలేదని కవిగారు తెలిపిరి. ఈ విధముగా ఈఉభయ భాషలందును అనువదింపబడిన ఇంత కావ్యములు దాదాపు 12 కు పైగా ఉన్నవి. "శ్రీ రాధాకృష్ణ ప్రణయము" వీరి స్వకపోల కల్పితాంధ్ర పద్యకావ్యము.

ఇక వీరు కన్నడమునుండి తెలుగులోనికి అనువదించిన భాగములు కొన్ని కలవు. వాటిలో కర్ణాటక జైమిని భారతము నందలి చంద్రహాసచరిత్ర, శ్రీ రామాశ్వమేధము అను వారికే

పాకభాగములను, ఆంధ్రభాషలో కదళీ ద్రాక్షాపాకములలో అనువదించిరి. వీరి రచన మచ్చునకు చూతము.

అరయఁ గౌతమపత్నిపై గుహునిపై యా యంజనా సూనుపై
చిరకాలంబు దపింప నా శబరిపై శిక్షార్హుడౌ పక్షిపై
మరణోత్కంఠు జటాయుపై వుడుతపై, మౌనుల్ గనఁ వారిపై
కరుణఁ జూపిన రామచంద్ర మది నిన్ గాంక్షించెదన్ బ్రోవవే!

సుమతి శతకములోని ఒక సుప్రసిద్ధ పద్యమునకు వీరి కన్నడానువాదమిది.

వరనిగె సిరిబందొడెతావ్
బరువరు బంధుగళు కేళదు యంతన్నల్
కెరెయొళగె నీరు తుంబిరే
బరువవు కప్పెగళు హత్తుసావిర సుమతీ

ప్రస్తుతము ఈ కవిగారు కర్ణాటకరాష్ట్రమునకు చెందిన చిత్రదుర్గం జిల్లా పరశురాంపురంలో సత్య శోధనాలయ మందు నివసించుచున్నారు. వీరికి భగవంతుడు ఆయురారోగ్యభాగ్యములిచ్చి కాపాడుగాక!

శ్రీ వేదాంతం నరసింహారెడ్డి

జననము : 1—5—1911

తల్లి: వేదాంతం సుబ్బమ్మ; తండ్రి: వేదాంతం నంజుండరెడ్డి

జన్మస్థలము; తలమర్ల - సత్యసాయి తా॥ - అనంతపురం జిల్లా

అనంతపురం జిల్లాలోని తలమర్ల గ్రామములో పుట్టిన కవికుమారు లందరూ ప్రకృతిమాత ఒడిలో పెరిగి పెద్దవారైన వారే. మధురకవి బెళ్ళూరి-తలమర్ల కళానిధి-వేదాంతం నరసింహారెడ్డి మువ్వురూ ఆ ప్రకృతిమాత అనుంగుబిడ్డలే. మధురకవి బెళ్ళూరి వారి స్నేహమువల్ల వేదాంతం నరసింహారెడ్డి కవితా కన్య వలపునబడి, స్వయం కృషితో కవిత్వము నభ్యసించి కృతకృత్యులైరి.

పుట్టింది రెడ్ల వంశములో, పెరిగింది జనపదములో, చేపట్టింది కర్షకవృత్తి. అట్టి వాతావరణములో పెరిగిన మన నరసింహారెడ్డి కవిత్వం కూడా అదే వాతావరణంలోనే చొచ్చుకొనిపోయింది. "ఉదయిని" అను పేర ఐదు భాగములుగా వీరు వ్రాసిన చిన్న ఖండకావ్యములలోని ప్రతి పద్యము ప్రకృతి సౌందర్యంతో నిండివుంది. "సనాతన, అధునాతనముల సమీకరణాల సారము తీయగల నేర్పరులు వీరు."

వీరి ఉదయిని చతుర్థ గుచ్ఛమునందు "పల్లెజీవితము"

అను ఖండికలో - పల్లెలందు సాయం సంధ్యాకాల మెట్లుండునో కనులకు కట్టినట్లు వర్ణించినారు. దానిని కొంత ఈ క్రింది పద్య ములో చూచెదముగాక:

చెరగుబిగించి, వెండ్రుకలుజీరగ పైటదొలంగి పోయినన్
నెఱుగని పల్లెటూరి పని కేగిన ప్రాయపు టందకత్తెలే
యరిగిరి సాంధ్యకాంతు లలమన్ గృహకృత్యముదీర్చు కాంక్షతో
కరము ప్రియోక్తులాడుచు వికావిక నవ్వుచు సౌరుగుల్కుచున్

రెడ్డిగారి పెక్కురచనలు సుబోధిని, సాధన, ఆంధ్రప్రభ, గృహలక్ష్మి, రేనాడు, ఆంధ్రపత్రిక మొదలైన పత్రికలందు వెలుగుచూచినవి. తమకున్న సాహిత్యాభిమానంకొద్ది తలమర్ల లోనే సారస్వత సమితిని స్థాపించి, దానికి అధ్యక్షులైరి. ప్రతి సంవత్సరం ఉగాది-దసరా-సంక్రాంతి కానుకలుగా చిన్న పుస్తక ములను ప్రచురింపబూనిరి. 1948లో "వసంతకానుక" యను చిన్ని సంకలనము మాత్రము విడుదల చేసిరి.

1) ముక్తికావ్యము 2) శ్రీసుందరుని ఆత్మబోధామృతము
3) అన్నపూర్ణకుమారి 4) నరసింహయోగి శతకము
5) హృదయార్పణము 6) పరిపూర్ణానందము (వచనము)
7) బ్రహ్మజ్ఞాని (వచనకావ్యము) వీరి అముద్రితకృతులు.

రెడ్డిగారు "శ్రీసాయి స్మరణామృతము" నందు శ్రీసాయి

బాబాగారిని గూర్చి యిట్లు ప్రార్థించిరి.

విన్నధ్యానింతు నీలోన నిమిడిపోవ
ఆత్మ తత్త్వంబు నందేల ననుదినంబు
ప్రేమరాజ్యంబు నేలంగ పెదకుబోని
బుద్ధి దయచేయు శ్రీసాయి పొంగి తలతు.

కవిగారికి శ్రీ సాయినాథుని కరుణాకటాక్షములు ప్రాప్తించుగాక!

శ్రీ రత్నాకరం వెంకటేశ్వరులు

జననము :- 1910

తల్లి: శ్రీమతి శేషమాంబ; తండ్రి: శ్రీ హొన్నూరాజు

జన్మస్థలం : వెంకటాద్రిపల్లి - ధర్మవరం తా॥ అనంతపురం జిల్లా

శ్రీ రత్నాకరం వెంకటేశ్వరులుగారు భట్రాజు కులమున జన్మించి, వృత్తిరీత్యా ఆయుర్వేద వైద్య విద్యను చేబట్టి, పుట్టుకతో అబ్బిన కవిత్వమును మరువక తనకు తోచిన రీతిలో తగినంతగా సాహిత్యసేవ గావించుకొన్న విరాడంబరులు వీరు.

వైద్య వృత్తిరీత్యా గ్రామాంతరములకు వెళ్ళినప్పుడు అక్కడి ప్రజలలోగల మతవైషమ్యములు, అన్యోన్య కలహముల

దుర్భర దారిద్ర్యజీవితము, ధనికులు స్వార్థ పరత్వముతో చేయు దుంతగములను చూచినప్పుడు కవిగారి హృదయము కలత చెందినది. అప్పుడే వారి హృదయాంతర్గత సాహితీ విపంచి తీగమీటినది. తమలోని ఆవేదనను పద్యరూపమున లలితాంబకు నివేదించుకొనిరి. దానిని "శ్రీ లలితా పుష్పమాల"గా వెలుగు లోనికి దెచ్చిరి.

"మాతృబోధ" యను వీరి చిన్ని పుస్తకము నీతి ప్రబోధకమైనది. ఒక మాతృమూర్తి తన అనుంగు కూతురును "పుత్రికా" యని సంబోధించుచూ చెప్పిన నీతి పద్యములివి. "నీ ముదిప్రాయంబున నిన్ను జూడవలదే మోదంబుతో కోడలున్" అని ఆ తల్లి కూతురుని మెల్లగా మందలిస్తుంది.

వీరు రచించిన భక్తి గ్రంథములలో శ్రీ వెంకటేశ్వర పుష్పమాల, శ్రీకృష్ణవర్ణమాల, శ్రీసత్యసాయిస్తుతి రత్నాకరం, శ్రీ వేంకటేశ్వర కల్యాణము (గేయము) శ్రీ భగవద్గీతా గద్య పద్యగేయామృతము, శ్రీ హనుమద్విజయము (గేయము) శ్రీ వాల్మీకి రామాయణ సుందరకాండము ననుసరించి రచించిన గేయ కావ్యములు ప్రసిద్ధములుగా చెప్పకొనదగినవి.

గేయములలో వ్రాయబడిన పై మూడు గ్రంథములు స్త్రీలు, బాలురు, పామరులు తమకు తోచిన రాగతాళములలో

పాడుకొనుటకు అనువుగా రచించిరి. పాదమునకు ముప్పదిరెండు మాత్రాగణములతోకూడి ప్రాసయతిగాని, సాధారణయతిగాని కలిగియున్న గేయములివి. శ్రీ వేంకటేశ్వరుని ఎందరో మహానుభావులు ఎన్నెన్నోరీతులుగా స్తుతించినారు. ఆతని దివ్యాద్భుత చరిత్ర ఎన్నిసార్లు వ్రాసినను, చదివినను, ముక్తిదాయకమే కదా! ఇతరులను మెప్పించవలెననెడి తలంపుతోగాక, కవిగారు తమలో పొంగి పొరలివచ్చు భావావేశము నణచుకొనజాలక తమకు తాము తృప్తిచెందు నుద్దేశ్యముతో ఎల్లరునూ పాడుకొనుటకు అనువుగా రచించి ధన్యత పొందిరి. ఈ వేంకటేశ్వర కల్యాణమును గానము చేయువారికి శ్రీయుత యం.యస్. రామారావుగారి సుందరకాండ రామాయణమును తలపుకు దెచ్చును,

ఇందు తొండమానుని జననము, పద్మావతి జననము, వకుళాదేవిచరిత్ర, వేంకటపతివేట, పద్మావతి పూర్వజన్మ కథ, పద్మావతి వేంకటేశ్వరుల కల్యాణము ప్రధాన ఘట్టములు. "శ్రీ వెంకటేశ్వరుని కల్యాణము చేసెద గానము శ్రీహరి కృపచే" అను పల్లవితో నీ గేయములను సాగించిరి. గేయరూపమున రచించిన ఈ కృతులు ఆంధ్ర సాహిత్యమునందు ఒక ఉన్నత స్థానము నందగల వనుటలో సందేహములేదు.

శ్రీ వేంకటేశ్వర కల్యాణమునందు శ్రీమన్నారాయణుడు ఎరుకలసాని వేషము ధరించి, పద్మావతి కడకొచ్చి సోదె చెప్పిన

విధమును కవిగారు బహు ముచ్చటగా వ్రాసిరి. అందలి ఒక వరుస గేయములో మచ్చునకు కొంత చూతుము. పద్మావతితల్లి ఎరుకలదానిని ఆ యువకుని వివరములను గూర్చి అడుగగా ఎరుకలసాని యిట్లను చున్నది.

సేసాశలమున సికరము మీదను
సేరెను తల్లీ నారాయనుడే
ఆదిదేవుడై యందరి మొక్కులు
నందుసు సేరెను వెంకటపతియై
సదివినవాడూ సకల విద్దెలను
సక్కనివాడూ మనుమతుకన్నా
దనమూ బలమూ దండిగ యుండూ
శీనివాసుడని సెప్పుదు రతనిని.

వీరి శ్రీ భగవద్గీతా గద్యపద్య గేయామృతము ఒక పెద్ద గ్రంథము. ప్రస్తుతము ముద్రణలో వున్నది. శ్రీ భగవద్గీత మూలము ననుసరించి ఇందు 701 పద్యములు, 701 గేయములు, 701 గద్యములు గల్గి సుమారు 1200 పేజీలకు తక్కువకాని గ్రంథరాజమిది. "ఇదివరలో వచ్చిన పెక్కు అనువాద గ్రంథము లన్నింటికి ఇది తలమానికము కాగలదనుటలో గొప్పేమీలేదు" అని శ్రీ కలచవీడు శ్రీనివాసరావుగారు ప్రశంసించిరి.

ఇంకనూ, ముద్రణ కావలసిన వీరి సుందరకాండగేయం,

శ్రీ హనుమద్విజయములు కూడ త్వరలో ముద్రింపబడి ఆంధ్ర లోకమును అలరించును గాక! వీరికి శ్రీ వేంకటాచలపతి ఆయురారోగ్య భాగ్యములనిచ్చి కాపాడుగాక!



శ్రీ వెంకట వరదాచార్యులు

జననం : 2-5-1910

తల్లి : శ్రీమతి వెంకటమ్మ

తండ్రి : వెంకటపాపాచార్యులు

జన్మస్థలము : బొందలదిన్నె. తాడిపత్రి తాలూకా. అనంతపురం జిల్లా

శ్రీ వెంకట వరదాచార్యులవారు బాల్యమునుండియే సంగీత, సాహిత్య, జ్యోతిష శాస్త్రములందు అభిరుచి మెండుగా గలిగి వుండిరి. 29వ ఏటనే నాటకములందు నటించుచుండిరి. 26వ ఏట వైద్యము చేబట్టిరి. జ్యోతిష గ్రంథములను పరికించి, పరిశోధించి కృత్రిమశాస్త్రమును విడచి "సప్రమాణ జ్యోతిస్సారము" అను గ్రంథమును 1973లో వ్రాసి ప్రచురించిరి.

1964లో వీరు వ్రాసిన "మాతృజ్యోతి" నవల డెమ్మీ సైజులో 630 పేజీలు గలదు. దీనిని కవిగారు నవలగా వ్యవహరించిరేగాని యిందు ఉత్కంఠత కల్గించు కథావస్తువు లోపించి, భారతీయ ఆచార వ్యవహారాదులు, సాంప్రదాయములు, నీతి నియమములు, ధర్మనిరతి మున్నగు అనేక విషయములకే ప్రాధాన్యత యివ్వబడినది. వాడుకభాషనే వాడినప్పటికి ముఖ్యముగా కథాగమనము కుంటువడుటచే పాఠకుడు చదువుటకు ఆసక్తి పడడు. రచయిత తనకు తెలిసిన పెక్కు విషయముల నన్నింటిని గ్రంథస్థము చేయవలెననెడి తీవ్రతయే అధికముగా ఉన్నట్లు కనిపించును.

ఇక ఈ కవిగారికి జ్యోతిశ్శాస్త్రమునందపారమైన వైదుష్యము గలదనుటకు "జ్ఞానజ్యోతి"-శ్రీ గణేశ నారదసల్లాపములు శ్రీ శారదా గణేశ వరప్రసాద వధూవరులు - అను ద్విపాత్ర ఏకాంక నాటిక సాక్ష్యములు.

తాడిపత్రిలో శ్రీ రాఘవేంద్ర జ్యోతిషాలయమును స్థాపించి వంశ పరంపరానుభవ వైద్యమును, జ్యోతిశ్శాస్త్రమును ప్రజలకు అందించుచున్నారు. వీరికి శ్రీ రాఘవేంద్రయతీంద్రుల వారు ఆయురారోగ్య భాగ్యములనిచ్చి కాపాడుగాత!



శ్రీ లింగుట్ల కోనేటప్ప

జననము :- 10-12-1910

తల్లి :- శ్రీమతి రంగమ్మ

తండ్రి :- వెంకటప్ప

జన్మస్థలము : ఛాయాపురము

గుత్తి తాలూకా

అనంతపురం జిల్లా.

అనంతపురం జిల్లాలో అజ్ఞాతంగా జీవించిన కవులలో లింగుట్ల కోనేటప్ప గారొకరు. జన్మించింది కమ్మకులము, చదివింది ఎనిమిదవ తరగతి, చేపట్టిన వృత్తి వ్యవసాయము. అభిరుచులు - నాటకములు, శాస్త్రీయ సంగీతము, జ్యోతిశ్శాస్త్రం, వైద్యవిద్య. వీరు సేకరించిన మాండలిక పదకోశ నిర్మాణము వ్యవసాయము - చేనేత; రెండు భాగములుగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ప్రచురించుట ఎంతయో ముదావహము.

తదుపరి వీరి "వంశరత్నాకరము" అకారాది నిఘంటువు. అముద్రితము. దాదాపు ఇది ఒక వేయిపుటల గ్రంథము. "అ నుండి "ఱ" వరకుగల సాముదాయిక నిఘంటువిది. దీనిని కవిగారు బహుళ కృషితో తయారుచేసిరి. ముద్రణాభాగ్యము పొందలేదు.

వీరు కొన్ని శతకములు కూడా వ్రాసినారు. ఏకప్రాస కంద పద్య దశరథరామ శతకము, యువతీ శతకము, ఈ రెండునూ అముద్రితములే. దశరథరామ శతకములోని ఒక పద్యము మచ్చునకు

కం॥ కరిబ్రోవ మకరి జంపితి
మురిపెముతో కంతు జనక, మోక్షపురిశా;
హరి, నను నేలవదేలర?
దరి జేరితి ఛాయపురము దశరథరామా!

" ఆధునిక సుమతి శతకము " అనునది వీరి ఒకే ఒక ముద్రితకృతి. జాతీయోద్యమము ముమ్మరముగా సాగుచున్న రోజులలో మన సమాజములోవున్న ఒడుదుడుకులను తెలుపుతూ వ్రాసిన శతకమిది. చిన్నతనపు వీధి బడిలో కంఠస్థము చేసిన బద్దెన సుమతి శతకపు పోకడలు అచ్చటచ్చట నెమరువేసిరి. "నాయీ రచన కొన్నిచోట్ల ఛాందస మహానుభావులకు వెగటు గల్గించినా ప్రజాబాహుళ్యము ఈ శతకాన్ని ఆదరించగలదని నా నమ్మిక" అని కవిగారు వ్రాసుకొనిరి. మచ్చుకా పద్యములు.

పదవీ వ్యామోహంబున
పదిలముగా జనులచుట్టు పనివడి తిరుగున్
పదవి లభించిన పిమ్మట
వదలును ప్రజ కార్యమెల్ల స్వార్థుడు సుమతీ

పదవులకు ప్రాకులాడెడి
ఉదరంభరి కెపుడుగాని ఓటియ్యకు మీ
యెదలో ప్రజమేల్ దలచెడి
సదయుని యెన్నికకు నిమ్ము సమ్మతి సుమతీ!

కోనేటప్పగారు వందల కొద్ది జానపద గేయములను సేకరించినట్లును, వీరి వద్దగల అమూల్యగ్రంథములు, అముద్రిత ప్రతులు ఎన్నో బంధువుల, స్నేహితుల యిండ్లలో వుండిపోయిన వనియు, తుదకీ ఒక్క శతకము మాత్రమే లభ్యమై ముద్రణా భాగ్యము పొందినదని వారి కుమారులు లింగుట్ల వెంకటప్ప పై శతకములో వ్రాసుకొన్నారు. ఈ కవిగారి కుటుంబమునకు దశరథ నందనుని అనుగ్రహము సదా లభించుగాక!

శ్రీ గాజుల వెంకటరమణప్ప

జననము :- 9—11—1917

తల్లి: శ్రీమతి నంజమ్మ; తండ్రి : శ్రీ వెంకటప్ప

జన్మస్థలం : కొత్తచెఱువు - సత్యసాయి తా॥ అనంతపురం జిల్లా

జీవనోపాధికై ఉపాధ్యాయవృత్తిని చేబట్టిన శ్రీ గాజుల వెంకటరమణప్పగారు వృత్తిరీత్యా తలమర్ల గ్రామమునకు ప్రధానోపాధ్యాయులుగా వచ్చుట సంభవించినది. చిన్నతనము

నుండి పద్యరచనపై మక్కువగల వెంకటరమణప్పగారు తాము వ్రాసిన రచనలకు వెలుగుచూపక ఎందులకో నిరుత్సాహపడు చుండుట తలమర్లలోని శ్రీ కళానిధిగారు చూచి, వీరిని ప్రోత్సహించి, తమ గురువులైన శ్రీ మధురకవి బెళ్ళూరి శ్రీనివాస మూర్తిగారితో పరిచయము గావించిరి. అప్పటికే తలమర్లలో సారస్వత సమితి స్థాపింపబడి అందలి సభ్యులైన శ్రీ వేదాంతం నరసింహారెడ్డి, కళానిధి, బెళ్ళూరి వారలు తీవ్రమైన కృషి సాగించుచూ కవిత్వతత్త్వాన్ని చర్చించుకొంటు వుండేవారు. అప్పటి ఈర్ష్యాలోకం కోమలమైన ఆ కవితాకన్యపై దుమ్మెత్తి పోసి రాళ్ళు విసురుతూవున్నా వారి వెట్టి వారికానందమన్నట్లుగా ఆ కవిమిత్రు లుండిరి. ఆ కవిమిత్రుల సాంగత్యము వెంకట రమణప్పగారికి లభించింది. అందుకే వారు తమ "భావో దయము" అను కవితా సంపుటిలో బెళ్ళూరి వారిని గూర్చి యిట్లు ప్రశంసించిరి.

నీవు జనించి మించిన పునీత తలమ్మర నే వసించుటఁ
భావరసోల్బణంబు దయివార నొకింత కవిత్వ వాటికన్
తావులు గ్రుమ్మరింపగల దార్ఢ్యమునందగ గంట సాహితీ
సేవయె జీవనంబగు వశీకృత చిత్తుడ వీవు సత్కవీ!

అప్పటినుండి వెంకటరమణప్పగారు కూడ ఆ సమితిలో సభ్యులై తమ "భావోదయము" అను ఖండకావ్యమును ఆ

సమితి ద్వారా వెలువరించిరి.

వీరి కవిత్వము ప్రాచీన కవితాపద్ధతిలో కొంత; నవీన కవితామార్గమున కొంత సమ్మేళనమై యుండును. వీరిది జిగిబిగి కల్గిన చక్కటిశైలి. భగవద్దత్తమైన భావనాశక్తిగల వీరి కవిత్వము జీవంతో కూడుకొన్నదనుటలో సందేహంలేదు. ఈ కవి తన మనోకాంక్ష నిట్లు తెలుపుకొన్నారు.

అడ్డు పాటుల నెల్లను నధిగమించి
వనధిఁజేరంగ నరుగు స్రవంతియట్లు
స్వార్థయుతమగు సంఘ నిబంధనముల
ద్రోసి, స్వాతంత్ర్య సీమయందున వసింతు.

"ఈ కవి సాహిత్యజీవి. శాశ్వతములైన తన భావములకు స్వరూప మిచ్చితీరవలె ననెడి యుద్దేశ్యము కలవాడు. ఇట్టి సాహితీ సమారాధకులు చాలామంది కానరారు. కాబట్టి అభ్యుదయము వీరి సహజలక్షణము" అని బెళ్లూరివారు ప్రశంసించిరి.

వీరు వ్రాసినవి రెండు ఖండికలేయైననూ చక్కటి రచనలను తెలుగువారి కందించి రనుటలో అతిశయోక్తి లేదు. ఇరువదేండ్ల కాలము శ్రీ శ్రీ శ్రీ భూమానంద భారతీస్వాముల వారిని సేవించిన ఫలముగా తనకీ రచనాశక్తి అబ్బినదని కవిగారు చెప్పుకొన్నారు. వీరిపై భూమానంద స్వాములవారి కృపాకటాక్షములు సర్వదా ప్రసరించుగాత!



శ్రీ మీసరగండ పుల్లమరాజు

జననము :- 10-11-1919

తల్లి: లక్ష్మీనరసమాంబ

తండ్రి: మీసరగండ ఓబరాజు

జన్మస్థలము : తరిమెల

అనంతపురం తా॥ - జిల్లా

మీసరగండ బిరుదాంకిత పండిత వంశమందు జన్మించిన మీసరగండ ఓబరాజు సుప్రసిద్ధ పౌరాణికులు, సంస్కృతాంధ్ర పండితులు, అనంతగిరి విలాస బాలరామాయణ కర్తలు. వీరి కుమారులే మన పుల్లమరాజు కవిగారు. పుల్లమరాజుగారు బాల్యమునుండియు తండ్రి వద్దనే ఆంధ్ర పంచకావ్యములను పాఠ మొనర్చిరి. తదుపరి తరిమెల వాస్తవ్యులు, సంస్కృత భాష యందు గొప్ప పాండిత్యముగల కీ॥ శే॥ రామాయణము శంకర శర్మగారి వద్ద సంస్కృత పాఠము నేర్చిరి. సంగీత, నాటకము లన్న చిన్నతనమునుండి వీరికి అభిరుచి మెండు.

ఉన్నతపాఠశాల విద్యాభ్యాసము అనంతపురంలో ముగించి 1938-40 సం॥ మధ్య అక్కడే ఉపాధ్యాయ శిక్షణపొంది, తదు

షరి మద్రాసు యూనివర్సిటీలో తెలుగువిద్వాన్ పట్టము స్వీకరించిరి. తొలుత బళ్ళారి పురపాలక సంఘంలో గుమాస్తా ఉద్యోగములో చేరి, తరువాత గుంతకల్, బుక్కరాయసముద్రము, పెనుకొండ పట్టణములందు తెలుగు పండితుడుగా పనిచేసి, తుద కక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే ఆంధ్రోపన్యాసకులుగా పదవీవిరమణ గావించిరి.

ఉపాధ్యాయులుగా ఉన్నప్పుడే వీరు కొన్ని నాటకములను రచించి వాటిని విద్యార్థులచేత ప్రదర్శింపజేసి, అనంతపురం జిల్లాయందేగాక గుంటూరు మున్నగు ప్రాంతములందు కూడ బహుమానములు పొందిరి. వీరు రచించిన నాటకములు స్వర్ణప్రతిమ, రజనీకాంతం, ఆదర్శసమితి. ఇవి అముద్రితములు. మధుకణములు ఖండికలు; కాంగ్రెస్ చరిత్ర-జంగంకథ; ఇవి ముద్రితములు.

మధుకణములు ఒక ఖండకావ్యము. కవిగారు మధుర భావావేశములు పొందినప్పుడెల్లనూ వ్రాసిపెట్టిన పద్యరత్నములివి. హిందీ పద్యభాగములను కూడా కొన్ని అనువదించి యిందు చేర్చిరి. ఇందలి "మాతృప్రేమ" ఖండిక ఎంతటి కఠినాత్ముని హృదయమునైననూ ద్రవింపజేయు ననుటలో సందేహములేదు. వేశ్యాలోలుడైన ఒక బ్రాహ్మణ యువకుడు తన ప్రేయసి తలనొప్పి బాపుటకు, ఆమె కోరికమేరకు తల్లిగుండెను దెచ్చుటకు ఏమాత్రము జంకక తల్లికడకు వెళ్ళినాడు. మాతృ

హృదయమ్ము మసిజేసి మాడునకు పూసిన ఆ వేశ్య శిరోభారము తగ్గునట. అతడీ విషయము తల్లికి చెప్పినాడు. ఆమె కుమారుని కోరికను కాదనలేదు. ఆమెను కత్తితో పొడిచి చంపి ఆ చల్లని తల్లిగుండె తీసుకొన్నాడు.

గుండియ చేతబట్టి చెలికోరిక దీర్చెద వేగ నంచు ను
ద్దండత నేగుచో శిలనుదాకి పదమ్మటు దొట్రిలంగ, నా
గండడు నేలపైబడియె; గ్రచ్చఱ గుండియయార్చె నాయనా!
మెండగు దెబ్బదింటివో సుమీ మెలమెల్లన లెమ్ము పుత్రకా!

ఇట్టి రసవత్తర ఖండిక లెన్నియో ఈ మధుకణముల సంపుటిలో చోటు చేసుకొన్నవి. ఉద్యోగ విరమణానంతరము పుల్లమరాజుగారు పుట్టపర్తి శ్రీ సత్యసాయిబాబా సన్నిధిలో కాలము గడుప నిశ్చయించి, కర్ణాటకలోనివారి వైట్ ఫీల్డ్ ప్రశాంత నిలయములో ధార్మిక చింతనలో కాలము బుచ్చు చున్నారు. వీరికి శ్రీ సత్యసాయి ఆయురారోగ్య భాగ్యము లందించుగాత!

శ్రీ కోగిర జయసీతారాం

జననము :- 14—11—1924

తల్లి : శ్రీమతి గొని చెన్నమ్మ: తండ్రి : శ్రీ గొని ఓబులరెడ్డి
జన్మస్థలము :- కోగిర - పెనుకొండ తా॥ అనంతపురం జిల్లా

నిఱుపేద కుటుంబములో పుట్టిన శ్రీ కోగిర జయసీతారాం గారు చిన్నతనమునుండి గడ్డుజీవితమును గడిపినవారే. చదివిన ఎనిమిదో తరగతికి ఉపాధ్యాయవృత్తి లభించే మంచికాలమది. పల్లెల్లోనే, ఆ పేదప్రజలనడుమ నిత్యము కలిసిమెలసి తిరుగుతూ ఆ ప్రజాజీవితాన్ని, భాషను, ఆచార వ్యవహారాలను, వారి జీవితానుభవాలను, మనోగతాలను పూర్తిగా తన రక్తంలో జీర్ణింపజేసుకొని, వారికోసం, వారిభాష, పలుకుబడులతో, వారి కష్టాలను పాలుపంచుకొనే ఒక మనిషి తానంటూ, తన మనో విపంచిని విప్పి కవితలల్లి ప్రజల ముందుంచిన ప్రజాకవి శ్రీ కోగిర జయసీతారాం.

వీరివి అనంతపురం జిల్లా ప్రజాభాషకు అద్దంపట్టే రచనలు. ఈలాంటి మాండలిక భాషారచనలు చేయగలిగిన కవులు చాల అరుదు. ఆ పద్ధతి ఒంటబట్టడం కూడా కష్టమే. అందుకే ఈ కవి సామాన్య ప్రజానీకానికి జరుగుతున్న అన్యాయాలను చూచి సహించలేక కవితలల్లితే, ప్రభుత్వము దాన్ని ధిక్కార నేరంగా లెక్కించింది, బెదరించింది.

" సలిమంట " అనే కవితలో సామాన్య పల్లెకూలీల దినదినగండపు జీవితాన్ని పుడిసిట బట్టినాడీకవి. ఆ కవిత సాధారణమాటల్లో సాగిపోయినా అది ఛందోబద్ధంగా వుంది. చక్కటి భావరమ్యతను కలిగి ఉంటుంది. జీవితంలో పండి పోయిన ఓ అవ్వ శరీరాన్ని కొరుక్కుతింటున్న చలికి ఓర్చుకో లేక, వాళ్ళను వీళ్ళను పలకరించి, చలి మంటేసుకొంటూ, తన వాళ్ళను పనులకు పురమాయించుతూ, చుట్టుప్రక్కల వాళ్ళను విచారించడం ఇందులో వస్తువు. జనం, జీవం అవ్వ మాటలకు ప్రాణం. సంభాషణావిధానంలో రచన సాగుతుంది.

ఆడ బొయ్యేదెవ్రు? ఆదిగా - "యాలవా"
"అగ్గిపెట్టి వుంద అనుముగా; నితావ?"
"వూను వుందితాలు నేనంటిత్త"

—— —— ——

"కప్కొనేకి యేష్టి కప్పడపూలేదు
దుప్టి గొందమంటె దుడ్లులేవు
తొలుపుల్యాక వాకిలికి తడకడ్డం బెట్కొని
యేటి బతుకొ యేమొ యల్లకాల్మ"

"—యంగటమ్మా! లేత్వ, యింగా లేదా"
"ఏం, లేశ్నవత్తా! యెసురెంత బెట్టిల్లి"
"రొండు జెస్లుబెట్టు; పిండి వుందా"

"యాడదిప్డు రాగులిసురల్ల; యెసర్లోకి
"సందకాడ వురికె సత్తా రంద్రు...."

ఇలా అత్తకోడళ్ళ సంభాషణ జరుగుతుంది. తుదకది "కుటుంబ సంక్షేమా"నికి దారి తీస్తుంది. ఈ విధంగా ఈ కవికి పల్లీయుల జీవితంలోని నొక్కుల్ని, లోతుల్ని పసిగట్టే శక్తి వుంది. అందుకే ఈ కవి "ఆత్మగతం" అనే శీర్షికలో వ్రాసిన కవితలో ఇలా వ్రాసుకొన్నారు.

పిన్న పదమునందు పెద్దభావము పొందు
నేర్పు గలుగువాడె నిజము సుకవి
కొద్ది పొలమునందు కొండంతపంట, పం
డించు నట్టివాడె మంచిరైతు.

"నిట్టూర్పులు" - పద్యకావ్యం; విజయప్రభ - బుర్రకథ; ఈ రెండునూ వీరి ముద్రిత కృతులు. తక్కినవన్నియూ వ్రాత ప్రతులుగానే మిగిలివున్నాయి. వీరు "సుగుణా!" అను మకుటముతో వ్రాసిన 400 పద్యముల శతకములో నేటి భారతదేశపు రాజకీయ వ్యవహారములను, స్థితి గతులను తూర్పారబట్టిరి. అలాంటిదే వీరి "మదాంధబరాతము"కూడ. ఇది తేటగీతికలలో కూర్చబడినది. ఇందు ధూర్తరాష్ట్రుడు (ధృతరాష్ట్రుడు కాదు) సంశయునితో(సంజయుడుకాదు) ఏ మడుగుచున్నాడో చూడుడు.

గీ॥ భరతభూమి స్వతంత్రమై ప్రజల పాల
నమ్ము ప్రారంభమైనట్టి నాటినుండి
ధాత్రియెల్ల మహాకురుక్షేత్రమయ్యె
సంశయా! చెప్పుమా దాని సరళి కొంత!

కం॥ దేవుని ఎదుట ప్రమాణము
గావించిన సాక్షి యిచ్చు కైఫీయతులో
దేవిన దొరకని సత్యము
దేవు డపహరించెనేమొ తెలియదు సుగుణా!

(— సుగుణా! శతకమునుండి)

మన తెలుగు సాహిత్యంలో కవికోకిలలు, కవివృషభులు కవిసింహులు, కవికిశోర బిరుదాంకితులే ఎక్కువ. "కవికాకి" బిరుదాంకితులెవరూ ఉన్నట్లులేదు. "కవికాకి బిరుదును మీకిస్తున్నాం, తీసుకోగలరా?" అని ఒకసారి శ్రీ బి. టి. ఎల్. యన్. చౌదరి (అనంతపురం జిల్లా గ్రంథాలయసంస్థ-అధ్యక్షులు) గారొక సారి జరిగిన గ్రంథాలయ వారోత్సవాల విందుసభలో శ్రీ జయ సీతారాంగారిని ప్రశ్నించగా, నిస్సంకోచంగా ముందుకొచ్చి "నెమలి జాతీయపక్షి. కాకి ప్రజలపక్షి. నిత్యం వాళ్ళను మేలుపుకొలుపుతుంది. నేను అలాంటికవినే. నాకాబిరుదుతగిందే" అని సగౌరవంగా సభలో పలికి, గౌరవా గౌరములన్నింటినీ ఒకే స్థాయిలో మన్నించిన సుకవి ఈయన. ఈ కవిగారిని

శ్రీ చౌదరిగారు అత్యభిమానిస్తారు. "కవికాకిగారు! బాగు న్నారా?" అని ఎక్కడ కనిపించినా నవ్వుతూ కుశలప్రశ్నలు వేస్తుంటారు, "అంతా నీ చలువేకదా! నాయనా!" అంటూ చౌదరి గారికి నవ్వుతూ జవాబిస్తాడీ కవి.

వ్రాసిపెట్టిన రచనలన్నీ వెలుగు చూడకపోయినా, వీరి రచనలన్నీ అనంతపురం జిల్లా సాహిత్యాభిలాషుల మనోఫల కాలపై చిరస్థాయిగా ముద్రింపబడినాయి. ఏ కవి సమ్మేళనం జరిగినా ఏ సాహిత్యగోష్ఠి జరిగినా, అభిమానులు కోరినా అక్కడికక్కడే తన సంచిలోని వ్రాతప్రతిని తీసి కవితలను వినిపిస్తుంటారు. 1. అరణ్యరోదనము (సీస పద్యములు) 2. కావ్ - కావ్ శతకము 3. కాకిగోల (గేయాలు) 4. పండు వెన్నెల (పిల్లలపాటలు) 5. కృష్ణార్జునయుద్ధము 6. రామాంజ నేయయుద్ధము 7. సీతారామకల్యాణము(నాటకములు) 8. జయ భారతి (బుడబుడక్కలకథ) ఇవి వీరి అముద్రితకృతులు.

సాధారణమైన ఉపాధ్యాయ జీవితాన్ని కొనసాగించినా, ఒక "అసాధారణమైన వ్యక్తి"గా లెక్కింపబడి తన పదునైన కలంతో చురకలంటిన ధైర్యశాలి. ప్రస్తుతము స్వగ్రామమైన కోగిరలోనే కాలం వెళ్ళబుచ్చుతున్నారు. భగవంతుడు వీరికి ఆయురారోగ్య భాగ్యములనిచ్చి సర్వదా కాపాడుగాక!

శ్రీ విద్వాన్ విశ్వం

జననము :- 21—10—1915

తల్లి : శ్రీమతి లక్ష్మమ్మ; తండ్రి : శ్రీ రామయ్య

జన్మస్థలము :- తరిమెల; అనంతపురం తా॥ - జిల్లా

ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక పాఠకులకు విద్వాన్ విశ్వం గారి పేరు తెలినియదికాదు. అందలి "మాణిక్యవీణ" శీర్షిక చాలనాళ్లగా వారు నిర్వహిస్తూ అనేక విషయములను వ్రాస్తున్నారు. పత్రికారంగంలో వీరి పేరు ఒక ఉన్నతస్థాయిలో వున్నది. పత్రికా రచయితగా, కవిగా, పండితుడుగా, అనువాదకుడుగా, సంపాదకుడుగా పేరు తెచ్చుకొన్న విశ్వంగారు ప్రస్తుతము తిరుపతి తిరుమల దేవస్థానంవారి ప్రచురణ విభాగంలో సంపాదకులుగా పని చేయుచున్నారు.

వ్రాసినవి లెక్కలేనన్ని పుస్తకాలేయైనా, విద్వాన్ విశ్వం గారనగానే జ్ఞప్తికి వచ్చేది "పెన్నేటిపాట" కావ్యమొకటే. అదే వారి కీర్తి చంద్రికలను ఆంధ్రదేశ మంతటా ప్రసరింప జేసినది. ఆ కావ్యముతో విశ్వంగారి పేరు తెలుగునాడులో మారుమ్రోగింది, తెలుగువారి హృదయాలలో ప్రతిధ్వనించింది.

రాయలసీమలో పుట్టిపెరిగిన ఈ కవివరేణ్యుడు తన అనుభవ మూలాధారముతో, ఈ సీమ నిజస్థితిగతులను యథాతథంగా

చిత్రీకరించారు. ప్రజల అష్టకష్టాలనుచూచి కన్నీరు కార్చిన మానవతావాది ఈయన. తన సీమనుగూర్చి తాను అతిశయోక్తిగా చెప్పుకొన్నా ఆ కవి నెవరేమి ఆక్షేపించువారు లేరుకదా! అందుకాయన మనసొప్పలేదు. అందుకు తావియ్యలేదు కూడా. ఎప్పుడో ఈ సీమలో రాసులుగా రత్నాలను పోసుకొని అమ్మినారట - అప్పుడది పచ్చలబజారు. అది గతించిన వైభవము. మరి నేడో, ఇదొక ఎడారి. ఇక్కడున్నది ఒకే ఒక నది - అది పెన్న. అందులో "ఏది నీరు? ఏదీ హోరు? ఏదీ నీటిజాలు? - ఇదే నీరు! ఇదే హోరు! ఇదే ఇసుకవాలు." అది ఒట్టి ఇసుక దిబ్బ. ఇప్పుడిక్కడ ఈ సీమవాసుల కన్నీరుతప్ప, నీరులేదు. ఇక్కడి ప్రజల కడగండ్లను వివరిస్తూ, "నేటి రాయలసీమ కన్నీటి పాట - కోటి గొంతుల కిన్నెర మీటుకొనుచు, కోటి గుండెల కంజరి కొట్టుకొనుచు" వినిపింతునని ఆ కన్నీటిపాటను విశ్వంగారు ఒక మానవతావాదిగా పాడినారు.

పెన్నేటిపాట ఐదు సర్గలుగా వ్రాయబడింది. ఇందలి కథ - ఒక పెద్దరైతు నారపరెడ్డి ఏకైక పుత్రుడు రంగడు. ఆ తండ్రి ఉన్నప్పుడు పొగడిన వారందరికీ అడిగినంత యిచ్చి తుదకు "కొన్ని దినాలకు దత్రము సన్నవడం జొచ్చె, కీర్తి సంపద బలిసెన్" అన్నట్లుగా దివాలా తీసినాడు. అప్పుడు

గే॥ నారపరెడ్డి నారప్పయ్యెను
ఊరిమోతుబరి ఉప్పరియయ్యెను

దారిమోటులో పూరికొట్టమున
చేరెను తోడాక చిన్నరంగడే.

ఆ రంగడు తండ్రి గతించిన తరువాత పడిన ఇక్కట్లను, తడి ఆరని కంటితో, ఎద తడబడుతూ, మసకమసగ్గా కనిపించే అక్షరాలను తడుముకొంటూ చదివింపజేసే ఈ కవితకు నిజంగా అమరత్వం సిద్ధించింది. ఆ కష్టముల నొకమారు మనంకొంత పరామర్శింతము.

సీ॥ ఒకరింటి గాటలో ఊరిన గంజెల్ల
నెత్తిపోయుట కెంత యేడ్చినాడొ!
ఒకరింటి దొడ్డిలో నుండిన కసవెల్ల
నూడ్చివేయుటకెంత ఉడికినాడొ!
ఒకరింటి నట్టింటనున్న కొట్టులనెల్ల
దంచుటకెంత కంపించినాడొ!
ఒకరింట గంపలకున్న రాగులనెల్ల
విసరుటకెంతగా విసివినాడొ!

గీ॥ ఒకరి యింటిలో పిల్లల నూచుటకు, మ
రొక్కరింట పక్కలువేయ, నొక్కరింట
అరవచాకిరీ చేయుట కొఱకు; ఎంత
యెంత దురపిల్లెనో వాని యింతయెడద!

గీ॥ కటికకారము సంగటి గుటకవడక
ఎన్ని బిందెలనీళ్ళు త్రావించినదియొ?
ఎండు రొట్టిముక్కలు అఱిగింపుగాక
ఎన్ని మిరపగింజల నమిలించినదియొ?

కం॥ ఇవియుం దొరకక పుడిసెడు
గవి నీళ్ళంద్రావి ముడుచుక పరుండిన పా
డు విభావరులెన్నో, లె
క్కవిలే వరి యేది? వల్లకాటి మనుగడ౯.

ఈ కావ్యంలో రాయలసీమ పలుకుబళ్ళు, నానుడులు, మాటల తీరుతెన్నులు, వ్యవసాయ విధానము, ఆహార విహారాదులు, సీమవాసుల మనోగతాలు, ఇక్కడ లభించే చిరుఫలాలు, వైద్యవిధానం, ఇక్కడ తిరుగాడే నక్కబావలు, నాగుబాములు, బొంతగద్దెలు, మండ్రగబ్బలు, ఇత్యాది అసంఖ్య సామగ్రితో విశ్వంగారి కవితా విరూపాక్షుడు తాండవించినాడు. "భాష, అర్థము, భావము, ఛందస్సు అన్నియు ఆ తాండవమునకు ప్రక్కవాయిద్యాలు వాయించినవి." అని రాళ్ళపల్లి వారన్న మాటలో ఎట్టి అతిశయోక్తి లేదు.

విశ్వంగారు మద్రాసు యూనివర్శిటీలో "విద్వాన్" పరీక్ష ముగించిన తర్వాత అందరూ ఈయన్ని "విద్వాన్ విశ్వం" అని

పిలవడం మొదలుపెట్టిరి. అదే వారి సార్థక నామధేయ మయ్యేను. కాశీ హిందూ విశ్వవిద్యాలయముతో సంస్కృత భాషా పరిశోధన సల్పుటకై చేరిరి కాని, విశేషంగా జబ్బు పడి నందువల్ల వదలివేసిరి. మఱల ఆరోగ్యం చేకూరిన తరువాత కీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రి గారి సహాయముతో సంస్కృత భాషలో పరిశోధన గావించిరి. ఆ పరిశోధన ఫలితంగానే వీరు సంస్కృతములోని కాళిదాసు ప్రణీతమైన రఘువంశం, కుమార సంభవము మేఘసందేశములను; మాఘ, బాణభట్టు,భారవి, దండి కవుల శిశుపాలవధ, కాదంబరి, కిరాతార్జునీయము, దశకుమార చరిత్రలను తెనుగులో వచన కావ్యములుగా తెనిగించి ప్రచురించిరి. వీరనువదించిన కల్హణకవి "రాజతరంగణి" ప్రస్తుతము ఆంధ్రప్రభ ఆదివారపు అనుబంధములో ధారావాహికగా ప్రతివారం ప్రచురింపబడు చున్నది.

1938లో వీరు "నవ్య సాహిత్యమాల" స్థాపించి దాని ద్వారా పెక్కురచనలు వెలువరించిరి. అప్పుడే వీరి "విరికన్నె" అనబడు పద్యగద్య గ్రంథము ప్రకటింపబడినది. సాహిత్య పిపాసకులను, రచయితలను ప్రోత్సహించు నిమిత్తమై "నవ్య సాహిత్య పరిషత్తు" ఏర్పడగ ఆ పరిషత్తుకు వీరు కార్యనిర్వాహక సభ్యులైరి. 1945లో హైదరాబాదు నుండి వెలువడుతున్న "మీ జా న్" తెలుగు దిన పత్రిక సంపాదక వర్గంలో వీర

ఒకరుగా పనిచేసిరి. "భారతి" మాసపత్రికలో గ్రంథసమీక్ష శీర్షికను కడుబాధ్యతతో నిర్వహించిరి.

1949లో శ్రీ విశ్వంగారు మద్రాసుకు వచ్చి, అక్కడి "అభ్యుదయ రచయితల సంఘము"నకు కొంతకాలము సంపాదకులుగా పనిచేసిరి. తరువాత 1952లో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక మద్రాసు నుండి వెలువడుట ప్రారంభమైనది. అందులో చాలానాళ్లు వీరు సంపాదకులుగాపనిచేసి,మంచిపేరు తెచ్చుకొనిరి.

పెన్నేటిపాట తరువాత వీరి "ఒకనాడు" చెప్పుకోదగిన పద్యకావ్యము. ఇది ఆంధ్రప్రభ వారపత్రికలో ధారావాహికగా వెలువడినది. ఇది రాయలసీమలో జరిగిన ఒక వాస్తవ చారిత్రాత్మక సంఘటన. 1893 అక్టోబరు 4వ తారీఖున ఒక యూరోపియన్ సోల్జర్, హిందూ స్త్రీల మానమును రక్షించే ప్రయత్నములో పోరాడిన గూళిపాలెం హంపన్నను కాల్చి చంపినాడు. హంపన్న గుత్తిలోని రైలు గేటుకీపరు. ఆ హంపన్నచరిత్రకు కావ్యరూపమిచ్చి రాయలసీమ వాసుల కీర్తిని ఇనుమడింపజేసిన ధన్యులు విశ్వంగారు. వీరికి శ్రీ తిరుపతి తిరుమల వేంకటేశ్వరుడు ఆయురారోగ్య భాగ్యములనిచ్చి కాపాడుగాత.

శ్రీ నూతలపాటి పేరరాజు

జననము :- 1896; నిర్యాణము :- 15-11-1968

తల్లి : శ్రీమతి సీతాంబ; తండ్రి : శ్రీ ఆదిరాజు

నివాసస్థానము :- ఉరవకొండ - అనంతపురం జిల్లా, ఆం.ప్ర.

గుంటూరు జిల్లా నూతలపాడు గ్రామములో పుట్టి పెరిగి, విద్యాబుద్ధులు నేర్చి "జగమెరిగిన బ్రాహ్మణునకు జందెమేలః" అన్నట్లు బహు గ్రంథకర్తలుగా వాసికెక్కి పెక్కేండ్లు అనంతపురం జిల్లాలో ఆంధ్రభాషోపాధ్యాయులుగా పనిచేసి, "విద్యార్ణవ" "సాహిత్య సరస్వతి" ఇత్యాది బిరుదములతో కవిగా, పండితునిగా వాసికెక్కిన శ్రీ నూతలపాటి పేరరాజు గారి నెఱుగని సాహితీ ప్రియులరుదు. విజయనగర సామ్రాజ్య చరిత్ర-తులసీ రామాయణం-ఆనంద రామాయణము వీరి భాషాసేవకు నిదర్శనములు. ఆనాటి స్కూలు ఫైనల్ విద్యార్థుల తెలుగు పాఠ్య పుస్తకములకు అరటి పండొలిచి చేతి కిచ్చినట్లుగా, సులభ పద్ధతిలో నోట్సులు తయారుచేసి ముద్రించి విద్యార్థి లోకమున కందించిన విద్యార్థి కల్పతరువులు వీరు.

తులసీరామాయణము, ఆనందరామాయణము, రామకథామృతము వీరి వచన రచనకు మచ్చుతునకలు. చక్కటి వచన రచన చేయగల సమర్థులు వీరు. వైదర్భీవిలాసము, శ్రీ సాయిబాబా చరిత్ర, శాంతి విజయము, తులసీదళము వీరి పద్య

రచనలలో మేల్బంతులు.

వీరి వైదర్భీవిలాసము ఒక చక్కటి ద్విపద కావ్యము. దీనిని కవిగారు 1918లో రచించి, 1928లో ముద్రించిరి. విదర్భ రాజతనయ, రుక్మిణీ పరిణయ గాథ యిందు వర్ణింపబడినది. రుక్మిణి తన మనోహరుడైన శ్రీకృష్ణునకు తన యభీష్టము తెలుపుచూ వ్రాసిన లేఖ చదువుడు.

మం.ద్వి॥ భువనైక సుందరా! పురుషాగ్ర గణ్య!
భవదీయ సుందర పదపద్మములకు
భక్తితో నొనరింతు వందన శతము
గొనుము దయాస్ఫూర్తి గోపాలబాల

—— —— —— ——

నిరతోదిత కరుణానిధి వీవటంచు
లావణ్య సర్వస్వ రమణుడవనుచు
నిన్నె వరింపంగ నెమ్మదిం దలచి,
వాంఛ బెంచితి నిన్నివత్సరంబులను;
నేడు వ్రాసితి లేఖ నీతియేలేక
మదవతియ లిఖించె మందాక్షమీగి
యని, నిరసింపక యరయుము కృష్ణ!

—— —— ——

నీ పదాంబుజసేవ నేబాయగలనె?

మన్నించి కొనిపొమ్ము మానితాకార!
కల్యాణ పూర్వంబు గౌరీ నివేశ
మందు నేనుందు నమంద భక్తికడు
నార్యాసమర్చనా ధ్యాన లీననయి
విలసిల్లు తఱిగాంచి, విమత నికాయ
మాజి నిర్జించి, సమ్మానంబున, నను
గొనిపోవు ఖ్యాతిగై కొమ్ము మానాథ! - "రుక్మిణి"

"శ్రీ సాయిబాబా చరిత్ర" మను ఖండ కావ్యమందు శ్రీ షర్డీ సాయిబాబా పుట్టుక, మహిమలను సంక్షిప్తముగా కడు మనోహరముగా, రసవత్తరముగా వర్ణించిరి. పద్యములన్నియూ ఆణిముత్యములే. రచన అతిసరళము. ఇందు వారు "తోటకము" "సుగంధి" వృత్తములను గూడ వాడిరి. వీరి "సుగంధి" తీరును కొంత ఆఘ్రాణింతము.

కాంచి రంత గాంచనాబ్జ - కమ్ర విస్తృతాక్షినిన్
మించి మందహాసమొల్కు - మేటి మోము వానినిన్
అంచితార్క ఘోరితేజు - హారి దివ్య దేహునిన్
ఎంచి చూడ వారి భాగ్య - మింతనంగ వచ్చునే.

"శ్రీకృష్ణ నిర్యాణము" వీరి అముద్రిత కృతి. శివవిద్యా శ్రీశైలప్రభ - ఆరాధన - పత్రికలకు వీరు సంపాదకులుగా పని చేసిరి. ఉరవకొండలో 30 సంవత్సరాలకాలం తెలుగు పండితులుగా

పనిచేసి, అక్కడే స్థిరపడిరి. కలకాలము నిలుచు కావ్యములే వీరి సంతానము. వీరికి అనంతపురం జిల్లాలో పెక్కుమంది శిష్యులున్నారు. వారందరూ ఉన్నత పదవుల నలంకరించి యున్నారు. వీరి శ్రీరామకథామృతమును ఉరవకొండ తా॥ పెద్ద కౌకుంట్ల గ్రామ వాస్తవ్యులు కీ॥ శే॥ పయ్యావుల కేశన్న గారి కుమారులు శ్రీ పయ్యావుల వేంకటనారాయణగారు తండ్రిగారి పేర ముద్రించి ధన్యులైరి. అనంతపురం జిల్లా సాహిత్యచరిత్రలో శ్రీ నూతలపాటి పేరరాజుగారి పేరు చిరస్థాయిగా నిలిచి కీర్తిని పొందినది,



డాక్టర్
తూమాటి దోణప్ప

జననము :- 1-7-1926

తల్లి: శ్రీమతి తిమ్మక్క

తండ్రి:
శ్రీ తూమాటి సంజీవప్ప

జన్మస్థలము: రాకెట్ల.
ఉరవకొండ తా॥
అనంతపురం జిల్లా

ఉరవకొండ డిస్ట్రిక్ట్ బోర్డు హైస్కూలులో మూడవఫారం చదువుతున్న విద్యార్థులను వారి అభిమాన ఉపాధ్యాయులైన

శ్రీ నూతలపాటి పేరరాజుగారు ఒకసారి బాహ్యప్రపంచానికి విహారయాత్రగా పిలుచుకొని వెళ్లారు. వారు విద్యార్థులను సాహిత్యంలో బాగుగా ప్రోత్సహించేవారు. అప్పుడప్పుడు వారి మధ్య కవితాస్పర్ధలుకూడా నిర్వహించేవారు. ఆ విహారయాత్రలో ఆ పండితులవారు విద్యార్థులను ప్రకృతి సౌందరాన్ని, పుస్తకాలను, మానవ స్వభావస్వరూపాలను వర్ణించమనేవారు. ఉపాధ్యాయులిచ్చిన ఉత్సాహంతో విద్యార్థులు కొద్ది కొద్దిగా ప్రయత్నించి సత్ఫలితాలు పొందేవారు. ఒకసారి ఒక విద్యార్థిని సాయంసంధ్యను గూర్చి వర్ణించమన్నారు. అప్పుడా విద్యార్థి

సాంధ్యలలనా లలామంబు సంతసమున
కట్టుకొన్నట్టి హోంబట్టు పుట్టమనగ
సంజె కెంజాయ లెల్లెడ....................ఇలా ఆశువుగా

చెప్పకొంటూపోయాడు. ఆయనగారి ఆశ్చర్యానికి అంతులేదు. మరోసారి "పారిజాతాపహరణ" కావ్యంగూర్చి ఆశువుగా చెప్ప మన్నారు. అప్పుడా విద్యార్థి తడుముకొనక,

పలుకు పలుకున తేనియ లొలుకునట్లు
అరణపుంగది ముక్కు తిమ్మన్నగారు
పారిజాతాపహరణమ్ము పాడినట్టి
కూరుచున్నారు ముత్యాల గొడుగునీడ.... అని వర్ణించాడు.

ఆ పండితులవారి ఆనందానికి అవధులులేవు. తన శిష్యులు

భవిష్యత్తులో మేటివారు కాగలరని ఆశించారు. వారిని ఆశీర్వదించారు. ఆ సుప్రసిద్ధ తెలుగు పండితుల ఆశీర్వచనములు పొందిన ఆ మేటి విద్యార్థి నేటి తెలుగు విద్యాలయపు తొలి వైస్ ఛాన్సలర్ డాక్టర్ తూమాటి దొణప్పగారు.

దొణప్పగారి చిన్ననాటి విద్యాభ్యాసము సొల్లాపురంలోని వారి పినతాత భీమప్పగారి వద్ద జరిగింది. భీమప్పగారు గొప్ప పౌరాణికులు. ఆయన సంస్కృతాంధ్రములందు మహా విద్వాంసులు. ఆయనవద్ద అమరం, శబ్దాలు, మేఘసందేశం, రఘువంశం, మున్నగు కావ్యాలను దొణప్ప పదేండ్లపాటు చదివారు. ఆ విద్యకూడా ఆయన వెంటే వుంటూ, ఆయన చెప్పిన పొలం పనులు చేస్తూ, "పనికి పని, పాఠానికి పాఠం" అన్నట్లుగా ఆడుతూ, పాడుతూ నేర్చుకొన్నారు. ఇలా ఆయన యోగవాశిష్టం. వివేకచూడామణి, భాగవతం, మున్నగు సంస్కృతాంధ్ర గ్రంథాలన్నీ ఆయన వద్దనే నేర్చుకొన్నారు. సాయంకాలం ఊరి రచ్చబండమీదో, ఇంటి అరుగుమీదో కూర్చుని భీమప్పగారు భారత, భాగవత, రామాయణాలను ప్రవచనం చేసేవారు. వాటిని శ్రద్ధగా వినడం, ఒకొక్కసారి తానుకూడ ప్రవచనం చేయడం, అర్థం చెప్పడం అలవాటు చేసుకొన్నారు దొణప్పగారు. ఇలా చిన్నతనంలోనే పురాణాలపై అతనికి మక్కువ జనించింది.

ఈ విద్యలోపడిన దొణప్పగారికి పదేండ్లవరకు ఎ. బి.

సి. డిలు కూడా రాలేదు. తరువాత ఆయన వజ్రకరూరులోని తన మేనమామ శ్రీ బొబ్బూరి చిన్నతిమ్మప్పగారి యింట్లో వుంటూ ఆంగ్లం నేర్చుకొన్నారు. I, II ఫారాలు అక్కడే ముగించి, IIIవ ఫారం చదువు ఉరవకొండలో ప్రారంభించారు.

చిన్ననాటి నుండి నాటకాలలో అభినయించడం ఆయన అభిరుచి. చిన్ననాడే మోహినీ రుక్మాంగదలో రుక్మాంగదుడు, కృష్ణతులాభారంలో శ్రీకృష్ణుడు, సాయిలీలలో సాయిబాబా పాత్రలను నిర్వహించి మెప్పుపొందారు. ఇన్ని అభిరుచులున్నా ఆయన చదువులో మాత్రం అందరి కంటె ముందే. 1953లో ఆంధ్రా యూనివర్శిటి నుండి బి.ఎ. ఫస్ట్‌క్లాస్, ఫస్ట్ ర్యాంకులో ఉత్తీర్ణులయ్యారు. తదుపరి 1954లో అదే యూనివర్శిటి నుండి యం.ఎ. ప్రథములుగా వుత్తీర్ణులయ్యారు. 1965లో పి. హెచ్. డి. 1982లో డిలిట్ పొందారు. 26 ఏండ్లు ఆంధ్ర మరియు నాగార్జున విశ్వవిద్యాలయం రిజిస్ట్రారుగాను, అంతర్జాతీయ తెలుగు సంస్థ డైరెక్టరుగాను ఉన్నారు. ప్రస్తుతము తెలుగు విశ్వవిద్యాలయం తొలి వైస్ ఛాన్సలర్‌గా నియమింపబడ్డారు.

శ్రీ దొణప్పగారు తమ సాహిత్య కృషిని పూర్తిగా పరిశోధన కార్యక్రమాలకే వినియోగించిరి. వీరు 1969లో "ఆంధ్రసంస్థానములు-సాహిత్యసేవ" అను పరిశోధనా గ్రంథాన్ని ప్రచురించిరి. అది సాహిత్య అకాడమీ అవార్డు నందుకొన్నది.

భాషా చారిత్ర వ్యాసావళి, తెలుగులో క్రొత్త వెలుగులు, ఎని మిది పరిశోధన వ్యాసాల సంపుటి "జానపద కళాసంపద", తెలుగు హరికథా సర్వస్వం (సాహిత్య అకాడమీ అవార్డును 1975-76లో అందుకొన్న పరిశోధన గ్రంథము) వీరి ముద్రిత కృతులు. "తెలుగులో చేరిన ఇందో - ఆర్యన్ పదాలు - దక్షిణ భారతదేశంలో తోలుబొమ్మలాట - మన కళాప్రపూర్ణుల కవితా రేఖలు (కవితలు, జీవిత సంగ్రహాలతోబాటు) ఆకాశవాణి భాషి ణాలు - తెలుగు వ్యాకరణ వ్యాసాలు, ఇవి వీరి అముద్రిత కృతులు. ఇవియేగాక వీరి మరింకెన్నో కవితలు, వ్యాసాలు, కథలు, ఏకాంకికలు, వివిధ పత్రికలలో ప్రచురింపబడినవి.

ఆంధ్ర, ఆంగ్ల, కన్నడ, ప్రాకృత, సంస్కృత భాషలు వీరికి బాగుగా తెలియును. జానపద సాహిత్యము, మాండ లికములు, తెలుగు వ్యాకరణము, భాషాశాస్త్రము, శాసన పరి శోధనములు వీరి అభిమాన విషయాలు. ఇంతటి యోగ్యత గలిగిన విద్యావంతునకు అర్హమైన పదవి లభించినందుకు ఆంధ్రులమైన మనం గర్వింప వలసినదే. "మణినా వలయం, వలయేన మణిః మణినా వలయేన విభాతికరః అన్నట్లు వైస్ ఛాన్సలర్ పదవితో దొణప్ప, దొణప్పవల్ల వైస్ ఛాన్సలర్ పదవి, ఆ రెండింటితో తెలుగు విశ్వవిద్యాలయం శోభిస్తున్నవి" అని శ్రీ తిరుమల రామచంద్రగారు ఆంధ్రపత్రికలో వ్రాయడం

అతిశయోక్తి కాదు. ఆ భాగ్యము సంపూర్ణముగా రాయలసీమ వారిది కావడం మరింత గర్వించదగిన విషయము. 1986 జూలై ఒకటవ తేదీన వీరు షష్ఠి పూర్తిని జరుపుకొంటున్న సందర్భములో యివే మా హృదయపూర్వక అభివందన శతంబులు.

శ్రీ దొణప్పగారు రెండవ షష్టిపూర్తి మహోత్సవకాలం వరకు ఆయురారోగ్యభాగ్యములతో జీవించి మరింత సాహిత్య కృషి గావించగలరని కాంక్షించుచున్నవారము.



డాక్టర్
అంతటి నరసింహం
జననము :- 1925
తల్లి :
శ్రీమతి అంతటి సుబ్బమ్మ
తండ్రి :
శ్రీ అంతటి చెంచలయ్య
జన్మస్థలము :
వెంకటరాజుపల్లి.
రాజంపేట తా॥ కడప జిల్లా

ఆదర్శాలు వల్లించడం అందరికీ తెలుసు. కాని ఆచరణలో వుంచడం మాత్రం అందరికీ చేతకాని పని. తమ రచనలద్వారా

రచయితలు ఆదర్శభావాలను, సంఘ సంస్కరణలను, వర్ణాంతర వివాహాలను, అస్పృశ్యతా నివారణ విధానాలను పాఠకులకు కథలుగా, నవలలుగా వ్రాసి అందివ్వవచ్చు. సన్మానసభల్లో శ్రోతల కరతాళధ్వనుల మధ్య వక్తలు ఆదర్శాలను ఉపన్యసించవచ్చు. కాని తొలుత తానాదర్శవంతుడై వుండాలనుకొనే రచయితలు, వక్తలు చాల అరుదు. వారాదర్శవంతులు కానప్పుడు వారి నీతిబోధకా లెవరికి అవసరమవుతాయి? తెలుగులో ఎందరో రచయితలు తమ రచనలలో సంఘ సంస్కరణ విషయాలను చొప్పించారు. ఆ రచనలు సాహిత్య చరిత్రలో ఖ్యాతి పొందాయి కూడ. ఆ రచనలు చదివి కొందరిలో మార్పురావడం కూడ జరిగింది. కానీ ఆ రచయితమాత్రం ఆ భావాలను కాసింత కూడ ఆచరణలో వుంచడు. అప్పుడవి శుష్కరచనలుగానే వ్యవహరించవలసి వుంటుంది.

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 39 ఏండ్లు గడిచింది. విద్యాధికుల సంఖ్య పెరిగింది. నాగరికత బాగా ముదిరింది. అంతేకాని మానవత్వం ఇంకా పెంపొందలేదు. అందుకే మన జాతిలో నేటికి అస్పృశ్యత అలాగే వుంది. సాంఘిక అసమానత్వం అట్లాగే వుంది. అందుకే ఒక రచయిత తాను వ్రాసిన ఆదర్శాలను తొలుత తాను ఆచరణలో వుంచుతూ యిలా అన్నాడు. "నా నవలలను చదివి పాఠకులు మెచ్చుకుంటే

నాకంత ఉత్సాహం వుండదు. దానిలో చెప్పినట్లు ఆచరిస్తే అధి కానందం కలుగుతుంది. దీనివల్ల వారికి, దేశానికి, అసలు మానవజాతికీ అభ్యుదయం కలుగుతుంది" అని. అలాంటి అభ్యుదయవాది. ఆ ఆదర్శరచయిత శ్రీ అంతటి నరసింహం గారొక్కరేనని ఘంటాపథంగా చెప్పవచ్చు.

శ్రీ అంతటి నరసింహంగారు కులవ్యవస్థను రూపు మాపుతూ, స్త్రీ విద్యను ప్రోత్సహిస్తూ, వరకట్నం నిషేధిస్తూ కులాంతర వివాహంగా ఓ చదువుకొన్న అమ్మాయిని, కట్నం లేకుండా పరిణయమాడారు. కాలేజిలో చదువుతున్నంత కాలము కాఫి, టీ, సిగరేట్ ముట్టక ఆదర్శవంతంగా జీవించారు. ఆదర్శ రచయితగా వాసికెక్కారు.

శ్రీ అంతటి వారు 1939-40లో మిడిలుస్కూలు విద్య ముగించి 1943లో యస్. యస్. యల్. సి. ముగించారు. అనంత పురం కాలేజీలో 1945లో ఇంటర్ మీడియట్ ముగించి, 1949లో వాల్తేరు ఆంధ్ర విశ్వవిద్యాలయములో బి. ఏ. ఆనర్సు ముగించి పిదప 1974లో శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటి నుండి "ప్రబం ధాలలో ప్రకృతివర్ణన" అనే పరిశోధనా గ్రంథము వ్రాసి డాక్ట రేట్ పొందారు. 1946 నుండి 1976 మధ్య అనేక ప్రభుత్వ కళాశాలలలో ఆంధ్రోపన్యాసకులుగా పనిచేశారు. తరువాత 1976 ఫిబ్రవరి నుండి కొంతకాలము ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృ

త్మిక వ్యవహారాల శాఖకు ప్రత్యేకాధికారిగా నియమింపబడ్డారు.

శ్రీ అంతటి నరసింహంగారి మనోగత భావాలను మనం వారి రచనల వల్లనే తెలుసుకోవచ్చు. వారు సమాజంలో సమానత్వం కోరారు. అస్పృశ్యత అణగారి పోవాలంటే కుల వ్యత్యాసాలను కూల్చి, కులాంతర వివాహాలు జరపాలంటారు. "సమాజంలోని ఉచ్చనీచతలకు, కలిమిలేములకు, అజ్ఞాన అస్పృశ్యతలకు, వర్ణధర్మమే మూలకారణం. అట్టి మన సాహిత్యాన్ని సంస్కరించాలి" అని అంతటివారు తమ అభిప్రాయాలను వెల్లడిచేశారు.

వీరు గేయకావ్యాలు, సాంఘిక నవలలు, చారిత్రాత్మిక నవలలు, నాటకాలు మరెన్నో రచించారు. వీరి రచన లన్నింటి లోను వీరి అభిమాన విషయాలను గూర్చే చర్చించారు. ఆదర్శం - భావం - స్వగతం-ప్రేమభిక్ష - శోభాదేవి - శంపాలత వీరి సాంఘిక నవలలు. వీరి నవలలు సంఘంలో కొంత సంచలనాన్ని సృష్టించాయి. వీరి "భావం" నవలలో "సెక్సు" అధికంగా వుందని పాఠకులు అభిప్రాయపడినా, అది వట్టి భ్రమేనని, అది వారి భావంమీద ఆధారపడి వుంటుందని నిరూపించారు. పెద్ద-చిన్న, కులం-మతం, దేవుడున్నాడు - లేడు ఇవన్నీ భావంపైనే ఆధారపడి వుంటాయన్నది రచయిత భావన.


వీరి ఆదర్శం నవలలో అస్పృశ్యతానివారణ ముఖ్యాంశంగా

చెప్పబడింది. కులమత భేదాలవల్ల వివాహం ఆగిపోయి, అవివాహితగా నిలచిపోయిన లేడీ లెక్చరర్ సానుభూతిమయ గాథ "లేడీ లెక్చరర్ స్వగతం" నవలలో చెప్పబడింది. "సహజీవనం" అస్పృశ్యతా నాటిక. 1956లో అనంతపురం జిల్లా కలెక్టరు గారు జరిపిన పోటీలలో దీనికి బహుమతి వచ్చింది. సమర సత్వం-మానవత్వం-పరిష్కారం వీరి మరికొన్ని సాంఘిక నాటకాలు. పరిష్కారం నాటకంలో మరో అంతర్నాటకం ఉండడం ఒక విశేషము. రామరాయలు-చారిత్రాత్మిక నవల. ఇందు అళియ రామరాయలు కులాంతర వివాహం చేసుకొని ఆనాటికే ఆదర్శవంతుడయ్యాడని, సంఘసంస్కరణ ఆనాటినుండే అమలులోకి వచ్చిందని చెప్పబడిన నవల యిది. "భువనవిజయం"-పఠనకు ప్రదర్శనకు యోగ్యమైన నాటిక.

ఇవియేకాక బాలసాహిత్యం వైపు కూడ తమ కలాన్ని నడిపించారు అంతటివారు. కోటవీరన్న సాహసం, ఉదయగిరి పోలన్న ధైర్యం, మంత్రాల రామన్న మొండితనం, కవిగారి బాల్యం వీరి బాలసాహిత్యపు నవలలు. చాలా కుతూహలం రేకెత్తించే విధంగా వ్రాయబడిన పిల్లల నవలలివి. ఇంకనూ వీరి వెన్నో అముద్రిత కృతులు ముద్రణ భాగ్యాన్ని పొందవలసి వున్నాయి.

శ్రీ అంతటి నరసింహంగారు విశాల హృదయులు.

పండితుల యందాదరాభిమానములు గలవారు. సమతావాదిగా మానవసేవ చేస్తున్నవారు. పరమేశ్వరుడు వీరికి ఆయురారోగ్య భాగ్యములనిచ్చి కాపాడుగాత!



శ్రీ అవధాని రమేష్

జననము: 12-4-1921

తల్లి: శ్రీమతి సావిత్రమ్మ

తండ్రి: వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రి

జన్మస్థలం: ఔరు అగ్రహారం. కర్నూలు జిల్లా

అనంతపురంలో ఒకసారి జిల్లా రచయితల సంఘం మహాసభలు వేడుగ్గా జరిగాయి. ఆ కార్యక్రమంలో ఒకనాడు బాల సాహిత్యానికి సంబంధించిన ఒక కథల సంపుటిని ఆవిష్కరించడం జరిగింది. ఆ సభలో ఆ రచయిత "మన జిల్లాలో బాల సాహిత్యం వ్రాసిన రచయితలు లేరు." అని గట్టిగా చెప్పడం, ఆ సభాధ్యక్షులవారు వెంటనేలేచి "అయ్యా! మీకు తెలియదేమో! ఈ సభకు ఉపన్యాసకులుగా ఆహ్వానింపబడిన అవధాని రమేష్

గారు మనజిల్లాలో విద్యాశాఖాధికారులుగా పనిచేసినవారు. బాల సాహిత్య రచయితలు. పెక్కు పిల్లల కథలు, పుస్తకాలు వ్రాసినవారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుండి 1965, 67, 69 సం॥లు వరుసగా బాలసాహిత్య బహుమతులను గెల్చుకొని, సన్మానింపబడినవారు" అని శ్రీ అవధాని రమేష్‌గారిని గూర్చి శ్రోతలకు చెప్పగానే, ఆ రచయితతోబాటు పెక్కురు తమకొక కొత్త విషయం తెలిసివచ్చినట్లు చకితులయ్యారు. అంతవరకు శ్రీ అవధాని రమేష్‌గారు వారందరికీ జిల్లా విద్యాశాఖాధికారిగానే పరిచయం.

శ్రీ అవధాని రమేష్ గారు అనంతపురం జిల్లాలో చాల ఏండ్లు జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేశారు. వీరు ఈ జిల్లా లోని చాలామంది ఉపాధ్యాయ వర్గానికి గురుదేవులు. చక్కటి బోధకులు, మంచి రచయితలు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, సంస్కృత భాషలలో గొప్పగా కృషిచేసిన విద్యావంతులు. మంచి వక్తలు. అభ్యుదయ భావాలుకలిగిన అభ్యుదయ కవి. సంస్కృత ములో కొన్ని వందల శ్లోకాలను కంఠస్థముచేసి, వాటిని తమ ఉపన్యాసములలో సందర్భానుసారముగా వల్లిస్తూ, అర్థము విశదీకరిస్తూ శ్రోతల నానందింప చేయుట వీరి ఉపన్యాసములోని ప్రత్యేకత.

శ్రీ రమేష్‌గారి ప్రాథమికవిద్య స్వగ్రామంలో జరిగింది.

6వ తరగతి నుండి యస్. యస్. యల్. సి. వరకు తాడిపత్రి పురపాలకోన్నత పాఠశాలలో విద్య నభ్యసించిరి. అటుతరువాత అనంతపురం ఆర్ట్సు కాలేజిలో ఇంటర్, బి. ఏ., పరీక్షలలో కృతార్థులై కాశీ విశ్వవిద్యాలయంలో ఎం. ఏ. పరీక్ష నెగ్గిరి. "ఇంగ్లీషు మెథడ్సు"లో ప్రత్యేక శిక్షణ పొందిరి.

వీరు మంచి రచయితలు. దరిదాపు 60 పుస్తకములు రచించిరి. బాలసాహిత్యంపై ఎక్కువగా కృషిచేసిరి. బాలల కనువగు పుస్తకములు వ్రాసిరి. వాటిలో ముఖ్యమైనవి లాల్ బహదూర్ శాస్త్రి, బాలగంగాధరతిలక్, తృణకంకణము, వీర పూజ, మూడు మంచికథలు, ప్రతీకారము (చిన్నకథలు) కాసుల పేరు (పిల్లలకథల సంపుటి) అజ్ఞాతవీరులు, ఇందిరాభారతం, వీరు ఇతర రాష్ట్రీపు విద్యార్థులకొరకు ఆంగ్లములో వ్రాసిన "ఉపవాచకములు" మిక్కిలి వ్యాప్తిలోనికి వచ్చినవి. వీరి ఇందిరాభారతం ఒక ఉద్గ్రంథము. భారతరత్న శ్రీమతి ఇందిరా గాంధి జీవిత చరిత్రను, ముఖ్య ఘట్టములను, ఆమె పాలనా కాలములో సాధించిన ఘన విజయాలను రచయిత చక్కగా, విపులంగా, ఫోటోలతో 250 పేజీల డెమ్మీసైజులో ప్రచురించారు. ఈ పుస్తకాన్ని ఒక జీవితచరిత్ర గ్రంథంగా కాకుండా "ఫ్లాష్‌బ్యాక్ టెక్నిక్" ని ఉపయోగించి వ్రాయడంతో చదువరులను విశేషంగా ఆకర్షిస్తుంది. రచయిత బహు శ్రమలకోర్చి

అనేక విషయములను ఈ గ్రంథములో చొప్పించి గణనీయ మైన కృషి చేసిరి.

భారత స్వాతంత్ర్య పోరాటములో అవధానిగారు కూడ పాల్గొని కారాగారక్లేశము ననుభవించిన అజ్ఞాత యువకవీరులలో ఒకరు. అందుకే వారు మాతృదేశ దాస్యవిముక్తికై పోరాడిన అజ్ఞాత వీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ "అజ్ఞాతవీరులు" అను పొత్తమును వారికి అంకితమిచ్చిరి. ఈ పుస్తకమునందు వీరు వ్రాసిన "పూర్వచరిత్ర - స్వాతంత్ర్యసౌధపు పునాదులు" అను ముందు మాట చదివినప్పుడు రచయితగారికి గల బహు గ్రంథ పరిచయమును గూర్చి మనకు తెలియనగును. ఇందు బలవంత రావుఫాడ్కే, హరిదయాల్, జితేంద్రనాథ్‌లహరీ, శ్రీమతి బీణాదాస్, నారాయణ (హుబ్లి)ల చరిత్రలు చేర్చబడినవి.

ఈ అజ్ఞాతవీరుల అమర చరిత్రలను వ్రాయదలచి, కవిగారు భారతజనని ఆశీర్వాదములు కోరుతూ ఇట్లు వ్రాసిరి.

"ఇతిహాసపు చీకటికోణం
అట్టడుగున పడి కాన్పించని
కథలన్నీ కావాలిప్పుడు
దాచేస్తే దాగనిసత్యం

భారతవీరుల దివ్యగాథలు
స్మరిస్తే హృదయవిదారం

మఱపిస్తే మఱువనిదృశ్యం
భారతీయ యితిహాసం."

మాతృదేశంపై అనన్య భక్తిప్రపత్తులను తమ రచనల ద్వారా వెల్లడించిన దేశాభిమానులు శ్రీ రమేష్‌గారు. ఎన్నో ఏండ్లు జిల్లా విద్యాశాఖాధికారిగా తమ కార్యనిర్వహణలో ఎల్లప్పుడు నిపుణులై వున్నను, సాహిత్యాభిమానులుగా ఎన్నో రచనలుచేసి, విప్లవరచయితల సంఘం, అభ్యుదయ కళాసమితి, రాయలకళాగోష్ఠి మొదలగు సంస్థలను స్థాపించిరి. "విశ్వప్రేమ" అను పత్రికను నడిపిరి. వీరి సతీమణి శ్రీమతి పద్మావతమ్మ కూడ జిల్లా విద్యాశాఖాధికారిణిగా పనిచేసిరి. ప్రస్తుతము వీరు అనంతపురం పట్టణములో స్వగృహమందు విశ్రాంతి తీసుకొంటున్నారు. వీరికి భగవంతుడు ఆయురారోగ్య భాగ్యములనిచ్చి కాపాడుగాత!

బాలకవి

శ్రీ పాలుట్ల వెంకటనరసయ్య

జననము : 29-12-1911

తల్లి: శ్రీమతి సుందరమ్మ; తండ్రి: శ్రీ మార్తాండయ్య

జన్మస్థలం: రాజుపాలెం - ఎఱ్ఱగొండుపాలెం తా॥ - ప్రకాశం జిల్లా

శా॥ సాలంకారముగా సలక్షణముగా శబ్దార్థయుక్తంబుగా
సౌలభ్యంబగు శైలి, సత్కవులు మెచ్చన్। కందముల్‌నూరుని

ట్లాలోచించక, బాల్యకాలమున వ్రాయ। న్నేర్చితౌనౌ! భళీ!
పాలుట్లాన్వయవార్ధిపూర్ణకుముదాప్తా! నారసింహాగ్రణీ॥

అంటూ అవధాని శ్రీ ఉప్పల పిచ్చయ్యశాస్త్రిగారు, శ్రీ పాలుట్ల వెంకటనరసయ్యగారి "హైమవతీశ" శతకము పఠించి, వ్రాసిన ప్రశంసాపద్యమిది. చిన్నతనముననే కవిత్వము వ్రాయుట కలవాటుపడిన వెంకటనరసయ్య గారిని అందరూ "బాలకవి" యని పిలిచిరి. ఈ కవితాధోరణి యలవడుటకు ముఖ్యకారణము, వారు శ్రీ పుద్దిరాల గోపన్నగారి గురుకుల వేద పాఠశాలలో శ్రీ రాళ్ళబండి నృసింహశాస్త్రుల వద్ద, "రఘు వంశము," "అప్పకవీయాది" గ్రంథములు చదువుటవలనను, వారి కులదైవము, శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి వారి అనుగ్రహము వల్లను కలిగినది. శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామిని, వీరి కుటుంబీకులు కడు భక్తిశ్రద్ధలతో అహర్నిశలు కొలిచెడిభక్తాగ్రగణ్యులు.

శ్రీ వెంకటనరసయ్య, చిన్నతనమునుండి దత్తతండ్రి నరసయ్యగారి వద్దనే పెరిగి విద్యాబుద్ధులు నేర్చిరి. 5వ తరగతి వఱకు మాత్రమే పాఠశాల చదువు సాగినది. 11వ ఏటనే ఉపనయనము చేసికొని తండ్రిగారి వద్ద "మంత్రపాఠము" "ముహూర్త జాతక పాఠములు", వేద పాఠశాలలో "శాస్త్రము, ఛందస్సు" నేర్చి, కవిత్వము చెప్ప నారంభించిరి.

1931 సం॥ నుండి కొంతకాలము త్రిపురాంతకపు గ్రామ కరణముగాను, మునసబుగాను, పనిచేసిరి. "పరోపకారార్థ-మిదంశరీరం" అను ఆర్యోక్తి ననుసరించి వీరు తమ గ్రామములోని హైస్కూలు, ఆస్పత్రి, దేవళములకు విరివిగా విరాళముల నిచ్చిరి. కాశీ, రామేశ్వరాది తీర్థయాత్రలు చేసిరి. అన్నదానము లొనర్చి, వేదపండితులను, కవులను సన్మానించిరి. ఇన్ని పుణ్యకార్యములు చేసినను, వీరు చేసుకొన్న పూర్వజన్మ దుష్కర్మఫలమేమో గాని సంతానము దక్కలేదు. తుదకు కవి గారు తమ గ్రామం రాజుపాలెములోని, తమ కులదైవం శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి వారి యనుగ్రహముకోరి "హైమవతీశ శతకము"ను రచించి, ముద్రించి ఆ పొత్తములను, కాశీగంగ సమారాధన సందర్భమున బంధు మిత్రాదులకు పంచిపెట్టిరి. వీరి హైమవతీశ శతకములో ఆ త్రిపురాంతకు నిట్లు వేడిరి.

కం॥ చాలు సుపుత్రుండొక్కం
డేలా? బహుమంది సుతులు హీనమనస్కుల్
చాలడె శూరుండొక్కం
డాళంబున ధైర్యశాలి, హైమవతీశా!

కం॥ అనృతం బాడిన దోషం
బున, కెనయగు దోషమున్నె? భువి, నిది నిజమౌ
నని, మదిలోనమ్మి నరుం
డనఘము, నిజ మాడవలయు; హైమవతీశా!

వాగ్దాన మొనర్చినచో దానిని తూ.చ. తప్పక ఆచరించెడి దీక్షా పరాయణులు, వెంకటనరసయ్యగారు. అనృతదోషమునకు కూడా వారు వెఱతురు. ఒకసారి అవధాని ఉప్పల పిచ్చయ్య శాస్త్రిగారిని, ఫలనా రోజున వచ్చి దర్శించెదనని చెప్పి, అనివార్యమైన కార్యమొక్కటి తటస్థించి చెప్పిన వ్యవధిలో వారిని కలియలేకపోయినందుకు చింతించి, అనృతదోష నివారణార్థము వారు ఆ రాత్రికి రాత్రే 25 మైళ్ళు నడిచి వెళ్ళి రాత్రి ఒంటి గంటకు వారిని దర్శించిరి. అప్పుడు శ్రీ పిచ్చయ్యశాస్త్రి గారు, ఆశ్చర్యపడి ఆశువుగా యిట్లు చెప్పి, ఆశీర్వదించిరి.

ఆ.వె. వనజ సంభవుండు - యినుపకాళ్ళను, రాతి
నోరు బెట్టి, నీ శరీరసృష్టి
జేసె; లేకయున్న - చిత్రంబుగా నిట్లు
నడువ, నుడువనగునె? నారసింహా!

అట్టి పెద్దల ఆశీర్వచన ఫలితముగా, వీరు శ్రీ త్రిపురాంతకేశ్వర మాహాత్మ్యము రచించి, ప్రచురించిరి. ఉగ్రనరసింహస్వామిదండకము, మార్కాపురం చెన్నకేశవచరిత్ర, తిరుమలనాథస్వామి చరిత్ర, పాలంక వీరభద్రుని చరిత్ర, పాలుట్లవారి వంశచరిత్ర, మార్కాపురం తాలూకా కవులచరిత్ర వీరి అముద్రిత కృతులు. శంకరుడు తమ కిచ్చినంతలో లేదనక కవి పండితుల కార్థిక సహాయం గావిస్తూ కవిపోషకులని కీర్తి పొందిరి. వీరికి ఆ త్రిపురాంతకేశ్వరుడు ఆయురారోగ్య భాగ్యములిచ్చి కాపాడుగాత!



శ్రీ గరుడంపల్లి రోషన్

జననము :- 11-9-1942

తల్లి: శ్రీమతి మెహబూబీ

తండ్రి : శ్రీ ముష్కిన్‌వలీ

జన్మస్థలము : గరుడంపల్లి.

ధర్మవరం తా॥

అనంతపురం జిల్లా

భారతరత్న, శాంతిదూత, భారత ప్రియతమ నాయకుడు శ్రీ చాచా నెహ్రూ, దివంగతులైనప్పుడు యావద్భారత దేశమే శోకసముద్రములో మునిగింది. అనంతపురంలో, ఆ ప్రియతమ నాయకునకు శ్రద్ధాంజలి ఘటించడానికి ఒక సంతాపసభ జరిగింది. ఆ సభకు ప్రముఖులందరూ హాజరయ్యారు. శ్రీ కల్లూరు సుబ్బరావుగారు ఆ సభకధ్యక్షులు. పెక్కుమంది కవిపండితులు తమ ప్రగాఢ సంతాపమును వెల్లడించి జోహార్లు అర్పించిరి. వీరందరిలోను ఒక యువకవి వ్రాసిన "పంచాశ్రువులు" అందరి మన్ననల నందుటేగాక కల్లూరు సుబ్బరావుగారి మెప్పును ఆశీస్సులను పొందడం జరిగింది. ఆ కవి వ్రాసిన పద్యమిది.

ఉ॥ నెత్తురు లింకినట్టి ధరణీస్థలి, నీతియు దేశభక్తియున్
గిత్తలగట్టి ధర్మమును కేల హలంబుగ బట్టి, సత్యపున్

సత్తువబెట్టి, సాత్త్వికపు సస్యములన్ మొలిపించి, శాంతి సం
పత్తిని పెంచినట్టి "కృషిపండితు"డా జవహారు దుర్ధరన్.

ఈ పద్యమువిన్న ప్రతిఒక్కరు, ఆనాడె ఈ యువకుడు మంచి కృషి గావించిన చక్కటి రచనలు చేయగలడని తలచిరి. ఆ కృషిని విడువక ఆ యువకుడు తెలుగు సాహిత్య నందనోద్యానవనంలో, సుగంధ కవితా పుష్పములను పూయించినాడు. మహమ్మదీయ కుటుంబమున పుట్టిన ఆ కవిపేరు గరుడంపల్లి రోషన్.

శ్రీ రోషన్ చిన్నతనంనుండి భారతీయ జాతి సమైక్యతా భావమును కలిగిన అభ్యుదయవాది. వీరి తండ్రి ముష్కిన్‌వలీ ఉపాధ్యాయ వృత్తిని నిర్వర్తిస్తూ, కవిత్వాన్ని కైవశం చేసుకొని, ఎన్నో ఖండికలు "నానార్థపద్యరత్నాకరము" అను వేయి కందములుగల గ్రంథము రచించినవారు. ఈతని పెద్దతల్లి యం. రాబీయాబీ (చియ్యేడు) అనంతపురం డిస్ట్రిక్టు బోర్డు మెంబరుగా పేరు గడించి, "క్విట్ ఇండియా" ఉద్యమంలో కారాగార శిక్ష అనుభవించిన తొలి మహమ్మదీయ వనిత. శ్రీ పొట్టి శ్రీరాములుగారు ఈమెను, "మహమ్మదీయ ఆదర్శమహిళ" గా ప్రశంసించిరి.

ఈ కవికి కులమతముల యెడ సంకుచిత భావములేదు. పుట్టింది మహమ్మదీయ మతంలోనైనా తొలుత వినాయకునికి

సలాములుచేసి కవిత ప్రారంభించును. తిరుపతి వేంకటేశ్వరుని తన యిష్టదైవంగా భావించును. అల్లాను ఆరాధించును. అందుకే ఆయనంటాడు "నాది భారతజాతి" అని. "నేను-నాదేశం" అనే ఖండికలో యిట్లా చెప్పుకొంటాడు.

తే॥ సంకుచిత వర్ణభేదముల్ సమయజేసి
పరగు సువిశాల దీర్ఘ దృక్పథము నాది
మతము, కులమను, నంధతమస్సు బాసి
ప్రజలు జిందెడి దృఢ మనోరథము నాది.

శ్రీ రోషన్ కవిత్వము, శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి కవిత్వాన్ని జ్ఞప్తికి తెస్తుంది. ఈతని కవిత్వం అతి మృదు మధురంగా, సరళంగా, భావయుక్తంగా, రమ్యతగా ఉషఃకాలంలో వీచే మలయమారుతంగా సాగిపోతుంది. ఇతనిది జీవమున్న కవిత్వము. సహజ సుందరంగా పూచి, మొగ్గతొడిగి, వికసించి, గుబాళించే గులాబీ సొబగులావుంటుంది వీరి రచన. "రాగ సుందరి" ఖండికలో వీరి సుందరమైన రచన యిలా సాగింది.

ఉ॥ కొమ్మలమాటులో, కొదమకోయిల, కమ్మగ పాడసాగె రా
రమ్మసఖీ! సుఖింతమనురాగ సుధాంబుధిలోనదేలి, ప్రా
యమ్మికరాదు; రేపనెడి యాసలు జూపగనేల నింక? నీ
కమ్మనిమోవి పానమును, కాన్కగ నీయవె! రాగసుందరీ!

వీరు వ్రాసినవన్నీ ఖండికలే. అన్నీ అముద్రితాలే. పుస్తకరూపమున కింకా ఎక్కలేదు. సాహితీ మిత్రుల ప్రోద్బలముతో వీరు "చంద్రవదన - మోహియార్" అను "ప్రేమైక్య జీవుల" చారిత్రాత్మక కథావస్తువును గైకొని కావ్యముగా వ్రాసిరి. ఇందలి పద్యములు రసగుళికలు. ఆ కావ్యము వెలుగు జూచెడి భాగ్యము కవిగారికి భగవంతుడు కలిగించుగాత!

"సత్యభామ సాంత్వనము" - "మణిమేఖల" - "భావ తరంగాలు" మరికొన్ని నాటికలు - పాటలు-పద్యాలు, వీరి అముద్రిత రచనలు. వృత్తిరీత్యా ఉపాధ్యాయులగుటచే, పుస్తకములు స్వంతముగా ముద్రించుకొను ఆర్థికస్తోమత వారికి లేదు. చిన్నతనమునుండి సంగీతము-సాహిత్యములమీద అభిమానం మెండు. తాను వ్రాసిన పాటలు, పద్యాలకు చక్కటి బాణీలను రాగాలను కూర్చి పాడగల నేర్పరి. కొందరి తేనెమాటలు నమ్మి, సినిమా రచయితగా పైకి రావాలని ఉబలాటపడి, అక్కడి వారి స్వార్థ బుద్ధులను పసిగట్టి, "వారు ఉన్నత స్థితికి రావడానికి మనల్ని నిచ్చెనలుగా ఉపయోగించుకొంటారే తప్ప మనల్ని పైకి రానీరు" అని తెలుసుకొన్న కవి రోషన్. ఈతనికి భగవంతుడు భవిష్యత్తులో, ఆయురారోగ్య భాగ్యములనిచ్చి కాపాడుగాత!

శ్రీ బత్తలపల్లి నరసింగరావు

జననము : 22-8-1901 —— నిర్యాణము : తేది తెలియదు

తల్లి: శ్రీమతి నరసమ్మ —— తండ్రి : శ్రీ సుబ్బరామయ్య

జన్మస్థలము : మద్దిమడుగు - కదిరి తా॥ - అనంతపురం జిల్లా

శ్రీ బత్తలపల్లి నరసింగరావుగారు 1944 నుండి 1958 వరకు అనంతపురం మునిసిపల్ హైస్కూలులో గ్రేడు-I తెలుగు పండితులుగా పనిచేసి, రిటైరయిన తదుపరి పోలీసు ట్రయినింగు కాలేజీలో లెక్చరరుగా చేరి, కొన్నాళ్ళు పనిచేయడంతో వీరి పేరు అనంతపురం జిల్లా వారికి బాగుగా తెలియును. వీరు భక్తకల్పద్రుమ శతకమును 1931లోను, కులలక్ష్మి 1933 లోను, 1948లో జవహర్ ఇందిరలేఖలు (అనువాదము)1963లో నీతిగాథలు ముద్రించిరి. వీరి భక్తకల్పద్రుమ శతకము కదిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామియొక్క స్తోత్రములు. అందలి పద్య మొకటి చూతము.

శా॥ శ్రీరమ్యంబగు రత్నపీఠమున, నాసీనుండవై పార్శ్వమం
దారామామణి సేవజేయగను, బ్రహ్లాదుండు సద్భక్తితో
నారాధింప గృహాంతరంగమున, నిష్టార్థంబులన్ గూర్చు లో
కారాధ్యా! ననుగావు ఖాద్రి నరసింహా! భక్త కల్పద్రుమా!

వీరి అముద్రితకృతులు పెక్కు కలవు. వాటిలో "చంద్ర వదన మోహియార్" - 3 ఆశ్వాసముల కావ్యము. మత సామ

రస్యమును ప్రబోధించు ప్రేమజీవుల గాథ. దీనిని కవిగారు శ్రీ గాంధీ మహాత్మునికి అంకిత మిచ్చిరి. "అభినవ - వేమన శతకము", "రామస్తోత్ర రత్నాకరము", "ఖాద్రి లక్ష్మి నృసింహ స్వామి చరిత్ర" ఇవి కూడ అముద్రితములే. అభినవ వేమన శతకములో 300 పద్యములు కలవు. అందలి ఒక పద్యము.

వాణి యజునిరాణి - వాక్కున నెలకొని
వీణమీటి సెగడ - వివిధగతుల
ఆట వెలదులెల్ల - నవె యాడి పాడెరా
విశ్వదాభిరామ - విను నృసింహ!

శ్రీ నరసింగరావు సంఘసేవా పరాయణులు. వీరు ఐక్య భారత సేవాసంఘమును స్థాపించిరి. గాంధి ఆయుర్వేద ఆస్పత్రిని నెలకొల్పి ఉచిత వైద్యము చేయుచుండిరి. బొంబాయిలోని "సంస్కృత విశ్వపరిషత్తు"కు సెక్రెటరీగా పనిచేసిరి. అనంత పురం కొత్తూరులోని మూడవ రోడ్డులో చాలకాలము నివసించి తుదకు ఖాద్రి లక్ష్మినరసింహస్వామి కృపకు పాత్రులై దివి చేరిరి.

శ్రీ టి. శివశంకరం పిళ్లై

శ్రీ టి. శివశంకరంపిళ్లైగారు అనంతపురం జిల్లా పెనుకొండ నివాసి. న్యాయవాది, మంచివక్త, మంచి రచయిత. అనేక సంవత్సరాలు పెనుకొండ తాలూకా బోర్డు ప్రెసిడెంటుగా పని చేసిరి.

వీరు వ్రాసినవి : 1) రామరాయలచరిత్ర, 2) వేంకటపతిరాయలచరిత్ర, 3) రాజత్వపౌరత్వము, 4) ఆంగ్లదేశాటన చరిత్ర, 5) భగవద్గీత, 6) స్థానికకూటములు, 7) దేశమాతాస్తవము, 8) ఉల్‌నత్తుఖాజాకంగళ్. (తమిళ గ్రంథము)

" దేశమాతాస్తవము " (National Anthem) ఒక దేశీయగీతము. స్వరసాహిత్యములతో ప్రచురింపబడినది. ఇట్టి గీతము దేశమున కవసరమని ఎంచి శ్రీ టి. శివశంకరపిళ్లైగారు 1883 నాటికే ఈ గీతమును రచించి, దానిని 1908 సంవత్సరంలో మదరాసు కాంగ్రెస్సు సభలకు వెళ్ళినప్పుడు ఆంధ్ర నాటక పితామహులగు శ్రీమాన్ ధర్మవరం రామకృష్ణమాచార్యులవారికి పాడి వినిపించిరి. ఆ పాట అల్లుటకు వీరి కాప్తమిత్రులైన సంగీత విద్వాన్ " చోళేమరి నరసింహాచార్లు ", చిరకాలము పెనుకొండలో ఉపాధ్యాయులుగా పనిచేసిన "శ్రీ కురూత్తాళ్వారు అయ్యంగార్లు", బెంగళూరు "చక్రవర్తి వేంకటవరద అయ్యంగార్లు" తోడ్పడిరి. ఆంధ్రభాషయందు దేశీయ గీతమంత వరకు

లేదను కొఱతను పిళ్లేగారు తీర్చిరి. వీరి గీతమును వ్రాయుటలో గల ఆశయము నిట్లు వ్రాసుకొనిరి.

"జాతీయైక్యతకు ఆంధ్రలోకమున కిట్టి గీత మొకటి ఇప్పటి పరిస్థితులందు ఆవశ్యకమనియు, యిట్టి గీతము, నెల్లరూ పాడ నేర్వవలెనన్న స్వర సాహిత్యములు, సులభములై యుండుట అవసరము. అందలి భావములు సహితము లలిత ములై యున్నగాని ప్రయోజనముండదు. అందుకే ఈ గీతము నాంధ్రలోకమునకు సమర్పించితిని."

వీరి రామరాయలచరిత్ర, వేంకటపతి రాయలచరిత్ర, ప్రసిద్ధములు. అవి ప్రస్తుతము అలభ్యములు. ఈ రెండు పుస్తకములు చరిత్రకారుల కెంతగానో నేటికి ఉపయోగపడు చున్నవి. వీరి కృషి ఆచంద్ర తారార్కముగా నిలిచినది.

శ్రీ పమిడికాల్వ చెంచు నరసింహశర్మ

జననము :- 19—8—1919

తల్లి: శ్రీమతి మంగళాంబ; తండ్రి : శ్రీ చెంచు సుబ్బయ్యశర్మ

జన్మస్థలము :- పెనగలూరు - రాజంపేట తా॥ కడప జిల్లా

రాయలసీమలో వెలుగు మొగము చూడక పల్లెలందే అడగియుండిన కవిరత్నములెందరో కలరు. వారిలో శ్రీ చెంచు

నరసింహాశర్మ గారొకరు. ఈ కవిగారు నిరాడంబరులు, నిష్కపటులు. పల్లెవాసుల పసిడి హృదయము వీరిది. వ్యవసాయము చేసుకొనుచు పోతనవలె కాలము వెళ్ళబుచ్చినవారు-పండ్రెండవ యేటనుండియే, వీరికి కవిత అలవడినది. సంగీతము, జ్యోతిషము, మంత్రశాస్త్రము, వైద్యము మున్నగు వాటియందు వీరికి మంచి ప్రవేశము కలదు. చిన్నతనమునుండి వీరికి పోతన భాగవతమన్న ప్రాణము. ఆ మహాకవి వీరికాదర్శమూర్తి. అతని వలెనే వీరును సహజ పాండిత్య శోభితులు.

స్వయంకృషితో ఆంధ్రభాషావిశారద, విద్వాన్ పరీక్షలు, ముగించి తెలుగు పండితులుగా పనిచేసిరి. తమ గ్రామమందే వెలసియున్న నయనాధీశ్వరునిపై "నయనాధీశ శతకము"ను రచించిరి. ఈ శతకమునకు జనమంచి వేంకట సుబ్రహ్మణ్యశర్మ గారు పీఠికను వ్రాసిరి. "భావకుసుమావళి" వీరి మరొక ఖండ కావ్యము. నవ్యభావ గర్భితములగు పద్యము లిందు కలవు. ఇందలి "కాఫీదేవత, శిలావిలాపము, శుభాకాంక్ష, పోతన" మొదలగు ఖండికలన్నియు వివిధపత్రికలలో ప్రచురింపబడినవి;

"ఆంధ్ర భగవద్గీత" - "ఆంధ్ర సౌందర్యలహరి" వీరికి పేరు తెచ్చి పెట్టిన గ్రంథరాజములు. శ్రీ మదాంధ్రభగవద్గీత శ్లోకముల నన్నింటిని ఈ కవిగారు తేనెలూరు తేట తెనుగులో తేటగీతి, కందములలో కడు సరళముగా నెల్లరు చదువుకొని

అర్థము చేసుకొను రీతిలో అనువదించిరి. దీనిని చిత్తూరు జిల్లా యేర్పేడులోని వ్యాసాశ్రమమువారు తమ ప్రచురణగా ప్రచురించి భక్తుల కందించిరి. భగవద్గీతను, సాధన చతుష్టయ సంపత్తిగల వారందరూ సులువుగా చదువుకొనుటకు వీలుగా నుండునని శ్లోకములతోబాటు, తెనుగు పద్యములను కూడ చేర్చి ప్రకాశకులు ముద్రించిరి. ఈ భగవద్గీత అనువాద కార్యమును తిక్కన నుండి నేటి వరకెందరో కవులు గావించినను "ముక్తి సంపద యిడుగీత నెవ్వరెటు వ్రాసిన గ్రాలదె? సజ్జనాళిలోన్" అని శర్మగారు సమాధానము చెప్పుకొన్నారు.

వీరి ఆంధ్ర భగవద్గీతలోని అనువాద సరళిని కొంత చూతము,

తే.గి. జాఱుచున్నది ధనువు-హస్తంబు నుండి
చర్మము దహింపబడుచున్న చందమయ్యె
మనసు విభ్రాంతి మయమగు, మాడ్కి-తోచె
నిలువజాల రథంబుపై-నిమ్మళముగ.

తే.గి. ఎవడు ఫలకాంక్ష విడనాడి, ఈశ్వరార్ప
ణముగ నియత కర్మంబు లొనర్చు నాత
డబ్జ పత్రంబు నీటిచే నంటబడని
పగిది, దాకుడు వడడు పాపంబువలన.

ఇట్లు వీరి రచన నిరాఘాటముగా, అతి సరళముగా,

మృదుమధురముగా సులభశైలిలో సాగినది. "ఆంధ్ర సౌందర్య లహరి"-వీరి మరియొక కృతి. ఇందలి కొన్ని పద్యములు భారతి మాసపత్రికలో ముద్రితములు. 1973 నవంబరు భారతి సంచికలో ప్రచురింపబడిన పద్యములలో ఒకదాని నిందు మచ్చునకు పొందు పరచడమైనది.

సీ॥ ఘల్లు ఘల్లని మ్రోయు కనకంపు గజ్జెల
మొలనూలు కటిభాగమున వెలుంగ
మదకరి కలభకుంభప్రాయ కుచభార
మున వంగి మైదీవ మురువు సూప
బ్రక్షీణ మధ్యంబు బరిణత శరదిందు
నిభ వదనంబును నీటు గులుక,
వరధనుశ్శరజాల - పాశాంకుశంబులు
కర చతుష్టయమున గ్రాలుచుండ.

తే,గీ. త్రిపురవైరి-యహంకార దీప్తమూర్తి
విశ్వజనసంఘ నిత్యభావిత సుకీర్తి,
అలజగన్మాత యెవ్వేళ లందు మాకు
మించు దయతోడ సాక్షాత్కరించుగాత!

శ్రీ చెంచు నరశింహాశర్మ గారికి ఇరువురు కుమారులు, ఇరువురు కుమార్తెలు కలరు. పెద్ద కుమారుడు శ్రీ పమిడికాల్వ

చెంచుసుబ్బయ్య, అష్టావధానిగా ఆంధ్రదేశములో పేరు తెచ్చు కొన్నారు. లేపాక్షి ఓరియంటల్ కళాశాలలో ఉపన్యాసకులుగా పని చేయుచున్నారు. రెండవకుమారుడు చెంచు సుబ్బనరసయ్య పెనగలూరు గ్రామమునందే తెలుగు పండితులుగా పని చేయు చున్నారు. ఆదిశంకరాచార్యులవారి సౌందర్యలహరిని, భగవద్గీ తను అనువదించి శ్రీ నరసింహాశర్మగారు ధన్యతపొందిరి.

శ్రీ దుత్తలూరి రామరావు

జననము :- 21—10—1939

తల్లి : శ్రీమతి లక్ష్మీదేవమ్మ;

తండ్రి : శ్రీ దుత్తలూరి చలపతిరావు.

జన్మస్థలము : మందలపల్లి-మడకశిరా తా॥ - అనంతపురం జిల్లా

అనంతపురం జిల్లా, మడకశిరా తాలూకా, అమరాపురం హైస్కూలులో 4వ ఫారము చదువుతున్న ఒక విద్యార్థి తన కున్న సహజశక్తితో పద్యములు పాటలు వ్రాయుచూ, హరికథ లను కూడా, గానము చేయుచుండుట చూచి ఆ పాఠశాలలోని ఆంధ్ర పండితులైన విద్వాన్ శ్రీ రూపావతారం నారాయణశర్మ గారు, మిగుల ఆశ్చర్యమంది ఆనందాతిశయముతో ఒకవైపు ఆ విద్యార్థియొక్క విద్యాభివృద్ధిని కాంక్షించుచూ, "పెద్దవాడైన

తరువాత వ్రాయవచ్చులే" అని సలహాయిచ్చిరి. ఆ విద్యార్థి దురదృష్టమేమో చదువు సక్రమముగా సాగినదికాదు. పూజ్యనీయులైన పద్మశ్రీ కల్లూరు సుబ్బరావు గారి ప్రేరణతో ఆ విద్యార్థి హైదరాబాదు నగరమునకు వెళ్ళి "తెలుగు విశారద" పరీక్షలకు చదువ నారంభించెను. అప్పుడే ఆ విద్యార్థి శ్రీ దివాకర్ల వెంకటావధాని గారి దృష్టిలో కూడ పడినాడు. నాటినుండి వారిరువురి పరిచయము దినదినాభివృద్ధి చెందినది. ఆ విద్యార్థియే దుత్తలూరు రామరావు.

శ్రీ దుత్తలూరు రామరావు 1960 నుండి 1970 వరకు, వివిధ ఉన్నత పాఠశాలలలో, తెలుగు పండితులుగా పనిచేసిరి. వీరి ఇష్టదైవము శ్రీ వేంకటేశ్వరుడు. తన్ను నడిపించు దైవమాతడేయని నమ్మిన భక్తకవి రామారావు. వీరికృతులన్నియు దైవసంబంధమైనవే. అందులోను శ్రీ వేంకటేశ్వరునిపై అల్లిన కవనమే అధికము. శ్రీ రాఘవేంద్రస్వామివారి చరిత్ర, శని మహాత్మ్యము లేక విక్రమార్క గర్వభంగము వీరి రచనలు. వీరికృతులలో, "నిర్వచన పద్మావతీ శ్రీనివాస కల్యాణము" ఒక రసవత్తర కావ్యము. ఇందలి పద్యములన్నియు, శ్రీ తిరుమలేశుని తోమాలసేవకు వినియోగించు వివిధ సుగంధ రమణీయ పుష్పములే.

"ఈ కావ్యము సరళమై సర్వ సుబోధకరమై రచింప

బడినది. పద్యములన్నియు, ధారాశుద్ధి శోభితములై, నిరర్గళముగ సాగిపోవుచున్నవి. అందుకు కారణము, శ్రీ వేంకటేశ్వరుని యెడ కవికిగల భక్తి విశేషమే. ఎడనెడ, వారు తెలుగు జాతీయములైన, నుడికారముల జక్కగా ప్రయోగించియున్నారు. ఈ కావ్యమంతయు, సాధారణ వృత్తపద్యముల లోనే వ్రాయబడినది. అక్కడక్కడ, మత్తకోకిలలు కనుపించుచున్నవి. వృత్త, గీత, సీస, కందములలో వేనిని వ్రాసినను కవిగారు కావ్యమునంతను సహజధారతో సాగించియున్నారు. చదువుట కారంభించినవారు, ముగియువరకు చదువక విడువరు. ఈ కావ్యమునందలి శైలీ మాధుర్యము, కథా రమణీయతయే ఇందుకు తార్కాణము" అని శ్రీ దివాకర్ల వేంకటావధానిగారు తమ అమూల్యాభిప్రాయము తెల్పిరి.

శ్రీ వేంకటేశ్వరుడు పద్మావతిని చూచినప్పటినుండి ఆతని మనసు పరవశమైనది. ఆమెను పెండ్లాడదలచినాడు. తల్లి వకుళాదేవి కుమారుని ఊరడించి, మనోవ్యథకు కారణమడిగినది. అప్పుడు శ్రీ వేంకటేశ్వరుడు తల్లితో చెప్పిన విధమును కవిగారిట్లు వ్రాసిం.

సీ॥ జాబిల్లి కంటెను జక్కనౌ వదనంబు
నల్లని ముంగురుల్ నటనమాడు
కనుబొమల్ ధనువులై కన్పించు వేయేల

మెఱుపుకంటె ధనువు మేల్మి యగును
ఆకాశరాజున కనుగుకూతురు పేరు
"పద్మావతీ"యన బరగుచుండు
రమణి నిజమ్ముగా లక్ష్మిదేవిని బోలు
పున్నెమ్ము బండె; నా పొలతి చూచి

గీ॥ ఆమె బొందని జన్మ నిరర్థకంబు
కోమలాంగి జేబట్టుటే కోటిసుఖము
వివరముగ నా విరహబాధ విన్నవించి
శీఘ్రముగ. వాంఛితముదీర. జేయుమమ్మ.

ఇందలి పద్యములిట్లు సరళముగా, తీగ సాగిన రీతిగా సాగిపోవుచుండును. ఇట్టి పద్యము లిందనేకములు. తదుపరి వీరి "శ్రీ వేంకటేశ్వర గానామృతలహరి" యందు, 101 భక్తి కీర్తనలు ఎల్లరూ సులువుగా పాడుకొనుటకు వీలుగా రచించిరి. ఈ పాటలు భక్తిరస భరితములు, అమృతలహరులు. ఇందు, వేంకటేశ్వరుని లీలలన్నియు వర్ణింపబడినవి. ఈ పాటలలో కొన్నిచోట్ల తత్వము, కొన్నిచోట్ల భక్తి, మరికొన్ని చోట్ల వైరాగ్యము చోటు చేసుకొన్నవి. భక్తుడైన ఈ కవి తన స్వామిని నిలదీసి యిట్లడుగుచున్నాడు.

నిన్నేమి - అనరాదు, నీ-కిదియు-సరిగాదు

కన్నయ్య - నాకిన్ని కడగండ్ల నిడరాదు

—— —— —— ——

సర్వకాలములందు-సర్వవేళలయందు
సర్వనామములందు-సంస్మరించుచు నుంటి
నాయార్తి నాలించి నన్నేలు కొమ్మంటి
సర్వమంగళవేష-సర్వేశ! జగదీశ!

—— —— —— ——

తనువెల్ల సొమ్ములను-తగిలించుకొని తిరుగ
అంతమోజా - నీకు - శ్రీనాథ! గోవిందా!

—— —— —— ——

ఇన్ని బరువులమోయు-నాచిన్ని కన్నయ్య
నను బ్రోచు భారమ్మ-నీకు భారమె? తండ్రి!

ఈ కృతికి ప్రేరకుడు - కారకుడు - ప్రకాశకుడు, ఆ కలియుగ వేంకటేశ్వరుడే యని కవిగారు చెప్పుకొన్నారు. ఇక "శ్రీ తాళ్ళపాక అన్నమయ్యచరిత్ర", "శ్రీ సత్యనారాయణ పూజా మహాత్మ్యము", "కలియుగ వైపరీత్యము", భిక్షాటనాధీశ్వర శతకము", "పాంచజన్యము", "అమృతాభిషేకము" వీరి అముద్రిత కృతులు.

శ్రీ రామరావుగారు కవులేకాక, చలనచిత్ర నటులుగా కూడ పేరు తెచ్చుకొన్నారు. మడకశిరాలో జరిగిన, సాహిత్య సభలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కీ॥ శే॥ పద్మశ్రీ చిత్తూరు

నాగయ్యగారు రామరావుగారిని, సినీరంగ ప్రవేశము చేయుటకు ప్రోత్సహించిరి. రామరావు మద్రాసుకు వెళ్ళి కొన్ని ఏండ్లు గడిపి శ్రమకోర్చి చిన్న చిన్న పాత్రలను పోషించిరి. ఇప్పుడు కూడ అవకాశము కొరకు ఎదురుచూచు చుందురు. ప్రస్తుతము వీరు అనంతపురం జిల్లా ధర్మవరం పట్టణమందు స్వంత ఇంటిలో సుఖముగా కాలము గడుపుచున్నారు. వీరికి శ్రీ వేంకటేశ్వరుడు ఆయురారోగ్య భాగ్యములనిచ్చి, కాపాడుగాత!



శ్రీ దేశాయి రామచంద్రరావు

జననము : 1900

మరణము : 15-1-1958

తల్లి : శ్రీమతి సుబ్బమ్మ

తండ్రి : శ్రీ దేశాయి వెంకటనారాయణరావు

జన్మస్థలము : మరూరు బండమీదపల్లె (అనంతపురం జిల్లా)

వెలుగుకురాక, అజ్ఞాతముగా నుండిపోయిన ఎంతో మంది రాయలసీమ కవులలో బండమీదపల్లె కరణము రామచంద్రరావు గారు ఒకరు.

శ్రీ రామచంద్రరావుగారు కరణముగా ప్రజల యొక్క ప్రభుత్వోద్యోగుల యొక్క ఆదరాభిమానముల చూరగొన్న వారు. ఒక వంక వృత్తి పరమైన బాధ్యతల నిర్వహించుచు, మరొకవంక సాహిత్యసేవ గావించినారు.

వీరికి స్వంత గ్రంథాలయము కలదు. విలువైన గ్రంథముల నెన్నింటినోకాని, విమర్శనాదృష్టితో వానిని పఠించినారు. కరణము లెక్కలు వ్రాయుట ముగియగానే గ్రంథముల చేత బట్టుటే వీరి పని. రాత్రి రెండు గంటలైనను పొత్తమును, పెన్సిలును విడుచుటలేదు.

పద్యరచన యందును, పద్యపఠనము నందును వీరిదొక ప్రత్యేక శైలి. శ్రీ రామచంద్రరావు గారికి సాహిత్యమునందే గాక, సంగీతము నందును పరిచయము గలదు. వీరు మధుర కంఠముతో శ్రావ్యముగ పురాణపఠనము గావించుచు, శ్రోతలను ముగ్ధుల గావించెడివారు.

శ్రీమాన్ పప్పూరు రామాచార్యులవారు, శ్రీ కల్లూరు సుబ్బరావుగారు, శ్రీ మరూరు లక్ష్మీనరసప్పగారు వీరి పురాణ పఠనమును, కవిత్వమును చాల మెచ్చుకొన్నారు.

శ్రీ రామచంద్రరావుగారు పాదుకా పట్టాభిషేకము, చిత్ర నళీయము, విషాద సారంగధర, గయోపాఖ్యానము, వరకాసుర

వధ మున్నగు నాటకములలో ప్రధానపాత్రల ధరించి ఉత్తమ నటుడుగా పేరు పొందినారు. హరికథల కొన్నిటిని గానము చేసినారు.

శ్రీ రామచంద్రరావుగారు కరణాలకు, సర్వేయర్లు కాగోరు వారికి ఉపయుక్తమగు రీతిగా "చెయిన్ సర్వే గణిత సూత్ర పద్యావళి" అను గ్రంథమును రచించినారు. అది ముద్రింపబడి నది. "శ్రీకృష్ణగారడి" యను నాటకము అముద్రితము. వీరు రచించిన "ప్రద్యుమ్నాభ్యుదయము" అను నాటకము అసంపూర్తిగ నిలిచిపోయినది.

వీరి "పరిమళపేటిక" ఒక ఖండకావ్యమునందు మనః ప్రబోధము, కరణీక రాజశీవి, కాలమహిమ, కర్షకౌన్నత్యము, దరిద్రాష్టకము, సీతాలక్ష్మణ పరిదేవనము, యమునితో ముచ్చటలు, ఏడ్పుమహిమ, గాంధీతాత మున్నగు శీర్షికలక్రింద ఎన్నో పద్యములు, గేయములు వ్రాయబడినవి. ఇందలి పద్యములు కొన్ని ఆంధ్ర గ్రామపాలన, సారథి, విజయవాణి, సాధన పత్రికలలో ప్రకటింపబడినవి.

మచ్చునకీ పద్యహులు చూడుడు

మ॥ మనసా! చంచలమై చెలంగు పథియున్
"మా" మైత్రితో నొప్పెడు

న్వినుమా: మన్మథ-మత్స్య-మర్కట-మరు
న్మేఘో-మనో-మానినీ
యనగా; మా-మదిరా-మధువ్రత సమా
ఖ్యల్ దాల్చి; పూర్వంపు నీ
చనవున్ గాంచుట దక్కవాని కొదవెన్
చాంచల్య భావంబులున్.

ఉ॥ ఎప్పటి కంటె నేదయిన నింత జపంబొనరింప గూరుచు
న్నప్పుడు పుట్టు నీకు దెవులక్కట! యొక్క నిమేష మేని గప్
చప్పున నుండ; వేమిటివొ చచ్చియుజావని యూహలన్నినీ
కప్పుడె పుట్టుచుండు; సమయంబిక లేదొకొ పాపిచిత్తమా!

కర్షకౌన్నత్యము.

సీ. బలరామునకు జూడ హలముమాత్రమె కాని
పసరంబు భూమి లే దసలు కృషికి;
పశుపతి కన్ననో పశువొక్కటియె కాని
భూమియు నాగలి పొసగలేదు;
కమలేశునకు భూమి కల దింతయే కాని
హల వృషభ విభూతి యమరలేదు;
ముగు రెకమైనను ముగియదు సేద్యంబు
రెండవ యెద్దు లే కుండు కతన;

గీ. ఇట్టి దారిద్ర్యపు సమాజ మెట్లు సాటి

హాల వృషభయుగ్మ విశ్వంభరాగత ప్ర
కర్ష వైభవ వ్యవసాయ కలితుడవగు
కర్షకా! నీకు? లేరు నీకంటె ఘనులు.

నిత్య సంతోషిగా, నిర్మల హృదయుడుగా, నిరతాన్న దాతగా, అజాత శత్రువుగా రాణించిన కరణము శ్రీ దేశాయి రామచంద్రరావు గారు జీవితము నంతయు గ్రంథ పఠనమునకు, సాహిత్యసేవకు ధారవోసి 58 వ ఏట స్వర్గస్థులైరి. వీరు అజ్ఞాత ముగా నుండుటకు కారణము కరణీకమే.



"కవియిత్రీ తిలక"

శ్రీమతి కొలకలూరి స్వరూపరాణి

జననము : 1-5-1943

తల్లి : శ్రీమతి మంగాదేవి

తండ్రి : శ్రీ గోవాడ ఎన్. వి. రత్నం

జన్మస్థలము : గోవాడ - తెనాలి తా॥ గుంటూరు జిల్లా

వృత్తిరీత్యానివాసము :
మోదా గ్రామము; హిందూపురం తా॥ అనంతపురం జిల్లా

నేటి తెలుగు సాహిత్యంలో నవలలు వ్రాస్తున్న నవలా మణులే ఎక్కువ. నేడు ఆ నవలల కున్న నిలువ, స్థానము మరే సాహిత్య ప్రక్రియకులేదు. నేటి మన పాఠకలోకం నవలా రచయిత్రులకే పెద్దపీఠం వేసింది. రచయిత్రులు కూడ ఈమధ్య వంటిల్లు విడిచి విశాల ప్రపంచం మనకంటూ ఒకటుందని ఎంచి అనేక విషయాలను తమ నవలల్లో చొప్పిస్తున్నారు. సస్పెన్స్, థ్రిల్లింగ్, కిల్లింగ్, హారర్, టెరర్ మరియు వైజ్ఞానిక, సామాజిక నవలలను కూడ చకచకా వ్రాస్తున్నారు. పత్రికలు కూడ వాటిని అతివేగంగా పాఠకుల ముందుంచుతున్నాయి. ఇప్పటి తెలుగు రచయితల సంఖ్యలో అధిక శాతం స్త్రీలదే. ఇంతమంది రచయిత్రులున్నా పై సాహిత్య ప్రక్రియ కాక అన్య మైన వాటిలో కృషిచేసి మంచిపేరు తెచ్చుకొన్నవారు అరుదు. కవియిత్రి అనే సార్థకనామం కొందరికే దక్కింది. వారు కూడ వేళ్ళపై లెక్కపెట్టవలసినవారే. చక్కటి పద్యములు, కవితలు వ్రాయగలిగిన నేర్పు ఏ కొందరు రచయిత్రులకో అబ్బింది. అలాంటి ఓ రచయిత్రి హిందూపురం పంచాయితీ సమితిలో ఉపాధ్యాయవృత్తిని చేపట్టి వుండటం గర్వకారణం. ఆమె శ్రీమతి కొలకలూరి స్వరూపరాణి. అసంఖ్యాక పద్య,గద్య,గేయ వచన విమర్శనాత్మక రచనలను, వాటికితోడుగా నేటి పాఠక లోకం మెచ్చేకథలు, నవలలు కూడ రచించి వాసికెక్కి పేరు సంపాదించుచున్నది.

ఈ కవయిత్రి రచించిన "గంగావతరణ-శివతాండవము" "చంద్రగ్రహణము" అను రెండుపద్యకావ్యములను చదివినప్పుడు .వీరి ప్రజ్ఞకు, కవితాశక్తికి, భావస్ఫురణకు అచ్చెరువొందని వారు లేరు. విద్వన్మణి - శ్రీ కఱ్ఱా వేంకట సుబ్రహ్మణ్యం ఎం.ఏ.- గారొకసారి ఈమె వ్రాసిన శివతాండవ కావ్యమును చూచి ముగ్ధుడై ఏదో అనిర్వచనమైనశక్తి ఈమెలో ఆవహించి ఉందని అది వాగ్దేవతా కటాక్షమై యుండునని భావించిరి. ఈ నిర్ణయము వారి దొక్కరిదే కాదు. ఈమె గ్రంథములు జదివిన ప్రతి యొక్కరికి కూడా అదే అభిప్రాయమే కలదు. ఆమె తన కవిత్వమును గూర్చి ఇట్లు వ్రాసుకొన్నది.

కం॥ స్వతహాగా, ఒనగూడిన
నితాంత సాహిత్య గంధ నిర్మల కవితా
లతాంత వేణిని, సార
స్వత ప్రాణి స్వరూపరాణి, సవినయ వాణిన్

ఇంకనూ ఈ కవియిత్రి స్వవిషయమును ప్రస్తావించుచూ తన ఆశయమును గూర్చి యిట్లు వ్రాసుకొన్నది.

లేదు విశేషప్రజ్ఞ లవలేశము, సారవచో విధానమున్
లేదు, కవిత్వ ప్రౌఢిమయు లేదిక, యున్నది హృచ్ఛతఘ్ని నా
వేదనగంధకాప్తి యనువిద్ధ సముద్ధతి ప్రేలి లోక ని
ర్వేద మహీధరాశ్మతతి భిన్నమొనర్చిన చాలు మత్కృతుల్.

వీరి "గంగావతరణ - శివతాండవము" ఒక ద్విపద కావ్యము. ఇందు నూరు ద్విపదులు కలవు. "ఇందలి రచన దీర్ఘదీర్ఘమయిన సంస్కృత సమాసములతో నిండియున్నది. అందందు ముచ్చటగా కూర్చిన చిన్నచిన్న సమాసములు కూడ కలవు. ఇందలి సమాసముల కూర్పు చాల పరిణతమైనది. ఎంతో అభ్యాసముండినగాని రచనలో ఇంతటి పరిణతి సంపాదించుట తేలిక గాదు. రచనలోనేకాదు భావ గంభీరతలో ఈమె పటిమ గల కవయిత్రి."

నిజమైన ఆధ్యాత్మిక చింతన, సామాజిక స్పృహకు వ్యతిరేకము కాదని కవయిత్రి భావించి, ఆమె తన శివతాండవ కావ్య నాయకుడైన శివుని సమాజ వికాస నాయకునిగా లెక్కించి, ఆతని సుహృద్భావ మెంతటిదో సవిస్తరంగా వివరించింది. ఈమె శివుని స్త్రీ జనోద్ధారకుడుగా, స్త్రీకి సమాన ప్రతిపత్తి నొసగిన ఔదార్యుడుగా, ఇరువురు భార్యలకు తన్ను తాను ఆత్మార్పణ గావించుకొన్నవానిగా, ఆదర్శమూర్తిగా, గిరి తనయను వివాహమాడి బలహీనవర్గాలు అనగా గిరిజనుల సంక్షేమానికి నాంది పలికినవాడుగా, శ్రీహరి పాదమందు బుట్టిన శూద్రబాలిక యగు, (హరిజన) గంగమ్మను స్వీకరించి అస్పృశ్యతను నివారించిన ప్రథమ అభ్యుదయవాదిగా ఆమె భావించినది. అట్టి సభ్య సంస్కారాలకు దర్పణము పట్టిన శ్రమజీవి చుట్టూ అల్లిన

కవితలో సామాజిక స్పృహ లేదనడం వట్టి మూర్ఖత్వమే అవుతుంది. ఈ దృష్టితో కవయిత్రి తన హృదయ పీఠికపై శివుడు సలిపిన తాండవమునకు కవితా స్వరూప మిచ్చింది. ఆ భావననే పాఠకులు కలిగించుకొన్నప్పుడు ఇందలి విషయం మరింత అర్థస్ఫూర్తిని కలిగిస్తుంది. వీరి శివతాండవ రచన యిట్లు సాగినది.

కనకకిరీటప్రకట నవరత్న–గణఘంటికావళి గణగణలాడ
షణ్ముఖగజముఖ చకిత సామీప్య–సన్మానమున సమక్షంబురంజిల్ల
నందీశ భృంగీశ నవ్రమనాట్యాభి–నందనోపశృతి నయగారమొలుక
అమరేందుబింబాననా బాహావల్లరీముక్తసురపుష్పరింఛోళిగురియ

— — — — —

శారికాకోటులై సందడిచేయ ఈరేడులోకాల ఏలికపూన్కి–
ధారుణి గంగావతరణశ్రీసెసగ గౌరీప్రియుండు గంగాధర నామ
బద్ధప్రసిద్ధికాస్పదుడయి వెలయ ఇద్ధ జలక్రీడ నేపుమీరంగ
విహరించి విహరించి విరమించిదరిని రహిమించు రాజమరాళంబు
రీతి.

— — — — —

గురు,జటాజూటానుకూల,కూలపముల సురకూలవతి విభాసురలీల
నురికె.

తదుపరి వీరి చంద్రగ్రహణ కావ్యము సమకాలీనతకు, సముజ్జ్వల భవిష్యత్తునకు నవ్య భావనలకు దర్పణము.

భూగోళమునకు, ఖగోళమునకు వారధి నిర్మింపజేయడం ఈకావ్య మందలి కథావస్తువు. "ఆర్యభట్ట" ఉపగ్రహాన్ని, 1975 లో భారతప్రభుత్వం, ప్రప్రథమంగా అంతరిక్షంలోనికి ప్రయోగించింది. దేశం సాధించిన వైజ్ఞానిక ప్రగతి కవయిత్రి హృదయాన్ని కుదిపివేసింది. భూమిచుట్టూ "ఆర్యభట్ట" పరిభ్రమిస్తున్నది. చంద్రుడుకూడ అదే కక్ష్యలోనే భూమిచుట్టూ తిరుగుతున్నాడు. ఒకవేళ "ఆర్యభట్టకు" చంద్రుడు తటస్థపడితే వాళ్ళ మధ్య జరిగే సంభాషణ ఎలా వుంటుంది? ఏయే అంశాలపై చర్చించుకొంటారు? అన్నదే ఈ కవయిత్రి ఊహ. ఆ ఊహా జగత్తుకు జరిగిన అంకురార్పణే "చంద్రగ్రహణ" కావ్యంగా వెలుగు చూసింది. ఈ రసమయ ఊహా చిత్రణలో కవయిత్రి "చంద్రుణ్ణి" స్త్రీగా మార్చింది. అతనికి స్త్రీ పాత్రను కేటాయించింది. ఆ చంద్రమ్మ, తనకు పట్టిన గ్రహణాన్ని గూర్చి ఆర్యభట్టునకు మొరపెట్టుకొంటుంది. తననీ అవస్థనుండి తప్పింపుమని కోరుతుంది. అట్లే ఆవిడ(చంద్రమ్మ) తాను గమనిస్తున్న మానవ సమాజంలోని సమస్యలకు పరిష్కారమార్గం సూచిస్తుంది. నూత్న విజ్ఞాన విశేషాంశాలను గూర్చి ముచ్చటిస్తుంది. ఈ మూడు విశేషాల - త్రివేణీ సంగమమే "చంద్ర గ్రహణ" కావ్యము.

ఇదొక నవ్య కవితాప్రక్రియ. ఇట్టి కావ్యము ఆంధ్ర

సాహిత్య చరిత్రలో అరుదు. నవ్యకవితా సంపుటాలలో భావాలు తొంగి చూడవలెనేగాని, భంగిస్సుకాదు. భావాన్ని బంధించే శక్తి ఛందస్సునకు లేదు. అందుకే ఈ కవయిత్రి కొన్ని వర్ణనలను అత్యాధునిక భావాలతో వర్ణించింది. ఇది తప్పేమీకాదు. భావాలకు సంకెళ్ళు వేయడంగాని, యిట్టి వర్ణనలే సాంప్రదాయిములు, సమంజసములని ఎక్కడా నిర్ణయింపబడడంగాని జరుగలేదు. సమాజపరంగా అల్లిన భావాలు సహజ సుందరంగా వుంటాయి. ఆ వర్ణనలు కొంతవరకు సమాజాన్ని ప్రగతి పథంలోకి పయనింపజేయగలవు. ఆ భావనతోనే, స్వరూపరాణి గారు వర్ణనలు గావించిరి.

సూర్యాస్తమయ వర్ణనకు చెప్పిన ఉపమాన మొకటి చూచిన చాలును, అది నేటి సమాజంలోని కొంతమంది వ్యక్తులపై ఎలా కొరడా ఝళిపించిందో విదితం కాగలదు.

మనువున కట్నమెల్ల తన మామ యొకేపరి క్రక్కడించు, తా
శి, నవల వైచియున్ విడచి లేజెలువన్ తరిలో చివాలునన్
జను, వరుడో యనంగ మలుసంజ ముహూర్తములోన, పద్మకాం
చను, నడియేటిలో పదలి తా నరిగెన్ రవి పశ్చిమాశకున్.

ఇట్టి మనోజ్ఞ భావయుక్తములగు పద్యములే గాదు, సుదీర్ఘ, సమాస భూయిష్ఠ, క్లిష్టతర పద్యములతోపాటు, ప్రాచీన

ప్రబంధశైలి నేమరక అటనట వ్రాసిన రమ్యములగు పద్య సుమములను కూడ ఈ నవ్య కవితాకన్యక తన సిగలో నలంకరించుకొన్నది. ఇందు కవయిత్రి తన మనోభావముల నన్నింటిని వివిధ శీర్షికలుగా విభజించి తానే ఆర్యభట్టుకు(లోకానికి) విని పించుకొన్నట్లు నిగూఢ భావనతో తెల్పినది. అందుకే ఆమె ఇందులో చంద్రమూర్తిని స్త్రీమూర్తిగా చిత్రీకరించింది. తుద కామె (చంద్రమ్మ) ఇట్లనుచున్నది.

నవలాజాతి యెడల తగు
అవగాహన కుదిరెనేని హక్కులు చట్టాల్
సవరించినంత పుణ్యము,
తెవు లెరుగని మందు లార్చి తీర్చునె రుజలన్?

పై రెండు కావ్యముల తరువాత స్వరూపరాణి గారు "ప్రబోధం" అను ఒక గేయ సంపుటిని, "నన్నయమహిళ" అనబడు పరిశీలనా గ్రంథమును వ్రాసిరి. ఈ పరిశీలన గ్రంథములో ఈమె అనాదిగా స్త్రీకి స్వాతంత్ర్యము లేకుండా పోయిందనే ఆవేదన వ్యక్తపరుస్తూ అనేక ఉదాహరణలను మహాభారతంలోని నన్నయభాగం నుండి గ్రహించింది. ఆమె అభిప్రాయాన్ని ఈ గ్రంథములో యిలా వ్యక్తపరిచింది.

"పుట్టింటి హక్కులను రద్దుచేస్తూ, ఇటు భర్తకు భార్యపై

సంపూర్ణాధికారాన్ని కట్టబెడుతూ, స్త్రీని రిక్తహస్తురాలిగా పడ గొట్టుతుంది వివాహవ్యవస్థ. ఆ వివాహ వ్యవస్థకు ప్రతిబింబాలు భారతంలోని స్త్రీ పాత్రలు. ఈ సంకెళ్ళనుండి స్త్రీకి విమోచనం కావాలి" అనే భావాన్ని రచయిత్రి తేల్చి చెప్పింది.

సారస్వతోపన్యాసములు, రేడియో ప్రసంగాలు, పత్రిక లలో రచనలు లెక్కలేనన్ని చేసిన ఈ కవయిత్రి ధ్యేయం- వసుధైక కుటుంబమైన సమసమాజ స్థాపన, కులమత వర్గాతీత సమాజకాంక్ష. కవయిత్రికాంక్ష ఈడేరేకాలం వచ్చింది.

"విద్యాధర ప్రభాస" అనబడే సాహిత్య సంస్థ నెలకొల్పి తద్వారా తమ ప్రచురణలను వెలుగులోనికి తెచ్చిన శ్రీమతి కొలకలూరి స్వరూపరాణి గారికీ వారి కుటుంబమునకు భగ వంతుడు సుఖ శాంతులను ఆయురారోగ్య భాగ్యములను యిచ్చి సర్వదా కాపాడుగాక!



శ్రీమతి గుంటి లక్ష్మీకాంతమ్మ

తల్లి: శ్రీమతి చిదంబరమ్మ

తండ్రి: శ్రీ కాశీభట్ల పెద్ద సుబ్బయ్య

భర్త: గుంటి నంజుండశర్మ

జననము : 21-7-1930

జన్మస్థలము : వజ్రకరూరు - గుత్తి తా॥ - అనంతపురం జిల్లా

శ్రీమతి గుంటి లక్ష్మీకాంతమ్మ గారు గేయ రచయిత్రి. వజ్రకరూరు చిన్నగ్రామమగుట చేత, పెద్ద చదువుల కాస్కారం లేదు. పుట్టినఇల్లు వేదాధ్యయన సంపన్నమైనది. కాన బాల్యము నుండియే, ఈమెకు దైవభక్తి అలవడినది. మెట్టిన ఇల్లు కూడా దైవభక్తి సంపన్నమై యుండుటవల్ల, ఈమెకు బంగారుకు పరిమళ మబ్బినట్లు, దైవభక్తికి ప్రోత్సాహ మబ్బుటవల్ల అనేక భక్తి రస గేయములను రచించి, తమ ఇంట పాడుకొనెడివారు.

1964లో "నక్షత్రమాల" వ్రాసి ప్రకటించిరి. శ్రీమతి ఊటుకూరు లక్ష్మీకాంతమ్మగారు, ఈమె వాగ్గేయ కారుల కోవకు చెందినదని ప్రశంసించిరి. "మందారమాల" ఈమె వ్రాసిన రెండవ గేయరచన. 1968లో హైదరాబాదులో జరిగిన "అఖిల

భారత రచయితల మహాసభ”లో ఈమె కవితాగోష్ఠిలో పాల్గొని “మందారమాల” గేయములను, పాడి వినిపింపగా, అకాడమీ కార్యదరి శ్రీ దేవులపల్లి రామానుజంరావుగారు, సంతోషపడి ఆ పుస్తక ముద్రణమునకు సహాయపడిరి.

“రచనాపాటవ మున్నవారికి గాత్ర సౌలభ్యము లేక పోవుట, గాత్ర సౌలభ్య మున్నవారికి రచనా సౌలభ్యము కొఱ వడుట సహజము. కాని, ఈ కవయిత్రికి రచనా పాటవముతో బాటు గాత్రసౌలభ్యము భగవంతుడు ప్రసాదించుట బంగారుకు పరిమళ మబ్బినట్లున్నది.” అని తిరుపతి సంస్కృత కళాశాల రిటైర్డు ప్రిన్సిపాలు గారైన శ్రీ చేబ్రోలు సుబ్రహ్మణ్యశర్మగారు ప్రశంసించిరి.

ఈ క్రింద, “మందారమాల”లోని కొన్ని గేయములను “స్తుతిమాల” లోని రెండు కీర్తనలను, అముద్రితమునైన, “ రుక్మిణీ కల్యాణము ” లోని రెండు గేయములను పాఠకులు చదువగలరు.

“మందారమాల”లో కొన్ని గేయములు.

౧

అలుక ఏలనో? అలివేలమ్మా పలుకగ రావమ్మా!
పిలిచి పిలిచి నిను-అలసితినమ్మా! అలుక మానవమ్మా!
దేవీ! పలుకగ రావమ్మా!

౨

కనివిని యెరుగని-కరుణాలయవని విన్నానోయమ్మా!
కరుణజూపి-శరణన్న వారికి దరిశనమేయిమ్మా!
దరిశనమిమ్మా!

౩

కరుణించుతల్లీ! శరణంటిగౌరీ! శర్వాణీ! గిర్వాణీ! కల్యాణీ!
తల్లి నీవే! తండ్రివి నీవే! గురుదైవము నీవే! దయనుజూపి-
దరిని జేర్చు దాతవు నీవే!
కర్పూరహారతిదె! గైకొనవమ్మా! శ్రీకాంతా!

"శ్రీ రుక్మిణీ కల్యాణము"లోని రుక్మిణీ ప్రార్థన (గేయము)

౧

నీ చరణంబుల-నీడను జేరి శరణంటిని-నీ కరుణగల్గదా?
తరుణము మించక-తరలి రానిచో మరణమె - శరణము-
కరుణాభరణా!

౨

"అమ్మ"ను గని యామమ్మె-అమ్మయని "అమ్మా"! నిను
మది నమ్మితినమ్మా!
నా మనోహరుని నా కొనగూర్పుము లేకుండిన, నను
నీలో జేర్చుము

ఈ కవయిత్రి మఱికొన్ని భక్తి గేయములను వ్రాసి ఆంధ్రలోకమున కర్పించుగాత!

★



శ్రీ చౌళూరు రామరావు

జననము :- 28-3-1916

తల్లి : శ్రీమతి నరసమ్మ

తండ్రి : శ్రీ సి. మధ్వరావు

జన్మస్థలము :- చౌళూరు,

హిందూపురం తాలూకా

అనంతపురం జిల్లా

తెలుగు సాహిత్యంలో అనువాదం ఒక విశిష్ట ప్రక్రియ. అనువాదకుడు ఈ ప్రక్రియ ద్వారా ఇరుభాషలలోని సాహిత్య మాధుర్యాన్ని పాఠకలోకానికి అందివ్వగలుగుతున్నాడు. కన్నడ భాషనుండి ఇప్పటికే ఎన్నో గ్రంథాలు తెనుగులోనికి అనువదింపబడియున్నాయి. ఈ అనువాద ప్రక్రియ ఎక్కువగా కన్నడరాష్ట్రమునకు చేరువగాను, కన్నడరాష్ట్రముతో ఎక్కువగా సన్నిహిత సంబంధాలు కలిగిన పొరుగురాష్ట్రాల రచయితలు కొందరు తమ భాషలోనికి రత్నాలవంటి కన్నడ రచనలను అనువదించి "కన్నడకస్తూరి" ని గుబాళింపజేసిరి. అట్లే "తెలుగు తీపి"ని కూడ కర్ణాటకులు గ్రహించినారు.

ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో పుట్టి పెరిగిన

వారికీ రెండు భాషలపైనా అవ్యాజమైన ప్రేమానురాగాలు సహజముగా ఏర్పడును. కన్నడ, తెలుగుభాషా శారదలు, వారిండ్లలో సతము నాట్య మాడుచుండుదురు. అట్టి సరిహద్దు ప్రాంతపుపల్లె, చౌళూరు. ఇది అనంతపురం జిల్లా, హిందూపురం తాలూకాలో వున్న గ్రామము. ఈ పల్లెలోని రైతులు కొందరు నేటికి తమ భూములశిస్తులు కొంతభాగము కర్ణాటకప్రభుత్వ ఖజనాకు, మరి కొంతభాగము హిందూపురం తాలూకా ఖజానాకు కట్టుచున్నారు. ఇట్టి చౌళూరు గ్రామములో ఒక సదాచార పరాయణుల యింట పుట్టినవారు శ్రీ రామరావుగారు.

శ్రీ చౌళూరు రామరావు చిన్నతనము నుండి ఆంధ్ర, కన్నడ రాజ్య రమామణుల యిండ్ల నాడిపాడిన విద్యాఖని. తండ్రి చౌళూరు మధ్వరావుగారు పేరుమోసిన ఉపాధ్యాయులు. నలువది సంవత్సరముల కాలము చౌళూరులో అవిచ్ఛిన్నముగా ఉపాధ్యాయవృత్తి నవలంబించి ఖ్యాతి నార్జించినవారు. వీరి ప్రథమ సంతానమే మన రామరావుగారు.

సి. రామరావుగారు హిందూపురం తాలుకాలో (అనంతపురం జిల్లా) 1934 నుండి సుమారు పదేండ్లకాలము ఉపాధ్యాయులుగా పనిచేసి, తదుపరి సుమారు 20 సంవత్సరముల కాలం ప్రాథమిక పాఠశాలల తనఖీ అధికారిగా (స్కూల్ ఇన్‌స్పెక్టర్) పనిచేసి 1971లో పదవీ విరమణ పొందిరి. ఉద్యోగ విరమణా

నంతరము సమాజహిత కార్యక్రమములందు విరివిగా పాల్గొన సాగిరి.

శ్రీ రామరావు మంచివక్తగా జిల్లాలో పేరు గడించిరి. వీరి ఉపన్యాసములు శ్రోతలను మంత్రముగ్ధుల గావించును. చక్కటి హాస్యప్రియులు. చమత్కారముతో కూడిన ఉపన్యాస ప్రసంగములు గావించుట వీరికి పుట్టుకతో అబ్బిన విద్య. సమయస్ఫూర్తి, నేర్పరితనము, సహజ సంస్కరణాభిలాష కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడడం వీరికున్న సహజ గుణాలు.

ఉడిపి పేజావర స్వాములైన శ్రీ విశ్వేశతీర్థ శ్రీపాదుల వారికి వీరు ప్రియశిష్యులై వారి వెంట ఆంధ్ర ప్రాంతములు తిరుగుచూ వారిచ్చు కన్నడ ఉపన్యాసములను అతి చక్కగా, సరళముగా, మధురముగా హాస్యాన్ని అక్కడక్కడ జోడిస్తూ అనువదించేవారు. అప్పుడే వీరికి స్వామిజీవారి కన్నడ రచన లను తెలుగులోనికి అనువదింపవలెననెడి ఒక గొప్ప ఆలోచన కలిగినది. స్వామి కృపవల్లనూ, వారి అనుగ్రహమువల్లనూ వారి రచనలను, ఉపన్యాసములను తెనుగున కనువదించి ధన్యులయిరి.

చౌళూరు రామరావుగారు తొలుత స్వామిజీ వారి, "గీతా సారోద్ధార" మను కన్నడ బృహద్గ్రంథమును తెనుగులోనికి అనువదించిరి. ఆ అనువాదము నెల్లరూ మెచ్చిరి. కొందరు

దానిని తెలుగు గ్రంథముగానే లెక్కించిరి. అందలి విషయము లెల్లరకు సుబోధకములు. స్వామిజీవారు దానిని ముద్రించి ఆంధ్రదేశ మెల్లెడలా విస్తృత ప్రచారము గావించిరి. అప్పటి నుండి రామరావుగారికి స్వామిజీ రచనలపై గురుత్వ మేర్పడి వారి కన్నడ గ్రంథములైన "గీతాంజలి" - "తత్త్వాంజలి"- "విశ్వేశవాణి" అనువదించి, ముద్రించిరి. "వాదిరాజులచరిత్ర" " శ్రీ రాఘవేంద్రస్వాముల చరిత్ర " స్వతంత్రముగా రచించి, ముద్రించిరి.

"గీతాసారోద్ధార" మందు శ్రీ విశ్వేశతీర్థ శ్రీపాదుల వారు హుబ్బళ్ళిలో చాతుర్మాసకాలమున భగవద్గీతను గూర్చి యిచ్చిన నలువది ఉపన్యాసములు కలవు. ఆ గ్రంథమిప్పటికి మూడు పునర్ముద్రణములు పొందినది. అందుకు కారణము అనువాద మందలి సౌందర్యశైలి. దీనిని చదువరులు మిక్కిలి మెచ్చుకొనిరి. తదుపరి శ్రీ స్వామివారి శ్రేష్ఠ వ్యాఖ్యానము నుండి స్వారస్యకరములైన భాగములనేరి "గీతాంజలి" కూర్చ బడినది. ఒక్కసారి చదివిన చాలు చిరకాలము జ్ఞాపక ముండు టకు వీలైన సులభశైలితో "గీతాంజలి" వ్రాయబడినది.

"వాదిరాజుల" వారు మాధ్వ యతిశ్రేష్ఠులు. సజీవముగ బృందావన ప్రవేశము గావించిన తొలి మాధ్వయతీంద్రులు వీరు. రెండవవారు శ్రీ మంత్రాలయ రాఘవేంద్ర స్వాములవారు. వాది

రాజులవారు తమ జీవితకాలములో చేసిన పనులు, చూపిన మహిమలు, సంపాదించిన తపశ్శక్తి అపారములు, అనూహ్యములు. ఇంతటి మహిమాన్వితులు లోకోపకారులగు శ్రీ వాదిరాజులవారి దివ్యచరిత్ర చాలమంది ఆంధ్రులకు తెలియదు. ఆలోటును తీర్చనెంచి శ్రీరామరావు వాదిరాజులవారి ప్రేరణతో అనేక కన్నడ గ్రంథములను పరిశీలించి తెనుగున వచన రూపమున "శ్రీ వాదిరాజులచరిత్ర" అను పేర పుస్తకమును ప్రచురించిరి. శ్రీ వాదిరాజులవారికి శ్రీ మహావిష్ణువు హయగ్రీవ రూపమున ప్రత్యక్షమై వీరు సమర్పించు నైవేద్యమును ప్రతి రోజు ఆరగించి పోవుచుండిరట! అట్టి మహనీయుని చరిత్ర అతి సులభశైలిలో తెనుగుభాషలో రామరావుగారు రచించి ధన్యులైరి.

"శ్రీ విశ్వేశవాణి" పేజావరు స్వాములవారి ప్రసంగాల లోని "ఆణిముత్యాలు". ఈ ప్రసంగములు సామాన్యులకు ధర్మాచరణయందు శ్రద్ధాసక్తులను కలిగించ వచ్చునని అనువాదకులు యోచించి వాటిని క్రోడీకరించిరి. అందలి ఒక ఆణిముత్యము నుదహరించుచున్నాము.

"గృహము భవనమని పరిగణింప బడవలెనన్న అచ్చట భగవద్భక్తి - భగవద్భజన మున్నగునవి జరుగుచుండవలెను. ఇట్లు భగవత్ సంపర్కములేనిచో అది "భ" కారము పోగొట్టుకొన్న "వన" మనిపించుకొనును. అచట నివసించువారు

భవనవాసులైన మానవులగుటకు బదులు వనవాసులైన పశువులే అగుదురు" ఇట్టి జ్ఞానోపదేశమును గావించు సూక్తు లిందు పెక్కు కలవు.

శ్రీ చౌహూరు రామరావుగారు అనువాదకర్త లేకాక సంఘ సేవాకర్తలు కూడ. హిందూపురం తా॥ బ్రాహ్మణ సంఘమును స్థాపించి, దాని కధ్యక్షులై పేద బ్రాహ్మణ వర్గమునకు చెందిన విద్యార్థులకు అన్నివిధములా సహకారముల నందించిరి. అట్లే హిందూపురం లేపాక్షి పట్టణములందు శ్రీ చింతలపాటి బాపిరాజు ధర్మసంస్థ - చిననింద్రకొలను వారిచే ఓరియంటల్ హైస్కూలు, కళాశాలలు స్థాపింపబడుటకు వీరెంతయో శ్రమించి విద్యా వ్యాప్తికై కృషిచేసిరి. విశ్వహిందూపరిషత్ కార్యక్రమములందు విరివిగా పాల్గొనుచుందురు. హిందూపురంనందలి శ్రీరాఘవేంద్ర స్వామిమఠస్థాపనకు వీరు చేసినసేవ అపారము. కీ॥ శే॥ పద్మశ్రీ కల్లూరు సుబ్బారావుగారికి వీరు కొన్నిఏండ్లు ఆంతరంగిక కార్య దర్శిగా వ్యవహరించిరి.

వయసు ముదిరినకొద్ది వీరిలో ఉత్సాహ మినుమడించి యువకులవలె సమాజసేవ కుద్యుక్తులగుచుందురు. ఇట్టి డెబ్బది ఏండ్ల నవయువకునకు భగవంతుడు ఆయురారోగ్య భాగ్యముల నిచ్చి సర్వదా కాపాడుగాత!



శ్రీమతి గొల్లాపిన్ని రామలక్ష్మమ్మ

జననము :- 29-7-1922

తల్లి : శ్రీమతి
కాశీభొట్ల విశాలాక్షమ్మ

తండ్రి : శ్రీ కాశీభొట్ల
మల్లికార్జునశాస్త్రి


జన్మస్థలము : చిన్నముష్టూరు
ఉరవకొండ తా॥ - అనంతపురం జిల్లా

విద్య : ప్రాథమికవిద్య మాత్రమే.

ఆంధ్ర గీర్వాణ భాషాభ్యాసము భర్తగారి వద్ద జరిగినది. వ్రాసిన గ్రంథములు : 1) జ్ఞానశతకము. 2) శివకవచము. 3) స్వప్నశాస్త్రటీక 4) శ్రీ విద్యా పద్మపరిమళము. అన్నియూ అముద్రితములే. వీరి శ్రీ మాతస్తుతి - గేయమును చదువుడు.

మాతృకే-శ్రీమాతృకే-జగధాధారభూతే-జగన్మాతృకే
చిత్రే-మహాచిత్రే-చిద్రూపికే-చిత్స్వరూపిణే
కాత్యాయినీ-దాక్షాయినీ-కామిత ఫలదాయినీ
అభయంకరీ-పరమేశ్వరీ-జగదీశ్వరీ-చండీశ్వరీ

ఏ రీతి నిన్ను నుతియింతునమ్మా! - ఎన్నెన్నో శ్లోకాల స్తుతియింతునమ్మా. ప్రస్తుతము ఈమె భర్త - పుత్రులతో హిందూపురం తా॥ పరిగిలో నివసించుచున్నారు. ★



డా॥ సత్రాజు
లక్ష్మీ నరసింహారావు

జననము: విక్రమ, ఫాల్గుణ
పౌర్ణమి (1941)

తల్లిదండ్రులు :
శ్రీమతి లక్ష్మీనరసమ్మ
శ్రీ సత్రాజు కృష్ణయ్య

జన్మస్థలము : కావలి.
నెల్లూరు జిల్లా-ఆం.ప్ర.

ప్రస్తుత నివాసము : హిందూపురం - అనంతపురం జిల్లా - ఆంధ్ర

శ్రీ సత్రాజు లక్ష్మీనరసింహారావు సాధారణ మధ్యతరగతి కుటుంబములో జన్మించి, బాల్యము నుండియు సత్సంప్రదాయములో పెరిగిన గుణశీలురు. వీరిలో సాహిత్యాభిరుచిని చిగురింప జేసినవారు శ్రీరాం వేంకట భుజంగరాయశర్మ గారు. అభినివేశంతో ఆంధ్ర సాహిత్యమును అభ్యసించినారు. ప్రస్తుతము వీరు హిందూపురం పట్టణ మందలి యస్. డి. జి. యస్. కళాశాలలో ప్రధానాంధ్రోపన్యాసకులుగా పనిచేయుచున్నారు.

నరసింహారావుగారు రచనలలోగల కథ, కవిత, వ్యాస, నవల, నాటిక మున్నగు వివిధ ప్రక్రియల నన్నింటిని చేబట్టి

తనదైన వ్యక్తిత్వంతో భాసింపజేసినవారు. వీరు మంచివక్తలు.

శ్రీ నరసింహరావు బహు గ్రంథ కర్తలు కాకపోయినా, బృహద్గ్రంథ కర్తలు. వీరిని సామాన్యులుగా లెక్కించుటకు వీలులేదు. మహాసముద్రముల నీదగలిగిన గజఈతగాడేకాదు- అందలి అనర్ఘరత్నముల నేరి రాశిగా పోయగలిగిన అన్వేషి. కవిత్రయ మహాభారతము ఒక మహాసముద్రమే కదా! అందలి అలంకారముల నేరి వాటిని గూర్చి సమగ్ర పరిశోధన గావించి వాటిని వెలికి దెచ్చి ప్రకాశింపజేసిన ఘనులు. "ఆంధ్ర మహాభారతము-అలంకారసమీక్ష"ను శ్రీరావుగారు అనంతపురం పి. జి. సెంటర్ ద్వారా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయమునకు తెలుగులో డాక్టరేట్ పట్టా కోసం ఈ పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. వీరి గురువులు శ్రీ కోరాడ మహదేవశాస్త్రిగారు వీరికీ విషయమై కుతూహలము కలిగించిరి. వారి సలహా మేరకు రావుగారు "ప్రయోగ సౌందర్య సమీక్ష" చేయుటకు పరిమితము చేసుకొనిరి.

ఈ పరిశోధన వ్యాసము రెండు అధ్యాయములుగా విభజింపబడినది. అందులో మొదటి అధ్యాయమున అలంకారాన్ని కేంద్ర బిందువుగా తీసుకొని సముచిత విషయ విస్తరం చేసుకొంటూ అలంకార ముఖ్య సిద్ధాంతాలనన్నింటిని కూలంకషంగా చర్చించిరి. "అలంకార ప్రశస్తి"లో వేద వేదాంగాలనుండి మంత్రాలను

ఉదాహరిస్తూ అలంకారం పుట్టు పూర్వోత్తరాలను శ్రీరావుగారు చక్కగా నిరూపించారు. ఇందు అలంకార స్థానాన్ని నిర్ధారించి, అలంకార శిల్పాన్ని విశ్లేషిస్తూ చేసిన సమీక్ష ఎంతో ప్రామాణికంగా లాక్షణిక హృదయావర్జకంగాను ఉన్నది.

కవిత్రయం ఏయే ప్రయోజనాన్ని అపేక్షించి ఎక్కడ ఏయే అలంకారాలను ఎలా ప్రయోగించారో, ఎలా పెంచారో కూడ స్పష్టం చేయబడింది. ఈ విధానాన్ని విశ్లేషించి చెప్పడం రావుగారి నిశిత పరీక్షకు నిదర్శనం. తిక్కన, ఎఱ్ఱాప్రెగడల అనువాద భాగాల్లోనుండి ప్రతి అలంకారానికి ఎన్నో ఉదాహరణలను ప్రదర్శించి, పరిశోధనను ఎంతో ప్రామాణికంగా శ్రీరావుగారు సాగించారు. ప్రధానాలంకారాలైన ఉపమ, రూపక, ఉత్ప్రేక్షలను మూలానువాద సాదృశ్య పరిశీలన పద్ధతిలో పరిశీలించి, ఇతర ముఖ్యాలంకారాలను ఎనభై మూడింటిని ఎంతో సంగ్రహంగా, సవిమర్శంగా, సముచితంగా ప్రతిపాదించిరి.

ఈ పరిశోధన వ్యాసము ఆంధ్ర మహాభారతముపై అలంకార సమీక్ష చేయడానికి వ్రాసిందైనా అలంకారంపై సంస్కృత లాక్షణికుల సిద్ధాంతాలకు కూడా ఒక చక్కని ఆదర్శంగా కనబడుతూంది. అలంకార స్వరూపాన్ని అవగాహన చేసుకోవాలనుకొనే సహృదయులైన రసహృదయులకు ఈ గ్రంథము ఒక చక్కని కరదీపిక వంటిది. ప్రామాణికంగా ఔచిత్య భాసురంగా

ఇంత చక్కని పరిశోధన చేసి ఆంధ్ర సాహితీ లోకంపై తీరని ఋణభారాన్ని మోపారు డా॥ సత్రాజు లక్ష్మీనరసింహరావుగారు.

శ్రీ రావు పై ప్రామాణిక పరిశోధనా గ్రంథాన్నేకాక "భువనవిజయము", "మగువ మనసు" అనబడు కథల సంపుటిని రచించి ముద్రించిరి. కాలేజి విద్యార్థుల ప్రోత్సాహముతో వారి ప్రదర్శన నిమిత్తమై వీరు వ్రాసిన "భువనవిజయము" - అటు ప్రదర్శనకు-ఇటు చదువుటకు యోగ్యముగా నున్నది.

నరసింహరావు గారికి కథారచన చిన్నతనమునుండే అలవడినది. రానురాను వారి ఆసక్తి యినుమడించినది. తనతోపాటు ఉత్సాహవంతులైన నలుగురిని కథారచనలో సిద్ధహస్తులను చేయవలెననెడి సంకల్పము వారిది. అందుకే వుద్యోగ రీత్యా హిందూపురమునకు వచ్చి చేరిన నరసింహారావుగారు స్థానిక కథా రచయితల నందరినొక్క చోట చేర్చి వారిలోని సృజనాత్మక శక్తిని పెంపొందించుటలో కృషి సల్పి సత్ఫలితము పొందిరి. రావుగారిది కథారచనలో అందెవేసిన చేయి. వీరి అనేక కథలు సుప్రసిద్ధ తెలుగు వారపత్రిక లన్నింటిలో ప్రచురింపబడినవి.

వీరి "మగువ మనసు" సంపుటిలోని కథలన్నీ పుష్టిని, తుష్టిని కలిగి మనస్తత్వ పరిశీలనకు చోటివ్వబడినవి. వీరి కథల్లోని వర్ణనలు, అలంకారాలు చదువరి దృష్టికి వేగనిరోధకా

లనిపించినా, ఆ వర్ణనలు, అలంకారాలు అతన్ని కొంత తడవు ఆలోచింపచేస్తాయి. మగువమనసు కథలో "సంతానంలేని స్త్రీ లోపమంతా మగాడిదే నన్నట్లు సులభంగా తప్పుదార్లలో పడుతుంది. పరులకోసం ప్రాకులాడుతుంది" అన్న దురభిప్రాయాన్ని రచయిత ఇందులో కాదని పూర్ణమ్మ పాత్రచేత లోకానికి తెలియజేసారు.

"మంచిమనిషి" అనే మరో కథలో రైళ్ళల్లో అవి యివి ప్యాసింజర్లకు అమ్ముకొంటూ జీవించే ఓ వెండర్‌ను రచయిత-ఓ దొంగగా భావిస్తారు. అతడెంతటి కళాకారుడో? అతని సహృదయత ఎంతటిదో? అతడెంతటి హస్తకళానైపుణ్యం గలవాడో తుదకు తెలుసుకొని ఆనాటి రైలు ప్రయాణములోనే అతడు తన కుడిచేతిని పోగొట్టుకోవడం చూచిన తాను (రచయిత) ఎంతగా కుమిలిపోయింది, చక్కగా చిత్రీకరించినట్లు కథను వ్రాసారు. వీరి ఈ కథల సంపుటి త్వరలోనే వెలువడుతున్నది.

శ్రీ నరసింహారావు మంచి రచయితలు, వక్తలేకాదు, కళాసాహిత్య సేవా సంస్థలందు కార్యకర్తలై బహుముఖ సేవలందించిరి. ఇట్టి వీరికి భగవంతుడు ఆయురారోగ్య భాగ్యముల నిచ్చి సర్వదా కాపాడుగాత!